# రామాయణ పాత్రలు
# రమణీయ కథలు



డా॥ ఎం. శివప్రసాద్ ఎం.ఏ., పిహెచ్.డి.

# రామాయణ లఘుకావ్య రామణీయకము

(సిద్ధాంత గ్రంథము)

ప్రథమ భాగము

డాక్టర్ ముత్తేవి రవిప్రసాద్,
M.A., (Telugu) M.A. (Sanskrit) Ph. D.
ఆంధ్రోపన్యాసకులు, కాకాని వెంకటరత్నం కళాశాల, నందిగామ

విజయిని ప్రచురణలు
నందిగామ - 521185.

ప్రతులు - 1000

ప్రథమ ముద్రణ : 1995

సర్వహక్కులు గ్రంథకర్తవి

మూల్యం : [redacted] రూ. 75.00

PLACED ON ... SHELF
Date......

ఈ గ్రంథము తిరుమల తిరుపతి దేవస్థానము
వారి ఆర్థిక సహాయముతో ముద్రింప
బడినది.

ప్రతులకు :


1) యం. వాసంతి
w/o డా॥ యం. ఆర్. ప్రసాద్, లెక్చరర్
23/28, నెహ్రూ నగర్
నందిగామ – 521 185

2) డా॥ యం. శ్రీనివాసు, లెక్చరర్
ఎస్. వి. ఆర్. కాలేజి
శారదా ధామము
కిసమత్ పురా (P. O)
హైదరాబాద్

ముద్రణ :
వాణీ ప్రెస్,
విజయవాడ – 2.

SRI VENKATESWARA
CENTRAL
RESEARCH
Acc No 48635
Date ... ....
TIPUPATI.

# అంకితం



SRI VENKATESWARA SWAMIVARI

తిరుమల వాసుని దివ్య చరణాలకు
భక్తితో

—రవి

TIRUPATI.

# ఎందరో మహానుభావులు

రామాయణ సాహిత్యంపై పరిశోధనం చేసే సముద్రపు తీరాన కూర్చొని నీటి బిందువుల్ని లెక్కించడం వంటిదని తెలిసినా గురుదేవుల యాశీస్సుల వండగా నేను కొని ఈ పరిశోధన కుపక్రమించాను. ముందుగా వారికి నా ప్రణామాలు.

లఘుకావ్యాలనే సరికి ప్రారంభంలో చాల కొద్దిగా లభించినా, సేకరణ తుది రూపాని కొచ్చేసరికి అవి అలఘు సంఖ్యాకమై, "వినయ మారుతి" ముందు దక్షిణ సముద్రమై భయపెట్టాయి. ఆ కావ్యాల నన్నింటిని ముందుంచుకొని అయోమయ స్థితిలో ఆలోచనలతో గడిపిన రాత్రులెన్నో లెక్కించలేనివి.

అటువంటి ఆపత్సమయాల్లో నన్ను ప్రోత్సహించి భుజంతట్టి ముందుకు నడిపించిన వాళ్ళు, నా విజయమే తమ విజయంగా భావించి నాతో సమానంగా శ్రమించిన వాళ్లు, అడిగినదే తడవుగా అపురూప గ్రంథాలనెన్నింటినో నాకు అందించి, అమూల్యమైన సలహాలిచ్చి ఆదుకొన్న వాళ్ళు, పత్రికా ముఖంగా నా అభ్యర్థనను మన్నించి కొన్ని కావ్యాలను నాకు పంపించి, మరికొన్ని తాము తమ మిత్రులకు వ్రాసి వారి ద్వారా నాకు అందునట్లు చేసిన సాహితీ మిత్రులు—

వేళకాని వేళల్లో సైతం ముంగిలిలో చేరే నన్ను ఆదరించి సందేహాలు దీర్చి ఋజుమార్గంలో నడిపించిన గురుదేవులు - గురుతుల్యులు - ఎందరినీ — ఐదు వసంతాల అవిరళ పరిశోధనలో ఆదుకొన్న సహృదయులు ఎందరో పేరు పేరున కృతజ్ఞతలు చెప్పుకోలేనంతమంది, అందుకే వారందరికి శిరసు వంచి ప్రణామాలర్పిస్తున్నాను.

ఈ గ్రంథ ప్రచురణ నిమిత్తము ఆర్థిక సాహాయ్యాన్ని అందించి, తెలుగు సాహితీ జగత్తులో మరొక రామాయణ పరిశోధనా గ్రంథం ఆవిర్భవించడానికి సహ

కరించిన తిరుమల తిరుపతి దేవస్థానము వారికి కృతజ్ఞతాభివందనాలు అర్పిస్తూ, తిరుమల నిలయుని దివ్యచరణాలకు ఈ గ్రంథాన్ని సవినయంగా సమర్పించు కొంటున్నాము.

గత ఇరవై సంవత్సరాలుగా నా అభ్యుదయ వికాసాలకు మూలకందమై నిలిచిన శ్రీ కాకాని వేంకటరత్నం కళాశాలకు, యాజమాన్యానికి, ప్రిన్సిపాల్ గారికి శత సహస్రాధిక వందనాలు.

గ్రంథాన్ని సకాలంలో అందంగా ముద్రించి యిచ్చిన వాణీ ప్రెస్ యాజమాన్యానికి కృతజ్ఞతలు.

ఎందరో మహానుభావులు
అందరికీ శిరసు వంచి ప్రణామాలు.
మీ
డాక్టర్ ముత్తేవి రవీంద్రప్రసాద్.

# విషయ సూచిక


| పాత్ర | లఘుకావ్యము | పుట |
|---|---|---|
| 1. గుహుడు | | 1 |
| 2. శబరి | మాధవ పెద్దివారి శబరి | 21 |
| | విశ్వమ్మ గారి శబరి | 31 |
| | పెమ్మరాజు వారి శబరి | 43 |
| | చరింగంటి వారి శబరి సవర్య | 55 |
| | గుదిమెళ్ళ రామానుజాచార్య శబరి | 62 |
| | బలుసు వారి శబరి | 74 |
| | ప్రకాశరావు గారి శబరి | 78 |
| 3. అహల్య | | 88 |
| | శ్రీ దువ్వూరి వారి అహల్య | 94 |
| | స్ఫూర్తిశ్రీ వారి అహల్య | 107 |
| | ఆచార్యుల వారి అహల్య | 111 |
| | శ్రీ బొడ్డు బాపిరాజు వారి అహల్య | 120 |
| | శ్రీ మానాప్రగడ వారి అహల్య | 121 |
| | శిష్ట్లా వారి శప్తాహల్య | 123 |
| 4. ఊర్మిళ | | 125 |
| | శ్రీమాన్ గుదిమెళ్ళ వారి ఊర్మిళ | 127 |
| | జంధ్యాల వారి ఊర్మిళ | 135 |
| | వావిలాల వారి ఊర్మిళ | 136 |
| | సుధాంశు వారి ఊర్మిళ | 148 |
| | ఊర్మిళా సౌందర్యం | 149 |
| 5. మాండవి | | 151 |
| | విశ్వనాథ వారి మాండవిక | 163 |

6. మైథిలి 165

గుదిమెళ్ళ వారి మైథిలి 169

శ్రీ మ్రవవన్ను వారి దుఃఖయోగిని 178

శ్రీ కలువపల్లి రంగనాథ శాస్త్రిగారి మహాసతి సీత 186

7. మంథర 189

8. కైకేయి 196

శ్రీ పళ్ళె వారి కైకేయీ సౌశీల్యము 198

చిట్టిప్రోలు వారి కైకేయి 203

కందుకూరి వారి కైక 206

కోగంటి వారి కైక 211

కందిబండ వారి కైక 216

సీతమాంబగారి కైక విజ్ఞప్తి 220

కైకేయీ సౌందర్యము 221

9. శూర్పణఖ 222

10. స్వయంప్రభ 228

11. సరమ 233

12. శ్రావణము 245

గొట్టుముక్కల వారి శ్రావణము 247

శ్రావణ చరిత్ర 263

పితృభక్తి 273

శ్రావణావలోకనం 276

13. భరతుడు 278

శ్రీ వసువంతన్ భారతం 287

ముప్పిడి వారి భరతుడు 288

దోర్బ్యల వారి భారతం 294

14. జటాయుర్మోక్షం 299

15. సంధ్యాసౌమిత్రి 307

# మొదటి ప్రకరణం

# పాత్రప్రధాన లఘు కావ్యాలు

## గుహుడు

అరణ్య వాసానికి బయలుదేరిన రామచంద్రుని గంగానదిని దాటించడానికి తోడ్పడిన పాత్ర గుహుడు. వాల్మీకి మహాకవి లేఖిని నుండి ఆవిర్భవించిన ప్రతిపాత్ర ఎంతోకొంత తన ప్రత్యేకతను నిరూపించుకోవటమేకాక, కావ్య గమనానికి హేతుభూతమై రామకథలో తమవంతు కర్తవ్యాన్ని పూర్తిచేసుకొని, జాతిలో శాశ్వతత్వాన్ని ఆపాదించుకొంటోంది. మంథర నుండి జటాయువు వరకు-శబరి నుండి స్వయంప్రభ వరకు ప్రతి ఒక్కరు రాముని సేవలో జీవితాన్ని ధన్యం చేసుకోవాలని ఆరాటపడ్డవారే. ఆ సేవలో ఆనందాన్ని అనుభవించి, ఆ మహానీయునిలో ఆత్మైక్యం పొందినవారే.

ఇటువంటి పాత్రలు కాలగమనంలో మరికొన్ని క్రొత్త సొగసులు సంతరించుకుంటూ పాఠకుల ముందు అద్భుత రూపాలతో ప్రత్యక్షమవుతాయి. ఆదికవి సృష్టించిన పాత్రల్ని గుర్తించలేనంతగా ఆధునికులు "నగిషీలు" దిద్దుకున్నారంటే ఆ పాత్రలపై కవుల దృష్టి ఎంత నిశితంగా ప్రసారితమైందో మనం గమనించవచ్చు.

అయోధ్యాకాండలో చాలా కొద్దిసేపు మాత్రమే కనిపించే పాత్ర ఈ "గుహుడు". అయినా మరపురానిది.

"తతో రాజా గుహోనామ రామస్యాఽత్మ సమస్సఖా"

– అని గుహుని రామునకు ప్రియస్నేహితునిగా ఆదికవి పరిచయం.

నిషాదాధిపతియైన గుహుడు శ్రీరాముడు తన దేశంలోకి రావటం విని కుల వృద్ధులు, మంత్రులతో ఎదురేగి రామచంద్రుని కౌగిలించుకొని, కుశల ప్రశ్నాదికములు కొనసాగించాడు. పితృవాక్య పరిపాలకుడై వనగమనానికి సిద్ధమైన రాముని చూచి విచారించి, భార్యాయుతుడై నేలపై పరుండిన శ్రీరామచంద్రునికి కావలికాస్తూ,

లక్ష్మణునికి తోడుగా తెల్లవారేవరకు నిలిచిన పాత్ర గుహుడు. లక్ష్మణుడు చెప్పిన రామగాథను విని అధిక దుఃఖాన్ని పొందాడు.

"నరేన్ద్రపుత్రే గురు సౌహార్దా ద్గుహః, ముమోచ బాష్పం వ్యసనాభి పీడితో"1 అంటాడు వాల్మీకి. రామునిపై ఉన్న మమకారం గుహునిలోని దుఃఖాన్ని అతిశయింపజేసింది. తెల్లవారిన తర్వాత రామాజ్ఞమేరకు నావను తెప్పించి గంగా లహరి తరణానికి ఏర్పాటు గావించాడు గుహుడు.

రాముని వనవాస జీవితానికి ప్రథమ లక్షణమైన "జటాధారణకు" వలసిన మఱ్ఱిపాలు సైతం రాముని కోరిక మేరకు గుహుడే అందించాడు. నావను అధిరోహించిన రామునివద్ద సెలవు తీసుకొని, నావను నడపవలసినదిగా "జ్ఞాతుల్ని" ఆదేశించి ఇవతలి ఒడ్డునే సుమంత్రునితో ఆగిపోయాడు వాల్మీకి గుహుడు.

ఇందులో మనము గమనించవలసిన విషయాలు – గుహుడు రామునకు ప్రాణమిత్రుడు. జటాధారణకు వలయు మఱ్ఱిపాలను గుహుడే అందించటం అనేవి.

ఒకరాత్రి గారవృక్షం క్రింద శయనించిన రామునకు లక్ష్మణ ద్వితీయుడై గుహుడు కావలాకాసి, తృప్తిని పొందుతాడు.

రాముని కోరికమేరకు తపోజన సామాన్యమైన జటాధారణార్థం మఱ్ఱి పాలను తెచ్చి గుహుడే స్వయంగా రామునకు అందించాడు. "రామలక్ష్మణులు" ఇద్దరు మాత్రమే జటాధారణం చేశారు.

"లక్ష్మణస్యాఽత్మనశ్చైవ రామస్తేనాఽకరోజ్జటాః" 2

గుహుడు సుమంత్రునితో కూడి ఈవలి ఒడ్డునే యుండి రాముడెక్కిన నావను నడుపవలసిందిగా బంధువులను ఆజ్ఞాపించాడు. గుహుడు రాముడెక్కిన నావను నడుపలేదు. అనగా "ఆత్మసఖుడైన" గుహుడు రాముని ఆవలిఒడ్డున చేర్చలేదు.

"తతో నిషాదాధిపతి ర్గుహో జ్ఞాతీ నచోదయత్" 3
సుమంత్ర, గుహులను వీడ్కొని రాముడు నావనెక్కాడు.

"అనుజ్ఞాయ సుమన్త్రం చ సబలం చైవ తం గుహం" 4 అని వాల్మీకం.

కానీ "గుహుని పాత్ర ప్రస్తావనకు రాగానే లోక ప్రచారంలో ఉన్నట్టి

---

1. వాల్మీకం - 2–51–27. 2. వాల్మీకం – 2 - 51 - 69
3. వాల్మీకం - 2- 51–80 4. వాల్మీకం – 2 - 51 - 77

లఘు కావ్యకర్తల్లో కల్పించే వివిధమైన కల్పనలు–ముఖ్యంగా నావను "గుహుడే నడపటం", రాముని పాదాలు కడగటం అనేవి.

గుహుని కేవలం భక్తునిగాను, రామసేవలో జీవన సాఫల్యాన్ని పొందటానికి ప్రయత్నించే ఒక పేదనావయ జీవిగాను చిత్రించారు కవులు. రాముడు గుహుని స్నేహితునిగా భావిస్తే, గుహుడు రాముని స్వామిగా సేవించాడు. ప్రేమించి పూజించాడు. నిషాదపతియైన గుహుడు రాముని ఆగమనం తెలిసి, ఎదురు వెళ్ళి తన పరివారంతో రామునకు స్వాగతం చెపుతాడు. నిషధదేశంలో, శృంగిబేర పురంలో హింసాత్మక జీవనం గడుపుచున్న ఈ గుహుడు రాముని కౌగిలిని పొందగలిగిన భాగ్యశాలి.

"భుజాభ్యాం సాధు పీనాభ్యాం పీడయన్"1 అంటారు వాల్మీకి.

అంతేకాదు. వాల్మీకి వాడిన "ఆత్మసఖా" అన్న పదాన్ని ఆధారం చేసుకొని రామునకు, గుహునకు ఇంతకు పూర్వమే పరిచయాదులున్నట్లు ఇతర రామాయణాలు చెపుతున్నాయి రాముడు విశ్వామిత్రునితో మిథిలానగరానికి వెళ్తూ గంగాతరణం చేసినపుడు నదిని దాటించిన గుహుడితడేనని ఇతనికి అహల్యావృత్తాంతాది గాథలు తెలుసునని - అందువలననే "రామస్యాత్మ సమస్సఖా"1 అని వాల్మీకి పల్కాని వారి వాదన.

మొల్ల రామాయణంలో కల్పించే -

"సుడిగొని రాము పాదములు........ వంటి పద్యాల్లో -

కల్పించే "రాతిని నాతిని చేసినకథ", అధ్యాత్మ రామాయణంలో కల్పించే "మానుషీకరణ చూర్ణమస్తి" వంటి సందర్భాలను పరిశీలిస్తే-అధ్యాత్మ రామయణంలో విశ్వామిత్రుని వెంటనున్న "బాలరాముని" చూచి ఒకనావికుడన్న పల్కులుగా మనం గుర్తించవచ్చు. ఆ మాటలే "మొల్ల" ఉల్లాసికెక్కి గుహుని పల్కులుగా పేర్కొంది. అసలు "గుహ శబ్దమే బోయవారికి పర్యాయ పదంగా వాడబడుతుంది. "గుహ" శబ్దానికి వ్యాకరణ రీత్యా "గుహతి వంచయతి పరస్వమితి వ్యుత్పత్త్యా వంచకత్వేన జాతితో వృత్తితో గుణతశ్చ హీనస్య" ఇత్యాదిగా పూర్వపక్షం చేసి గుహుని హీనజాతీయునిగాను, నీచునిగాను నిరూపించనుత్నిస్తే - గుహరక్షణే ఇత్యస్మాద్ధాతోః "గుహతి గోపాయతీతి గుహః"2 భగవత్కైంకర్య జన్యాత్మ

---

1· వాల్మీకం - 2 - 50 - 45 2 ఆశ్చర్య రా. అయోధ్య-పు· 34

విజ్ఞానేన ఆత్మానం రక్షతీతి" అనే అర్థంలో గుహుని ఉన్నతత్వాన్ని సిద్ధాంతీకరించారు పండితులు.

తులసీ రామాయణంలో సైతం నావికుని చేత "మానుషీకరణ మూర్తి" 1 ప్రస్తావన కన్పిస్తుంటే - తెలుగు కవులు మాత్రం గుహునికే శ్రీరాముని పాద్య ప్రక్షాళనా భాగ్యాన్ని కల్గించారు.

శ్రీ బృందావనం రంగాచార్యులుగారు "గుహుడు" అనే తన కావ్యంలో దీన్నే ప్రధానంగా తీసుకొని –

"రామరాజు కాళ్ళ రాతిన దుమ్ముతో
బండరూరెనంట పడుచువోలె!
నిజము దాటకయ్య నిక్కమేనాయది?
ఉన్నమాటచెప్పు మున్న యట్లు" 2

అంటూ లక్ష్మణుని ప్రార్థించడమే కాక, "పడవమార నాదు బ్రతుకెల్ల మారదా?" అన్న పదంలో "స్యాచ్చేద్విశో విద్ధి కుటుంబహానిః" అన్న అధ్యాత్మ రామాయణ మూలం కన్పిస్తుంది.

"అణువిద్దం యాతలి కాదరువుగ
నడుపుకొనుచుంటి రాముని నమ్మి పడవ
పున్నెముండును బాబు నా మొఱవినండి
కాళ్ళు గబగబ గడుగంగ గదుమకండి" 3

– అంటూ త్వరత్వరగా కాళ్ళు కడిగి పడవను అవలి ఒడ్డుకు చేర్చుమన్న లక్ష్మణునితో అన్నమాటలు బోయవాని పలుకుబడితో అందాలు చిందుతాయి.

గంగానది ఈవలి ఒడ్డునుండి అవలిఒడ్డు వరకు జరిగినరామలక్ష్మణ. గుహుల సంభాషణమే ఈ కావ్యంగా అవతరించింది. "వాల్మీకములో వలెనే ఈ కావ్యంలోను జానకీమాత కేవలం సాక్షిగా మిగిలిపోతుంది. గుహునిలోని భక్తిని ఉన్నతరీతిలో ప్రదర్శింపచేయడమే కవి ఉద్దేశ్యం. అవకాశాన్ని తీసుకొని శ్రీరామచంద్రమూర్తిపై తనకున్న భక్తి తత్పరతను ప్రకటించుకోవడానికి కవి చేసే ప్రయత్నం ఈ

1. వాల్మీకం - 2 - 50 - 36 2. ఆశ్చర్య రామా. 2-2-వృ. 34

3. తులసీరామాయణం-అయోధ్య" చరణ్ కమల రజకహం సబ్ కహోయీ
మానుషీకరనీ మూం కఛ్ అహోయీ

కావ్యంలో మనకు కన్పిస్తుంది. భక్తి భావాన్ని ఆధ్యాత్మిక తత్త్వాన్ని అడుగడు గునా ఉన్మీలించటానికే కవి ఉద్యమిస్తారు.

"పరతత్త్వమ్మను భావమందిరములో ప్రాచీన సంస్కార మ
స్థిరపీఠమ్మున నిల్పి - భక్తిమెయి సంసేవించుచున్ జీవికన్
దరియింపంగ జరించువాని గతి —
యోగీంద్రుల్ హృదయాబ్జ మధ్యమున లోకోద్ధారక ఖ్యాతుదౌ
ఆగోవింద పదార విందముల విన్యాసమ్ము గావించి యే
భోగుల్ పొందని - అందజాలని ముదమ్మున్ తెందుచున్నట్లు"1

- గుహుడు స్వోద్యోగంలోనే సంతృప్తి పొందుతాడు. "దేవదేవుడే మెచ్చినదిచ్చె: వచ్చినదే మేరువనే" అల్ప సంతోషి గుహుడు. లభించినదానితో తృప్తి పడుతూ, కర్మయోగంలో జీవితాన్ని పండించుకున్న ధన్య జీవి. పూర్వజన్మవాసనా బలంతో "తిరమగుమాట-జీవితపు తీరు లభించినదే కొలంది యా"అనే తత్త్వంతో స్వజనుల హితాన్ని సంతతుల సంస్మరించని [7] పుణ్య గుణశీలుడై గోవింద పదారవింద ధ్యాన నిమగ్న యోగి గుహుడు "సంసార సాగర మహోత్వ మేదముల నిద్రుల్ నల్పగేస్తుల్ సదా ఆరాధింప గుహుండ యొజ్జ"1 అన్నంత ఉన్నత స్థాయి కెదిగిందారీ గుహుని.

"యస్త్వింద్రియాణి మనసా నియమ్యాఽరభతేఽర్జున
కర్మేంద్రియైః కర్మయోగం అసక్త స్సవిశిష్యతే 2

అన్న గీతాచార్యుని వాక్కు గుహునిలో అక్షరసత్యమైంది. అందువల్లనే "జ్ఞాన యోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్" 3 అన్న పలుకుల్లోని రహస్యం- "యోగీంద్రుల్ హృదయాబ్జ మధ్యమున" అన్న పద్యంలో పలికించి గుహుని కర్మ యోగిగా నిలబెట్టారు ఆచార్యులవారు. "గుహుండే యొజ్జయగుగదా! కర్మయోగము నన్" 14 అన్న పలుకులు తదర్థకాలు.

నిరాసక్తితో కర్మసాధన కావించే ఆ గుహుని కన్నుల్లో మాత్మ తేజస్సు

1. గుహుడు - పు. 24
2. గుహుడు - పు. 24
3. గుహుడు పు. 2
4. గుహుడు - పు.4
5. భగవద్గీత -3 - 7
6. భగవద్గీత -3 -3
7. గుహుడు - పు 4

ప్రతిఫలించింది. తన జీవిత సాఫల్యం పొందే క్షణం ఎదురైంది. సీతా, సోదర యుతుడై శ్రీరాముడు దర్శన మిచ్చారు.

"సీలా(భమ్ము వయిందరత్తరల వన్నెల్దిద్దు విద్యుల్లతా
జాలంపుంగమనీయకోలగతి-వర్చస్వంతమున్ జానకీ।
లోలమ్మౌ రఘురామమేఘము నవాలోక ప్రముగ్ధమ్ముగా
దాలాలిత్యము లొల్కనెట్టెదుట సాంద్ర స్వాదుతాపూర్ణమై" 1

-యోగీంద్రుల నైష్ఠిక ప్రచుర దీక్షంగాంచగా లేని మైథిలీనాథుని దర్శించి పూతుడై పులకించి పోయాడు గుహుడు.

"రాముని-జానకీ హృదయరాజ్య రమారమణీయ వల్లికా
రాముని-భాస్కరాన్వయ వర(ప్రతిభా పటుకీర్తి సంప ద
ద్దాముని-దైవ భావనవశామహితామల కీర్తి చంద్రికా
కాముని పాదచారిగనై కానలజేరిన మూర్ఖుపోముడిన్" 2

-జానకీ హృదయ రాజ్యరమా రమణీయ వల్లికా రాముడైన శ్రీరాముడు పాదచారిగ అడవులబడి రావడం-గుహుని గుండెల్లో వెలయేర్లను ప్రవహింప చేసింది. కన్నులు జలపాతాలైనాయి. మోమున విదార మేఘాలు అయిముకుంటుంటే వెల్లు బుకుతున్న దుఃఖవారాశుల్ని స్తంభింపజేయయత్నిస్తూ--

"దండములండిబాబు, దయదాల్చితిరెంతటి వండుగండి: నా
గుండెలనిండ పండతమె! కొండ! అయోధ్యదొరా!
ఏటి! యిదేటివేసము! మరేటిదొరా! విఱమేటి! యేటి మీ
కోటి కరాలసామికివెలో! యిదియేటి! యటంచు"—3

-కొంత దేవర యానలో దండమొనరించుచూ, వేడి కన్నీటితో రామపద వనజీరజ యుగ్మాన్ని కడుగసాగినాడు గుహుడు. "ఆర్తనాదానవార్ధ్రమైన గుండెకాల్వారిన రీతిగా ఊలపించుచున్న "పతిత పరమేశ పాదసంస్మరణ రక్తు" గుహుని వాత్సల్య దృక్కులలాలించి తన కథ విన్పించారు రాఘవుడు. పాత్రోచిత భాషా ప్రయోగం వల్ల ఈ కావ్యం మరింత రసముగ్ధమైంది.

---

1. గుహుడు - పు 4 2. గుహుడు - పు 5

3. గుహుడు –పు 5

చింతాకుల చిత్తుడైన గుహుని సత్కరించి, "బుజావత్రీ! గంగదాటించి మా మన మువ్వొంగ చేయవే" 1 అన్నాడు శ్రీరాముడు. ఉలిక్కిపడ్డాడు గుహుడు. "ఎన్ని దినాలకీ జనుమకేర్పడె స్వామిసేవ" అని ఆనందించి-

"వెన్నవగట్టి మేల్కొలువ వేగమెలేచినరీతిగా సుధా
స్విన్నమునమ్ముపై వెలుగువెల్లువ పొర్లిన మౌక్తిక జాలమున్
పొన్నలు లే గులాబులు ప్రపుల్లములైన విధాన" 2

-పొంగి తననావను ప్రయాణానికి సిద్ధంచేశాడు. కమ్మని పూవులతో మహనీయ మందిరపుతోంపులతో సలంకరించి, తన అదృష్టానికి పొంగిపోతూ సిద్ధిపొందిన యోగీంద్రు చెలువమొలుక "వినయ వినమిత మస్తకమున కరాంజలిని మోగిడ్చి" రామచంద్రుని పాదపద్మముల చెంతకు చేరాడు.

"ఘనయోగులకందని దేవదేవసంపుల్లపదారవిందయుగమున్" 3

స్పృశియించి మెల్లగా కడగడం ప్రారంభించాడు ప్రపత్తియుక్తుడై గుహుడు. రాముని పాదాలను కడగడం సామాన్య విషయం కాదు. ఆ శ్రీకర పాదపూజ సర్వజన లభ్యంకాదు. మామగా జనకమహారాజుకి, గౌతమ పత్నిగా అహల్యకు, భార్యగ సీతాసాధ్వికి మాత్రమే స్పర్శయోగ్యాలు శ్రీరాముని పాదాలు.

"కన్నియనిచ్చువాడు జనక ప్రభుడున్; పతిశాపవైభవా
భ్యున్నతిచే నహల్యయు, నయోనిజయున్ సతియౌట స్వేచ్ఛగా
పున్నెముపండి యీచరణపూజలొనర్చిరొ; తత్పదద్వయీ
సన్నుతసేవలబ్బె గుహజాతకమేమొ! అయాచితమ్ముగన్". 4

"గుహజాతకమేమో! అని బ్రహ్మకడిగిన పాదాల్ని" సేవించగలిగిన గుహుని అదృష్టానికి కవి ఆశ్చర్యపడటంలో ఆశ్చర్యంలేదు.

కలుషములేనివారు, యుగాలుగ ఘోరతపస్సు చేయడం వలన పొందిన ఫలాన్ని అయాచితంగా పొందాడు గుహుడు. అందుకే నిరులు, గిరులు, అన్ని వింతగా కళ్ళు పెద్దవి చేసుకొని గుహుణ్ణి చూశాయి.

---

1. గుహుడు -పు.8 2. గుహుడు -పు.8
3. గుహుడు-పు. 9 4. గుహుడు పు. 10

"విచ్చిన హోమలవ్విరుల-విభ్రమదృక్కుల మీనకోటులన్
పచ్చదనమ్మునన్ నరిదుసాంతము-పక్వఫలాలవృక్షముల్
అచ్చపుస్వచ్ఛరోచుల నియన్నది, అగుహుంపూజగాంచుచున్
మెచ్చిన యద్భుతస్థితియ మేయమటంచును విస్తుపోవుచున్" 1

తత్త్వసాధన లేకుండా, ఉపాసనాదుల నొనర్చకుండ, పరమ యోగుల పాదసేవ యొనర్చకుండ, పవిత్రతీర్థాలను సేవించకే గుహునికి లభించిన ఆ పుణ్యం ఏ పూర్వజన్మ సంచిత పుణ్యఫలమోయని విస్తుపోతారు కవి.

ఈ విధమైన ఆలోచనల వెల్లువలు గుహునిలో కొల్లలుగ ప్రవహించాయి. శ్రీరాముని చరణరాజీవాలను కడుగుతూనే ఉన్నాడు గుహుడు-ప్రయాణం చేయవల సిన విషయం మరచిపోయి. రాముడు సైతం అలాగే ఉండటం లక్ష్మణునకు ఆశ్చ ర్యాన్ని కల్గించింది.

"గంగనయనింపుచుండె మంగళకరముగ
గుహుడు రఘురాము నడుగుల గోర్కెమీర
భక్తి గడుగుచునుండెను పట్టువిడనక -
దాశరథి గాంచుచుండె నుత్సాహపరత" 2 - అంటూ కవి కాలాన్ని—

భక్తిభావంతో ముడివేసి గడిపేశాడు. స్వార్థబుద్ధిలేని భవ్యభక్తి భావబంధుర పూజా విధానాన్ని, ఆదరపూర్వదృక్కులచూస్తూ అలానే ఉండియాడు రాముడు.

"అత్యపూర్వ విశుద్ధ మహానుభూతి
భరిత హృదయాన-పరవశత్వాన-దివ్య
చింతనా మగ్న భావాన-సేవలోన
రేలుగుహుఁగనె రాముడదే విధాన" 3

ఈవిధంగా భగవంతుడు, భక్తుడు ఇరువురు వారివారి ఆనందసాగరాల్లో తేలియాడు తుండే చూచిన లక్ష్మణునకు ఆశ్చర్యమేసింది. కాలం తెలియని తన్మయత్వం వారిది. పైపద్యంలో "గుహుఁగనె-రాముడదే విధాన" అంటూ విశేషణాల్ని రామునికి, గుహు నకు ఒకే విధంగా సమన్వయింప చేసిన కవి గడుసుదనం కొనియాడదగింది. సేవ లోని పరవశత్వంలో మునిగిన వారిరువురిని మార్చి మార్చి చూశాడు లక్ష్మణుడు.

1. గుహుడు. పు. 11.
2. గుహుడు-పు. 18.
3. గుహుడు-పు. 16

అన్నగారి ముఖాన్ని చూసి, మాటాడలేక, చేసేదిలేక, కాలాల్ని ఎలాగుర్తు చేయాలో తెలియక చివరకు లక్ష్మణుడు సాహసించి గుహుని హెచ్చరిస్తాడు. "ఏమి గుహుండ! మైమరచితేమి? భక్తికిన్, ప్రేమకు; నాదరమ్మునకు; బెద్దలుహద్దులు చెప్పలేదె" 1 అంటూ ప్రారంభించి "పడవ నడుపుకొని జీవించవలసినవాడవు. అది వదిలేసి రామమంత్రాన్ని ఉపాసిస్తూ, కడిగిన కాలినే కడుగుతున్నావని" యొకింత పరిహాసం చేస్తాడు.

"నీవు నిజమైన భక్తుడవైతే లేచి నావను సిద్ధం చేయ"మంటాడు. నావ ప్రయాణిస్తుంటే నీవు సేవించుకొందువు. ప్రధానమైన చుక్కాని నేను ధరిస్తాను" అన్నంతగా చిరాకుపడతాడు లక్ష్మణుడు. అన్నగారి కార్యసరణికి భంగం. కలగడం ఇష్టంలేక తమ్ముడు కోపిస్తే-చిరునవ్వుతో గుహుడు అతని పలుకుల్ని త్రోసిపుచ్చుతాడు. లక్ష్మణునిలో గూఢంగానున్న స్వామిభక్తి భ్రాతృభక్తి, రూపంలో "బుసలు" కొడుతుంటే-నడిచివచ్చిన స్వామిని సేవించుకోనిమ్మన్న ఆర్తి గుహునిది. భక్త పరాధీనుడైన భగవంతుడు తానుగ నడిచి భక్తుని దగ్గరకొచ్చాడు. "చల్లని సామి కెపుడు దొరుకు తీరిక? కన్నుల కఱవు దీర కొలుచుకొనవలదే?" అన్నాడు భక్తుడు. స్వామి కార్యానికి భంగం కలుగుతుందేమోనన్న తపన "శేష" రూపుడైన లక్ష్మణునిది కాగా, స్వామి దూరమైపోతాడేమోనన్న ఆవేదన గుహునిది.

"అంత తొందరేమి టాగండి బాబయా !
ముద్దుదీర రామమూర్తిగారి
కాళ్లమురికి బోవ గడుగుటవలననే
కలుగులాభ మొకటి కలదునాకు."2

తానుచేస్తున్నపని "తన కుటుంబానికి, నోటికాడ కూటికి సంబంధించిన విషయమని. ఇందులో చిన్నదొరలు చిఱ్ఱుబుఱ్ఱని బెదరగొట్టవద్దని" పనిచేసికోని. రాముని కాళ్ళ "మురికి" పోయేవరకు కడగవలసిందేనన్నాడు గుహుడు. ఈ విధమైన లక్ష్మణ, గుహుల సంవాదాన్ని చిరునవ్వుతో విన్నాడు రాముడు. భక్త వాత్సల్యం అటువంటిది.

"రామన్న కాళ్ల మహిమలు
సామీ ! మీకెఱుకలేవె : చల్లని తండ్రీ !
నామీద గుఱ్ఱుజెందకు
డీ మాత్రపు జాలిజూపరే ! దాసుండన్."3

అని బ్రతిమిలాడి, రామపాద మహిమను గుర్తుచేస్తాడు. "బండ పడుచుగ మారిన

1. గుహుడు—పు. 19. 2. గుహుడు - పు. 23
3. గుహుడు - పు. 25

కథనిజమేనా?అని లక్ష్మణుని నిలదీసి పడవ మారిపోతే నాబ్రతుకు బండలవుతుందని విదారిస్తాడు.

"సాధుత్వమ్ము - ప్రసన్నవేషము సదాశాస్త్ర ప్రసంగమ్ము స
ద్గాధాగాన పరాయణత్వము - తపోధర్మమ్ము నేవేవియో"1

భగవంతుని సాధించుకొనుటకు సాధనాలుగా చెపుతారు పెద్దలు. కాని అపూర్వమైన రీతిలో ఆ లోకాధీశుని వాత్సల్యాన్ని పొందగలిగాడు గుహుడు. అట్టి గుహుని గొప్పతనాన్ని నిరూపించడం ఒక్క దాశరధికి మాత్రమే సాధ్యమవుతుంది.

"గుహుని భావాలయందు నిగ్గుజను దేల్చి
వెలను నిర్ణయ మొనరింపవలయునెడల
దాశరధి పేయవలె"2

అన్న కవి విశ్వాసమే ఈ కావ్యాన్ని వ్రాయించింది. సందర్శనము, సంతరణము. సముపలాలనము అని నాలుగు భాగాలుగా విభజించబడ్డ ఈ కావ్యంలో - "మక్కువ మిక్కుటమై, తానొక్కడే సర్వము నగుచునోరిమి మీరక చిక్కని భక్తి రసమ్ముల రామభద్రుని చొక్కించి. 3

సమర్చనము పూర్తిచేసి నావమీదకు ఆహ్వానించాడు. "ఏటికెరటాల తీయ విహటవోలె" సాగిపోతోంది నావ. ఇహమ్మును సమ్మి భోగమార్గాన చరించు లౌకికుల చూచి నవ్వుచున్న యతీంద్రుని లాగ నిశ్చలంగా నావ గంగానది జలాల్లో పయనిస్తోంది. ప్రవహిస్తున్న నీరు,ఎగిరిపడే తరంగాలు, అలలుచిందించే తుంపురులు, ప్రవాహంలో తిరుగుతున్న సుడులు. నీటిలో కొట్టుకొనిపోయే వృక్షమూలాలు, నీటిపైకి ఎగిరే చేపలు, ఇదీ అదీ అనటందేనికి" సమస్త ప్రకృతి వివిధ రీతులలో నశ్వరమైన జీవితాన్ని తృణీకరించి, అనశ్వరమైన బ్రహ్మ పదవిని పొందవలసినదని హెచ్చరిస్తోంది. ఆ నావగమనంలో అనేక వేదాంత భావాలు ఆవిర్భవించాయి.

"కేవల నశ్వరైహిక జిగీషకు లొంగి సమస్తయత్నముల్
నావిపులో దుర్దాద్భృతఘనప్రతిభన్ ఫలియించునన్న దు
ర్భావముతో నరుండు భగవంతునిలక్ష్యము పేయనట్లులన్
నావనెదుర్కొనున్; విరిగి నవ్వులపాలయిపోవు రెండుగన్"4

---

1. గుహుడు - పు. 28
2. గుహుడు - పు 26
3. గుహుడు - పు. 32
4. గుహుడు - పు. 34

ఈవిధమైన పద్యాలు కొల్లలు. ఇవి గుహునిలో కవి పరకాయ ప్రవేశం చేసి, అనుభవించిన అనుభూతి విశేషాలు. లఘుకావ్య రచయితల అందరివలెనే శ్రీ రంగాచార్యులుగారు సైతం ఇచ్చట అవకాశం తీసుకొని, ఆవేశాన్ని ఆధ్యాత్మికతా భావాల విరుల్ని పాఠక లోకానికి అందించారు. "దైవాన్ని నమ్మనివాడు చెడిపోతాడని ఘంటా పథంగా శాసిస్తారు.

"సంకల్పమ్ము ప్రసన్నమై మధురతా సంపన్నమై యున్నని
స్సంకోచమ్ముగ సర్వకార్య విజయోత్సాహంబు సిద్ధింపదా?
పంకల్ తక్కినవెన్నియేని, సుజనత్వమ్మున్ రమానాథు న
తైంకర్యమ్మును; గల్గువారి కితరోత్కర్షమ్ము లింకేటికిన్?" 1

అన్న విశ్వాసము "రమాజాని" పదారవింద సంసేవ్యమాన మానసుడైన రంగాచార్యుల వారిది. ఈ వాదమే "నూతనవాదం"గా గుహుని గొంతుకలో ధ్వనిస్తుంది.

"ధర్మపథమ్మునం జనుట తత్పరత న్మదియందు మాధవు
నర్మిలి సంస్మరించుట యథార్థవచో విభవమ్ముమీర స
త్కర్మలు సల్పుచుండుట హితమ్ము చితమ్ముగ నాదరించుచే
నిర్మలమూర్తియౌ గుహుని నిశ్చల నూతన వాదమంతయున్."2

"పడవనడుపు" వాడైన గుహుడు పొందిన పరమాత్మసన్నిధిలోని రహస్యమిది. చిరకాల నిరీక్షణ ఫలించి రాముని దర్శనం లభించింది. కల్మషమెరుగని భావన, చలనములేనట్టి గాఢసాధనయున్ - బుద్ధిప్రేమ పరిమాణమ్మున గావలయున్ భవసార్థకత బడయుట కొరకున్" అన్న మార్గదర్శక సూత్రం ఫలితాన్నిచ్చి, రామసాన్నిధ్యాన్ని ప్రాప్తింపచేసింది. భగవంతుని చేరడానికి కవినిర్మించిన సువర్ణ సోపానం

గుహుని భావసుమాల విగ్గు గురుతించగలేక లక్ష్మణుడు సతమతమౌతున్న తరుణంలో ఒడ్డుకు చేరింది నావ. అన్న మనోభావాల్ని, గుహుని మదిలో రేగిన ఆనందతరంగాల్ని గమనించి ఆశ్చర్యచకితుడయ్యాడు లక్ష్మణుడు. గుహుని భుజంపై చేయివేసి, ఎన్నియుగాలో తపిస్తే, గాని, లభించని మాయన్న యనుగ్రహానికి నోచుకొన్న నీవు అదృష్టవంతుడవని" ఇలాకొనియాడుతాడు.

---

1. గుహుడు - పు. 41
2. గుహుడు - పు. 28

"నిర్మల భావము నీయది
మర్మము నెరుంగనట్టి మానిసివయ్యా !
ధర్మమ్మొక్కటె నీసత్
కర్మకు లక్ష్యమ్ముగా వికాసము జెందెన్."1

ఆతని సేవకు సంతృప్తిచెంది, మామగారు కళ్యాణ సమయంలో ఇచ్చిన ముత్యాల హారాన్ని ప్రేమోపహారంగా గుహుని కందిచాడు సుమిత్రాతనూజుడు. నీ నడవడికి బంగారంతో వెలగట్ట ప్రయత్నించికాదు. మా యనురాగ స్ఫోరకంగా దీన్ని బహూకరిస్తున్నామని అభిమానంతో-

"మెచ్చినారమయ్య నెచ్చెలికాడ ! మా
యిచ్చకోలది యిది గ్రహింపు మింక" 2

అంటూ మైత్రిని పల్కులతో గుహునికి బహుమతి నందిస్తున్న లక్ష్మణుని చూచి ఆశ్చర్యపోయింది సీతాసాధ్వి.

"కోపియటన్నమాట తనకున్ దెలియున్ - జగమెల్ల చిన్న నా
దే పసిగట్టె నీవిషయమెప్పుడొ ! ఆగ్రహబుద్ధి పిల్వగా
నే పరువెత్తువానిమదినెట్లు దయారసధారపొర్లెనో !
పాప" మటంచు సీతకొక భావనరేగెను మానసమ్మునన్-3

లక్ష్మణునిలో కోపమే ఉందని తెలుసుగానిదయారసంకూడ ఉందని గ్రహించి విస్తుపోయింది సీతమ్మతల్లి. నాతమ్ముని మాటమాత్రం కటువు, కాని మనసుమాత్రం సుమసుకుమారమని మురిసిపోయాడు రామచంద్రుడు. "గుహుడు మాత్రం ఎంత కమ్మని హృదయమ్ము నీనిది సుమా" యని పొంగిపోయాడు కాని హారాన్ని మాత్రం గ్రహించలేదు.

"బాబు! బాబు! వలదు బంగారుదండలు
పేదవాడ - దాచి పెట్టజాల -
వెట్టుకొనగ మనసు పుట్టనే పుట్టదు
పట్టుబట్టి మెడకు జుట్టకయ్య!"4

- అంటూ బలవంతంగా హారాన్ని మెడలో వేయబోయిన లక్ష్మణుని ప్రార్థిస్తాడు. తాను తీసుకోక పోవడానికి కారణం —

1. గుహుడు - పు. 46 3. గుహుడు - పు. 50
4. గుహుడు — పు. 53

"నావదోలువాడు నావను దోలెడి
వానివద్ద కేపు పట్టరాదు
అంతకన్న పాపమనలుంద బోదంట
అన్నయిచ్చు రూకనైన ముట్ట" 1

సాటి వృత్తిలో ఉండేవాడి నుండి .... ఎవరూ శుల్కము తీసుకోరు. ఇది వృత్తి ధర్మం. దీన్ని గుహుడు ప్రకటించాడు. ఆ మాటతో లక్ష్మణునికి మరల కోపం తెప్పించాడు.

"మంచితనాల కొండయని మాయలెరుంగని సామియంచు పూ
జించెదరే ప్రభున్ నరులు చిక్కిన దా యిలవేల్పు సేవ: యీ
కొంచెపు వానికిప్పటికి కోపముజూపకు మన్నపాదముల్
ముంచెద పూలమాలికల ముట్టను నీ వరహాలదండలన్" 2

అని నొక్కి వక్కాణించాడు గుహుడు. ఆలోచించిన కొద్ది గుహుని మాటల్లో స్వాతిశయం ధ్రుతిమించి అన్నను కూడా అవమాన పరచే పల్కులు దౌర్లదం సహించలేక పోయాడు లక్ష్మణుడు.

"ఏమిటి యిచ్చటన్ బడవలెవ్వరికున్నవి? ప్రేమమీరగా
మేమొక హారమీయ దగమే! గ్రహించుట కిన్నిమాటలా!
యీ మొనగాని గర్వమున కేమనవచ్చును?" 3 — —
"తాను పడవవాడు - తగినమాటయె యది
ఇచ్చట నున్న యెల్ల రిట్టివారే!" 5 – అన్న అభిమానంతో రోషం ప్రజ్వరిల్లింది. కాలం కలసిరాక కానలబడిన మేము ఈ బోయవానికి చులకనై పోయామా?" అన్నంత వరకు ఆలోచనలు చెలరేగాయి.

"రాజ్యముల నేలజాలిన రాచబిడ్డ
వనవనడిపించుకొనువాని భావమందు
పలచనై పోయె - కాలప్రభావమేమి
యేవి యొనరింపగలదు —" 5 అంటూ విచారించాడు లక్ష్మణుడు!

ఈ మూర్ఖుణ్ణి క్షమించకూడదనుకున్నాడు. "అరరే! అన్నను నావవాడనెదవా. ఆ కావరమ్మేమి?" "లోకనాధున కన్నకు నీకు సాటియా! వచింపగబూనితి వౌర" 6

---

1. గుహుడు - పు. 53
2. గుహుడు - పు. 54
3. గుహుడు - పు. 55
4. గుహుడు - పు. 55
5. గుహుడు - పు. 56
6. గుహుడు - పు. 57

అంటూ ఆవేశంతో పలుకసాగాడు. రాముని నగుమోమును దర్శిస్తున్న గుహునిలో ఏ మాత్రం చలనం లేదు.

హద్దులు దాటిన సోదరుని ఆగ్రహానికి చిరునవ్వుతో అడ్డుతగిలి, ప్రసన్న దృక్కులతో లాలించాడీరీతిగా రాముడు.

"మాటల వోటున మనుజుల
పాటవ భావనకు చిత్రపటములు వెలయున్
సూటిగజూడగ నేర్చిన
మేటికె కచ్చట్టువాని మేలిమి శోభల్" 1

"నీవలె సూక్ష్మభావముల దర్శించుట అందరికీ సాధ్యమా! మాటల మాటున భావాలు దాగిఉంటాయి. భావాలు అందించడంలో వారి మానసిక విధానం తెలియక వారిని అనార్యులనడం వాంఛనీయంకాదు. అతని మాటల్లో తప్పులుంచే ప్రశ్నవేసి భావాన్ని స్పష్టం చేయమను – అంతేకాని ఆక్షేపణల వల్ల ప్రయోజనంలేదు.

"మంచి యూహయె గుహుం డొనరించెనేమొ!
తెలియ బల్కగదా! తేటతెల్లముగను !" 2

అంటూ నెమ్మది పల్కుల తమ్మునిలోని రోషాన్ని సమయింప రాఘవుడు యత్నిస్తుంచే - రాముని భావం తెలిసిన గుహుండు తన మనోభావాల్ని స్పష్టపరుస్తాడు ఈ సన్నివేశంలోనూ కవి స్వతంత్రత పారంముదుతుంది. లక్ష్మణుని పల్కులలోను లోక సామాన్య విషయాలనేకం వివరిస్తాడు. కోపంవల్ల కలిగే అనర్థాలు, సజ్జనుల లక్షణాలు, అహంభావికి ఉండే సహజగుణాలు మొదలైనవి—ఇందులో వివృతాలు. లక్ష్మణుని శేషరూపాన్ని దర్శించి గుహుండు —

"అన్నగారినేమొ! యన్నట్లు కన్నున
చిన్నదొర మనస్సు చెదిరిపోయె
దండమండి బాబు! తప్పులున్నను దిద్ద
వచ్చు తమరు - చెప్పవచ్చుమాకు" 3

అంటూ - భవసాగరాన్ని దాటించు పడవ రాముని వద్ద ఉన్నదని —

1. గుహుండు – పు. 62
2. గుహుండు - పు. 63
3. గుహుండు - పు. 66

"చిన్న పడవ నడపి జీవించువాడను
పెద్ద పడవ అన్నవద్ద గలదు — 1
కంటిచూపు మేలు గల యొద్దునకు జేర్ప
బలము చాలనట్టి పడవనాది -
జన్మయనెడి గొప్ప సంద్రమ్ము దాటించు
అన్నపదములన్న యట్టి పడవ" 2

అంటూ తన మాటలు అర్థమయ్యేటట్టు చెప్పగా తలవంచేశాడు లక్ష్మణుడు.

తనని పెట్టి వేదాంత వాక్యాలు అంటూనే జీవితపు సాఫల్యాన్ని వివరించేస్తాడు గుహుడు. 'ఈ నావికుని వద్ద నా సొమ్మే కొంత మిగిలియుండటం మేలు" అన్న ఆలోచన ఎంత బాగుంది.

"ఎవ్వరైన గాని యీ నావికునికడ
కెప్పుడో యొకప్పుడేగి సాయ
మడుగవలయుగాన; నప్పటికీ యప్పు
మిగిలియుంట నాకు మేలు బాబు!" 3

అన్న విజ్ఞత గుహునిది. "స్వామి నావికుడె సత్యముగను" 4 అంటూ స్పష్టం చేసేశాడు. "పలుకు పలుకున గుండె లోతులను చూపి పూల దోసిలి కుప్పగ బోసినట్లు" హృదయాలను కదిపిన గుహుని మాటలకు సిగ్గిలిన లక్ష్మణుని నముప లాలించి, గుహుని గొప్పతనం - తన భక్తుని ఘనత - విశ్లేషించి చెప్పడంతో కావ్యం ముగుస్తుంది.

కావ్యంలో కథా వస్తువునకన్న పాత్రనాశ్రయించి కవి యొనర్చిన మనో విశ్లేషణ ఎక్కువ భాగం కావ్యాన్ని ఆక్రమించింది. చిన్న విషయాల ప్రస్తావనలో సైతం కవిలోని విస్మిమావేశం కావ్యంలో రామచంద్రుని ఉన్నతిని, ఆయన్ని ఆశ్రయించిన భక్తుడు గుహుని ఔన్నత్యాన్ని అత్యధికంగా గానంచేస్తుంది. అసలు "రాముని" పేరు చెపితేనే పులకించిపోయే జాతి మనది అవకాశాన్ని తీసుకొని స్నేహ మాధుర్యాన్ని ఆవేశంవల్ల కలిగే అనర్థాల్ని సత్సాహిత్య ప్రయోజనాల్ని సమయానుగుణంగా వివరిస్తారు కవి. ఉదాహరణలు కొల్లలు—

---

1. గుహుడు - పు. 67
2. గుహుడు - పు. 67
3. గుహుడు — పు. 68
4. గుహుడు - పు. 69

"గరువములేనియూహ మమకారముపొంగెడి మాటతీరు-సం
బరములజల్లులో విరియువర్తన-భవ్యగుణ ప్రసన్న వి
ర్భర దరహాసరోచి రుచిరమ్మగు వీక్షణసంక్తి-చాటవా!
నరుని విశిష్టవై భరుల-నవ్యతమ ప్రకృతిన్ సహూదరా!"1

-ఈవిధమైన లాలింపులతో గుహుని ఔన్నత్యాన్ని గుర్తించిన లక్ష్మణుడు రాముని పాదాలపై వాలిపోయాడు. అవనతశిరస్కుడై మహాపరాధం చేసినట్లు కుములే తమ్ముణ్ణి ఓదార్చాడు రఘురాముడు.

"కలవరపడకుము తమ్ముడ!
తలుపులు విష్కలుషములుగ దనరిన జాలున్
దెలియకపోవు నిజమ్ములు
గొందిగ నాలస్యమైన గొదవేమి యగున్"2

"తప్పుదిద్దుకొన్న సామాన్యుడు మాన్యుడవుతాడని ఓదారుస్తాడు. మాటమాట పెరిగినప్పుడు మనసు నొచ్చుకోవడం పరిపాటి. దిద్దుకొనడంలోనే తెలివిచూపాలి." అంటున్న అన్నగారి పాదాల చెంత వాలాడు లక్ష్మణుడు. అప్పటికే గుహుడు రామ పాదాలచెంత ఉన్నాడు. లక్ష్మణుడు గుహుని చెంతచేరి రామపాదాల్ని స్పృశించాడు.

"స్వస్థుడై లక్ష్మణుం డగ్రజున్మ చరణ
సరసిజములానె గుహునకు సరస జేరి"3

గుహుని చెంతచేరి, పాదాలకు ప్రణమిల్లుతున్న లక్ష్మణుని భక్తుడైన గుహుని "మమతలెల్ల విరియ నమపాళముగ కరమునెత్తి ఆశీర్వదించాడు శ్రీరాముడు. లక్ష్మణునితో "సమపాళమైన" స్థానాన్ని కల్పించాడు గుహునికి-శ్రీరామచంద్రుడు. దేవతలు పుష్ప వృష్టి కురిపించారు. గుహునిపాత్ర కావ్యత్వాన్ని పొందింది.

"గంగానదీ తరంగస్నాన బుద్ధి"–ఇత్యాదులెన్ని యున్న ఏకాగ్రభావము లేకపోతే దైవత్వం ప్రాప్తించదు. కేవలం ఏకాగ్రత-నిరీక్షణవల్లనే దైవప్రాప్తి లభిస్తుంది. భగవంతుడే బయలుదేరి భక్తుని చెంతకు వస్తాడు. ఇదే ఈ కావ్యంలో కవి నిరూపింపదలచిన భక్తితత్త్వం. దండకారణ్యంలోని ఋషులు-శబరి, అహల్య వంటి వారికి మోక్షప్రాప్తి నిరీక్షణవల్లే సాఫల్యమైంది. తారకమంత్ర మయిన "రామనామం" చేతనే జన్మఫలము నగడియించె గుహుడు" అన్న విశ్వాసాన్ని కవి పాఠకునిలో హత్తుకునేటట్లు చేస్తాడు.

---

1. గుహుడు - పు. 73 2. గుహుడు - పు. 77 3. గుహుడు - పు. 79

"వేదము లభ్యసింపడు - వివేక విహీనుడు—దాన ధర్మముల్
సాదరబుద్ధి జేసెనను సాక్ష్యము లేదు-మహర్షి బృందమున్
పాదములంటి వేడదు— కృపావిధి దాశరధిన్ స్మరియించియే
మోదమునంది జన్మఫలముగ్గడియించె గుహుండు వింతగన్" 1

అంటారు. పైన పేర్కొన్న లక్షణాలు ఏవి లేకపోయినా "దాశరధీధ్యానం" చేసే వివేకం కలవాడు గుహుడు. అందుకే ఇతని జన్మసార్థకమైంది.

"నాయమాత్మా ప్రవచనేన లభ్యో నమేధయా నబహునా
శ్రుతేన. యమేవైష్ణ వృణుతే తేనలభ్య స్తస్యైష ఆత్మా
వివృణుతే తనూంస్వామ్"2 అని ముండకోపనిషత్తు.

భగవానుడెవ్వని ప్రేమిస్తున్నాడో ఆతడే యా భగవానుని చెంతచేరుట కర్హమగు చున్నాడు గానీ, మహా మేధాశక్తి గలిగి చక్కగా వేదశాస్త్రాధ్యయనం చేస్తూ కూర్చుండే వారు కాదనే ఉపనిషద్వాక్యాలు-పై భావానికి ప్రోద్బలకాలు.

"మిత్రభావేన సంప్రాప్తం నత్యజేయం కధంచన
దోషోయద్యపి తస్యస్యా త్సతామేత దగర్హితమ్" 3— అని రాముడు విభీషణ రక్షణ సమయంలో సుగ్రీవునితో చెప్పిన పల్కులను గమనిస్తే-"మిత్రభావేన సంప్రాప్తం" అన్న వాల్మీకి పల్కు—"ఆత్మ సమస్సఖా" అనడంలో గుహునికి గూడా తోడ్పడింది. శృంగిబేరపురంలో నిషాదుడై జీవించినా రామ నామ ప్రభావం, రామ పాద సేవ అతణ్ణి జీవన్ముక్తుణ్ణి చేసింది.

ముముక్షూణాం విరక్తానాం తధాచాశ్రమ వాసినాం
రామమన్త్రార్ధ విజ్ఞాని జీవన్ముక్తోని సంశయః 4

"రామ నామ" మంత్రమే మోక్షప్రాప్తికి ఆలంబనం. దాశరధిని స్మరించి ధన్యుడైనాడు గుహుడు.

"కావలెనన్న లభ్యపడగా దరమౌనె భజింప సర్వలో
కావళిధన్యమై మనుటకాశ్రయభూతములైన పాదరా
జీవములెల్లవారికి? విశిష్ట పురాకృతపుణ్యమెద్దియో
కావలెగాదె ! —"5

---

1. గుహుడు-పు-30 2. ముండకోపనిషత్తు 3.2 3. రామాయణం – 6–27
4. రామానన్దలహరి – ప్ర–51 5. గుహుడు-పు-10

అన్న విశ్వాసమే ఆచార్యుల వారి కావ్య రచనా ప్రేరకం. ఆ ఆనందమే భద్రగిరి రామ దేవుని పాద కమల యుగళమున కంకితమిప్పించి, రామ పాద పంకేరుహ సేవా నిరతుడైన గుహునకు శాశ్వతత్వాన్ని కలిగించింది.

"యోర్చయే న్మమపాదాబ్జే తులస్యాః కోమలైర్దళైః
మమలోక మనుప్రాప్యరమయా సహమోదతే"

అన్న పురాణోక్తి "రామ పాద సేవా నిరతులకు" మోక్షప్రాప్తి నందిస్తోంది. గుహుడు కర్మయోగి. ఇతర యోచనలు లేక తన వృత్తి ధర్మాన్ని దైవ కర్మగా భావించి దైవదర్శనం వల్ల బ్రహ్మానందాన్ని పొందిన ధన్యజీవి.

"గుహుని" పాత్ర సాక్షాత్కారంతో కావ్య సృష్టి గావించిన ఆచార్యుల వారు వాల్మీకంలోని కొన్ని విషయాల్ని ప్రస్తావించకపోవటం ఆశ్చర్యకరం. మొదటిది - మునిజనోచితమైన "జటాధారణ" కొరకు రాముని కోరిక మేఱకు "మర్రి పాలను" గుహుడే రామునకందించటం. శ్రీరామచంద్రుని బిగి కౌగిలి పొందటం వంటివి త్యజించటం భావ్యం కాదు. అందువల్ల రామాయణ పరాయణులు కొంత అసంతృప్తి చెందుతారు.

గుహుని పాత్ర విశ్లేషణే కవి ప్రధానోద్దేశ్యమని భావించినా—ఇవి కూడా పాత్ర సంబంధిత విశేషాలే గదా! అసలు "గుహుడు" అంటేనే భక్తాగ్రేసరుడు అనే స్థాయిలో ప్రారంభమైన కావ్యం గనుక పాత్ర క్రమోన్మీలనాన్ని చెందలేదు. "రామ పాద" పూజయే ప్రధాన ఇతివృత్తంగా గలిగిన ఈ కావ్యాన్ని భద్రగిరి రాముని పాద కమలాలకు అంకితం చేయడం కవి రామభక్తికి నిదర్శనం.

రామాయణంలోని కొన్ని పాత్రలు ఆకాశంలోని తారలవలె ఒక పరి మెరిసి పోతున్నా వాని కాంతి మాత్రం భూమిపై శాశ్వతంగా నిలిచిపోతుంది. ఇట్టి కాంతి శబలిత పాత్రల్లో "శబరి" ప్రధానమైంది.

రామాయణంలోని పాత్రల్ని ఒక దృష్టిలో రెండు విధాలుగా విభజించవచ్చు-

1) రామునితో చరించే పాత్రలు

2) రాముని కొఱకు జీవించే పాత్రలు

మరొక రీతిగా విశ్లేషిస్తే —

1) విశిష్ట పాత్రలు

2) విశేష పాత్రలు

ఇంకొక పద్ధతిలో-రామకథకు —

1) ప్రత్యక్ష సంబంధం గలవి

2) పరోక్ష సంబంధం గలవి —

గాను వింగడించవచ్చు.

శబరి పాత్ర లేకపోయినా శ్రీరామకథకు వచ్చిన లోటు ఏమీలేదు. మూల కథకు అతిరిక్తంగా కొనసాగిన కథ "శబరి"ది. ఋష్యమూకాన్ని గురించి, సుగ్రీవుని స్నేహ ప్రయోజనాన్ని గురించి అంతకు పూర్వమే కబంధుడు రామునకు వివరించి స్వర్గప్రాప్తిని పొందాడు. అతనే శబరిని గూర్చి కూడా చెప్పి ఆమెను దర్శించి వెళ్ళవలసిందని రాముని హెచ్చరించి మతంగాశ్రమ ప్రస్తావన చేస్తాడు. రాముని కొఱకు జీవించిన పాత్ర శబరి. రామచంద్రుడు దుష్టశిక్షణకు శిష్టరక్షణకు ఆవిర్భవించిన యవతారమూర్తి. తన భక్తులను వెదకుతూ వెళ్ళి వారికి మోక్షాన్ని ప్రాప్తింప జేయడంలో ఆయనకు మక్కువ ఎక్కువ.

"శబరి" రామభక్త్యంకితమైన తేజోరూపిణి. నిషాదకులజుడు గుహుడు రామపద సేవా పూతచరితుడు. మతంగ కులజ శబరి. రామునకు ఆతిథ్యమిచ్చి ధన్యురాలయింది.

తెలుగు కవులలో "శబరి" పాత్రపైనున్న అభిమానానికి ఆమెపై నావిర్భవించిన అనేక లఘు కావ్యాలే సాక్ష్యాలు. వాల్మీకి మహర్షి శబరి, కార్యనిరతికి స్వామి భక్తికి అనాసక్తికి ప్రతిరూపం. ఆమె ఆశ్రమాన్ని"తద్వనం"1 అంటాడు వాల్మీకి.

ఇక్కడ పుష్పించిన పూలు రంగు చెడటం కానీ, కాంతి విహీనమవడం కానీ జరుగదు. విశాల విశ్వం చుట్టూ పరివ్యాప్తమైన జీవరాసుల్ని ఒక బిందువు వద్దకు తీసుకురాగలిగిన వన మిది.

"వాల్మీకి సంకల్పించిన కోణంలో శబరి విశుద్ధ చక్రం గాను, పంపాసరోవరానికి ఆవలి తీరంలో వున్న ఋష్యమూక పర్వతాన్ని చేరేందుకు మైలురాయి గాను భావించాలి. కబంధ సుగ్రీవులకు మధ్య ప్రధానమైన కొలికి మాత్రమేకాక రాముడు తన ప్రయాణాన్ని అర్థవంతం చేసుకొనే దశలో ఒక ప్రధాన స్థానంగా శబరి రూపొందింది. కబంధము నుండి సుగ్రీవము వరకు మానవాత్మను పవిత్రం చేయడంలో ఆమె సేతువుగ ఉపయోగపడింది.

అంతేకాదు. సీతా వియోగంలో దుఃఖిస్తూ, కింకర్తవ్యతా రహితుడై యున్న రాముని స్వపాలనవైపు మరల్చడానికి "శబరి" ఆధారమైంది. రామునిలోని దివ్య

1. "తస్య తద్వనం నామ తద్వనమిత్యుపాసితవ్యం"-కేనోపనిషత్తు-4-31.2

శక్తుల్ని గుర్తుచేసి, ప్రోత్సహించింది. శ్రీరాముని వనవాస దుఃఖ జీవితంలో శబరి ఘట్టమాశ్వాస స్థానమందుండి, రామునకది గతమును మరపించి, భావిని జ్వాజ్వల్యమాన మొనరించి, ప్రకాశమిచ్చిన దివ్యజ్యోతి. సాంసారిక కష్టములను జక్కనడచి, కర్తవ్యోత్సాహాన్నిచ్చిన దివ్యౌషధి." 1

శబరి సవరజాతి స్త్రీ. భద్రగిరి శ్రీరామచంద్రుని చరణసేవలో పునీతమైన గోదావరికి ఉపనదిగా సైతం తెలుగు కవులకు క్రొత్త ఊపిరినిచ్చిన నదీకన్యక. రామాయణ లఘు కావ్యాలలో "శబరి" అగ్రతాంబూలమందుకొంది. అనేక కవులు వేరు వేరు రీతుల్లో శబరిభక్తి సాయుజ్యాల్ని వివిధ దృక్కోణాల నుండి దర్శింపచేశారు. అయితే ప్రతి కవి శబరిలో శ్రీరామునికి "కౌసల్యను దర్శింప చేయడానికి యత్నించడం సమాన లక్షణం కావడం ఆశ్చర్యోపేతం. ఈ ఇతివృత్తాన్ని కవులు తమ శక్తి కొలది సౌందర్యోజ్వలితం కావించారు.

"దృష్ట పూర్వా అపిహ్యర్థాః 2 ........ ఇత్యాది ఆలంకారికోక్తిని బట్టి కథ కథనంతో వ్యక్తిగతమైన శక్తి సంపన్నత సమాశ్రితమైనప్పుడు వైవిధ్యము అన్ని వేళలా గోచరిస్తుంది. ఒక్కొక్క కవి ఒక్కొక్క సన్నివేశంలో కావ్యాన్ని ప్రారంభించి అనేక రీతుల్లో కవితావాహినిని ప్రవహింపచేసి, తుదకు శబరిని శ్రీరామునిలో ఐక్యం చేసి ఆమెతోపాటు వీరూ కృతార్థులైనారు.

ఇంతేకాక జాతిపిత గాంధీజీ ప్రారంభించిన హరిజనోద్ధరణము వంటి సంఘ సంస్కరణలచేత ప్రేరితులైన కవులు ఈ శబరి పాత్రను తమ లక్ష్యానికనుకూలంగా మలచుకొన్నారు.

శబరిని హరిజన వనితగా భావించి ఆమెవల్ల మహర్షులు సైతం సంస్కరింపబడినట్లు ఊహించారు. ఈ కవులు గావించిన కల్పనల్లో ప్రధానమైనది మతంగ మహర్షి వృత్తాన్తం కాగా శబరి బాల్యవృత్తాన్తం, వివాహ ప్రస్తావన, దీనజనోద్ధరణ వంటివి మరికొన్ని. వీనిలో కొన్ని పద్మపురాణాంతర్గతాలు కాగా, మరికొన్ని స్వకపోల కల్పితాలు. యోగాగ్నిలో దగ్ధమైన శబరి ఊర్ధ్వలోకాలకు వెళ్ళినట్లు కొందరు వ్రాస్తే, రాముని దర్శించి ఆ ఆనందపారవశ్యంలో కరిగి నీరై, ఏరై పారిందని భావించిన కవులు మరికొందరు. "సీతారాముల"తో శబరిని దర్శింపచేశారు ఇంక కొందరు.

---

1. రామాయణంలో స్త్రీ పాత్రలు-77 పు. 2. ధ్వన్యాలోకం-4-4.

48635



## మాధవపెద్దివారి శబరి

శ్రీ మాధవపెద్ది బుచ్చి సుందరరామ కవి "శబరి" కావ్యాన్ని కాలక్రమములో ప్రథమంగా స్వీకరిద్దాం. అనంతర కవులవలె పద్మపురాణాది కథలను ఆశ్రయించక—ఆశ్రమంలో వదలివేయబడ్డ పసిబిడ్డను మహర్షి పెంచినట్లు మాధవపెద్దివారు కల్పించారు. శబరి హడావుడి చూసి మతంగ మహర్షి వస్తాడా? అంటూ ప్రశ్నిస్తాడీ కవి !

### శ బ రి

"అవునులే యింతకన్న నెక్కువ మహేరు
తపము జేసెను పెంచి పెద్దగనొనర్ప
విజము నమ్ముము నాతల్లి! నీవటన్న
నాడు మూన్నాళ్ళ గ్రుడ్డునుగూడ గావు" — (13-ప)

"పుట్టిన నెత్తురికందు నిను బుట్టినచే పడవైచి పోవగా నెట్టులు జేతులాడినవో" అంటూ పసిగుడ్డుగ శబరిని మతంగ మహర్షి పెంచి పెద్ద చేసినట్లు కల్పించారు. అంతేకాదు పెంపుడు కూతురు ప్రేమలో కన్నకూతురునే మరచిపోయాడంటూ మతంగ కన్య అరుంధతిని గుర్తుచేసి, "దైవచిత్రమ్మ దెంతకును జాలు" అంటూ సమర్థిస్తాడు కవి. వివిధములైన ఫల, పుష్పాలన్ని సేకరిస్తూ విరిదండల విరచిస్తూ పరమోత్సాహ సన్నాహ మానసయైన శబరిని నెమ్మదిగా పల్కరిస్తాడు-కావ్యంలోకి ప్రవేశించి సూత్రధారునివలె కవి మాధవపెద్ది. వీరి కావ్యమంతటా ఈ నాటకీయ ప్రక్రియే ప్రదర్శితం. కథా గమనానికి సంధానకర్తగ, కొన్ని యెడల పరిచయ కర్తగ, కొన్నియెడల నిర్దేశకునిగ కవి వేరు వేరు సన్నివేశాల్లో కన్పించి, కావ్య పాత్రలకు అటు పాఠకులకు సంధానకర్తగా వ్యవహరించడం బుచ్చివారి రచనలోని రామణీయకం.

"అవ్వా! చిత్తము విస్మితంబగును నీయావేగమ్ముం జూడగా
నెవ్వారెంతటి పూజ్యపాదులిటుగా నేతేరగామందిరో"- (22 ప)

అంటూ 'శబరి'ని పలకరించి, మరకతతృణ వేదిక లేర్పరిచి, క్రొత్త అందాలు సంతరించి ఆశ్రమ సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తున్న శబరి ఉత్సాహాన్ని గమనిస్తూ, చూపుని నెమ్మదిగా దూరంగ సారించి—

"అది యేమిట్లరుదెంచుచున్నవి మనుష్యాకారతంబూని యి
య్యదర్ఘ్యారణ్య హిరణ్మయప్రభయు విద్యుల్లేఖయున్ సీలతో
యద మాహా!—యిపు డెంతలో జెదర్చె(జూపవ్వా! యెటుల్! -(23. ప)

అంటూ జగదేకమోహనుడైన శ్రీరాముని సీతాసాధ్వితో గూడి దర్శించె భాగ్యం దృష్టిదోషం మూలంగ కోల్పోయామని శబరితోపాటు తాను గూడ విచారించి—చూపుచక్క చేసుకొని —పరికించి.—

"నిత్యసత్య దయారాసులు లక్ష్మణానుగత సీతారామ లోకేశులా?" 1

అంటూ ఒక్కసారి ఆనందాతిరేకంతో కేకవేస్తాడు కవి. శబరికంటే ముందుగా వారిని గుర్తించిన అదృష్టం కవికే దక్కుతుంది.

"పఱతెంచు త్రోవ జక్కం
బఱుపంగా లక్ష్మణుడు పలుకాడుచు నిన్
దరియుచు నున్నారదె నీ
చిరకాల తపఃఫలములు సీతారాముల్"—(24. ప)

అంటూ చూపు ఆనన్ని అవ్వ శబరిని సాహయ్యులై "సీతారాములు" నీచెంతకు వచ్చారు అంటూ శబరికి సీతాసమేత శ్రీరామచంద్రుణ్ణి దర్శింపచేస్తారు కవి. మాధవపెద్ది సీతాసమేత శ్రీరామచంద్రునే శబరిచే దర్శింపచేస్తాడు. సీత లేని రాముణ్ణి చూడటానికి కవి మనసు అంగీకరించలేదేమో! అందుకే తాను చేసిన ఈ మార్పుకి ఆధారం "శబరివిందు" అని తాను విన్న జానపదగేయమని విషయ పరిచయంలో చెప్పుకున్నారు.

రాముని చూచి పులకించిన శబరి కనుల ఆనందబాష్పాలు ప్రవహించాయి. వాని దర్శనానికి తాను పడిన తపన, గుర్తుకొచ్చింది. ఎద కుదుటపడింది. కన్నీటి బిందువులు కూడా ఆరిపోయాయి.

"శ్రమ యెంతోయిడినాను స్వామి నయిరించంజెల్లు నిన్నెంతదూ
రము రప్పించితి నేమిసేతు 2—

అంటూ తనకై నడిచివచ్చిన శ్రీరాముని చూచి, తనచెంతకు పిలిపించుకొన్నందుకు బాధ పడుతుంది శబరి.

---

1. శబరి-23. ప.  2. శబరి–31 ప.

"కృపయీనాటిక? యేదినీదునగు మోమేది యిటుల్ చూపు-దూ
రపు జూపానదు రమ్ము దగ్గరకు 1 వార్థక్యము మెండయ్యె!

అని చేతిని అడ్డుపెట్టుకొనిచూస్తూ, రాముని చెంతకు పిల్చుకొని తడిమి చూసుకొని, మాతృత్వపు మమకారాన్ని పంచి, ఆనందిస్తుంది. "నడలో నెంతటి యందమున్న యదిరా నాయన్న, భూదేవి నీ యడుగుల్ ముద్దిడికొంచునున్నదియొకో యన్పించె"2 అంటూ సుందరరాముని శ్రీ చరణాలు భూదేవి ముద్దిడుకొంటున్న అనుభూతిని పొంది, ఆ నడకలోని అందాన్ని మనసారా పొగిడి ఆనందిస్తుంది.

"రాతిన్ నాడొక నాతిజేసితివి స్పర్శన్, దర్శనంబిచ్చి యీ
నాతిన్ నేడొక రాతిచేసితివి ప్రాణం బెప్పటట్లుంచి" 3

అనే పద్యం శబరిలోని స్తంభిత చైతన్యాన్ని సూచిస్తుంది. తన కోరికల ప్రోవై పూర్వజన్మ పుణ్య ఫలమై ప్రాప్తించిన రామదర్శనం శబరిని అచలను చేసింది. ఇక ఏవిధంగా అతిథ్యమిచ్చి, మర్యాదల్ని చేయగలనంటూ విచారిస్తుంది ఆ భక్త హృదయం.

రామభక్తుడై రామదూత హనుమంతుని ఉపాసించి, రామమంత్రాన్ని ధ్యానిస్తూ– భౌతికవాంఛాతీతంగా- కవితాసమాధిమగ్నుడై రామకథాగానం చేయాలనే తపన ఉన్న కవి మాధవపెద్ది.

"వేయునేటికి మారామ విభునివంటి
శ్యామసుందర మదన మోహనుడు లేడు
అమ్మహాధర్మవీరు నామమ్మె చాలు
త్రిభువనమ్ములు మోహముద్రితములగును."

అన్న విశ్వాసంతో "బుద్ధిని పెడత్రోవ తిప్పక, భగవత్కైంకర్య భావనతో, బ్రాహ్మీ ముహూర్త మందు వీచెడి ప్రాతఃకాలవాయువులలో జానకీరామచంద్ర పరబ్రహ్మన్ని దర్శించాడీ భక్త కవి మాధవపెద్ది. మరి వీరిచేతిలో "శబరి" "భక్తశబరి" అయింది. భక్తిరసప్రవాహం రూపు దాల్చి "శబరి"గ నిల్చింది. కొన్నిచోట్ల "శబరి" మాట్లాడక మునుపే కవి కల్పించుకొని శ్రీరామభద్రునితో "శబరి" మనస్సులోని భావా

1. శబరి–32 ప. 2. శబరి–34 ప.

3. శబరి-35. ప.

లను చెప్పే ఆవేశాన్ని సైతంపొందుతారు. అసలు "శబరి"కి సీతారాముల్ని పరిచయం చేసిన భాగ్యం ఈ కవిది.

"దరియుచు నున్నారదె నీ
చిరకాల తపఃఫలములు సీతారాముల్,"1

"ఓ శబరి! వచ్చిరిరుగో ఫ
లాశనుల భాగ్యత స్వయంవిష్ణువులై
దాశరధులు నీయెడల ద
యాశరధులు న్వగత మేల స్వాగతవేళన్"2

"..............................ఏ
మందువో తడవుచు బెదవులాడింతు గదే"3

ఏది యపరాధము జరిగిన
యదియో లక్ష్మణుడు కటములదరగ బెదవిం
గదలింప నుండె-దెలియద
మది ముందుగ, వేడుకొంద మాపయి శబరి!4

అంటూ అనేక సందర్భాల్లో కవి శబరికి సన్నిహితుడై సంచరిస్తాడు.

రామచంద్రునికి అర్ఘ్యపాద్యాదులందించి, అతిధి మర్యాదలు చేయడానికి "చిత్తం బెంతకున్ గూడ జిన్ముద్రం బాయదికెట్లు నీకొనగికొందున్ దండ్రి! యాతిధ్యమున్"5 అంటూ రామదర్శన జనితానంత పారవశ్యంలో చేతలుడిగి కూర్చుండిపోతుంది శబరి.పాద ప్రక్షాళన వల్ల పద్మతీర్థాన్ని, హస్తాదులయందు శంఖచక్ర తీర్థాల్ని స్వీకరించిన శబరి, "తరియించెడి యోగమున్న దారియుదొఱకున్"6 అంటూ ఆనందిస్తుంది. కాని కడుగుతున్న చేతికి శ్రీరాముని చరణాలు కఱుకుగ తగిలాయి, ఉలిక్కిపడింది శబరి.

"చరణము లిట్టులుంట సహజంబుగనే యరుణమ్ములౌటనా?
కఱకు పథమ్ములన్ నడువ గందుటనా? 7 ........అని ఇంతకు పూర్వమే

1. శబరి 24. ప.
2. శబరి 25. ప.
3. శబరి 30. ప.
4. శబరి 53. ప.
5. శబరి 36. ప.
6. శబరి 39. ప.
7. శబరి 37. ప.

సందేహించిన ఆమె మనస్సు ఇప్పుడు బలపడింది.

"అడవుల నొక్కటే తిరుగుటొంటను బొక్కగటోలు బాదముల్
కడిగెడువేళ జేతి కలకాళలు వివ్వరి నూగొయన్న కై
వడి తవిలెన్ రఘుప్రవర" 1 - అంటూ వేదన చెంది దానిపై హిమ

మిశ్రిత పటీరచర్చ వేసి శాంతింపచేస్తుంది. చేతులు కాయలుగాసి కఠినంగ ఉండ టానికి కారణం-కర్కశమైన శివధనస్సుని విరచడమై ఉంటుందంటూ-శ్రీరాముని పరాక్రమాన్ని మరొక్కసారి స్తుతించి-"చిటిపొటి పూలనేర్చి విరచించిన" ఒక తీగ చుట్టును నవరత్నకాంతి సంఘటితపు ముద్దుటుంగరముగా భావించి శ్రీరాముని చిటికెన వ్రేలికి తొడిగి, కన్నుల కఱువు తీరగ చూసుకొని ఆనందించింది.

"చూచితె రామ! నీకెదురుచూచుచు నా కనులిట్లు కాయలన్
గాచుటెగాక యాశ్రమమునంగల యీ తరుటెన్ని గాయలన్
గాచెను నీకు నర్పణమొనర్పగ" 2

అంటూ రామునికై ఎదురుచూచి, చూచి, ఆమెకన్నులు కాయలుకాస్తే, రాము నికి సమర్పించుకోవడానికి చెట్లుకాయలు కాసినాయి. రెండు కాయలు రామచంద్రు సమర్పణకే. "కన్నులు కాయలు కాయడం" అనే వాలీ కాన్ని ఇక్కడ కవి అందంగా వాడుకొన్నారు. మధురమై రసవంతములైన పెక్కు పండ్లను వారికి అందించింది శబరి.

లక్ష్మణునిలో మార్పు కన్పించింది. దవడలు అదురుతుంటే, ఎట్టబడిన ముఖంతో ఏదో మాట్లాడాలని అతను చేసే ప్రయత్నాన్ని కవి ముందుగానే గమ నించి, శబరిని హెచ్చరిస్తాడు-"ఏదియొ" అపరాధము జరిగిపోయింది.

"...............దెలియుద
మది ముందుగ, వేడుకొందమాపయి శబరి!"3

అంటూ ధైర్యం చెపుతాడు కవి శబరికి. ముందుగ విషయం తెలుసుకొని, ఆ తరువాత వేడుకొందామంటూ హామీ కూడ ఇస్తాడు.

---

1. శబరి 43. ప
2. శబరి - 50 ప
3. శబరి - 53 ప.

"పండులు మెండెగాని యెదిపట్టిన చిత్రము ! పక్షి యాడిన
ట్లుండె నిదేమిపాపమవిగో పలుగాట్లు, వివేకశూన్యవై
పండినసీపు నీ తపసు పాడటిపోవునటుల్ కృపాసము
ద్రుండగు రామభద్రు నొక రుద్రునిగా నొనరింపజూతువే" 1

పండ్లమీద పంటిగాట్లను చూసి, కోపగించిన లక్ష్మణుడు "రామభద్రునొక రుద్రునిగా నొనరింప జూతువే" అంటూ వీరభద్రుని వలె రోషకషాయిత నేత్రుడయ్యాడు. కానీ శ్రీరామచంద్రుడు శబరి ఇచ్చిన ఫలాలను మక్కువతో స్వీకరించడంతో అవాక్కయిపోయాడు.

"బ్రతికితిమి తల్లి ! యెంతయు
సదముడు నీయెడల రామచంద్రుడు నీ విం
కెది చెప్పదలతో చెప్పుమి
యదియెల్లను స్వామివార లాలింపంగన్" 2

అంటూ శబరిని సమాధాన పరుస్తాడు కవి. శబరి అదృష్టానికి ఆశ్చర్య పోతాడు.

"అంబా! నీ యపరాధమెంత మహాసీయారాధనంబయ్యె లో
కంబందెవ్వరి పుణ్యమింత పరిపక్వంబయ్యె జేసాచె జి
త్రంబీ యెంగిలిపండ్లకే రఘుకులోత్తంసంబు......" 3

అంటూ రామునికి శబరిచేత ఎంగిలి పండ్లను తినిపించాడు లక్ష్మణుని చేత-కవి మాధవపెద్ది. ఒక్కొక్క పండు రామునికందిస్తూ శబరి తనగోడు రామునకేకరువు పెట్టుకొంటుంది. -

"చిక్కితె! నేటికిన్ దపసుచేయగ జేయగ వీవసీయవే
మక్కువదీఱ నా వలపుమామిడి లేజిపురాకు వీవనన్" 4

అంటూ రాముని మార్గాయాసం పోవునట్లు మామిడి లేజిపురాకు వీవనతో వీచి శ్రమ పోగొడుతుంది. రాముని దివ్యసుందర విగ్రహాన్ని తనివితీర దర్శించి, స్వహస్తాలతో ఫలాలను అందించే భాగ్యం తనకు లభించినందుకు ఆనందనృత్యం చేస్తుంది శబరి మనస్సు.

---

1. శబరి - 54 ప.
2. శబరి - 57 ప.
3. శబరి - 58 ప.
4. శబరి - 60 ప

"మామకభక్తియన్న దణుమాత్రము లేకెటు మాయమయ్యెనో
యేమిది యొక్కచే మమత యేర్పడె నీవొక బిడ్డవై నటుల్
రామయతండ్రి!" 1

అని బ్రహ్మచారిణిలో మాతృ ప్రేమ పెల్లుబుకగా, కౌసల్యగా రాముని ఆదరించిన అదృష్టవంతురాలు. మాధవపెద్ది వారి "శబరి" "నరరూపమ్మున వచ్చితే యతిథివై నాయింటికీనాటికిన్" అన్న ఆర్తితో హృదయావేదన మిక్కుటమై–"నానా యజ్ఞ ఫలస్వరూపమగు సంతానమ్ముగా నాదిలక్ష్మీనారాయణు నిన్ను గర్భమున గాంచెన్ గాని కౌసల్య"-అని కౌసల్యాసాధ్వి అదృష్టాన్ని కొనియాడి—

"..... ..... ..... ..... ..... ..... .....మ
ధ్యానైకాగ్రత నీకు నీవె యిటు మత్సంతానమైపోవ న
న్నానందించితి వింతకన్న గలదే యోగమ్ము యోగమ్మనన్"2

తన యోగ ఫలసిద్ధిగా లభించి తనకు సంతానమైన శ్రీరాముని వేయినోళ్ళ కొనియాడుతూ, "ఆదివ్యసుందర విగ్రహుని" "మంగళరూపుని క్షీరసాగరశయనుని" అనేక రీతుల స్తుతిస్తుంది.

"తబిసింబోలుచు బాదముల్ గడుగనో - తల్లింబలెన్ జెక్కులన్
జుబుకంబున్‌గొన వ్రేళులన్ బుణుకనో – నోరార విన్ బిల్వగా
నుబలాటంపడబోనొ - తండ్రివలెనే" 3 - అంటూ ఆర్తి చెందిన ఆమె హృదయంలో హఠాత్తుగ అనంతశయనుండైన ఆదినారాయణుడు ప్రత్యక్షమౌతాడు.

"ఆ నీ క్షీరసముద్రమే యిచట నా యాహ్లాదమై నిండెనా?
యీ నా లక్ష్మణుడయ్యనంతశయనంబేనా? యిటుల్ చూడు నీ
వేనా ధ్యాననిమగ్ననౌ నెడల నాయిచిత్తపద్మాన ల
క్ష్మీనారాయణమూర్తిగా వెలసెదో శ్రీరామచంద్రప్రభూ" 4

"హరినారాయణు నాదివిష్ణు జగదేకారాధ్యు విశ్వంభరున్" 5

ఇత్యాదిగ భక్తసులభుడు, బ్రహ్మణ్యుడు, సంసారసంహరణుడు, నిర్మల నిర్వికల్పుడైన లక్ష్మీశ్వరుని అనేక విధాలుగా స్తుతించిన శబరిలో ఇంకా మర్త్యవాసన మిగిలే ఉంది. అందువల్లనే ద్వైధీభావమనస్కయై-

---

1. శబరి - 60 ప. 2. శబరి - 66 ప. 3. శబరి - 63 ప.
4. శబరి - 69 ప. 5. శబరి -77 ప.

"పరమేశుండని భక్తి మ్రొక్కుదునా? పాపండంచు లాలింతునా?
ఇరువందమ్ములు వొక్కసీయెడలనే నీక్షించుచున్ లోన ని
వ్వెఱపాటొందుచు మిన్నకుండుదునా? నీవే చెప్పవే 1

అంటూ సందేహనివృత్తికై దాక్షిణ్యపాథోనిధియైన యా దాశరధినే ప్రార్థిస్తుండగా కనులముందు కాంతి వెల్లువ ప్రవహించింది. వైకుంఠం నుండి పుష్పకవిమానం వచ్చి వాకిట నిలిచింది. రామచంద్రుని ఆజ్ఞ అయింది. కాని ఇహబంధాల మీద మమకారం తెంచుకోలేక పోయింది మాధవపెద్దివారి శబరి. "చిగురువేసిన మాధవీ తీగలు" పుష్పించేవరకు,"గర్భిణియైన హరిణము ప్రసవించే వరకు ఉండిపోగూడదా" అని బాధపడుతుంది.

"పూవల్ పాపము మాధవీవకుళముల్ పుష్పించుటంజూచియే
నీ పోగూడదో యేనుపెంచు హరిణంబే ప్రొద్దు నీరాడునో" 2

అంటూ చింతించి, తన ప్రయాణాన్ని గ్రహించి దుఃఖిస్తున్న హరిణాన్ని బుజ్జగిస్తుంది. అత్తవారింటికి వెడుతున్న శకుంతల చేత అభిజ్ఞాన శాకుంతల కర్త చేయించిన అప్పగింతలు - వైకుంఠప్రాప్తి పొందబోతున్న శబరి చేత చేయించారు మాధవపెద్ది. వాసంతిక, లవంగి, లవలీమతల్లికలకు, పంపా సరోవరానికి కన్నీటితో కడసారి వీడ్కోలు చెప్పి -

".... .... .... వత్సమ్మనే చూడు మే
మరకేవేళను నాకు మారుగను గోమాణిక్యమా! రమ్మ నా
హరిణమ్మా! కడసారి మూర్కొనగనిమ్మా పోవ ప్రొద్దయ్యెడిన్"3

గోవత్సాన్ని, హరిణాన్ని కడసారి ముద్దిడుకొని, ప్రొద్దుపోతుంది అంటూ ముందడుగు వేసింది శబరి పుష్పకవిమానాన్ని అధిరోహించడానికి. ఇంతకుముందు ఆర్తితో హృదయాన్ని పంచి దైవాన్ని దర్శించి, భక్తి ప్రపత్తులు వెలయించిన ఈ శబరిలో కావ్యనాయికను, దర్శింప చేయడం కవియొనర్చిన మార్పు. కణ్వాశ్రమాన్ని వదలి వెళ్ళలేని కాళిదాసు శకుంతలలోని జీవసమైక్య కారుణ్యభావాన్ని శబరిలో దర్శింప చేసిన మృదుహృదయుడుగ ఆశ్రమ వాసులలోని కరుణరస ప్రవృత్తి వెల్లడింప యత్నించారు. ఇది కావ్యగత సౌందర్య జగత్తు. దీనిని ఆధ్యాత్మికంగా, కేవల

1. శబరి - 72 ప. 2. శబరి - 85 ప.
3. శబరి - 89 ప.

మోహరహితంగా నిరూపించటం కవికభీష్టంకాదు "అపారే కావ్య సంసారే కవి రేవ ప్రజాపతిః యథాస్మై రోచతేవిశ్వం, తథేదం పరివర్తతే" అన్న అభినవ గుప్త పాదుల ఆదేశం ఇచ్చట స్మరణీయం.

ఈవిధంగా ప్రకృతిని పలకరిస్తూ, పలవరింపులతో చరిస్తున్న శబరిని-రాఘవు లేదో అంటున్నారంటూ మళ్ళా కవి కల్పించుకొని రామునివైపు దృష్టి మరల్చు తాడు.

"జననీ ఈ రాఘవులేదిమో
యనుచుండిరి వించు చేరుమమ్మా పరమున్" 1

అన్న మాటలతో కవి శబరిని రామవాగున్ముఖం కావించి రామచంద్రునిచే వరప్రదానం చేయిస్తాడు. మూలంనందు తనరాకకోసం ఎదురుచూసి, తన దర్శనానంతరం ఆనందించి ఈ శరీరాన్ని త్యజించటానికి అనుజ్ఞ నభ్యర్థించిన 2 శబరితో రాముడు ఇలా ఉంటాడు.

"అర్చితో౽హం త్వయా భక్త్యా గచ్ఛ కామం యథాసుఖమ్" 3

అన్న వాల్మీకాన్ని ఆధారం చేసుకొని మాధవపెద్దివారి రాముడు-

"ఆ హంసమ్మొక దేవయానముగ నీకై యాయితం బయ్యె నీ
దేహంబింతటితో భువిన్ విడిచి జ్యోతీరూపతం బెంది యా
రోహింపం గదవమ్మ విన్నదియె చేర్చున్ విష్ణులోకానకున్
సో౽హం సోహమటన్న దేమరకుమమ్మా! నీవు లోలోపలన్"4

అంటూ సాగనంపడమే కాక-"శబరీ రూపమునందరూవతను సాక్షాచ్చి వికుంఠమ్మున్ దబసుల్ మున్నెపరందజాలన్ విముక్తత్వమ్ము గైసేయమీ"5 అనిమార్గనిర్దేశం కూడా చేస్తాడు "యత్రతే సుకృతాత్మనో విహరంతిమహర్షయః తత్పుణ్యం శబరీస్థానం"6 అన్న వాల్మీకి మూలమే కవిచేత శబరికి మార్గనిర్దేశం చేయించింది. సుకృతాత్మనః అన్న పదానికి "సుకృత ధైర్యవంతః ఆత్మసమాధినా- ఆత్మవిషయ యోగేన"అని వ్యాఖ్యానించి"స్త్రియా అపి విదురాదేరివ యోగాధికారస్సంభవతి తదంగ యజ్ఞాది కర్మస్థానే గురుశుశ్రూషా"ఇత్యాదిగ ప్రత్యేక విశ్లేషణ గోవిందరాజీయంలో కన్పిస్తుంది.

---

1. శబరి - 90 ప.
2. 'తదిత్యమభ్యనుజ్ఞాత త్యక్త్వా మేతత్కళేబరం అరణ్య' 74:28
3. అరణ్య-74—31
4. శబరి-92—ప.
5. వాల్మీకన్న -అరణ్య-74
6. శబరి—95 ప.

"స్వర్గమేవ జగామసా" అన్న మూలాన్ని-"స్వర్గశ్చ ఆదౌ అక్షయానిత్యాక్త్యా పునరావృత్తి రహితం పరమపదమిత్యగమ్యతే"1 అని గోవిందరాజీయం. వైకుం క్వావర్ణన మొనర్చడానికి సైతం కవికి అవకాశం కలిగించింది.

"అదిగో! ద్వారము ద్వారమున్ దనకు దాసై వీడెడుంజూడు ము
ప్పది యొక్కోటుల దేవతల్ నిలిచి రంబా! పూలదోయిళ్ళతో
నెదురుం జూచుచు నిర్నిమేషతను లక్ష్మీశుండు వేంచేయునో
ఒదుగుల్ వోపుచునున్నవారు మునుముందున్నట్టి దిక్పాలకుల్" 2

అంటూ కవిచేసిన వర్ణన మూలాతిరిక్తం. "హుత్వా ఆత్మానం హుతాశనే"3 అని హోమాగ్నిలో శరీరాన్ని అర్పించి స్వర్గాన్ని చేరినట్లు మూలం. అదే విధంగా ఎంగిలిపండ్లు సమర్పించటం సైతం మూలాతిరిక్తమే. పద్మపురాణాంతర్గమైన ఈ భాగం అనేకమైన లఘుకావ్యాల్లో జానపద గాథల్లో చోటుచేసుకుంది. దీనిగూర్చి స్థలాంతరమందు చర్చించడం జరుగుతుంది.

శబరికి మోక్షప్రాప్తిని కవి చేకూర్చాడు.; గోవిందరాజీయానుసారం. కాని "సోఽహం సోఽహం" అన్న పద్యపాదాన్ని బట్టి అద్వైత ప్రతిపాదన జరిగింది. ఈ రెంటి సమన్వయం ఎట్లాగు? సాలోక్య సాయుజ్యాలు అనుభవించి ఆనందించి తదనంతరం పరమాత్మతో తాదాత్మ్యమందటం జీవునివేదనలోని అంతరార్థంగా కవి ప్రతిపాదించిన ధ్వని. విశిష్టమైన అద్వైతసిద్ధి పిమ్మట, అద్వైతసిద్ధి క్రమంగా కల్గాలని కవి ఆశయంగా కనిపిస్తుంది. "దాసోఽహం" "దాసోఽహం" అంటుంటే చివరకు వినిపించేది "సోఽహమే కదా!"

1 శబరి-95-వ 2. వాల్మీకం—అరణ్య-74-
3. వాల్మీకం-అరణ్య—74—33

## చిట్టెమ్మ గారి శబరి

మాధవపెద్ది వారు మతంగ మహర్షి ప్రస్తావనలో-శబరిని ముజ్జాళ్ళ గుడ్డును గూడకాని "పసికందును ఆశ్రమంలో ఎవరో విడిచిపెట్టినట్టు, ఆ పసిపాప మహర్షి చే పెంచబడినట్లు వర్ణించగా – శ్రీమతి భోగరాజు చిట్టెమ్మ ఇంక కొంత సాహసించి, శబరి యొక్క కన్యా భావ రమణీయ కాలాన్ని, తత్సమయపు ముచ్చటలను సైతం ప్రస్తావించి, ఇష్టంలేని వివాహాన్ని తప్పించుకోవడానికి ఇంటివద్ద నుండి పారిపోయి, అటవీమార్గం పట్టి తుదకు మతంగ మహర్షి ఆశ్రమం చేరినట్లు వర్ణించారు. ఈ మార్పుకు ఆధారం పురాణ ఇతి వృత్తమే. 1

## దర్శన భాగ్యము

"వెలుపలి చూపుల న్వదలి, విశ్వమునంతయు బ్రహ్మరూపుగా
దలచి, దురంత సంసరణ తప్తజనాళికి పార సత్కృపా
కలిత దృగంచలమ్ముల సుఖం బొనగూర్చెడు దివ్యమూర్తి, ని
శ్చల సుతపోవిభాసి, గురుసన్నిధి జేరగ రమ్ము సోదరా" 2

అంటూ తాపసోత్తములు ఒకరినొకరు పిల్చుకుంటూ గురువుల చెంతకు చేరుతుండ టంతో కావ్యం ప్రారంభమౌతోంది. వేదఘోషలు దిక్తటాలను వ్యాపిస్తుంటే, రామజగదీశ్వరు గూర్చిన ప్రసంగాలతో, శాస్త్రపురాణచర్చలతో ఆశ్రమభూమి పుణ్య భూమియైపతితజీవుల పాపముల తుడిచివేయ గలిగిందిగా భాసిస్తోంది. చిలుకగుంపులు గూడరాత్రింబగళ్లు'రామ'నామస్మరణ చేస్తున్నాయి. ఈ విధమైన రమ్య ప్రకృతి వాతా వరణంలో మహర్షి మతంగులవారు శిష్యకోటికి 'బోధ' చేస్తుండగా ఎవరో ఒక కన్య చెట్టు చాటునుండి దాగి, గురుదేవుల బోధల నాలకించడంతో 'శబరి' కావ్య ప్రవేశం చేస్తోంది.

"పంక మం దుద్భవించిన పద్మమామె
మలయు గంజాయి మొక్కల దులసియామె
ఘనతరాజ్ఞాన గాంధాంధకార భరిత
జగములకు వెల్గునొసగెడు జాణయామె." 3

---

1. ఆశ్చర్య రామాయణం - 15 సర్గ - పు. 638
2. శబరి - 3.7
3. శబరి - 4.12.

అట్టి శబరి తన కులంలో సంభవించెడి హింసా ప్రవృత్తుల్ని తిరస్కరించి, అహింసను బోధింప యత్నించింది.

కాళికాదేవికి బలి యివ్వడానికి సింగారించి తోలుకొని పోవు పశువుల్ని చూసి ఈమె హృదయం రోదించేది. బండగుండెలు గల ఈ క్రూరుల మధ్య తననెందుకు పుట్టించావని ఆ దైవాన్ని నిష్ఠూరాలాడేది.

"కన్న సంతానంబు కడుపారగా మ్రింగు
కఠిన మనస్కవే? కాళికాంబ!

అంటూ వేదనజెంది "తల్లి"ని ప్రశ్నించుటయే కాక, చేతులుమోడ్చి,

మాతరో! నీకు జోహరు మానుమమ్మ
బలిని గొనుటలు, జీవుల బాదమాన్పి
ఘనకృపా దృష్టి వానిని మనుపుమమ్మ" 1

అని సైతం 'దేవి' ని ప్రార్థించేది శబరి. ఈ విధంగా 'పెట్టిపిల్ల' వలె హింసావృత్తి గల కుటుంబంలో, కులంలో పుట్టి 'అహింసా' భావాల నావిష్కరిస్తున్న ఆమె ఏకాగ్రత్త చెలికత్తెల రాకవలన భంగమౌతుంది. చెలికత్తెలు చుట్టుముట్టి వయసుకు తగిన రీతిలో మాట్లాడుతూ, పెళ్ళి ప్రస్తావన చేస్తారు.

కాబోయే పరుడు గొప్ప విలుగాడు అన్నారు. సుందరాంగుడు అంటారు.

"నీదు పరుడు చాల నిపుణుడమ్మ
వాని విక్రమంబు వర్ణింప వశమటే
ధాతకైన వాని తాతకైన" 2

అని కాబోయే వాని గూర్చి అధికంగా వర్ణించడమే కాక, అతని పరాక్రమం పలు విధాలుగా కొనియాడి-

"మొన్న నీవు పూలమొక్కలలో నున్న
కలుపు దీయునట్టి కాలమందు" 3

అతడు నిన్ను చూచి వరించాడని, "అమెగాంచి యింక నాగలేననుచును" 4 వార్త కూడా పంపాడు అంటారు. ఆశ్చర్యపోతుంది శబరి. అతను పంపిన లేఖను సైతం చదివి వినిపిస్తారు చెలికత్తెలు.

---

1. శబరి - 5.17
2. శబరి - 7.20
3. శబరి - 8.20
4. శబరి - 8.23

"నా వరాలమూట, నారాణి నాదేవి" 1 అంటూ ప్రారంభమైన లేఖ అనేక రీతులుగా కొనసాగి -

"నన్ను కౌగిలించి వేగ నాదు తాపమార్పవే
నిన్ను దప్పు నేరిగూడ నే నెఱుంగనే ప్రియా
యెన్న రాని యందమంత యెంత నీకు గల్గినన్
సన్నుతాంగి బింకమింక చాలు చాలు చాలునే" 2

అంటూ అత్యంతోత్సాహంతో వ్రాసిన లేఖాంశాలను కోపగించుకొన్న శబరి చివాలున లేచి ఇంటికి వెళ్ళిపోయింది. అంధకార పరివృతమైన ఆకాశంలో శశిరేఖలాగ, దుష్టులైన ఆ యాటవికుల మధ్య జన్మించి దినదినము బాధల పొందుతూ ఆమె షోడశ వర్ష ప్రాయ అయింది. తరుణ కాలమని వివాహ ప్రసక్తి తీసుకొచ్చారు తల్లి దండ్రులు. చెలిక త్తెల పల్కులు, వారు వర్ణించిన 'అతని' హింసాప్రవృత్తి పూర్వక పరాక్రమ వర్ణన ఇవన్నీ గుర్తుకొచ్చి తల్లిదండ్రుల మాటల త్రోసి పుచ్చి, పెళ్ళి ప్రస్తావనను తిరస్కరించింది శబరి. కాని వారి ఏర్పాట్లలో వారున్నారు. భయపడి పోయింది శబరి. ఇలవేల్పు 'కాళిక' ను పలువిధాల ప్రార్థించింది. "రేపేనాకిక పెండ్లి మృత్యు" వనుచు భయపడి, త్రిలోకమాత పార్వతిని ప్రార్థిస్తూ, తోచిన సాహసు పురస్కరించుకొని, పారిపోవ నిశ్చయించుకొని అడవిమార్గం పట్టింది. భయంకరాటవిలో ఆలోచనా రహితంగా ఐదుకోసులు ప్రయాణించి, అదృష్టవశం చేత మతంగ మహర్షి ఆశ్రమానికి చేరుకొంది. శిష్యులకు విద్యనేర్పుచున్న మహర్షి పలుకులు ఆసక్తితో చెట్టుచాటునుండి వినసాగింది. మహర్షి చెంతకుపోయి నమస్కరించుటకు వీలులేని కులంలో పుట్టడానికి దుఃఖిస్తూ, ఆమహాసీయుని ఉపన్యాసాన్ని విని జీవితాన్ని అలౌకిక జగత్తు వైపు మరల్చింది.

"దీనులను జాలి గనుటయే దేవపూజ" 3 అన్ని ప్రాణులలో నుండె నతడు గాన వారి సేవయే 'యాతని' 4 జేరు త్రోవ. ఈ శరీరంబు మీద గాడెపుడు/హాడ' 5 జన్మమొందనేల చావంగ నేల యీ పాడులోక మందు వాడుకొనుడు దేవదేవు గూర్చి" 6-

వంటి మహర్షి అమృతంపు పల్కులు మదిలో క్రొత్త బాటల నిర్మించ, ఆ మహర్షి సేవలోనే జీవితాన్ని ముగించాలని నిర్ణయించుకొంది శబరి.

1. శబరి – 8.21
2. శబరి – 9.28
3. శబరి – 22.83
4. శబరి – 22.84
5. శబరి – 21.72
6. శబరి – 21.74

5)

## ఉపదేశము

ప్రతిరోజు ఆశ్రమం ముంగిలి శుద్ధిచేసి, ముగ్గులువేసి, పుంతలు బాగుచేసి దర్భలను ఆశ్రమ ద్వారంలో సిద్ధంచేస్తున్న అజ్ఞాతవ్యక్తి ఎవరో తెలుసుకోవాలని మహర్షి శిష్యులను ఆదేశించారు. మాటువేసి గురువుల ఆజ్ఞను అమలు జరిపారు శిష్యవరేణ్యులు. శబరిని తీసుకొచ్చి గురువుల ముందు నిలబెట్టారు. భయంతో వణికి పోయిందామె. ప్రశ్నించారు మతంగ మహర్షి.

"ఎదుటనునిల్చి పల్కుటకు నేవియు నోచనిజాతిదాన, నా
మది కడుకల్మషంబు కనుమా భవదీయ కృపార్ద్ర దృష్టి, నీ
పదముదెదిక్కునాకు............" 1

తాను చేసినది తప్పయితే క్షమించమని పాదాలపై బడి వేడుకొంటున్న శబరిని ఆశీర్వదించి, భయముదీర్చి, భక్తిమార్గాన్ని ప్రబోధించారు మహర్షి.

"నాధాహం శబరీ నీచా భాగ్యహీనా వనే స్థితా
మహర్షే తవ సేవాయాం చికీర్షత్సవ మాచరం
యధా మే సద్గతిర్భూయాత్తధా దేహి మమాఽశిషమ్" 2

అంటూ ప్రార్థిస్తుంది ఆశ్చర్యరామాయణంలో శబరి. పెండ్లి ప్రస్తావనాదులు పద్మపురాణాంతర్గతమైనవి కాగా, ముంగిలి ఊడ్చుట, దర్భలు సమకూర్చుట మొదలైన సన్నివేశాలన్నీ ఆశ్చర్య రామాయణంతో సైతం కన్పిస్తున్నాయి. శిష్యులు రాత్రి మేలుకొని ఆమెను గమనించి, గురువు చెంత నిలబెట్టగా శబరి పైవిధంగా ప్రార్థిస్తుంది.

"ఆశ్రమే తిష్ఠ శబరీ ఛాత్ర భూతా మమాంతికే" 4

అని తన శిష్యురాలిగ స్వీకరించారు మహర్షి మతంగులు.

............నిరపాయత నిచ్చట నుండు మమ్మరో" 5 అంటూ ఆశ్రమనివాస యోగ్యతను కల్గించి, శిష్యురాల్ని చేసుకొన్నారు శ్రీమతి చిట్టెమ్మ మతంగులు.

"బిడ్డ నీవు నుంత బిడియంబు పడకుండ
వినుముబోధ, జ్ఞానధనము గనుము" 6

---

1. శబరి – 31.21
2. ఆశ్చర్యరామాయణం – 16.111
3. ఇంధనానిగృహేత్వాచ తదాశ్రమ సమీపత,........ ఆ.రా 16.34
4. ఆశ్చర్యరామాయణం – 16.12
5. శబరి – 35.40
6. శబరి – 32.25

"రామనామంబు పేరిటి రత్న మెపుడు
చిరకొంగున ముడివైచి, చేరనీకు
మెవనిరింగాని ప్రక్కకు నెపుడుగూడ
దాని జూపింపకమ్మ యెందఱకు నీవు"1

"మనము నిర్మలమయినంత మమత లుడుగు
గలుగు నేకాగ్రబుద్ధియు, గాంచె దీవు
జ్ఞానరత్నంబు దాన నీ జన్మముననె"2

వంటి భావాలు కొల్లలుగ మహర్షి ప్రసంగంలో ప్రవహించి, శబరిని పవిత్రీకృతాత్మను చేస్తాయి. హింసావృత్తితో జీవిస్తూ, ఎప్పుడూ పోట్లాడుకునే తనజాతి భవిష్యత్తు ఏమైపోతుందని రోదిస్తుందామె. "భగవంతుడన నెచటనో లేడు నిత్యము దీనుల రూపంబున మన ఎదుటనే తిరుగుచున్నాడు. మానవసేవయే మాధవసేవ యనుమాట జ్ఞప్తి యందుంచుకొనుము"3 అంటూ అహింసా సిద్ధాంతాల్ని, దరిద్రనారాయణుల సేవా ప్రయోజనాలను, గాంధేయవాదాన్ని ఈ సమయంలో రచయిత్రి మతంగుల ద్వారా చెప్పించడం—స్వాతంత్ర్యోద్యమ ప్రభావాన్ని రచయిత్రిపై అహింసాజ్యోతి రామభక్తుడు అయిన గాంధీజీ ప్రభావాన్ని మనం స్పష్టంగా గుర్తించవచ్చు.

అట్టి గురుదేవుల ఉపదేశ ప్రభావంతో రామనామ ధ్యానైకదేశ మనస్క అయింది శబరి.

"రామునినమ్ము నెమ్మదిని, రామునినామము నుచ్చరించు, శ్రీ
రామ యటంచుబిల్చు, గనురామమయంబుగ లోకమెల్ల,"4

............జగమంతా రామమయంగ జీవించసాగింది శబరి. మహర్షి నీచు రాలికి ఆశ్రయమిచ్చాడని క్రోధించిన మునిగణం మహర్షిని నిలదీసింది. ప్రశ్నించింది. తన నిశ్చయాన్ని స్పష్టంచేసాడు మహర్షి. వారిని ఆ మార్గంలోనే నడిచి ముక్తిని పొందవలసిందని హితబోధ చేస్తాడు.

"మనసుఖంబును మనమేలు మనముముక్తి
బడయు మార్గముజూచుచు బ్రతుకుచుంట
మంచిమార్గమొ? పతితుల మధ్యకరిగి
జ్ఞానమిచ్చుట మంచిదో గానలేరే?"5

---

1. శబరి—32.27
2. శబరి-34.35
3. శబరి—36 41
4. శబరి—41.59
5. శబరి—46.84

అని సైతం ప్రబోధించిన మహర్షిని "పిన్నవాడవు నీవు నీచిన్నబుద్ధి వదలి వేగమే పీడుమా పనిత నిపుడు" అంటూ శతవర్ష జీవులందఱు హెచ్చరించి, తుదకు మాట వినవి యాయనను అంత్యకులజను చేరదీసినందుకుగాను కులంనుండి వెలివేశారు తాపసులు"1 కాని చెదరని విశ్వాసంతో దీనజనులకు సేవచేస్తూ విద్యార్థులకు బోధ చేస్తూ పవిత్రకార్యంలో నిమగ్నమైన ఆ మహర్షికి బ్రహ్మైక్యకాలం సమీపించింది.

శబరికి శ్రీరామ జననాదికాన్ని వివరించి, ఆ మహానీయుని దర్శనం చేసుకొని మోక్షము పొందవలసిందని ఆశీర్వదించి వైకుంఠ ప్రాప్తి పొందారు.

## గురు గుప్తి

"ఆగమిష్యతితే రామస్సు పుణ్య మిమ మాశ్రమమ్" అని వాల్మీకం. మతంగ మహర్షియే శబరికి అభయమిచ్చాడు.

"రామో దాశరథి స్సాక్ష ద్విష్ణురేవస్సనాతనః
అవతీర్ణో స్త్యయోధ్యాయామాగ మిష్యతి తేంతికమ్"

అని ఆశ్చర్యరామాయణం. గురూపదేశాన్ని ఔదల దాల్చి రామచంద్రుని ధ్యానిస్తూ రామచంద్రునికై నిరీక్షిస్తోంది శబరి దీన జన జనసేవనుమరువక ఆచరిస్తూ రోగులను సేవిస్తూ,అన్నార్తుల్ని ఆదుకుంటూ,గురుదేవుని ప్రవచనాల్ని మననం చేసుకుంటూ రామునికై ఎదురు చూస్తున్న శబరిని ఎన్నో నేరాలారోపించి పుర బహిష్కారం చేశారు ప్రాంతవాసులు.

"కొంచెమైనను భయమును గాంచదయ్యె
నంతయును రామమయముగా నరయుచుంట"2

సర్వము రామమయముగా భావించిన శబరి ఈషణ్మాత్రమును చలించక జీవించుచూ చిన్ననాడే తల్లిని, తండ్రిని కోల్పోయిన ఎనిమిదేళ్ళ బాలపితంతువు అయిన బ్రాహ్మణ బాలికనొకతె దారి తెన్ను గానక దుఃఖసంతప్తయై కాలము గడుపుచుండ ఆమె—

"దుఃఖితుల దుఃఖరాశిని దొలగజేయు
జ్ఞానమునకన్న గలదె? యీజగతియందు
చింతయును చీకటిన్ బడునంతలోన
వెలుగురాకున్నె వెన్నెల విధముగాను"3

---

1. మతంగం ప్రాపదన్దుష్టం శబరీ సన్నిధానతః
ఆశ్చర్యరామాయణం-16.14

2. శబరి-52.13

పలువిధములుగా ఓదార్చి "యామె రత్నంబామె కొంగునకట్టి" రామభక్తిని ప్రసాదించింది. అది చూచిన బ్రాహ్మణులు శబరిని దూరంగా తరిమివేశారు. అరణ్యమధ్యంలో ఒంటరిగా, రామునకై జీవిస్తోంది. చీమచిటుక్కుమంటే రాముడు వచ్చాడనుకుంటోంది. గుమ్మం వరకు వెళ్ళి నిరాశతో వెనక్కి తిరిగి వస్తోంది. నిరీక్షణ అతిశయిస్తోంది.

"కన్నులనుమూసి నిద్రను గాంచునప్పు
డులికిపడిలేచి, నేనెంత తెలివిమాలి
నిద్రబోయితి, శ్రీరామభద్రు డిప్పు
డిచటికేతెంచి వెడలెనో యేమొయనుచు" 1

అనేస్థాయికి ఆమె వేదన చేరుకుంది. ఈ సమయంలో రచయిత్రి అవకాశాన్ని తీసుకొని శ్రీరామచంద్రుని గుణగానాన్ని విస్తారంగా చేస్తుంది.

"రారా రాఘవరామా !
రారా సుర వినుత నామ! రాక్షసభీమా
రారా రవికుల సోమా!
రారా సాకేతధామ! రారా రామా" 2
"మురహర భవహర నరవర
సురవరనుత చరణకమల, సురుచిర లీలా!" 3
"ఏలా? యింతటి కోపము
మేలా? యిటు లూరకుంట, మృదులహృదయ" 4
"వలదా ! నాయాతిథ్యము
కలదా ! నీయాత్మనింత కాఠిన్యంబి" 5

మొదలైన పద్యాలు ఇందుకు ఆధారాలు.

ఏ శబ్దం విన్నా శ్రీరాముని పదధ్వనిగా, నేమాటవిన్నా ఆ కరుణా వరుణాలయుని వచనములుగా ఎవ్వరిని చూచినా ఆదేవదేవునిగనే భావించుచు కాలం గడుపుతోంది. రాముని రాక ఆలస్యమౌతోంది.

1. శబరి - 61. 46
2. శబరి - 57. 34
3. శబరి - 58. 36
4. శబరి - 58. 38
5. శబరి - 59. 41

"ఘననిరాశను గూలును, కనులమీద
కోపగించును, మీరేల తేప దేప
కిట్లు మాతనుబడుదురే నెట్టులింక
నామహోమహా మూర్తిని నరయుదాన" 1

'తేప తేపనిట్లు' మాతపడుచున్న కండ్లపై కోపగించుకొనుచు - జారిపోతున్న విశ్వాసాన్ని కూడగట్టుకొంటూ, గురుదేవుని పల్కుల విశ్వసిస్తూ –

"వచ్చును తప్పక వచ్చును
వచ్చును నాయింటికిపుడు వచ్చునతండున్" 2

అంటూ దీనజన శరణ్యుని కోసం –

"తియ్యగానున్న పండ్ల నాదేవునకును
బెట్టుకోరిక రుచిచూచి పెట్టినాను
గంపనిండుగ ".... .... ...."3

అంటూ రుచిచూచి, తీయని పండ్లను రామునికై ఏరి ఉంచింది శబరి.

ఇంతలో ఆమెకు దారినిండా ఉన్నముళ్ళు గుర్తుకొచ్చాయి. పాదుకల సైతం భరతునికిచ్చి నడిచివస్తున్న రామునికి ఈ ముళ్ళు బాధ కల్గిస్తాయేమోనని ఏర డానికి ప్రారంభించింది. కాని ఎన్నని ఏరగలదు? ఆలస్యమై పోతోంది. రామ చంద్రుడు వచ్చేస్తాడేమో! నని తొట్రుపాటు. అందుకే -

"ఏరదొడంగె నెన్నియనియేరును? తొంబదియేండ్లదామె, యా
కారమొ? యస్థిపంజర వికారము చూడగ, నంతలోననే
మారెను భావమేమొ? పలుమారులు దొర్లగసాగె నేలపై
"యేరిన చాలకాలమగు నింతట రాముడువచ్చునేమొకో" 4

అంటుంది రచయిత్రి. నేలపై దొర్లుతూ ముళ్ళన్నీ తనశరీరానికి గుచ్చుకొంటే మార్గం నిష్కంటకమై రామునకు బాధ కలగదని తలంచిన ముగ్ధభక్తి ఈ శబరిది. ఆ సమయంలో స్నానానికని సరస్సుకి వెడుతున్న ఒక బ్రాహ్మణుడు దొర్లుకుంటూ తనపైపుకి వస్తున్న శబరిని నిందించుమా, తాను మైలపడిపోతానేమోననే శంకతో, తొలగవి ఆమె గర్వానికి కోపగించి, చేతికఱ్ఱతో ఆమెను దండించాడు.

---

1. శబరి - 6'. 48
2. శబరి - 64. 57
3. శబరి - 64. 58
4. శబరి-64-60

జ్ఞానము గలిగిన నైనన్
ధ్యానము దా జేసిచేసి ధన్యుండైనన్
మానక యుండిన గోపము
గానరుగా శాంతి నెంత ఘనులున్ గూడన్" 1

కోపమువల్ల కలిగే అనర్థాలు అనేక విధాలుగా ప్రస్తావిస్తుంది ఈ ప్రదేశంలో రచయిత్రి, "మాలతి" కు మంచి బుద్ధి చెప్పాననని సంతోషిస్తూ సరస్సుకి చేరాడు బ్రాహ్మణుడు. సరోవర మంతయు పురుగులతో కులకుల లాడుచు 2 చీమునెత్తురులతో నిండియుండ చింతించి, ఎప్పుడో రాక్షసుడీ పని చేసియుండునని, రాఘవేంద్రుని ప్రార్థించి తరుణోపాయమును పొందగలమని మిత్రులగు బ్రాహ్మణులచే సమాలోచన చేయునేగాని, తానొనర్చిన దుష్కృత్యమును గూర్చి కించిన్మాత్రము ఆలోచించలేదు. ఇంతలో రామచంద్రుని ఆగమనవార్త మల్లెల పరిమళంలా వ్యాపించింది. వనమంతా కదలి, రామునికై బయలుదేరింది. తనకు ఎదురుపడ్డ మునులతో—

"............కనబడ్డవారితో, గనబడెనా భిల్ల
వనిత శబరియంచు బలుకువాని
దీనురాలామెదౌ దిక్కుగాంచిరె మీర
లంచు విచ్చేదివారి నడుగువాని
గండ్లు కాయలుగాయ గాంచుమన్నది నాదు
దారి నెల్లపుడటంచు దలచువాని" 3

శబరిని గురించి ప్రశ్నిస్తూ, ఆమెకై వెతుక్కుంటూ వస్తున్న కోదండపాణిని చూశారు మునివరులు. మాయింటికి రండంటే మా యింటికి రమ్మని దారికడ్డుపడి అభ్యర్థిస్తూ నీవులేక మేము నిలువలేమని ప్రార్థిస్తున్న మునులలో రాముడు –

"వేరుగా నెంచబోవక వినుడుమీరు
శబరియింటికి నిపుడేము చనగవలయు" 4

మీరుకూడ రండు" అంటూ వారి అభ్యర్థనను మృదువుగ త్రోసిపుచ్చి, వారిని తనతో వెంట నిడుకొని, బ్రాహ్మణుని కర్రదెబ్బలచే పీడించబడియు, రామనామ తన్మయతతో ముళ్ళు ఏరేమిషతో దొర్లుచున్న శబరిని చూచాడు రామభద్రుడు. కరుణరసావిష్టుడై తనకై తపించుచూ, కుయ్యోడుచున్న ఆ భక్తురాలి నాదుకొన

1. శబరి - 66.68
2. శబరి - 68.72
3. శబరి - 70.78
4. శబరి - 72.83

జరుగు ఆలస్యమును సహించలేనివాడై, "సిరికిన్ చెప్పడు" గజేంద్రప్రాణావనోత్సాహియైన శ్రీమహావిష్ణువై –

– సోదరా ! రమ్ము వేగమే చూడుమయ్య !
నేలపై దొర్లుచున్న దదేలనో గ
దయ్య, ? రక్తముగారెడు నయ్యా? తలను
కారణంబేమొ నీమది గాంచినావె"? 1

అంటూ పరుగెత్తి, రక్తముతో తడిసిన యామె తలను ఒడిలోనికి తీసుకొని, కృపారస దృక్కులంతో శబరిని వీక్షించినాడు; దీనజన పాలకుడైన శ్రీరామచంద్రుడు.

## భగవత్సాక్షాత్కారము

ఎదురుగానిల్చిన తన దైవాన్ని దర్శించలేక తన్మయావస్థలో పరతత్త్వాన్ని భజిస్తున్న శబరిని మేల్కొల్ప "మీరెంతయు భక్తితో సలుపుడిప్పుడు కేశవనామ కీర్తనం" బని మునులను ప్రార్థించాడు శ్రీరాముడు.

"రామా, రామా, రామా,
రామా, శ్రీరామ, రామ, రామా, రామా,
రామా, రామా, రామా,
రామా, శ్రీరామ. రామ, రామా, యనుమన్" 2

భక్తిరసం ఆ ప్రాంతంలో పొంగిపొర్లింది. రాఘవుని దివ్యగానం చెవులసోక కనులతెరచిన శబరి ఎదురుగానున్న రామచంద్రుని దర్శించి పులకించిపోయింది. పాదములపైబడి పరవశమైయున్న శబరిని లేవదీయుచు –

"ఆకలి తోదనుంటినిక నాగగలేకను వచ్చినాడ, నే
నీకడ కింతవేగముగ...........................
........పోదము రాగదవమ్మ ! యింటికిన్" 3

అంటూ ఆకలితో ఉన్నానని, ఆదరించమని మారాంచేసిన రాముని ఆశ్రమానికి తీసుకెళ్ళి, శిష్యవర్గము, మునులు ఆశ్చర్యంతో నిలబడిపోవగా –

---

1. శబరి - 74.94
2. శబరి - 76.8
3. శబరి - 78.13

"తెచ్చితి మంచిపండ్లనివి తియ్యనివే తినుమంచు, వెంటనే
యిచ్చెను రామచంద్రున కొకించుకయేమియు నెగ్గులేక, తా
మెచ్చుచు వానిదౌరుచిని, మేలనియెంచి భుజింపసాగె".

రాముడు."దోరపండ్ల దా నెంతయుపేక్క గోసి యొకయించుకవాచవిజూచివానిలోన్"2 "తియ్యనై నట్టి ఫలముల దెచ్చియుంచి"3 న శబరి వానిని రామునకు "ఎగ్గు" లేక అందరిముందు అందించింది. అహారమునకు మొగమువాచినటుల అర్థించిన ఆ రామ చంద్రుడు వాని రుచిని మెచ్చుకొనుచు తినసాగాడు. అందుకే —

"........... ........శబరి సత్కథ చెన్నగ నేరి శక్యమా"4 అని తాను చెప్పే కథలను సమర్థించుకొంటుంది రచయిత్రి. "ప్రేమభిక్షార్థియయిన మా రామ విభుడు భక్తులొసగెడి దేమియైన నెంతయో రుచ్యమనుచు నెంచునంట"5 అన్న పల్కులు శబరీ కల్పిత రచయిత్రివి. శబరి ఎంగిలి పండ్లను అందించుట యనునది అవాల్మీకమని, పద్మపురాణ, ఆశ్చర్య రామాయణాదులలో, జానపద గేయాలలో కన్పిస్తున్నదన్న విషయాన్ని ఇక్కడ గుర్తుచేసుకోవాలి! విశేషచర్చ ముందు చేయ బడుతుంది.

శబరి ఎంచి చూచి ఇచ్చిన ఫలాలను "ఒక్కడు తినినచో కాదు ధర్మమనెడు సూక్తిని పాటించెడి" ధర్మమూర్తియైన రాముడు ఆ ఫలాలను తమ్ముని సహాయంతో మునీశ్వరులందరికి పంచియిచ్చాడు. కాదు! కూడదు అనక ఆఫలాలను స్వీక రించారు మునులు.

"ముల్లోకంబులనేలు సామియె ఫలంబుల్ బంచి యీయంగ, నే
రొల్లంజాలరు? మందబుద్ధులొకో! యాయుర్వీసురేంద్రుల్ ధరన్"7

అన్న వక్కాణ రచయిత్రిది.

స్నానాద్యనుష్ఠానములకు వలయు సరసు నీటిని ఏమాయావియో పాడుచేశాడు. మాకేది గతి యని అరాటపడుచున్న మునులతో భిల్లవనితను వేడు

---

1. శబరి--79--20
2. శబరి-63--53
3. శబరి-63-54
4. శబరి
5. శబరి-79--20
6. శబరి-80 21
7. శబరి-80--22

కొవి, ఆమె స్పర్శచే వానిని పునీతం చేసుకోమన్నాడు రామచంద్రుడు. కోపోద్రిక్త మనస్కులైనారువృద్ధులు.

"శబరి యింటికి రప్పించె, చాలకంత
నామె ముట్టిన పండ్లను ప్రేమతోడ
నందఱకునిచ్చి తినిపించె నదియుచాల
నట్టులామెను బ్రతిమాలుడనుచు పలికె"1

కాని యువత వారిని సముదాయించి, రాముని మాటల వినునట్లు సమాధాన పరిచినట్లు రచయిత్రి భావన. లోకారాధ్యుడు, వైకుంఠనాథుడు అనికొనియాడిన రాముని పల్కుల్ని తిరస్కరించినట్లు వ్రాయడం రచయిత్రి కల్పన. ఆశ్చర్యరామాయణంలో రాముని ఆజ్ఞ పురస్కరించుకొని శబరి మహాత్మురాలని గ్రహించి ఆమెను ప్రార్థించి, ఆమె స్పర్శచేత సరస్సులోని నీటిని పూర్వమునకన్న నిర్మలంగా చేసుకొన్నారు మహామునులు 2 "యువత" పరికల్పన ఇచ్చట నూతనత్వం. మునీశ్వరుల చేత శబరీ ఫలాలను తినిపించిన భాగ్యంకూడ శ్రీమతి చిట్టెమ్మదే. అంతేకాదు-శ్రీరాముని చేతనే-భక్తి తత్త్వాన్ని గూర్చి, పతితోద్ధరణ గూర్చి,భిక్షలను గూర్చి, తీర్థయాత్రలను గూర్చి, విస్తారంగా మునులకు ఉపన్యాసం యిప్పించడం ఎంత సమన్వయింప యత్నించినా, అసంభవమేననిపిస్తోంది. తాదాత్మ్యంలోరచయిత్రి రాముని మానవునిగ భావించింది. ఆసమయంలో మాత్రం శబరి స్పర్శతో, కలుషమైన నీరు పరిశుభ్రమైనాయి.

## పరబ్రహ్మైక్యము

సంకరజాతి, నీచకులం, మెట్లమీద బిచ్చగాళ్ళు మొదలైన విషయాలతో విపరంగా తత్త్వాన్ని బోధించిన రాముని అనేక విధాలుగ కీర్తించింది శబరి. వామనావతారం వరకు గల ఆ మహావిష్ణువు మహిమల్ని కొనియాడింది. శ్రీరాముడు ఆమెకు నవవిధ భక్తిమార్గాలను వివరించాడు. మునుల వద్ద సెలవు తీసుకొని వెళ్లుటకు ఉపక్రమించుచున్న శ్రీరాముని పాదాలపైబడి ప్రార్థించింది.

"నల్లవాడ! నాదునుల్లంబులోనికి
మెల్లగాను వచ్చి యెల్లకాల

---

1. శబరి 80-39 2. ఆశ్చర్య-అరణ్య-55-55

ముల్లసిల్లుమయ్య............" 1 అంటూ ప్రార్థించదమేకాక
"వచ్చుచున్నాను దేవరా ! వచ్చుచుంటి
నీదువెంటనె, విస్వీడి విముసమైన
బ్రతుకజాలను రాఘవా! బ్రతుకజాల
నన్ను నీలోన జేర్చుకో నల్లనయ్య !" 2

అంటూ రామైక్యాన్ని అర్థించింది శబరి. అనుగ్రహించాడు శ్రీరామభద్రుడు. రాముని చరణాలపై దృష్టి నిలిపి, చిత్తరువుగా చలనరహితయై నిలుచుండ, ఆమె శరీరము నుండి "ఒక వెలుగు" రామునిలో ప్రవేశించింది. మునీశ్వరులు ఆశ్చర్యచకితులై లోకేశుని పలువిధాల కీర్తించారు. ఇందులో శబరి రామునిలో ఐక్యం చెందడం సైతం అవాల్మీకమే.

వివాహ ప్రస్తావన, మతంగ మహర్షి దర్శనము, ఎంగిలి ఫలాలనందించటం, ముళ్ళను తీసివేయుటకై నేలపై దొర్లటం, సరస్సునీరు మలినమవ్వటం, రామునిలో లీనమవ్వటం - కావ్యంలోని ప్రధాన పరివర్తనాలు. అయితే ఇవి ఆధారసహితాలే. పద్మపురాణ, ఆశ్చర్యరామాయణాలు ఇందుకు ఆధారాలు. నవవిధ భక్తిమార్గాలు రాముడు శబరికి బోధించటంలో తులసీరామాయణం ప్రభావం గోచరిస్తుంది.

మొత్తంమీద పద్యాలంతగా సుస్నిగ్ధం కాకపోయినా కవయిత్రి మొల్లకు శిష్యురాలుగా ప్రశంసింపదగినది.

## పెమ్మరాజు వారి శబరి

చిన్ననాటి నుండి ఆశ్రమంలో ఉంటూ మంచి పెద్దలను తోడై భక్తిమూర్తిగ ఎన్నో రీతుల మహర్షి ప్రశంసల నందుకొన్న భిల్ల వనిత శబరి. జీవితావసాన సమయంలో ఆమెకు తానేదో ఒకదారి చూపాలనే ఆశయంతో చెంతకు పిలిపించు కొన్నారు మతంగ మహర్షి - 'నాయనంతర మొక్కదాన వెట్టులుండగలవో' అనెడి

1. శబరి -88-31 2 శబరి - 99-34

పల్కులతో తనవేదనను అందిస్తారు మహర్షి. పెమ్మరాజు వారి కావ్యం 'శబరి'కి ఇది ప్రారంభ సన్నివేశం.

శ్రీమతి చిట్టెమ్మ కావ్యంలో వలె పూర్వచరిత్రలు, విస్తారతలు ఈ కావ్యంలో లేవు. ఆమె సేవలకు ప్రతిఫలంగ ఏమి ఇవ్వలేక పోయానని చింతిల్లుచున్న గురుదేవుల చూచి,....శబరి-

"ఏమియు నేర్పలేదనుచు నేల దిగుల్పడుచుంటిరయ్య! నా
కేమిటికోర్కె? చిత్తముద్రవించి దయల్ ప్రవహించినన్ను మీ
లో మిళితంబు చేసుకొని రూపము దీర్చితి రింత చాలదో?
తాము తపింపగా వలదు దాసులకేటికి వేఱె కోరికల్?" 1

అంటూ దాస్యభక్తిని చాటి, ఆత్మానుసంధానమేగాని, వేరు కోర్కెలు లేవను నిష్కామతత్త్వాన్ని ప్రదర్శిస్తే - ఆమెలోని అచంచల విశ్వాసానికి మరింత ఆనందించి -

"ఇందుకే! యిందుకేనమ్మ! ఈ యఖండ
మైన విశ్వాసమునకె, నా మానసమున
బేరుకొని పోయినది మమకార మింత;
నీ భవిష్యత్పథంబును దిద్దవలయు" 2

అనే దృఢవిశ్వాసంతో శాస్త్రములలోని భక్తిరసాన్ని విశ్లేషించి, హృదయ సంస్కారాన్ని గూర్చి, జగదీశ్వరుని దివ్యతత్త్వాన్ని గురించి భక్తిమార్గ పర్యవసాయిగ బోధ చేస్తాడు మహర్షి. సిద్ధాంత రాద్ధాంతాల మూలంగా ప్రయోజనంలేదని, భావ సంస్కారం చేత, మంచిచెడ్డలను ఏర్పరచి, ఋజుమార్గాన్ని దర్శింపజేయ గలిగింది రామనామమొక్కటేయని, మనకై ఆ రామయ్య భూమిపై జన్మించాడని ప్రబోధించారు మహాముని.

1. శబరి 17–9 2. శబరి – 17.11.

# ప్ర బో ధ ము

"రామునకంటె నన్యము పరాత్పరుడొక్కడులేడు, సర్వశో
భామయమైన ప్రాకృతిక భాగ్యముపండి యనంత దైవిక
శ్రీమిళితంబునై రఘువరేణ్యుని మూర్తియు శక్తియొప్పు, న
మ్మా! మటి రామనామ జపమంగళ గీతము లాలపింపుమా" 1

వేదావధులు సైతం అందుకోలేని అద్భుతమూర్తి, అయోధ్య పురవీధులలో శిశువై నటియించిన అందగాడు, నిరాశానిస్పృహలతో ఎండిన, హృదయ కేదారములలో శాంతి సౌభాగ్యాలను వర్షించ గలిగిన మేఘరాశి, బ్రతుకు ఎడారిలో లభించెడి మధురమైన సరస్సు,శరణాగతవత్సలుడు, వినిర్మల తేజుడు, విష్ణుమూర్తికి అపరరూపము నయిన రాముని ప్రార్థించి, ఇహలోకాన్ని తరించవలసినదని ఆవేశంలో, గంగా ప్రవాహ సమంగా కొనసాగిందీ కావ్యంలో మతంగుల ప్రబోధము. ఈ సమయంలో కవికనులముందు కోదండపాణి చిరునవ్వుతో ప్రత్యక్షమైనాడు. ఆవేశపుటేరులు పారి కవితాఝురులుగాలు పొర్లి ప్రవహించాయి. కవి భక్త్యావేశపు టూపిరులతో వెలసిన పద్యరత్నాలు అమూల్యాలు.

"యోగుల యందునన్ బరమయోగి, మహర్షులలో మహర్షియున్
భోగులయందునన్ బరమభోగి; యఖండ తపస్వి, సర్వ శా
స్త్రాగమవేద్యుడున్ రఘువరాన్వయ దివ్యమణి ప్రదీపమున్" 2

"రాముడెదిక్కు నీకు! రఘురాముడె నీకు విముక్తినిచ్చు, శ్రీ
రాముడె జన్మకర్మల పరంపరలన్ దెమలించు, జానకీ
రాముడె సర్వధర్మచయ రాజిత సాధు పవిత్రమూర్తి" 3

అంటూ ఆ శ్రీరామచంద్రుని ఎంత శ్రద్ధగ నీవు లక్షింపగలవో? అంత తొందరగ నీవు నరయగలవు" 4 అని తరుణోపాయాన్ని నిర్దేశిస్తారు.

"శబరి! దాశరథులు దయాశరధులమ్మ
రాముడిట వచ్చు — నీదు కోఱంత దీర్చు" 5

అంటూ ఆశీస్సులందించి పరలోకగతులయ్యారు గురుదేవులు. అక్కడ నుంచి రాముని కై శబరి నిరీక్షణ ప్రారంభమైంది. గురుదేవుని సేవలో తరించిన ఆమె మోక్ష ప్రాప్తికై ఎదురుచూస్తోంది.

---

1. శబరి — 22.1
2. శబరి — 25.13
3. శబరి — 25.15
4. శబరి 26 — 17.
5. శబరి 26 — 19.

# నిరీక్షణము

నీలమేఘశ్యాముని దివ్యకథాగానం వీనులకు విందు చేకూరుస్తుంది. రాముని పాదధూళి సోకి అహల్యగ మారిన విషయం విని, ఆ ఆరామమంతా రాళ్ళు నిలుపు దామనుకొని, ఆ మహనీయుని తాను పరీక్షించుటయా అంటూ ఆ ఆలోచన మాను కొని బేలయైన పాత్ర పెమ్మరాజువారి శబరి. కాటుక చీకటిలో శ్రీరాముడు రాలేక పోతాడేమోనని ఎత్తుగ స్తంభాన్ని పాతి అఖండదీపాన్ని వెలిగించింది. పర్వదినా లలో దేవాలయాల్లో వెలిగించు "కార్తీకదీపాలను స్ఫురింపచేస్తూ, అఖండదీపము" అనే పదంలో భక్తి తత్పరత వెల్లివిరుస్తోంది. రాముని త్రోవ వెలుగునట్లు దీపాన్ని వెలిగించి, దారుల్ని బాగుచేస్తూ. చేతితో ముళ్ళు లేకుండా ఒత్తిచూస్తూ, లేళ్ళకు రాముని రాకను గూర్చి చెప్పకుంటూ వేయికళ్ళతో ఎదురుచూస్తోంది.

రాముని వెంట వేలమంది రాక్షసులొస్తే-ఆయుధాలు ఏమైనా ఏర్పాటు చేయాలి. రావణుడు సీతను ఎత్తుకొని ఈ త్రోవలో వెళ్ళుతున్నట్లయితే ఏదో విధంగా భూమి మీదకు దింపాలి-వంటి రకరకాల ఊహలుచేస్తూ తన పిచ్చి ఆలో చనకు తానే నవ్వుకుంటుంది. రామునికై సంపాదించిన పండ్లు ఏరోజుకారోజు ప్రోవులై గుట్టలుగ పెరిగిపోతున్నాయి. కాలచక్రం వేగంగ తిరిగిపోతోంది. ముని మాపుల కాసెడి వెన్నెల సోన జాళ్ళలో సెలయేరుల నీటికోవలో, కపిలగోవుల పాలనురుగు పొంగుల్లో శ్రీరాముని చిరునవ్వులు భాసిస్తున్నాయి. సమస్త ప్రకృతిలో రాముడే కన్పిస్తున్నాడు. మల్లెకుసుమాలలో, మండుటెండలో తుదకు చీమలబారు సారులో సైతం రామచంద్రుడే కన్పిస్తున్నాడు. నిరీక్షణ పరాకోష్ఠకు చేరుకొంది. తుదకు రాముడు వస్తాడా అనే సందేహం మెండయ్యింది.

"గురువు చేయుమన్నాడు సంకోచము విడి
ఆమె నెఱపుచున్నది గాఢమైన దీక్ష
అంతె-అంతియేకాని పథాంతరముల
గొడవలేమియు నెఱుగని యడవిమనిషి" 1

అంటాడు కవి. నిజంగానే అడవిలోని మనిషి యామె. గురుదేవుల ఆదేశమునకు విశ్వాస స్థానం. రాముని పాదాంచెంత ప్రాణాలు వదలాలన్నది ఆమె కోరిక.

---

1. శబరి – 31 ప.

## రామలక్ష్మణులు

తన మూలంగ రామునికి కీర్తి వచ్చిందో, లేక రాముని వలన తనకు కీర్తి లభించిందో ఆలోచించకయే సౌందర్యధాముడైన రామునిపై సూర్యుడు, మండు టెండను కురిపిస్తుంటే, ఈతని వల్ల తన గారాబు బిడ్డ సీత కష్టాలపాలైందని కోపంతో భూమాత రాముని పాదాలు బొబ్బలెక్కేనట్లు మండుతుంటే, తన కోసం నిరీక్షిస్తున్న శబరిమాత కోసం, తమ్ముడయిన లక్ష్మణుడు మార్గంచూపు తుంటే, ఒక "లేడిపిల్ల" వల్లనే రామునికిన్ని బాధలు కలిగాయని జాలితో లేళ్ళ గుంపులు అనుసరిస్తుంటే–జానకీ వియోగదుఃఖ పరిపీడితుడైన రాముడు నెమ్మదిగా నడుస్తున్నాడు. "జానకీ విరహవేదన తప్పితే అన్నీ ఉన్నవాడు తాను కాగా అన్ని టిని వదలివేసి రాముడే గతియని చూచు పవిత్రాత్మ "మనస్విని" శబరి. అందుకే వెతుక్కుంటూ బయలుదేరాడు రామభద్రుడు.

పళ్ళకొరికి పారవేస్తున్న కోతుల్ని, చిలుకలు కొరికి విడిచిన మామిడి పండ్లను, గొఱ్ఱెగుంపులు తినగా మిగిలిన కొమ్మల్ని–ఎంగిలి యనెడి భావన లేక మరల స్వీకరిస్తున్న ఇతర జీవరాసుల్ని చూచి ఆశ్చర్యపోయిన లక్ష్మణుడు ఆ మాటలను పైకే అనేశాడు. "అన్యపక్ష్యమనెడి శంకయసలులేదు, ఎంత నిర్మల జీవులో యిచట, తిరుగు శరభ శార్దూలము లయిన జంతు వితతి" 1 చిరునవ్వు నవ్వాడు శ్రీరామచంద్రుడు. సృష్టిలో ఎంగిలి అనేదే లేదంటూ –

"పక్షి సంతతి వృక్షాల పండ్లుమెక్కి
విడచివేసిన యెంగిలి విత్తనములె
మొలచి యీ ఘోర కాంతార భూములయ్యె
అరయుమా ! లక్ష్మణా ! సృష్టి సరణియింతె" 2

"జలజల మర్మరధ్వనుల సాగెడి నీ సెలయేఱు: దీనిలో
జలములె ద్రావి జంతుపులు సల్పును జీవనయాత్ర, అట్టి యెం
గిలిజలమే భృశమ్ము బ్రతికించుచునున్నది మానవాళి...." 3

అంటూ "ఈ మనసే యన్నిటి కాదిమూలము" అనేస్తాడు. ముందు రాబోవు "శబరి విందు"లోని "ఎంగిలి"కి ముందుగా రంగాన్ని సిద్ధం చేసుకొంటున్న గడుసుదనం ఈ "గోపాలుని"ది. ఆహార రహితంగా అల్లుకొన్న అద్భుత కల్పనలుగా కవి పిస్తాయి. కానీ ఆకాశవాణి ద్వారా వినిపించే "గంగ ఉదకం దెచ్చి నీకు లింగపూజ సేతమంటే గంగలోని చేపపిల్ల ఎంగిలంటున్నాయి దేవ" అనే తత్త్వం శ్రుతికి తగులుతుంది. –

1. శబరి 36–10 2. శబరి 37-4 3. శబరి - 37-17

"మాపులు రేపులున్ శబరి మార్గ నిరీక్షణ జేయుచుండెడిన్ తాపము దీర్ప గావలయు" అంటూ తమ్ముణ్ణి తొందరజేసి, ముందడుగు వేస్తాడు గుణభద్రుడు రాముడు.

## అన్వేషణము

సతనోన్ముఖమయిన పర్ణశాలలో కట్టుకొన్న కాషాయవస్త్రం అగ్నిహోత్రాన్ని గుర్తు చేస్తుంటే - నెఱసిన వెంట్రుకలతో -

"అమల కాషాయ వస్త్రాచ్ఛాదిత శరీర
మగ్నిహోత్రిచ్ఛట ననుకరింప,
తలపైన జుట్టగా నిలిపిన వెంట్రుకల్
పరివేషమట్లు విభాంత్రి గొలుప
.... .... .... ....
.... .... .... .... ....
చకిత క్షణక్షణ ప్రకటితేక్షణములు
నిశితముల్ నల్కడల్ నిండిపోప" 1

కడిమివృక్షాల నడుమ, రాలిపోయిన పండుటాకుల మీద కర్రఊతగా నడుస్తున్న శబరి రామునకై వెతకుతోంది. ఆర్తితో పరమాత్మను అన్వేషిస్తోంది. నల్లనావికై వెదకిన గోపికయైంది.

"ఏతత్ప్రాంతములందు నెందయినగానీ వృక్షసంతానమా!
సీతారాముల జాడగాంచితిరె? లక్ష్మీమోహనాకారునిన్" 2

అంటూ వృక్షసంతానాలని, గిరికందరాలని, పంపా మలయమారుతాన్ని ప్రశ్నిస్తోంది శబరి. "సితను కొలువొతిననుచింతను భక్తుల విస్మరించెనో!" అని సందేహిస్తుంది. కాని దైవానికి ఆపదఏమిటి, దేనికొఱకో ఈనాటక మాడుతున్నాడుగానీ అంటూ తనకు తానే సముదాయించుకొని, గురుదేవులు అబద్ధమాడరు గదా అంటూ విశ్వసిస్తుంది.

ఇంతలో ప్రకృతిలో మార్పు వచ్చింది. ఆకాశంలో మేఘాలు కన్పట్టం లేదు గాని నెమళులు నృత్యాలు చేస్తున్నాయి. గాలి లేకపోయినా శ్యామములైన శీవ జొంపాలు తలలూగిస్తున్నాయి. రాముడు వచ్చే ఉంటాడు" 3

1. శబరి - 38. 2
2. శబరి - 40. 5
3. శబరి 41. 9

"రాముని దివ్యనీల రుచిరమ్ములె సుందర వారిదమ్ములై
స్వామి సుమిత్ర సూతి తనుసాంద్రకళారుచులే తటిత్తులై
ప్రేమను వారిభాషణములే కలితమ్ములు మేఘగర్జలై
ఆమని వర్షముల్ కురియునట్లుగ తోచె - నతండు రాముడే" 1

అంటూ నిర్ధారించుకొంటుంది. అద్భుతమైన పరికల్పన. కవి భావనాశక్తికి, శబరి ఆధ్యాత్మిక శక్తికి రూపుదాల్చిన అక్షరముల కూర్పులు రచయిత వ్రాసిన పద్యరాజాలు. 'ఆమనివర్షముల్' ఎంతలోతైన భావన.

"రామునికంటె! కోసల విరాజిలు కాంతులె శారదీయ పూ
ర్ణామల చంద్రికావిభములై, యనుజన్ముని కంటి వెల్గులే
శ్రీ మహితారుణారుణ మరీచి వితానములై, పవిత్ర, సం
ధ్యా మధుమాధురీ కలితమ్ములు తోచె - నతండు రాముడే" 2

రాముని ఆగమనాన్ని నిర్ధారించుకోవడానికి శబరి చూపించిన ఉపపత్తులు అద్భుత శోభావహాలై కావ్య జగత్తుకే క్రొత్త అందాలను తెచ్చిపెడుతున్నాయి.

"రఘుమహారాజునాది పరంపరాగ
తప్రశస్త మహోదార ధన్యయశము
రెండు భుజముల వ్రాలి యూరేగుచుండ
ఠీవిగా వచ్చు నతడేనా దేవమూర్తి" 3

ఠీవిగా వచ్చాడు రాముడు. ఆయనను ఏవిధంగా ఎదురొని సంభోషించి, సన్మానించాలోనని ఆ 'భిల్లవనిత' సందేహం,

"వందన మందునా? అతడు బాలుడె .... .... ....
.... .... .... చిరాయురస్తు నీకందున అంత గొప్పలు మహత్త్వములున్నవె నాకు" 4
అంటూ సందిగ్ధంలో తలమునకలవుతుండగానే రాముడు చెంగటకొచ్చేశాడు.

1. శబరి - 42. 10
2. శబరి - 42. 11
3. శబరి - 42. 13
4. శబరి 43. 14

## సమాగమము

వానకై ఎదురుచూసే చాతక పక్షి కోసం పూనుకొని ఆకాశంలో అలముకొన్న కారుమేఘాలు చిన్నచిన్న చినుకుల్ని వర్షించడం ప్రారంభించాయి. రామ శబరి సమాగమానంద వేళ దూరతీరాలలోనున్న చల్లగాలి పుణ్యరాసుల ప్రోవుల్ని ఆశ్రమప్రాంతంలో గుమ్మరించడం ప్రారంభించింది."1 ఈ వర్ణనలో "చాతకపక్షి" శబరియై ఆమె నిరీక్షణ యనెడి "మొగిళ్ళు" ఫలించి రాముని దయావృష్టి కురియబోతున్నట్లుగా వర్ణించడం కవి వర్ణనాశక్తికి, భావనా పటిమకు నికషాలు.

"రాముని దివ్యమంగళ విరాజితరూపము దగ్గఱింపగా
నామెది గుండెయెల్ల నదమై జడమై-ధృఢమై-విశాంత ని
ష్కామనమై-శరీర మవశమ్మయి వ్రాలగ జేతులెత్తి శ్రీ
రామ! నమో! నమో! యనుచు వ్రాలె పదంబుల భక్తిమూర్తియై"2

భక్తిమూర్తియై, అపస్మృతి గాత్రియై, రాముని చరణాలపై వాలిపోయింది శబరి. పూజ్యుల పట్ల తప్పితే నమస్కరించని లోకాధీశుడు రాముడు భక్తి ముందు తలవంచాడు. "అమ్మా" అంటూ సమీపించి, చేతుల్లోకి తీసుకున్నాడు శబరిని.

అతిథిసేవలు ప్రారంభించింది శబరి. పాదాలు కందుతాయేమోనని కాషాయ వస్త్రాన్ని నేలపరచి నడవమని ప్రార్థిస్తూ-

"పట్టు బండను దకిన పరిణామదియ?
ఎంత నొచ్చెనో?-నీకోస మెవతెయయ్య?
బండగా మాఱి యిట పడియుండెస్వామి!
పరమ సుకుమార మూర్తి నిన్ బాధపెట్ట!"3

అంటూ తన రామునికి గల్గిన బాధకు ఎంతగానో నొచ్చుకుంటుంది శబరి మనస్సు. అన్నకు సేవచేస్తున్న లక్ష్మణుని తప్పుకోమని-"పెద్దదానను నే నున్న పిదప కూడ చిన్నవాడవు మటల నీ సేవలేల?"4 అని రాముని సేవకు ఉపక్రమిస్తుంది శబరి. మోహనరూపుడైన రాముని చేరి ఆ మహనీయుని సౌందర్యాన్ని కన్నులతో త్రాగి, గుండెలనిండుగ నిలుపుకొన్న భాగ్యశాలి యీమె.

---

1. శబరి-43-15,16
2. శబరి-44-1
3. శబరి-45-6
4. శబరి-45-7

LIBRARY TIRUPATI 48635

"వాలిపోవుకనన్ రెప్పలన్ పైకితెరచి
చూపు తోడనె రఘుపతిం జుఱ్ఱునట్లు
తనివి తీరని చూడ్కులన్ దడవికొనుచు
నిలిచిపోయెను ముదుసలి-నిముస మట్లె"1

మొలత్రాడు వదులై పోయింది. బిగించుకొమ్మని హెచ్చరిస్తూ బడలికపోవునట్లు విశ్రమించ పలసిందని ప్రార్థిస్తుంది. కుశలప్రశ్నలతో శబరిని పల్కరించి, పాదముల నొత్తుటకు ఉపక్రమించునామెను, "తల్లులకు తల్లికాదగు దాన వీవు నీదు సాతిథ్యమే మాకు నించెముదము"2 అంటూ........ కాలాతీతమైంది పోయి విశ్రమించమన్నారు రామలక్ష్మణులు.

## విశ్రాంతి

బడలిక తీఱగ విశ్రమించారు రామలక్ష్మణులు. ఆదివరాహమూర్తి పవిత్ర దంష్ట్రిలమీద నిలిచిన విశాలమైన పృధ్వివలె ఆ భక్తురాలిచ్చిన మంచము మీద ముడుచుకుని పడుకొనినాడు జానకిజాని. విశ్రాంతి తీసుకొంటున్న అన్నదమ్ములిద్దరు శబరి గొప్పతనాన్ని గూర్చి ఆమె తపోదీక్షను గురించి సంభాషింపకొంటారు.

"ఎంతటి పూర్వపుణ్య ఫలమేచిన మానిని కాకయున్న, నీ
యంతటి స్వామి యేల వెదుకాడుచు వచ్చును కోరి కోరి;"3

అంటూ ఆశ్చర్యపోవడం లక్ష్మణుని వంతయ్యింది. "అత్యంతము భక్తి తత్పరత నహల్యనే చూచితి, నీమెజూచితిన్" అంటూ అహల్యా తపోమహిమ సరసన ఈమెను కూడ నిలబెట్టేస్తాడు లక్ష్మణుని మాటల్లో కవి.

## సంభాషణము

రాముని సేవకై పరితపించెడి ప్రాణులు కొన్ని కాగా రామునితో జీవిస్తూ రామునికై జీవించే జీవులు కొన్ని. రామచంద్రుని పరోక్షంలో ఆశ్రమంలో తటస్థ పడ్డారు శబరీ లక్ష్మణులు. రాముని వెంటే ఉంటూ ఆ మహనీయుని సేవాభాగ్యం పొందిన అదృష్టవంతుడని తదేకంగా చూస్తోంది శబరి లక్ష్మణుణ్ణి. ఈమెకోసం వెతుక్కుంటూ ప్రత్యేకంగా ఇంతదూరం వచ్చాడు రాముడు. ఈమె ఎంత తపశ్శాలినియో కదా! యని ఆలోచనామగ్నుడయ్యాడు లక్ష్మణుడు. చక్కని సమాగమము. ఒకే

1. శబరి-47-12.
2. శబరి-48-16
3. శబరి 51-5

వ్యక్తి సాన్నిధ్యానికై, ఒకే స్వామి చల్లనిచూపుకై ఆరాటపడుతున్న రెండు హృదయాల సంచలనం. చక్కగా ఊహించారు కవి. మంచి దృశ్యాన్ని నిర్మించారు. రాముని బాహువుల వలె విశాలంగా సాగిన చెట్లు కొమ్మల నీడలో చిరునవ్వు లొలికిస్తూ లక్ష్మణుడు-తదేకభక్త్యోచిత దీక్షలో శబరి తారసపడ్డారు.

"నాల్గు దిక్కుల జూచు చున్నాడతండు
ఒడలు కట్టపై మోపి చూచెడిని యామె,
ఇరువు రొకరినొకరు పల్కరించుకొనక
కడకు సస్మితాననుడు లక్ష్మణుడు పలికె" 1

ముందుగా లక్ష్మణుడే పలకరించారు ఆమెభక్తి మహాత్మ్యాన్ని "వేనోళ్ళ" కొనియాడాడు. తుదకు –

"చలన మెఱుగని భక్తియే చాలుగాని
తనువులెంతటి దూరమో? మనసులంత
దగ్గరగనుండి యొండొంటి తారసిలును" 2

మనుషులు దూరమైన కొలది మనసులు దగ్గరౌతాయి. నేనెంత వేడినా అనుసరించడానికి అంగీకరించని రాముడు సీతై నీవు పిలవకపోయినా వెతక్కుంటూ వచ్చాడు. నీవెంత భాగ్యశాలివో-నీవు వియోగ యోగినివి" 3 అంటూ ఆమె గొప్పతనాన్ని పలువిధాలుగా కొనియాడుతుంటే శబరి మాత్రం తన తాదాత్మ్యంలో తానుండిపోయింది. "నీవేమంటున్నావో నాకు తెలియడంలేదు రామచంద్రుడే నాప్రాణ రక్షకుండు" అంటుంది.

"నాకనుల నేనే నమ్మకున్నాను స్వామి
రాములధివసించినది దర్భాసనంబు?
అరయగా శబరి హృదయాసనంబ?" 4

అంటూ పరవశించిపోతుంది.

నీళ్ళ బావి వద్ద నీళ్ళు తోడుకుంటున్న రాముణ్ణి చూచి,
"తండ్రి ! సగభాగమైన సీతమ్మలేని
కడమ యర్థమే యింతటి కాంతులీన
రెండు నొకటిగ నున్న భరింపగలమె?" 5

అంటూ ఆశ్చర్యపోతుంది శబరి. సీతాస్మరణ మాత్రానే రాముని కళ్ళల్లో నీళ్ళు

1. శబరి 53-2
2. శబరి 54-4
3. శబరి 54-6
4. శబరి-55.11
5. శబరి – 57,18

రాయి. ఉలిక్కిపడింది శబరి. చీరచెఱగుతో స్వామి కన్నీరు తుడిచిన భాగ్యశాలి అయింది పెమ్మరాజు వారి శబరి.

"తుడుచుకొనుమయ్య నా తండ్రి! తుడుచుకొనుము
తుడుచుకొనకున్న లోకాలె ముడుచు కొనును" 1

అంటూనే శబరి......."చీరచెరగున స్వామి కన్నీరు తుడిచె" 2

రాముని దుఃఖం చూచి లక్ష్మణుని కళ్ళలో నీళ్ళు నిండాయి. వారివి చూచి శబరి హృదయం కరిగింది.

"స్పందనంబున్న హృదయమే వలయుగావి
ఆర్ద్రతలులేవి హృదయ మెవ్వరికివలయు?
ఎంత మృదులమ్ము తండ్రి ! నీ హృదయసుమము" 3

ఆర్ద్రతలేనివారిని ఎవరు అభ్యర్థిస్తారు. అవమానపడతారు. "చిక్కని వెన్నెల కాంతి కాంత, సంపత్తులు మేళవించిన సుమంగళధాముడైన" రాముని తప్ప అన్యులను ఎందుకు ప్రార్థిస్తారు? అంటూ రామభక్తి ప్రాశస్త్యాని, వెంగడిస్తుంది.

అనుభూతితో ఉద్గమించిన కవిత్వం పెమ్మరాజు వారిదని మరొక్కపర్యాయం ఈ సమయంలో బుజువౌతోంది. రామభక్తి నిర్మగ్నమానసులు కాబట్టే ప్రస్తుతము ఈ కవి "జ్ఞానానందాశ్రమం" స్థాపించుకొని రామధ్యానానందామృతులుగా శోభిస్తున్నారు.

## నివేదన

కడుపు నిమిరి అన్నముపెట్టెడి కన్నతల్లి ప్రేమను దురిపించి, "వెన్నుకంటు కొనిపోయెను నీకడుపేమి కర్మరా?" అంటూ వేళకు తిండిలేక, అడవులబట్టి తిరుగుచు ఆలి వియోగాన్ని అనుభవిస్తున్న జలధరశ్యామునికి ఆప్యాయతగ దరిచేరి ఫలాల్ని అందించింది శబరి.

"అనుమానంబది లేదులే తమకు రామయ్యా ! వనంబేగి కో
సిన పండ్లన్ మునిపంటనొక్కి పులుపున్ చేదున్ పరీక్షించి తీ
యనివాటిన్ గొనితెచ్చి యిచ్చితిని, మీకాబాధయేలేదు చ
ల్లని తండ్రి! దయనారగింపగదవే ! ప్రాల్మాలికల్ మానియున్" 4

తాను "రుచిచూచి ఎంచి తీసుకొచ్చాను. నీవు ఏరుకోనవసరంలేదు. స్వీకరించవలసింది" అంటూ ఆత్మతృప్తితో ఆరగింపజేసింది: "అనగనగా నొక అబ్బాయి కలడంట, అతనికంటెను ఘనుడాతని సోదరుడు" అంటూ గోరుముద్దలుగా అందించింది రమ్యఫలాల్ని.

---

1. శబరి - 58.12 2. శబరి 3. శబరి - 59.

తల్లితో బంగారు పళ్ళెంలో తిన్న గోరుముద్దలు గుర్తుకొచ్చాయి. "ముగురమ్మల ప్రేమల మేళవించి యీబోయెతలో ప్రవేశము బొందె నటంచు దలంచు" అంటూ రాముడు శబరిలో తన ముగ్గురు తల్లులమూర్తుల్ని చూచుకొని మురిసిపోయాడు.

## ఆత్మార్పణము

రామచంద్రులకు ఫలాలు అందిస్తుండగానే శబరి ఏదో అనిర్వచనీయానుభూతికి లోనయ్యింది. శరీరం తేలికైపోతున్నట్లు, పూర్వజన్మకృత పాపాలన్నీ బూడిదై పోతున్నట్లు అనుభూతి పొందింది. ఏదో నూతన శక్తి మహావేగంతో శరీరంలో ప్రవేశిస్తోంది. తెలియని ఉత్సాహం ఎదలో చోటుచేసుకొంటోంది.

"అదెవై కుంఠము – వారెవో నివరులా యానంద ధామంబులో
వదె సీతమ్మ – సుమిత్రసూతియదుగో ........ అంతటన్ నీవే" 1

అంటూ తాదాత్మ్యంలో మునిగిపోయింది. రాముని కన్నుదోయి నుండి వెలువడిన కాంతిరేఖలు "శబరి విశుష్క-జీర్ణశరీరం" నుండి నిర్గమించిన తేజస్సులో విలీనమైనాయి. ఆకాంతిచ్ఛటాచ్ఛటలు శ్రీరామునిలో కలసిపోయాయి.

"ఒకటిగ కలసిన అమ్మహోజ్జ్వల శిఖ
శ్రీ రఘూత్తమునందె విలీనమయ్యె" 2

రామునిలో కలసిపోయింది శబరి. చేతనాశూన్యమైన శబరి దేహాన్ని పట్టుకొని నిలబెట్టాడు సౌమిత్రి. ముద్దగా అయిపోయింది శబరి.

"శబరి కన్నీరె వరదలై జాలువారి
క్రమముగా దేహమంతయు కఱిగిజారి
పలపలల ఘుర్ఘుర విజయ ధ్వనులతోడ
కనులయెదుటనె మెల్లగా కదలిపోయె" 3

ఆ ప్రవాహమే శబరి. పవిత్రగోదావరి మహాప్రవాహినిలో విలీనమైన జలమయ్యింది. 'అమృతమస్తు' అని తొలిసారి ఆ పవిత్రజలాలతో ఆచమించి, నీటితో కనులు తుడుచుకున్నాడు శ్రీరాముడు.

1. శబరి - 69. 7
2. శబరి - 70. 10
3. శబరి - 71. 11

శబరి జీవచైతన్యాన్ని రాములిలో ఐక్యం చేయించి, ప్రాణాధారమ ఏరుగా మార్చడం ఈ కావ్యంలోని ప్రత్యేకత. ఈ మార్పుకి ఆధారం ఆశ్చర్యరామాయణం.

"స్నానపానోపయుక్తం తే నరస్త్వేతదితః పరమ
ప్రవాహరూపం సంప్రాప్య త్వన్నామ్నా ప్రథితం భవేత్
కించ గోదానది యుక్తా త్వన్నామ్నా ప్రథితాచసా" 1

అన్న ఆశ్చర్యరామాయణోక్తి కవికి మార్గదర్శకం. అగ్నిహోత్ర ప్రస్తావన ఈ కావ్యంలో లేదు. ఎంగిలి ఫలాలు తినిపించడమేకాకుండా పక్షి సంతతి విడిచివేసిన విత్తనాలే అరణ్యాలైనాయని, ఎంగిలి జలమే మానవాళిని జీవింపచేస్తోందనే సిద్ధాం తాన్ని నూతనంగా ప్రస్తావిస్తాడు కవి. రాముని గూర్చి భక్తి అన్ని కావ్యాలలోను, కవులలోను అత్యధికంగా గోచరించడం అతి సహజగుణం.

పద్యాలలో ఒదిగిపోయి పండించిన భావ సౌందర్యం బంగారానికి తావి అబ్బి నట్టయింది. అందమైన పదాల అల్లిక భావాలకు అనుగుణంగా అల్లుకొని, రసోత్పా దనకు అవకాశం కల్గించి పాఠకుల హృదయాలలో ఆనందాన్ని వర్షింపచేస్తుంది. రాముని ఆగమనాన్ని శబరి ఊహించిన సమయంలోని పద్యాలు అత్యంత రామణీయ కాలు. రామదర్శన సమయంలోని ఆర్తికవి హృదయంలోని రామభక్తికి అక్షర దర్పణం. భక్త్యావేశం కవిత్వావేశంతో పెనవేసుకొని మధుర భావాలు పండించింది. 'భావాల తరకుమీగడలు తరచి మధురభావాలతో మలచి, మధించి, నవనీతం చూపిం చాడు" 2 అన్న ఊటుకూరి సత్యనారాయణరావుగారి మాటలు అక్షరసత్యాలు. 'తీయని మనస్సు అనుభూతి తపస్సు' కవిలో మిళితమై అందరాని అనుభూతుల్ని అతని హృదయంలో నిలిపి శబరి కావ్యంగా ఆవిర్భవింపచేసిందనటంలో అతి శయోక్తిలేదు. అందుకే ఈ కావ్యం 'తెలుగయ్యలకు అత్యంత ఆదరణీయం" 3

## చురింగంటి వారి శబరి సపర్య

రామచంద్రుడు లక్ష్మణునితో గూడి మతంగముని ఆశ్రమం వైపు అడుగులు వేయడంతో వీరి కావ్యం 'శబరీ సపర్య' ప్రారంభమౌతోంది. "అదియానేమొ

1. ఆశ్చర్యరామాయణం - అరణ్య 2. 3. తోచినమాట - ఊటుకూరి

మతంగ మౌనివరు పర్ణాగార మూహింపగన్" అంటూ లక్ష్మణునికి ఆశ్రమాన్ని చూపిస్తున్న రామునకు పవిత్ర కేశయైన వృద్ధాంగన కన్పించింది.

"పలితశిరోజముల్ ముఖముపై బడితూగ................

................జననిన్ గనుగొమ్మదె! ఎవ్వరో కదా!" 1

అంటాడు రామచంద్రుడు. సీతావియోగభర దుఃఖితుడైన రామునకు లక్ష్మణునిచే మార్గనిర్దేశం చేయిస్తూ శబరీ ఆశ్రమంలోకి ప్రవేశపెట్టడం ఇతః పూర్వం కవులు చేసిన మార్పు సహజ సుందరమై తత్కాల రామస్థితికి ఉచితముగా ఉన్నది. కాని ఆచార్యులవారు రామునిచేతనే మతంగుని ఆశ్రమవర్ణన చేయించి, అందులో కన్పించిన వృద్ధాంగనను సైతం "ఎవ్వరో కదా!" అంటూ ప్రశ్నింపచేయడం ఔచిత్య దూరంగా ఉంది. కబంధుని ఆదేశంతో రామలక్ష్మణులు మతంగాశ్రమానికి బయలు దేరినదే శబరిని కలిసికోవడానికి. కాని ఆచార్యులువారు ప్రారంభపు ఎత్తుగడలో క్రొత్తదనాన్ని చూపాలని ప్రయత్నించటం రమ్య దూరం. వాల్మీకంలో రామ లక్ష్మణులు ఇరువురిని చూసిన శబరియేముందుగా శాస్త్రోక్తమర్యాదలను ఆచరిస్తుంది. అనంతరం రాముడు కుశలప్రశ్నాదికం ప్రారంభిస్తాడు.

ఆశ్రమాన్ని సమీపిస్తున్న ధనుర్ధాలను శబరి చూచింది. ఎవరో అన్నదమ్ముల వలె నున్నారనుకొంది. వెంటనే గుర్తు కొచ్చింది గురుదేవుల మాట. పులకించి పోయిందిశబరి. శబరికి ఎదురుగ రామలక్ష్మణులు నడుస్తున్నారు. వారి కెదురుగ శబరి అడుగులు వేస్తోంది.

"హర్షపులకిత స్ఫార సర్వాంగ కముల
ననుపమంబ పూర్వానంద మంది శబరి
పరువు పరువున నెదురేగి పరమభక్తి
దాశరథి దివ్యపాద పద్మముల వ్రాలె!" 3

'పరమభక్తి'తో రాముని పాదాలమీద వ్రాలిపోయింది శబరి. నీకొరకై అరణ్యములో జపించి, తపించిపోయాను అంటూ చేతులు జోడించింది.

---

1. శబరి - 2.6
2. అరణ్య 74-24.
3. శబరి - 3.11

"దర్శనం పరభక్తి స్స్యాత్ పరిజ్ఞానంతు సంగమమ్
పునర్విశ్లేష భీరుత్వం పరమాభక్తి రుచ్యతే" 1

సాక్షాత్కారం 'పరభక్తి' అయితే వియోగం కలుగుతుందేమోననే భయం 'పరమ భక్తి' అని చెప్పబడుతోంది. "నాబ్రతుకెల్ల నీశుభముహూర్త ప్రాప్తికై వేచితిన్" అంటూ హర్షస్ఫారడెందంతో (చక్కని వైరి సమాసం- శబరీముఖం కాబట్టి సమర్థించవచ్చు) ఆహ్వానించింది. రామపద స్పర్శతో అణువణువు పులకించిన వనం ఆనందాంబోధిఅయింది. ఆప్యాయతతో ఆతిథ్యాన్నిఅందించింది "సరసస్వాద్యంబులౌ పక్వ భోజ్యామోదార్హ ఫలాళి నీ కొరకు దీక్షా కాంక్షతో దాచితిన్" అంటూ పండిన ఫలాల్ని ఎంచి సమర్పించింది.

"ఏమిచేమిటో నీ కమరింప వలయు
నంచు నేనెంత కాలమూహించినాను
తీర నీవు విచ్చేయ నదేమొ – నాదు
బుద్ధి బుగ్గిగానెది తలంపునకురాదు" 2

ఏమిచేయాలో తెలియని తొట్రుపాటు శబరిలో కన్పిస్తుంది. ఎంత కాలంగానో ఎదురు చూసిన స్వామి రాకవలన కలిగిన ఆనందంవల్ల సంభవించిన తొట్రుపాటది.

"ఎంగిలి ఫలమ్ముల నొసగెనేమొ శబరి
కాన, గైకొన్న నియమభంగంబు గలుగు"3 అంటూ లక్ష్మణుడు అన్నఆప్యాయంగా అందించిన ఫలాలను భక్షించడానికి సందేహించాడు. తమ్ముని ద్వంద్వ భావాన్ని గమనించి, "జనసిదత్త ఫలోపముంబులని విశ్వాసంబుతో నందవే!" అంటూ హెచ్చరించాడు రాముడు. అన్నమాటను "సిగపువ్వు"గ స్వీకరించి ఫలాలు పేవించాడు సౌమిత్రి.

ఆచార్యుల వారు సైతం రామునకు "ఎంగిలి ఫలములేమొ" అని సందేహంగా "ఎంగిలిపండ్ల"ను రామునకు అందించారు. "పరమేశ్వరార్పణమటంచు" 4 స్వీకరించాడు రామభద్రుడు. అరమోడ్పుకనులతో రాముని వీక్షిస్తూ, రామగానాన్ని ఆలపిస్తున్న శబరికి జానకి గుర్తుకొచ్చింది.

"విచ్చటడించినీ వరుగుదెంచితి విచ్చట; కామెలేక నీ
వెచ్చటకేగుదోయి కమలేక్షణ! కూరిమి ధర్మపత్నితో
ముచ్చటగాను వచ్చెదని మూయని కన్నులుగాయునట్లుగా
విచ్చటవేచియుంటిని; తదీప్సిత మీవిధి విల్పె స్వప్నమై!" 5

---

3. శబరీసపర్య – 8.17
1. మందరము – అరణ్యకాండ - 668 పు. 4. శబరీసపర్య - 8.30
2. శబరి సపర్య – 6.19 5. శబరీ సపర్య - 11 39

పాదములు కందునని, రాక్షసులబాధలు తాళలేదని మహర్షుల ఆశ్రమాల్లో ఉంటి వచ్చావా? అంటూ ప్రశ్నిస్తుంది వీరి శబరి. మాధవపెద్దివారు "సీతను" కూడ కలిపి దర్శింపజేస్తే శ్రీమతి చిట్టెమ్మ, పెమ్మరాజువారలు ఆమె దర్శనం చేసుకోలేక పోయి నందుకు చింతించి, ఆ దుష్టరాక్షసుని నిందిస్తారు. రాముని ఓదార్చుతారు. కాని ఆచార్యులవారి శబరి పూర్తి అమాయకంగా సీత జాడను ప్రశ్నిస్తుంది. "నేను ప్రత్యేకము చెప్ప నేల? గ్రహియింతువిదే గతమిపె సర్వమున్"1 అన్నాడు రాముడు. రాముని పల్కులు శబరికి దివ్యదృష్టిని కల్గించాయి. గతమంతా కనులముందు కన్పించింది. ఈ అవకాశం చేసుకొని రచయిత "రామకథను" క్లుప్తంగా గానం చేశారు.

సర్వము దర్శించి, తన యదృష్టానికి పులకించిపోయింది శబరి. మహా యోగులకు సైతం సాధ్యంకాని దివ్యదర్శనాన్ని ఒనకిచ్చినందుకు ఎంతగానో రామ చంద్రుని కొనియాడింది. "ఇకనైన మోక్షలక్ష్మీ రుచిరానుభూతి కలిగింపుము" అంటూ ప్రార్థిస్తుంది. "అన్యథా శరణంనాస్తి" అంటూ పాదాలపై ఒరిగి పోయిన శబరిని ప్రేమతో లేవనెత్తి-

"మ, న్మాతృ మమత్వ మాధురుల మైమరపించిన నీదుచిత్తపున్
రీతులు-లోతులెల్ల శబరీ! గ్రహియించితినమ్మసర్వమున్"2

అభయమిచ్చారు భగవంతుడు. ఆమె మనస్సులో సంతోష సముద్రం పొర్లిపోయింది. ఆర్తురాలి ఆత్మలో స్వర్గలోకం ప్రత్యక్షమైంది. జానకీపతి మృదుస్పర్శతో పులకించి పోయిన శబరి-సుగ్రీవ స్నేహం నుండి పట్టాభిషేకము వరకు జరగబోవు వృత్తాన్ని ప్రస్తావించి త్వరలో మంచిరోజులు వస్తాయంటూ రాముని సంతోషపరుస్తుంది ఈ ఆచార్యులవారి శబరి. సీతాపహరణ వృత్తాన్తమే తెలియని ఈమె భవిష్యత్కథ నంతను ప్రస్తావించడం విచిత్రమేకాని రామదర్శన, స్పర్శలవల్ల అది సంభవమని సర్దుకోవచ్చు.

"వేదనాజర్ఝరితమైన విశ్వమందు
భక్తి చైతన్య సందీప్తి పదిలపరుప
నీవు "శబరీనదీరూప మిరవుకొనగ
వరలుమా చిరకీర్తిని తరతరమ్ము"3

నదిగా మారి కీర్తిని పొందవలసిందని ఆశీర్వదిస్తూ, వాత్సల్యంతో ఒక పర్యాయం ఆమెను స్పృశిస్తాడు రాముడు. దివ్యాలంకారాలతో అప్సరసయై దేవతా విమానా న్నధి రోహించింది శబరి. అదే సమయంలో ఒక ఏరుభూమిపై చిత్రగతులతో ప్రవహించింది.

1. శబరీ సపర్య-13.45 3. శబరీ సపర్య-40.145.
2. శబరీ సపర్య-33.118.

"దివ్యాభరణ సంయుక్తా దివ్యమాలాన్యానులేపనా
దివ్యాంబర ధరా తత్ర బభూవ ప్రియదర్శనా" 1

అన్న వాల్మీకి వచస్సు కవికి శిరోధార్యమైంది. దివ్యాంబరధారిణియైన ఆ అప్సరసను దేవతా విమానాన్ని అధిష్ఠింపచేశారు.

గోదావరి పావనోదారవాః పూరముల ద్రావిన కవులే ఎక్కువగా "శబరి" నామక కావ్యాలు వ్రాసినట్లు కన్పిస్తోంది. వీరిలో పెమ్మరాజు వారి మార్గంలోనే ఆచార్యులవారు సైతం "శబరి"కి నదీ రూపాన్ని కలిగించారు. "యోగాగ్ని" ప్రస్తావన ఈ కావ్యంలో కూడలేదు. "మతంగ మహర్షి" వృత్తాన్తం ప్రత్యేకంగా లేదు గావిప్రస్తావన కన్పిస్తుంది. ఇంతవరకుజరిగిన రామకధప్రస్తావనవల్ల కావ్యము నిడివి యైంది. ఇదియొక నూత్నకల్పన. సీతా ప్రస్తావనతో ఈ అవకాశం కవి సముచితంగా వినియోగించుకొని ధన్యులైనారు. "ఎంగిలిపళ్ళ"నే శబరి అందిస్తుంది. శబరి నదిగాను, దివ్యాంగనగాను రెండురూపాలను పొందడం ఈకావ్య ప్రత్యేకత.

"శబరీసపర్య"లో కవితాశిల్పోద్దీపకములైన కొన్ని మార్పులు-కథాకథన సమక్రియా రూపకముల కొన్ని కూర్పులు చేర్పవలసివచ్చినది" 2 అంటూ రచయితయే కావ్య ప్రారంభములో చెప్పుకున్నారు. వానిలో ప్రధానమైనది శ్రీరామాయణగాథాపునస్సమాలోకనము అని ఆచార్యుల వారి అభిభాషణ-స్వతస్సిద్ధముగనే సంప్రదాయ వాదిగ భక్తవరుల కుటుంబములో జన్మించిన ఆచార్యుల వారు "భాగవతులు"గ లబ్ధ ప్రతిష్ఠులు. భక్త్యావేశస్ఫోరకంగా పద్యాన్ని నిర్మించడం వీరి ప్రత్యేకకళ. సీతాకళ్యాణాన్ని వర్ణిస్తూ -

"హరకోదండ విఖండనోదిత మహత్ జ్యాఘోష విన్పింపగా
మొరసెన్ నిర్జరదుందుభుల్; విరసె సమ్మోదార్ద్ర కల్పప్రసూ
త్కర మాలావిసర ప్రఘాత రసవద్వైశిష్ట్య మానంద సుం
దర మందార పరీమళాల పులకింతల్ గ్రమ్మె సీతాసతిన్" 3

ఇటువంటివి కోకొల్లలు. "సపర్య" అనడంలోనే వైష్ణవ ప్రపత్తి ధ్వనిస్తుంది.

1. అరణ్య - 74.345.
2. శబరీ - సపర్య—4.
3. శబరీ సపర్య - 16.58

## మేకావారి భక్త శబరి

రామనామ స్మరణతో గురువుల ఆదేశం మేరకు ఆశ్రమాన్ని ఆశ్రయించు కొని ఉండి శ్రీరామునకై ఎదురుచూస్తోంది శబరి. కాని ఆరోజు ఎందుకో మనసు అత్యుత్సాహాన్ని పొందుతోంది.

"ఏదో ఉత్సాహ మెదవిండె నీ ఉదయము

ఎన్ని పూవులు కోసెనో! తృప్తి గనదు" 1

ఆకాశం శ్యామలవర్ణోద్దీప్తం. ఏదో క్రొత్తశక్త్యుత్సాహాలు శరీరంలో ప్రవేశించాయి. కట్టె ఊత లేకుండానే వేగంగా బయలుదేరింది. చూపు సారించింది. సంభ్రమాశ్చర్యస్వాంత అయింది.

"మెల్లన వచ్చుచున్న అల మేఘవినీల సుగాత్రుగాంచి, నం

వుల్ల ముఖారవిందయయి పూజలు పండిన సంతసంబునన్

ఉల్లము హర్ష మోదముల నుప్పతిలన్" శబరీమతల్లి, "నా

చల్లని స్వామివచ్చె", నని స్వాంతము నందున విశ్వయించియున్" 2

దయగొని వచ్చితివే దాశరధీ! అంటూ ఆతిధ్యాన్ని సమర్పించింది మేకావారి శబరి. పళ్ళెరంలో పాదాలుంచి, కడిగి ఆ నీటిని నెత్తిన చల్లుకొంది.

"అట్టులాయమ్మ పాదము లాదరమున

కడుగుచుండుట గాంచిన కౌసలేయు

మానసంబున స్ఫురియించె మాతృమూర్తి

..................................

తనదు దేహము కడుగుచు తనియునట్టి

తల్లి కౌసల్య ప్రేమమ్ము తలపువచ్చి" 3

రామనేత్రాలు అశ్రుపూరితాలైనాయి. శబరిలో కౌసల్యను దర్శించాడు రామచంద్రుడు. భగవంతుని ఆత్మీయత అటువంటిది. పూసెజ్జ ఏర్పరచిన శరీరం కందు నేమోయని పుష్పాది పేకరించి పాన్పు తయూరు చేసింది భగవంతుని కొఱకు మేకావారి శబరి. మాతృత్వ మమకారం అటువంటిది.

---

1. భక్త శబరి - 4.
2. భక్త శబరి - 6.
3. భక్త శబరి - 13.

మధుర ఫలాలెంచి, తీసుకొనివచ్చి అర్పించింది. పండు తినబోతూ దానిపై నున్న మచ్చని చూస్తున్న రామునివద్ద నుండి ఆ ఫలాన్ని తీసుకొని, "పటుక్కున కొరికి "ఇది వద్దు" అంటూ ప్రక్కన పారవేసింది. ఏరి మరో పండు తీసి కొరికి చూచి ఇది తీసుకో–మంచి మధురంగా వుంది" అంటూ అందించింది. 1

రాముని ముందే లక్ష్మణుడు చూస్తుండగానే "పటుక్కున" కొరికి రాముని కర్పించింది ఫలాన్ని శబరి. - లక్ష్మణుని ముఖకవళికల వలన తన తప్పును గ్రహించి క్షమింప ప్రార్థిస్తుంది. "మా తల్లి స్థానంలో మాకు ప్రేమతో ఇలా తినిపించావు" 2 అని ఆనంద బాష్పాల వర్షించాడు రాముడు.

"భావమునందునన్ అహముబాయనివారలు మౌనులైన, ఆ
శ్రోవను బోవనెంచ నతిదూరము నాకును వారి కీర్తికిన్
సేవలు జేయు దీక్షనిట జీవిత మిమ్మగ గడ్పుచున్న, ఓ
పావని ! విస్మమించు నిజభక్తులు నా స్థలులేరు నా కిలన్!" 3

అంటూ అనుగ్రహించాడు రామభద్రుడు. రామునసుజ్ఞ బడసి అగ్నిలో ప్రవేశించి, దివ్యతేజాన్ని పొంది "గురుని దివ్యసీమ"ను చేరింది శబరి.

పద్యగద్యాత్మకంగా కొనసాగిన రచన యిది. ఆధార సహిత కావ్యమిది. అగ్ని ప్రవేశం మూలానుసరణం. "ఎంగిలి ఫలాలు" ఇతర రామాయణ ప్రభావాలు, పద్య నిర్మాణంలో కవి ఉత్పలమాలికల్ని, గీతమాలికల్ని రచించడం భావ స్పష్టీకరణలో, పదబంధ నిర్మాణాలలో ఇంకా పరిపక్వత పొందలేదేమోనని పిస్తోంది.

"ఒకేధార. సంధులు ప్రయోగములు కొన్నిటిని మించి కూడ పయనించినాడు కథా స్రవంతికివి అడ్డురావన్నాడు. అంతయేమిటి? పద్యమరందధార చాలక, గద్యలో చక్కని సరళ భాషలో శ్రీరాముని శబరి సంభాషణలు సాగించాడు. ఇచట పద్యం కంటే గద్యం హృద్యంగా జాలువారింది" 4 అన్న శ్రీ గురజాడ రాఘవశర్మగారి, "కవితాలోకంలో సుధాకరరావుగారు ఉదయమాన దశలోనే ఉన్నారు. ఇతడు ప్రౌఢ కవితామార్గానికి చేరువలోనే వున్నట్టు స్పష్టమౌతోంది" 5 అన్న సి.నా.రే. పల్కులు గమనిస్తే ఈ సహృదయ విమర్శ కవికి మార్గదర్శకం.

1. భక్తశబరి-15-1
2. " 16–1
3. " 17–2
4. భక్తశబరి-ii–1
5. స్రవంతి–69 జూన్

## గుదిమెళ్ళ రామానుజాచార్య 'శబరి'

పంపాతీరంలో దూరంగా కనిపిస్తున్నసుందర దివ్య విగ్రహాలు ఎవరా? అవి తర్కించుకోవడంతో కవి కావ్యానికి శ్రీకారం చుడతాడు.

"శంపాకారుడు శ్యామసుందరుడు సాక్షాద్దేవతామూర్తుల
ట్లింపుల్ గుల్కుచునున్నవారు-భళిరా! యేమా!! తనూశోభలా
గుంపుల్ గట్టిన ధూళి ధూసర జటాకూటంబులా బాహంపుల్" 1

వారి తను శోభకు ఆశ్చర్యపోయి, ధూళిధూసరిత జటాకూటాలకు విభ్రాంతిపోయి, మూపున వ్రేలాడుచున్న ధనస్సు మొలలోని చిఱుకత్తి చూడగ రాజకుమారులనే నిర్ణయానికి పాఠకుల్ని తీసుకురావటం గుదిమెళ్ళవారి సహజసిద్ధ రచనాశిల్పం.

## 1. సాక్షాత్కారము

మునులను సైతం మోహపెట్టే తనూ విలాసంతో మౌనివేషధారులై, కను లలో కాంతి మగవారిని సైతం లోభపరచునట్లుండ ఇటు విచ్చేయుచున్న ఈ వీరు లెవ్వరో నేను కూడ వీరిని అనుసరించి కలరూపెఱుంగుదునని కవి కూడ ఆ మహ నీయుల వెంట కావ్యంలో బయఽదేరాడు.

................ ...యీ ముఖపు పోలిక లెచ్చటో చూచియుంటి-నెం
దైనది జ్ఞప్తిరాదు-హృదయంబున నున్నవి పూర్వవాసనల్" 2

గుర్తుచేసుకోవడానికి ఎంతగానో ప్రయత్నించి తుదకు-"వచ్చెను జ్ఞప్తికి............ వారలె రామలక్ష్మణుల్" 3 అనటం ఆచార్యులవారి విషయంలో ఆశ్చర్యజనకం.

"ఎప్పుడో చిత్రకూటంలో వుండగానే చూశాను క్షేమంగా వున్నావా" అంటూ ఆత్మబంధువుగ వారి సేవా సమాచారాలు ప్రశ్నిస్తాడు. బాగా చిక్కిపోయావు. "చక్కని వస్తువు చిక్కిపోయినన్ హాయిగనుండు — నీవిధపు నందము లెవ్వరి కుండు?" 4 అంటూ పుంసాంమోహనుడైన రాఘవుని కొనియాడి భరతుని విలా పాన్ని గుర్తుచేసి, బొత్తిగా నలిగిపోయావంటూ, కబంధ వధా సందర్భంగ ఏర్ప డిన గాయాల నుండి జాలువారుతున్న రక్తాన్ని చూసి ఎంతగానో పరితపిస్తాడు కవి. ఇది తన ఆరాధ్యదైవమైన రామునిపట్ల భక్త కవికిగల సహజామరక్తి.

1. శబరి-18.1
2. శబరి-20.3
3. శబరి-20.4
4. శబరి-21.2

"నా కదియేమో! బోసిగ గనంబడుచుంటివి హేతువేమి?"

అని శ్రీ విరహిత రాముడిలో ఏదో "లేనితనం" గమనించి -

"మఱచితి నిన్ను నేనడుగ............లక్ష్మణా!" అంటూ "వదినగారికి నీ కెదియేవి మాట పై హృదయము మారెనా?" 1 అంటూ కదలక నిలబడి కన్నీరు నింపుతున్న లక్ష్మణున్ని తిరిగి ప్రశ్నించడం, కవి సంభాషా చాతురిని చాటుతుంది.

## 2. పంపాసీమ

ఇంద్రనీలమణి కాంతులు కుప్పలు పోసినట్లున్న రాముని శరీరకాంతులు పంపా సరస్సులో ప్రతిఫలించి నల్లకలువల భ్రాంతిని కల్గిస్తుంటే శబర్యాశ్రమ ప్రవేశము చేశారు రామలక్ష్మణులు.

"అదిగో! బోయెత-యెదురుగ
గుదురుగ గూర్చుండి పండు కొరుకుచు నోటన్
బెదవులు కదలించుచు..............." 2

—రుచి చూచిన పండ్లు రామున కందించింది. దండక నుండి రావడం వలన పుండుగ వాచిపోయిన రాముని పాదాల్ని చూచి వెతచెందింది శబరి.

"..... .... .... .... .... .... .... .... చూదని
మ్ముందుమ–యెంత బాధ పడుచుంటివిరా యని పైట చెంగు నో
ర్నిందుగనూది నోటిసెగ నింపుచు వెచ్చనికాపు పెట్టుచున్" 3

అనేక విధాలుగ బాధోపశమనానికి సేవలు చేసింది కరుణార్ద్రహృదయంతో—

"కన్నుల కద్దుకొంచు, బిగికౌగిలి గూర్చుచు, రొమ్ముకద్దుచున్,
సన్నుతి సేయుచున్, బ్రణుతి సల్పుచు" 4 పులకించిన గుండెతో రామునికి బోయకులానికి గల అవినాభావ సంబంధాన్ని ఏకరువు పెట్టుతుంది.

"నాయన! నీ పవిత్ర చరణంబులు దాకేడు గౌరవంబు మా
బోయల వంగడంబునకె ముఖ్యముగా గల – దల్లనాడు గం
గాయతకూలమందు గుహు డంటిన పాదము లివ్వి" 5

---

1. శబరి–23.2
2. శబరి – 24.4
3. శబరి – 25.3
4. శబరి–25.4
5. శబరి – 25.5

అంటూ బోయకులానికి, రామకథకుగల అంతస్సూత్రతను కదిలించిన మేధావిని ఆచార్యులవారి శబరి.

"నీకును మాకు, మాకథకు నీకథ, కున్న దనాదినుండి యీ
లోకు రెఱుంగరాని యతిలోక మహత్తరబంధ మేదొ ! - వా
ల్మీకి యొకండె తానెఱుగు" 1 అనడమే కాకుండా అసలు రఘువంశ ప్రతి
ష్ఠకు కారణభూతులమే మేము అనేస్థాయికి పెరిగిపోతుందీ శబరి.

"....................మేము గదా భవదన్వయ ప్రతి
ష్ఠైక నిదానభూతులము స్వామి! రవంతగ బొఱజూతుమా!" 1

అంటూ వాల్మీకి గూడ బోయవాడు. అందువల్లనే రామకథ ప్రచరితమౌతోంది అన్న భావన శబరి గొంతులో పల్కించిన గడుసరి ఈ కవి.

"ఏ విరిసిన కల్వపూలు కనిపించిన నీవను నాసమౌచెదన్" 2 అన్న ఆర్తి శబరిది.

వచ్చేశాడు రాముడు. నిరీక్షణ ఫలించింది. మెరుపుతీగ మేఘము కలిసిన రీతిలో సీత నీవు కలిసి వస్తావనుకొన్నాను కాని నాకాయదృష్టం లేదు. అంటూ వ్యధ చెందుతుంది ఈమె. అంతేకాదు అసలు సీత లేక నీవు లేవు "అయోనిజ క్షణ మావలనుండిన నీ స్వరూపమే వమ్మయి పోయినట్లు కనుపట్టును" 3 అనేస్తుంది వైష్ణవ మత సంప్రదాయాలను జీర్ణించుకొన్న ఆచార్యుల వారి శబరి.

"సీతారాములు", "జానకీ రాములు" అంటూ సీత పేరు ముందు ఎందుకుం చారో తెలుసా? ఆ రహస్యమెప్పుడైనా ఆలోచించావా? అంటూ ఆ జానకీనాధునే ప్రశ్నించి, "చెప్పకూడ దిటువంటి రహస్యము లెంతవారికిన్" అంటూ అతిరహ స్యంగ అసలు రహస్యం బయట పెడుతుంది.

"సీత, తనంత తానెడమచే నవలీలగనెత్తు కార్ముకం
బాతరి నీవులేచి కుడిహస్తముతో నది యెత్తగల్గితీ
చేతుల జంటలో నెడమచేతితో నెత్తుట గొప్పగాన, వి
ఖ్యాతిని గూర్చినారు జనకాత్మజకే ఋషులెల్ల రాఘవా" 4

---

1. శబరి - 26.2
2. శబరి–27.5
3. "శ్రీశ్రీశయోస్తు సమ్పన్దశ్చంద్ర చంద్రికయోరివ" వైఖానస భగవచ్ఛాస్త్రం
4. శబరి–31.2

అన్న చమత్కారం అత్యంతరమణీయం. "అల్పాక్షరంపూర్వం" అన్న వ్యాకరణ మర్యాదల్ని ప్రక్కన పెడితే ఈ భావన అతిరమ్యంగా సీతాధిక్యాన్ని సమర్థిస్తుంది. పదునాలుగువేలమంది రాక్షసుల్ని దండకలో ఒక్కడుగ నిలిచిగెలిచిన శ్రీరాముడు-శ్రీ విరహితుడగుటతో ఒక రాక్షసుడైన రావణుని సంహరించడానికే వానర సహాయం తీసుకొన్నాడంటే "శ్రీ"లోని మహాత్మ్యం వేరుగ ప్రస్తావించనక్కరలేదని పిస్తుంది.

ఇంతకాలం రాముడు రాకపోవడంతో తన మనః పరివేదన అంతులేనిది. "ప్రేమగలట్టి వస్తు వగుపింపకపోయిన నెంత బాధరా, స్వామి! రఘూత్తమా! యనుభవజ్ఞుడవు" 1 అన్న శబరి పల్కుల్లో సీతా వియోగ వ్యధను గుండెల్లో దాచుకున్న రాముని వ్యధ, వెంటనే స్ఫురింపజేస్తుంది.

## ఉచ్ఛిష్టము

"…. …. …. …. రాఘవ యారగింపు మీ పండును—విన్న గోసుకొని వచ్చితి-నే రుచి జూచినాను" 2 అంటూ తీయని పండ్లను రుచిచూచి అందించింది శబరి. సీతయో దగ్గరలేదు. ఉన్న తమ్ముడికేమో ఆకలిదప్పులుండవు. ఇక విన్ను మాచేవాళ్ళెవరు అంటూ బాధపడుతుంది.

> "…. …. …. గాలితో బ్రతుకు నాకలిబాధ నతండెఱుంగునా!" 3
> …. …. …. …. …. …. …. …. …. …. …. …. ఏ
> పుట్టకో! చెట్టుకో తిరిగి ప్రొద్దులు పుచ్చుచు విన్ను దాబగన్
> బట్టిన వాడువోలె నెడబాయడురా !" 4

వంటి మాటల్లో లక్ష్మణుని శేషత్వాన్ని ధ్వనింప చేస్తుంది ఆచార్యులవారి శబరి. చోటు మారినా బుద్ధిమారని మన స్తత్వం లక్ష్మణునిది అని కూడా అంటుంది.

రుచి చూచిన పండును రాముని చేతిలో పెట్టింది. ఆనందంతో ఆరగించ బోయాడు రఘురాముడు. చేయి పట్టుకొని ఆపి ఎంగిలి అంటూ అభ్యంతరం చెప్పాడు లక్ష్మణుడు. చిరునవ్వే రాముని సమాధానమైంది.

> "ఎంగిలి పండుగా దలచితే యిది లక్ష్మణ! యెంతమాట! ముం
> గొంగున మూటగట్టెదవు కోపము నెప్పుడు-స్వీయ ధన్యుడవ్
> సంగతియే యెఱుంగ పికజాలును-మా భరతుండు వచ్చినన్
> దొంగగ బట్టుకొంటి విది దోషముగా గమనింపకుందువే" 5

---

1. శబరి - 32.5
2. శబరి - 34.1
3-4. శబరి - 34.2
5. శబరి - 34.3

అనేస్తాడు రాముడు. తొందరపాటు స్వభావాన్ని గర్హిస్తాడు. "శబరీ శుకీగళిత మీ ఫలమందుట, యెంతవారికో!" 1 అని ఆమె ఔత్కృష్ట్యాన్ని కొనియాడి—

"... ... ... ... ... ... ... ... నీ
కొఱకిది తెచ్చినాననుచు, గూరిమితో జెయిబెట్టెనేని సం
బరమున స్వీకరింతును-ప్రపన్నుల కెంగిలియేమి? లక్ష్మణా!" 2
"యొరులమాట కేమి? యుచ్ఛిష్టమనుమాట
నా మతంబునందు నాకు లేదు" 3

"నా మతమున నాకులేదు" అనుమాట వైష్ణవ మతానుయాయులై జియ్యరువారి శిష్యులగు కవిపరులది. రామానుజుని అనుజ్ఞలో జాతి విచక్షణ లేదు. పంచముద్రల పొందిన ప్రతి ఒక్కరు విష్ణు భక్తులే.

"జాతినిబట్టి చూడ కపచారమగున్, శబరీ చరిత్రలో
జాతికులాలు నిల్చుటకు స్థానములేదు - ప్రపన్నురాలి నీ
గోతిని దింపబోకు" 4 అంటూ లక్ష్మణుని హెచ్చరించడమే కాకుండా, పెద్దల సేవించి వివిధ విశేష శాస్త్రముల నాలకించి, బ్రహ్మచర్య దీక్షనొందిన మహాత్మురాలు శబరి నాకు "ఎంగిలి పండ్ల"ను ఎలా ఇవ్వగలదు. అంటూ ఇచ్చిన పండ్లు "ఎంగిలి"వి కావని విశ్లేషిస్తూ —

"అర్థమెఱుంగ నీ విషయమంతయు వైష్ణవ సంప్రదాయ ది
వ్యార్థము, నాకు, మా శబరికారయ నెంగిలిలేని మాట, ము
ఖ్యార్థము-బాధ దీనికగునప్పుడు లక్ష్మణ చేయుచుంద్రు శా
స్త్రార్థము సేయబూనుకొను నయ్యలు" 5 —

అంటూ వైష్ణవమత సంప్రదాయంలో "ఎంగిలి" లేని ప్రస్తావన తీసుకొచ్చి పద్మ పురాణాంతర్గతంగ చెప్పబడిన పాదభేదాల్ని అన్వయించుకొని ఈ పద్య నిర్మాణం చేశారు ఆచార్యులవారు "జాతిని పట్టిచూడ" అనే పద్యం —

పుంస్త్వే స్త్రీత్వే విశేషోవా జాతినామాశ్రమాదయః
నాకారణం మద్భజనే భక్తి రేవహి కారణమ్!" 6

అన్న అధ్యాత్మ రామాయణానికి విశ్లేషణ. జనవాదంలో ప్రాచుర్యంగా ఉన్న "ఎంగిలి విందు" విషయాన్ని ప్రథమంగా ప్రస్తావించి, పండిత కవిగ వివిధ

1. శబరి — 35.5 2. శబరి - 36.3 3. శబరి - 36.1
4. శబరి — 37.1 5. శబరి - 39.2 6. అధ్యాత్మ-అరణ్య—10.10

గ్రంధాంతరములందున్న ముఖ్యార్థ శాస్త్రార్థాల విశ్లేషణను గుర్తు తెచ్చుకొని-"అట్టి మహాత్మురాలు, నా, యొద్దకు దెచ్చి యేపగిది నుంచును-యెంగిలి పండ్లు లక్ష్మణా!" అనేస్తారు కవి. ఇది కవి వాక్కు. రామునినోట పలికింది. ఈ విషయం పద్మపురాణంలో—ఈ విధంగా ఉంది.

"ప్రత్యుద్గమ్య ప్రణమ్యాథ నివేశ్యకుశవిష్టరే
పాదప్రక్షాళనం కృత్వా తత్తోయం పావనాశనమ్
.... .... .... .... .... .... .... ....
ఫలానిచ సుపక్వాని మూలాని మధురాణిచ
స్వయమాసాద్య మాధుర్యం పరీక్ష్య పరిభక్ష్యచ
పశ్చాన్నివేదయామాస రాఘవాభ్యాం దృఢవ్రతా" 1

వాల్మీకమునందు "ఎందు" ప్రస్తావనే లేదు.

"మయాతు వివిధం వన్యం సంచితం పురుషర్షభే
తవార్థే పురుష వ్యాఘ్ర పంపాయా స్తీరసంభవమ్" 2

అని మాత్రం వ్రాయబడింది. దీన్ని వ్యాఖ్యానిస్తూ వన్యశబ్దేన ఫలమూలాదిక ముచ్యతే....సంకుచితమిత్యనేన రామస్య చిత్రకూటాగపునాత్ ప్రభృతి సంపాదిత్వం ఆదరేణగు ప్తత్వంచ, తత్తత్ఫల జాతీయ మాధుర్యం పరీక్ష్య స్థాపితమితి సంప్రదాయః" అని గోవిందరాజాచార్య వ్యాఖ్యానించారు. పద్మపురాణ ప్రసక్తిని మహేశ్వరతీర్థులు స్పృశించి వదిలివేశారు. 3

పద్మపురాణభాగంలో "పరీక్ష్య, పరిభక్ష్యంచ పశ్చాన్నివేదయామాస" అని ఉన్న భాగాన్ని ఆశ్రయించి శబరి తీపిని పరీక్షించి, భక్షించి అనంతరం రాఘవుని కందించిందన్న అర్థం స్పష్టమౌతోంది. కాని శ్రీవాసుదాసుగారి మందరంలో ఈ విషయాన్ని చర్చిస్తూ ప్రస్తుత ముద్రిత పద్మపురాణంలో ఈ భాగం లేదని క్రొత్త పాఠము నిచ్చియున్నారు.

".... .... .... .... ....
అర్చయామాస భక్త్యా వై హర్ష నిర్భరతేజసా
ఫలానిచ సువక్వాని మూలాని మధురాణిచ
నివేదయామాస తదా రాఘవాభ్యాం ధృఢవ్రతా"4

అనే భాగాలనిచ్చి ఆ వాదాన్ని తిరస్కరించారు. కాని పై పాఠాన్నే శ్రీ మహేశ్వర తీర్థులు ఉటంకించిన విషయం మరువరానిది. కాని ప్రసిద్ధ పాఠం "పరీక్ష్య, పరిభక్ష్య"

1. పద్మపురాణం - ఉత్తరఖండం
2. వాల్మీకం - చతుర్వ్యాఖ్య- పు. 1276
3. వాల్మీకం- చతుర్వ్యాఖ్య - పు. 1276.
4. మందరము - పు. 691.

అనువదియే. అయితే ఇందులో కూడా శబరి తానుతినిన పండునే రామునకర్పించిన ట్లన్న విషయం స్పష్టంగాలేదు. ఒక్కొక్క జాతికి ఒక్కొక్క ఫలం వంతున భక్షించి, పరీక్షించి ఆ వృక్షపు లేక ఆ జాతి సంబంధ ఫలమూలాలను రామునకర్పించి ఉండుననుట సరియైన వాదము. "బాధ దీనికగునప్పుడు లక్షణపేయాచంద్రు శాస్త్రార్థము సేయ బూనుకొను నయ్యలు" అన్న ఆచార్యులవారి మాటలలోని లక్ష ణార్థమిదియే.

"భక్షించి" అనుటకు టాకావేసి కొంచెం గిల్లి నోటవేసుకొనినట్లు ఎంచవల యుననేగాని వేరుకాదు" 1 అంటారు శ్రీ వాసుదాసు.

ఈ వాదాన్ని స్వీకరించినా ఒక్కొక్క జాతి ఫలమూలములందు ఒక్కొక్క జాతి ఫలమూలాల్ని తాను తిని మిగిలిన భాగాల్ని భగవానుడైన శ్రీరామునకిచ్చిన మొదల అది మాత్రము ఉచ్ఛిష్టముకాదా? అనేది సందేహం. దైవానికి చేసిన పదా ర్థాలు దేవునికి నివేదించకుండా తినడం పాపమే.

శ్రీరాముని ప్రియః పతిగ నెంచి, ఆయన రాకకోసం ఎదురుచూస్తూ జీవిత కాలాన్ని పొడిగించుకొంటున్న మహాతపస్విని శబరి. అట్టి మహానుభావునకు తాను అర్పించే విందులో మాధుర్యం కొఱవడితే ఓర్వలేక, అపచార దోషభయం చేత భక్త్యతిశయంచేత శబరి ప్రవర్తనలో ఆ మార్పు వచ్చియుండవచ్చు. వృద్ధ, జ్ఞాన వైరాగ్య సంపన్న, గురు శుశ్రూషా, ధర్మపరాయణ అయిన శబరిలో అట్టి తదాత్మ్యం సాధారణ విషయంగానే కన్పిస్తోంది. ఎందువలననగా—భక్తుల్లో అది సాధారణమే గనుక. విదురువింటికి విందుకు విచ్చేసిన శ్రీ మహావిష్ణురూపుడైన శ్రీకృష్ణునకు విదురుని భార్య భక్త్యతిశయం చేత అరటిపండ్లు ఒలిచి చెక్కలను కృష్ణునకిచ్చి కాయలు పారవేయుమంత మందస్మిత వదనార విందుడై జగన్నాథుడు వానిని స్వీకరించినాడు. ఇట్టి ముగ్ధ భక్తుల కథలు పలు ప్రచురితమైనాయి. శబరి ఎంగిలి విందు సైతం జానపదుల ప్రభావంగా భావించవచ్చు.

అందువల్లనే ఆచార్యులవారు "సంప్రదాయ, ముఖ్య, లక్షణార్థాలు" అంటూ వాదనలను రాముని ద్వారా పలికించి సందేహ నివృత్తి చేశారు. నీ సేవ వలన తృప్తి పొందాను. ఆకలి బాధలు, ఆత్మవ్యధలు కూడ నీ సేవల వలన మరచి పోయాను అంటూ "మా యింటిదె లేకపోయె శబరీ! వినుచూచుట కేమి సేయుదున్" అని అంటూ శబరికి "తన యింటిదానిని" చూపలేకపోయినందుకు బాధపడతాడు ఆచార్యులవారి రామచంద్రుడు. శూర్పణఖావృత్తాన్తం తదనంతర పరిణామాలు రాముడే శబరికి విప్పిస్తాడు.

---

1. సుందరము - పు. 691.

ఈ సమయంలో సైతం ఆచార్యులవారు శ్రీరాముని పాత్రను నిశితంగా విశ్లేషించి భళీ అనిపిస్తారు. ఇది మూలాతిరిక్తమైన నూతన కల్పనేకాక, ఇతర కవులు ఎవ్వరూ అందుకోలేని మధుర భావన.

"అనలది చుప్పనాతి–విషయ స్పృహతో దిరుగాడుచున్న పెన్
బనరము–దానితో నెపుడు నవ్వవివాదను చేతులార నీ
వినయము మ్రింగినా ననుభవింతును-లక్ష్మణుడైన ముందుగా
గనరెనె? తెచ్చినా మొకరికన్నను నొక్కర మిద్ది కొంపకున్" 1

శ్రీరాముడు చేసిన మొదటి పొరపాటు అది. దాన్ని సరిచేసుకోవడానికి రామాయణం సరిపోయింది. ధర్మజుడు చేసిన ఒక్క పొరపాటుతో భారతం నిర్మించబడినట్లు–శూర్పణఖ పరాభవం రామకథాగమనానికి ప్రధానాధారం. జూదంలో భార్యనుపణంగా పెట్టి రెండవ పర్యాయం ఆడకపోతే-కురుక్షేత్రం లేదు. భారతం లేదు. పర్ణశాలకు వచ్చిన కాముకి రాక్షసి శూర్పణఖను భార్య ప్రక్కనుండగానే రాముడు లక్ష్మణుని చెంతకు లక్ష్మణుడు రాముని చెంతకు పంపుటవంటి రెచ్చగొట్టు పనులు చేసి అవమాన పరచని యెడల రావణవధ, అగ్నిప్రవేశం అనంతరం సీతా పరిత్యాగం, వాల్మీకాశ్రమ వృత్తాంతాలు వుండేవేకావు. మరొకరీతిగ జరిగేవంటారా! అది ఊహాతీతం.

ఈ పై పద్యంలోనూ భావాలు తెలుగువారి మానసిక పరిణతికి దర్పణాలు. "చుప్పనాతి శూర్పణఖ" అనేది తెలుగువారి నుడికారపు తిట్టు అది పద్యంలో అల్లుకొంది. విషయ వాంఛలతో పశుపుగా సంచరిస్తున్న దాన్ని ఎప్పుడు ఎవరితోను హేళనగా మాట్లాడని గుణాభిరాముడు రాముడు అందునా ఆడదాన్ని విషయ స్పృహతోనున్నదాన్ని చూచి, కవ్వించిన రీతిలో మాట్లాడాడు. అదే కొంపకు తీసుకొచ్చింది. "పాడు నిశాటి నన్నొకటి పట్టి పిశాచము రీతి మొన్న" 2 అన్న పదంలో పశ్చాత్తాపము, వేదన బరువుగా ధ్వనిస్తాయి. "చేతులార, నీ, కీడును నేను గాదె కలిగించితి సీతకు జూచుచుండగన్" 3 అన్న వేదన కడవరకు పీడించింది. ఇది ధీమాణ్యుడు రాముడు చేసిన ఒకే ఒక్క పొరపాటు. ఇక్కడ మానవ మాత్రుడుగా రాముడు సంచరించాడు. ఇది వాల్మీకి ఆశయామకూలమే. ప్రస్తుత పాశ్చాత్య భావనకిది సమీచీనం. ఎంత గొప్ప వ్యక్తిలోనైనా చిన్నమెత్తు దోషం వుండక తప్పదంటారు పాశ్చాత్యులు.

1. శబరి –40.2 2-3. శబరి – 40.1

ప్రక్కన భార్య ఉన్నదన్న విషయం కూడ మర్చిపోయి, రాక్షసితో సరసా లాడాను ఇంకెక్కడి సీత "నాకెక్కడ దక్కునమ్మ-సిరి" అన్న రాముని పలుకులు ఎంతో బరువైనవి. "చుప్పనాతితో చిక్కులుగాక నా కనలు సీతయె దక్కకపోయె నక్కటా" 1

"అట్టి విశాటితోడ బరిహాసములాడుటగాదె కొంప వో
గొట్టితి జూచుచుండ-మది గుందుచునుంటి దివానిశంబు, నీ
గుట్టు, పరుండెవండు వినగూడదు, నేననరాదు, నీవు కా
బట్టి మనః ప్రశాంతికలు పాతరలాడుచు విన్నవించితిన్" 2

ఈ రహస్యం రామునికి సంబంధించినది కాబట్టే రాముడే చెప్పుతున్నాడు ఆత్మీయు రాలయిన శబరితో. "సీత పోవడంతో గోటికి సాధ్యమైన పని గొడ్డలికిప్పుడు సాధ్యమయ్యె" 3 అంటూ అయిన వారి వద్ద మనస్సు విప్పుకొని వేదనను వెళ్ళ గ్రక్కొని స్వాస్థుడయ్యాడు రాముడు.

సీతా విరహవేదనా దోదూయమాన మనస్కుడైన, రాముని నేదదీర్చి, కర్తవ్యోన్ముఖునిగ చేయడానికే "శబరి" పాత్ర వాల్మీకిచే కల్పించబడిందని భావించే కవి వరేణ్యుడు మాత్రమే ఇటువంటి రచన చేయగలడు. విరాగా నిస్పృహలతో మునిగిపోయి, సీతకై విలపించుచున్న రాముని ఓదార్చి తత్త్వనిరూపణ చేసి, కర్త వ్యోన్ముఖుని చేసింది శబరి.

## యోగాగ్ని

రాఘవుని కన్నుల జాలువారుచున్న భాష్పబిందువుల్ని వణుకుతున్న చేతు లతో తుడిచి, ఓదార్చి, "శూర్పణఖ చేసిన తప్పేమిటి?" అని ప్రశ్నిస్తుంది శబరి. నీ భువనమోహన సౌందర్యాన్ని చూచి కొంచెంగా హద్దుమీరిందేమో నంటుంది. "నీ, యొద్ద నిరీహులే ప్రణయముంచి తపించెరు మచ్చుమందెదో కద్దట, కాకయున్న మమకారము నీపయిగల్గ నేర్చునే?" 4 అంటూ నిలదీస్తుంది రాముణ్ణి. ఎక్కడో మూలల్లో దాగియున్న రాక్షసుల్ని బయటకు లాగి బలిపశువుల్ని చేసి నీ ముందు నిలిపింది ఆమెయేగదా? అంటుంది.

"శూర్పణఖా విశాటి నిను జూచిన కాల విశేషమేమొ? నీ
నేర్పును, భుజామహిమ"..........................5

ఆమె వలనే రాక్షస సంహారం, అందువల్ల రామావతార ప్రయోజనం, సిద్ధిస్తాయని, లోక కళ్యాణకారకుడవుతావని అంటుంది. ఇంతచేసిన శూర్పణఖను మరుజన్మలో

---

1. శబరి -40-3 2 శబరి - 40-4 3. శబరి - 40-5
4. శబరి - 41. 2 5. శబరి - 45.1

నయినా ముచ్చట తీర్చవయ్యా" అంటూ ప్రార్థిస్తుంది శబరి. ఈ సకల విషయాలు "గురుదేవుల" సేవ వలన తెలుకోగలిగానంటూ "గురువుల సేవలోని" ఉన్న తత్వాన్ని ఒక పర్యాయం గుర్తుచేస్తుంది. శబరి జ్ఞాన సంపన్న. గురుశుశ్రూషవల్ల మోక్షప్రాప్తి కలుగుతుందన్న సత్యానికి శబరీ చరిత్ర ప్రథమోదాహరణము.

"యస్యదేవే పరాభక్తి ర్యధా దేవే తథా గురౌ"

— శ్వేతాశ్వేతరోపనిషత్తు.

గురుదేవుల్ని పరమభక్తితో గొల్చినది కావుననే విదురాదులు పొందిన ఊర్ధ్వలోకాలను "స్త్రీ"యై ఉండి, హీనకులజాతగ నైతము పొందగలిగింది. అందువల్లనే శబరీ మోక్షప్రాప్తి ఘట్టంలో "స్వేనతేజసా" అనే దళాన్ని వాల్మీకి వాడారు. రాముని కొఱకు శబరి ఎదురు చూసింది. రామదర్శనం అయిన తరువాత "తన ప్రభావం" చేతనే ఉన్నత లోకాలను పొందగలిగింది అని ఇక్కడ భావన. భగవద్దర్శనంతో ఆ ప్రభావం ఇంకా పెరిగింది. శబరి ధృఢమైన కోరిక, వినిర్మలభక్తి రాముని వెతుక్కుంటూ శబరి చెంతకు తీసుకొచ్చాయి. శబరిని చేరిన రాముడు నూత్నశక్తితో ఋష్యమూకం వైపు ప్రయాణం ప్రారంభించాడు. అది మతంగాశ్రమ ప్రభావమే. తల్లిగ సేదదీర్చి గురువుగ కర్తవ్యోపదేశం చేసింది ఆచార్యులవారి శబరి.

అప్పుడు గాని సీతా వియోగం చేత కృశించిన శ్రీరాముని చేతికి రామాంకితమైన అంగుళీయకం కన్పడలేదు శబరికి. ఆశ్చర్యపోయింది. అరణ్యానికి వచ్చేటప్పుడు ఆభరణాలన్నీ తీసేశావుగదా! ఇది నీచేతి కెలా వచ్చింది. కైక అంగీకరించిందా? అంటూ సందేహిస్తుంది—ఆచార్యులవారి శబరి. నారచీరలు ధరించిన నీచేతికి ఇది ఉండకూడదు. "కానీ రమణీయ వస్తువిది యేటికి వచ్చెనో! పెట్టుకొమ్మ—నీ, తారుచిరాననా విరహతాపము తీర్చునో! తమేమొ! రాఘవా!" అంటూ సర్దుకొంటుంది ఆ తపస్విని. కాని ఇది చేతికెలా వచ్చిందనే సందేహం మాత్రం వదలలేదు.

"అప్పుడయోధ్యలో వెడలునప్పుడు వ్రేలికిలేదు, మధ్య నీ
కెప్పుడొ! సంక్రమించెనిది.... .... .... .... .... అని ఊహించి
.... యెంచగ నీప్రణయ ప్రసక్తిలో

నొప్పులొ! తప్పులో! జరిగియుండుమ? సందెము దీని బెట్టి నా
రెప్పుడొ! నీవు గెల్చి లభియించితి విద్ది యరణ్యయాత్రలో" 1

1. శబరి – 46-3

అని సందేహాన్ని తీర్చుకొంటుంది. ఈ సందేహం కవికి ఎప్పటినుండో ఉన్నది. అది శబరి నోట వెలువడింది. కాని కావ్యాంతరంలో - ఆచార్యులవారు వాల్మీకిని—

"అంగుళీయకమ్ము అనిలాత్మజానకిచ్చె
రాముడంటి మేమి వ్రాతలయ్యె
నగలువిడిచినాడు నారవస్త్రాలతో
మన్నవానికున్నె యుంగరమ్ము" 1

అంటూ ప్రశ్నిస్తాడు స్వప్నంలో దర్శించి. అయితే ఈ సందేహాన్ని గోవిందరాజాచార్యులే తమ వ్యాఖ్యానంలో - కిష్కింధ, సుందరకాండలలో అంగుళీయక ప్రస్తావన వచ్చినప్పుడు వేరు వేరు మాటల్లో ఒక భావాన్ని అందించారు.

"రామనామాంకితమంగుళీయకం సీతాయాః కదాచిద్రావణా–గమ
నాత్పూర్వం ప్రణయపరత్వేన రామేణ స్వీకృత మితి బోధ్యం"
యద్వా-భార్యాస్నేహేన కనిష్టికాయాం సదా ముద్రికా ధార్యత ఇదిదేశాచారం
యద్వా-వివాహకాలే జనకేనదత్త మిదం పరాలంకారత్వేన" 2

అంటూ ఊహించారు. ఇది కిష్కింధాకాండలోని ప్రస్తావన. సుందరకాండలో సైతం ఇదే విధమైన వ్యాఖ్యానం కన్పిస్తుంది. ఈ వ్యాఖ్యానాలను చూసిన కవి–ప్రణయ కలహావసరంలో మారీచమృగం రావడానికి ముందు సీతనుండి రాముడు తీసుకొని ఉంటారన్న ఊహను అంగీకరించి మీ 'ప్రణయ ప్రసక్తి' లో అంటూ రామునికి అంగుళీయకాన్ని అలంకరించారు.

ఆ విధంగా లభించిన అంగుళీయకం జానకి విరహ వేదనతో వ్రేలికి వదులై పోయింది. జారిపోతుందేమోనని భయపడి పోతుంది శబరి.

"....  ....  ....  ....  ....  ....  ....
వదులయిపోయె నుంగరము–భద్రము, జాగ్రత, జారునేమొ! యి
య్యది చెయి జారెనేని బ్రతుకంతయు వ్యర్థము, ముందుముందు నీ
కిదియె శరణ్యమై వెలయు, నియ్యది జీవమునిల్పు నాయనా!" 3

"ఇదియె శరణ్యమై వెలయు" అనుమాటకు "ననుత్యక్తం సకలధనస్య సస్యవృత్యా వర్తమానస్య కుతో అంగుళీయకమితిచేత్ ఇదమేకం పితత్కార్యార్థం రక్షితవాన్"4 అన్న వాఖ్యానకర్తల పలుకులు ఆధారాలు కావు అనలేము.

1. రా-రహస్యాలు 25. వ
2. కిష్కింధ–చతుర్వ్యాఖ్య–పు. 211
3. శబరి – 46. 5
4. గోవిందరాజీయము–కిష్కింధ–పు. 211

తాటకవధా సమయంలో మారీచుని చంపకుండా వదలివేయడానికి, శూర్పణఖ వంటి రాక్షసిని నాసికాఖండం మాత్రమే చేసి వదలి వేయడానికి ఉన్న ప్రయోజనాలే-ఇక్కడ అంగుళీయకం ధరించడానికి ఉన్నాయి.

ఈవిధంగా శబరీదర్శనం వలన రామునికే ఎక్కువ ప్రయోజనం కల్గించారు కావ్యక ర్తలు. దూరప్రాంతానికి వెడుతున్న బిడ్డకు హెచ్చరికలు చేసే తల్లిలాగ-దూరప్రయాణానికి వెడుతూ బిడ్డకు బుద్ధులు చెప్పే అమ్మలాగ శబరి నిరాశానిస్పృహలకు లోనుకాబోతున్న రాముని ప్రోత్సహించి, ఋష్యమూకానికి వెళ్ళి సుగ్రీవుని కలవవలసిందని అందువల్ల మంచి జరుగుతుందని చెపుతూనే యోగాగ్నిలో ప్రవేశించింది. దేవతలు చూస్తుండగా అగ్ని ప్రవేశంచేసిన శబరిని ఆశ్చర్యపోతూ చూస్తుండి పోయారు రామలక్ష్మణులు.

శబరి పాత్రకు రామునితో గల సంబంధాన్ని ప్రత్యేకంగా విశ్లేషించి, నూత్న భావస్ఫోరకంగా రమణీయ కవితారూపంలో అందించిన మహాకవి రామానుజాచార్య. హయగ్రీవోపాసకులైన కవివర్యులు ఆశుకవితాధురీణులై ఎంతోవేగంగా పద్యాన్ని నడిపించినా మధురాతిమధురభావాల్ని అందంగా పొందుపరుస్తారు. సుకుమార రీతిలో మధుర రసాల్ని ఊరించగలిగిన రచనా నైపుణ్యం వారికి ఉపాసనాలబ్ధం. ఉదాహరణకు శబరి రామునితో ఇలా అంటుంది.

"ఏంటి వినున్ స్త్రీయం పురుషవిగ్రమంచపహాస్యమాడి పె
న్నంబె ధరాత్మజాత వనికించును మున్నటువంటి భార్య - నీ
వాంటి-ఖరాదిరాక్షసుల నెంచుటజూచి - కుచోష్మరేఖ -నీ
గంటుకు గాపుపెట్టెనటగా!! యెటువంటి యదృష్టరేఖరా!" 1

తనభర్త ఒంటరిగ పద్నాలుగువేల మంది రాక్షసుల సంహారించాడన్న ఆనందంతో ఆ జనకతనయ ఇచ్చిన కౌగిలింత - బహుమతి - యుద్ధంలో అయిన గంటుకి కాపువెట్టింది. అందుకేనేమో! నాధుని కవ్వించి అరణ్యానికి వచ్చింది సీతాసాధ్వి.

"భర్త గెలుపుమాచి భార్య ఇచ్చిన బిగికౌగిలి వేడితో గాయాలకు కాపు పెట్టడం" కవిభావనకు అద్భుతంగా ఉందిగాని శబరి చేత అనిపించడం ఉచితమా అని ప్రశ్నింపచేస్తుంది. కాని, "ఏదీ నీకాయము-నొక్కహారి నను గౌగిలి గట్టిగ జేయవిమ్ము" 2 అంటూ శబరికి రాముని కౌగిలింత భాగ్యాన్ని కలిగించిన ఆచార్యుల వారు "కుచోష్మరేఖ" పదం శబరిచేత పల్కించడం కూడా సబబుగానే అనిపిస్తుంది. ఇది భక్తికి పరాకాష్ఠ. యోగవిషయ శక్తిపాతం మోక్షప్రాప్తికి సులభమార్గం. అయితే యుగధర్మానికి విరుద్ధం. భవిష్యద్ధర్మానికి నాంది ప్రస్తావన కావచ్చు.

1. శబరి - 42. 5 2. శబరి 29--2

## బులుసు వారి శబరి

గుడిమెళ్ళవారి "శబరి" క్రొత్త పోయగాల్ని ప్రదర్శిస్తే శబరి వృత్తాంతానికి క్రొత్త అందాన్ని కలిగించారు రామమూర్తి గారు "శబరి" కావ్యంలో.

## 1. ఆవిర్భావము

మతంగాశ్రమ సమీపంలోని ఒక కోయపల్లెను పాలిస్తున్న కోయదొర ఈశ్వరార్చనాతత్పరుడు. ఆ ఈశ్వరుని దయవలనే వారికి ఒక బాలిక జన్మించింది. కానక గన్న సంతానం గాపున శబరీ వంశీయులుగ వారు ఆమెకు "శబరి" అని పేరు పెట్టారు. ఆ శబరీలలామ వయస్సు పయస్సుగ పొంగువారింది.

"సన్నని మధ్యమమ్ము నవిశమ్మును కేసరికిన్ సమానమై
క్రొన్నెల బోలుమోము తళుకుందన మొప్పు శరీరసౌష్ఠవంతో"1

రుచిరారుతున్న శబరిని చూచి "గార్గి అనే మునికుమారుడు మరులుగొన్నాడు. తన మనసులోని మాటను ఆమెతో పంచుకున్నాడు. "ఒంటొరుల మనస్సులందు మధుకోహలు దోలికలై చలింప సత్వరమిదె తాళికట్టెదను తప్పదటంచు"2 పలికాడు కాని విధి వక్రించింది. పెద్దలు అంగీకరించలేదు. వారి ప్రేమ భగ్నమైంది. విరహవేదనతో కృశించి మరణించాడు గార్గి. తనకు కాబోయే భర్త మరణించడంతో నైరాశ్యంలో మునిగిపోయింది శబరి. పంపానరోవరంలో పడి, ప్రాణత్యాగం చేద్దామనుకుంటుండగా రక్షించారు మతంగ మహర్షి. ఆమె విషాదగాధవిని, సముదాయించి తారకమంత్రాన్ని ఉపదేశించారు.

"మనసు పరమాత్మయందున జొనిపి యాశ
లన్ని తెగటార్చి పరమార్థమందు సతము
చంచలంబైన చిత్తంబునుంచి యబల!
మోక్షకామిగ నుండుమా దీక్షవిడక!!"3

అంటూ ప్రబోధించారు. క్రమంగా ఆశ్రమవాటికను శుభ్రం చెయ్యటం, పూజకు పుష్పాలందించటం మహర్షులకు సేవచేయటం వంటి పనులలో మునిగి భక్తి పారవశ్యంలో బంధువర్గాన్ని మరచిపోయింది.

---

1. శబరి–3.1    3. శబరి–6.23
2. శబరి–3.3

## 2. నిరీక్షణ

రామచంద్రుని ఆగమనాన్ని గురుదేవుల ద్వారా విన్నశబరి ఆ పరమాత్ముని కై ఎదురు చూడసాగింది. పలుకీతులుగా ఆ దేవుని ఆర్తితో ధ్యానించింది. ఆవేదనతో పిల్చింది. ఆరాధనగ ఎదురుచూసింది.

"కన్నుల వత్తులుంచుకొని కాంచుచునుండు తదేకదృష్టితో"1 తన ఆశ్రమ మంతటిని చలువ పందిళ్ళతో నందానించి, రంగవల్లులుదిద్ది, తోరణాలు తీర్చింది. క్షణమొకయుగంగా ఆ దీన శరణ్యుని కొరకు ఎదురు చూడసాగింది. కనులు మూసినా తెఱచినా రాముడే కవిపిస్తున్నాడు. జీవితావసాన దశలోనైనా వస్తాడా? అనే సందేహంతో మనసు దురపిల్లుతోంది.

## 3. సాక్షాత్కారము

రామనామ ధ్యానంలో తన్మయురాలై ఉన్న శబరికి రాముడొస్తున్నాడన్న విషయాన్ని పరిచారిక లొచ్చిచెప్పారు. నిరీక్షణ ఫలించింది. హృదయం ఉప్పొంగ వృద్ధాప్య కారణాన తొట్రుపడుతూ రామునికెదురు నడిచింది శబరి.

"దండము చేతబట్టి పవితామణి ముందుకురాగ వేగ కో
దండధరుండురాఘవుడు శాల్మివహింపుము నేనువత్తు నీ
దండకటంచుజెప్పె జనితంబగు మోదము సంఘటింపగా"2

కన్నీటిధారల రాముని పాదాలను కడిగింది శబరి.

"రామదర్శన భాగ్య విరాజమాన
మానసాంబుజ శబరి సమస్త దుఃఖ
ములను మదివిస్మరించి సంపూతయైన
మనము శ్రీరామ పాదమందున నమర్చె"3

మనసుని రాముని పాదాలచెంత పరచి నివేదన చేసింది. మధురమైన ఫలాలను తెచ్చి రామార్పణంగ సమర్పించింది. రాముడు ప్రీతితో స్వీకరించాడు.

"........శబరి ఫలంబుల నేటి కొటికి
మధురమైనవి తెచ్చి రామార్పణముగ"4

శబరి అందించిన ఫలాలను చూపి లక్ష్మణుడు చికాకు ప్రదర్శింపగ రఘు రాముడు సమాధానపరుస్తాడు. ఈ సమయంలో విరిసిన భావాలు గుదిమెళ్ళ వారి భావాలకు సమీచీనం—

---

1. శబరి 13.12
2. శబరి–22.23
3. శబరి–23.25
4. శబరి–26.39

"ఎంగిలియంచు భావనము నేనెఱుగన్ భక్తిచే పండిన యామె"
చేసిన యట్టిచేష్ట నాకెంచగ మోదమయ్యె"1 మొదలగు తావుల్లో పూర్వకవుల భావాలు తొంగిచూస్తున్నాయి. అనేక విధాలుగ రాముని స్తుతించి కైవల్యాన్ని అర్థించింది శబరి.

## మోక్షము

పుట్టినవారందరికి మరణము తప్పదుకాని జీవించినంతకాలము పుట్టుకను సార్థకం చేయాలన్న దీక్షతో మానవుడు శ్రమించాలి. గడిచిన దాన్ని గూర్చి విచారించి ప్రయోజనం లేదు. "ధాత్రియంతయున్ నడచుమదీయ శాసనమున నాతి" నీ మనస్సు తెలుసుకొనే నిన్ను తరింపజేయడానికి వచ్చానుఏమికావాలో కోరుకొమ్మంటాడు 2బులుసువారి రాముడు. "నాకిదుమిక ముక్తి మార్గమదియే పదివేలు"3అని శబరి ఇంతకు పూర్వమే ప్రార్థించింది. మళ్ళీ రాముడు ప్రశ్నించడం ఉచితంగా లేదు. భగవద్గీతాసారాన్ని నింపుకొన్న పద్యాలలో రాముడు పరమాత్మతత్వాన్ని ప్రకటించుకోవడం ఈ తావున కొంచెం వింతగా కన్పిస్తుంది. ఉదాహరణకు—

"గడిచిన దానికేల........4 ధాత్రి సర్వమున్ నడచు మదీయ శాసనము" అన్న పద్యం రాజవిద్య రాజగుహ్య యోగములో-10శ్లో. మయాధ్యక్షేన—అన్న శ్లోకాన్ని-

"అనితర భక్తితోడ........5" సర్వధర్మాన్ పరిత్యజ్య, "త్యక్త్వా కర్మ ఫలాసర్గం" (జ్ఞాన-20) సర్వభూతస్థ మాత్మానం (ఆత్మసంయమ—29) శ్లోకాలకు ప్రతిబింబాలు కాగా—

పుట్టినవారికెల్లరకు.... ....6 అన్న పద్యం జాతస్య హి ధృవో మృత్యుః (2—27) అన్న శ్లోకానికి ప్రతిబింబం. అందువల్లనే కవి"వేదపురాణ గాథల పవిత్ర రహస్యములివ్వె"7 అంటూ తాను చెప్పిన భగవద్గీతాసారాన్ని అంగీకరించారు. భక్తుల దృష్టిలో రాముడు పరమాత్ముడు కావున రచయిత తన దృష్టిలో రాముణ్ణి గీతాచార్యునిగా దర్శించారు.

"ప్రకృతిని వీడి పురుషుడు బాయునొకప్పుడు దానికేమి? త
త్ప్రకృతము చేత నా ప్రకృతి శుద్ధ మనస్సున జేరు పూరుషున్
ప్రకృతియు పూరుషుండు నెడబాయని వారు నిమిత్తమాత్రమౌ
వికలతగాంచి దుఃఖపడి చేదనపొందుట చిత్ర మిద్దరన్"8

1. శబరి 27.41
2. శబరి—35.25
3. శబరి-32.15
4. శబరి-35.27
5. శబరి—33.18
6. శబరి-33.'9
7. శబరి—34.20
8. శబరి—34.22

ప్రకృతి పురుషుల వియోగం క్షణికమైందని తుదకు వారు ఏకం కావటం అని వార్యమని సిద్ధాంతీకరించి నడుమ వచ్చిన వియోగాన్ని మాయామోహితంగా నిరూపించి వారి సంయోగాన్ని ఆనందవిధానంగా మార్చారు కవి. సీతారాముల వియోగానికి కవి నిర్దేశించిన ప్రతీక ఇది.

"శివశ్శక్త్యాయుక్తో యది భవతి శక్తః ప్రభవితుం
న చే దేవం దేవో న ఖలు కుశలః స్పందితుమపి" 1

"ప్రకృతి శుద్ధ మనస్సున జేరుపురుషున్" అన్న కవి వాక్కులో ఆదిశంకరుని పై పల్కుల సారాంశం గుబాళిస్తుంది. ఆ పల్కులవలన అగ్నిపునీతిగా సీత రాముణ్ణి చేరడాన్ని ధ్వనింపజేశారు కవి.

రాముడు కోరుకొమ్మనగా నీకు తెలిసియు నన్ను పరీక్షిస్తున్నావు స్వామీ లేక మళ్ళీ వినాలని కోరికగా ఉందా! అని మోక్షప్రాప్తి నర్థిస్తుంది శబరి.

"అనవిని రామచంద్రుడు భవాంబుధి దాటగసేతు నిన్ను మా
నిని! భవదీయ నామమది నిల్చినరీతి యనంత కాలమున్
తనరు నదీమతల్లిగ . ..........." 2 అంటూ ఆశీర్వదించారు రాముడు.

"ఆవనితా శిరోమణి దయానిధి రాముని యాత్మ జేరగా"
దీవెనలిచ్చె రాముడు సుధీమణి వాహినిగా విరాజిలన్" 3

అని కవి శబరిని రామునిలో లీనం చేయించి నదిగా సైతం ప్రవహింపచేశారు. ఇది పద్మ పురాణగాథ.

గార్గి – శబరుల ప్రేమకథా ప్రస్తావన ఈ కావ్యంలో క్రొత్త విశేషం, శబరికి పరిచారికలు కూడా ఇందులో కన్పిస్తారు. రామకథను మతంగుని చేత శబరికి చెప్పించారు. ఎంగిలి పండ్లనే రామునకు సమర్పించింది శబరి. లక్ష్మణుని కోపం గూడ మిగిలిన కావ్యాల రీతినే ద్యోతకమైంది. శబరీ సౌందర్య వర్ణన క్రొత్త విశేషం. ఇది ప్రబంధోచిత ధోరణి.

కవి అష్టావధాని అవడంతో ఆశుకవితా ధోరణిలో పద్య నిర్మాణంలో కొంత సడలింపు వచ్చింది. కథా సంవిధానానికన్నా కవి నివేదన, భక్త్యావేశ ప్రకటనం కావ్యంలో ఎక్కువగా చోటుచేసుకున్నాయి. యోగాగ్ని ప్రస్తావన లేదు. శబరి రామునిలో లీనమగుటయేగాక నదీరూపంగా సైతం ఇందులో కన్పిస్తుంది. ఇది ఆశ్చర్య రామాయణ కల్పనగా ఇంతకు పూర్వమే వివరితం.

రామునికి శబరి చెంతకు మార్గనిర్దేశం చేసింది. "విరాధుడు" అంటూ ఒక టీకాక రెండు పర్యాయాలు కవి ప్రస్తావించటం 4 ప్రమాద పలితం కావచ్చు.

---

1. సౌందర్యలహరి - 1 శ్లో 2. శబరి – 35.27 3. శబరి–36.28.

4. పంపా సరసీతటంబున విభాసిలునట్టి విరాధుజంపగా

ii ఆ విరాధుకు గంధర్వుడై చెలంగి నడుపు శబరిచరిత.

"ప్రమాదో ధీమతామపి"అనే ఆర్యోక్తికిది లక్ష్యంగా స్వీకరించవచ్చు. వాల్మీకి రాముసకు మార్గనిర్దేశం చేసింది మోక్షప్రాప్తికి ముందుగా కబంధుడనే విషయం సర్వవిదితం.

## ప్రకాశరావుగారి శబరి

గార్గి శబరుల ప్రేమ వృత్తాంత కల్పన శ్రీబులుసు వెంకట రామమూర్తిగారిది కాగా, "నిర్మలానందశబరుల" కల్పన శ్రీసహదేవ సూర్యప్రకాశరావుగారి లఘుకావ్యంలో మనకు ప్రత్యేకంగా కన్పిస్తుంది. ఆదారిన వచ్చిన ప్రతి బాటసారిని రాముని గూర్చి ప్రశ్నిస్తోంది శబరి.

### ప్రతీక్ష

"ఈవు వచ్చిన దారిలో, ఇంద్రనీల
మణి గణాభదేహు డొకడు, మహిత హేమ
కాంతి రేఖామనోహర గాత్రుడొకడు
గాని పించిరే, నీకనుల్ కలవుదీర"1

ఆవేశంతో శ్రీరాముని పలురీతులుగ వర్ణించి ఎక్కడైనా కన్పించారా? అంటూ ప్రశ్నించే తమకంలో బిడ్డకై ఎదురుచూస్తూ, బిడ్డను వెతుక్కుంటున్న మాతృహృదయం గోచరిస్తుంది. పాంథుని ఆశ్రయించిన కవి శబరి ద్వారా మతంగాశ్రమ పరిసరాలను, రాముని ఆగమనాన్ని గూర్చి గురుదేవుల ఆదేశాన్ని మతంగ వన మహిమను గూర్చి ఉగ్గడిస్తుంది.

"ఖానుకులుడు నీకోనము వచ్చుదనుక
నీశిథిల దేహయష్టిని నిలిపి కొనుము.
శక్తికిని, రక్తికిని, భక్తి ముక్తులకును
కాయమే కదా యుపయోగకారకమ్ము"2

"శరీరమాద్యంఖలు ధర్మసాధనం"అన్న ఆర్యోక్తి పొందికగా పాదంలో సర్దుకుంది. భూమి మీద ఏ శబ్దం విన్పించినా రాముడేమోనని ఆశగా ఎదురుచూస్తున్నాయి శబరి నేత్రాలు. వచ్చిన బాటసారికి శయనింప దర్భశయ్య నమర్చి, అతిథిపూజలచేసి పెందలకడనే నిద్రించిన యెడల ప్రభాతవేళనే లేచి గమ్యము చేరగలరని ప్రార్థించి, రాముని గూర్చి చింతిస్తూ ఆ రాత్రి గడిపేస్తుంది శబరి.

### విరహ

సీతావియోగంచేత కబంధవధ వలన కల్గిన అలసటచేత శబరి ఆశ్రమ మార్గంలో కొద్దిసేపు విశ్రమించారు అన్నదమ్ములు.

---

1. శబరి–1.2
2. శబరి–5.14

"అస్తమిత భాస్కరుని యరుణారుణాంశు
వొకటి జాల్వాఱి, రఘురామునిచికిలిపీలి
చెక్కిలింబడి, కన్నీటి చుక్కలోన
ప్రతి ఫలించెను సప్త వర్ణముల కాంతి"

రాముని చెక్కిలిమీద ఇంద్రధనస్సు భాసించింది. 'లోచూపు'లో ప్రియారూపాన్ని దర్శిస్తూ, బాహ్యంగా విస్మితుడై విప్పృత నేత్రుడు, శూన్యదృక్కుడై యున్న రాముని చెంతకుచేరింది. ఒక లేడిపిల్ల'లోచూపు'లోనున్న వేడినిట్టూర్పునకు భయపడి పారిపో యిందా లేడి. రామచంద్రుని కన్నులలో 'మంకెనలు' కన్పిస్తున్నాయి. మారీచ మృగం గుర్తుకొచ్చింది. అదే మాట కవి-ఇలా సమర్థిస్తారు.

"కినుక ఏల శ్రీరామచంద్రునకు పొడమె
మమతలూరించు మృగకిశోరమును జూడ
స్మృతికి దట్టెను గాబోలు, హృదయ మర్మ
మంటు, పరిపూత సీతాపహరణగాధ"2

ఈ విధంగా ప్రకృతి యంతా సీతాపహరణాది వృత్తాల్ని గుర్తుచేస్తున్నాయి. జక్క వల జంటలు, చిలుకల జంటలు, గోరువంక మిధునములు ఆనందంతో 'సంచరిస్తూ' రాముని విరహాన్ని ఇనుమడింపచేశాయి. వసంతరాత్రి పండువెన్నెల రాముని ఆవే దనను అధికంచేసింది.

"కానిపించునే నాకు సీతానతాంగి,
ఎన్నటికినేవిలక్ష్మణ! ఎచట నుండె ?
ఏమి కడగండ్లు పడుచుండె? ఎఱుకరాదు
తస్కరించినదెవరో? నిర్ధారణముగ "3

"జటాయువు చూచుటకు ముందు రామునిలోని విలాపం"4 ఇది. "కేనాహృతావా సౌమిత్రి" అన్న వాల్మీకిపదం 'తస్కరించినదెవరో'గ రూపొందింది. ఇంత వేదన లోను రాముడు 'సూర్యచంద్రుల' ప్రసక్తినివిచిత్రంగ సంవదింపచేస్తారు.

"చంద్రుడవు నీవు, సూర్యవంశజుడ నేను,
లేశమేని వైషమ్యము లేదుమనకు,
కావ నాపేరు నీపేర కలిపికొంటి,
రవిశశాంకులు చక్రినేత్రములుగారె"5

---

1. శబరి-11-3
2. శబరి-12-8
3. శబరి-16-18
4. సీతారహితోఽహం నహిజీవామి లక్ష్మణ
5. శబరి-16-20

"నాపేరు నీపేర కలిపికొంచే" అనే బంధుత్వంతో సీత ఎక్కడుందో గమనించి చెప్పమని చంద్రుని ప్రార్థిస్తాడు శ్రీరామచంద్రుడు. శశిదూతం నిర్వహించమన్నాడు.

"నీకరమ్ములు నామెయి సోకినంత
ఏలకో తప్తహృదయమ్ము ఇవతిశించె,
ఆకరమ్ములు నా ప్రియురాలిమేను
తనిపి, నన్నలరింప వచ్చినవి యేమొ"1

సీత దేహాన్ని తాకి విన వెంతకు వచ్చినందువల్ల కలిగిన హాయిని గుర్తుచేసుకుంటాడు రాముడు. "ఒకరి క్షేమ మొక్కరికి తెల్పి, పుణ్యమ్మునొంద వోయి" అని ప్రార్థిస్తాడు.

## స్మృతి

తనకులం వారిని సంస్కరింప యత్నించి, సాధ్యంకాక భగ్న హృదయంతో మతంగముని ఆశ్రమాన్ని చేరింది శబరి. శ్రుతి చిట్టెమ్మశబరి లాగానే రహస్యంగ ఆశ్రమాన్ని శుద్ధిచేసి, ముగ్గువేస్తూ సేవించుకుంటున్న శబరిని గురువుగారు కాపువేసి పట్టుకొని ప్రశ్నించారు. తన కథనంతటిని ఏకరువు పెట్టుకొంది. మతంగ మహర్షి శబరిని గుర్తించారు.

"శబరి కన్యవా నీవు? సచ్చరితవమ్మ
నీ మనఃపరివర్తన నీ విసర్గ
మంజుల స్వభావము నెల్ల మనవిచేసి
నాడు నాకు, శ్రీ నిర్మలానందు డెలమి."2

నిర్మలానందుని శీలాన్ని శంకించి, అతవి మరణానికి కారణభూతమైన సమాజాన్ని నిందించారు. ఆశ్రమాన్ని సేవిస్తూ, జీవితాన్ని సార్థకం చేసుకోమన్నారు మతంగ మహర్షి.

"ఇంతలోకమ్ములో నిసుమంత చోటు
నీకు లేక పోయెనె, శబరి కుమారి!
రమ్ము మా పర్ణశాలకు, మమ్ముజూచు
కొనుము మాతృ వాత్సల్యమ్ము కొనలువోవ"3

"మాతృవాత్సల్యంతో మమ్ము చూసుకోవలసిందన్న ఆహ్వానం మహర్షిది" ఆశ్రమవాసియైంది శబరి.

---

1. శబరి-17.23
2. శబరి-27.20
3. శబరి-31.2

## స్వాగతి

"తెలుగు మగనాలి సింధూర తిలక మటుల
వెలుగు లీనె తూర్పు ముఖాన వేగు జుక్క"1

వేగుచుక్కతోపాటు దినచర్య ప్రారంభించి, రామనామాంకితమై శుకశారికలు ఆశ్రమ వాటికను రామమందిరం చేస్తుంటే ప్రతిరోజు రామునికై నిరీక్షిస్తూ దినమొక యుగంగా గడిపేస్తోంది శబరి....హఠాత్తుగ ప్రకృతంతా ఒక్కసారిగ రామసంకీర్తనం ప్రారంభించింది. పర్ణశాల ముంగిలిలోకి వచ్చి చూచింది.

"అంత కౌముదీకమనీయ కాంతి, శబరి
యక్షులకు దట్ట ఱెప్పలల్లార్చిచూచె
నీలి మాత్రము శంపయు బోరెపచ్చి
శుభ్రతేజః విహిత దివ్య సుందరులను"2

గాంచి ఎవరా అని ఆశ్చర్యపోయి, "నాదుతమిదాప వచ్చుచున్నారు వారు వారె రామ లక్ష్మణులు"3 అని నిర్ధారించుకొంది.

"గడ్డిపూవులు తల రెత్తి గాంచుచుండె
నెవరి పదపంకజమ్ముల కెఱగ దలచి,
కొలనిలోపలి మీనము లొలసి పడుచు
నేరివి గన పదేపదే ఎగయుచుండె"4

అంటూ ఆశ్చర్యపోయి, ఆశ్రమ ప్రాంగణంలో శ్రీరామచంద్రుని దర్శించి, రామ నామ పరవశయై తన్మయత్వంలో అవశయై రామునిపాదాల చెంత ఒరిగిపోయింది శబరి.

## వరివస్య

రాముని సాంత్వనముతో తెలివంది "రండి శబరి పూరింటికి" అంటూ ఆహ్వానించింది. పూగద్దెలపై గూర్చుండ జేసి, పాదాలు కడిగి నెత్తి చల్లుకొంది. అహల్యకాపురాన్ని నిలబెట్టిన పవిత్రపాదాలను సేవించిన భాగ్యానికి ఎంతో పొంగి పోయింది.

"జనకు దర్శించి కడిగిన చరణ యుగళి,
అమ్మ సీతమ్మ ఒత్తిన అరుగు దోయి,
భద్రు నౌదల మెట్టిన పాద పాళి,
నంటి పూజించి నేధన్యురాలనైతి."4

---

1. శబరి-32.2 2. శబరి-35.10 3. శబరి-35.15
4. శబరి-36.14

సీతతో పీ దర్శనం చేసుకుందామని కోరుకున్న నాకు ఆ రాక్షసుడెవడో అద్భుతగిరి నన్ను, నిన్ను వేధించాడు. కాని వాడు నాశనమౌతాడు అంటూ ఊరడిస్తుంది. మీ దర్శనమైనా లభించింది. అదృష్టవంతురాల్ని "అస్మదాచార్య మణికి లభ్యమ్ముగాని, దివ్యసందర్శనమ్ము ప్రాప్తించె నాకు" అన్న ఆత్మసంతృప్తి ఈ శబరిది. నవవిధ భక్తి మార్గాలను విశదంచేస్తాడు రాముడు.

## అతిధేయము

"వనమునందలి చెట్టు చాటునకు తిరిగి
తిరిగి, మిగుల మాగిన పండ్లు, తేనె లీను
పండ్లు, చవిచూచి కోసుక వచ్చినాను
కోరి, శ్రీరాఘవేంద్ర! మీకోసమేను"1

అంటూ చవిచూచిన పండ్లను ఆప్యాయంగా అందించింది. ఈమె తెలుగువారి శబరి అన్న విషయం మళ్ళీ ఇక్కడ స్పష్టమౌతోంది. తెలుగు కవులందరిలోను కన్పించే ఈ భక్తి తత్పరత, రామునకు ఎంగిలి పండ్లు అందించడంలో, కౌసల్యను దర్శింప జేయడంలో, సమానతను పాటించారు. తెలుగుతల్లి తనబిడ్డకు గోరుముద్దలు కలిపి, ఎలా ఉంవో రుచిచూచి, బిడ్డకు అందించిన ప్రేమ శబరిలో దర్శించారు. "చంద మామ రావె–రామచంద్ర తినవె" అంటూ కౌసల్యవలె కొసరి కొసరి తినిపించింది. ఇదే ప్రవృత్తి గోరుముద్దలు తినిపించడం పెమ్మరాజువారిలోను, భోగరాజువారిలోను మనం గమనించాము. "సీతా ఫలము లారగింపుమయ్య" అనేసరికి సీత గుర్తుకొచ్చి నిట్టూర్పు పుచ్చాడు రాముడు. ఓదార్చింది శబరి.

ఎంగిలి పండ్లను రామచంద్రునికి కిస్తున్న శబరి కాంతను చూసి "బుస్సుమని లక్ష్మణుండూర్పు బుచ్చినాడు"2 రామునికి ఆశ్రమ మంతా త్రిప్పి చూపించింది శబరి.

"కృతాభిషేకై ర్హైర్న్యస్తా వల్కలాః పాద పేష్వివ
అద్యాపి నావ శుష్యంతి ప్రదేశే రఘునందన"3—

అన్న వాల్మీకి మూల శ్లోకం-ఆధారంగా.

---

1. శబరి–49.2
2. శబరి-65.17
3. అరణ్య-74.26

## మహస్సు

"శ్రీమతంగ గురుని నారచీర, లెన్ని
ఏండ్లు పూండ్లను గడిచి పోయినవొ, వాని
నార వేసి—ఇప్పుడే తడియార బెట్టి
నట్టులుండు మహర్షి మహస్సు వలన"1

అన్న పద్యంలో మహర్షి గొప్పతనాన్ని-

"ఇయంప్రత్యక్ స్థలీవేది 2-అదె మతంగ మునీంద్రుల యాగవేది 3
పశ్యసహితాన్ సప్తసాగరాన్ 4- సప్తనీరధులె కొలనుగా జననమందె 5

పలు రీతులుగా ఆశ్రమాన్ని వర్ణించి, సుగ్రీవుని కలవమని నిర్దేశించి,

"నా వరము సంధ్యవేళ ఘృణా ప్రపూర్ణ
లగుచు, మోక్ష పదము జేరనానతిండు"6

అంటూ రాముని అనుజ్ఞ తీసుకొని,

"రాముడనుమతింపగ శ్రీమణీమతల్లి
అంజలి ఘటించి, జ్వలిత యోగాగ్ని జిహ్వా
కాంతరముల భస్మీకృత గాత్రయాయె.
.... .... .... .... .... .... ...."7

రామలక్ష్మణులు విస్మయాక్రాంతులై చూస్తుండగా భస్మశరీరమైంది శబరి. ఆరవేసిన నారచీరలు యాగవేదులు, అగ్నిహోత్రం అదృశ్యంకాగా, రాముడు కూర్చున్న పూగద్దె పర్వతమైంది. అందులో నుండి ఒక ఏరు ప్రవహించింది. తెలుగు మాగాణుల్ని పండిస్తూ, గౌతమిలో కలసిన పవిత్ర నదీమతల్లి శబరి.

ఆ పర్వతమే "రామగిరి" కాళిదాసుని యక్షునికి ఆవాసమైన రామగిరి. "రామగిర్యాశ్రమమేషు"-అన్న పలుకులలోని మందాక్రాంతం విరహవేదనల్లో వేగిపోతూ సాహితీ ప్రియులకు రసానందాన్ని కల్గిస్తూనే ఉంది.

శబరియోగాగ్నిలో దగ్ధమై నదిగా ప్రవహించిన తర్వాత ఉచ్ఛిష్టాన్ని గూర్చి లక్ష్మణుని సందేహాన్ని తీర్చినట్లు కవి మార్చి వ్రాస్తారు. ఈ చర్య శబరి ఎదుట చేయడం కవికి ఇష్టంకాలేదు. ఇది మిగిలిన కవులు అనుసరించని మార్గం. ఈ విషయాన్ని కవి ఒక ప్రత్యేక విషయంగా భావించడంవల్లనే దీన్ని వేరుగా వ్రాయడం జరిగింది. శబరి ఎంగిలి అందించిన సమయంలో లక్ష్మణుడు ఉగ్రదృష్టుల చూచి, బుస్సుమని నిట్టూర్పు విడిచాడు.

1. శబరి 54.2 2. అరణ్య-74.23 3. శబరి- 55.3
4. అరణ్య—74.25 5 శబరి—55.4 6. శబరి- 57.11
7. శబరి-58.13.

## ఉచ్ఛిష్టము

ఆ విషయాన్ని కవి ఇక్కడ చర్చిస్తున్నారు. అసలు ఎంగిలి అనేది ఎక్కడ ఉంది అంటాడు. భక్తునకు, బ్రహ్మకు అవినాభావ సంబంధమున్నప్పుడు జాతి కుల మతాల హద్దులు లేనప్పుడు ఎంగిలి ఎక్కడుంది అంటాడు రాముడు. "సాత్త్విక ప్రేమలో నన్ను నమిసిపోవు" అంటూ ప్రకటించేసాడు వీరి రాముడు.

"అమ్మయొసగెడు కాలకూటమ్ము నేని
స్వీకరింపక పసిపాప విడుచునేమి,
పారవశ్యమ్ముతో భక్తవరులొసంగు
నేపదార్థమేని తిరస్కరింపగలనె"1

"తల్లిపెట్టే విషాన్నైనా పసిపాప" స్వీకరించినట్లుగా అని పై పద్యంలో ఉపమించటం శబరి యిచ్చే ఎంగిలి ఫలాన్ని స్వీకరించిన రామునిలో తప్పువిసరితనాన్నే వెలువరిస్తోంది గాని ప్రేమను తెలియజేయడం లేదు. ఆ పోలిక మార్చి ఉంటే బాగుండేదేమో!

"నీవు నేనను భేద మొకింత లేక
"ఆత్మ వత్సర్వ భూతాని" యనెడు సూక్తి
జీవితమ్మున కాదర్శమై వెలుంగ,
ప్రతిహృదిని మానవత చెలువారవలయు"2

అన్న వేదాంత వాణి రామునికి తాను కొఱికి చవిచూచిన ఫలాలతోనే అతిధి సత్కారం చేయించింది శబరిచేత-

అచ్చటచ్చట మూలాన్ని అనుసరించినా లఘుకావ్యమంతా కవి యొక్క రమ్య రచనా ప్రక్రియకు దర్పణమే-వీరేశలింగం గారి ఆరాధకుడైన ఈ కవిలో సంఘ సంస్కరణ, అజ్ఞాన తిమిరవిచ్ఛేదం,జాతి కుల విచక్షణను అంతమొందించడం వంటి విషయాలలో నిర్దుష్టమైన అభిప్రాయాలున్నాయి. సమయానుగుణంగా కవి ఆ భావాల్ని పాఠకులతో పంచుకుంటారు. ప్రాచీన కవులపై ఈ కవికి మంచి అవగాహన ఉంది. భావకవిత్వపు వాసనలు కూడా పుణికి పుచ్చుకొన్నారు.

"తెలుగు మగనాలి," "సింధూర తిలకము""నీలివింగి," "నీలాల జలదపాశికలు," "ముత్తెముల పావడాల్కల తోసిన" మొదలైన పదచిత్రాలు లో చూపుగలవి.

1. శబరి-63.7 2. శబరి-63.8

కవి "ఊహలు రసరమ్యములు శ్లాఘ్యా పాత్రములు.............. భావకవిత్వపు ఛాయలు కావ్యము నిండా రసపోషకములుగా నిసర్గసుందరముగా పాఠక హృదయము లను తనియించుచున్నవి"1 రచనలో భావగాంభీర్యం, శైలీసౌకుమార్యం పోటీపడ తాయి.

"నల్లరాతిని నవ జీవనమ్ము, పులక
రింప, సుమనో మనోహరాకృతిని, తీర్చి
దిద్ది, ఇల్లు నిలబెట్టిన దివ్యపదము
లంటి పూజించి నే ధన్యురాలనైతి"2

వంటి పద్యాలు వీరి కవితా పటిమకు తార్కాణాలు.

## శబరీ సందర్శనం

ఇంతవరకు కొనసాగిన వివిధ కవుల "శబరీ కావ్యాలు సందర్శిస్తే గమనించ దగ్గ విషయాలు కొన్ని ఉద్ఘాటించాలి. వానిలో ప్రప్రథమంగ పరిశీలించదగినది "ఎంగిలి ఫలాలను సమర్పించడం" ఈ విషయంలో కవులందరు పద్మపురాణాన్ని జానపదవాఙ్మయాన్ని ఆశ్రయించినవారే, కాని వాల్మీకి మార్గంలో నడచినవారులేరు.

2. యోగాగ్నిలో భస్మంకావడం, దివ్యరూపధారణ.
3. ఏరుగా మారడం
4. శబరీ జన్మవృత్తాంతం, ప్రేమ, వివాహాది ప్రయత్నాలు
5. శబరిని "నిషాదకన్య" గ ప్రస్తావించడమేకాక, నిషాదరాజ కొమార్తెగా కొత్త గౌరవాన్ని ఆపాదించడం.
6. సీతాసహిత రాముణ్ణి శబరికి దర్శింపజేయడం.

1. ఎంగిలి పండ్లు :- శబరి సమర్పించడం పద్మపురాణాంతర్గతంగా ఉన్న విషయాన్ని సమన్వయించు కోవడంలో ఉన్న తేడా అన్న విషయాన్ని చర్చా సమయంలో మన నిర్ణయించాం. యోగావంచ రామాయణంలో "చవిమాచి ఏర్చి కూర్చిన బత్తివి దద్యోగినీమణి తనకు సమర్పనా పూర్వకముగ సమర్పించుట ఎఱిగియు పతంగకులపుంగవుండెంగిలి పండ్లను యొండాడక కొండాడి యామెంగూడి భుజియించె" అని చెప్పడం కూడా పద్మపురాణ ఆశ్చర్యరామాయణాదుల ప్రభావమే. అదే తెలుగు కవులకు ఆదరపాత్రమైనది. ఈ కవులందరు ఈ విషయంలో ఏకీభ వించారు. గుడిమెళ్ళ వారు మాత్రము దానిని గూర్చి సూక్ష్మంగా విశ్లేషించి, రాముడు ఎంగిలి కాకుండ జాగ్రత్త పడ్డారు.

---

1. శబరి—23 పు. 2. శబరి-40.5

**2. యోగాగ్ని ప్రస్తావన :-** వాల్మీకి శబరి "హుత్వాత్మానం హుతా శనే" తనకు తానుగ అగ్నిలో శరీరాన్ని హోమం చేసి, ఊర్ధ్వగతులు పొందినట్లు చెప్పియున్నారు. ఈ విషయంలో ఆధునికులు వేరు వేరు మార్గాలను అనుసరించారు. శ్రీ మాధవపెద్ది "సశరీరముగ" విమానాన్ని అధిరోహింపజేయ, శ్రీమతి చిట్టెమ్మ రామునిలో "దివ్యతేజస్సుగ" శబరిని లీనంచేసింది, పెమ్మరాజువారు "శబరి" కాంతిని రామునిలో లీనం చేయించి, ఏరుగా శబరిని మిగిల్చారు. ఇదేమార్గం "శబరీ సపర్య" కవి మరంగంటివారికి అనుసరణీయమైంది. వీరు దివ్యతేజస్వినిగా శబరిని దేవతా విమానం ఎక్కించి, ఏటగా భూమిపై మిగిల్చారు. మేకావారి శబరి రామానుజ్ఞ తీసుకొని అగ్నిప్రవేశం చేసి "గురుని" దివ్యసీమ చేరింది. గుడిమెళ్ళ వారు వాల్మీకి అనుయాయి. వెంకట రామమూర్తి శబరిని నదిగా మిగిల్చి, మోక్ష ప్రాప్తి చేయించారు. సహదేవ వారి శబరి అగ్నిలో భస్మం కాగా ఏరుగా మిగిలింది.

**3. జన్మవృత్తాన్త ప్రస్తావన :-** శబరిని పసికందుగా మాధవపెద్ది ప్రసావించగా శ్రీ భోగరాజు పద్మపురాణ ప్రభావంతో ప్రేమ,పెళ్ళి ప్రస్తావనలు తీసు కొచ్చింది. బులుసురామమూర్తి గార్గి, శబరుల ప్రేమ వృత్తాన్తం ప్రస్తావిస్తే,సహదేవ "శబరీ నిర్మలానందుల" స్నేహాన్ని ఉటంకించారు.

**4. నిషాదకన్య :-** వాల్మీకి శబరిని గూర్చి చెప్పుచూ-

"రాఘవః ప్రాహ విజ్ఞానే తాం నిత్యమబహిష్కృతామ్"1 అంటూ"నిత్యమామె ఆత్మ జ్ఞానముచే లబహిష్కృతురాలు. అనగా నిత్యజీవితములో బహిష్కృతురా లని వ్యంగ్యముగా శబరి కుల సంజాతిగ చెప్పియున్నాడు. పేరులోనే విషయము స్పష్టపరచగలిగిన ధీసాగరుడు వాల్మీకి.

అధ్యాత్మరామాయణంలో-"హీనజాతిసముద్భవా"2 అని స్పష్టంగా ఉంది. ఈ ఆధారాలే పద్మ పురాణంలో నిషాదపుత్రిగ ఆవిర్భవించింది. శ్రీమతి భోగరాజుకి అదే ఆధారమనే విషయం పూర్వోక్తం.

శబరి పూర్వజన్మలో మాలిని అనే గంధర్వకన్య యని చెప్పబడుతుంది. గంధర్వరాజైన చిత్రకవచుని ఏకైక పుత్రిక ఈమె. వీతిహోత్రుని పరిణయ మాడింది. భర్త ఎల్లప్పుడు యజ్ఞ యాగాదులలో మునిగియుండగ ఈమె కల్మాషు డనే బోయవానితో సంబంధం ఏర్పరచుకోగా కోపించిన వీతిహోత్రుడు ఈమెను శబరవనితగ జన్మించమని శపించాడు.

---

1. వాల్మీకం-అరణ్య-74.17    2. అధ్యాత్మ-17.10.3

"రామదర్శనానంతరం ఆ మహాసీయుని ఆశీస్సులతో తిరిగి "మాలిని"గ మారిపోయి భర్తతో గంధర్వలోకాన్ని చేరింది." అని కంబరామాయణ కర్త శబరి పూర్వచరిత్ర కల్పించారు. తిరిగి భర్తను కలుసుకొన్న సన్నివేశవర్ణన గౌతముని కలుసుకున్న అహల్యావర్ణనను పోలింది. ఇట్టి విషయాన్ని తెలుగు కవులెవరు పురస్కరించుకోలేదు.

రామాయణాన్ని మానవుని శరీరభాగాలకు క్రమబద్ధమైన ప్రతీకలుగ భావించిన విమర్శకులు-శబరీ వృత్తాంతాన్ని ప్రస్తావించే సమయంలో ఇలా అన్నారు.

"మొండాన్ని శరీరంతో కలిపే స్వరపేటిక శబరి. పంపా సరోవరంలో వివిధ వర్ణాలతో శాశ్వతంగా శోభించే నిత్య జల ప్రవాహమే-శబ్దోధ్యానమే ఓంకారము. శబరి సేవించిన తద్వనంలోని సతతహరిత వృక్షాలు-స్వరపేటిక నుండి వెలువడే మానవధ్వని యొక్క శాశ్వత సౌభాగ్యాన్ని" తెలుపుతాయి. ఈ స్వరపేటిక ద్వారానే దివ్యదృష్టిగల పురుషోత్తముడు పురుషవాక్కును -సుగ్రీవుని-సమీపించాడు"2 అని పాండురంగారావు గారి వక్కాణ.

మొత్తము మీద పరిశీలించిన "శబరి" తెలుగువారి మన్ననలకు పాత్రమైన ఉదాత్తపాత్ర. ఈ పాత్ర కేవలం లఘుకావ్యాలుగానే కాక దృశ్యకావ్యాలుగా కూడ పలువురు కవులచే రసనిష్యందిగా పరిష్కృతమైంది.

నిజానికి భారతంలో విదురుడులాగా "శబరి" గొప్ప సంస్కారం గల ధన్యజీవి. ఇట్టి ఆటవిక పాత్ర సవ్యకవుల కావ్యసృష్టి నాకర్షించడం వారికి రామాయణం పైగల రసముగ్ధత్వాన్ని విరూపిస్తుంది.

1. Puranic Encyclopaedia--p. 659

2. రామాయణంలో స్త్రీ పాత్రలు-పు. 77

# అహల్య

బ్రహ్మమానస పుత్రికయై, మహర్షి మంత్రద్రష్ట న్యాయసూత్రప్రణేత అక్షపాదుడునైన గౌతముని పరిణయమాడి పంచకన్యలలో ప్రథమతాంబూలం స్వీకరిస్తున్న పతివ్రతా సాధ్వి అహల్య.

"హలం నామే కహ వైరూప్యం హల్యం తత్ప్రభవం భవేత్
యస్యాన విద్యతే హల్యం తేనాహల్యేతి విశ్రుతా" 1

హల్యమనగా వైరూప్యం. అదిలేనిది అహల్య. సర్వాంగసుందరిగా సృష్టికర్త చేతనే ప్రశంసించబడిన సౌందర్యం ఆమెది. కాని-ఈమెపై చెలరేగిన దుమారం సాహిత్యంలో మరే పాత్ర మీద లేదంటే అతిశయోక్తికాదు. వేద వాఙ్మయం నుండి దక్షిణాంధ్ర సాహిత్యం మీదుగ ఆధునిక సాహిత్యం వరకు అహల్య అనేకరూపాల్లో మనకు కన్పిస్తోంది. తైత్తిరీయారణ్యకంలో ఇంద్రుని యాగమున కాహ్వానించే సందర్భంలో—

"ఇంద్రాగచ్ఛ హరివ అగచ్ఛ మేధాతిథేః
మేషవృషణశ్వస్య మేనే
గౌరావస్కంది న్నహల్యాయై జార
కౌశిక బ్రాహ్మణ గౌతమ బ్రువాణ" 2

గౌతమ–అహల్య–ఇంద్ర–కౌశిక అనునవి రామాయణ పాత్రలు. శ్రీరామచంద్రుడు ఆ పాత్రల్ని పునీతం చేశాడు. పై మంత్రానికి విద్యారణ్యుల భాష్యాన్ని పరిశీలిస్తే -

"హే ఇన్ద్ర పరమైశ్వర యుక్తః ఇహకర్మణ్యాగచ్ఛ హరివ–హరినామక అశ్వా అస్య విద్యతే .... .... .... .... .... .... .... .... .... .... .... .... తస్మిన్నర్థే వృషణశ్వస్య మేనే" ఈ రీతిగా వైదిక పరంగా కొనసాగిన వ్యాఖ్యానంలో "అహల్యాయై జార" అన్న పదానికి-"అహల్యా గౌతమస్య భార్యా తస్యా ఇంద్రే జార ఇతి పురాణే ప్రసిద్ధం" 3 అని వదలివేయడం మనం గమనించవచ్చు.

శ్రీకుమారిల భట్టు "తంత్రవార్తికము"లో వేదముల యందలి ఇంద్రాహల్యల ప్రస్తావన వివరిస్తూ —

---

1. వా. ఉ. 30–29 శ్లో.
2. కృష్ణ-యజుర్వేద తైత్తిరేయారణ్యకం 2-70 పు
3. " 12వ అనువాకం

12వ అనువాకం

చంద్రుడే గౌతముడు. గోశబ్దమునకు ఉత్తమకిరణములని యర్థము. (సర్వేపి రశ్మయః గావఇత్యుచ్యంతే-నిరుక్తము) చంద్రునియొక్క భార్యయగు రాత్రియే అహల్య. "అహః లీయతే యస్యాంసా అహల్యా"-పగలు దేనియందు మునిగి యునో అది అహల్య-అనగా రాత్రియే అహల్య. ఇంద్రుడనగా "పరమైశ్వర్య సంపన్నుడగు సూర్యుడ"ని అర్థం.

కనుక ఇంద్రశబ్ద వాచ్యుడగు సూర్యుడు ఉదయింపగనే అహల్య అనగా రాత్రి నశించిపోతోంది. కావుననే ఇంద్రుడు "అహల్యాయై జార"-అని సంబోధింప బడుచున్నాడు.

నిరుక్తంలో "అహల్యామైజార" అను శ్రుతి వాక్యమును వ్యాఖ్యానిస్తూ- "ఆదిత్యోఽత్ర జార ఉచ్యతే, రాత్రేర్జరయితా"అనగా సూర్యుడే ఇంద్రుడు. రాత్రిని పోగొట్టుటచే అతడు అహల్యామైజార" అని సంబోధించబడుచున్నాడు.

భట్టభాస్కరులు "అహల్యాజారుడనగా వాక్పరిణామకారకుడగు ఇంద్రుడని, "గౌరావస్కంది"....అన్న మంత్రంలోని గౌరశబ్దమునకు అద్యంత గ్రహణం చేత "గౌతమదార" అని గ్రహణమని వ్యాఖ్యానించారు.

ఈ వివరణల్ని పరిశీలిస్తే గౌతమ అహల్య ఇంద్రశబ్దాలు వేదంలో ప్రతీకాత్మకంగా ప్రయోగించబడ్డాయని తెలుస్తుంది. కానీ, వేదాలకన్న భిన్నంగా రామాయణాది కావ్యాల్లో రమణీయేతివృత్తంగా అహల్యకథ రూపుదాల్చింది. రామాయణంలో అహల్యా వృత్తాన్తం రెండు ప్రదేశాల్లో కన్పిస్తుంది. బాలకాండలోని వృత్తాన్తంలో అహల్య దోషిగా కన్పిస్తుంటే ఉత్తరకాండ వృత్తాన్తం ఆ దోష పరిహారం కోసం చెప్పబడింది. బాలకాండ కథలో ఇంద్రుడు గౌతమమహర్షి వేషంలో వచ్చినట్లు తెలిసికూడ అహల్య-ఇంద్రునిపై మక్కువతో-

"మునివేషం సహస్రాక్షం విజ్ఞాయ రఘునందన
మతించకార దుర్మేధా దేవరాజ కుతూహలాత్" 2

ఇంద్రునకు తనను తానుగా అర్పించుకొన్నట్లు వ్రాయబడగా, ఉత్తర కాండలో ఆమె తెలియక పోవుటచే తన భర్తయే ననుకొని అతని కోరికనుతీర్చి నట్లు వ్రాయబడింది.

---

1. యఏష సూర్య స్తపతి ఏష ఉ ఏవఇన్ద్రః-శతపథ బ్రాహ్మణము-4-5-94
2. వాల్మీకం-బాలకాండ-48-19 శ్లో

"అజ్ఞానాత్ ధర్షితా విప్ర త్వద్రూపేణ దివౌకసా
నకామకారాత్ విప్రర్షే ప్రసాదం కర్తు మర్హసి" 1

అని ప్రార్థిస్తుంది అహల్య. బాలకాండ కథలో అహల్య పాప నిష్కృతిని పొందగా ఉత్తర కాండలో ఇంద్రుడు పాపపరిహారాన్ని పొందుతాడు. గౌతమమహర్షి శాపాన్ని పొందిన ఇంద్రుడు-

"కుర్వతా తపసో విఘ్నం గౌతమస్య మహాత్మనః
క్రోధముత్పాద్య హిమయా సురకార్య మిదంకృతం" 2

సురకార్యాన్ని నిర్వహించ గలిగానన్న తృప్తితో దేవలోకానికి వెళ్ళిపోతాడు. ఇది క్లుప్తంగా అహల్యా వృత్తాన్తం.

రావణుడు సీతను అపహరించాడు. రాముడుద్ధరించాడు. అక్కడ సీత ఏ అపచారం చేయలేదు. కానీ రాముడు ఆగ్రహించాడు. సీతమ్మ అగ్నిప్రవేశం చేసింది. శుద్ధయైన సీత "దీప్తామగ్ని శిఖామివ" అన్నట్లు ప్రకాశించింది వాల్మీకంలో.

దేవకార్యం కోసం ఇంద్రుడు అహల్యానాక్రమించాడు. గౌతముడు కోపించాడు-శపించాడు. రామచంద్రుడుద్ధరించాడు. తపించిన "అహల్య" "దీప్తామగ్నిశిఖామివ" లాగా ప్రజ్వరిల్లింది.

హలమనగా నాగలి. సీత-నాగేటిచాలు. అనగా నాగలిచే ఏర్పడింది.

అహల్యా శాప మోక్షానంతరం మిథిలలో ప్రవేశించిన విశ్వామిత్రుడు శతానందునితో "రేణుక జమదగ్నిని కలిసినట్లు నీ మాతృమూర్తి అహల్య నీ తండ్రిని కలిసింది" అంటాడు. ఇచ్చట రేణుకా జమదగ్నుల ప్రస్తావన రాబోయే పరశురాముని ఆగమనాన్ని సూచిస్తోంది.

"సీతా, అహల్య"ల వృత్తాల్ని ఏకముఖంగా పరిశీలిస్తే రెండు విషయాల్ని మనం పరిశీలించవచ్చు. అహల్యా గౌతముల సమాగమం తరువాత సీతారామ కళ్యాణం జరగాలన్నది ఆది కవి నిర్దేశం. కళ్యాణానంతరం భార్గవుని ఆగమనం చెప్పనిసరి. ఆ విషయం తెలియజేయడానికే రేణుక జమదగ్నిని కలిసినట్లు అహల్య గౌతముని కలిసింది" అని చెప్పడం జరిగింది. చెప్పింది అహల్యాగౌతముల కుమారునితో. రేణుకా జమదగ్నుల కుమారుడు ముందు రాబోతున్నాడు. రాముణ్ణి

---

1. వాల్మీకం-ఉత్తరకాండ-30-44శ్లో
2. వాల్మీకం-ఉత్తరకాండ-49-2 శ్లో

కళ్యాణరామునిగా, శతానందుడు చేస్తే-భార్గవుడు కోదండరాముణ్ణి చేస్తాడు. ఒకతరం మారి వేరొక తరంగా రూపొందబోయే సంధియుగం. ఇది మహర్షి భావన.

యాగ సంరక్షణలో విజయులై విశ్వామిత్ర ద్వితీయులుగ మిథిలానగరానికి బయలుదేరారు రామలక్ష్మణులు.

విశ్వామిత్రుని కథలతోను, రామలక్ష్మణుల ప్రశ్నలతోను దారి తరిగిపోతూ కాలంసాగిపోతూ ఉంటే మిథిలోపవన ప్రాంతానికి చేరారు ముగ్గురు. వన్నె తరిగిన బంగారంలా, మేఘావృతమైన చంద్రబింబంలా, మాసిన అద్దంలోని ప్రతిబింబంలా అణగారిన కాంతితో ప్రకాశిస్తున్న గౌతమాశ్రమాన్ని చూచి, ప్రశ్నించాడు శ్రీరామ చంద్రుడు. "హంత! తే కథ యిష్యామి" అన్న నిట్టూర్పు విశ్వామిత్రునిది. భక్తుల కొఱకు కదలివచ్చిన కరుణాధాముడు శ్రీరాముడు. భర్తృ సాన్నిధ్యానికి దూరమై తపిస్తున్న సాధ్వీమతల్లి అహల్య. ఆమెకు శాపమోక్షాన్ని ప్రసాదించటానికై రాముడు ప్రశ్నించాడు రాముని ప్రశ్న వినగానే "హంత" అన్నాడు విశ్వామిత్రుడు.

ఆ నిట్టూర్పులో ఎంతో ఆనందం—ఒక మహర్షిదంపతులను ఏకంచేసే శుభ సమయం ఆసన్నమైందనే ఆనందం. ఆ ఆనందానికి తాను ఆధారమౌతున్నాననే ఉద్వేగం. ఎంతోకాలంగా కొనసాగుతున్న అహల్యాదేవి తపస్సు సఫలీకృతం కాబోతోందనే ఉత్సాహం విశ్వామిత్రుని చేత "హంత" అనిపించింది.

శ్రీరాముని పాదధూళి సోకి, అదృశ్య, నిరాహారయై తపిస్తున్న అహల్యకు అసలురూపం వచ్చింది. గౌతమాశ్రమంలో కలకూజితాలు వినిపించాయి. ఫలవృక్షాలు చిగిర్చి పుష్పించి, ఫలవంతాలు కాగా పూవాలలు శిరసులూపి అతిధులను ఆహ్వానిస్తున్నాయి. ఉగ్రతేజస్సంపన్నుడైన గౌతమమహర్షి ఆశ్రమంలో ప్రవేశించాడు. ఆ పుణ్యదంపతులకు పాదాభివందనంజేసి, వారి ఆశీస్సులను పొంది, మిథిలకు ప్రయాణ మయ్యారు కుశికసుత దాశరధులు.

మిథిలలో ప్రవేశించిన రాముడు శ్రీరాముడై కళ్యాణరాముడైనాడు. గౌతమాశ్రమంలో దంపతీపూజ యొనర్చి పెళ్ళికొడుకుగ రాముని మిథిలానగరంలో ప్రవేశింపజేశారు వాల్మీకి. ఇది ధర్మయుత ఆర్షసంస్కృతికి చిహ్నంగా భాసించింది. తన తల్లిని తండ్రితో కలిపిన పరంధాముడగు శ్రీరాముని పూజించాడు శతానందుడు. తను రామునకిచ్చినట్లుగా ఏర్పరచి దైవఋణం తీర్చుకొన్నాడు. రఘురాముడు సీతారాముడుగా కాగా లక్ష్మణుడు ఊర్మిళోపేతుడైనాడు.

ఆ యదృష్టం అహల్యాగౌతముల వంటి దంపతుల ఆశీః ప్రభావమేనని భావించవచ్చు. అది వాల్మీకి మహర్షి పరికల్పన.

ఈ ఘట్టంలో విశ్వామిత్రుడు చెప్పిన వృత్తాన్తంలో అహల్య దోషిగా "దేవ రాజకుతూహలాత్" అనే పదం వలన ముద్రవేయబడింది. బ్రహ్మ మానసపుత్రీ మహర్షి పత్ని దేవరాజకుతూహలమై జారయైంది. "సురకార్యార్థ" మిదమని ఇంద్రుడు తప్పించుకున్నా మగవారి రాచకార్యాలకు ఆడదిగా అహల్య బలైంది. జారగా మిగిలింది. అందుకే ఉత్తరకాండ వృత్తాన్తంలో ఇంద్రుని గౌతమునిగా భావించి ("త్వద్రూపేణ దివౌకసా" —అహల్య ఏకశయ్య అయినట్లు చెప్పి, బాల కాండలోని మాలిన్యం కొంత క్షాళన చేయబడింది కాని ఆడదాని మీద పడిన అప వాదు గాయం మానినా పోని మచ్చలాగా శాశ్వతంగా మిగిలిపోతుంది. అహల్య విష యంలో అదే జరిగింది. వేదాలలో ప్రతీకాత్మకంగా వాడిన అహల్యాజార శబ్దం అనంతర కాలికుల కావ్యాల్లో కల్పనల్లో రెక్కలు విదిల్చి విహరించి తుదకు అశ్లీలా ర్థమైంది.

వాల్మీకి మహర్షి "నైతికవర్తనను, దానిపై సమాజానికున్న బాధ్యతను తెలియజెప్పడానికి ధర్మప్రబోధాత్మకంగా అహల్యావృత్తాంతాన్ని వ్రాశారు. బ్రహ్మ మానసపుత్రియైనా, మహర్షి పత్నియైనా తప్పుచేస్తే శిక్ష తప్పదన్న హెచ్చరిక, ధర్మ ప్రకటనం మహర్షి ఉద్దేశ్యం. అయితే పసివానికి నిప్పుకాలుతుందని తెలియజేయుటా నికి సెగచూపిస్తే సరిపోతుందికాని అంగవైకల్యం సంభవించేటంతగా కాల్చలేము గదా! అహల్య విషయంలో రెండోది జరిగింది. అస్తిత్వానికే లోపం ఏర్పడింది. బాలకాండ-ఉత్తరకాండ కథల నడుమనున్న అంతరాన్ని పరిశీలిస్తే అహల్యాశీల సంరక్షణకు కవి చేసిన ద్వితీయ ప్రయత్నం మనకు స్పష్టమౌతుంది.

అహల్యాజారుడైన ఇంద్రుని శపించి అహల్యను సైతం "వాయుభక్షా నిరా హారా తప్యంతీ భస్మశాయినీ" అంటూ అదృశ్యగా తపించి రామచంద్ర స్పర్శచే పవిత్రీకృత గాత్ర కావలసిందని గౌతముని పల్కులుకాగా- "అహల్య" రాయిగ మారినట్లు అధ్యాత్మ రామాయణంలో కన్పిస్తోంది.

"దుష్టేత్వం తిష్ఠ దుర్వృత్తే 'శిలయామాశ్రమే మమ'
నిరాహారా దివారాత్రం తపః పరమమాస్థితా"1

---

1. అధ్యాత్మ-రా 5-బాలకాండ

ఆనందరామాయణ, సత్యోపాఖ్యానాలయందు సైతం శిలారూపమైనశాపమే అహల్యకు కన్పిస్తోంది. తులసీదాసు కూడా అహల్యను శిలారూపంగానే దర్శించారు.

బ్రహ్మపురాణంలో "శామస్యాహమునిః కోపాత్ త్వంచ శుష్కనదీభవ"
నదీభూత్వా పునారూపం ప్రాప్స్యసే ప్రియకృన్మమ"1

ఎండిపోయిన నదిగా శాపం-గౌతమీనదితో కలిసినపుడు విమోచనం చెప్పబడింది గౌతముని భార్యకు. పద్మపురాణం-అస్థి చర్మసమావిష్టా నిర్మాంసా నఖవర్జితా చిరం స్థాన్యసి2 .......

ఎముకలు చర్మము గోరను మిగిలి మాంసమును గోళ్ళు లేనిదానివై నలుగురు చూచు చుండగా చిరకాలముండవలసినదిగా శాపం అహల్యకు కన్పిస్తుంది. "అస్యాదోషో నచైవాస్తి దోషోయం పాకశాసనే"3 అని పద్మపురాణంలో రామచంద్రుడు అహల్యను సమర్థించటం సైతం మనకు కన్పిస్తుంది. విచిత్ర రామాయణాదుల్లో కన్పించే కథలు మరీ అశ్లీలవద్యోతకాలు. 'శప్తాహల్య'గ వాల్మీకినుండి అనేక కవుల, విమర్శకుల చేత దోషిగా నిరూపించబడ్డ అహల్యపాత్ర ఆధునికులను ఆలోచింపజేసింది.

విచిత్ర రామాయణాదుల్లోని కల్పనలవల్ల సిగ్గిలి విలపిస్తూ కన్పించే అహల్య రూపం ఆధునికుల కావ్యాల్లో అత్యున్నతంగ తీర్చిదిద్దబడింది. నిప్పుకు చెదలంట నట్లు గౌతమపత్ని అహల్య దీప్యమానాగ్నిగా వీరికావ్యాల్లో దర్శనమిస్తుంది.

"అహల్యాదేవిని దర్శించటానికి బయలుదేరిన భర్త యొక్క "విషపుటాలో చనల" గమనించి శచీదేవియే అహల్య రూపంలో గౌతమాశ్రమ ప్రవేశం చేసి, గౌతముని వేషంలో ప్రవేశించిన ఇంద్రుని కౌగిలిలో ఒదిగి, ఒకపతివ్రతను కాపాడిన కల్పన ఒకానొక ఆధునిక కవిది ఇక్కడ కళాపూర్ణోదయమందలి కలభాషిణీ మణికంధరులు, రంభా నలకూబరులు మాయా వేషాలతో కలుసుకోవడం ఈ కవికి ప్రేరణ కావచ్చు.

ఊర్వశీ పురూరవనాటకాన్ని ప్రదర్శించే నెపంతో అహల్యను, ఆమె కోడలిని ఇంద్రోర్వశులరూపంలో ఏకశయ్యా గతులజేసి, గౌతముని వల్ల అహల్యకు శాపం కలిగింప యత్నించిన అమృతకల్పనా ప్రాభవం వేరొక కవిది.

ఇంద్రజాలి విద్యతో అహల్యకు కలలో ఇంద్రసమాగమాన్ని కలిగించి, దాని వల్ల చెదరిన తలపులుగల అహల్యకు అనుకు మధ్యంలో మహేంద్రుని కౌగిలిని

---

1. అహల్య-పు. 5.
2. పద్మ-పు-సృష్టి–158-43
3. పద్మ-పు–సృష్టి-158–38

కలిగించి, అహల్యాప్రాతివ్రత్యాన్ని గ్రుడ్డిలో మెల్లగ ఒడ్డున వేయ యత్నించిన మార్మికత మరొకరిది.

పలురీతులుగ పలు తెరగులు పరుగెత్తిన ఆలోచనల్లో ఆవిర్భవించిన ఆధునిక కావ్యాల్లో అహల్య పతివ్రతా శిరోమణి. శ్రీరాముడు శిరసువంచి ప్రణామం చేసిన అహల్య వారి కోసమే గౌతమాశ్రమంలో శ్రీరాముని ధ్యానిస్తూ, తపిస్తూ, నిలచినట్లు వ్రాసి రామభక్తిని ప్రదర్శించిన భక్త్యావేశం ఇంకొకరిది. అయితే వీనిలో కొత్త పాత్రల ప్రవేశం సంభవించినా "గౌతమాహల్య ఇంద్రుల" వృత్తాంతం మాత్రం సమానంగా కన్పిస్తుంది.

## శ్రీ దువ్వూరి వారి అహల్య

అహల్యాశీల సంరక్షణలో తనవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నానన్న ఆనందాతిరేకంతో అహల్య కావ్యానికి శ్రీకారం చుట్టినట్లు కవి కావ్యంలోని విజ్ఞప్తి ద్వారా తెలియచేశారు.

"సీతాయనము" అనే పేరుగల పాళీభాషా రామాయణం నుండి ఈ కథను కవి స్వీకరించారు. సీతాయన రామాయణ రచయిత రామబ్రహ్మానందం.

"ఇతివృత్తమ్మున భిన్నవృత్తి, రచనాహేవాక, మాదివ్యని
ర్మితిలో భావనిబంధనానుగతి, యాత్మీమాతనద్రీతి, య
ద్భుతపాత్రౌచితి, యాదికావ్యమునయందుంబోలె జూపట్టు నా
కృతి "సీతాయన" మందు; రార్షముగ సాగెన్ దాని వాగ్వైఖరుల్" 1

అంటూ ఆ కావ్యంలోని కల్పనా వైశిష్ట్యం కథాకథన శిల్పము అచ్చెరువు కల్గించగా, "శశి" యని నినదించి లేఖిని కదిల్చానని ప్రకటించారు దువ్వూరి సూర్యనారాయణ శాస్త్రి. దీనిలోని కల్పన అద్భుతమైనదనడంలో అతిశయోక్తిలేదు. శతానందుని భార్యగ "జనతి", జనతి తండ్రిగా ప్రక్రవహుడు, అత్తకు ద్రోహం చేసిన జనతి శాటకిగ శాపాన్ని పొందడం మొదలైనవి నవ్యతతో దర్శనీయాలై, పాఠక హృదయాలకు "హాళివాటించి" ఆనందాన్ని కలిగిసాయి.

1. అహల్య—పు. 7

## జననాది

శ్రీ సరస్వతీ చతుర్ముఖులు ధర్మసంస్థాపన కొఱకు భూమిపై మహర్షి దంపతులుగా ఆవిర్భవించగా, వారికుదయించిన పుత్రికలు ఇరువురిలో అహల్యను తపోనిధియైన గౌతముడు పరిణయమాడాడు. వారి దాంపత్యం ననలుసాగి, లతలుప్రాకి, పుష్పించి ఫలించింది.

పున్నామ నరకాన్ని దాటించడానికి కొడుకు కావాలని మహర్షి, ముచ్చలుట తీర్చుకోవడానికి కొమార్తె కావాలని ఆ గాదె ఆశపడుతుండగా, ఆ ఇల్లాలు మగ బిడ్డను ప్రసవించింది.

పుట్టినంతనె నూర్నవ్వు లుట్టి పడుట!
బుత్రకుడు శతానందుడై పొదలుచుండె—(6ప.)

జోలపాటలతోటి, లాలిపాటలతోటి అందిశయ్యలు, ప్రాకులాటలతో బాల్యం గడిచిపోగా ఎనిమిదవ ఏట ఉపనయనాదివాల్ని పూర్తి చేసుకుని, తొలిచదువులు ప్రారంభించాడు శతానందుడు. ఆర్ష సంప్రదాయాలతో యావయౌవన సంపదలు పోటీ పడుతుంటే బ్రహ్మచర్య దీక్షతో ప్రకాశిస్తూ తండ్రి తపః క్రియలకు సాహాయ్యంగా మన్ననలందుకొంటున్నాడు.

అరవై గ్రామాలకు ఏలికయై సంగ్రామ రంగంలో సహస్రబాహువుగా పేరొందిన సమస్త కళావిశారదుడైన ప్రకృపహుని ముద్దుల కొమార్తె జనతిని పరిణయం చేశారు పెద్దలు శతానందునకు. సర్వకళా విశారదయై వంటవార్పులతో పాటు కావ్య లక్షణ తత్త్వాలను గ్రహించిన "జనతి" కాపురానికి వచ్చింది. శతానందుని ధర్మపత్నిగ అత్తమామలకు సేవచేస్తూ ఒప్పులకుప్పయై నాథుని అలరింపచేస్తూ-సంచరించిన జనతితో కొన్ని సంవత్సరాలు ఇష్టోపభోగాలను అనుభవించాడు శతానందుడు. -కొద్దికాలం తర్వాత ఆధ్యాత్మ విద్యారహస్యాల్ని గ్రహించటానికి "ధర్మరామం" వెళ్ళాడు ఋషిపుత్రుడు. "జనతి" ఆశ్రమంలో అత్తగారి వద్ద ఒంటరిగా మిగిలిపోయింది.

## వరదానము

గృహస్థాశ్రమ ధర్మ నిర్వహణలో తోడుగనిలిచి, పుత్రవతియైన సుగుణశీల "అహల్యను" ఏదైనా వరం కోరుకోమన్నాడు పతిదేవుడైన గౌతముడు. చిరునవ్వు నవ్వింది అహల్య.

"వరముల్ శీకరముల్; కృతార్థతలు మీవాల్లభ్యముల్ వంపదు
త్కరముల్ లేవె భవత్కృపావిలసనగ్రైవేయహారావళుల్"1

అనేసింది. "మీ ప్రేమాభిమానాలే నాకు కంఠహారాలు అంతకుమించిన వరాలెందుకు అంటూ ప్రేమోల్బణత ఉట్టిపడేటట్లు పల్కిన భార్యను చూచి, "ఈ యనులాపముల్ పలుకు చెందులకే మిసిమింతురాల! నేనే యిదువాడ!"నంటూ వరాన్ని ప్రసాదించాడు మహర్షి. నమితాంగియై ప్రసాదంగా స్వీకరించింది అహల్య.

"........లోకహిత మెంచి తలంచినకర్జమందు నీ
దే యగుగాక దిగ్విజయ,........"2 మనునది గౌతముని వరం. లోక కళ్యాణార్థం ఆవిర్భవించిన శ్రీరాముని కీర్తిని దిగంతాలకు వ్యాపింపజేసిన ఖ్యాతి అహల్యది. గౌతముడిచ్చిన వరం రాబోయే కధకు ప్రాణభూతమైంది. గౌతమాహల్యల దాంపత్య జీవితాన్ని మృదువుగా అందించిన ఈ సన్నివేశం అన్యరామాయణాదృష్టం.

## విజయము

కాలంలో మార్పు వచ్చింది. ప్రక్రవహుని రాజ్యంగుండా ప్రయాణంచేసి గౌతమాశ్రమం చేరే మహర్షి శిష్యుల్ని ప్రక్రవహుడు అడ్డగించి అటకాయించాడు. శిష్యులు మహర్షితో పలుమార్లు విన్నవించుకున్నా మహర్షి "కావలసిన వారలతో వైరములేల" అంటూ ఊరుకున్నాడు!

ముంగిలిలోవిద్యార్థుల వేదనాదాలు వినిపించక కారణం ఏమిటని భర్తను ప్రశ్నించింది అహల్య. వేదనాదాన్ని వినడానికి అలవాటుపడిన చెవులు అనడానికి అలవాటు పడ్డ నాలుక ఈ విధంగా ప్రశ్నింపచేశాయని సంజాయిషీ చెప్పుకొంటుంది.

"వియ్యంకుని" ఆవేశాన్ని, శిష్యులకు సంభవించిన అపదని దాచకుండా చెప్పేసి, దీన్ని తప్పించడం అసాధ్యమన్నట్లు మహర్షి మాట్లాడటం-చుట్టరికమవ్వల చూచుకొందమది శాటాయూటమై తోచినన్-అంటూ శిష్యుల్ని ఆదుకోమని ప్రార్థించింది అహల్య. కొంతసేపు వాదంసాగింది.

---

1. అహల్య–20–ప. 2. అహల్య–22. ప.

"శిలం గొనగోటను బో
నేలా గొడ్డలికి బరువులెత్తు టహల్యా!"(38 ప.)

అనేశాడు మహర్షి.

"ప్రజలు కారా మునుల్ ? మౌనభావ మిండ్లు
దగ్గ మౌచుండనా? యేటిధర్మ మార్య"(142 ప)

అన్న అహల్యతో సరే! నీ శక్తి చూద్దాము ప్రయత్నించమని ప్రోత్సహించాడు మహర్షి. "భవద్వచ ప్రభోవాదృతిలేదె వజ్ర కవచాకృతి" అంటూ సిద్ధమైంది ఋషిపత్ని. మీ ఆశీస్సులుంటే నాకు విజయం కరతలామలకమన్న ఇల్లాలిని చిరునవ్వుతో మహర్షి "తథాస్తు శిష్యజననీ సుఖమస్తు జయోఽస్తు"—అంటూ దీవించారు. మహర్షి ఆశీస్సులు ఫలించాయి, దౌత్యం విఫలంకాగా, యుద్ధంలో కోడలి తండ్రిని ఓడించి, రాజ్యాన్ని గౌతమ శిష్యులైన "ఉద్గవ్యుల" వశం చేసింది గౌతమ పత్ని. గౌతమాశ్రమం శిష్యులతో మరల కళకళలాడసాగింది.

## ఉపదేశము

వియ్యంకునికి పరాభవం, శిష్యసంతతికి విజయం లభించాయి. కక్షకట్టిన ప్రక్రవహుడు "అహల్య"ను అవమానించడానికి పథకాన్ని ఆలోచిస్తున్నాడు. ఇంతలో నారదుడు ప్రవేశించాడు. రంగం సిద్ధమైంది. ఈ కుట్రలో కోడలు "జనని" సైతం పాల్గొంది. శిష్య రక్షణకోసం, వేదవిద్యావ్యాప్తికోసం పోరాడిన ఋషిపత్ని కుత్సితబుద్ధుల కుట్రకు బలైపోయింది. ఈ పాత్రలు నేటి మానవప్రవృత్తికి ప్రతీకలు.

ఒక ఆడదాని చేతిలో ఓడిపోవడం-అందులోను బంధువు, వియ్యపురాలు, సాధ్వి, నీతివిశారద-ఒకదానికొకటి గుండెల ఉండల చుట్టివేసే విజాలు.

"ఓటమిమాటయే వ్రణమయో! యటుపై నబలాకృతమ్ము నా
బోటియు జుట్ట మే మనగబోల్ తలకొట్టుట లయ్యె నారదా!
దాటుదునేత్రపాజలధి, దాటుదునే వనవానదావమున్........"(50 ప.)

అంటూ ఆడదాని అధికారంవల్ల అహంకారం రేగి ఆయాసపడుతున్న ప్రక్రవహుని "సాధనకు దార్లు శతసహస్రములు గలవు" అంటూ ఉసిగొల్పాడు నారదుడు. చెవిలో

మార్గాన్ని ఉపదేశించారు. నారదుని ఉపదేశంలో భాగంగా ప్రశ్రవపూని దంపతులు గౌతమాశ్రమ పజ్జను కుటీరాన్ని నిర్మించుకొని ఋషివృత్తిని జీవించసాగారు.

## ఉపక్షేపము

కోడికూత ఆశ్రమప్రాంతమంతా ప్రతిధ్వనించింది. "ధర్మకాహళిగా విన్పించిన కోడికూతకు మేలుకొని నదీస్నానానికి సిద్ధమయ్యాడు మహర్షి.

ఇది నదికేగువేళ రమణీ! జపమాలయు గుండిక దెచ్చి యీ
గద్దె, యట దండెమందు మడిగా బడవైచితి నంగవస్త్రమున్
బదిలముగాగదే, మెలకువా విదురా యిది? బద్ధకింతువే
మదవతి! తెల్వి తెచ్చికొని మాపయనమ్ములు సాగనీయవే"(59 ప.)

అన్న మహర్షి పల్కులు బద్ధకించిన అహల్యను మేల్కొల్పాయి. బయటకు పార చూసింది అహల్య. వాతావరణంలో మార్పు ఉంది. ఆకాశంలో మేఘాలు క్రమ్ముకుంటున్నాయి. చలిగాలి, కారుచీకటి వర్షం ప్రారంభమైంది. ఈనాటికి ఇంటివద్దనే జపాదికాలు పూర్తిచేసుకోమని ప్రార్థించింది ఋషిపత్ని. "స్నానానికి వెళ్ళేవాడిని వర్షం బాధిస్తుందా? అంటూ నవ్వేశాడు మహర్షి.

"నీ కనుచూపు వెన్నెలరె పచరించును నాకు బాట" అంటూ చమత్కరించి, కోడలు అందించిన కమండలాన్ని తీసుకొని ప్రియకన్నుల వెలుగుల్లో చీకటిని చీల్చుకుంటూ నదీతీరానికి బయలుదేరాడు మహర్షి. ఇది గౌతమాహల్యల చివరికలయిక. ఆశ్రమవాసుల "పోతపాలు" గౌతముని హృదయ కలశంలో కలవకపోతే కథేలేదు. అందుకే కవి వీరి ఎడబాటు చివర్లో మున్నిత ప్రణయాన్ని చిత్రీకరించారు.

స్నానానికి బయలుదేరిన గౌతముడు వర్షం పెరగడంతో సమీప పర్ణశాలవైపు అడుగులు వేశాడు. పంచలో చేరిన మహర్షిని లోపలున్నవారు గుర్తించారు. ప్రసంగం "వింత"గ సాగింది. వారే "జవతి" తల్లి దండ్రులు.

వారి మాటల్లో అనేకమైన "అపస్వరాలు" దొర్లాయి. "మీకు అడమ్మల గోలేల" అంటూనే నెమ్మది నెమ్మదిగా ప్రశ్రవపూని భార్య-అహల్యశచీపతులు ఏకశయ్యాగతులై యుండగా చూశానని, అటువంటి ఆడదానితో ఆ మహర్షి ఎలా కాపురం చేస్తున్నాడోనని-కుమిలిపోతుంది.

"ఇంటను లేరు తా మొకపు డేగినదాన నహల్య జూడ నా
దంట శచీపతిం గలసి తత్పరభావన నేకశయ్యపై
నుంట యెఱుంగకే తలుపు లోరగ నుండుట లోవి కేగితిన్
కంటగిలెన్ మనంబు తదనంతరగాథలు త్రవ్వబోకుడీ!" (1 ప.)

అంటూ ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం అహల్యపై అపవాదుల జడివానను కురిపించారు. ఋషి వేషధారులైన వ్రక్రవహ దంపతులు. వానలో తడవ కుండ కుటీరపు ముంగిలికెళ్ళి నిలిచిన గౌతముడు ఆ అపవాదుల జడివానలో పూర్తిగా తడిసిపోయాడు. "ఏమి అహల్య–శచీపతి–ఏకశయ్య" అంటూ విశ్లేష్టుడై పోయాడు. బెండ్లినాటి విషయాలు తలపుకొచ్చాయి. ఇంద్రునిపై అనుమానంపెరిగింది అహల్యాజారయైంది. "జగజంతలు కాంతలు" అనేశాడు మహర్షి.

"............................మీ
పొంత సుఖించు టాది ముని ముట్టగ నోడుదు, నా వ్రతంబు లా
నంత లవెల్ల నాదుగ్రహచారము చాలక దాపురించె"–(75. ప.)

అంటూ ఇంద్రుని కౌగిలిలో నున్న అహల్య పల్కులుగా మహర్షికి విన్నవించారు కుట్రదారులు. అవమాన భారంతో క్రుంగిపోయాడు మహర్షి.

"ఎంతపాపాని కొడిగట్టితే యహల్య!
నన్ను నట్టేట దింపితే వన్నెలాడి!
గౌతమయశస్సు గంగలో గలిపి కులట!
యింద్రుతో గూడ నీమన పెట్టు లొప్పె" - 83. ప.

రోషకషాయిత నేత్రుడై పదంగల్లో పర్ణశాలకు చేరాడు మహర్షి. ముఖంలో కాంతి తగ్గింది. చిరాకు, పరాకులు పెరిగాయి. అనుమానాలు, శూన్యదృక్కులు వాచాతీత దుర్భావనలు మనసులో చోటుచేసుకుంటున్నాయి.

గౌతమీనదిని భూమికి తెచ్చి, గౌతముడుగ యశస్సు నార్జించిన మహర్షి యశస్సు గంగలో కలిసిపోయింది. ఇంక స్నానాలు–జపాలు ఎక్కడివి. విద్యార్థులు–వేదపాఠాలు లేవు. నిద్రదూరమైంది. రాత్రింబవళ్ళు "అహల్య–శచీపతి–ఏకశయ్య" తప్పితే వేరొక ఆలోచన మహర్షికి లేదు. ఉగ్రమైన తపోనిష్ఠలను, పవిత్రమైన బ్రహ్మచర్య దీక్షను వదలివేసి, గృహస్థాశ్రమాన్ని స్వీకరించిన మహర్షికి తాను

పరిణయమాడిన స్త్రీ "కులట" అని తెలిసినప్పుడు కలిగే పరివేదన ఈ సమయంలో ఎంతో రమ్యంగా ప్రదర్శితం.

"మౌనముద్ర లస్పష్టసంభాషణములు
కోపతాపము లాకృతిగోపనములు
తనకుటీకుట్టిమస్థితి, జాణుగుటలును
మౌనిచంద్రుని జీటికెలో మార్చివై చె"-(86. ప.)

అహల్యపై మహర్షికున్న అనురాగం, ప్రేమ, నమ్మకం ఇవన్నీ వమ్మయి, కోప తాపాలు ప్రజ్వరిల్లాయి.

భర్తలో కలిగిన మార్పుకి చలించిపోయింది అహల్య. కారణం తెలియడం లేదు. ఏదైనా తప్పు జరిగిందా! ఆలోచనలకందలేదు. భయపడుతూనే ప్రశ్నించింది. ఈ మార్పుకి కారణం ఏమిటంది? ఆగ్రహమా స్వామీ అన్న అహల్య ప్రశ్నకే కోపంతో ఊగిపోయాడు మహర్షి.

బొనిది నగ్ననాటిక యధార్థము, దీన గలట్టిభావమున్
జాణ లెరుంగరే యశికచా! నటనాపటుశక్తియుక్తులున్—అనేశాడు (89.ప)

"నగ్ననాటిక" పదంలో ఏదో ధ్వనించింది. సమాధానం సూటిగ చెప్పలేక పోతున్నాడు. ఎక్కడో విన్నమాటల్లోని యధార్థాన్ని గూర్చి భార్యను ప్రశ్నించలేని అసహాయ స్థితి—గుండెల్లో గాలమైంది మహర్షి పలుకు-అహల్యకు.

"..... .. ........మీ వాణియం
దది యెదో ధ్వని, గుండెగాల మగునర్థాపత్తి, మీచూపులం
దెదియో తీక్షణత................ (91 ప.)

భర్త ప్రవర్తనలో మార్పు సుకుమార హృదయాన్ని గాయం చేసింది. ఈటెలవంటి మాటలతో పీడిస్తున్నాడు. చేయని తప్పుకు శిక్ష సహించరాని వేదన.

"వ్యంగ్యపుటసల్ విషదిగ్ధము లమ్ములౌచు వన్ గఱచెడి, గంట్లువెట్టెడి మనమ్మున" అంటూ రోదించి నిజం మీకే తెలుస్తుందని పల్కిన అహల్యతో మాట మార్చి శతానందుని ఆరోగ్యాన్నిగూర్చి కబురువచ్చిందని, చూట్టానికి వెడుతున్నానని, శోదలిని ఓదార్చమని సుద్దులు చెప్పి, కొడుకుచెంతకు వెళ్ళిపోయాడు గౌతముడు.

## నాటక ప్రదర్శన

భర్త వెళ్ళిపోయినా ఆలోచనలు మాత్రం వదలలేదు. చింతాకులిత హృదయయై కూర్చున్న అహల్యను సమీపించి వేదనకు కారణం అర్థం కావడంలేదంది కోడలు. ఆ చూపుల్లోని భావాలు అమంలిత పూర్వాలు. మామగారి గమనాగమనాల్ని గూర్చి పలురీతుల ప్రశ్నించి, శోకిల్లుతున్న ఆమె హృదయానికి ఆహ్లాదాన్ని కలిగించడానికి ఒక నృత్యరూపకాన్ని ఏర్పాటు చేసింది జనతి. కుట్రదారులతో కలసి అత్తకు ద్రోహంచేయ తలపెట్టిన పాత్రగా కవి ఈమెను చిత్రించారు. 'ఊర్వశీ పురూరవ" రూపకంలో అహల్యచేత "ఊర్వశి" పాత్ర వేయించింది. మాటల గారడీతో అహల్యను అంగీకరింపచేసింది జనతి.

"ఊర్వశికి వంకలు దిద్దుమన్న మీదు
రూపురేకల భూమికాలోప మున్నె?" (109. ప.)

అన్న పొగడ్తతో అత్తగార్ని తనపన్నుగడకు అనుకూలంగా అయత్త పరిచింది. నారదుని ఆశీస్సులతో "జనతి" ఇంద్ర రూపాన్ని ధరించింది. అర్ధరాత్రి వరకు నాటక ప్రదర్శన కొనసాగింది. అలసిన అత్తాకోడళ్ళు మంచంమీద వాలిపోయారు.

"పాత్రధారిణు లలసటపడిరి: నాట
కాంత మగువలు కేకళయ్యెయు ఘటిల్లె:
కడచె నడురేయి; కన్నుల గప్పె సుప్తి
ఉన్నవా రున్నయటులె పరుండి రందు" 112-ప.

## శాపోపహతి

ఆలోచనాకులిత మనస్కుడై గౌతముడు పర్ణశాలలోఅడుగుపెట్టారు. అవమానంతో అనుమానంతో గుండెలు మండిపోతుంటే, నిద్రలేక కళ్ళుమండుతుంటే రాత్రి నాల్గవయామున పర్ణశాలకు చేరిన గౌతముడు—"జాల మార్గది దృష్ట ప్రసారితేక్షణుడై" ఏకశయ్యాగతులైన "కృత్రిమేంద్రునహల్య"ను చూచి స్తబ్ధుడై నిలువ శక్తి లేక, పంచపాళిలో కూలబడ్డారు. చెమటతో శరీరం తడిసిపోతుంటే, కోపంతో నేత్రాలు అగ్నికణాల వర్షిస్తుంటే, వణికిపోతున్న శరీరంతో పలురీతుల పరితపించాడు.

"ఏవో బాధలు జారిణీపతినటం చేవేవా దుర్భావనల్
ఏవోనిందలు, స్వాశ్రమంబు వృధ యం చేవో విరోధోక్తులే
వేవో తర్జనభర్జనమ్ములును బాపేచ్ఛల్ ప్రలాపమ్ములున్
లావుల్ దక్కి మహర్షి బిక్కి ముని నేలంగూలి వాపోవుచున్" (117 ప.)

"ఉమ్మనమింతగా బలిసెనోరి దిసన్పతి" అన్న కోపం – అతణ్ణి అని ఏం లాభం "మన బంగారానికే చిలుము కలుగ" అని అమెనని ఏం ప్రయోజనం. నాప్రారబ్ధం– ఇది. అవి పలుకీతుల దురపిల్లు మామను గమనించిన జనని తనదు స్తంత్రం సఫలమైనందుకు మనసులో నానందించి, ఆహార్యాన్ని మార్చుకొని, ఇంటి పనిలో మునిగిపోయింది.

మెలకువ వచ్చిన అహల్య ఉలిక్కిపడి లేచింది. పంచపాళిలో వినిపిస్తున్న మూలుగులకు తృళ్ళిపడి, లేచివచ్చి మహర్షిని చూచి "ఏమిట్లుంటిరి? మూల్గులేల కుళలంబేబిడ్డ" అంటూ బిడ్డ ఆరోగ్యాన్ని భర్త ఆరోగ్యాన్ని ప్రశ్నిస్తూ—"ఉంద బట్టలేక మునిని దటిసి, కంటిపాపల కలిపి చేనంటి యడుగ" బోయిన అహల్యను చూచి "అగ్గిమీద గుగ్గిల" మయ్యాడు మహర్షి.

"శాకెదవె నీదు చీకటి తప్పులెల్ల
గనుల గంటిని చెవుల వింటని" అంటూ

తిరస్కరించడమే కాక,

.... .... .... .... .... .... .... మునీంద్ర
శబ్దమువమిత మౌనచే చాన? కాక
తత్పురుష మౌనొ? పలవరింతలబె పవలె?" (127 ప.)

అంటాడు. మునీంద్ర శబ్దం ఉపమితమా లేక తత్పురుషమా? జారిణీ! జాతి గుండెల జాణవీవు" అని నిందించటమేకాక "మగని గొట్టి మోసాలెత్తు తెగువలెల్ల గొంచకే వంగనాచి!" అనేశాడు మహర్షి.

ఆ పల్కులు ముల్కులై అహల్య హృదయాన్ని భేదించాయి. ఘొల్లు మన్నది అహల్య.

"అహా! జారిణీ! జారిణీ! యనుటహల్యాజాని! నన్నా? యివే
యూహాపోహము ? — అంటూ ఆశ్చర్యపోయింది.

"జారిణి యనుట హల్యా జాని" అన్న పల్కు అహల్యా పాత్రకు సరి పోయిన ప్రయోగం. బిడ్డ సుఖంగా వున్నాడా? అసలు మీరు మీరేనా అనే సందే హంలో ఆవేదన అహల్యది.

"ఏల మీ చూపులో సెగ? లేల తీక్షణ
దీర్ఘనిశ్వాసతతులు? సంధింపనేల
గన్నుల గవోష్ణధార? లక్కజము మీర" (131 ప.)

అంటూ ఆశ్చర్యచకితయైన అహల్యను ఆ పే ఆవేశంతో మహాముని

"ఓసి! వగలాడి! చూచుచు నుండగానె
కనుల గారము చల్లెదే కౌలటేయి?
ఇంకనుం డాగురించెదవే కులఘ్ని!" (132 ప.)

"జారిణి, జాణ, సంగచాచి, వగలాడి, కౌలటేయి, కులఘ్ని" అన్న పదాలు అహల్యపై మహర్షి కున్న కోపానికి అహల్య శీలంపై మహర్షి కేర్పడిన దృఢాను మానానికి ప్రతీకలై పలుకుబడిలో వేడిని వాడిని సంతరించుకొన్నాయి. "సంగనాచి, వగలాడి" పదాలు తెలుగు భాషా సౌందర్య గుంఫితాలే.

"ఓ శిలామయి! కుమతి! వినోర్నరుచ్ఛవాద
నే? త్వదాకృతి శిల యౌగదే" (133 ప.)

అనేశాడు "అనుమానం" అహల్యను "రాయిగ" శపించింది. ఆర్షవాగ్వజ్రమై తగి లింది. "పదవె! నా దృష్టి తొలగి విర్భాగ్యురాల" అంటూ ఈసడించుకున్నాడు సహ ధర్మచారిణిని మహర్షి.

"అన్నా! మోహము, వట్టిభ్రాంతి, మునినాధా! జారిణీభావమా?" (134 ప.) అంటూ విలపించిన అహల్యారోదనం అరణ్యరోదనే అయింది. అహల్య శిలారూపు క్రమంగా ఆక్రమించుకొంది. ఆశ్రమ ప్రాంతంలో గాలి స్తంభించింది. గండశిలలు సైతం కరిగాయి. ప్రకృతి మూగగా రోదించింది.

"నిర్దోష నిర్దోష"నన్న అహల్యాక్రందనలు మహర్షి హుంకరింపులో మలగి పోయాయి. కోకిల కన్నెర్రజేసి ఆశ్రమాన్ని వదలివేసింది. లేడికూన బెదరిపోయి బెదురుచూపులతో బెంబేలుపడగా, జాజి తీగ పండిన ఆకులను కన్నీరుగా రాల్చింది

అప్పుడు మహర్షిలో ఆవేశం తగ్గి ఆలోచనకు స్థానం కలిగింది. యోగదృష్టి బరికించి, విన్నది, కన్నది అసత్యమని గ్రహించగలిగాడు. కాని సమయం మించి పోయింది. అప్పటికే కంఠంవరకు శిలగా మారిపోయింది అహల్యాసతి. భోరున విలపించాడు.

"కాంతగళమ్ము దాక శిలగానయితేయని కర్జవ ర్తియై" నీదేజయమని, సర్వేశు పాదధూళితో శాపమోక్షం ప్రాప్తిస్తుందని, తనక్షమాపణల్ని ఆమె ఆవేదనల్ని, శాప విమోచనాన్ని ఎన్నో సంగతుల్ని ఒక్క పర్యాయంగా చెప్పాలన్న ఆతృత ఆ సమ యంలో మహర్షిలో కలిగింది. పశ్చాత్తప్త, హృదయుడై గౌతముడు ప్రదర్శించిన ఆవేశం—అద్భుతంగా చిత్రీకరించబడింది. చేసిన తప్పుని ఏదోరీతిగా దిద్దుకోవాలని తన జీవిత భాగస్వామిని కాపాడుకోవాలనే ఆరాటం తపన అణువణువున గౌతము నిలో ప్రవేశించింది. అందుకే శిలగా మారుతున్న సహచారిణి చెవి యొద్దకువెళ్ళి "శ్రీరామ రక్ష నీకు" అంటూ ఆక్రందించాడు.

"ఏ నధర్మైకమతివి, సర్వేశుపాద
ధూళితో శాపమోక్షము దొఱకు నీకు" (161 ప.)

అనడమే కాకుండా—

రమణీ! నీకును నాకు శ్రీరామరక్ష అనేస్తాడు.

మహర్షి మాటలు చెవులబడ్డాయో లేదో గాని అహల్యరాయిగా మారి పోయింది. "గాజుబొమ్మ"గా మిగిలిపోయిన ధర్మపత్ని సన్నిధిలో జడపదార్థంగా మిగిలిపోయాడు గౌతముడు.

ఆదేసమయంలో శతానందుడు ఆశ్రమంలో ప్రవేశించాడు. "విధివిచిత్ర సంధానకౌశల మొకప్డు వింతగొలుపు గాదె" అంటూ ఈ సన్నివేశాన్ని పరిరక్షింము తున్నాడు కవి.

"నమః పితృభ్యః" అంటూ పర్ణశాల ముంగిలిలో మోకరిల్లిన శతానందుని ఎవ్వరు పల్కరించలేదు. "తేలుకుట్టిన దొంగ"వలె "జనని" పర్ణశాలలోనే ఉండి పోవడం ఈ సమయంలో గమనించదగింది.

"తండ్రి! తండ్రి! యటంచు నాతనయు డాడె
అమ్మ! అమ్మా! యటంచు నాయయ్య పిలిచె" (171 ప.)

కాని ప్రతిసమాధానం రాలేదు. లోపలికి ప్రవేశించాడు. ఎదురుగా—నిర్జీవ ప్రతిమగ తల్లి ఆమె ముంగిలిలో పరితాపపరీత వినమ్రమూర్తిగా తండ్రి—ఇక తనయుని ఆవే దన పత్త సముద్రాలకు పోటు వచ్చిన రీతి-అద్భుత కరుణారస విష్యంది సన్నివేశ మిది. తల్లికై బిడ్డ ఆవేదన ఇది.

"అమ్మా! అమ్మ! యటంచు లేచి యతి దత్యంతార్తుడై యాద తా
బొమ్మం జేరి కరమ్ములన్నిమురుచున్ బొంతం గృశీభూతులై
సొమ్మం గ్రుమ్మరుతాతపాదులను సంక్షుబ్ధాత్ముడై కాంచి, నే
త్రమ్ముల్ బిమ్మిటివోవగా బనపె సంతాపమ్ము రెట్టింపగన్" [172 ప.]
"అమ్మా! బొమ్మవ? అమ్మవా? పలుకవమ్మా! యీ పరిణామ మే
మమ్మా? యెవ్వరికృత్యమో నడువవమ్మా? యేల కారూపు, మా
యమ్మా? మూగవటమ్మ..........................." — [173 ప.]

అంటూ శిలామూర్తియైన తల్లిని పలురీతుల ప్రశ్నించి రోదించి తుదకు—

"...................తండ్రి! యిది యేమై యుండు? నీ పైన నా
కిమ్మా యుత్తర" మన్నాడు కాని ప్రయోజనంలేదు. అత్రుతను అపుకోలేక—
...............ఏలమీకు శ్రమ? నేనే దీని వీక్షించెదన్"

అంటూనే దివ్యదృష్టితో సర్వాన్ని తెలుసుకొన్నాడు ఋషిపుత్రుడు.

"మామమంత్రమ్ము, నారదమౌనియుక్తి,
జనతి వైకృతియున్ ఫలించిన వటంచు."—[174 ప.]

క్రుద్ధుడైనాడు శతానందుడు.

"ఓసీ! దుర్మతి! నాలిముచ్చ! యెట నోహో! పీడుపన్నాగముల్
వేసమ్ముల్ సఫలమ్ములా? జనతి! యీవే దర్శనం బోసి రా
కాసీ! అమ్మను బొట్ట బెట్టుకొని కుల్కంజూచితో, నిన్ను బల్
గాసిం బెట్టెద "తత్తథాస్తు" గురుధిక్కారంబు నీ కయ్యెడున్"-[175 ప.]

రాకాసీ! అని సంబోధించి "తత్తథాస్తు! అంటూ శపించేశారు.

పదవె! నాదృష్టి తొలగి నిర్భాగ్యురాల! అంటూ త్రోసిపుచ్చాడు శతానందుడు.
తండ్రికొడుకుల ఇరువురి కాపాల్లోను ఒకే పదం దొర్లింది. తండ్రికి తగిన కొడుగ్గా శతానందుని నిలిపిన కవి ప్రతిభ ఇది. యోగదృష్టితో చూసిన గౌతముడు "జనతి" చేసిన కుట్రకు కుమిలిపోయాడే కాని కోదలిని కోపగించలేదు. ఆ మహర్షి కోపం భార్యకు సంభవించిన విపరీత రూపువల్లనే సమసిపోయింది. మరి శతానందుడు—తన భార్యవల్లనే తన తల్లి తనకు దూరమైందని, తండ్రి విచారగ్రస్తుడైనా

దని తెలుసుకొని, విప్లవించాడు. కోపలిని శపించే స్థాయికి గౌతముడు దిగలేదు. ఆ యర్హత కట్టుకున్నవాడికే వుంది. బాధ్యత ఎరిగిన కొడుకు శతానందుడు ఆ పని ముగించాడు.

భయంకరమైన రక్కసిగా కంఠం వరకు రూపుదాల్చి శాపోపశమనం కోసం ప్రార్థించసాగింది జనని. కాని ఆమె మాటలు వినడానికి గాని, ఆమెవైపు చూడ్డానికి గానీ అంగీకరించని గౌతమ పుత్రుడు —

"తాకకే తాటకా! ముట్టకే కరాళి!
కుమతి! మాకొంప నష్టేట గూల్చినావె
నీకు శాపాంత మిదువాడనే పిశాచి!
ఆర్షతత్త్వము నీ కర్థమయ్యెనటవె?" — [185 ప.]

అంటూ హుంకరించాడు. అయితే పాదాలు వీడని ఒకనాటి భార్య వేదనకు నెమ్మదిగా మనసు ద్రవింప -

"............ఓసి రక్కసి మదంబిక కెవ్వడు తారకుండో, నీ
కును నతడౌ విమోచకుడు కుందకపొమ్ము" అంటూ [187 ప.]

శాపావసానాన్ని దయచేశాడు. మలయ కరూశాల్లో నివసించే "తాటకి" రూపాంతర జనని రామబాణంతో అనంతర కాలంలో మోక్షాన్ని పొందింది.

తల్లి జయించిన ప్రక్రవహుని రాజ్యంలో నుండి గౌతమ శిష్యులకు దారిని కల్పించి, మిగిలిన రాజ్యాన్ని మామగారి కందించి, పితృహితా చరణుడై మిగిలి పోయాడు శతానందుడు. కావ్యం ముగిసింది.

రామచరణ స్పర్శతో మోక్షమందిన అహల్యను గౌతమునితో కలిపి కావ్యాన్ని ముగించి ఉంటే రమ్యంగా ఉండేది. కానీ, కవి "అహల్య" నామాంకిత గ్రంథానికి "అహల్య"ను శిలగానే మిగిల్చి ముగించటం సాహితీ ప్రియులకు సంతృప్తి జనకం కాదు.

ఏమైనా అద్భుత కథా కథన శిల్పంతో, కవికి వ్యాకరణ శాస్త్రంపై గల అధికారంతో కూడా ఈ కావ్యాన్ని మనం రమ్యంగా దర్శించవచ్చు. "మిసిమింతురాలు" "వాగునెడంద" "ఆకుటిండులు" వంటివి వానిలో కొన్ని. "మునీంద్ర" పదాన్ని తప్పుపష, ఉపమితాల్లో విశ్లేషించడం నిశితం.

## స్ఫూర్తిశ్రీవారి అహల్య

దేవతా సార్వభౌముని ఎదలోని దుశ్చింతన తెలుసుకొని నాథుని క్రూర విషదంష్ట్రల నుండి అహల్యా సతీత్వాన్ని పరిరక్షించడం కోసం శచీదేవి అహల్యా రూపంలో గౌతమముని ఆశ్రమాన్ని చేరి ఇంద్రునితో "విందు" నారగించిన తీరు వర్ణించి అహల్యను నిర్దోషిగ ప్రకటించ యత్నించిన కావ్యం స్ఫూర్తిశ్రీ అహల్య.

శ్రీకాకరపర్తి కృష్ణశాస్త్రి సంస్కృత రూపకాధారంగ తానీ కావ్యాన్ని రచించి నట్లు కవి "ఆముఖము"లో చెప్పుకున్నాడు.

కాళిదాసుని లేఖిని కేళీ కలన
బ్రదుకు గాంచె దుష్యంతుడు భారతమున
కృష్ణశాస్త్రి చాతుర్యము కీర్తి నింపి
నతులయం దహల్యను సమున్నతికి తెచ్చె.

అన్న విశ్వాసమే కవిని కావ్య నిర్మాణానికి ప్రోత్సహించింది.

పైన చెప్పిన కల్పన తప్పితే ఈ కావ్యంలో క్రొత్తగకన్పించే సౌందర్యం మృగ్యం.

బ్రహ్మ తనకున్న అపప్రధ పోయేటట్లు సృష్టిలోని అందాలన్నీ కలిపి "అహల్య"ను సృష్టించాడు. వైదిక విద్యల్లో విష్ణాతురాలై యౌవన ప్రాంగణంలో అడుగుపెడుతున్న అహల్య గురుకులవాస శిక్షిత కావాలని, గౌతముని చేతుల్లో న్యాసంగ ఉంచారు. అహల్య నియమశీలియై మున్యాశ్రమ సంప్రదాయాల్ని అలవడ చేసుకొంది. న్యాసాన్ని భద్రంగా బ్రహ్మదేవుని కప్పగించాడు గౌతముడు. కుశల ప్రశ్నాదికం పూర్తయ్యాయి. కౌమార్తి వివాహ ప్రస్తావన తీసుకొచ్చారు విధాత. గౌతమమహర్షి బౌన్నత్యాన్ని కొనియాడాడు. వెళ్ళవస్తానన్న మహర్షితో—

"ఏమి గౌతమా! తొందర యింతయేల?
ఇంటనాలు బిడ్డలు నిరీక్షింతురేమి ?" – [17 ప.]

అంటూ బ్రహ్మచారిని గృహస్థుకమ్మని వ్యంగ్యంగా హెచ్చరించాడు బ్రహ్మ. సము ద్రంలోని అలలు ఆకాశానికెగరటానికి, మాధవీలత మామిడిగున్నను కౌగలించుకోవ డానికి, వెన్నెల జిలుగులలో భూమాత పులకించడానికి కారణం ఏమిటో చెప్పగలవా? అన్నాడు విధాత బ్రహ్మచారి గౌతమునితో.

"కారణమ్ము పరస్పరా కర్షణమ్ము
దేవ!" అని వచించె మహర్షి "శాపకో క్త
మైన ఆకర్షణమ్మది మానవాళి
పట్ల పై తము సత్యమై వరలునేమొ!" (21 ప.)

అంటూ అర్థోక్తిగా ఆపేశాడు అబ్జభూతి.

"కవివి నీవు సరస్వతీకాంతుడవును
కల్పనాతీత కల్పనా కారణుడవు" (24 ప.)

అని తప్పుకొన్న గౌతముడు బ్రహ్మదేవుని మాటల్లోని "గూఢత"ను ఆలోచిస్తూ ఆశ్రమాన్ని చేరాడు.

కాలచక్రం తిరిగింది. కౌమార్తె పరిణయాన్ని పురస్కరించుకొని బ్రహ్మదేవుడు ఎల్లరకు ఆహ్వానాలు నారదుని ద్వారా పంపించారు. సత్యలోకంలో శంకరుని ఎదుట వివాహం ఏర్పాటు చేయబడింది. గొప్ప గొప్ప వాళ్ళందరూ విచ్చేసిన నాటి సభకు దేవేంద్రుడు ప్రత్యేకాలంకారాలతో ప్రత్యక్షమయ్యాడు.

"పెండ్లి పెద్దయై విలసిల్లె విశ్వవిభుడు;
క్షితి వరి సర్వజగత్ప్రదక్షిణము పణము;
అఖిల సౌందర్యరాశి అహల్య వధువు;
సౌర వర సమాజము ప్రతిస్పర్ధి జగము" (31 ప.)

పందాన్ని విని కొంతమంది ముందుగానే తప్పుకోగా ప్రయత్నం చేసి జారుకున్న వారు కొందరు. దేవేంద్రుడు మాత్రం హుటాహుటిని ఆ ప్రయత్నంలోనే ఉద్యమించాడు. ఎనిమిది కళ్ళతో పరికిస్తున్న బ్రహ్మదేవునికి మాత్రం మనసులో గౌతముడే అల్లుడు కావాలనుంది. ఆ మహోభావనాబలం వ్యర్థంకాదు. గౌతమమహర్షి ముని సంఘంనుండి లేచివచ్చాడు. పీతరాగుడైన మహర్షి రాగసమేతుడయ్యాడు. కనులలో అరుణకాంతులు సుడులు తిరగ్గా శరీరం పులకలతో నిండిపోయింది. చెలికత్తెలమధ్య నుండి అహల్య గౌతముని చూచింది.

"గౌతముని మానసించె పంకజభవుండు
గౌతము డహల్య వాంఛించె; గౌతముని వ
రించె నామె; ఇద్దర మదయించె ప్రేమ
సబల భావ తరంగ ప్రసారఫలము" (44 ప.)

పరమేశ్వర దంపతుల్ని మూడుసార్లు ప్రదక్షిణం చేసి

> "నిన్ను చుట్టివచ్చుట యన్న నిఖిలలోక
> చయము చుట్టివచ్చుట........" (48 ప.)

అంటూ ప్రకటించిన గౌతముని "జేత"గ ప్రకటించారు పారిషదులు. అహల్యా కర గ్రహణం చేసి గృహస్థుడైనాడు గౌతముడు. 1

అహల్య గౌతమునికి దక్కడంతో విరహవేదనకు గురయ్యాడు దేవేంద్రుడు. పలురీతుల అహల్యా సౌందర్యాన్ని తలచుకొని దురపిల్లాడు. ఆవేశం హద్దులమీరి, ఆలోచనలు విస్పష్టమై పరుగులుతీశాయి.

> "పాల కరళ్ళు సుళ్ళగొను భాతి త్వదీయ పయోధరస్థమౌ
> చేలము వాతపోతముల చేతులలోబడి చుట్టుకొంచు ఆ
> లోలము నొచు నా మనసు లోతుల జొచ్చి విరాళిహెచ్చను
> ద్వేలముగాగ త్వచ్ఛిదయ పీడి గమించిన దంతలోననే" (16 ప.)

అంటూ చీరకుచ్చిళ్ళ నుండి సర్వావయవాల్ని తనివితీర వర్ణించుకొని అహల్యను మించి స్వర్గముండునే ? అనే స్థితికి వచ్చేశాడు స్వర్గాధిపతి. "రంభోరు! రంభాదులే నీకాల్గోరునకైన కారు వదవె! నిర్జింత మాకంతువినో" అన్న పలవరింతలు ఇంద్రునివి.

కోడికూతవిని మెల్లగా నిదురమేల్కొంది అహల్య. చిక్కులచీకాకుగొన్న చీరను సరిచేసుకొని, జడను సర్దుకొని పతిదేవుని పాదాలకు ప్రణమిల్లింది. నెమ్మదిగా నాధుని చెక్కిలి ముద్దుల నిదురలేపింది. బడలికగా కదిలాడు గౌతముడు.

అర్ధరాత్రమిదేమి పనియె అన్నులమిన్న" అన్న భర్తతో చాలు వేగినది లెండని" నిద్దురలేపింది అహల్య. అలకన్నులు మలుముకుంటూ లేచి, అవసర సామాగ్రితో అనుష్ఠానానికి నదికి వెళ్ళిపోయాడు గౌతముడు. అనుష్ఠానం పూర్తయినా తోటిమునులు ఎవరూ కన్పించలేదు. ఉదయకిరణాలు వికసించలేదు. పక్షి కూతలు లేవు. పూలపరిమళాలు లేవు. ఆదుర్దాగా ఆశ్రమానికి చేరాడు మహర్షి.

ఇంతలో పర్ణశాలలో ప్రణయధోరణులు ప్రబలాయి.

---

1. వాల్మీ ఒ- 30 వ ప్రశ్న 1.

"ఒందొకళ్ళ యొదళ్ళు తాక
నొక్కపై శయనించువారి
బొండుమల్లె నునుగేసరము
పొదుగు కొన్నటు లున్న వారి" (11 ప.)

చూచి చండప్రచండుడై గర్జించాడు మహర్షి. తడబాటుతో అహల్య శయ్యదిగి లోపలి గదిలోకి పారిపోయింది. ఇంద్రుడు ఎదురుపడ్డాడు.

"నా రూపులో వచ్చి యిట్లు
నాకాంత గిలుపాడి నట్టి
నీరూపు వేయింత లౌత !
నీ నీచ వాంఛను బట్టి !" (13 ప.)

అని ఇంద్రుణ్ణి—

అరణ్యకుల మధ్యనంత
నాత్మల నమ్ముకొందుమటె!
గౌరవహీన! అహల్య !
కఠిన పాషాణి వౌదువటె!" (13 ప.)

అహల్యను అభిశపించాడు మహర్షి. మునిశాపం వెల్వడునంతలోనే అరణ్యమధ్యం నుండి అహల్యాదేవి ఆక్రందన హృదయ విదారకమై విన్పించింది.

"ప్రాణేశ! చూచుచు నుంద
మనము తనువును రాయి వలె
మారుమన్నవి నాకు స్వామి !" (14 ప.)

అహల్యా విలాపం మహర్షిలోని కోపాన్ని మింగేసింది. ఆగ్రహం చల్లారిపోయింది. అయోమయావస్థ ఎదురుగా ఇంద్రుడు. లోపలి గదిలోనుండి అహల్యారూపంలో శచీదేవి వచ్చి మహర్షి పాదాల వ్రాలిపోయింది.

"పాపాంధ కూపాన మునిగి
ప్రాణేశు దేమౌనో యనుచు
కాపాడు మార్గమ్ము వెదకి

కర్తవ్యమ్మును గనుంగొనుచు
నా పూలు పసుపుగుంకుమలు
నావిగా నిల్పుకో దలచి" (18 ప.)

తాను చేసిన పని చెప్పుకొని, "మౌనీంద్ర నీవు గాంచినది, మమ్మె, అహల్య లేదించు" అంటూ అహల్య నిర్దోషిత్వాన్ని కార్యకారణ సమన్వయంగా నివేదించింది శచీదేవి. దీనుడై పోయాడు మహర్షి. గొంతుకో తడపాటు, కళ్ళలో విన్నబాటు దోప–కాళ్ళలో స త్తవలేనట్లు క్రుంగిపోయి,—

"దేవేంద్రు తలపు దోసమున
దేహమ్ము భరియించు కీడు;
నీవంటివారి-కన్నులకు
నేత్ర సహస్ర సుందరము!" 24 ప.

అంటూ శాపాన్ని శాంతింపజేశారు. పాపమెఱుగని అహల్య సంగతేమిటని ప్రశ్నించింది శచీదేవి.

"పాపవిధికి పశ్చాత్తాప పథముగలదు
నిత్య పుణ్యను నేను మన్నించుటేమి
తనకు కలుగకుండునె మీదదైవమొకడు" (25 ప.)

నిత్యపుణ్యశీలకు క్షమాపణలేదు. రామచంద్రుడొచ్చాడు అహల్యననుగ్రహించారు. అహల్య యొనర్చే స్తోత్ర పాఠంతో కావ్యం ముగుస్తోంది.

ఈ రచన కొంత వాల్మీకి అడుగుజాడల్లో నడచినా తక్కిన కల్పన అంత సముచితమనిపించుకోలేదు.

## ఆచార్యులవారి అహల్య

"అహల్య"పై నున్న అభిమానంతో కవి కావ్య ప్రారంభం చేశారుగాని కావ్యాన్ని ఏవిధంగా ముగించాలో, అహల్యా చిత్రణలో ఏ మార్పులు చేయాలో సరియైన నిర్ణయం తీసుకోకపోవడం వలన కావ్యంలో అనిర్వచనీయతా స్థితి ఏర్పడింది. ఈ స్థితికి నిదర్శనం - స్వప్నవృత్తాన్తం కవి కల్పిత ఈ వృత్తాన్తం కావ్య

కథకు పూర్తి ప్రయోజనకారి కాలేకపోయింది. ఇంద్రాహల్యల కలయిక కంలో, కౌగిలి బాహ్యజగత్తులోను సంభవించాయి. "అహల్య" మలినమైంది.

"ఆయమ కన్యయౌనా, భువనైక పతివ్రత యౌనో, ఐంద్రకా
మాయత మానసాంతర సమావృత రాగరసైకమూర్తియో, —

ఏయది "ఇత్థ" మంచు వచియింపగలేను-అంటూ కవి ప్రదర్శించిన దోలాయమాన స్థితియే కావ్యమంతా కప్పిస్తుంది.

## అహల్య

గౌతమ మహర్షి ఆశ్రమంలో అహల్య - పొలబుగ్గల నుండి జాలువారుతున్న కన్నీటిని కొనగోట గెంటివైచుకొనుచు, "కాషాయవల్కల గుప్త నవ్య మధుర యౌవన మూర్తియై" కావ్యారంభంలో ప్రత్యక్షమవుతుంది. ఆమె వేదనకు కారణం—కామవాసనే-తపస్వీగ నిత్య ఏకాంతాన్ని అభిలషించే మహర్షి ఈమె మక్కువలను తీర్చడం లేదు.

"ఆ మహాసీయ సిద్ధి బడయంగ పతమ్ము తపమ్ము జేయుచే
తా మది ధ్యేయ మంచెపుడుదల్చును - గావి - కుటీరమందహ
ల్యా మృదు ముగ్ధమోహన విలాస కలా సుకుమార యౌవన
శ్రీముఖదర్శనం బెపుడు జేయగ గోరదు గౌరమండెటుల్!" (పు. 6)

మహర్షి పత్నిలోని విచారానికి కారణం — పత్ని తన యౌవన శ్రీముఖ దర్శన లోలుడు కాకపోవడం — బ్రహ్మమానసపుత్రి ముఖాలకు దురపిల్లుతోంది.

## ఇంద్రుడు

అహల్య గౌతమాశ్రమంలో "యౌవన ముఖాల"కై ఎదురుచూస్తుంటే అక్కడ మహేంద్రుడు "అహల్య యౌవన సంపద" తనది కావాలని ఆరాట పడుతున్నాడు. వియచ్చరాంగనల పాదమంజీర నాదాలపై మనసు నిలవక—అహల్యా దరహాస మోహన ముఖాంబుజ సుందర దర్శన స్పృహోన్మాద తరంగ భంగిమల నాట్యమే మనస్సులో నటిస్తోంది. ఆమె తన అంకపీఠికారోహించినట్లు కలలు కనేస్తున్నాడు.

అణువణువున అహల్యారూపం అలమికోగా ఆగలేక ఆమెను చూడాలని బయలుదేరాడు. ఆశ్రమం చేరి—దివ్యాంగనా సహస్ర పరిపూర్ణ సుందరతాతిశయమూర్తీభవించునట్లున్న ఆమె సౌందర్యాన్ని చూచి చేరబోయిన ఇంద్రుడు—

"సత్య శివ సుందరాత్మక నిత్యభాస
దివ్య పూత పాతివ్రత్యతేజ మరసి" — (పు. 8)

భయకంపితుడై నిలిచిపోయాడు. శృంగార రసం భయానకమై విజృంభించ వెను తిరక్క తప్పలేదు. కాని మోహపాశం ముందుకే లాగుతోంది. విరహప్రాప్త మరణాన్ని తప్పించుకోవడానికి మార్గాంతరం లేక "దైవికపూర్ణ సిద్ధుల్ని" ప్రార్థించి అహల్యపై ఇంద్రజాలాన్ని ప్రయోగించాడు.

"ఇంద్రజాలాంతర మగ్నమానసిక"యై ఆమెయు—
"ఒక్కపరి విద్యుదాఘాత మూర్ధ్వలోక
ములకు విసరినరీతి — నమోఘశక్తి
ఏదియో తన ప్రకృతిని పాదుకోర
పెకలించినరీతి దోచగ భీతిజెందె!"—(పు. 9)

ఏవియో స్వప్నలోకాల్లో తేలిపోతున్నట్లు,దివ్యరమ్యానుభూతికి లోనయింది."ఇంద్ర" జాలం అహల్యను అవాఙ్మనస స్థితిలో ముంచివేసింది.

## తొలి చూపు

శరత్కాలపు సాయంత్రంలో లేత చలిగాలులు పులకరింతల కలిగిస్తుంటే- పూవులు గుచ్చుతుంటూ, ఎదలో పొంగెడి మధుర భావాల తీపి ఊహలు పెదవులపై చిరునవ్వుల వెలయిస్తుండగా—"సమయమవి" మెల్లగా ఇంద్రుడు అహల్య చెంత వాలాడు. ఉలిక్కిపడింది ఋషిపత్ని. భర్తలేని సమయంలో వచ్చిన మహేంద్రునికి చేయవలసిన సత్కారాలను గూర్చి ఆమె భయపడింది· ముగ్ధనయనోత్పల కాంతులు వెండువట్లుగ విచ్చిపోయింది. విశ్చేతనత ఆవరించింది· బిత్తరపోయి — విజవెల్ల తమాలత పుల్కరించగా తత్తరపాటు జెంది విచ్చిపోయిన అహల్యలో పెద్దన వరూధిని సాక్షాత్కరిస్తుంది.

ఆమెతొట్రుపాటు చూచి,మదిలో కోరికలురేగ పెదవులపై చిరునవ్వులు చిప్పిలగ—"గౌతమ మహర్షునెట" యని గద్గదికంగా ప్రశ్నించాడు దేవేంద్రుడు. తలుపుల నోరలాగి నగము కప్పించెడిలాగ విచ్చి -

"ఆయనలేరు - ఇట్టి సమయంబున స్వర్గరమాధి నాథులే
ఈయెడ కేగుదెంచిరి – అభీప్సిత మేదో యెరుంగవచ్చునా"

అని ప్రశ్నించడమేకాక —

"ఏ యనివార్యకారణము లేవియు లేకయె రాదుగా తప
శ్ఛాయలు చెంగలించు విలసన్మునికోటి కుటీరవాటికిన్!"—(పు. 11)

అంటూ అధిక ప్రసంగం చేస్తుంది ఇంద్రజాలాక్రమిత అహల్య. ఈ సంభాషణా నేపథ్యంలో "శోకమనుటోదియ" చేరి విల్చిన వరూధినే పాఠకులకు దర్శనమివ్వటం గమనించవచ్చు.

అహల్య ప్రశ్నతో మనసులో మాటను బైటపెట్టేశాడు ఇంద్రుడు.

"లోకమోహనమైన యలోకమూర్తి
కలసి యైక్యము జెందెడి కాంక్ష తీవ్రి
తపము జేయు, నహల్యాచ్ఛదారిణికయి
వెదకుచును వచ్చినాడ నీనేళ తవ్వి! — (పు. 11)

వెతుక్కుంటూ వచ్చానన్నాడు. కోరిక తీరకపోతే మరణమే శరణ్యమన్నాడు. ఆశ్చపోయింది అహల్య. ఓరకంట చూచి ఒక నవ్వు విసిరేసి—రంభాదులు తిరస్కరించారా? యౌవ్వనంలో వైరాగ్యమెందుకు అని ప్రశ్నించడమేకాక – మీ బాధ వెళ్ళి మీ శచీదేవితో చెప్పుకోండి - మీ బాధలకామె ఏదో ఒక ఉపశమనం చూస్తుందంటూ ఉచిత సలహా పారేసింది.

అయితే వచ్చినవాడు పదిమంది ఆడవారితో పరిచయమున్న మగవాడు. మాటకారి అందుకే వెంటనే అనేశాడు.

"ఈ విధంబైన యూహ నాకింతవరకు
తోచనేలేదు-గౌతముతోడ లేపు
వాదు కోరికయును చెప్పరాదె? మీర
లనిన "ఫక్కున" నవ్వె నా యతివ లోన!" — (పు. 13)

ఫక్కున నవ్వింది అహల్య. గుండెకు గాయమైంది ఇంద్రునకు. నా కోరిక తీరస్తావా? లేకపోతే వజ్రాయుధంతో ప్రాణత్యాగం చేస్తానని, ఎత్తి పట్టిన ఆయుధాన్ని అడ్డుకొన్నది అహల్య. "ఆ గదిలో పూలసెజ్జపయి హాయిగ" దస్తానంటూ బయలు దేరిన మహేంద్రునితో –

"అంతటి త్యాగమూర్తులవి యందరకున్ విశదంబెకాని-మీ
రంతగ దొందరింప వల దాగుడు – కాలుని తోకజెప్పి యే
కాంతము నాపుజేతు" – (పు 14) అంటూ ధైర్యం చెప్పి -

"ఋతు కాలముగా" దని చిన్నినవ్వుతో
సుంతగవించి యొదలను-"దూడుడు కోడియెకూయదా"

అంటూ రహస్య నిర్దేశం చేసింది. "కోడికూత"కు అవకాశమిచ్చి ఋతుకాలం కాదని ఏకాంతం చూద్దామన్న అహల్య "దేవరాజ కుతూహలాత్" అన్న బాలకాండలోని అహల్య కాని సురకార్యం కొరకు ధర్షించబడ్డ గౌతమపత్నికాదు.

## స్వప్నానుభూతి

తీయని బాధలో నిదురించిన ఆ పేద గుండెకు కోడికూత విన్పించింది. గాఢ మైన కామన స్వప్నంలో కోడికూత. ప్రియుని గొంతులోకవ్పించిన సంగీతంలాగ కలలో మెల్లగా మేల్కొంది అహల్య. కన్నులు తెరిచి చూస్తే మహర్షి స్నానానికి వెళ్ళిపోయారు. "శూన్యశయ్య" వెక్కిరించింది. ఇంతలో —

"నన్నవి తెల్లరేఖ కనులందాయల "తళుకు"ని కానిపించుచున్
తిన్నగ కాంతిగోళ పరిధీకృతమై మిరుమిట్లు గొల్పి దీ
ప్యన్న వమోహనంపు మధుభావము మూర్తిని దాల్చివచ్చి తా
నున్న మృదుప్రసూన రుచిరోజ్జ్వల శయ్యను జేర నామెయున్!" (పు. 15)

ఆమె సైతం ఆ మహాకాంతి మహర్షిలోని బ్రహ్మతేజమనుకొంది. తెలియరాని అను భూతికి లోనయింది. "మధుర స్పర్శ" శరీరాన్ని వివశను చేసింది అరమోడ్పు కనులతో, వేడి నిట్టూర్పులతో "హాయి" శరీరాన్ని ఆక్రమించింది.

"మధుర వేదన యపాదమస్తకముగ
శరీరి విద్యుత్తరంగమై పరుగుపెట్ట"—(పు. 16)

గొంతులో ఎంతోకాలంగా దాగి వున్న "ఒక్క శబ్దము" మెల్లగా వెలికివచ్చింది. ఎదురుగా ఇంద్రుడు. జరిగిన ఘోరానికి వెక్కి వెక్కి ఏడ్చింది. ఆవేశం, కోపం కలసి ప్రవహించాయి. మనసు మెత్తపడింది. దారుణ శాప సంధానసిద్ధమైన హృద యం ఎందువల్లనో వివశమైంది.

"…. …. …. …. …. …. …. ….ఆమె
ఋతువు సమయంబు కాదిది మతిచలించె
నెందుకని" యన-ఇంద్రుడు నేమొ-యనియె! — (పు. 17)

మళ్ళీ "కోరిక" రెక్కలువిప్పి ఎగిరింది. మొలకనవ్వులు మోముపై ముసురు తుంటే అహల్యను మరల మంచం మీదకు లాగబోయాడు ఇంద్రుడు. తాపసివచ్చె నని తప్పించుకొంది. తిరిగి దర్శనం ఎప్పుడంది. ఇదేతీరంటూ సమాధానం. కాంతి పుంజం ఆకాశంలోకి ఎగిరింది.

అది కలో విజమో అర్థంకాలేదు. అవయవాలను తడుముకుంటూ తెలియ రాని అనుభూతిని పొందింది అహల్య.

తెల్లవారినా శయ్యపై నుండి లేవలేని విచిత్ర ప్రవృత్తి. స్వగతంలో ఏవో ఆలోచనలు.

## నిర్ణయము

జరిగిన దానికి బాధపడలేదు అహల్య. మునికి తెలిస్తే ప్రమాదమన్న భావన మాత్రం ఉంది. "దేవరాజకుతూహలాత్" అన్న ఆది కవి వాగ్విశేషమే.

వివాహ సమయం నాటి పందాన్ని నిందించింది. స్వయంవరాన్ని గర్హించింది. ప్రియోపభోగ సంభావితమైన జీవితాన్ని ముని ఆత్మతృప్తికై వదలివేయడానికి అంగీకరించలేదు. ముని కోపించినా సరే —

"ఈ మధురానుభూతికయి యెన్ని వసంతములో తపించి యు
న్నాము–జగన్నియంత కరుణారస దృక్కులజూచి మమ్ము–స్వ
ర్గామల దివ్యసౌఖ్యముల నందగ గూర్చి — అనంతరంబు నే
నేమయినన్ సరే-బ్రతుకునీడ్చెద–రాయిగ మారిపోయినన్!"—(పు. 21)

రాయిగమారిపోయి శిక్షను అనుభవించడానికైనా సిద్ధపడిందిగాని ఆ సుఖాన్ని మాత్రం విడిచిపెట్టలేకపోయింది పీరి అహల్య.

## రహస్య వేదన

ఆలోచనల్లో లోచనాలు అశ్రుపూరితాలైనాయి. ఏదో మాట్లాడుకొంటుంది. ఎందుకో నవ్వుకొంటుంది. అలసిపోయిన రీతి నిట్టూర్పులు. ఇంటి పనిలో ఇష్టంలేని రీతి. పనిసగంలో ఆపివేసి ఆలోచనల్లోకి మునిగిపోతోంది. మొలకనవ్వులు-ఎవరైనా పల్కరిస్తే వింతగా కళ్ళు పెద్దవిచేసి చూడటాలు పరిపాటైపోయాయి.

ఏపని చేయబోవ-కలయే తలముక్కగ గుర్తువచ్చి - సం
తాపము జెంది కూర్చొను-వితర్దిక-చెక్కిట చేయిజేర్చి — (పు. 23)

కారణం అడిగినవారికి కన్నీరే సమాధానం.

## మ ధ న

ఆలోచనల్లో అంతర్మధనమొదలైంది. తనస్థితి, అనంతరకాల మందు తన గతి అర్థమైంది. ఈశ్వరునిపై నిలవక మనస్సు పరిపరివిధముల పోవడానికి కారణ మేమిటో తెలియడంలేదు. ఈ సంబంధానికి పూర్వజన్మబంధ మేదైనా కారణమేమో ననే సందేహం ఆమెలో కలుగుతోంది. అర్థంకాని ఆవేదన, ఆర్తి ఆమెలో గూడు కట్టుకొంటున్నాయి.

## పునర్దర్శనము

అధిక ఆలోచనలవల్ల ఏ విషయమైతే యోచిస్తున్నామో, మళ్ళీ అక్కడకే వెడుతుంది మనస్సు. రాత్రింబవళ్ళు ఆ ఇంద్రుని గూర్చి ఆలోచనలు. మర్చిపోవా లనుకొన్న కొద్దీ అధికమౌతోంది. శరద్రాత్రి వెన్నెలలో ఆశ్రమోపాంత భూము లలో విహరిస్తున్న అహల్య చెంతకు చేరాడు ఇంద్రుడు. ఉలిక్కిపడింది అహల్య. ప్రక్కగ నిల్చోనిన వానిని చూచి—

"ముక్కున వ్రేలినుంచి యిక ముందర నిద్దరి కింక జీవితం

దక్కరలేద?—ఏమి ప్రభువా! ఇటువచ్చుట? వేళలేద?" (పు. 26) అంటూ ప్రశ్నించింది. కలలో జరిగిన సమాగమం ఇలలో సంభవించింది. భయపడింది అహల్య. -వెళ్ళమని, జీవితాన్ని కాపాడుకోమని ప్రాధేయపడింది. కానీ ఆగలేక పోయాడు ఇంద్రుడు-కౌగిలిలో బంధించాడు.

"....అహల్యను కౌగిట నదిమి కొనుచు
తన విశాల వక్షంబున తనివి దీర
నున్ననౌ బుగ్గలన్ ప్రేమ నొక్కి మెల్ల
మహువు దను మేఘ గంభీరమందరమున" - (పు. 26)

అహల్యా సౌందర్యాన్ని చూడటానికి వెయ్యికళ్లు కావాలన్నాడు. కోటి స్వర్గాలైన, వెయ్యికోట్ల శచీదేవులైనా "అహల్యా ప్రియత్వం" ముందు కొరకేనన్నాడు.

## శా ప ము

ఇంతలో "అహల్యా" యనెడి గౌతముని పిలుపు అడవిలో పిడుగువలె ప్రతి ధ్వనించింది. కౌగిలి విడిపోయింది. భూమి కృంగిపోతున్నట్లు సప్తసాగరాలు ఒక సారి పొంగినట్లు, అగ్ని తమచుట్టూ అల్లుకొన్నట్లు భయపడిపోయాడు ఇంద్రా

హల్యలు. నేటరాజు భూమికి దిగివచ్చినట్లు, నృసింహుడు విజృంభించినట్లు చక్ర త్రిశూలాలు రెండు కలసివచ్చినట్లు ప్రత్యక్షమయ్యారు క్రుద్ధ గౌతముడు. ఆకాశంలో దేవతలు ఆర్తనాదాలు చేశారు.

"శప్తయైన యహల్య పాషాణమయ్యె
ఆ మహేంద్రుడు గూడ దుష్టాంగుడయ్యె!" - (పు. 28)

దోషులు తలలు వంచేశారు. సమస్త దేవతానీకము ప్రార్థించింది శాపావసానాన్ని అర్థించింది. తప్పుచేసిన వారు మాత్రం నోరుమెదపలేదు. వారినేరం క్షమార్హమైనది కాదని కవిభావన. అందువల్ల వారి పక్షాన దేవతలే ప్రార్థించారు. శాంతించిన మహర్షి విమోచనాన్ని ప్రసాదించారు.

## ఆత్మతృప్తి

తన వేదనను పరోక్షంగా రామునితో విన్నవించుకొంటుంది శిలారూప అహల్య. ఆమె పల్కుల్లో ఎన్నో వాదనలు, వేదనలు, శ్రుతులు, అపశ్రుతులు విన్పిస్తాయి. కలలు తనంత తాకలుగుతాయి. తనకు తానెలా బాధ్యురాల్ని అంటూ ప్రశ్నిస్తుంది అహల్య. తన తండ్రి నిత్యకన్యాత్వాన్ని సృష్టించినప్పుడే తనకిచ్చాడని, బ్రహ్మవాక్కు నాలోచించక భర్త శపించాడని ఆయనపై పితూరి.

పాపంచేశానని నీవు రావడం ఆలస్యం చేస్తున్నావనే అలక, అసలు నీవు వైకుంఠం వదలివచ్చిందే నావంటివారికోసం, నీవు రాకపోవడం ఎలా సంభవం. నావంటి శాపవిదగ్ధజీవులు నీకై ఏడుస్తూ ఎదురుచూస్తుంచే ఆలస్యం చేస్తావేమిటనే బెదరింపు. నీవుతప్ప నాకు దిక్కెవరున్నారనే అహంకారత్యాగం, ఆత్మనివేదన ఒక పరిణామావస్థలో అహల్యలో కనిపిస్తాయి.

శ్రీరాముడు విశ్వామిత్రుని వెంట నడుస్తున్నాడు. "రామా" అనే ఆర్తనాదం అరణ్యమంతా ప్రతిధ్వనిస్తుండగా, అర్థంకాని అనుభూతికి లోనై ఆవేదన చెందిన శ్రీరాముడు గురుదేవుల ప్రశ్నించాడు. అడుగుముందుకు వేయించాడు విశ్వామిత్రుడు.

"కదలినది రాయి-అట నమస్కారముద్ర
తోఁచ కరకంజయుగము ముందునకు వచ్చె
మంచు తెరదీయు కమలము మాడ్కిఁదోచు
ముఖకమల మెత్తిచూచె రాముని అహల్య!" - (పు. 45)

దొషమాత్రమంలో రామచరణధూళి రాతివినాతిగ మార్చింది. నిరీక్షణ ఫలించింది. 'వెతుకుతున్న శిల' లభించింది. భువనమోహనరూపాన్ని విశాలనేత్రుడై వీక్షించాడు శ్రీరాముడు. తన కొఱకు నడిచివచ్చిన రామయ్యను కనులెత్తి దర్శించింది అహల్య. ఆమెకన్నుల్లో ఆనందనీరాజనాలు. రామయ్య కన్నుల్లో అనుగ్రహ పారిజాతాలు.

"అమ్మ!" యని రామచంద్రు డహల్య నవియె-
అప్రయత్నముగా - ముఖ మల్లె చూచి-
"నాయనా! రామచంద్ర! ప్రణామమనియె
అ ప్రయత్న గద్గదిక నహల్య గూడ!" — (పు. 46)

'ఆత్మతృప్తి' ఇరువురిలోను మిగిలింది. భక్త రక్షణలో కృతకృత్యత భగవంతునిది కాగా, భగవంతునికై చేసిన నిరీక్షణ ఫలించి భగవద్దర్శనం వల్ల కలిగిన తృప్తి భక్తురాలిది.

ఈ కావ్యాన్ని పూర్వోత్తర భాగాలుగా విభజిస్తే - 'శాపము' వరకు పూర్వ భాగమై మిగిలిన భాగం ఉత్తరభాగమౌతుంది. శాపానంతరం సాగిన రచన అహల్య నిరీక్షణ, రామావతారం, శాపమోక్షము, ఆత్మతృప్తి మొదలైనవి పునరావృత వృత్తాలు అధికమై విసుగునుకల్గిస్తాయి. భావాలకై వెతుక్కున్నపట్టులు సైతం ఎక్కువ. శీర్షికలే పునరావృతమవ్వడం ఇందుకు నిదర్శనం. భక్తిని క్రమ పరిణామంలో అహంకార త్యాగ ఆత్మార్పణలను నిర్దేశించడానికి కవి ప్రయత్నించారు.

పూర్వభాగంలో 'స్వప్నవృత్తాన్తం' పెట్టి కలలో ఇంద్రాహల్యల సమాగమాన్ని కల్గించి, తిరిగి అరణ్యమధ్యంలో ఇంద్రుని కౌగిలిలో అహల్యను నిలిపి, తుదకు పాఠకులకు కలో—నిజమో తెలియని స్థితి తీసుకొచ్చారు. అహల్య రామునితో 'ఆత్మనివేదన' చేసుకుంటూ కలలో జరిగిన దానికి తాను బాధ్యురాలనా? అని నిలదీస్తుంది. అంటే కవి 'అహల్య'ను ఏదో 'నూత్నసృష్టి'గా కాపాడాలని ప్రయత్నించారు. తత్పరిణామమిది. అహల్య వాదన కొన్ని యెడల 'విపరీతవాదన'కు దారితీసి, 'చీకటితప్పు'ని సమర్థించుకొనే ఆలోచనలే కన్పిస్తాయి.

కావ్యంలో 'ఖండికలవిభజన' అధికమై - రసాస్వాదనకు, కథాగతికి అవరోధాలౌతాయి. కవి కావ్యాన్ని ఏదో కారణాలవల్ల రెండు దశల్లో పూర్తి చేసినట్లు కన్పిస్తుంది. పైన చెప్పిన కారణాలన్నీ అందుకు నిదర్శనాలే. —

## శ్రీ బొడ్డుబాపిరాజు వారి అహల్య

అహల్యావృత్తాన్తంలోని కొలికిపూస ఆమె పశ్చాత్తాపం. పశ్చాత్తాపరహితగా అహల్యను సంప్రదాయవాదులు స్వీకరించ లేకపోయారు. చేసిన తప్పుకు – శిక్ష అనుభవించడం తప్పనిసరిగ భావించిన సమాజమది. కోపించిన భర్త ఇచ్చిన శాపం - తెలిసి చేసినా తెలియకచేసినా కలుషితమైన శరీరానికి తపన - తప్పని సరి. రామచంద్రునికై ఎదురుచూస్తున్న 'అహల్య నివేదన' బాపిరాజుగారిది.

"ఒక యాకర్షణకున్ వశంబయి తదీయోత్సేకమున్ నిల్వజా
లక చేజేతుల త్రెంచివైచితి చిరప్రాలంబి సౌశీల్య వ
ల్లిక; నెమ్మోమున గ్రామికొంటి నిశరాత్రింబోని దుష్కీర్తి, దా
నికె ఈనాబ్రతుకెల్ల వ్రేల్చెద తపాగ్ని జ్వాల నిన్నాళ్ళుగా.

క్షణికమైన ఆకర్షణకు లోనై బంగారం వంటి కాపురాన్ని కాలదన్నుకొని 'అర్థరాత్రి' వంటి దుష్కీర్తిని పైన వేసుకొని, దాన్ని పోగొట్టుకొనే ప్రయత్నంలో తపిస్తున్న అహల్య పల్కులివి.

"మలినంబైన చరిత్రతో కటికి హేమంతంబులెన్నెన్ని ని
శ్చల పాషాణ తపస్సులో నిదళితాశాభిన్న హృత్తంత్రులన్
విలపింతున్ పలవింతు నీ కొరకు తండ్రీ! నీ పదచ్ఛాయ నా
తలవ్రాలున్ ప్రభువా! శమింపగ హృదంతస్తాపముల్ పాపముల్"

ఎన్నో కటిక హేమంతాల్లో, తెగిన ఆశలతో విలపించిన భగ్నజీవి అహల్య. అమృతకలశం లాంటి నిండైన జీవితం ఇంద్రుని మోహమనే నేలపై ఒలికి పోయింది.

"కాదనలేక యింద్రియ వికారమునంబడి సాధుజీవన
స్వాదుమరందపూర్ణ కలశమ్మును భగ్నమొనర్చుకొన్న యు
న్మాదిని యా యహల్య యలనాడె నశించెను, స్వామి! నేడు నీ
పాద రజమ్మునంటొడమి వచ్చు మరొక్క యహల్య రాఘవా!"

ఇంద్రియ వికారం భరించిన అహల్య ఏనాడో కృశించిపోయింది. తపించిన దేహంతో రాముని పాదధూళికై ఆరాటపడుతున్న అహల్య గౌతమమహర్షి పత్ని. "రామచంద్రుల పేయడుగు జీవుళ్ళ నవ్వడియె నాగుండెన్ మ్రోయుచున్నది చల్లగ" అంటూ శిలారూపంలోనే చెవులు రిక్కించి రామునకై ఎదురుచూసే "నిరీక్షణా హల్య" బొడ్డు వారిది.

---

1. అహల్య - భారతి - ఆగస్టు - 46 – పు. 164

## శ్రీమానాప్రగ్గడ వారి అహల్య

శ్రీమానాప్రగ్గడవారి 'అహల్య' నామాంతర శ్రీపాదరేణువు 'కావ్యం ఆత్మ నివేదన కావ్యం. 'అహల్య' నేపథ్యంలో స్త్రీజాతికి ఆనాటినుండి ఈనాటివరకు జరుగుతున్న అవమాన పరంపరలను ఏకరువు పెడతాడు కవి. సంసార జీవనంలోని ఒడిదుడుకులు, పూర్వాపరాలు, ఆలుమగల అనురాగ విరాగాలతోపాటు చీకటితప్పు వంటి "చిన్న తప్పు"లు చేస్తే దానికింత 'శిక్ష' అన్నంత అభ్యుదయవాది ఈకవి.

"కదలగ లేని రాతికిని–గాలిని–వెల్గును-వానజల్లు–వె
చ్చదనము-పొందు స్వేచ్ఛ సహజమ్ముగ నున్నది- సృష్టిలోన గొ
ప్పదనము తెచ్చుకున్న మగవారలు–లేమల చిన్నచూపుతో
వదలని దాస్యశృంఖల నిబద్ధలు జేయుట నాయమా! ప్రభో!!"—(40. ప)

నియమరహిత స్వేచ్ఛాలైంగిక జీవనం ఆడవారికి కావాలనే వాదన వీరి అహల్యది. మగవాడు తన చిన్ననాటి ప్రేమ కబుర్లు ఎన్నయినా చెప్పవచ్చుకాని ఒక ఆడది "తప్పిపోయిన తన చిన్ననాటి మనువును గూర్చి యోచించుట తప్పా! అని నిలే స్తుంది అహల్య.

"ఒక పొరపాటు-దైవికమెటో –మిడిమేలముగా-తటస్థమై
న-కరుణవీడి-క్రోధమున-నమ్మిన జీవన భాగ ధేయమున్
కొకిబికి చేతల న్విడువ గూడునె! కాంతులొనర్చు నేరముల్
నకియలు-చేదు మ్రింగినటులన్నవరించిన గాక రాఘవా!"—(69. ప)

"ఒకర్ని ప్రేమించి, మరొకర్ని పెళ్లాడి, ఇంకొకదానితో సుఖపడగోరే మగవాడు తన భార్య ఇంకొక మగవాణ్ణి చూడటానికే ఇష్టపడడు. ఇదేమి న్యాయం "అని అహల్య శ్రీరాముణ్ణి ప్రశ్నిస్తే ఏకపత్నీవ్రతుడైన ఆ మహాపురుషుడు మాత్రం ఏమన గలడు-అందుకే జీవిత రహస్యాన్ని—

"మనసు మనసు కలియ-మనువగుజోడికి
తనువు తనువు కలియ మనువు కాదు

16)

మనసులేని మనువు-మాసుతో చెలిమి-జీ

విత రహస్యమిదియ-వినవె!రామ!!" —(22.ప)

"మనసులేని మనువు" గౌతమునితో అహల్య పరిణయమని ఇచ్చట అహల్య భావనై యుండాలి.

ఈవిధంగా ఆవేశకావేశాలతో, నిందలు నిష్టురాలతో సాగిన "ఆత్మనివేదన" వంద పద్యాలవరకు సాగి, అక్కడి నుండి హఠాత్తుగ భక్తి నిష్యందియై "చరణ రజమ్మె నాకు శరణమ్మయి—ఉమ్మలికమ్మె జిమ్ముతన్" అనే మకుటంతో అర్థ శతాధికంగా కొనసాగటం ఆశ్చర్యకల్గించి వీరి అహల్యలో వచ్చిన మార్పును గుర్తు చేస్తుంది.

"పురుషులకైన మోహమును పుట్టగ జేసెడు-నందగాడు ముం

గురులు చలింప-కర్ణముల కుండలకాంతులు-పంచకట్టుతీ

రొరపిడి రాచపుట్టువయి-ఒద్దికముద్దులుగారు-రామ వం

చరణ రజమ్మె-నాకు శరణమ్మయి-ఉమ్మలికమ్మెజిమ్ముతన్"

పూర్వ పద్యాలకు, ఈ పద్యాలకు, భావ విశ్లేషణలోను పదగుంఫనలోను తేడా స్పష్టంగా కన్పిస్తుంది ప్రథమభాగంలో "అహల్య"విప్లవకారిణిగ, కన్పిస్తే-ఈ భాగంతో పశ్చాత్తప్త హృదయంగా దర్శన మివ్వడం గమనించవచ్చు. ఎంత "బ్రహ్మగన్న చిన్నదైనా" అహల్యలో కవి తీసుకురా యత్నించిన తిరుగుబాటు ధోరణి అహల్యపాత్రను కప్పివేసి ఆధునిక నాగరికతామత్తులైన స్వేచ్ఛా ప్రవృత్తులను గుర్తుచేస్తోంది.

"ఈ కృతికర్త కవితారీతి బహుప్రౌఢంగా, జాతీయోక్తి సూక్తంగా మృదు పుణా మధురంగా ఉన్నది. ఈలాంటి దుర్వాద పోషక రచనకు ఉపయోగించక సాహాజిక చైతన్యోద్దీపకమైన రచనకు ఉపయోగించవలసినదిగా వలషో యిష్టున్నాను" అన్న విమర్శకుల మాటలు పురుషాధిక్య ప్రపంచంలో విజాణుగావే కన్పిస్తున్నాయి.

ఏమైనా "మానాప్రెగ్గడ సుబ్బారాయకవి" అహల్యలోని "విపరీత ప్రవృత్తి సమర్థనీయంగా లేదు. అహల్యాశీలసంరక్షణ కవి దృక్పథమేకాదు కాబట్టి "పాపచిత్రణ" ప్రస్తావనేరాదు.

## శిష్ట్లావారి శప్తాహల్య

వాల్మీకి 'అదృశ్య'గ కల్పించ చేసిన గౌతమ పత్ని కవులకావ్యాల్లో 'శిలాకృతి' గ నే దర్శనమివ్వడం చూస్తే అధ్యాత్మరామాయణ ప్రభావం సమాజంపై, ఎంతగా ఉందో మన కర్థ మవుతోంది. 'శిలారూప' గా అహల్యకు శాపం అధ్యాత్మ రామాయణం లోనిదే. జరిగినదాన్ని గూర్చి మీమాంసగాని, పశ్చాత్తాపం గాని లేని నిర్వి కార శిల శప్తాహల్య.

"పాతివ్రత్యము జాలిమై దెలియ జెప్పంజాల నేజాగృతిన్
సుప్తావస్థ వచించితావమతినై జోగంగనే జాల — సం
తప్తాంతర్హృదయమ్ము చిమ్ము విపరీతజ్వాలలన్ మ్రిగ్గెదన్ -
శప్తాహల్యను! రామపాద సరసిజంబెంచి కేలొగ్గెదన్.

సంతప్తాంతర్హృదయాగ్ని జ్వాలల్లో తపిస్తూ రామునికై ఎదురు చూస్తోంది. 'శిలా రూపంగ' ఉండమని శపించిన ఆ పతిదేవుడు గౌతమర్షి మనసుని మాత్రం బంధించ లేదు.

"నాలో నాకు శరీరముం గలఁగు-నంతర్దృష్టియుం గల్గు -చే
గాఁకల్ మాత్రము రావు-నాల్కయును బల్కంజాల దొక్కింత-ఈ
శైలాకారము స్వామి కింపిదని నాస్వాంతమ్ము సాంతమ్ముగా
నేలామూయదు? మన్మనోవ్యధయు దానేలానమున్ బాయదో!

బాహ్య చైతన్యం లేక, అంతశ్చైతన్యం కలిగిన జీవి వేదన ఇది. కాళ్లు చేతులు కద లవు. నాలిక పల్కదు కాని ఆలోచనలు, ఆవేదనలు రోదనలు కొనసాగుతూనే యున్నాయి. భరించలేని విచిత్రస్థితి. రాముని కొరకు ఎదురుచూస్తూ, చేతలు లేని చైతన్య స్థితిలో తపస్వినిగా అహల్య. సీతమ్మ మీద మనస్సుతో రఘురాముడు ఇటు వెళుతూ తనను రక్షిస్తాడనేది ఆశ. కాని ఇంతలో ఎవరన్నా ఈ దారినవెడుతూ రాతి పై కాలిడి వేస్తారేమో? అయితే ఏమౌతుంది? ఏమో?

"దావదగ్ధంబు మనమ్ము-పై తనువు జూత్రింబున్న దీయాకృతిన్-
భువనాధారుడు రాముడుర్వితనయా బద్ధిన్ బ్రయాణించుచు
న్నెవరేన్ దాపుల నుండి యేగుచును గాలిరాతిపై మోపి, నా
భవ మోక్షంబు కుప్పకూల్చుదరయా! బ్రహ్మాయువుల్ మీకగున్"

---

1. శప్తాహల్య -శిష్ట్లా సత్యనారాయణ రాజశేఖరం-భారతి-1956 జూన్-పు. 8. 9

రామపాద స్పర్శతో భవమోక్ష కాంక్షియైన అహల్యకు ఎవరైనా రాతిపై కాలిడి, కావిరూపు తెప్పిస్తారేమోననే ఆవేదన చమత్కారంగా ఉంది. వసుచరిత్రకారుని నుండి రామాభ్యుదయ కర్తవరకు ఈ క్షణంలో ఒక్కసారి గుర్తుకొచ్చేస్తారు! రాలపై కాలు వెట్టడాలు రూపు మారడాలు మధుర భావనలై ప్రబంధ యుగంలో గుబాళించాయి. శిష్టావారి రచనలో తత్పరిమళాలగాలులే వీస్తున్నాయి.

## అ-హల్య వీక్షణం

వేదాల్లో ప్రథమంగా కన్పించే అహల్య ఆధునిక సమాజంలోకి అడుగుపెట్టే వరకు అనేక రూపాల్లో దర్శనమిస్తోంది.

శ్రీ దువ్వూరి వారి అహల్య అద్భుత కల్పనా కావ్యంగా రాణకెక్కగా, స్ఫూర్తిశ్రీ అహల్యా శిల సంరక్షణలో కొంతవరకు సఫలీకృతులైనారనే చెప్ప వచ్చు. ఇంద్రజాల ప్రభావంతో పాఠకులలో సత్యాసత్యాలు తెలియలేని స్థితి నల్లాన్ చక్రవర్తుల వెంకటాచార్యులు వారిది. మహిళా సమితుల్లో స్త్రీల హక్కుల చర్చించే స్థాయిలో మానాపెగ్గడ వారి అహల్య ఆధునీకరించబడింది.

బొడ్డు బాపిరాజుగారి అహల్య పశ్చాత్తాప హృదయంతో కృశీభూత గాత్రియై రామచంద్రుని కోసం నిరీక్షిస్తుండగా-శిష్టావారి అహల్య రామునికోసమే ఎదురుచూస్తూ అంతశ్చైతన్యం గలిగిన అద్భుతపాత్ర. శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారి "రూపనవ నీతంలో" అహల్యనందించిన రీతి ఆధునికుల ప్రశంసలనందుకొంది.

"అహల్య పూర్ణ దాక్షిణ్యమూర్తి. చింతామణి కామధేనువులకు నాథుడైనవాడు ఇంద్రుడు. యజ్ఞయాగాదులలో పురుహూతుడు. అప్సరస కులానికి అధిపతి. అట్టి వానికికామలాలనతీరింది కాదు. అతనిచేతము అహల్యాముఖలక్ష్మి బద్ధమైవిహ్వలించింది. దానితో దేవేంద్రుడు అకించనుడై అతికృపణుడై యాచ్నాదీనుడై దాక్షిణ్యగుణకుల్య అయిన అహల్యనుకావ్యభిక్ష పెట్టమనిఅర్థించెను. ఆమహాపతివ్రతకు అదిదుస్తరమైన దుస్సంధితరుణం. అటు దాక్షిణ్యంలోకరిగిపోతుంది;ఇటుశీలభంగమునకు తప్పిస్తుంది. తుదకు తన స్త్రీచైతన్య స్వభావమే గెలిచింది. తనజీవక్షీరములను దారవోసి ఆమరేంద్రుని బ్రతికించి తాను పాషాణమైపోయింది" ఉ అన్న భావన రాయప్రోలు వారిది.

'హల్యత'లేని రూపంలో అహల్యను దర్శింపజేయయత్నించిన కవుల ప్రయత్నాలు తెలుగు సాహిత్యంలోకొనసాగుతునే వున్నాయి. సాహితీప్రియులకు 'అహల్య' మరిచి పోలేని పాత్ర.

---

1. క) శ్రీ భూపుత్రీ వివాహ వేళ........ ..........వసుచరిత్ర–1.వ.
   ఖ) అలజవరాలు .......................రామా- 5. 106.
2. ఆధునికాంధ్ర కవిత్రయ శారదా సమారాధనం-పు. 41.

# ఊర్మిళ

ఊర్మిళ రామానుజుని ఇల్లాలు. లక్ష్మణుని అగ్నిసాక్షిగా పరిణయమాడి అయోధ్యానగర అంతఃపురంలో అడుగుపెట్టిన దశరథుని కోడలు. జనకరాజర్షి ఔరసపుత్రిక. సీతాసాధ్వి ముద్దుల చెల్లెలు. 'సీతాయాశ్చరితం మహత్' అంటూ సీతా కథాగానంలో మునిగిన వాల్మీకి ఊర్మిళను మరల పల్కరించలేదు.

జనకుని కొమార్తెగానే వాల్మీకంలో ఊర్మిళ ప్రస్తావించబడింది.

'సీతాం రామాయ భద్రంతే ఊర్మిళాం లక్షణాయచ

వీర్యశుల్కాం మమ సుతాం సీతాం సురసుతోపమాం

ద్వితీయామూర్మిళాం చైవ త్రిర్దదామి నసంశయః 1

అంటూ జనకమహర్షి తన రెండవ బిడ్డను విశ్వామిత్రాదులకు పరిచయం చేశాడు.

లక్ష్మణాగచ్ఛ భద్రంతే ఊర్మిళా ముద్యతాం మయా

ప్రతీచ్ఛ పాణిం గృహ్ణీష్వ మాభూత్కాలస్య పర్యయః 2

అల్లుని చేతిలో ఊర్మిళనుంచి తన బరువు దించుకున్నాడు రాజర్షి.

అయోధ్యానగరంలో గృహ ప్రవేశాది విధిపూర్వక క్రియాకలాపం పూర్తి చేసుకొని అంతఃపురంలో అడుగుపెట్టిన ఊర్మిళ తిరిగి కనబడలేదు. ఆమెకై చూచి, చూచి విరాళ చెందిన సాహితీ ప్రియులు, రామకథాగాన తత్పరులైన జానపదులు ఊర్మిళను కావ్యనాయికను చేసి కావ్యాలు వ్రాయడం ప్రారంభించారు.

శ్రీ మైథిలీ శరణ్ గుప్త వంటి ప్రసిద్ధ హిందీకవులు "సాకేత్" 'పంచవటి' వంటి కావ్యాల్లో ఊర్మిళను అపురూప కావ్యనాయికగా సృష్టించి ఉపేక్షితను అపేక్షితగా మార్చి ఆమెయే రామకథా గమనానికి ప్రధానపాత్ర అన్నంతగా ఆ పాత్రకు విశిష్టతను అపాదించారు. 'ఊర్మిళాదేవి నిద్ర' 'లక్ష్మణదేవర నవ్వు' వంటి జానపద గేయాలు తెలుగువారికి ఊర్మిళపైనున్న అభిమానాన్ని, ఆరాధనా భావాన్ని ప్రస్ఫుటం చేస్తున్నాయి. ఒకవైపు హిందీకవుల ప్రభావం, మరొక వైపు జానపదగేయాల ప్రభావం తెలుగు కవులను ప్రేరేపించగా తెలుగు సాహితీ జగత్తులో ఊర్మిళ కావ్య నాయికగా అవిర్భవించింది.

---

1. వాల్మీకం – బాలకాండ - 1-71-21

2. వాల్మీకం - బాలకాండ - 73-304.

"ఊర్మిళా శేషశక్తిర్హి జనకస్యౌరసీసుతా" అని ఊర్మిళాదేవి యాదిశేషుని శక్తిగా పురాణాదులు ప్రస్తావిస్తున్నాయి. వాల్మీకి, తులసీదాసాదులే కాదు కరుణారసైకమూర్తి భవభూతి సైతం ఉత్తర రామచరిత్రలో ఊర్మిళా వృత్తాంతాన్ని మాట మాత్రం వదలివేయటం ఊర్మిళా దురదృష్టమే.

మిథిలానగరంలో జరిగిన ఆ కళ్యాణ ముహూర్తబలం ఎట్టిదోగాని ఆ వధువులైన అక్కచెల్లెండ్రు నల్గురు కష్టాల కడలిని యీదవలసినవారయ్యారు. వారిలోను జనకపుత్రికలకే కష్టాలు ఎక్కువగ కన్పిస్తాయి. అందులోనూ ఊర్మిళా లక్ష్మణుల జీవన గమనంలో రాముని కైంకర్య సమయమే ఎక్కువ. సీతాసాధ్వి భర్తృవియోగాన్ని సహించలేక ఆయనతో పాటు అడవులకు అడుగులు వేయడానికి సాహసిస్తే—అన్నను అనుసరించాడు లక్ష్మణుడు. ఆ సమయంలో భర్త వెంట ఊర్మిళ కూడా వస్తానంటే?—అసలు లక్ష్మణుడు తాను అన్నవెంట వెడుతున్నట్లు ఊర్మిళతో చెప్పాడో లేదో కూడ వాల్మీకి లేఖిని వ్రాయలేదు. తన వెంట అడవులకు వస్తానన్న తమ్మునితో శ్రీరాముడు "వృచ్ఛస్వ సౌమిత్రే! సర్వమేవ సుహృజ్జనం"2 అని అంటాడు. ఇచ్చట "సర్వమేవ" అన్న సముచ్ఛయంలోనే ఊర్మిళ కూడ ఉండి ఉండవచ్చు.

సీతారాములతో లక్ష్మణుడు అడవులకు పోగా ఏకాంతంగా అంతఃపురములో పదునాలుగు వసంతాల్ని గడపటం ఊర్మిళ వంతయింది. మాండవీ శ్రుతకీర్తులకు కనీసం భర్తల సాహచర్య భాగ్యమన్నా లభించింది. కానీ ఊర్మిళకు నాధుని నిరీక్షణలో నిండు వేసవులు గండు శీతులు నిండు గ్రీష్మాలుగానే మిగిలిపోయాయి. రాజపుత్రికగా సామాన్యమైన ఆలోచనలకు అతీతంగా ఆమె ఎలా ఉండగలిగి ఉంటుందన్న ఆలోచన కవుల కలాలకు ఊపిరినిచ్చింది. భాషాభేదంలేని రీతిలో ఉత్తర, దక్షిణ భారతదేశ కవుల హృదయాలలో క్రొత్త క్రొత్త భావాలకు ఊపిరి పోసి, ఊర్మిళ ఉత్తమ కావ్యసృష్టికి కారణమైంది.

శ్రీ మైథిలీ శరణ్ గుప్త "పంచవటీ" కావ్యంలో పర్ణశాలకు వెలుపల శిలాతలంపై కూర్చొని దీర్ఘాలోచనల్లో మునిగిపోయిన లక్ష్మణుని ఊహల్లోకి ఊర్మిళను రప్పించారు. ప్రణయదేవత ఊర్మిళా మధుర స్మృతులు ఊహల్లో ఊరట కల్గిస్తుండగా, "శూర్పణఖాగమనం" సంభవిస్తుంది. ఊర్మిళా మనోనాధుడు శూర్పణఖను

1. రా. సా. బాల 12-39

2. వాల్మీకం - అయోధ్య-31-26

చూపే సమయానికి అతని మనస్సులో ఊర్మిళయే నిండి ఉన్న సన్నివేశం ఔచితీ సంభరితం. "సాకేత్" కావ్యంలో రాముని తీసుకురావడానికి చిత్రకూటానికి బయలు దేరిన భరతుని వెంట ఉన్న అంతఃపుర జనంలో ఊర్మిళను కూడ పంపించి, అక్కడ పర్ణశాలలో ఒంటరిగా ఊర్మిళా లక్ష్మణులను కలిపి ఊరట పొందారు. ఊర్మిళ "సమాధి"లోనుండి నిద్రలో పద్నాలుగు సంవత్సరాలు గడపటం జానపదుల కల్పన.

ఇవన్నీ తెలుగుకవులను ఆకర్షించాయి. అందమైన కావ్యనాయికగా ఊర్మిళ రూపొందింది. శ్రీ వావిలాల రామమూర్తి, గుదిమెళ్ళ రామానుజాచార్య వంటివారు ఊర్మిళ కావ్యాలనే రచించగా శ్రీ "కరుణశ్రీ" "శ్రీసి.నా.రె" "సుధాంశు" వంటివారు కావ్యఖండికలు రచించారు. ఊర్మిళా ఔదార్యము, శక్తి సంపన్నతలే రాముని వన గమనానికి "రక్ష"గా నిలిచి, ఆమె యోగ విద్యోపాసనలే లక్ష్మణుని తిరిగి అయోధ్యకు రప్పించగలిగాయన్న స్థాయిని ఊర్మిళకు చేకూర్చారీ నవ్యకవులు.

## శ్రీమాన్ గుదిమెళ్ళ వారి ఊర్మిళ

అయోధ్యా నగరం శ్రీరామచంద్రుని పట్టాభిషేకం కోసం అందంగా అలంకృతమైంది. కొబ్బరియాకుల పందిళ్ళతో, అరటి బోదెలతో, పచ్చని తోరణాలతో రాజ్యలక్ష్మికి స్వాగతం చెబుతోంది. రంగవల్లులతోపాటు తీర్చిన దీపతోరణాలు వీధుల్ని కాంతిమంతం చేస్తుంటే-రాచమేడల్లోని దీపాలుమాత్రం ఎందుకో కొడిగడుతున్నాయి. దూరంగ తోకచుక్క రాలిపడింది.

రాత్రికి రాత్రి ముహూర్తం నిర్ణయించబడి, పట్టాభిషేకానికి ఏర్పాట్లు ప్రారంభించబడ్డాయి. దూరప్రాంతాలకు వార్తలు చేరకముందే సందడి ముగిసే లక్షణాలు మెండయినాయి. వశిష్ఠుని ఆదేశంతో దశరథుడు చేసిన రామ పట్టాభిషేక ప్రకటన పౌరజనానీకానికి ఆనందాన్ని కల్గించింది. కానీ "ప్రథమరాలికి" ఈ విషయం చెప్పలేదు రాజు. అయినా ఆ రహస్యం ఆగలేదు. కుబ్జయైన దాసి పని పూర్తి చేసుకొంది. "మంథరన్, వండకొకానొకండను, కుభంధర యంచిది యెంత సత్యమో" అంటాడు కవి. మంథర లేనిదే రామాయణం లేదన్న నమ్మకం ఈ కవిది.

దశరథుడు ముద్దులభార్య మేడకు చేరాడు. మరి తిరిగిరాలేదు. తెల్లవారింది. పౌరులు పట్టాభిషేకోత్సవం కోసం ఎదురు చూస్తున్నారు. సుమంత్రుని రథం రామచంద్రుని ఎక్కించుకొని కైకేయి గృహం చేరింది. గుసగుసలు సాగాయి. రాజ రహస్యం బట్టబయలైంది. కైకేయి కోరిక నెగ్గింది. రాముడు అరణ్యవాసానికి

1. ఊర్మిళ-9 ప.

బయలుదేరాడు. సీతాసాధ్వి తనమాట నెగ్గించుకొని భర్తను అనుసరించింది. మరి లక్ష్మణుడో—

"పట్టగరాని దుఃఖమున బాష్పజలమ్ములు కంటగాల్వగా
గట్టి స్రవించుచుండ, రఘుకాంతుని దివ్యపదారవిందముల్
గట్టిగ బట్టి లక్ష్మణుడు కాననయాత్రకు నన్నుగూడ జే
బట్టు మటంచు దీనముగ బల్కెను జానకి చూచుచుండగన్" 1

"బాష్పపర్యాకులముఖశ్శోకం నోఢుమశక్నువన్, సభ్రాతు శ్చరణా గాఢం నిపీడ్య రఘునన్దనః సీతామువాచాతియశా రాఘవంచ మహావ్రతమ్" 2 అన్న వాల్మీకం ఈ పద్యానికి ఆధారం.

తమ్ముని ప్రార్థన విన్నాడు, పలదని అనేక రీతుల వారించి, తుదకు,

"కాదని చెప్పినన్ వినవు కాననయాత్రకు వత్తువేని ముం
దే దెటులైన నొమ్మడుగు మింట సుహృజ్జను లుండిరందఱన్" 3

అన్నాడు రామచంద్రుడు. "సర్వమేవ సుహృజ్జనమ్" అన్న వాల్మీకం సుహృజ్జను లుండి రందఱన్"గ రూపొందింది తెలుగు కావ్యంలో- "అందరన్" అన్న మాట లోని ఊనికలో ఊర్మిళ కూడ ధ్వనించింది. అందుకే రాముని సేవలో అనిర్వచనీయానందాన్ని అనుభవించాలనుకున్న లక్ష్మణుడు ఆనంద సింధువైన ఊర్మిళాదేవి అనుజ్ఞకోసం ఆమె మందిరానికి బయలుదేరాడు.

రామకైంకర్యంలోని ఆనందాన్ని అనుభవించే లక్ష్మణునకు ఆ మహావీరుని పల్కుల్లో ఊర్మిళ గుర్తుకొచ్చింది. ఎంతో ఓర్పుతో నాధుని ప్రేమకై ఎదురుచూస్తూ ఎదలోచింతిలని ఉత్తమ సాధ్విగా ఊర్మిళ రాముని పరోక్షసేవకై ఎదురు చూస్తోంది. శ్రీరాముని ప్రత్యక్షసేవాభాగ్యానికి పతిదేవులు ప్రాకులాడుతుంటే వారికి సేవచేస్తూ, వారి సేవకు భంగం కలిగింపక ఆ రీతిగా పరోక్షంగా రామసేవకు పూనుకొనిన ఉత్తమురాలు.

"పచ్చని మేనితో, నునికి వచ్చెడు ప్రాయపు బాలపొంగుతో
విచ్చిన తమ్మిపూలవలె వేడుకగొల్పెడు కన్నుదోయితో" 4
"చక్కని ముక్కు, శ్రీలొలుకు నన్నని మేను, గులాబిశోభలన్
బుక్కిటపట్టు చెక్కిలియు, పుష్పశరుండల జైత్రయాత్రకై
యెక్కు రథమ్మువోలె గదువింపుగనున్న నితంబము - 5

తో ఊర్మిళారూపు లక్ష్మణుని హృదయంలో చోటుచేసుకుంది. కానీ, ఆ మహావీయుడు జితేంద్రియుడు. కాగా, అంతకుమించిన జితేంద్రియ ఊర్మిళ. వారి సమాగమమే అద్భుతమైంది.

---

1. ఊర్మిళ - 16 ప.
2. వాల్మీకం - అయోధ్య - 31. 1
3. ఊర్మిళ - 17.ప.
4. ఊర్మిళ — 21.ప
5. ఊర్మిళ — 24.ప

భార్యను వదలి భర్త వనవాసానికి వెళ్ళడం నీతికాదని, నిలవేసి, "ప్రియాం పురుష విగ్రహమ్మ"ని హేళనజేసి, తన కోరికను సఫలం జేసుకొన్న జానకీదేవికి సహోదరి ఈమె. "అసలు జానకి" ఈమె. తన కోరికను అంగీకరిస్తుందో లేదో— సందేహ పరంపరలు తుమ్మెద దారులా సాగుతుండే తొట్రుపాటుతో ఊర్మిళా సౌధాన్ని చేరాడు సౌమిత్రి. దాసి వెళ్ళి శుభవార్తను ఊర్మిళకు తెలియజేసింది. మోముపై వాలిన ముంగురుల్ని గాజులు సవ్వడి చేయగ మెల్లగా ప్రక్కకు వత్తు కొని—

"గబగబ మేడమెట్లు దిగి కాంచి వితంబమునుండి ప్రేలగా
గుబగుబ పొంగ దియ్యనగు కొన్ని తలంపులు, రాజహంసకున్
సొబగులు నేర్పునట్టి గతిశోభలతో నెదురేగుదెంచె, లో
నుబికిన ప్రేమవాహిని మహోర్మల నూర్మిళ నూపుచుండగన్"1

అర్ఘ్యపాద్య ఆచమనీయాదుల నిచ్చి, గోర్వెచ్చని పాలతో సేవించి అందించి, బంగారు పీటపై భర్తను కూర్చుండజేసి, విసురుతూ తీయగా పల్కరించింది.

"ఎంతటి సుప్రభాత మిది! యేలినవారికి నేడు జ్ఞప్తి-కు
ద్దాంతము వచ్చె గావలయు, దాసి తపో జప పూజలెల్ల నొ
క్కింత ఫలించె నేటి కిది యెంత శుభోదయమైన వేళ, మీ
యంతట మీరు వచ్చి విజయమ్మొనగూర్చుట కంజలించెదన్"2

రఘురాముని పట్టాభిషేక సందర్భంగా చేసే ఏర్పాట్లలో విశ్రాంతి లేని మీకు ఈ దీనురాలు, గుర్తుకురావడం నిజంగా తన భాగ్యమని మురిసిపోయింది ఊర్మిళ. ముందుగా సుమిత్ర ఔన్నత్యాన్ని పలుకీతులుగ కొనియాడి ఆటుపంటి ఉత్తమురాలికి కోడలిగ, తనకు భార్యగా తాను పొందుతున్న ఆనందం అనిర్వచనీయమైంది అన్నది. "మీరు మహావిరాగు లిక మిమ్ముల మించిన దత్తగారు" అనటమే కాక "మీ ధోరణి వేరు, మీకెవరిత్రోవలు వారివి, మీ స్వభావముల్ వేరుగ గన్పడున్" అని వాడిగ పల్కడమేకాక, కారణజన్మలివ్వి మమకారము లుండవు పీనమేనియున్ అని వారి ఉదాసీనతను గుర్తుచేయడమే కాక, 'అమ్మ బుద్ధులే బిడ్డకొచ్చాయని" సుమిత్రా లక్ష్మణుల కైంకర్యభావాన్ని, మమకార రాహిత్యాన్ని పలుకీతుల కొని యాడుతుంది ఊర్మిళ.

1. ఊర్మిళ–31 ప.
2. ఊర్మిళ-33 ప.

"గడబిడ లేనిజన్మ, మమకారపు కంపము బెద్దపెట్టుగా
మెదకు దగిల్చి లాగదు, సుమిత్రకు మించిన సాధు లుందురే" 1

అన్న కితాబు శ్రీ గుదిమెళ్ళవారి ఊర్మిళాదేవిది.

## నిష్టారము

"నారగుపించినారు, తమ నాయనగారు, గృహప్రవేశమున్
వేడుక కోసమిందు పిలిపించిన రాత్రి నవోఢ నొటచే
వ్రీడ కతాన నే బలకరింపగ నైతివి ముందు మిమ్ము, నన్
జూడగ మీరుకూడ రుచి జూపకపోయితి రేమిపేయుదున్"2

"నన్, జూడగ మీరుకూడ రుచి జూపకపోయిరని" నాథునిపై చిరుకోపంతో నిష్టూర మాడింది ఊర్మిళ. రామస్వామి సేవతో మీకు కాలం ఆనందంగా గడుస్తుంది. నేను మీ నిరీక్షణలో శిలనై పోతున్నాను. మీకుమాత్రం ఊర్మిళయే గుర్తురాదు. రఘు రాముని దాస్యసుఖానుభూతిలో ఇల్లాలి రూపస్మరణకు సమయమెక్కడ?

అనుజ్ఞ వస్తుందో లేదోననే తొట్రుపాటు-రాముని చెంతకు త్వరగా చేరాలనే తొందర-ఊర్మిళా ప్రేమ వాహినిలోని మాధుర్యం-లక్ష్మణుని నేత్రాల్ని అశ్రుపంకిలా లను చేశాయి. "రాముని పాద సేవకిబదుగు గృహవ్రతమ్ము ప్రతిబంధకమయ్యె నటంచు నశ్రువుల్" కారుస్తున్న భ్రాతృసేవా తత్పరునిలో ఊర్మిళయొక్క ప్రేమ అడక తెరలో ఉంచినట్లయింది. "ఇట్టి విరాగుల కంటసీరా?" అంటూ ఆశ్చర్య పోయింది. "ఈ సమయంలో మిగిలిన సోదరులులేరని వేదనా? అవసర సమయంలో ఆప్తులు లేకపోతే అలాగే ఉంటుందితెండని" ఓదార్చింది భర్తను ఊర్మిళ.

వాల్మీకి ఊర్మిళ మూగది కాగా రామానుజాచార్యులవారి ఊర్మిళ మాటకారి. క్రియాశీలి. చమత్కారి కూడాను. అందుకే-మీ సోదరులకై మీరు ఎదురు చూస్తు న్నట్లు—

"మీకయి నేను కూడ మనమే యొక యిల్లుగజేసి భావమున్
వాకిటనిల్చి చూచితిని స్వామి తమారమి కొన్నియేండ్లు"3

అంటూ విలేసింది. తీరని కోరికలతోను, "మూగబాధ"లోను ఎంతసేపు ఎదురు చూశాను.

"........నా ప్రణయ మాధురిలోని యత్నప్త వాంఛ యాలోక మదే మెఱుంగు బతిలోకమె లేనిది కాంతియుండునే" 3 అన్న పల్కులు "ఊర్మిళ"ను అపేక్షిత నాయికగ మార్చిన ఆధునిక కవివి.

---

1. ఊర్మిళ—42-ప
2. ఊర్మిళ—47-ప
3. ఊర్మిళ—51-ప

## సందేహము

ఇంతగా మాట్లాడుతున్నా నోరుమెదపని లక్ష్మణుని మాట్లాడించడానికి చివరి ప్రయత్నంగా "ఈ దినమందు స్వామి కవనీటుడు రాజ్యమొనంగుచుండగా, సోదరుడు ముందర నా వినపుచూపులు చాలునికర్ణమయ్యె" అనేసింది తెలుగు ఊర్మిళ. ఉలిక్కిపడ్డాడు లక్ష్మణుడు. ఊర్మిళ నోటికడ్డంగా చేతినుంచి ఆ పల్కుల్ని విరోధించాడు: అసలు విషయం చెప్పేశాడు. కైకేయి వరాలు, తీర్మానాలు, తత్పర్యవసాన ప్రాప్త అరణ్యవాసాలు వెలువడ్డాయి. అన్ననువీడి అరనిమిషం కూడ నిలువలేనన్నాడు. ఆయన బంధమీనాటిది కాదన్నాడు. జనన్నాంతర సౌహృదమన్నాడు.

"నిర్మాయము, నిష్కళంకమును, మంజూలమున్ మహనీయమైన యా
త్మీయత, బాహిరేఖల కతీతముగా గవిపించు నూర్మిళా"1

అతడు సోదరమాత్రుడేకాడు. అస్త్రవిద్యలచిర్చిన గురువు. "నా జీవితమెల్ల సార్థకము జేయు దలంపున వానితోడనే, శోభనమంటి వనభూమికి" అంటూ అసలు విషయం వెల్లడించాడు లక్ష్మణుడు. గాలి మేపరినై అన్నావదినలకు సేవచేస్తానని—

"దాసుండ నేను రామునకు, దాశ్యమె నాగతి, వన్నివాన శ
య్యాసన పాదుకాంకుకములందున నేనిధి వాడుకొన్న సం
తోసమె, వోయె భోగములతోగల బంధము, కాని శేషతా
వాసన, వానివెంటబడి ప్రాకుటయున్ విడబాల నూర్మిళా"2

త్రివిష్టపాన్ని త్యజించి, బ్రహ్మపదాన్ని తిరస్కరించి, మోక్షాన్ని సైతం త్రోసిపుచ్చి, శ్రీరాముని సేవకొలకు తాను ఆరాటపడుతున్నానని, జాగ్రత్తగా ఆలోచించి అనుజ్ఞ ఇవ్వవలసిందని ప్రార్థిస్తాడు లక్ష్మణుడు. ఈ పద్నాలుగు సంవత్సరాలు మనుషులు దూరంగా ఉన్నా మనముల లోచూపులతో పరస్పరము కల్సుకొందామని, అందుకు అభ్యంతరం లేదని ప్రాధేయపడి—

"మనమున నెంతమాత్రము మమత్వము బెంచకు, లేనిపోని భా
వనలకు గ్రుంగి గ్రుంగి, మదిపాడొనరింపకు, కర్మయోగియౌ
జనకుని కన్నకూతురవు, సర్వమెఱుంగుదు వన్నగారు నీ
యనుమతికోనమై యెదురుచూచెదరు కాదనబోకు నూర్మిళా"3

"ఐహిక సుఖాలకై ఆరాటపడని వ్యక్తివని, కర్మయోగి కన్నకూతురుగ నీకా సంయమనం కద్దని" పొగడటమేకాక, రాముని సేవ లేకపోతే తాను జీవించలేనని-అనుజ్ఞ ఇవ్వవలసిందని ప్రార్థించి తుదకు కన్నీరు కాల్వలుగట్టగా—"వందన మాచరింతునని ఊర్మిళ పాదాలపై వ్రాలబోయాడు లక్ష్మణుడు.

---

1. ఊర్మిళ—68 ప
2. ఊర్మిళ—73 ప
3. ఊర్మిళ—81 ప

పాదాలపై వ్రాలబోయిన ప్రాణనాథుని జూచి ఉలిక్కిపడిందా జానకి.

"పయ్యెదజారగా జఘనభారముతో వడుమూగుచుండగా"1 పతిదేవునివారించి, బంగారు పీటపై తిరిగి కూర్చుండబెట్టింది. కన్నీటిని తుడిచి, ఓదార్చింది.

"శాంతముగా, గభీరముగ, శ్రావ్యముగా, హృదయంగమమ్ముగా
వింతగ, విశ్వగేయముగ, వీనులవిందుగ, విశ్వదాయిగా,
నంత సగోష్య పద్ధతిగ, నంతకు మించి విలక్షణమ్ముగా
కొంత యవజ్ఞగా బ్రణయ కోపము కాంతగ, భర్తకిట్లనున్" 2

'ఎందులకింత విచారమంటూ' బేలగా దుఃఖిస్తున్న లక్ష్మణుని పలుతెలుగుల సమాధాన పరుస్తుంది తెలుగువారి ఊర్మిళ. కైకేయీ వరాల్ని సమర్థించింది. అడవులకు రాముడు వెళ్ళడం లోక కళ్యాణ కారకమని, రామలక్ష్మణుల సంబంధం లోకానికి తెలిసిందే కాబట్టి 'శేషత' నిలుపుకొని, మీరు సైతంవారిని అనుసరించాలని ప్రోత్సహించింది. శ్రీ రామునిపై కైకకున్న అవ్యాజానురాగానికి ఇది ప్రతీక.- ఎవ్వరు వరాలిచ్చినా తీర్చ వలసిన బాధ్యత స్వామిదే కదా - అన్న కొనమెఱుపు - నిర్దేశం గుదిమెళ్ళవారి ఊర్మిళది.

"భరతుని కీయగావలయు బ్రస్తుత రాజ్య మరణ్య మన్నగా
రరుగుటయే సమంజసము నాయమ యన్న చతుర్ద శాబ్దముల్
జరిగినగాని లోకమున శాంతిజనింపద యెవ్వరేరి కే
వరము లొసంగియున్న నది పాలనసేయుట స్వామియేగదా" 3

ఊర్మిళ మాటల్లో ఎన్నో మర్మాలు, ధర్మాలు సుళ్ళు తిరిగాయి. వాల్మీకి రామాయణం లో నామ మాత్రంగా కన్పించే ఊర్మిళ ఈ కావ్యంలో చిలుకమొకరిమై కైకవరాల నుండి ప్రారంభించి దశరథుని పట్టాభిషేక నిర్ణయం, భరతాదుల్ని పిల్వనంపకబో వడం లోని ఔచిత్యం, రాముని అరణ్యవాస గమనంలోని అంతరార్థం, శేషతారూపు డైన లక్ష్మణుని బాధ్యతల వరకు అనేక విషయాలు సవివరంగా చర్చించి, సమర్థించ గల ఆమె స్థాయి ఆవిష్కృతమైంది. ఆమె మాటల సందర్భంలో సీతాప్రాదుర్భా వవట్టం నుండి విశ్వామిత్రాగమన సీతా కళ్యాణాది కమనీయ దృశ్యాలన్నీ మనో జ్ఞంగా దర్శనమిస్తాయి.

---

1. ఊర్మిళ - 86 ప
2. ఊర్మిళ - 87 ప.
3. ఊర్మిళ - 106 ప.

"అక్క యయోనిజాత కమలాలయ తానవతారమూని యీ
ప్రక్కకు వచ్చె దాని కిటువంటి సహోదరి యబ్బె కంటిరే" 1

అంటూ లక్ష్మీరూప సీతాసాధ్వికి తాను సోదరిగ జన్మించడం తన అదృష్టంగా పొంగిపోయి, చివరకు అసలు విషయం నెమ్మదిగా బయటపెట్టింది.

"అక్కను జూడకుండ క్షణమైనను నేనును నిల్వజాల మీ
ప్రక్కగ ఛాయరీతి నిలువంబడియుండి యరణ్యయాత్రలో" 2

"అన్నకు మీరు అక్కకు నేను, సేవ చేస్తూ తరించాలని కోరికగా ఉందంటుంది. సీతామణి చెంతనుండగా శ్రీరాముడు అరణ్యయాత్రలో కాకుల్ని గ్రద్దల్ని కోతుల్ని సైతం తరింపజేయనున్నాడని తండ్రి జనకునితో విజ్ఞులు చేసే ప్రసంగాల్లో తాను విన్నానని, అటువంటి మహనీయునికి సేవచేయడానికి మీరు వెళ్ళాలని నిర్ణయించు కోవడం తన అదృష్టమని భావించింది. తాను వస్తానని అనుగ్రహించమని ప్రార్థించిన ఊర్మిళ - మాటల్లోనే మనసు మార్చుకొని –

"మీ సమ్మతి లేదు మీ కొఱకు సర్వము త్యాగము సేసుకొంటి నా
సమ్మద మెట్టులున్న పతిసంతసమందిన జాలు భార్యకున్" 3

అంటూ సతీత్వాన్ని నిరూపించి, "మీ సమ్మతిలేదు" అంటూ అతని మనోభావాల్ని గమనించి, తన కోర్కెను మానుకొంటుంది. లక్ష్మణుని వెళ్ళమని ప్రోత్సహించ డమేకాక, బుద్ధులు సైతం చెపుతుంది.

"భూమిజ నొంటిగా విడిచిపోకుడు" అంటూనే "పొమ్మననేని పొందు" 4 అంటూ వెసులుబాటు కూడ కల్గిస్తుంది.

"ఏరిని చెయ్యి చేసుకొని ఏడ్పు విధమ్మున జేయబోకుడీ" 5 అనే హెచ్చరిక సైతం ఊర్మిళ పల్కుల్లో విన్పిస్తుంది. పై మాటల్లో సీతాపహరణం, ఈ మాటల్లో శూర్పణఖ నాసికా ఖండన వృత్తాలు రమ్యంగా ధ్వనిస్తాయి.

"శేషత నా స్వరూపమని చీటికి మాటికి వారి పీరిపై
దోషము బూనుచో రఘువరుండిది సైపడు పారతంత్ర్యమే
వేషము దాల్చినట్లు కనిపింపుడు యూర్మిళ సేవ కూడ సం
తోషము మీర మీరు దయతో నొనరించి తరింప జేయుడీ" 6

---

1. ఊర్మిళ - 128.ప.
2. ఊర్మిళ - 131 ప.
3. ఊర్మిళ - 139.ప
4. ఊర్మిళ - 141.ప
5. ఊర్మిళ - 142 ప
6. ఊర్మిళ - 143.ప

తనసేవ కూడ లక్ష్మణునే చేయమని ఆ విధంగా తనని తరింపచేయవలసిందని ప్రార్థించడమే కాక, "సీతాగమనం" ఒక మహాకావ్యమై ఆవిర్భవించగలదని, ఈ పద్నాలుగు సంవత్సరాలు గృహాన్ని అరణ్యంగా భావించి ఏకభుక్తనై మీ రూపాలను మదిలో నింపుకొని ఎదురు చూస్తుంటానని ధైర్యంచెప్పి—

"కలయిక లేని ప్రేమ కలకాలము నిల్చును మీకు మాకు ని
ష్ఠులమగుబంధమున్న నదిదూరమునుండియు జూచుకొందమని"

వియోగం గుర్తురాగా దీనావనయ, భర్త పాదాలపై వ్రాలిపోయింది ఊర్మిళ. అనుజ్ఞ వచ్చినందుకు ఆనందం, అర్ధాంగిని వదలి వెళ్ళవలసివచ్చినందుకు ఆవేదన మిళితం కాగా పాదాలపై వ్రాలిన ప్రియురాలిని కౌగిలిలోనికి తీసుకొని బుజ్జగించి వేగంగా రామాంతఃపురంవైపు బయలుదేరాడు లక్ష్మణుడు.

పేరుకి "ఊర్మిళ" కావ్యమే కాని దీనిలో సీతాకథాగానమే ఎక్కువ. కర్మయోగియైన జనకుని కొమార్తెగా యోగీశ్వరేశ్వరిగా, భూతభవిష్య దర్శయుక్త రామభక్తిని తనకు సంపాదించుకొని, భర్తను రాముని సేవకోసం త్యాగం చేసి, తాను తరించిన సుగుణశీలగ ఈ ఊర్మిళను కవి చిత్రించారు. క్రొత్తదనం అంతగా ఇందులో కన్పించదు. అయినా తమ యితర కావ్యాల్లోని భావాలే పునరావృతమౌతూ కవియొక్క రామభక్తి సాంద్రతను నిరూపిస్తాయి. "శేషత, అనపాయిని, పురుషకారము, విశ్వ-అమిత్రుడు-విశ్వామిత్రుడు" వంటి విందు కుదాహరణములు.

రామాయణ కథా విశ్లేషణతో ప్రారంభమైన ఈ కావ్యం ఊర్మిళా లక్ష్మణుల సంశ్లేష విశ్లేషాలతో ముగించడం ముచ్చటగొలుపుతుంది. లక్ష్మణుని పారతంత్ర్య భక్తిని ఊర్మిళ ద్వారా ప్రదర్శింప యత్నించారు రామానుజాలు.

1. ఊర్మిళ—147 ప.

## జంధ్యాల వారి ఊర్మిళ

ఊర్మిళపై జాలిని కురిపించి, ఆమెకు గల్గిన పదునాల్గు వసంతాల భర్తృ వియోగ వ్యథను తలచికొని, ఆవేదన చెందిన కవులు ఆత్మీయతగా ఆమెను పల్కరించి, సానుభూతి ప్రకటించటం ఆధునిక కవుల లక్షణం. ఆమెకు సంప్రాప్తించిన దైన్యానికి చింతిస్తారు. ఓదారుస్తారు. బుజ్జగించి, లాలించి తుదకు ఆమె ఔన్నత్యాన్ని కొనియాడుతారు.

ఊర్మిళకు సంప్రాప్తించిన కష్టానికి నిట్టూరుస్తారు జంధ్యాల. "ఎట్లు నిలిచెదు పదునాలుగేండ్లు తల్లి?" అన్న ఆవేదన కరుణశ్రీది.

"అన్న పదములన్ గొలుచు నాన మనోహరుడేగినాడు-తా
జన్నది భర్తృ పాద పరిచర్యకు ప్రేమపు టక్క-గారు—ఏ
మున్నది దిక్కు నీకిచట? నొంటరి వైతివి తల్లి! ఎంతయున్
జిన్నతనమ్ము-నీవెటులఁజేతు వొ కోడరికమ్మయోధ్యలో!"

నన్ను, నా కొడుకుని చంపి, రాముని రాజునిచేస్తానన్న ఆ లక్ష్మణునికి ఇల్లాలివని కైకమ్మ ఆడిపోసుకుంటుంది. చెల్లెళ్ళు భర్తలను సేవిస్తున్నారు, అక్క భర్తను అనుసరించింది. నీవెందుకు మిగిలిపోయావు, కమ్మని జవ్వనాన్ని అడవిగాచినవెన్నెలం జేసి భర్తృ వాక్యానికి అడ్డుచెప్పక నిలిచి, పతిభక్తిలో సీతమ్మను మించిపోయావని పొగడి, కాటుక కన్నుదామరల కొలువలై ప్రవహించు వేడికన్నీటిని భూమిపై పడనీయ వద్దని, నీవంటి వధూటి కన్నీటిని భూమి భరించలేదని ప్రార్థించిన కరుణార్ద్ర హృదయులు మన కరుణశ్రీ.

నలుగురు "నంగనాచి గహనాలకు కాంతుని వెంట నింటిలో
కులుకుచు కూరుచున్న" దనుకొందురటంచు తలంతువేని చిం
తిలకుము తల్లి! త్యాగమయదేవిని నీవని నీ చరిత్రయే
తెలుపుచుండె-లోకము హృదిన్ గదలించు వదాత్వదశ్రువుల్" 2

కరుణశ్రీ పద్యాలు నిజాలై జాతియావత్తు ఊర్మిళకై అశ్రువుల్ని విడుస్తూనే ఉంది.

1. ఊర్మిళాకుమారి 6 ప.
2. ఊర్మిళా కుమారి 10 ప.

## వావిలాల వారి ఊర్మిళ

రాజర్షి జనకునకు భూపుత్రి ధర్మపుత్రికగా లభించిన సంవత్సర కాలానికి రెండవ భార్య సునయన యందు ఊర్మిళ జన్మించింది.

"సుమేధా నామికా తస్యా ధర్మపుత్రీతు భూమిజా
జనకస్య చ తస్యాపి ద్వితీయా గృహిణీ తధా
సమాఖ్యయా సునయనా తజ్జాతా హ్యూర్మిళాసతీ
జానకి లబ్ద వర్షాంతే సంజాతా హ్యూర్మిళాతతః"1

అన్న మూల గ్రంథం వావిలాల వారి కావ్యానికి ప్రారంభం.

జనకుని పంటపండి, సంతతిలేదనే కొరతదీరి, సంవత్సరం కాకముందే చిన్న రాణి అంతఃపురంలో ఊర్మిళా జననవార్త మార్మోగింది. చెంపకు చేరెడేసి కన్నులతో, చిక్కని పాలబుగ్గలతో నల్లని ముంగురులతో, వాడలోని ఆడవారందరు "భళి" యని మెచ్చుకొనుచుండగా పదహారు కళలతో పెరుగుతూ, ఘడియకొక రూపుగ అందాలు చిందించింది ఊర్మిళ. తండ్రియైన జనకుని యోగదృష్టి, సీతను దర్శిస్తుంటే "ప్రేమదృష్టి" సంబరంతో ఊర్మిళను చూస్తుండేది. సుతామమతార్ణ హోర్మంలో మునిగిన దంపతులు అప్రయత్నంగా "ఊర్మి" అనగా అదేపేరును యాజ్ఞవల్క్యుడు సభలో ప్రకటించాడు. "ఊర్మిళ" తండ్రివద్ద, తండ్రి చెంతకు వచ్చే పెద్దలవద్ద విద్యలు నేర్చుకొని, యోగమునలోతులెరింగి, "చనువు" పెంపున సీతతోను, శతానందాదులతోను చర్చల సాగిస్తుండేది.

ఊర్మిళా పాత్ర చిత్రణలో కవులందరు "యోగశాస్త్ర" ప్రస్తావన తీసుకు రావడం గమనార్హం. పద్నాలుగు సంవత్సరాలు "ఊర్మిళ" నిద్రలో ఉన్నట్లు అది "సమాధి"యై లక్ష్మణాదుల దర్శనం ఆమెకు ఆ సమాధిలోనే సంభవించినట్లు జాన పదులు సైతం వర్ణించడం ఆమెపై ప్రజలకున్న మమకారానికి ప్రతీక. "యోగ శ్చిత్తవృత్తి నిరోధః"2 అంటాడు పతంజలి. ప్రమాణ విపర్యయ, వికల్ప, నిద్రా, స్మృతి అని చిత్తవృత్తుల్ని ఐదు విధాలుగా విభజించారు. అంతేకాక స్మృతివృత్తి లోనే స్వప్నవృత్తి చేరిందని సైతం వ్యాఖ్యానించారు.

అందువల్లనే ఊర్మిళా నిద్రను యోగనిద్రగా ఊహించడం సంభవించింది. కాబట్టి కవి ఈ భాగంలో "యోగమున లోతులెఱుంగుచు" అంటూ ముందురాబోయే తనకల్పనకు బీజావాపం కావించారు. శాస్త్ర చర్చల్లో ఊర్మిళ కనబరచే ప్రజ్ఞా పాట వాలకు ఆశ్చర్యపోయిన పండితశ్రేష్ఠులు నాసికానక్షిత తర్జనులై నిలిచిపోయేవారు.

1. రామాయణ సారోద్ధారం-బాలకాండ-పు 567

2. పాతంజలి యోగశాస్త్రం-1. 2. 3. పాతంజలి యోగశాస్త్రం-1. 6.

ఇంద్రి వములలో వహాయం చేస్తూ నందేహ సమయాలలో సలహాలనిస్తూ తలలో ల్కాయై తిరగసాగింది ఊర్మిళ.

స్వయంవరం నిర్వహించబడింది. విశ్వామిత్రుని ఆదేశంతో రామచంద్రుడు నువు నెక్కుపెట్టాడు. ధనుర్భంగమైంది. మహావీరులు ఆ ముక్కలను సైతం క్కన పెట్టలేకపోగా లక్ష్మణుడు వాటిని తీసి ప్రక్కన పడేశాడు. విందుసభలో నకుడు ప్రకటించాడు. సీతోర్మిళలు రామలక్ష్మణులను చెట్టపట్టారు.

"శ్రీమత్ క్షమా రసోజ్జ్వల సౌమిత్రి కన న్మహార్హవై కోర్మిః
జీయా దుమేళ సత్కృప యేయం, పతిదేవతా మణి స్సతతం"1

ఇత్యాదిగా గార్గి వ్రాసిన శుభలేఖాహ్వానాలు అందరికీ అందాయి. షడ్రస పాయసా లతో సారభృతాలతో అపూప, సుపూపాలతో గృహస్థులు తృప్తిగా భుజించగా, అపుపాలతో ఖర్జూరఫలాలతో వానప్రస్థులు సాపడ్డారు.

శ్రీనాథుల భోజనప్రియత్వం రామమూర్తిగారిలో ప్రవేశించి, వివిధ వర్గాల వారికి అభిరుచికి అనువుగా ఆచారబద్ధంగా తెలుగు వంటకాలను వడ్డించారు. ఉప్పిడి పిండి, అప్పడాలు, అటుకులు, వడుగులు, పులగాలు మిధిలానగరవాసులు రుచి చూశారు సీతారాముల పెండ్లికి.

సమృద్ధిగా సంభావనాసత్కారాలనంతరం గృహప్రవేశాది క్రియా కలాపం ముగిసింది. పన్నెండేళ్ళ సుఖజీవనానంతరం అయోధ్యలో-సంచలనం. కైకేయీ వరాలు—రామయ్య అరణ్యవాసం—పుత్రునికై దశరథ విలాపం—"ఊర్మిళా ముక్తిం గూర్పవేయంచు" మహారాజు మరణించారు.

## సమాధి

సమాధిలోకి వెళ్ళిపోయింది ఊర్మిళ. రాగభోగాలు వెలివేసి, భర్తృశుభాగము భాగ్యాతాంక్షయై భర్తరూపాన్ని ధ్యానిస్తూ సమాధి స్థితిని పొందింది ఊర్మిళ. పగలు, రేయి బాహ్యాంతర్జగత్తులు లేని దివ్యలోకాన్ని సృష్టించుకొంది.

"తదేవార్థమాత్రనిర్భాసం స్వరూపశూన్యమివ సమాధిః"2 అని యోగ శాస్త్రం. తాను ధ్యానించే వస్తువుని మాత్రమే భావించడం ధ్యాన మనబడుతుంటే"3 ధ్యానం ధ్యానించే వస్తువుయొక్క స్వరూపంగా పరిణమించి ధ్యానిస్తున్నాననే బాహ్య స్మృతి లేకపోవడమే సమాధి.

---

1. ఊర్మిళ—పు. 6
2. పాతంజల యోగశాస్త్రం—3.3
3. పాతంజల యోగశాస్త్రం—3. 2

తననాథుని నుదుట తిలకం దిద్ది, విశాలవక్ష స్థలాన హారాలనలంకరించి, చరణాలకు లత్తుకదిద్ది ఆనందిస్తోంది ఊర్మిళ. తనకన్నీరు భర్త పాదాల మాలిన్యాన్ని కడిగి, తన శరీరకాంతితో నీరాజనాలిచ్చి, తన హృదయాన్ని నైవేద్యంగా సమర్పించి, అధరామృతాన్ని పానీయంగా అర్పించి షోడశోపచారాల్ని అందిస్తోంది. కానీ ఆమె బాహ్యస్థితి అంతఃపుర జనానికి అయోధ్యాపురవాసులకు అర్థంకానిదైంది.

"అద్ది కల గాగ దోచు మదాంధ తతికి
నద్ది సంయమనంబుగ నాత్మ విదుల,
కద్ది యున్మాదముగ దోచు బుద్ధి సెడిన
వారలకు, నా పతివ్రత ప్రకట వృత్తి" 1

హృదయ పీఠంలో పతిదేవుని ప్రతిష్ఠించుకొని, ధ్యానముద్రావిలోకిత భర్త్మ పాద యుగళియై ప్రార్థిస్తున్న ఊర్మిళకు లక్ష్మణుడు ప్రత్యక్షమయ్యారు.

## సాక్షాత్కారం

లోకమంతా నిద్రలో జోగుతున్న తరుణంలో ఊర్మిళా హృదయసీమలో సాక్షాత్కరించాడు లక్ష్మణుడు.

సీతారాములు నిద్రపోయిన అనంతరం వారి సేవలో మునిగిన లక్ష్మణుడు జాగ్రత్తగా వారిని ఒకకంట గమనిస్తూ, గారాముగా ఊర్మిళతో సంభాషించటం ప్రారంభించాడు, "ఎవరే నిన్నుదసంబు చేయుమని రోసి విచ్చిదానా! తనుచ్ఛవి డిందన్, విలువల్లనెండ" అంటూ కృశించిన ఊర్మిళను ప్రేమతో ఓదార్చి, మంద లింపు వాక్యాలు పలుకుతాడు. పెద్దబిడ్డ మగని వెంట అడవులకు పోగా, చిన్నదాని పైన నీవు ఈ విధంగా అయిపోతే సీతంద్రిగారు బాధపడతారు. అరణ్యావాసంలో సగం గడిచిపోయింది త్వరలోనే వచ్చేస్తాను. అయోధ్య వదలిన నాటినుండి ఎన్ని అనుభవాలు ఎదుర్కొన్నామో ఎలా చెప్పమంటావు - అంటూ ముచ్చట లాడసాగాడు. ఎన్నో పల్కరింతలు, కలవరింతలు, పులకరింతలు, కొల్లలుగా ప్రవహించాయి. మాతృత్రయీ సేవాపరతంత్రవై ఇహపరప్రాప్త ఫలాన్ని పొందవలసింద న్నాడు. అనాథ వృద్ధుల సేవకు నీవున్నావనే కదా నేను అన్నను అనుసరించింది అనునయించాడు.

---

1. ఊర్మిళ - పు. 13.

"గురుదుఃఖమ్ముననున్న తండ్రికెవరాక్కో దిక్కు సేవింప నీ వరుదే బూనకు"మంచు రామవిభుడొయ్యం బల్కు నిన్ జూచియే స్థిరబుద్ధిన్ జనుదెంచినాడ" అని బాధ్యతల్ని ఊర్మిళ కప్పగించడమే కాక,

"విగ్నత నొంద నేల రఘువీరుడు కల్గిన నాకు నైన్నుషా
లగ్న మనస్కు లై దుహితృ లంపటలై యుభయాంబికల్, వ్యథా
మగ్నలు కావి యట్లు, జవ మావిత సేవల దన్పుభాగ్య, మే
యగ్ని పరీక్ష నైనను, మహాక్షమ నెగ్గెదు నీకు దక్కెపో!" 1

అంటూ ధైర్యం చెప్పి, త్వరలో రాగలనని ఓదార్చి, ఊర్మిళను వృద్ధుల సేవలో నియోగించి అంతర్ధానుడై నాడు లక్ష్మణుడు.

## సిందూరము

పతిదేవుని పల్కరింపులు గ్రీష్మపీడిత హృదయానికి మలయమారుతాలై, మరుభూమిలో మంచినీటి సరస్సులై ఆనందాన్ని కల్గించగా, సమాధి వదలి, పెద్దల సేవకై ఉపక్రమించింది ఊర్మిళ. పతిదేవుని దర్శనంతో తపస్సు చాలించిన పార్వతియై, అద్భుతభ రవచస్కయై సమాధికి భరతవాక్యం పల్కింది ఊర్మిళ.

కోడలు తపస్సు చాలించిందని విన్న రాణులు ఆనందంతో ఊర్మిళాంతఃపురం చేరు కొన్నారు. ఆమె వృత్తాంతాన్ని విని, ఊర్మిళ అదృష్టాన్ని పలురీతుల కొనియా డారు అయోధ్యా వాసులు.

"కూరిన యోగ విద్రకు, బ్రకోష్ఠక యష్టిక ప్ర ప్రతిష్ఠిత
శ్రీ రమణాకృతిం దలచి, చెందిరమున్ భ్రుకుటీలతా తటిన్
గోరకితంబు చేసి, కొలుకుల్ దిగజాఱ బ్రమోద బాష్పముల్,
మాఱట గౌరియై, పరిసమాప్తి ఘటించె జిరంటి, దంటయై" 2

అత్తలకు ప్రణామాలు చేసి, అప్పుడే వచ్చిన విశిష్టదంపతులకు పూజలొనర్చి ఆశిస్సు లనందింది ఊర్మిళ. ఎర్రనీరు త్రిప్పి, కొబ్బరికాయల వగలగొట్టి వేదమంత్రాలతో ఊర్మిళకు మంచి జరగాలని అంతఃపురంలో ఉత్సవం నిర్వహించబడింది.

---

1. ఊర్మిళ - పు. 24
2. ఊర్మిళ - పు. 26

## సేవనము

పతిదేవుని ఆజ్ఞతో క్రొత్త ఉత్సాహం తెచ్చుకొని, అత్తల సేవలను ప్రారంభించింది. పుత్రవియోగాన్ని తలచుకొని దుఃఖించే అత్తలకు మంచి జరగాలని, అడవిలో కష్టాలు పడుతున్న అయినవారు ముగ్గురుకి మంచి చేకూరాలని ప్రతిదినం "శాంభవి"కి మొక్కులు సమర్పించి, దినచర్యను ప్రారంభించేది.

"ఆమె నర్పెడి సకల కార్యములు, చూడ,
జానకీ రామ లక్ష్మణ సౌఖ్యమునకై
భర్తృ సంతర్పణమె యామె వాంఛితంబు,
రామ సేవయె, లక్ష్మణస్వామి మతము" 1

చేసే దానాలన్నీ రామాదులకు శుభం జరగాలని, సలిపే జపాలన్నీ రామాదులకు సౌఖ్యం జరగాలని, చేసే ఉపవాసాలన్నీ వారికి ఉపకారం జరగాలని అతిథి పూజలన్నీ రామాదుల క్షేమాన్ని ఆశించి, నిర్వర్తించే తపస్విని ఊర్మిళ. వశిష్ఠ వామదేవ సుమంత్రాదులు ఆమె పల్కులు వినడానికి ఉత్సుకత చూపుతుంటే—తాటకవధ, అహల్యా మోక్షము, శివధనుష్ఖండన, కళ్యాణ ఘట్టాదుల్ని లలిత లలితరీతిలో విప్పించి వారల నానందింప చేసేది.

"రామ మందిర తమో రాశి, పటాపంచ
లౌ, నూర్మిళా మందహాస పటిమ
లక్ష్మణ ప్రాగార లంద గోపానసీ
తమ మడంగెడి, నూర్మి ధన్య దృష్టి"2

ఉదయం లేవగానే దశరథ మందిరంలో దివ్వె వెలిగించి, వంటశాలలో అగ్నిని రగుల్కొల్పడం ఒక భాగంకాగా—

"రామలక్ష్మణ పవిత్ర స్వైర వనవాస
విలసనమ్మును, యోగవీక్ష గాంచు"3

ప్రధాన చర్యగ భాసించింది. ఎన్నో పురాణగాధలు, రామాయణ కధలు కుప్పలు తెప్పలుగ వినవచ్చేవి. ఎవరి అభిరుచులకు అనుగుణంగా వారితో సంభాషిస్తూ, ఆనందం కల్గించేది ఆ జనకజాత. "లలితసాత్త్విక భక్తియే లక్ష్మణుడుగ" విషయ వివృత్తియే ఊర్మిళగ ఆవిర్భవించారని ముచ్చట పడిపోయాడు వశిష్ఠుడు.

అత్తలకు సేవచేస్తూ, "చేయితీరిన వేళల" హరి ప్రబోధము విప్పిస్తూ, భర్తను యోగవీక్షణాలతో దర్శిస్తున్న సమయంలో జనకుని వద్దనుండి సందేశమందింది.

---

1. ఊర్మిళ—పు. 30
2. ఊర్మిళ-పు. 32
3. ఊర్మిళ—పు. 33

## సందేశము

అత్తలకు సేవచేయడమనే భాగ్యం పూర్వపుణ్యవశప్రాప్తమని, అట్టి గంభీరమైన బాధ్యతల్ని వహించి, మన్ననలందుకొన్న ఊర్మిళకు ముందుగా ఆశీస్సుల నందించాడు జనకుడు. అన్న ననుసరించిన, లక్ష్మణుడు అదృష్టశాలి. తండ్రి ఆజ్ఞతో రాజ్యాన్ని వదలి అరణ్యానికెళ్ళిన రాముడు సుగుణాభిరాముడని మామగారైన జనకుని భాషణ.

"గ్రహములు దారితప్పినను, రాముడు మాత్రము ధర్మమార్గమున్
గహనము చొచ్చినన్ విడడు, క్రమగుణుండు, సుమిత్రకాగ్రజుం,
దిహపరముల్, గడంక వెలయించి జయించును, గర్మపుంగతుల్
విహితములెల్ల వేళల, నభీప్సితముల్ నెఱవేరు గైకకున్"1

'గతముగతంబె'యని గడిచిన కాలాన్ని వదలి భావిని సుఖవంతం చేసుకోవలసిందని దశరథ భామినులను కోరతాడు. అరుంధతీ వశిష్టుల చల్లని చూపులతో కోసల సుభిక్షంగావిలసిల్లగలదు. దనుజప్రకరాంతక విరాముడు రాముని సామాన్యునిగ తలచవలదని, లోకోత్తరునిగ గుర్తించవలసిందని ఆకాంక్ష. అందుకే అభీప్సితముల్ నెఱవేరు కైకకున్" అన్న వక్కాణపై పద్యపాదంలో చోటుచేసుకొంది. పేరుపేరున భరత శత్రుఘ్నుల్ని, మాండవీ శ్రుతకీర్తుల్ని పల్కరించి, వారిని మించిన ఓర్పుతో ఊర్మిళా మనస్విని సేవల్ని కొనియాడి—

"ప్రణతులు ధర్మవృద్ధులకు బంచిన దీవెన లింత చిన్న లౌ
గుణులకు, రాణివాసమునకున్ శుభమౌత సుశాశి కెంతయున్,
చణు, లజపౌత్రు లెల్లరు, దిశావలయంబు జయింత్రు గాత, ల
క్ష్మణు వనితామణిన్, నియమధారిణి, గారణజన్మ నెంచెదన్"2

అంటూ ముగించాడు జనకుడు. తపస్విని ఊర్మిళ శ్వశురుల సేవలోనుండి లోకానికంతటికి ఆనందం కల్గించింది. ఆమె తపస్సు తీవ్రమైతే-లోకాలు తల్లడిల్లి-రామలక్ష్మణులను పిలిపించవలసి ఉంటుంది. రామలక్ష్మణులు వస్తే-రావణసంహారం ఆగిపోతుంది. అందుకే ఆమె తపస్సు సఫలం కావడానికి దేవతలు వరాలిద్చారు ఆశీర్వదించారు—

"దేవత లెల్ల రామెకు సదృశ్యులుగా పరముల్ ఘటించి, రీ
............
కామితముల్ ఫలింప గలకాలము భర్తృ పదారవింద సే
వా మతియై యమేయమగు భాగ్యము నొందుతమంచు మూర్మిళా"3

ఆశీస్సుల నందించి, ఆనంద నృత్యాలు చేశారు దేవతలు.

---

1. ఊర్మిళ-పు-43
2. ఊర్మిళ-పు-45
3. ఊర్మిళ-పు-47

## సంగ్రామము

మనోనేత్రంతో నాధుని వీక్షిస్తూ, శారీరకంగా అత్తల సేవ చేస్తూ కాలం గడుపుతున్న ఊర్మిళ ఒక మునిమాపు వేళ హఠాత్తుగా అపస్మార స్థితి పొంది బాహ్యస్మృతి కోల్పోయింది. అంతఃపురం, అయోధ్యానగరం ఆవేదనలో మునిగి పోయింది. అన్నిరకాల సేవలు వృథాయైనాయి. "వెలది యింపుల్ దప్పె విశ్చేష్ట తల్, మిగిలెన్ యౌగికముద్రకుం దనువు కల్గింపన్, సముద్యద్ధశన్" అంటాడు కవి.

ప్రాణంలేని బొమ్మలాగ పడి ఉన్న ఊర్మిళను చూసి భోరున విలపించారు రాణులు. అయోధ్యానగరమంతా వివిధరకాలైన వార్తలతో నందండించింది. బిడ్డలు దగ్గర లేరనుకుంటుంటే, ఇంతలో నీకు ఇటువంటి కష్టం దాపురించిందేమని, కుమారుడైన లక్ష్మణుడు త్వరలో వస్తాడనుకుంటుంటే నీవు ఈవిధంగా అయిపోయా వేమిటని, లక్ష్మణుడు వచ్చి అడిగితే మమ్మల్నేం చెప్పమంటావని పలురీతుల దుఃఖిం చారు కౌసల్యా సుమిత్రలు.

"కైకకు దిక్కు తోపక మొగంబును బైటను గప్పి, రోదనం
దాకయె లేని వెల్లు వనునట్లుగ సల్పిన, దూర్మిళమ్మ యే
కాకిగ నుండు టామె వథకంబున లేనిది, యామె సేవలన్
పీకను బొందినట్టిది - ద్రవింపదె డెందము తాతికే వినన్?" 1

ఊర్మిళా స్థితి ఏమిటో తెలియక భయపడ్డ చెలికత్తెలు వశిష్ఠమహర్షిని వెంటబెట్టు కొచ్చారు. దివ్యదృష్టితో విషయాన్ని గ్రహించి, అంతఃపురాన్ని ఊరడించాడు మహర్షి.

"ఈమెను సత్సమాధి గొన వింటు, భయంకర బాహుశక్తి శ్రీ
రాముడు లక్ష్మణుండును దురంబును సల్పుచు నున్నవారు, త
ద్భామ తపస్సు తోడ్పడగ ఘోర జయంబును గాంచి, వారు సు
త్రాముని దృప్తు జేసి యిదె రాగల వారని పల్కె నంతటన్" 2

ఊర్మిళా సమాధికి భంగం లేని రీతిగ పురంలో నిశ్శబ్దత ఆవరించింది. బ్రాహ్మణుల చేత పూజలు నిర్వహించబడ్డాయి.

"రామప్రేరిత మారుతి ప్రహత దుర్వారోగ్ర సంసేవక
స్తోమాధీన మహోషధ వ్రజ మహాక్షోణీధర ప్రాపణ
క్షేమోద్భాసిత భవ్య బాహుయుగళ క్షిప్త ప్రచండాస్త్రి కో
ద్దామ క్షుద్ధ రణేంద్రజి ద్దనుజ హర్తన్, రామ కాంచెన్ హృదిన్" 3

---

1. ఊర్మిళా - పు. 51
2. ఊర్మిళా - పు. 52
3. ఊర్మిళ - పు. 53

రావణ సంహారం పూర్తయి గృహోన్ముఖుడైన రాముని యోగదృష్టితో దర్శించి ఆనందించింది ఊర్మిళ-

## సామీప్యము

పురంధ్రీమణుల మంగళ గీతాలాపాలతో, రంగవల్లుల సోయగాలతో అయోధ్యానగరం సంబరం చేసుకొంటుంటే రఘురాముడు నగరంలో అడుగుపెట్టాడు. తల్లులు బిడ్డల్ని అక్కునజేర్చుకున్నారు. అయోధ్యావాసులు ఆనందతాండవం చేశారు. సీతాదేవి కన్నీళ్ళతో చెల్లెళ్ళు మాండవ శ్రుతకీర్తుల్ని కౌగలించుకుంది. కానీ-ఆమెలో ఏదో అసంతృప్తి గమనించాడు శ్రీరాముడు."ముదల్బిన్ గాన నూర్మిళ్రభన్"అన్నాడు సుమిత్రతో. ఊర్మిళా తపస్సమాధి ప్రస్తావన కొచ్చింది. కన్నీరు నించింది కౌసల్య.

"మా మనసుల్ హరించినది నాయన! యా యమ లేచి, లక్ష్మణ
స్వామికి, నీకు సీత వలెసౌఖ్యము గూర్చిన జాలురా!" యనెన్![1]

కౌసల్య మాటల్ని విని సాభిప్రాయంగా లక్ష్మణుణ్ణి చూశాడు రామచంద్రుడు. చిరునవ్వులు చిందించాడు చిన్ని తమ్ముడు. అంతఃపురం ఆనందకేదారమైంది. అల్లుళ్ళను కూతుళ్ళను అక్కున జేర్చుకొన్నారు కన్నవారు. అందరి హృదయాల్లోనూ ఒకే ఆలోచన-

"రాముని చూపులోని మధురసద్భవులన్ గ్రహియించి లక్ష్మణ
స్వామి చనెన్ సువర్ణమయ సౌధముపైపు ప్రశాంత చిత్తతన్
శ్రీమ దనంత వైభవము చేతనతం గొన, భామినీ మణీ
కామిత మెంచి, పుల్క లెసగన్, విడజేయ సమాధిముద్రలన్" 2

రాముని చూపు లక్ష్మణుని ఊర్మిళా సౌధానికి బయలు దేరదీసింది. వశిష్ఠుల ఆజ్ఞతో సమాధి విష్టురాలైన ఊర్మిళా శిరస్సుపై చేతినుంచి స్పృశించాడు లక్ష్మణుడు. మీట నొక్కితే విద్యుత్ప్రసారంతో దివ్వెవెలిగినట్లు-స్వామి స్పర్శతో కన్నులు విప్పి దిక్కుల కాంతిని పంచింది ఊర్మిళ.

"లీలా మానుషవిగ్రహాన్, సిత నవాలీ దంతశోభావహాన్,
హేలా యౌవన నైగవిగ్య సుమిళర్థైమైకదేహాన్, చల
ద్రోలంబోజ్జ్వల కాకపక్ష వివహాన్, దుర్దాంత వీర్యప్రభా
పాలం బాపరిమాన పింగళకతా ధాప్రిష్ఠబాహాన్ గనెన్" 3

---

1. ఊర్మిళ - పు. 55
2. ఊర్మిళ - పు. 56
3. ఊర్మిళ - పు. 57

ఊర్మిళా శిరసుపై చేతినుంచి, ఆమెను మేల్కొల్పడం "ఊర్మిళా దేవి నిద్ర" జాన పద గేయాత్మక సన్నివేశాన్ని గుర్తుకు తెస్తుంది. ప్రాణనాధుని వీక్షించి పులకిత గాత్రయైన ఊర్మిళ లక్ష్మణస్వామి పాదారవిందాలపై వాలిపోయింది. ప్రియభామను కౌగిలిలోనికి తీసుకొన్నాడు సౌమిత్రి.

"తన రూపంబును జూడగా ననుచు సర్వాంగప్రసన్నేత్రాలతో
గను, నాదర్శ కపోల మందు గను సుత్కమ్మూర్తి బింబంబిటన్
గననౌ నంచును మోవిపై గను గన ద్గంభీర బింబంబులం
చును దత్త ద్విమలాంగకంబులను జూచున్ లక్ష్మణస్వామితాన్"1

అనంత వియోగానంతర కలయిక ఆనంద సంద్రమై పొంగిపొర్లింది.

తనశయ్యపై కూర్చొని తనను మేల్కొలిపిన లక్ష్మణుని-పదునాల్గు సంవ త్సరాలుగ మూసిన కన్ను తెరవక పడియున్న ఊర్మిళకు అంతఃపురంలో ఎవరో పరపురుషుడు ప్రవేశించాడని భావించిన-జానపద సాహిత్యంలో—

"అయ్య మీరెవరయ్యా మీరింత యాగడమ్మన కొస్తిరీ
సందుగొందులు వెదకుచూ మీరింత తప్పగళాయగవస్తిరీ
యెవరూ లేని వేళా మీరిపుడు యేకాంతమున కొస్తిరీ"2

అంటూ ప్రశ్నించడమే కాక—

"మాయక్క బాప విన్నా మీకిపుడు ప్రాణముకు హాని వచ్చూ
మాయక్క మరిది విన్నా మిమ్మిపుడు బ్రతుకనివ్వరు జగతిలో"3

అని మందలించడం జానపదుల్ని గుర్తు చేస్తుంది.

## సైకతము

అనంతకాల వియోగానంతరం కలుసుకొన్నారు అక్కచెల్లెండ్రు. చిరకాలం తరువాత కలుసుకొన్న ఆత్మీయుల హృదయాలలోని ఊసులు రెక్కలొచ్చి విహ రించాయి. సీతోర్మిళలు పద్నాలుగు సంవత్సరాలనంతరం సరయూసైకతాలపై కూర్చొని, కబుర్లను పంచుకోవడం ప్రారంభించారు. విషపుదియలు, మధురక్షణాలు గాలి తరగలుగా దొర్లిపోతున్నాయి వారి సంభాషణల్లో.

---

1. ఊర్మిళ—పు.58 2-3— ఊర్మిళాదేవి నిద్ర—జా-గే-

"అశ్రులు ధారలై చన, వ్యథాఽశ్రుతరోచి మనోఽత్రపీమలో
నశ్రమరీతి గోచరిల నాదృతి నూర్మిళ గౌగిలించి, చె
ల్లీ! శ్రుతి సేయ, నే దొకటియే? పదునాలుగు వర్షముల్, వియో
గశ్రమ నెట్లు పైచితివో! కార్శ్యముతో-ననె సీత ఖిన్నయై"1

పద్నాలుగేళ్ళ పతి వియోగాన్ని ఎలా సహించగలిగావని సీత ప్రశ్నిస్తే, అక్కా ఆ రాక్షసుల మధ్య అంతకాలం నీవెలా ఉండగలిగావని ఊర్మిళ సందేహించింది.

"కరవంబెట్టితి మమ్మ కష్టజలధిన్ గాంతైక సత్ప్రేమయే
కరకం బట్టిన నావగా; భువి పరీక్షాకాలముం జెల్లె,"2

అంటూ గడచిన కష్టదినాల గుర్తు తెచ్చుకోవడం ఇష్టంలేనట్లు, నెట్టివేసి, తుదిగ "ఉవ్వరు చెప్పంగలవారు రాగలది" అంటూ నిట్టూర్చింది వైదేహి. ఈ వియోగ వ్యధ ఇలా ముగిసింది. రాబోయే "రామకథ" ఎలాసాగుతుందో-అని ధ్వని?

సేవాభావంతో నిత్యము నమస్కరించే లక్ష్మణునిలో "నిన్ను నెప్పుడు కన్గొంయ ముదంబు నొందితిని మాపుల్ తేపులున్ నెట్టుచున్" అంటూ ఊర్మిళను చూసుకుంటూ గడిపావన్న సీత పలుకులు తీయనివై చెల్లెలిపై అక్క ప్రేమను ప్రదర్శిస్తున్నాయి.

యోగ నిద్రా మహిమతో నిద్రాముద్రితమైన ఊర్మిళ తేజస్సు లక్ష్మణునిలో ప్రవేశించి, సీతకు లక్ష్మణునిలో ఊర్మిళను దర్శింపజేసి ఉంటుందని భావించడం రమ్యం.

అక్క కౌగిలిలో ఒదిగిపోయింది ఊర్మిళ. పొర్లుతున్న కన్నీటిని ఒత్తి, నుదుటిపై ముద్దిడికొని మోముపై పొరాడు కురులను చక్కనొత్తి, చెక్కిళ్ళను స్పృశిస్తూ శోకాన్ని మరచిపోయిన జానకిని సరయూ సమాగతమైన పిల్లవాయువులు మునిమాపు వేళను గుర్తుచేస్తూ సేదదీర్చాయి.

## సోత్ప్రాసము

కైకేయీ ఆశీఃప్రభావ ప్రయత్నారే రామునిచే వర్చిన రాక్షససంహారం, జరిగిన రామకథ అన్న విశ్వాసం గల కవి నిర్మిత లక్ష్మణునకు ఆదేభావం ఉండటంలో ఆశ్చర్యంలేదు. అందుకే లక్ష్మణుడు తల్లి కైకేయిని చేరి-రామచంద్రునికి నీవిచ్చిన వని శోక సంక్షేమంగా పూర్తయింది. ఇక అన్నకు పట్టాభిషేకానికి అనుజ్ఞ ఇవ్వ వలసిందని ప్రార్థిస్తారు.

---

1. ఊర్మిళ-పు. 59
2. ఊర్మిళ-పు. 60.

"నీ యాశీర్వచన ప్రభావమున ఖండించెన్ మహాభీల దై
తేయాళిన్ బదునాల్గువేల ఖలులన్, దీపించి, లంకేశ్వరున్
మాయావిన్ హతమార్చె"1
శీఘ్రమే యన్న పట్టాభిషిక్తు డగుత!
నీదు నానతి తల్లి! నీ పాదసేవ,
ప్రేమ భాసిల్ల,"1

అంటూ అన్నపై ప్రేమతో తెలియని గత రోజుల్లో విన్న విందిందానవి, అవి వేకాన్ని మన్నించి, అన్నకు పట్టాభిషేకానికి అనుజ్ఞ ఇవ్వవలసిందవి ప్రార్థించిన పారతంత్ర్య భక్తి సంపన్నుడైన వావిలాలవారి లక్ష్మణుని సృష్టి అపూర్వం.

## సౌభాగ్యము

వశిష్ఠుని ఆదేశం మేరకు ఊర్మిళాలక్ష్మణులకు సంపంగినూనెతో తలంట్లు పోసి, మధుపర్కాలను కట్టబెట్టారు. భర్తలతో మధురభావ సంపన్నలై, ఆనంద విధానాలైనారు అయోధ్యానగరపు కోడళ్ళు. అన్నదమ్ముల స్నేహం లోకానికి ఆదర్శప్రాయమైనది. "రామలక్ష్మణుల్ లేవిదయోధ్యలేదు, దరిలేదు, కకుప్పును లేదు చూడగన్"

ఊర్మిళాలక్ష్మణుల సంసార జీవితం అనురాగ పరిమళాల గుబాళించింది

"స్వతతాం కాన బ్రగండ బాలికమునన్ వర్తింప, భామాన్య దీ
ధితులన్ లక్ష్మణమూర్తి మోము చొరి, యందే సోల, గండైక సం
గతి సంప్రాపిత పత్ర భంగ రచనం గన్గొని తద్భర్త, కా
నతియద్దం బిడి, లక్ష్మణత్వ మిపుడే సార్థక్య మంచున్ నగున్"2

లక్ష్మణత్వాన్ని సార్థకం చేసి, చిఱునవ్వుల కవ్వించిన ప్రేయసిని కౌగిలిలో బంధించాడు ఊర్మిళా ప్రియుడు.

"పతి వక్షః స్థలి సందిటన్ దలగ హావ స్ఫూర్తులం గొల్పుచున్
దత సల్లాపము లాడుచున్, విమల ముక్తాహారమున్ మీటుచున్
గతి కల్పించుచు, భారమైతి నొకొ! సాక్షాద్రామ భారంబు నే
ర్చితి గాదే తల దాల్పగా ననుచు రక్తిన్ రామ తేల్చున్ బ్రభున్"3

రాముని భారమే మోయడానికి సిద్ధమైన లక్ష్మణునకు 'రామ' భారమవ్వడం జరగదు- 'రామ' సేవలోను రాముని సేవలోను కాలాన్ని మరచిపోయాడు సౌమిత్రి.

ఊర్మిళా లక్ష్మణుల దాంపత్యవల్లి మారాకులు తొడిగింది.-సీమంతోత్సవాలు పెద్దఎత్తున నిర్వహించబడ్డాయి జ్యేష్ఠపుత్రుడు అంగదుడు. ధర్మం నాల్గు పాదాలతో

1. ఊర్మిళ-పు. 62. 2. 3. ఊర్మిళ-పు. 65

నడుస్తుండగా లక్ష్మణుడు అన్నను సేవిస్తున్నాడు. కాలం గడిచింది. సౌభాగ్యవతి ఊర్మిళ ద్వితీయ సంతానాన్ని అయోధ్యానగరానికి ప్రసాదించింది, అతను చంద్రకేతుడు.

తన భాగానికి వచ్చిన రాజ్యాన్ని బిడ్డలకిచ్చి, రాముని చెంతనే అయోధ్యలో వుండిపోయాడు లక్ష్మణుడు.

"రాముని సేవింతు రూర్మిళా లక్ష్మణులెద
రాణులను గొల్తు రూర్మిళా లక్ష్మణు లెద-
భామ సేవించు లక్ష్మణస్వామి నెపుడు
రామ దేలించు లక్ష్మణ స్వామి సతము"

ఊర్మిళా లక్ష్మణుల సంగతితో కావ్యం ముగుస్తోంది. రామానుజాచార్య 'ఊర్మిళ' జానకి చెల్లిగ నామమాత్రి కాగా, రామమూర్తి గారి ఊర్మిళ, స్వయంప్రకాశ. జనకుని కొమార్తెగా, జానకికి చెల్లెలుగా ఆమెకు ప్రాతినిధ్య ప్రతిపత్తులున్నాయి. కథను కల్పనల వైపు పోనీయక అలాగని మూలకథానుగుణంగా పేలవమై సాగనీయక సమయానుగుణమైన వర్ణనలతో, బిగువైన కథా సంవిధానంతో వానితో పోటీపడే భాషా సంపత్తితో ముప్పేట ముత్యాలహారంగా కావ్యం తీర్చి దిద్దబడింది. అనంత కాలవియోగానంతర దంపతుల కలయికలో తొణికిన దాంపత్య శృంగారం, రసిక హృదయాలకు ఆనందదాయకమవుతుందనడంలో అతిశయోక్తి లేదు.

కవి సమ్రాట్ విశ్వనాథవారిని 'పితామహులుగా గౌరవించి శిరసువాల్చిన ఈ కవి, వారి భాషలోని ధార్మికతను మార్మికతను అలవర్చుకున్నారనిపిస్తుంది. ధిత్పువు -రిరంస - మత్స్యండిక-చిరంటి - తోదితచిత్తుడు - ముత్తో - సీమాటి - గోపానసి - శంయువు - శుభంయువు - తస్థివాంసుడు - సౌహృత్వము- వంటి అనేక పదాలు అప్రయత్నంగా పదాల్లో చోటుచేసుకున్నాయి. ఇది వారి భాషోపాసి-భుతకు నిదర్శనం.
1. ఊర్మిళ-పు- 68.

రామాయణ కథలో నిర్లక్ష్యం చేయబడినట్లు కన్పించే ఈ పాత్రను యోగినిగా చిత్రించి, ఆమె యోగ మహిమయే రామలక్ష్మణులను దరికి చేర్చిందన్న స్థాయికి ఆ పాత్రను పెంచడం కవికి ఊర్మిళపైగల ఉదాత్త భావ విస్ఫూర్తికి నిదర్శనం.

అత్తల్ని సేవిస్తున్న ఊర్మిళ "భాగలాకుముడుపుల్ ఘటియించి సీతాభ్రి అండముల్ కలిపి విడెంబు కూర్చెడిని" అంటూ విగతభర్తృకలైన అయోధ్యా రాణులకు తాంబూలాలు అందించిందని వ్రాయటం, ఊర్మిళా దినచర్యను వర్ణిస్తూ "ప్రహసంతి నొక్కెడ రాజబెట్టు" అంటూ పొయ్యి అంటింప జేయడం వంటివి ఈ పాత్రకవికి తగిన కల్పనలు కావనిపిస్తుంది.

## సుధాంశు వారి ఊర్మిళ

అన్నను తీసుకొస్తానని అడవికి బయలుదేరిన భరతునితో ఊర్మిళను కూడ చిత్రకూటానికి తీసుకెళ్ళిన దయార్ద్ర హృదయుడీ "సుధాంశు" - చిత్రకూటం చేరిన భరతుని రాణువలో ఊర్మిళకూడ ఉంది. ఉండకేమవుతుందన్నది ఆధునిక కవి ఆలోచన. కుటీరం వెలుపల అన్నను అంగీకరింపజేయడానికి భరతుడు యత్నిస్తున్నాడు. ఒంటరిగా పర్ణశాలలో కూర్చొంటుంది ఊర్మిళ. హఠాత్తుగా లోపలికొస్తాడు లక్ష్మణుడు. భర్త పాదాలను కన్నీటితో కడిగింది ఊర్మిళాదేవి. – ప్రియా హృదయాన్ని అర్థం చేసుకొని సముపలాలించిన లక్ష్మణుని పల్కులు ఈ కావ్యానికి ప్రథమ చరణాలు.

ఈ సన్నివేశం ప్రముఖ హిందీకవి మైథిలీశరణ్ "సాకేత్" కావ్యంలోనిదీ కవికి ప్రేరణయైంది. మైథిలీ ప్రభావంతోనే "సుధాంశు" చిత్రకూట పర్ణశాలలో ఊర్మిళా లక్ష్మణులను కలిపారు.

తాను ప్రారంభించిన మహాయజ్ఞానికి ఆమె సహకారం కావాలని, ఆమె బేలగా విలపిస్తే తానే విధంగా తన కర్తవ్యాన్ని నిర్వహించగలనని వేదన చెందుతాడు లక్ష్మణుడు.

"ఈ విటు క్రుంగికూలుచు కృశించి తపించుచు నుంటివేని నే
నేవిధి భ్రాతృసేవ నొనరింతు ప్రశాంత హృదంతరుండనై!" 1

అన్న ప్రశ్న భ్రాతృసేవా పరతంత్రుడైన లక్ష్మణునిది.

"శ్రీకరమ్ము, సౌభాగ్యభాగ్యాకరమ్ము, నీ సహాయమ్ము పేర్మినర్థించుచుంటి"2 నని ప్రార్థించి, అయోధ్యకు వెళ్ళవలసిందని, అన్నావదినెల సేవించి అనతికాలంలో మరలిరాగలనని ధైర్యం చెప్పి బ్రతిమలాడుతున్న ప్రాణనాథునితో ఊర్మిళ.

"ఇంతగ జెప్పనేల హృదయేశ్వర! మీ కెది యిష్టమో అదే
సంతసమౌను నాకును– "ప్రసన్న సుమంగళమూర్తి ఊర్మిళా
కాంత" యటంచు బేర్వడి అఖండ యశస్విని యౌటకన్న అ
త్యంత శుభోదయమ్ము కలదా! వసుధాస్థలి జీవితేశ్వరా! " 3

అంటూ ఓదారుస్తుంది.

---

1. ఊర్మిళ – వైజయంతి ఖండకావ్యం – పు.42
2. ఊర్మిళ – వైజయంతి ఖండకావ్యం – పు.42
3. ఊర్మిళ – వైజయంతి ఖండకావ్యం – పు.44

ఈ పదాలకు మూలం మైథిలీ శరణ్ వి,

"హేస్వామి! కిస్‌నాకహి నాథా కహాఁవన్‌కే కర్మోంకాదోష్

పర్ జిస్ మే సంతోష్ తుమిహే, మురు ఉసేమేహై సంతోష్" 1

అంటే–'మైథిలీ' 'ఊర్మిళ'తెలుగులోకి తొంగిచూచిందని మనం గ్రహించవచ్చు.

## ఊర్మిళా సౌందర్యం

శ్రీమాన్ రామానుజుల వారి ఊర్మిళ అనుజ్ఞ కోసం వచ్చి, ప్రాధేయపడి పాదాలపై వ్రాలిపోయిన భర్తను ఓదార్చి రామకథనంతా విన్పించి, రాముని సేవకు వెళ్ళిరావలసిందని సాగనంపిన వీరపత్నిగ కన్పిస్తుంటే- పావిలాల వారి ఊర్మిళ అయోధ్యాపుర అంతఃపుర కాంతగానే తన పాత్రను ఇంపుగ పెంపొందించుకొని, యోగినిగా, తపస్వినిగా అతీంద్రియత్వంతో అత్తల సేవలో భర్త సేవలో సైతం పునీతయై మాతృమూర్తిగా, ఆత్మీయురాలైన అక్కకు ముద్దుల చెల్లెలుగా అమరాగ దేవిగా పరిపూర్ణ స్త్రీత్వంతో ప్రకాశిస్తుంది. జంధ్యాలవారి ఓదార్పులోని కన్నీటిజడిలో ఊర్మిళా రూపం మసకగా కన్పిస్తుంది. సుధాంశువారి ఊర్మిళ మైథిలీ శరణుని ఊర్మిళకు ప్రతిబింబం. మైథిలీ శరణుని ఊర్మిళ మహోజ్వల పాత్ర. ప్రేమ, త్యాగం అనేపవిత్ర గుణాలకు ప్రత్యక్షరూపం వీరి ఊర్మిళ. "ఇతిహాస ప్రధానమైన ఈ మహా కావ్యంలో ఊర్మిళ పాత్ర ఉజ్వలమై ప్రకాశించడమే కాక ఇతర పాత్రల్ని కూడ ప్రకాశింపజేసింది. ఊర్మిళ పలికిన ప్రతి పల్కులోను కసి, సానుభూతి, కరుణ, ప్రేమ, నిర్దుష్టంగా స్పష్టమౌతాయి —" 2 అట్టి ఊర్మిళను తెలుగులో "లఘువు" గానే దర్శింపచేశారు "సుధాంశు".

డాక్టర్ నారాయణరెడ్డివర్యులు కూడ ఊర్మిళ పాత్రతో సంభాషించారు. - గేయసరళిలో. "ఓ మనస్సన్యాసినీ! ఊర్మిళా! ఓ ఆత్మ సంభాషిణీ! నిర్మలా!" 3 అనే సంబోధనలు సరసాలు. ఊర్మిళ పాత్ర ప్రాకృతులకు దేవతాకృతిగా వెలసిం దని, అభాగినివని, యోగినివని యథాశక్తి ప్రశంసించారు.

1. సాకేత్ – మైథిలీశరణ్ –
2. ప్రవంతి– చిమ్మపూడి - జనవరి 1963 - పు.33
3. ఊర్మిళ–దివ్వెల మువ్వలు - సి.నా.రె.

3. ఊర్మిళ – దివ్వెలమువ్వలు - పు.11

"నీ వళాగినివి, పున్నెముల పంటవు నీవె
నీవు యోగినివి, అంతేకాదు రాగిణివి
వినుగూర్చి వ్రాయులేఖివి మషీరసములో
కాదు - కన్నీట మున్కలు వేయవలెనమ్మ" 4

"ఊర్మి" అంటే తరంగం. రామాయణ కథావేగాన్ని పెంచడానికి ఈ అల ఉపయోగపడి, వేగంగా గమ్యాన్ని చేర్చి, రామకథా బంధాన్ని ఏకసూత్రంగా మల చిందని చెప్పుకోవడం రమ్యంగ ఉంటుంది.

"భజ్యతే స్వయమేవభంగః" అన్న నిర్వచనాన్ని అంగీకరిస్తే తనంత తాను నశించునది అనే అర్థంలో రాముని సేవకై పతిదేవుని పంపి, పదునాలుగు వసం తాలు ఏకభుక్తగా, నిద్రామూర్తిగా, నిశ్చైతన్యగా, యోగినిగా, తన్నుతాను కృశింప జేసుకొని తపస్వినిగా రూపొందిన "ఊర్మిళ"కి వాల్మీకి చేసిన నామధేయం సార్థకం.

---

4. ఊర్మిళ – దివ్వెలమువ్వలు - పు.12

# మాండవి

మాండవి భరతుని ఇల్లాలు. అయోధ్యానగర సార్వభౌముని ఇల్లాలుగ వాల్మీకి మహర్షిచేతనే కాదు అనంతర కాలికులు ఎవరి చేతను దర్శింపబడని సౌందర్యం ఈమెది. కుశధ్వజుని కొమార్తెగ, భరతుని పాణిగ్రహించి, అయోధ్యా నగర రాజప్రాసాదంలోకి అడుగుపెట్టింది. మిధిలా నగరంనుండి వచ్చి దేవతా పూజాదికాలు పూర్తిచేసుకొని అంతఃపురంలో ప్రవేశించిన ఈమె తిరిగి కనబడదు వాల్మీకంలో.

అటువంటి "మాండవి"ని ఆదర్శనారిగ చిత్రించి ఆంధ్రజాతికి అందించిన ఖ్యాతి కవి గుడిమెళ్ళ వారిది. వారి కావ్యమే "మాండవి".

హేమంతపు గాఢ చలిలో గోదావరి స్నానానికి బయలుదేరిన రాముని అనుస రిస్తున్నాడు లక్ష్మణుడు. ఈ సమయంలో భరతుని ప్రస్తావన వస్తుంది వాల్మీకివారి రామాయణంలో.

"అత్యంత సుఖసంవృద్ధ స్సుకుమారస్సుఖోచితః
కథ న్న్వపర రాత్రేయ సరయూ మవగాహతే"1

సుకుమారుడైన భరతుడు ఇంత చలిలో అర్ధరాత్రి స్నానాలు ఎలా చేస్తున్నాడో! అన్న సందేహాన్ని లక్ష్మణుడు ప్రసంగవశంతో రామునితో అంటాడు. భరతుడు అర్ధరాత్రి సమయంలో స్నానానికి వెళ్ళడానికి గల కారణం "కైకేయీ పుత్రుడుగ జనులకు తన మొహాన్ని చూపించలేని అవమానమే"నని వ్యాఖ్యాతల వివరణ.

"అపరరాత్రేషు యథానవవైధవ్యాః స్త్రియః మనుష్యసంచారాత్ పూర్వ మేవ మనుష్యముఖ మవలోక యంత్యా గచ్ఛంతి తథాఽయమపి కైకేయీ పుత్రోయం ఏతన్నిమిత్త ఏవానర్థమితి జనాః వీక్ష్యంతీతి భీత్యా అపరరాత్రేష్వేవ గచ్ఛతే"—2 అని వ్యాఖ్యానించారు.

ఈ విశేషణే కవి కావ్యానికి నాంది. ఊహాలకు ఊపిరి. భరత పాత్రోన్న తిక్తై, "మాండవి" పాత్రనువెలికితీయించింది. వాల్మీకి చూపించని అందాల్ని అందిం చింది.

---

1. వాల్మీకం 3–16–30 2. చతుర్వ్యాఖ్య 1046 పుట

మూలంలో భరతుడు స్నానానికి వెళ్ళేది అర్ధరాత్రి మాత్రమే. కాని "మాండవి" కావ్యంలో కైకేయీ పుత్రుడు స్నానానికి బయలుదేరిన రాత్రి కాళ రాత్రిని తలపింపజేస్తోంది.

…రాత్రి నడిజాము రమారమి దాటవచ్చె-గ
ర్జానముదాయుపంజనితరావమహాధృతి - చంచలా ప్రభా
పానము సీదుగాలి-వరివచ్చును బోల్పగగాఢరాత్రితో 1

ఇటువంటి వాతావరణంలో స్నానానికి బయలుదేరాడు భరతుడు. లోకమంతా భయపడి గూళ్ళలో తలదాచుకొంటున్న సమయంలో చావుకి తెగించిన మానవుడిలాగా గుర్తుపట్టవీలులేని కారుచీకటిలో నారవస్త్రంలో రాచఠీవి వెలుగుతుంటే మెరుపు తీగల కాంతిలో భరతుడుగా పోల్చుకొన్న చమత్కారం కవిది. "నందిగ్రామ నివాసియో భరతుడా? నాకంటి కట్టుండెడిన్"2 అంటూ పాతకునికి పరిచయం చేస్తారు భరతుణ్ణి,

"దినమున సరయూనదియం
దవగాహన మాచరింప నరిగిన నితడే
యపురా! కైకేయీతనూ
భవుండని ప్రజతిట్టునంచు వచ్చెనె? రేయిన్.

ప్రజలు నిందిస్తారేమో కైకేయి కొడుకుననే భయంతో రాత్రిపూట స్నానానికి బయలుదేరాడు. ఈఅవమానాన్ని భరించలేక నదిలోపడిమరణిద్దామా అంటే "రామపాదుకలు" గుర్తుకొచ్చి ఆగిపోతున్నాడు.

పోవుచునుండగా బురుగు ముట్టిన బాగని చూచుచుండు రే
కే విషజంతువైన గబళించిన మంచిగా దలంచు నా
పావనవాహినిన్ మొసలి పట్టిన బాగని చూచుచుండు నే
భావము కూడిరాదు 4 బలవన్మృతి దోసముగా విధించుటన్.

ఏ పురుగో ముట్టుకొని మరణిస్తే వేదనలు తీరిపోతాయన్నంత నైరాశ్యం భరతుని ఆక్రమించుకొంది. పద్నాలుగు సంవత్సరాలు ఎప్పుడు వెళ్ళుతాయో? రాముడు వస్తాడో? ఈ పాపిని చూడటానికి ఇష్టంలేక అక్కడే ఉండిపోతాడో? సందేహాలు సముద్రాలౌతున్నాయి.

---

1. మాండవి 13-1
2. మాండవి 14-6
3. మాండవి 15-10
4. మాండవి 15-13

మనసు మోయగ లేదిక భావ భారమున్"1 అనే ఉల్బణస్థితికి చేరుకొన్నాడు భరతుడు.

నలగని మల్లెచెండువలె, కందని కవటాకు వలె నవ యౌవన సంపదతో ప్రకాశిస్తూ సమీపంలో సంచరిస్తున్న మాండవి సౌందర్యం భరతుని కదల్చలేక పోయింది పలుకే బంగారమై పోయింది. చేసంజ్ఞలతోను, కనుసన్నలతోను పనులు చేయించుకొనే స్థితిలో ఉండిపోయాడు భరతుడు.

భర్త మౌనవ్రత దీక్షలో ఉంటే మాండవి అలంకార భూషితయై అతని వ్రతాన్ని చెదారగొట్టే రీతిలో ప్రవర్తించేదికాదు.

"పొంగెడు పాలునా వయసు పొంగుచునుండ ననుక్షణంబు న
స్తంగతమోహయై భరతు సన్నిధి మాండవి విస్తరంగమౌ
గాంగఝరంబు రీతిగ వికారము లేక ప్రశాంతినుండు ని
స్సంగతినున్న మౌనితతి చాలునో? చాలదో? తద్విరక్తికిన్.-2

ఈ పద్యం ఆమె ప్రవర్తనకు నిర్మల దర్పణం. ప్రణయ దీపాన్ని వేడి నిట్టూర్పుల పడగాలిచే ఆర్పివేసి, వక్షస్థలమందలి వేడిని కన్నీటి ధారల చల్లార్చిన ఆమె వైరాగ్యం ఆశ్చర్యం కలిగిస్తోంది. మాండవి రూపం సజ్యరమాకుమారకరచాపం. కాని ఆభరణ రహితయైన ఆమె భ్రష్టసామ్రాజ్య లక్ష్మిని గుర్తుకు తెస్తోంది. వాళ్ళ కన్నులలో నిరాశలు దోబూచులాడుతున్నా లోకానికి మాత్రం ఆమె భర్త చాటు భార్య.

"చారునితంబమందు దిగ జారిన కాంచియు నేకవేణిగా
జారిన కేశభారము కషాయపురంగుగ మారి ధూళిపై
జేరిన చీరెయున్ దెలియ జెప్పును మాండవిబాధ"-3

కృశించిన శరీరంతో బంగారు కాంతి మిగిలి ఉన్నా, ఆమె నవ్వు సంగతి మర్చి పోయి చాల కాలమైంది. అరణ్యవాసం చేస్తున్న భర్త సేవలో ఆనందాన్ని అనుభ విస్తున్న అర్ధాంగి మాండవి.

---

1. మాండవి 16-15
2. మాండవి 16-17
3. మాండవి 17-21

భర్త స్నానానికి వెళ్ళి చాలా సమయమైందనే ఆవేదనతో తామగ సరయూ తీరానికి బయలుదేరింది. గాలివాన. విశంబభారయైన ఆమె చిగురుటాకుల వంటి పాదాలతో కంటకావృత మార్గంలో ఉపవాసకృశాంగియై నదీ తీరానికి చేరుకొంది. "జాలియు భీతి, వేదన, విషాదము కన్నులనిండ"1 భర్త జాడకై చూపు సారించింది.

చెక్కిలిపై చేయిచేర్చి నదీ తీరంలోని బండరాతిపై కూర్చొని నీటిలోనికి కాళ్ళుజార్చి తదేకంగా చూస్తూ రామవనవాసాన్ని గురించి ఆలోచిస్తున్నారు భరతుడు.

"శైవలినీ ప్రవాహ వికసత్సుకుమార సమీరలోల వీ
చీవిసరోపఘర్షణ విశీర్ణమనోహర వారిబిందువుల్
ప్రోవులు ప్రోవులై తనదు ముంగిటవిచ్చి కషాయవర్ణ రే
ఖావృత మూర్ధకుంతలములందు విహారము సేయుచుండగా"2

ఆలోచనామగ్నుడైన భర్తను చేరింది మాండవి. వానకు తడిసిన పైట చిరుగాలికి కదలాడుతూ వక్షద్వయ సౌందర్యాన్ని కాపాడుతూ వుంటే మానసిక వ్యధతో విల బడింది. ఇరువురు "మాటామంతీ" లేకుండా అలా ఉండిపోయారు క్షణకాలం. ఇంతలో మాండవి హృదయం నుండి వెలువడిన వేడివిట్టూర్పులు భరతుని శరీరానికి తగిలాయి. "మాండవీ హృదంకురిత మహావ్యధావిభవ ఘోరవిశ్వసనంబు"3 భరతుని శరీరానికి "చుఱుక్కున" తగిలి సమాధి భంగం చేసింది. హృదయమంతా రామభావనాక్రాంతం. ఎదురుగా నిలిచిన మాండవిని "కేకయాత్మజా సుదతికి" కోడలుగ గుర్తుపట్టాడు భరతుడు. ఆశ చిగిర్చింది. రాముడు వచ్చెనా? అంటూ ఆదుర్దాగా ప్రశ్నించాడు. "ఆటకు రమ్మనెనా?" అని కోరికగా అడుగుతాడు. "నను నన్ను బిల్వనీ సీమకు బర్వునెత్తుక నిశీథములో నెటువచ్చితే"4 మాండవిపై జాలిని కురిపిస్తాడు. "పతంధాముడు సీతతో ఎక్కడున్నాడు? నీవల్ల గదా నాకోరికలు ఫలించాయి అనేస్తాడు—మాండవిని కేకయాత్మజాపతి గోడలుగ గుర్తించడంలోనే భరతునికి కైకపై నున్న ఏహ్యభావం. అలాగే తనను అనుసరించి వచ్చిన ఈమె తన నియతికి భంగం కలిగిస్తుందేమోనన్న సందేహం వలన కలిగిన వ్యతిరేకత ధ్వనిస్తున్నాయి.

1. మాండవి 18-30
2. మాండవి 19-33
3. మాండవి 20-36
4. మాండవి 20-38

రాముడు చిక్కిపోయాడా? వదిన చిక్కి శల్యమై వచ్చిందా? మనవాడు సర్వమున్ వదిలెనటంటగా బ్రతికి వచ్చెనె" అంటూ ప్రశ్నల వర్షాన్ని పరంపరంగా మాండవిపై కురిపిస్తాడు భరతుడు, నీవిక్కడకు వస్తే అక్కడ వారి అవసరాలను చూసేవాళ్ళెవరుంటారు? అంటూ బాధపడటమే కాకుండా, అసలు రాముడు ఇటు రాకుండా అటు ఎందుకు వెళ్ళాడు? భరతుడు మరణించాడని అనుకున్నాడా? అంటూ బేలగ విలపించిన ఆర్ద్రహృదయుడీ భరతుడు.

"జానకి కూడనన్ మరచె స్వామికి దమ్ముడు లక్ష్మణుండు నా
ప్రాణము దీయ నాడెదురు వచ్చెను వానికి నేను జ్ఞప్తికిన్
రానుగదా? దయామయుడు రాఘవుడెప్పటికైన గాని తా
మానడు చూడకుండనని మాండవి రేబవలాశ చేసెదన్-1"

అంటాడు రామునికై నిరీక్షణలో రాత్రింబవళ్ళు గడుపుతున్న భరతుడు "స్వామికి దమ్ముడు లక్ష్మణుండు" అన్న మాటలు ఎంతో బరువైనవి. తనకు లభించిన రామ సేవాభాగ్యం ప్రాప్తించిన అదృష్టవంతుడు లక్ష్మణుడు. మరి అతనొక్కడే "స్వామికి దమ్ముడు" తాను కాదన్న వేదన ఆ మాటల ఉనికితో భావస్ఫూర్తి నందిస్తాయి. ఇంతకాలం ఎవరికోసమైతే తాను ఎదురుచూపులతో నిరీక్షిస్తున్నాడో ఆ మహావీయుడు రాముడు వచ్చాడు. కానీ తనను చూడకుండా వెళ్ళిపోయాడు. ఇంకా ఎవరికోసం తాను జీవించాలన్న నైరాశ్యం వచ్చేసింది. "ఈ వేదన లోన నేననుభవింపగ జాలను పోయి వానికీ పాదుకలిచ్చి మొక్కితరి పాదములన్‌బడి యేక్పివత్తు"2 నన్న ఆత్మార్పణతో ముందుకడుగు వేస్తాడు భరతుడు.

ఇంతలో అతనిలోని విచక్షణ మేల్కొంది. ప్రభువు రాలేదని తాను బాధపడట మేమిటన్న ఆలోచన చోటుచేసుకుంది.

"స్వామి కనహ్యమౌ బ్రతుకు జానకికైనను జ్ఞప్తిరాని యీ
నామము లక్ష్మణుండు కలనైనను జూడగ గోరనట్టి యీ
మోము ప్రపంచమెల్ల పెదమోముగ త్రిప్పెడు నీ శరీరర మీ
భూమిని నమ్మలోలోకడు పుట్టగరా దొకనాటి కేనియున్"-3

అంతంలేని ఆవేదనతో పతమతమవుతూ "స్వామిని నేన పోయి కొనివత్తును మాండవి దారిజూడు"4మని అడుగు ముందుకువేశాడు భర్త. కాని భర్తలోకవిపిస్తున్న

---

1. మాండవి 41 ప.
2. మాండవి 44 ప.
3. మాండవి 45 ప
4. మాండవి 46 ప.

విచిత్ర భావ సంఘర్షణ ఆవిడకు దుఃఖాన్ని కలిగించింది. కపోలాలు అశ్రుపంకిలా లయ్యాయి. మాకాడు భరతుడు.

"మాండవీ యేది మోమునొకమారిటు త్రిప్పుము బాధయేమి?
గుండెల బాప మిట్టదరుగొట్టుచుమన్నది కంటినీరు చే
గండము దారగట్టెనవి ప్రశ్నించి
వినగల్గిన చెప్పుము మాటలాడవు-అని సందేహించి
ఉండుండుము చెప్పబోకు మంటూ నివారించి
అహో యివియా విశేషముల్–1

అంటూ మాండవి మాట్లాడక మునుపే తిరిగి తనే తన ఊహల్ని ఇలా ప్రకటిస్తాడు. "మాండవి పలుకుల్ని పాఠకులకు విప్పించే ఉద్దేశ్యం కవికి ఇంకాలేదు.

"చాలును మాండవీ! ఇకను జాలును నీ మననర్థమయ్యె" అన్న పలుకులు
ములుకులుగా మాండవి హృదయాన్ని గాయం చేస్తుంటే-
"......... .... ....... .......నీ
చేరెడు కన్ను లింతలుగ చేసి విలాసము లెల్లజూపి నా
ధీరత మంటగల్ప ఁ జనుదెంచితి వియ్యది కేకయాత్మజా
ఘోరతరోపదేశమనుకొందును కాదనిదేమి? మాండవీ.

—అంటూ అత్తగారి ప్రేరేపణతో తన నియమవ్రతాన్ని భగ్నం చేయడానికి, రాచరికపు సుఖాల అందజేయడానికి వచ్చావని, అసలు అర్ధరాత్రి ఈ విధంగా ఏనాడైనా ప్రయాణం చేశావా? నన్ను నీ త్రోవలోకి లాక్కోవాలనే ప్రయత్నం తప్పితే ఇది వేరుకాదని పరిపరి విధాల ఆమెను నిందిస్తాడు. ఆమెనేకాదు "ఉరిమి ఉరిమి మంగలంమీద పడ్డట్టు" ఆమె అత్తగారైన "కేకయాత్మజే" దీనికి ప్రేరకమని ఆమెను తప్పుపడతాడు. ఆమె మాండవి అత్తగారు. కానీ తన తల్లి అని చెప్పుకోలేని హేయభావం, న్యూనతాభావం భరతునిలో కవి ధ్వనింపచేశారు.

ఈ విధంగా ఎన్ని రీతుల నిందించినా పల్లెత్తు పల్కలేదు మాండవి. ఆవేశం తగ్గి చల్లబడిపోయాడు భరతుడు "రాముని చూడకున్న నిక ప్రాణము నిల్పుదు బొందిలోన"3 అంటూనే ఆయన రానప్పుడు నా శరీరాన్ని ఈ సరయూనదిలో పడవేసి ఎందుకు మరణించకూడదో చెప్పు అంటూ మాండవిని నిలదీస్తాడు.

---

1. మాండవి-47 ప.
2. మాండవి–51 ప.
3. మాండవి-53 ప.

"మానసికార్తి నేనికను మాన్పగలేను కుటుంబమందు బా
షాణము కల్పె నాజనని జన్మలు మారిన నీకళంక మిం
తేనియు మాసిపోదు బ్రతుకేమి? ప్రయోజన మెట్టి రాము రా
జ్యానకు గాని వానిగ గటా? యొనరించితి నేమికర్మమో."-1

"కుటుంబమందు పాషాణము కల్పె" నన్న పలుకుబడి భరతునికి కైకేయి పైనున్న ఏహ్య భావానికి, కోపానికి గీటురాయి. అంతేకాదు హంసతూలికా తల్పాలమీద శయనించవలసిన నారాముని కలకు పాషాణాలమీద పవ్వళింపజేసిన నా తల్లిని ఏమ నగలనను "ఏ కల్పపు నాటి దుర్దశయొ కైకకు పుత్రుడుగా జనించుటల్" 2 కైకకు పుత్రుడుగా పుట్టడమే తాను చేసుకొన్న పాపంగా భావించాడు భరతుడు. ఇల్లుని నేలమట్టం చేసిన తల్లిని చంపేద్దామా అనుకుంటే "మాతృహంతకుడ"ని రాముడు తిరస్కరిస్తాడేమోనని ఆ పని మానుకున్నా నన్నంత కోపము భరతుడిది. "దీనిని గొంతు కోసినన్ వల్లిని గోసినట్టులన వచ్చునె పాపము" 3 అన్నంత మాతృనిందకు వెళ్ళిపోయి, తన తండ్రికూడా మోహంతో కళ్ళు మూసుకుపోయి, ఈ విధంగా ప్రవర్తించి వీరందరకు కష్టాలు తెచ్చిపెట్టాడు. "ప్రియా స్నేహము తేనెతో మరుగుచేసిన కత్తి సుమా తలంపగన్" అన్న అనుభవ పూర్వకమైన పలుకు భరతుడిది. తన వెంటపడి సరయూనది చేరిన మాండవిని"కూడా అదే రీతిగా భావించాడు పై మాటల్లో.

కవి ఈ సందర్భములో కైకనింద పనికట్టుకు చేయిస్తారు. రామాయణేతిహాస సంబంధిగా దశాధిక కావ్యాల్ని రచించిన ఈ కవి కైకేయి పైని చిన్నకావ్యం వ్రాయకపోవడాన్ని బట్టి ఆ పాత్రపైన కవికి కూడా సదభిప్రాయం లేదేమో! అని పిస్తుంది. కానీ, ఈ కావ్యంలోనే మాండవి ముఖతః కైకేయీ పాత్ర విశిష్టతను దాటి తమకామె పట్ల గల ఆరాధన భావాన్ని వ్యంగ్యంగా తెలియచేసారు.

"అక్కట! యెంత గుండెగల యాడుదిరా! యది యెంతమంది నో
ర్నొక్కె వశిష్టువా కవలబ్రోసె సుమంత్రుడు గోలచేసినన్
లెక్కకు రాకపోయెను ఫలింపక పోయెను పౌరులేడ్చినన్
రక్కసిజాతిబుట్టె నవురా! యది చూడగ నాకు మాండవీ!"

---

1. మాండవీ - 59 ప
2. మాండవీ - 62 ప
3. మాండవీ - 65 ప
4. మాండవీ - 78 ప.

ఈ పద్యంలో ఎందరి మాటల్ని కాదని కైక రామునికి అరణ్యవాసం విధించిందో నిరూపించాడు కవి. అది చూడగ మాండవీ! అన్న సంబోధనలో 'అది' అన్న అమ హద్యాచ్య ప్రయోగం కవికి గల హీనాభిప్రాయాన్ని ధ్వనిస్తుంది.

తల్లిదుశ్చేష్టల తలమకుంటున్న భరతునకు లక్ష్మణుడు గుర్తొచ్చారు. అతడు ఏర్పరచిన దర్భశయ్యలు గుర్తొచ్చాయి. సుమ సుకుమారి సీత గుర్తుకొచ్చింది.

పూవుల సౌకుమార్యమును మోటనిపింపగ జేయు మార్దవ

శ్రీవిభవాప్తినున్న మన సీతకురా! యిటువంటిశయ్య, యా'' 1 అని

ప్రశ్నించి "జ్ఞాతి వనిపించితి లక్ష్మణ'' 2 అని జ్ఞాతిగ శేషతను సైతం ప్రకటించు కొన్నావు అంటాడు భరతుడు. "శేషత నీ స్వరూపమని చెప్పకచెప్పచునుండె వృత్తిలో ... ముందుగ శేషత పుట్టి పుట్టితే'' 3 అన్న పల్కులల్లో శేషత లక్ష్మణు నిలో స్పష్టంగా ప్రకంటించేస్తాడు ఈ భరతుడు.

ఈ విధమైన "నిషపు" జీవము గల్గిన వానిని కట్టుకొన్న ఊర్మిళ మాత్రం ఏం సుఖంచిందనిఅంటూ "పాముకు బాలుపోయుగతి వ్యర్థముగా గనిపించె నూర్మిళా శ్యామను నీకొసంగుట విషందిట నీకడనుండెనంచు నా కోమలి యయ్యోతా నెఱుగ కున్నది''4 అని ఊర్మిళ అమాయకత్వాన్ని దురదృష్టాన్ని ఎత్తి చూపి మిగిలిన అక్కచెల్లెళ్ళు ముగ్గురు కనీసం భర్తల చెంతనైనా ఉండే భాగ్యం లభించింది. కానీ ఊర్మిళకు ఆ అవకాశం కూడా బ్రహ్మ కల్గించలేదు.

"హా! గీచెనే గీత యూర్మిళ సుఖింపగ రాదని బ్రహ్మ లక్ష్మణా!5 అంటూ పరిపరివిధాల రామలక్ష్మణాదుల ఏకరువు పెట్టి తుదకు–

"చారుగుణాభి రాముడవు స్వామిరఘూత్తమ సేవకోన మా

హారమునిద్రమానిన మహాత్ముడ విచ్చెదె? యొక్క ముద్దుబం

గారపు దంద్రి యేది? చిబుకంబని' - 6

- మాండవి గండమెత్తి బింబారుణమైన క్రింద పెదవిని ముద్దిడబోయాడు భరతుడు. ఉలిక్కిపడింది మాండవి. తొట్రుపాటుతో "మాండవిదాసురాలను" అంటూ ప్రక్కకు తప్పుకుంది. ప్రకృతిలోనికి వచ్చి ముఖం ప్రక్కకు త్రిప్పుకున్నాడు భరతుడు.

"ఎప్పుడీవిటకు జచ్చితి భూతము వోలె, బట్టితివి'' 7 అంటూ నిందించ సాగాడు.

1. మాండవి - 83 వ
2. మాండవి - 81 వ
3. మాండవి - 83 వ
4. మాండవి - 93 వ
5. మాండవి - 94 వ
6. మాండవి - 96 వ
7. మాండవి - 97 వ

"మాండవి! చెప్పరే ని కను మానసికార్తిని చావకున్న నా
గుండెకు శాంతిలేద యదిగో సరయూనది పిల్చుచున్న దీ
పుండుము నా నిమిత్తమున నూరక యేత్వక పాదుకార్చనం
బండగ నిల్చియుందు మ" 1ని అప్పగింతలు పెట్టి ప్రాణ త్యాగము చేయ బోయిన భర్తపాదములపైపడి బోరున విలపించింది మాండవి. అర్ధరాత్రి ఒంటరిగా స్నానానికొచ్చిన మీరు రావడం ఆలస్యమైంది. హృదయావేదనను ఆపుకోలేక పరు గెత్తుకొచ్చాను. నాకు వేరు ఆలోచనలు లేవు అంటూ "దోసిలి మొగ్గి కాంత విజ్ఞాపన సేయ మీ యెదుట సాహసమూనెను దాసురాలు" అంటూ నోరు విప్పుతుంది.

"నా పయి గోపమూనరవి నమ్ముచు మీ కొక విన్నపంబు వి
జ్ఞాపన సేయుచుంటినిక స్వామి! రఘూద్వహా మీద నొట్టుగా"—
అని ప్రారంభించి భరతుడు చేసిన కైకనిందను త్రోసిపుచ్చి, కైకేయీ రహస్యాల్ని తెలియజేయాలని యత్నిస్తుంది కవి నేతృత్వంలో మాండవి. "కేక యాత్మజానతికి కోడలైన" ఈమె పలుకుల్లో అనేక రామాయణ రహస్యాల్ని ఉన్మీలిస్తాడుకవి.

"కైక మహా తపస్విని యొకానొక దివ్యచరిత్రురాలు యీ
లౌకిక దృష్టికామె యొక లౌల్యము గల్గిన నీచురాలిగా
స్వీ కృతయయ్యె నే నిజము చెప్పిన లోకము మారునేమొ"3
అన్న ఆశ మాండవిది. మాండవి కావ్యనిర్మాత ఈ పాత్రను నిర్మించడంలో ఎంచు కున్న ప్రథమ ప్రయోజనమేకాదు ప్రధాన ప్రయోజనం కూడా ఇదే.

"ప్రేముడి కల్గుచోట గనిపింపదు వస్తువులోని శక్తి" అన్నమాట మాండవి సమన్వయం లోని మొదటి సూత్రం.

మీరంటే రాముని కొఱకు అన్నము నీరుమానేసిన మహానుభావులు. రాముని లోని శక్తిని మీరు తెలుసుకోలేరు. ఎందు వలనంటే "మహత్తర ప్రణయశీలకు సత్యము గోచరించునే" అంటూ ప్రశ్నిస్తుంది.

1. మాండవి - 99 ప
2. మాండవి - 103 ప
3. మాండవి - 106 ప
4. మాండవి - 106 ప

"చేసెద రామమూర్తి కభిషేకము మంచిముహూర్త మెద్దియో
దానున కానతిండనుచు దాను వసిష్ఠుని వేడుకొన్న వ
న్యాసిని జేసి రాము వని కంపగజాలు ముహూర్తమంచె నీ
భూసురులా రఘూత్తముని భూరిమహత్వ మెఱుంగు తాపసుల్"-1

అసలు రామచంద్రుడు భూమిమీద ఎందుకు పుట్టాడో, రాముని శక్తి ఎటువంటిదో దాని ప్రయోజనం ఏమిటో ఎందరకు తెలుసు? అని నిలదీసి-

"రాముని తత్త్వమంతయు గరామలకంబుగ జూచువారలీ
భూమిని నిర్వురుండిరి తపోమహితుండగు గాధినందన
స్వామియు నైకజన్మనముపాత్తతపః పరిశీలితాత్మవి
ద్యామహిత ప్రభావ హృదయంగమ కేకయరాజపుత్రియున్"-2

-అనేస్తుంది మాండవి. 'అహంవేద్మి' అని రాముని తత్త్వాన్ని తెలుసుకొని ప్రకటించ గలిగిన వారు ఇద్దరే. విశ్వామిత్రుడు మొదటివాడుకాగా, కేకయరాజపుత్రి రెండవది. వారివలననే "రాఘవస్వామి మహత్త్వవల్లి యెగబ్రాకుచునున్నది దేశమంతటన్"3 అని వారిద్దరి వల్లనే రామమహిమ ప్రచలితమౌతోంది అన్నంత విశ్వాసం మాండవిది. కావుననే కైక ఆజ్ఞ మాత్రమే ఆధారంగా తీసుకుని రఘుచంద్రుడు అడవిలో అడుగు పెట్టాడు. ఆ మహానీయుని దర్శనం వలన ఎందరు మహర్షులు మోక్షప్రాప్తితో ఊర్ధ్వలోకాలను పొందగలిగారో, ఇంకా ఎందరు ఆ మహారణ్యంలో తరించనున్నారో గదా! మీ శ్రీరాముని పాదాలు బండరాళ్లకు తగిలి కందిపోతాయేమోనని బాధపడుతున్నారేకాని "ఆ శ్యామల కోమలాంగచరణాబ్జరజంబున చేసి రాయియే శ్యామగమారె నీయశము చాలదే! మీకులముద్ధరింపగన్"4 అన్న మాండవి వాక్యాల్లో "మీకులముద్ధరింపగన్"అనడంలో సూర్యవంశ ప్రతిష్ఠ రాముని అరణ్యవాసంవల్లనే నిలిచిందన్న ఉదాత్తభావం స్ఫురిస్తుంది.

తాటకను చంపినాడన్న మాట నిజమని ఒప్పుకుంటే ఆ మాటే కోటిచేస్తుంది. అరణ్యంలో రామునికి మంచి జరుగుతుంది అనడం అతిశయోక్తి ఔతుంది. ఆ విశ్వామిత్రుడు మిమ్మలందరిని త్రోసిరాజని రాముణ్ణి తీసుకెళ్ళకపోతే, "నశించునే సుబాహు" అన్న ప్రశ్న మాండవిది. "ఇట్టి లోకైక శుభంకరుండు గృహమందున నుండుటకా జనించుటల్" అనే ప్రశ్న భరతుని నెపంతో లోకాన్ని ప్రశ్నిస్తుంది. మహాపురుషుల సేవలు జాతికి కావాలి. సమాజాన్ని ఉద్ధరించడానికి వారు ఆవిర్భవిస్తారు. ఆర్తులను ఆదుకొంటారు. కాదని ఇంటివద్ద తనవారికి, రాజ్యానికి అంకిత

1. మాండవి-107 ప
2. మాండవి-109 ప
3. మాండవి-110 ప
4. మాండవి-114 ప

మైపోయే స్వార్థ ప్రవృత్తి మహనీయుల్లో ఉండదు. మరి పురుషోత్తముడైన రాముడిలో అది ఎలా వుంటుంది? అనేది ప్రశ్న.

"లోకులు కాకులెప్పటికి లోకము మూయగ మూతుదుండ దే
కైకను దిట్టిపోయుట లోకానొక వాడుకగా జగంబులో
నాకిన దీరుకూడ భగవంతులు మిమ్మనరాదు కాని మీ
రేకలుషంబు జూచి శపియించుచు నుంటిరి మాతృదేవినిన్"-1

లోకులు నిందిస్తున్నారని మీరు కూడా "మాతృదేవత"ను నిందిస్తున్నారే. అక్కడ ఎందరో రామునికోసం ప్రాణాలుగ్గబట్టుకొని ఎదురుచూస్తుంటే రాముడు ఇక్కడ ఎందుకుంటాడు. ఆనాడు విశ్వామిత్రుడు ఎంతో రభసచేసి, రాముణ్ణి తీసుకెళ్ళాడుగానీ, అడవైకూడా కైక ఒక్కతే పట్టుపట్టి సీతతోకూడా రాముని అడవికి పంపి, రామావతార సాఫల్యానికి శ్రీకారం చుట్టింది. ఆ కీర్తిని మీ వంశానికి లభింపజేసింది. అందుకే శ్రీరాముడు—

తనకుపకారమున్ సవతితల్లి యొనర్చినదన్న భక్తి రా
మునకెద లేకపోదు, మనమూరక కైకను తిట్టిపోసి నిం
దను తలదాల్చుటే యగును, తత్వము చూడ వశిష్ఠుకన్న కై
కను పదిమందిలో విలువగట్టెను రామునికేమి వెఱ్ఱియా! 2

కైకను వశిష్ఠుని కన్న ఎక్కువ గౌరవించాడు అంటుంది మాండవి. "మధ్యమాంబా గరీయసీ" అన్న రాముని పల్కులు ఈ పద్యానికి ఆధారాలు రామునికి క్షమాగుణం విశ్వామిత్రుని వెంట వెళ్ళినప్పుడే అలవడ్డది అందుకే విశ్వామిత్రుని ఆ ప్రయత్నం అయ్యుంటుంది. ఇక లక్ష్మణుడు "శేషతాకాముడు గాలిపిల్చిబ్రతుకం గలడాకలినిద్రయుండునే?" 3 సీత విషయానికొస్తే" ధరిత్రి పుట్టినిల్లాపెకు కష్టమన్న సుఖమంమందురు లోక మెఱుంగుకొన్నదే" 4

"ధరిత్రి పుట్టినిల్లు" అనడంలోనే ఆమెకు ఓర్పు సహనం పుట్టుకతోనే లభించాయన్న ధ్వని విన్పిస్తుంది మాండవి పల్కుల్లో.

ఇన్ని విధాలుగా కైక ప్రయత్నాల్ని సమర్థించి చివరకు "రఘునందునివిపై నభిమానమున్న వారేరు శపింపరీమెను శపించినరాముని దిట్టుటేగదా!' 5 అనేస్తుంది. "మాతృదేవోభవ" అన్నసూక్తిని గుర్తుచేసుకొని "నామెనికబూజమొనర్పుడు-నేదరించెదన్" 6 అన్న అభ్యర్థన కావ్యనిర్మాణ ప్రాధాన్యాన్ని పురస్కరించుకొని కవి మాండవి చేత అనిపించేశారు.

1. మాండవి - 112 ప
2. మాండవి - 126 ప
3. మాండవి - 128 ప
4. మాండవి - 129 ప
5. మాండవి - 131 ప
6. మాండవి - 133 ప

"అరయ పారతంత్ర్యమనట్టిది మీకు స్వభావసిద్ధ మే
తీరున రామచంద్రుడు విదేశము చేసెనో! దాని కన్యథా
మారగరాదు మారదది మార్చుటకెరికి శక్తిలేదు త
చ్చారుసువర్ణపాదుకలె స్వామి ప్రసాదము, చాలునద్దియే"–1

ఆ రాముని ఆశీస్సు అంతవరకు చాలు. ఆ గుహునికి గంగానదీ తీర సైకతాల్లో రామపద లాంఛనమునిచ్చి, మీకు సువర్ణపాదుకల ననుగ్రహించాడు" అంటూ రాముని ఔదార్యాన్ని, కైకేయి ఔన్నత్యాన్ని విగదించి, భరతుని సమాధాన పరుస్తుంది మాండవీ కావ్యంలో.

మాండవి పాంచజన్య శక్తిగా మార్కండేయ రామయణమున ప్రసక్తికలదు "వాసన్తిక" యను కన్యతో శ్రీమహాలక్ష్మి ప్రస్తావన వశంగా–

"అయం మమపతి శ్రీమాన్ శేషేణచదరేణచ
సుదర్శనేన సాకేత గృహే దశరథన్యచ
........... ...............................
శక్తిస్తు పాంచజన్యస్య మాండవీతి ప్రకీర్తితా"2

అని పాంచజన్య శక్తియే మాండవిగ చెప్పబడింది.

"వ్యాజములేక నిసర్గమైనచో ప్రేమగలట్టి వస్తువగుపింపక దూరమునందునుం డుచే క్షేమ మహర్నిశంబు పరికింతురు ప్రేమికులాపదార్థమున్" 3 అంటూ చూపుల కన్న ఎదురుచూపులే తీయన" అనిపించునట్లు, దూరంగా ఉన్న వస్తువులపై మమకారం మిక్కుటమని ప్రకటించి, రామపాదుకలే మనకుశరణ్యాలని ప్రపత్తిని ప్రకటిస్తుంది.

వాల్మీకి మహర్షి పరిచయం చేసిన ఈ పాత్రను కైకేయి ఔన్నత్యాన్నివిర్దేశించదం కోసం, మాండవీ సముదాత్తతను ప్రదర్శింపజేయడం కోసం కవి ఈ కావ్యాన్ని సృష్టించాడు.

కైకను మహాతపస్వినిగ చిత్రించి, లోకోపకారదృష్టితో తాను నిందమపొంది, రాముని అరణ్యవాసానికి పంపినట్లు మాండవిచే ప్రస్తావింపజేసారుకవి. లక్ష్మణునిపై భరతునికిగల భ్రాతృభక్తి సైతం కొన్నియెడల "అతిప్రేమను" ప్రదర్శించి, నిందకు దిగి, తిరిగి తమ్ముని మెచ్చుకొంటూ, లక్ష్మణుడమకొని "మాండవి"ని ముద్దుపెట్టుకొనబోవు సన్నివేశం ఇందుకు తార్కాణం.

---

1. మాండవి - 134 ప. 2 మార్కండేయ.పు. ఉత్తరార్థం. 1 అధ్యాయం.
3. మాండవి - 135 ప. రా. పా. పు. 776.

మాండవి పల్కిన ప్రతి పదములోని "సభ్యత" భరతుని ఆలోచింపజేసింది. అతనిలోని నైరాశ్యాన్ని వదలింపజేసింది. పాదుకార్చనకు పురికొల్పింది. "వానికి ప్రేమపాత్రమగు వస్తువుపై నభిమానముంచినన్ గాని యనుగ్రహింపదొకొకాలము నాటికి" అని రామసేవలో నిమగ్నమౌనట్లు నిర్దేశించింది. ఆత్మహత్యా ప్రయత్నం నుండి నివారించి, నూత్న జీవితా విష్కరణకు దారి చూపుంది. వాల్మీకి నిర్మించిన రామాయణంలో అన్ని పాత్రలు ప్రయోజనాత్మకాలే నన్న విశ్వాసమున్నవారిలో రామానుజులు ఒకరు. అందువల్లనే రామానుజుని పత్ని మాండవికి కావ్యత్వాన్ని కల్గిందారు "వీరి మాండవి సాలంకారము మధురశైలీ విరాజితము. రసధ్వని మంజులము. క్షేత్రజ్ఞులకు కాక ఇట్టి హిరణ్యనిధి మాండవి కథ ఇతరులకు శ్రీమద్రామాయణమున లభించునా?" 1 అన్న విమర్శకుల పల్కులు సత్యవచనాలు. "పద్య నిర్మాణంలో ఆచార్యుల వారిది అందెవేసిన చేయి. ఆచార్యులవారి వృత్త రచనా నైపుణి అతి ప్రశంసనీయమైనది అదియొక సున్నితపు పోగారుపని."2 అంటారు ఆచార్య యస్వీగారు.

విశేషంగా ఇందులో ఆటుధార కనిపిస్తుంది. వారి భాషశారీతికి (idiolect) అతి సమీచీనం వారి పద్య రచనా రీతి.

## విశ్వనాధవారి వాసంతిక

తెలవారితే రామచంద్రుని పట్టాభిషేకం. భరతుడు మాండవీ సీత సౌధ మండలికి బయలుదేరి వెళ్లాడు. రంగవల్లికలు దిద్దబడిన వికర్దిక మీద కోమలి కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు ఇల్లాలు వచ్చింది. అసంస్కృత శిరోజాలతో, కాషాయాంబరధారిణియై వచ్చి కేలుమోడ్చి నిల్చిన ఇల్లాలిని చూపిన భరతుని ఎదలో వేదనా సముద్రాలు పొంగులు వారాయి.

"యింతి గనుగొంచు భరతుని హృదయపద్మ
కేసరంబులు విరజారె భామరములు"1

—అంటాడు కవిసామ్రాట్. "యోగిని"గ నిలబడిన ఇల్లాలిని ఏదో విధంగా పల్కరించి, మాటాల్లోకి దించాలన్నది భరతుని తపన చెంతనే ఉన్న వాసంతిక కల్పించింది. అది నాటి చాలకాలమైంది. కాని ఇంతవరకు మొగ్గతొడగలేదు. భార్యకు అ తీగపై గల అభిమానాన్ని ఆధారం చేసుకొని సంభాషణలోనికి దిగుతాడు భరతుడు.

---

1. మాండవీ - పుట 4. 2. మాండవీ - పుట 6.

1. వాసంతిక – కృష్ణాపత్రిక - స్వర్ణ సంక్రాంతి - 1వ.

"ఇద్ది చూలెంతయు గాద" న్న పల్కులు రామానుజునివి. ఆ మాటలు విన్న మాం డవి నెమ్మదిగా ఇలా అంది.

"నేవింటిలోన నెక్కడో
పూని మహావ్రతము, బూనెొక్కలకున్
దానెవరు నీరువోసిరి
వాన యదుపు తోటమ్మాలి శ్రద్ధయు గలదే"2

భార్య మాటలకు ఆశ్చర్యపోయాడు. ఈ మహావ్రతం ఎవరి కోసమన్నాడు భరతుడు, "భర్త యొల్లని సతి" అంతకంటె ఏంచేయగలదు. చెడిపోయిన గృహ సంస్కృతి. సంస్కృతులకై తానీ వ్రతాన్నవలంబించాను గాని ఆ దైవానికి ఇంకా అనుగ్రహం కలుగలేదు.

"నా భర్త యొక్కడున్నాడన్నగారితో
బాటు జటాధారి పట్టణమున
సతివి భార్యను నేన యపకీర్తి పాలైన
యత్తగారున సుఖమతిన నేను
తుమలి పోవుచు నాదుకొంచుంటి యెుకరొక
రీమాత్ర "వాసంతి" యొదిగెనేవి
ఆ యత్తగారు దయాక్షీర పాదోధి
శ్రీమతి యాయమ చేతి చలువ"3

ఆమె మాటల్లో ఎన్నో భావాలు సుళ్ళు తిరిగాయి. కళ్ళముందు కమ్ముకొన్న మంచుపొరలు తొలగిపోయాయి భరతునికి. 'శ్రీరామ కీర్తి పతాకాభిరామయష్టి' మూర్తియైన మాతృమూర్తి కనులముందు కన్పట్టింది భరతునికి. వాసంతి ఈ మాత్రం విరిచిందంటే దానికి కారణం.... 'దయాక్షీరపాదోధి'యైన అత్తగారి చలువ" అన్న మాండవి పల్కుల్లో విన్పించిన ధ్వని భరతునిలోని 'విజ్ఞత'ను మేల్కొల్పింది. వెంటనే.... "రక్షోరాట్పరోక్షరి నక్షదముల్ జేరి క్షమింప వేదదన యీ వాసంతి యున్ విప్పునే కద తానప్పటి కంటు" లేచాడు. చేసిన తప్పుని దిద్దుకోవాలనే తొందర భరతునిది. ఎంతోకాలంగా మదిలోని వేదన తీరే రోజు ఆసన్నమైంది. వేగంగా పరుగెత్తాడు కైకేయీ భవనానికి తన పాపాన్ని ప్రక్షాళనం చేసుకొని కాంతి చంద్రుడై తిరిగివచ్చాడు భరతుడు.

"ఆసాయంతటి కైకయీ పద సపర్యాధుర్యుడై వచ్చుచున్
వాసంతీ లత చిన్నిపూవిడులు శోభంగాంచె రామానుజుం
డా సీమంత మధూళికా రచిత మాణిక్యాభ్య కాశ్మీరరే
ఖా సం పన్నిధి మాండవీ ముఖలసత్కంజాదవంజాతమున్"

1. వాసంతిక-7 వ.

'మాండవీ' ముఖవివిర్గత దరహాస చంద్రికలు భరతరాజేంద్రునిపై ప్రతి ఫలించాయి. 'వాసంతిక' చిరునవ్వు చిందించింది.

'మాండవి' ఉపదేశం భరతునిలో కరుడుగట్టిన మాతృవై ముఖ్యాన్ని కరి గించి వేసింది. శ్రీరాముని కీర్తి పతాకకు ఆధారపు కొయ్యగ కైకమ్మను నిలదీం చింది మాండవి. ఉపదేశికయై కావ్యంలో తన పాత్రను శాశ్వతీకరించింది—'కాంత'గ మాండవి. ఇది విశ్వనాథుని అపూర్వసృష్టి. కాంతా సమ్మితమైన కావ్యంలో నాదునికి వలసిన ఉపదేశాన్ని 'కాంత' చేతనే యిప్పించి కావ్యానికి ఉత్కృష్టత నాపాదించిన మహాధీయులు శ్రీమద్రామాయణ కల్పవృక్ష సృష్టికర్తలు.

## మైథిలి

"జానకి" లేని రామచంద్రుడు "చంద్రిక" లేని చంద్రుడై కాంతి హీనుడౌ తాడు. "మైథిలీ" విరహిత రఘురాముడు "శక్తి"ని కోల్పోయి, ఇదుములకు లోన య్యాడు. "జానకి మాత" సకల సద్గుణ సముపేత. తనకు కీడు చేసిన వారికైన హాని చేయనంగీకరించని మాతృహృదయ 1. "సీత" చెంతనుండగ "గడ్డిపరక" సైతం రామబాణమై విజృంభించగా, సీతాపహరణానంతరం శ్రీరాముడు సమస్త శక్తుల్ని కోల్పోయినవాడై, దేంగ విలపించి, కొండల్ని కోనల్ని ఆశ్రయించి, గ్రద్దల్ని, కోతుల్ని సహాయంగా తీసుకోవలసి వచ్చింది. ఎదుటివార్ని సమ్మించ దానికి "తనబలాన్ని" ప్రదర్శించవలసిన దుస్థితికి రాఘవాన్వయుడు దిగాడంటే అందుకు కారణం "శ్రీ"విరహితుడు కావడమే.

"శ్రీ"అనేది లక్ష్మి బీజం, సర్వశక్తి సమన్వితంగా ఆ బీజాక్షరం భాసిస్తుంది.

"మహాలక్ష్మ్యర్థకశ్శస్యాత్ ధనార్థ రేఫ ఉచ్యతే

(ఈ) తుష్ట్యర్థోఽ పరోనాదో బిందుః దు;ఖహారార్థకః 2

---

1. ప్రణిపాత ప్రసన్నాహి మైథిలీ జనకాత్మజా
పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ
కార్యం కరుణమార్యేణ నకశ్చిన్నాపరాధ్యతి—
యుద్ధ - 119 - 44 శ్లో

2. మం - పు. 18

సర్వసంపత్కరము, సర్వదుఃఖహరమునైన "శ్రీ"లేని రాముడు వియోగ వ్యధా దుఃఖితుడై విలపించాడు. క్రోధించాడు. తపించాడు. పోరాడినుదకు శ్రీకర మైన సీతను పొంది సీతారాముడుగా కీర్తినందాడు. "శ్రీ శ్రీశయోస్తు సంబంధశ్చంద్ర చంద్రికయోరివ" అన్న పౌరాణిక వాక్కులు దీనినే సమర్థిస్తాయి.

మైథిలీ పాణిగ్రహణం శ్రీరాముని గృహస్థునిగా మార్చి, పట్టాభిషేకానికి సిద్ధం చేసింది. కాని కైకేయీరూప కాలవాహిని రాముని గమనాన్ని మార్చి, అర ణ్యంలోని మునుల చెంతకు చేర్చి, రాక్షస సంహారం చేయించింది. క్షత్రియవీరుడుగా యువరాజుగా జైత్రయాత్ర పూర్తి చేసుకొని, సర్వ "శక్తి" సంపన్నుడై రాజ్య లక్ష్మిని గ్రహించి రాముడు లోకారాధ్యుడై ఆదర్శప్రాయుడైనాడు. "సీతా మహా సాధ్వి" "సీతామాతయై" పూజలందుకొంది.

రామాయణాన్ని రామ+అయనం, రామా+అయనం అని రెండు విధాలుగా విభజించవచ్చు. రామకథలో సీతారాముల కిరువురికి సమప్రాధాన్యాన్ని చేకూర్చవచ్చు.

"బాలేవ రమతే సీతా బాలచంద్ర నిభాననా
రామా రామేవ్యాదీనాత్మ విజానే ఒపి వనేసతీ॥" 1

మైథిలీ దాశరథులు సత్యస్వరూపానికి ప్రతినిధులన్న భావం "రామా","రామ" శబ్దాలలో మహాకవి వ్యంజితం చేశారు.

అశోకవనంలో "సీతామాత"ను చూసిన ఆంజనేయుడు ఆమెలో రాముని పోలికలుండటం చూచి ఆశ్చర్యపోతాడు. తల్లీకూతుళ్ళ మధ్య, అన్నదమ్ముల మధ్య సమానమైన పోలికలుండ వచ్చునేమోగాని భార్యాభర్తల మధ్య ఒకే పోలి కలుండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. —అందుకే ఇలా అనుకుంటాడు.

"అస్యా దేవ్యా యథారూపం అంగప్రత్యంగ సౌష్ఠవం
రామస్య యథారూపం తస్యేయమసితేక్షణా॥"2

ఈ పోలికల్లోదాగి ఉన్న రహస్యాన్ని "దేవమాయేవ నిర్మితా" అన్న పదంతో ఛేదించారు మహర్షి వాల్మీకి.

సీతారాముల దాంపత్యం జగతికి ఆరాధ్యం. శ్రీరామునకు తగిన ఇల్లాలు మైథిలిః "పంకజముఖి సీతవంటి భామామణియున్" అన్న అభిమానం ప్రజల్లో

1. వా. అయో. 60-10 2. 5-15-51

నిలిచిపోయింది. మహావీరుడై, శివధనుష్ఖండనుడైన రామభద్రుని పరిణయమాడిన వధువు మైథిలి కష్టసుఖాల్లో భర్తకు తోడునీడగ నిలిచి, అనుకూలవతి, అనురాగవతి, పుత్రవతియునై, అభిమానవతిగా భూప్రవేశం చేసే వరకు సీతాపాత్ర అత్యుత్కృష్టమైన రీతిలో మలచబడి "సీతాయాశ్చరితం మహత్" అని మహర్షి చేతనే కొనియాడబడిన పవిత్రశీలం.

వలుకే బంగారంగ బాలకాండలో అసలు మాట్లాడక దర్శనమాత్రం చేతనే అలరించిన జానకి సుందరకాండలో అతిమాత్రంగ సంభాషిస్తుంది. సీతారాముల కళ్యాణం లోకకళ్యాణంగ భావించే భారతజాతి సీతారాముల దాంపత్యాన్ని ఆదర్శ దాంపత్యంగ ఆరాధిస్తోంది. అందులో "సీత" జగదారాధ్య. మాతృ స్వరూపిణి. శ్రీరాముని తేజోవిహీనుని చేయగల కాంతిచ్చట. "ఏదేశ వాఙ్మయమునందైన శ్రీరామచంద్రుని వంటి పురుషోత్తముడు లభించినా లభించవచ్చునేమో కాని సీత వంటి ఆదర్శ చరిత్రయగు పతివ్రతాతిలకము లభించుట దుర్లభమని" 3 పల్కిన వివేకానందుని పల్కులు అక్షరసత్యాలు.

ఎన్ని యిడుముల నెదుర్కొన్నా "భర్తా హి మమదైవతం"1 అని ప్రకటించిన నిర్మల హృదయ యీమె. లోకంకోసం అగ్నిప్రవేశం చేయించినా,అరణ్యవాసం చేయించినా ఓర్పుతో సహనంతో భర్త గౌరవాన్ని కాపాడి రాముని లోకారాధ్యుని చేసిన ఉత్తమ ఇల్లాలు. రాముడు లోకం కోసం ప్రవర్తించినా "నేదాసీం త్వదృతే సీతే స్వర్గోఽపి మమరోచతే"2 నీవు లేక స్వర్గమును కూడ అంగీకరించనన్న భావన భర్తలో కల్గించిన మహిసాధ్వి.

"త్వద్వియోగేన మేరామ త్యక్తవ్యమిహజీవితమ్"3 అన్న పల్కులు రామ వియోగాన్ని సహింపలేక మరణిస్తానంటున్న సీతవి. వారి వైవాహిక ప్రణయం జగదారాధ్యం కావడానికి ప్రధానకారణం వారిలోని ఆరాధనా భావమే. అది వాల్మీకి అపూర్వచిత్రణ.

"ప్రియాతు సీతారామస్య దారా పితృకృతాఇతి
గుణాద్రూప గుణాచ్చాపి ప్రీతిర్భూయోఽ భివర్ధతే"4

తండ్రిచే అంగీకరింపబడిన భార్యగా సీతను స్వీకరించినను అనురూప గుణాన్వితి,

---

3. శ్రీమద్రా. వై. పు 523

1. 2. 16. 89
2. 2. 42. 30
3. 2. 5. 29
4. 1. 77. 27

సౌందర్య సముపేత అగుటచే ఆమెయందు శ్రీరాముని ప్రేమ పెరిగింది. మరి సీత విషయం చూస్తే—

"తస్యాశ్చ భర్తా ద్విగుణం హృదయే పరివర్తతే
అన్తర్గత మపివ్యక్త మాఖ్యాతి హృదయం హృదా"5

సీతా హృదయంలో రాముడు ద్విగుణుడై వసిస్తున్నాడు. ఆమె హృదయాంతర్గత మైన ప్రేమను ఆమె హృదయం అతని హృదయానికి చెప్పుచుండెను.

— అవి చెప్పటంలో వారి అన్యోన్యత వాల్మీకి లేఖినిలో ప్రవహించింది. అంతేకాక— "మనస్వీ తద్గతమనా స్తస్యా హృది సమర్పితః"6 అంటాడు మహర్షి. వారిరువురి దాంపత్యం అటువంటిది. అందువల్లనే "యుక్తా రామస్య భవతీ ధర్మపత్నీ గుణాన్వితా" అంటూ మెచ్చుకున్నాడు అశోకవనిలో సీతను చూసిన హనుమంతుడు.

సీతరాముని చెంత ప్రేమస్వరూపిణిగ, గోచరిస్తుందేగాని, శత్రువుల చెంత,- రావణాదుల తిరస్కరించి అభిశంసించేటప్పుడు మహాశక్తిగా రూపుదాలుస్తుంది. ఆ "శక్తి" పాతివ్రత్య ప్రభావమే. పతివ్రతాసాధ్వి శోకవిలాపాలు కార్చిచ్చులై కాలాగ్ని విషాలుగ కాముకుల్ని కాల్చి వేస్తాయన్న నగ్నసత్యం రావణాదులు తెలుసుకోవడానికి ఆలస్యంపట్టింది.

....అనేకమైన కధలు వెలుగులోకి రావడానికి కారణభూతమైంది. త్రిలోక విజేతయైన రావణుడు సైతం "మహాశక్తి" ముందు, పాతివ్రత్యం విప్పముందు కంపించిపోయాడు-

అట్టి "సీతమ తల్లి" కధలు తెలుగు ఇల్లాండ్రు పసిపిల్లలకు పాలబువ్వలతో పాటు చెప్పుకుంటూ ఆనందించగలిగే స్థాయికి వెళ్ళిపోయిన చరిత్ర సీతమ్మ కధ. అనేక కావ్యాలతోపాటు లఘుకావ్యాలనేకం సీతాచరితంగ ఆవిర్భవించాయి. "సీతమ్మ" కధ రామాయణం కాగా రామకధలో "సీతకధ" ఉన్నతంగా భాసిస్తోంది. ఏ కవి కలమైన "జానకి" కధా విధానానికై, పరువెత్తుతుంది.— ముందుగా-

---

5. 1. 77. 29 6. 1. 77. 26

# గుదిమెళ్ళ వారి మైథిలి

శ్రీకరమైన యాగ సంరక్షణానంతరం శ్రీరామలక్ష్మణుల వెంట విడుకొని, మిథిలా పురీనాథుని సౌందర్య ధామాన్ని చేరుకొన్నారు విశ్వామిత్రుడు. కర్మయోగి యైన జనకుడు ఎదురుకోలు సన్నాహంతో ఆహ్వానించి, యజ్ఞశాలను ప్రవేశింపచేసి, ఉచితాసనాలను ఇచ్చి గౌరవించారు. యథోచిత మర్యాదల అనంతరం శతానందుని సత్కరించారు రాజర్షి. తల్లిదండ్రులైన గౌతమాహల్యల ప్రస్తావన తీసుకొచ్చి వారి నిద్దర్ని ఏకంచేసి వచ్చామని చెపుతూనే- "నీ వల్ల పురోహితుండవొక భారము దీర్దవి" ప్రక్కనున్న జనకుని వైపు చూశాడు విశ్వామిత్రుడు.

ఎంతోకాలంగా వియోగాన్ని అనుభవిస్తున్న తల్లిదండ్రులు ఒక్కటైనారనే ఆనందం ఒకవైపు మిన్నుముడుతుండగా, విశ్వామిత్రుని మాటల్లో "భారము" బరువుగా తోచి ఉలిక్కిపడ్డాడు జనకుని పురోహితుడు శతానందుడు. ఇంతలో జనకుని సత్కరించాడు కౌశికుడు.

"ఈ వొక కర్మయోగి వసనీశ్వర! నీవొనరించు కర్మలో

లేవు ఫలభిలాష లొక రీలకు నైనను — (9 ప)

అంటూ కర్మయోగియై, తామరాకుపై నీటిబొట్టుగ సాగిపోయే అతని జీవన గతిని వేరీతుల మెచ్చుకుంటాడు.

"లోగిలి కాలుచున్నదని లోకులు తెల్పిన నే వికారమున్

లోగవిపింప నీయవతిలోకమురే దృశయోగి వృత్తమున్"(10 ప)

అంటూ కితాబిచ్చేసి, ఈ పొగడ్తలన్నీ ఎందుకో అర్థంకాక తెల్లబోయి నిలబడిన జనకుడు పాఠకుల మనోఫలకంపై ప్రత్యక్షమౌతుండే నెమ్మదిగా అసలు విషయం లోకి వచ్చేసి-

యాగము చేసినంత సుతు "దాజికి" గల్గె నయోధ్యలో పరే

యాగము చేయబోవ సుతయబ్బెను నీకిట చిత్రమయ్యెడున్

1- మైథిలి- 6 ప

యాగ మహాప్రభావ మిది యంతయు భూవర! యేదియో మహా
యోగము వీర లిర్వురకున్నదయా! మునుముందు చూడగన్!

అంటూ మిథిలా అయోధ్యా నగరాలకున్న సంబంధాన్ని కలుపుతున్న అంతస్సూత్రాన్ని కదిలించి, సీతారాముల యాగ ప్రాదుర్భావాన్ని వారి ఔన్నత్యాన్ని ప్రస్తావించి, అయోధ్యానగర సంభావిత సమస్త వృత్తాన్ని క్లుప్తంగా విన్పిస్తాడు బ్రహ్మర్షి.

విశ్వామిత్రుడు మాట్లాడుతున్నంతసేపు ఏదో ఆలోచనల్లో మునిగి కన్పిస్తున్న జనకుణ్ణి చూచి కారణం గ్రహించి తలయూచి పెళ్ళి కావలసిన ఆడపిల్ల ఇంట్లో ఉండగా తండ్రుల ఆలోచనలు అలాగే ఉంటాయంటూ సమర్థిస్తాడు.

"దాచగ బెట్టినట్టి యొక ద్రవ్యపు మూట తనూజయన్న నా
దాచినవాడు వచ్చి తన ద్రవ్యము గైకొను పోవుదాక లో
దోచదు తండ్రికేదో వ్యధతో గనిపించు గ్రహీత వచ్చి చే
సాచి గ్రహించెనేని మది శాంతి వహించు గదయ్య భూవరా!

—అంటూనే రామలక్ష్మణుల్ని పరిచయం చేసి, తాటక వధాది సాహసగాథల్ని వివ
స్తాడు. కర్మయోగిని పరీక్షించడానికే ఆ దేవుడు "కామార్తె" విచ్చాడని ఆమె పెం
గురించి జనకుడుపడే అశాంతిని "లోభావనచేసి," ఆమె కొఱకే ఇక్కడక
వచ్చానంటాడు ఆచార్యులవారి విశ్వామిత్రుడు.

మూలంలో మిథిలా నగరం చేరిన విశ్వామిత్రాదులకు జనకుడే అర్ఘ్యాదు
నందించి, అడిగి రామలక్ష్మణుల వృత్తాంతాన్ని తెలుసుకొంటాడు [3]కాని తెలుగు క
విశ్వామిత్రుడు ఆడపిల్లల కన్న తండ్రి ఆవేదన తెలిసిన వాడవడంతో అడగకనే
అసలు విషయం చెప్పేస్తాడు.

"తాటకజంపెనా? యితడు తాటకనెక్కడి మాట"

అంటూ ఆశ్చర్యపోతున్న జనకునితో విశ్వామిత్రుడు, తన శిష్యుడి గొప్పతనాన్ని
గంభీరంగా ప్రకటిస్తాడు. "ఇదేమి లెక్కయా, గోటను మీటు నీ ధనువు కూడనట
చటుచూచెమౌపియున్" రాముని వంటి శిష్యుడు దొరికిన అదృష్టం విశ్వామిత్రుని
కాగా, విశ్వామిత్రునివంటి గురువులభించటం రాముని వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దింది.

1. మైథిలి - 11 ప
2. మైథిలి - 19 ప.
3. 1.40.174.

అందుకే—శతానందుడు

"నాస్తి ధన్యతరో రామ త్వత్తోన్యోభువి కశ్చన
గోప్తా కుశిక పుత్రస్తే యేనత ప్తం మహ త్తపః"1

-అని రాముని అదృష్టాన్ని మెచ్చుకొంటాడు.

వీరి రక్షణవల్ల తనయాగం పూర్తయిందని, అందుకు ప్రతిగా వీరిని మిం యాదగ ఇంటికి పంపాలి "మరల కౌశికుదేగుటపాడిగాద, యెం, దైనను దోడు నూడవలె నావయినీవలె యాగదక్షణన్" అంటాడు విశ్వామిత్రుడు. తీసుకొచ్చిన తానే తిరిగి పంపించడం పాడిగాదంటూ, దక్షిణ యిచ్చి తోడుగా ఎవరైనా చూడాలన్న పలుకుల్లో రాజర్షి రాజసం తొంగిచూస్తోంది ఇది ఆధునిక కవి సృష్టి. ఈ రామ ణీయకం ఇంతటితో ఆగలేదు.

"ఏనిక యాగ దక్షిణగ నేదియొ వీరల కీయ గావలెన్
దానికి లక్ష్మి యెందు గలదా! యని భూవర! చూచుచుంటి'

అని "లక్ష్మి" కోసం చూస్తున్నానని, దొరికిన "లక్ష్మిని" ఎవరికివ్వాలో యని నీవు ఆలోచిస్తున్న విషయం తెలిసి ఇటువచ్చామని, అనడమేకాక-

"పరులకు చెందు వస్తువును భద్రముగా గనిపెట్టుచుంటి పీ
బరువు వికెంత కాలమని పావము మోయుదువయ్య భూవరా!

అంటూ జాలి కురిపిస్తాడు.

"... ............ ...నీకడనున్నది లక్ష్మి కావునన్
మావని జూడుమయ్య" అని అర్థింపడమే కాక
...................మునిమాటను గాదని తోసిపుత్తువా!

అని "తర్జనీ దర్శనం" సైతం చేసేస్తాడు. "లక్ష్మి యుండుట ఏమి, లభించుట ఏమి?" అని ఆశ్చర్యపోతున్న జనకునితో—

"...................మీ గృహమందేదో ధనూ
రత్నముకద్దటంచు విని రాముడు తానొక చూపు చూడగా
బ్రొత్త చరిత్ర వచ్చె మనవానికి చాపము చూపగా వలెన్"2

అంటూ ఆదేశిస్తాడు.

1. 1-51-15.    2. మైథిలి-35 ప

దేవతవంటి సీతను రాముడి కివ్వడమేకాక, ఊర్మిళను లక్ష్మణున కివ్వడం సిందవి సోదరుడైన కుశధ్వజుని కొమార్తెర్ని భరత శత్రుఘ్నుల కివ్వమని వలసా యిస్తాడు. "ఆతడు కూడ గుమార్తెం తండ్రియే గదా!" ఆడపిల్లల తండ్రులైన జనక, కుశధ్వజుల పైజాలి తలచి, సంబంధాల్ని కుదర్చవచ్చిన పెద్దగా విశ్వా మిత్రుడు తెలుగుకావ్యంలో ప్రత్యక్షమౌతాడు.

ఇంతలో సాయం సమయమయ్యింది కర్మాద్యనుష్ఠానాలకు కదిలే తరుణం అది. కర్మయోగ ప్రస్తావన వచ్చింది. విశ్వామిత్రుడు రాముడు తన చెంతకు చేరి నాటినుండి తన దినచర్యలో వచ్చిన వ్యత్యాసాలను ఏకరువు పెట్టాడు జనకునితో

"కర్మ కైంకర్యముగ మార్చి కౌశికుండు
గడుపుచుండెను గాలమిప్పుడు నరేంద్ర!
కర్మయోగికి జాకిరి గంపెడంత
ఫలము శూన్యము కైంకర్య పరుడె సుకృతి" - (42 ప)

అంటూ ప్రారంభించి-

"వేళకు నిద్ర నేనెఱుగ వేళకు స్నానములేదు సంధ్యయున్
వేళకులేదు యోగమును వేళకులేదు - తపోజపమ్ములున్
వేళకులేవు తిండియును వేళకు లే దిక సర్వమీత దే
వేళకు గానిపించు రఘువీరుడు పార్థివ! యేమి సేయుదున్" - (44 ప)

అంటూ అనుష్ఠానానికి సమయమైందన్న జనకునితో అసలు రాముడు వచ్చినప్పటి నుండి వేళకు ఏదీ జరగడంలేదు. సర్వము రఘువీరుడే ఆక్రమించాడు అనడమే కాక, "ఏమిసేయుదున్" అంటూ తన ఆశక్తతను పైతమ్ముప్రకటిస్తాడు విశ్వామిత్రుడు "వికసత్సరిదంబుజ రేఖలో వీవివ్వరూప రేఖకవిపించును" అన్న పద్యాలలో విశ్వా మిత్రునిలో రాముని విలిపారు తెలుగుకవి. అందుకే-

"చేయుదు స్నానమేను రఘుసింహాని దేహారుచి ప్రవంతిలో
జేయుదు భోజనమ్ము రఘుశేఖరు దివ్యకథా ప్రసాదమున్
చేయుదు ధ్యానమంచతని చింతన - కౌశికు కర్మయోగ మ
య్యా! యటులున్నది.......... (51. ప)

-అంటూ సర్వము రామమయంగ మారిపోయిందంటాడు ఆనందాతిరేకంతో విశ్వామిత్రుడు.

"ఆగమమన్న మాట నిజమైనది రాముని యాగమమ్మె, మా
యోగమటన్న వీడుదరి నుండుటె యోగము దర్శనమ్మనన్
బాగుగ వాడుమేమిటుల పార్థివ! చూచుటె దర్శనమ్ము, మా
కాగమయోగదర్శనము లన్నియు రాముడె చాలు ధన్యుడన్" - (50 ప)

ఆగమ దర్శనాల్ని రామునిలో దర్శించిన భాగ్యశాలి విశ్వామిత్రుడు. "అహంవేద్మి" యన్న మహనీయుని, గాయత్రీ మంత్రద్రష్టయైన విశ్వామిత్రుని పాత్రౌచిత్యం చక్కగా పోషించబడింది తెలుగు కావ్యంలో.

రామసేవలో తాను ధన్యుడనయ్యానని విశ్వామిత్రుడు ప్రకటిస్తే, మరి "సీత"ను ధర్మపుత్రికగా పొందిన జనకుడు మాత్రం ఆగగలడా! ఆయన సైతం "సీతరాక మొదలైనది నా స్థితి యట్టులుంటకున్" అంటూ తన తాదాత్మ్యాన్ని విన్నవించుతుంటాడు. ఇద్దరు స్వామిభక్తులు ఒకచోట చేరితే గుణగానంతో తెల్లవారుతుందన్న ప్రతీతి వీరి విషయంలో నిజం చేశారు రామానుజులు.

"స్నానము సేయబోయెదను స్నానము సేసితినంచు వచ్చెదన్
ధ్యానముసేయ బూనెదను ధ్యానము సేసితినందు నెంచెదన్" – (53 ప)

అనే స్థితి జనకునిది. "పరమాత్మునితో తాదాత్మ్యంచెంది" "ఎందెందు వెతకి చూచిన అందందే కలడని" ప్రకటించిన భక్తుని విశ్వాసమిది. భాగవతోత్తములకు మాత్రమే లభించేది.

విశ్వామిత్రుడు 'సర్వమీతడే, నేతకు గానిపించు రఘువీరుడు పార్థివ యేమి సేయుదున్" అంటూ రాముని విషయంలో తన అసహాయతను ప్రకటిస్తే - "ఎప్పుడున్, జానకియే కనంబడును సంతతియుండిన యోగముండునా" అన్న ఆవేదన హృదయదర్పణం కాదు జిహ్వాంచలములందలిదే ఏలన - "జానకినాత్మగా దలచి నల్పుచుమంటిని కర్మయోగ"మని ప్రకటించడమేకాక - "సీతను జూచుచున్న ముని శేఖర! యాత్మను జూచినట్లుగా ప్రీతి వహించుచుంటి" అంటూ ఆనందాన్ని వ్యక్తం చేస్తాడు జనకుడు.

"జ్ఞానమయ స్వరూప నొకచక్కని శ్రీపురుషోత్తముండు నన్
గానగవచ్చుచో నతని కర్పణ సేయగ జూచుచుంటి" - (57.ప)

-అంటూ ఆడపిల్ల తండ్రిగా జనకుడు రాముని సౌందర్యానికి బలపరాక్రమాలకు ఆకర్షింపబడి, వాని గురువుచెంత ఈ మాటల్ని పలికి, అంతఃపురానికి చేరాడు.

"జానకి"తో యజ్ఞశాలలోని విషయాలన్నీ వివరిస్తాడు. "నల్లని కల్వపూలవలె నవ్య పయోదము పట్టినట్లుగా నున్న అతని చక్కదనాన్ని వాని భుజోపరిలంబ ధనుశ్శరా యుధాల్ని, వాని వీరోచిత చర్యల్ని వర్ణించి, "వానిని జంకనెత్తుకొన వాంఛ జనించెను" అంటూ మురిసిపోయి, "వానిని చూడగావలయు వానికి సేవ యొనర్పగావలెన్" అంటూ రామునికై ఆరాటపడతాడు. తన జానకికి అతడు నాధుడు కావాలన్న ఆశ గాఢంగ పెరిగిపోయింది.

వెంటనే "ఈ ధనస్సును ఆ సుకుమారుడెత్తగలడా" అని సందేహం- "ఈ, భారము ద్వాదశాబ్దముల ప్రాయము వాడితడోపగల్గునే? నేరక పెట్టికొంటినిది నేటి దినమ్మున వింటిముందు బంగారము వంటి యీ పీరుడు కన్పడవచ్చిన విట్టులుండి తిన్" అని వేదన చెందు జనకుడు తెలుగు కవి సృష్టి. ఈ చాపము చూపి రాముని సుకుమార శరీరుని ఎత్తమని పరీక్ష పెట్టితే లోకులు నవ్వరా! యన్న సందేహం సైతం జనకునిలో మొలకెత్తింది.

"రాముడు సూర్యవంశజుడే – రాజకుమారుడే – రూపవంతుడే
నామది కన్నిరీతులగ నచ్చిన వాడె - సుబాహు ముఖ్యులన్
భీమశరాశి కట్టె బలిపెట్టిన శౌర్యగుణైక ధాముడే
భూమిజ కర్హుడౌ పరుడె మూర్ఖుడనై పణ మిట్లు పెట్టితిన్" - (76.ప)

"మూర్ఖుడనై పణమిట్లు పెట్టితిన్" వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోలేక పరీక్షలతో సమయాన్ని వ్యర్థం చేస్తున్నానన్న బాధ జనకుని మాటలలో వ్యక్తం. యజ్ఞ దక్షిణకై వచ్చానని, జనకునివద్ద లక్ష్మి ఉన్నదని పలికిన విశ్వామిత్రుని పల్కులు కూడా పార్థివునకు అర్థంకాలేదు.

"నాకడ లక్ష్మియేమి రఘునాధున కయ్యది యిచ్చుటేమి? యీ
పోకడ చూచుమంద మునిపుంగవు దేదియొ, యెత్తువేసినా
డీ కమనీయ కావ్యమున కేది మొదల్ తుదియేది యేదియున్
వాకొన లేక యుంటినని.......................(80 ప.)

ఆవేదన చెందుతున్న జనకునితో "జానకి తల్లి" వచ్చి సీత జీవిత రహస్యాన్ని విశదీకరిస్తుంది. ఇది కూడా మూలాతిరిక్తం కాకపోయినా అరణ్యకాండలో కన్పించే, భిక్షిణి వృత్తాంతాన్ని కవి ఇక్కడ ప్రస్తావించారు. "జానకి జీవితమ్మకథ జాల విచిత్రముగా గనంబడున్" అంటూనే ఆ కథను ప్రస్తావిస్తుంది తల్లి.

అలాగే సీతాజనన వృత్తాంతం, వేదవతి వృత్తాన్తాదులు శతానందుని చేత ప్రస్తావ వశంగా మైథిలీ కథకు సంవదింపజేశారు తెలుగుకవి. చివరకు రాబోయే అరణ్యవాసాన్ని రావణవధను సైతం చెప్పించి,—

"కావున సీత లక్ష్మి దశకంఠవధార్థ మయోని జన్మగా

బావన యాగభూస్థలిని బ్రాభవమందిన దీవిధాన" —108 ప

అంటూ ప్రకటిస్తారు శతానందుడు. "రాముడే హరియు, జానకియే సిరి వింటిరే ప్రభూ!" అని ప్రకటించడం తెలుగు శతానందుని ప్రత్యేకత. ధనుస్సును రాము డెక్కు-పెట్టగలడా, లేదా యనెడి సందేహానికి తావులేదు.

"అపవిజతో వివాహమగు నాతని కొవయి చిత్రచిత్ర సం

భవపరిణామ వైఖరుల వారి మహాకథ యాది కావ్యమై

కువలయ మందు విల్చు కవి కోకిల గీతి మనోహరమ్ముగన్"-117. ప

అని జనకుని ఓదార్చి ఆదికావ్యప్రాదుర్భావాన్ని ప్రస్తావించిన క్రాంతదర్శిగ శతా నందుడు దర్శనమిస్తాడీ కావ్యంలో.

ఇంతలో జనకుని ఇల్లాలికి ఒక సందేహం కలుగుతుంది. దశరథునకు అంత మంది భార్యలున్నారు-వానికుమారుడికెంత మందిఉంటారో—తన బిడ్డకు పట్టమహిషిత్వ సంప్రాప్తిని గూర్చి ప్రశ్నిస్తుంది ఆమె. తండ్రిపోలిక సంతతికుండకున్నె-యిదినల్పిన సీతకు శాంతియుండునే" అన్న ఆవేదన ఆ మాతృమూర్తిది. విననజనకపురోహితుడు చిరునవ్వు నవ్వాడు" రఘూత్తము దట్టివాడుగా, దన పుచరిత్రకారి కలనైన మనస్సునైన దృష్టినైనను—

—మరి మాటనైన పరనారిని జూడడు" అని, ఇనకుల వార్ధిసోము డతదేకపత్నీవ్రతుడని రాముని ఏకపత్నీవ్రతాన్ని స్థాపిస్తారు. వారి నంగీకరింపజేస్తారు శతానందుడు.

"సిరిగలిగి యున్నచోటికి

బిరువెత్తుచునుందు లెల్లవారలు తల్లీ

సిరియిచ్చటున్న కతమున

వరుడే తానచ్చివచ్చె స్వయముగ విటకున్" —32 ప.

---

1. కన్యయా చపితుర్గేహే వనవాసకృతో మయా

భిక్షణ్యాం సాధువృత్తాయా మమమాతు రిహాగ్రితః" 2-/3 వాల్మీకం

సీత భూమిలో దొరికిన బంగారంకాబట్టి దానిని ఆభరణంగా స్వీకరించడానికి రాముడు వచ్చాడని చమత్కరిస్తాడు కవి.

కావ్యనామము-"మైథిలి" అని పాత్రప్రధానంగా ఉంచినా ఇందులో విశ్వామిత్ర, జనక, శతానందాదుల చాటున "మైథిలి" అదృశ్యగానే మిగిలిపోయింది. యాగశాలనుండి వచ్చిన జనకుడు రామలక్ష్మణుల ప్రస్తావన చేసే సమయంలో మాత్రమే ఒక్కసారి సీతా దర్శనం లభిస్తుంది పాఠకులకు, తండ్రి చెప్పిన మాట లన్నీ విని-

"అదివిని మందహాస మధురాంతర మందున జిందుచుండగా
వదన సరోజ బింబము త్రపాభర మోపగ లేక యొంగగా
పదములు రాజహంసగతి పై భవమంతయు నొల్కబోయగా
గదిలెను సీత లోపల కకాండతటిల్లత సాగినట్లుగా" 86. ప

—లోపలికి వెళ్ళిన మైథిలిపరిణయవేళ "మైథిలి హ స్తము రామమూర్తికిన్" సమర్పించేవరకు తిరిగి కనబడలేదు. దర్శనమే కరువైనప్పుడు ఇక పలుకు బంగారమవడంలో ఆశ్చర్యంలేదు. మైథిలీ పరిణయానికి జరిగిన పూర్వరంగ ప్రస్తావనే ఈ కావ్యంలో ఎక్కువగా కన్పిస్తుంది అయితే దాన్ని ఆధారం చేసుకొని "సీతాదేవి" లోని ఉదాత్త సౌందర్యాన్ని గుణగణాల్ని స్తోత్రం చేశారు కవి.

రామునిచేతిలో సీతనుంచుతూ జనకుడు—

"తన కతిపీడ సల్పినను ధారుణి యెట్లు సహించి పంటచే
దనుపు నొ లోకులందఱను తత్సుత గావున నీమె నెవ్వరే
మనిన క్షమించి వారలెవరైనను నెంతటి దుష్టులైన బ్రో
చును సుమి రామ! నీవటుల చూచెదవే! దొనగేరు చేసినన్"—145 వ

అని ప్రశ్నిస్తాడు.

సీతలోని కారుణ్యభావం రామునిలో ఎలావుంటుంది? ఆమె ప్రేమస్వరూపిణి, అందుకే—

"పాపానాంవా శుభనాంవా వధార్హాణాం ప్లవంగమ
కార్యం కరుణ మార్యేణ నకశ్చిన్నా పరాధ్యతే"

అన్న ఖ్యాతిని పొందిన దయార్ద్ర హృదయ, సహనశీలిగ కొనియాడ బడింది.

కళ్యాణం ముగిసింది, కమనీయ రూపుని కళ్యాణం లోక కళ్యాణంగా మంగళాక్షతలు విరియించారు పెద్దలు.

"పువ్వులు రాల- దుందుభులు మ్రోయ నభస్థలి నోరచూపులన్
రువ్వుచునుండ- గన్యలు పురోహితుడా శిషమీయ గడ్డమున్
దువ్వగ మౌని- శ్రీ దశరథుండెనలేని ముదమ్ము నొంద శే
నవ్వుల మోముతోడ రఘునాథుడు పెండిలియాడె మైథిలిన్" (53. ప)

"చంపకోత్పలాలతో గుణాభరణాంచిత కావ్య కన్య" తను రఘురామునకు సమర్పించి ధన్యులయ్యారు ఆచార్యులవారు చంపకోత్పలాలతో ఎన్నో రామ కథలను అందించిన రామానుజులు ఈ కావ్యాన్ని సైతం వారి భావాంనే అదే రీతిలో ప్రస్తావించారు. "సీత"లో లక్ష్మీత్వాన్ని దర్శించి "అనపాయిని"గ ఆమెను దర్శించడం, "లోనారసి" చూచి ఆమె కొఱకు విశ్వామిత్రుకు బయలుదేరి రావడం, శతానందుని చేత రామ కథా భవిష్యత్తును సైతం చెప్పించడం- వీనిలో కొన్ని-

"మైథిలి" చేత ఏమి మాట్లాడించాలో తెలియని స్థితిలో ఈ కావ్యం సీత మౌనంగా నిలిచిపోవడం దర్శనం సైతం ఒక పర్యాయమే జరగడం గమనించదగ్గ విషయం.

"సిరిగలిగి యున్న చోటికి, బరువెత్తుచునుండు రెల్లవారలు!........ జానకి భూమిలో దొరుకు స్వర్ణము 2...., నదృష్ట మేదియో, జనకునకుండ బట్టి యిటు పాగిరి లక్ష్మియు జక్రిధారియున్" 3 వంటి పద్యాలు చమత్కారనిష్యందములై ఆచార్యులవారి సహజ సిద్ధ కవితా ప్రాభవాన్ని ప్రకటిస్తున్నాయి.

"....భూసుతి కంపమైనచో, దానొక కాలమేఘముగ దర్శన

"మిచ్చును"వంటి పద్యాల్లో రఘురాముని వర్ణించు తరి 'కాల' పదానికి బదులు "నీలమేఘము" అంటే బాగుండేది- ఇటువంటి నెఱసులు మహాప్రవాహంలో కొట్టుకు పోతాయి. ఆచార్యులవారు అనువుగా చెప్పినట్లు కనిపిస్తాయీ పద్యాలు. అందుకే వీటిలోస్నిగ్ధత కొరతగా వుంటుంది.

---

1. మైథిలి- 132 ప
2. " - 133 ప
4. మైథిలి - 133 ప

## శ్రీ సుప్రసన్న వారి దుఃఖయోగిని

అశోకవనిలోని "సీత' ను "దుఃఖయోగిని" గావించిన ద్రష్ట శ్రీసుప్రసన్న.

లోకంలో బాధ అనేది రాక పూర్వం భయంచడం అతి భయంకరంగా వుంటుంది. కానీ అనుభవింపక తప్పని యప్పుడది ఆగాధావంతో అతి తేలిగ్గా భరించ బడుతుంది. ఇది లోకం రీతి. శింశుపా వృక్షం క్రింద రాశీభూత దుఃఖయై కూర్చొన్నది భూజాత. ఋతువులు మారుతున్నా అక్కడ శిశిరఋతువే కన్పిస్తోంది. సముద్రుడు భయంకరంగా ఘోషిస్తున్నాడు. అణచుకోలేని బాధతో సుళ్ళు తిరుగుతున్న రీతిగా బారలు చాస్తూ లంకను తనలో కలుపు కోవాలని యత్నిస్తున్నాడు. కన్న కూతురు దుఃఖాన్ని చూడలేక విలపిస్తున్న తండ్రి వేదన అది.

కారుచీకటిలో సైతం కాంతిమయంగా, తమో సరస్సున హిమ పటల పరీత శ్వేత పుండరీకం వలె, మంచున తడిసిన మల్లెమొగ్గల మాలగా శింశుపా వృక్షం క్రింద "క్షీరాబ్ధికన్య" దర్శనమిస్తుంది. తమస్సు అజ్ఞానానికి ప్రతీక కాగా తేజస్సు జ్ఞానానికి ప్రతీక. అంతరంగిక లోకమే కాని బాహ్యజగత్తు లేని యోగిని సీత.

"కన్నులను మూయుటన్న లోనున్న అంధ్య
మందు వెల్గుల సాధింపనన్న మాట
చీకటిని చూడచూడగా చిట్టచివర
వెలుగులివి యని గుర్తింప వీలుపడును".... (16 ప.)

"తమసోమా జ్యోతిర్గమయ" అన్న విశ్లేషణలో కవి 'జానకి'ని దుఃఖయోగినిగా మార్చారు.

"ఊహవంటి మనస్సునందున్న దున్న
యల్లెవరికైన దుఃఖమే అలమునేని
తన్మహా దుఃఖమందున తప్తమయిన
యలుటిజీవియె 'యోగిత' నందుకొనును".... (25. ప)

తప్త కాంచనం కాంతిని పొందినట్లు దుఃఖాగ్ని తప్తయైన జీవి 'యోగిత' నందు కొంటుంది.

"ఆమె యీ లంక యన్నది అసలె యెరుగ
దిక అయోధ్యయు మిధిలయు నెపుడొ మరచె,
ఆమె కిపుడు దేశము, లోకమంచు, చేత
మంచు, ఊహయంమను, కోర్కెయంచులేదు".... (27. ప)

కోరికలు లేని యోగినిగా రామధ్యానమగ్నమైన జానకికి రావణుడు—తమశ్శుద్ధ రూపిణులైన రాక్షస స్త్రీలను కాపుగా వియోగించాడు. వీరు ఎప్పుడు నిద్రపోతారో, ఎప్పుడు మేల్కొంటారో తెలియదు. తామసాకృష్ఠలైన యీ దానవినులు సీత సౌంద ర్యాన్ని చూసి ఈర్ష్యపొందారు. "అమ్మవారిలాగున్నదే" అంటూ గుసగుసలుపోతారు. అలానే నిద్రపోయిన వారు మేల్కొనేవరిగి "అదివిభీషణ రాజ్యమటంచు తెలిపె" అంటూ వారినిద్రానమయాన్ని అత్యంత చమత్కారంగా తెలియజేశారు సుప్రసన్న. అందుకే వారు "తమశ్శుద్ధరూపిణులు" అనే విశేషాన్ని సార్థకంగా వాడారు.

ఎదలో కొట్టుపాటు, నడకలో తడబాటు, కన్నులలో పెరటాటు వంత లిస్తుంటే-రాక్షసకాంతలు భయంతో ప్రక్కకు తప్పుకొంటుంటే రామప్రభుని చెంత నుండి విభీషణుడు సీతామాత సమీపానికి వచ్చాడు. సీత మ్రుంగిలిలో దోసిలొగ్గి రావణుని మరణాన్ని రామప్రభు విజయ పురస్సరంగా ప్రకటించాడు.

"ఆమె నా స్వామి సన్నిధి కానయింప
వేగ రా వచ్చుటయు విన్నవించినాడు" - (45. ప)

కాని సీతాసాధ్విలో కదలికలేదు. ఏమి చేయాలో పాలుపోలేదు లంకేశ్వరునికి-

"ఏకదలికయు కాంచక, ఏమి చేయ
రాక, తద్గత దృష్టి మరల్పలేక
అట్టులే ఒక్క క్షణకాల మచట నిలచె" - (46. ప)

విభీషణుని హృదయంలో కదలికలు అతిశయించి, ఆత్మనంటుతున్నాయి. మూసిన కన్నుల్లో సైతం ఆమె మూర్తియే భావనాపథంలో ప్రత్యక్షమైంది. "సర్వఋషి భావి తాత్మ విద్యారహస్యమగుచు" వాక్కుల కందని వెలుగు ప్రత్యక్షమైంది.

పూర్వదిశాభాగం ఎరుపురంగును సంతరించుకొంది. ఆ సుప్రభాతము "మొట్ట మొదటిసారిగా ఉదయమందినదిగదోచు". చెట్లకొమ్మల చివర్లో కన్పించే ఎఱ్ఱని కాంతులు సున్నితమైన గోళ్ళ చివర పండిన గోరింటాకు వలె ప్రకాశిస్తున్నాయి. కాడిఎత్తున లేచిన తరంగాల చివర తురిమిన మందార పూలవలె సూర్యకిరణాలు ప్రసరిస్తున్నాయి.

రాఘవాన్వయుని హృదయంలో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. సాగ

కువి లోతు సూర్యుని తీవ్రత గలిగిన అతని భావాల్లో జన్మజన్మాలుగా పీడకాలనట్టి "శ్రీదేవి" ఆలోచనలే సంచరిస్తున్నాయి.

"గలగలమటంచు నొక్కచిక్కనితరంగ
మమలహేలా నిధానమై అరుగుదెంచి
కాళ్ళు కడిగెనను తనకు, బంగారుటందె
లను ధరించిన సీతవచ్చిన విధాన" - (3. వ –9 వ)

అలల నవ్వడులనెడు బంగారుటందెల పాదద్వవితో కాళ్ళు కడిగిన సీత గుర్తుకు వస్తుంటే-ఇసుకలో కదలాడుతున్న గాలి తన చెవిలో సీతవచ్చి ఏదో ఊసులు చెప్తున్న తీయని భావన రాముని కదల్చివేసింది. ఇంత జరిగింది ఎవరికోసమనేది ప్రశ్న.

"ఇంతటింతటి సంగ్రామ మెవరికొరకు
ఇంతఇంత రక్తప్లుతి ఎవరికొరకు
స్వాత్మకొరకయి, జీవన్మృతాప్నకరండ
వర్తికయి, ఒక మహాదివ్యమూర్తికినయి" - (11. వ)

ఒక మహోన్నత మూర్తికయి ఈ పోరాటం. రక్తపాతం.

సీత చెంతకు వెళ్ళిన విభీషణుడు మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ రావడం చూచింది వానరసైన్యం. అంగదుడు లేచినిలబడ్డాడు. లక్ష్మణుడు అన్న ముఖంలోకి చూశాడు. విభీషణుని కన్నులలో ఏదో మూత్నానుభూతి వేదనతో మిశ్రితమౌతోంది. రాముని చూపులు "ప్రశ్నావశమ్ములై" పౌలస్త్యుని ముఖంమీద నిలిచాయి. ప్రశ్నించాలన్న ప్రయత్నం అందరికి పెదవుల మీద చేరి ఆగిపోయింది.

"విన్నపము సేసె నెల్ల విభీషణుండు
పది నెలలమండి తల్లి కన్పడిన తీరు
తాను చూచిన దెల్లను తాను నమక్ష
వించినది ఎల్ల వాక్కుల యంచులందు" – (21. వ)

యోగీశ్వరేశ్వరి యైన సీతారూపాన్ని వారిముందు రూపు కట్టించాడు మాటలలోనే విభీషణుడు. తన మనస్సులో సీతారూపాన్ని ధ్యానించి కనులు మూసుకొన్న లక్ష్మణునకు—

"అతని ఊహలు చూపులై అతని మీధ
అద్దమై ఊర్మిళనుగూర్చి అవగతించె" — (23 ప)

"ఊర్మిళా రమ్య మృదు విలాసహేలా స్మృతి పరంపరలు" కదిలాయి లక్ష్మణునిలో. వసంతర్తులు, గ్రీష్మశీతాలు, ఇంద్రధనస్సులు శరశ్చంద్రికలు వెల్లివిరిశాయి.

"ఇల్లు తా వీడునాడె విద్రింపబోయె
అట్టులే వెల్గుచున్నది ఆమెమూర్తి-
అవియె, భూషలు, వస్త్రమ్ము లవియె, మల్లె
లవియె, పెదవులపై దరహాస మదియె" — (30 ప)

ఆనాడు అయోధ్యలో తాను విడిచి వచ్చిననాడు ఉన్న ఊర్మిళ రూపే ఈనాడు కన్పిస్తోంది. ఇది ఎలా సాధ్యం? సందేహ నివృత్తి చేస్తూ—

"ఇంతదూరమ్ము తనదాక నేగుదెంచు
నామె లోజూపులవెలుంగు, లటుల కాద
యేని ఆమెను తాజూచు టెటులిపుడు?
వెల్గులేనిదే ఎట్లు కన్పించు టగును" — (35 ప)

అని సందేహించి -

"లో గొనందిడియెడునట్టి యోగమునకు
క్రొత్త ప్రస్తార మొనరించికొన్న యట్టి
ఊర్మిళా దివ్యరూపమ్ము నూదివిలుచు
నొక యలౌకికకాంతి అనూహ్యరీతి" — (36. ప)

-అంటాడు కవి.

"యోగమన్నది ఒకకొండవాగు వంటి
దద్ది ప్రవహింప మొదలిడెననుము, గుండె
లోతులెందాకనో, అంత లోతుచూచి
కాని విడువనిదెన్ని మార్గములనైన" — (37. ప)

ఆనాటి మల్లెలు పైతం వాడని స్థితిలో ఉన్న ఊర్మిళను దర్శించగలిగిన ప్రభావం ఊర్మిళదే.

"తనదిలేదేది, ఎల్లఅతనిదె, తనదు
సుఖములాతనివే, మహాసుప్రియన్న

అతని ఆత్మయే తనయాత్మయగుటకొరకు

నొందు యోగ సమాధియె ఊర్మిళవిధి" — (43. వ)

ఊర్మిళా మహాత్వం లక్ష్మణుని అనుసరించి, రామసేవలో పునీతమయింది. సీతోర్మిళలు ఒకే యోగానికి రెండు ప్రక్కల వారుగ విదేహరాజర్షి తపోవిభూతి సమపాళ్ళగా పంచుకొన్నవారుగా దర్శనమిస్తారు

ఆలోచనా ముద్రితులై భావనాపథంలో దేవేరుల వీక్షిస్తున్న అన్నదమ్ముల్ని ఆశ్చర్యంతో చూశాడు ఆంజనేయుడు.

"తరణి యొక్కడె వారలిద్దరుగనైన

ఒకడు కాంతియగును; మరియొకడువేడి" — (45. వ)

అనుకొన్నాడు ఆంజనేయుడు. సీతోర్మిళలు యోగానికి రెండువైపులైతే తరణికి రెండువైపులా రామలక్ష్మణులు దర్శనమిచ్చారు రామభక్తునకు. వారి కలయికయే పూర్ణత్వాన్ని ఆపాదించు కొంటుంది.

తన ఆత్మను దర్శించడానికి బయలుదేరాడు రాముడు. అత్యంతోత్సుకతతో అనుసరించారు వానరులు సీతామాతను దర్శిస్తామన్న ఆనందం వారందరి ముఖాల్లోను కొట్టొచ్చినట్లు కన్పడుతోంది. ముందు నడుస్తున్నాడు విభీషణుడు. వెనుక అందరూను, ఆలోచనల్లో తేడాలు ఉండవచ్చుగాని వారి గమ్యం మాత్రం ఒక్కటే.

"ఊహలందున భిన్నత ఉండవచ్చు

గమ్య మొకటియే జీవజగమ్మునందు" — (48. వ) అన్న పల్కులు– స్రవవన్నవి- "జీవన సరళిలో మార్గాలు వేరుగావి గమ్యం ఒక్కటే" అన్న వేదాంత భావసారం.

అశోకవన సౌందర్యాన్ని వీక్షిస్తూ, రావణుని అభిరుచిని మెచ్చుకొంటూ, శింశుపావృక్ష సమీపానికి చేరాడు రాముడు.

"ఆమహాయోజ్ఞి ముందర హైమకాంతి

విచ్చుచుండెడి యజ్ఞాగ్ని విధము, జనక

రాజ్యకన్యక, వీక్షించు రామచంద్రు

కనులలో కోటివెల్గులు పెనలువడియె" — (3. 23. వ)

రామచంద్రుని కన్నులలో కోటివెన్నెలలు చిల్కరించాయి. సౌమిత్రి కన్నులలో దివ్య తేజస్సు వానరుల నేత్రాలలో మహానంద స్రోతస్సు. ఎవరి మనస్సు ఏ స్థాయిదో వారిలో అటువంటి ఊహలే కలుగుతాయి. అతని కోర్కెలన్నీ వానినే అనుసరిస్తాయి.

స్వామి నడిచినంత మేర గాలికి చల్లదనమొచ్చింది. స్వామి చూపుపారినంత మేర తరువుల తల్లో విరులు వికసించాయి. వనంలో క్రొత్త సౌందర్యం ప్రత్యక్షమైంది.

"చల్లనివి, చిక్కనివి యైన స్వామిచూపు
లవనిజాత దేహమ్మునందలమికొనియె" - (3.34.ప)

చిక్కనిచూపులు చల్లనై వైదేహి శరీరాన్ని తాకుతుంటే,–

"గౌతమినదివలె గొంతు గద్గదమ్ము
గాక, కరుణ ఒక్కడె పొంగుగాగ పిలచె".... (3.36.ప)

ఓసిమైథిలి! వైదేహి! ఓసి జానకి! అంటూ పిలిచాడు రాముడు. అతని పిలుపులామె యందున విరజానదీ మనోజ్ఞభంగదివ్యరవమై శ్రీ వైకుంఠనగరశింజిత కాల సూచక మనోజ్ఞ పాంచజన్యరవమై ప్రతి ఫలించింది. ఆకాశగంగలోని బంగారు తామరవంటి జానకి వొంగి పద్మాన్ని నల్లని మబ్బు బాలరేఖను పట్టుకొనినట్లు రాముడు తన చేతిలోకి తీసుకొన్నాడు. వహ్ని జ్వాలలు కీలలై చెలరేగాయి.

భగ్నమయ్యె వైశ్వానర పర్వతమ్ము-
మబ్బులో చంచలాలత మండి పడియె–
భవుని ఫాలదృగ్వహ్నులు పడగలెత్తె-
స్వామి స్పర్శచే సీతలో సర్వమందు" - (3.40.ప)

చిరకాల వియోగ సంభవ స్వామి స్పర్శతో జానకిలో జనించిన వహ్ని కీలలు జ్వాలలై ఆమె కనుల్లోను, చెవుల్లోను కుదకు–

"ఆమె తనువు నందు వహ్నియెడల నగ్ని
ఉద్భవించె జీవ హోమమట్లు" - (3.42.ప)

సీత అగ్నిపునీత అయ్యింది. అక్కడ చేరిన వారందరు ఊహాతీతులై ఆశ్చర్య సముద్రంలో మునిగిపోయారు. అశోకవనిలోని వృక్షాలు వెల్లుల జల్లులవలె మాత్న పల్లవాలతో పువ్వులను అందించాయి. ఆమని రాముని కై పరుగులెత్తుకొచ్చింది. అగ్నిశిఖల చుట్టబడిన సీత "అమృతవర్షాధ్వమందు" తడిసినట్లు ప్రకాశించింది. సీతా రాములు ఒక్కటైనారు.

సర్వసృష్టికి మూలము, సర్వభావనా విశిష్టరూపంగ రాముడు, "సహస్రార చక్రకీలాప్త వహ్ని" లో ఒదిగెడి మహాశక్తిగా సీతవేరుగా కన్పించి ఒక్కటిగ నిలిచిపోయారు.

"అంతవరకు ఇద్దరైన సీతారాము
లాక్షణమ్మునుండి ఆత్మభావ
మందునైక్య మంది, రంతకన్నను సృష్టి
యందు నేకయుగళ మసలలేదు" (3.48.ప)

వారివిమించిన ఏకరూపులు జగతిలో మరొకరులేరు. సిద్ధిపొందిన యోగివి స్వామిలో లీనమై కావ్యం ముగిసింది.

"ఆనంద విధానుడైన శివుడు దుఃఖరూపుడు, రాముడు సౌఖ్యరూపుడు, శ్రీకృష్ణుడు మనస్సారధులుగా"! ఈ కావ్యానికి శ్రీకారం చుట్టిన కవి ఈ కావ్యాన్ని అనుభూతి విచారణాశీలక కావ్యంగ చెప్పుకొన్నారు. ఆనందమే సుఖదుఃఖరూపాలను పొందినట్లు యోగమనే తపనలో ఆనంద మావిర్భంచినట్లు దుఃఖవహ్ని తప్తమైన మనస్సులో తేజస్సముద్రం ప్రవహించడం కవి నిరూపించదలచిన సత్యం. ఆనందమే సుఖదుఃఖ రూపాల్ని పొందినట్లుగ వాల్మీకియే కాళిదాస భవభూతులుగ జన్మించినట్లు ఊహించిన కవి భావనలో రామకథపై సుప్రసన్నతున్న ప్రపత్తి వెల్లడవుతోంది. అందుకే-

"ఈ గీతి నా ఆత్మలోన కోటి
పుట్టువుల పూర్వమున నుండి తట్టుచుండు"—2

అనడంలో ఎంతోకాలంగా కవిలో కలిగిన మథన పర్యవసానమే ఈ కావ్యామృత కలశం. సీతావియోగాన్ని ఆధారం చేసుకొని కవి అనుభూతి పరంపరలను విరివిగా అందించారు.

"వెలుగులు సుఖమ్మునకు, చీకటులును దుఃఖ
మునకగు ప్రతీకలై లోకమును కలంచు
అహరహోద్భృతిశీలకమయిన చీవి
యెరిగియు నెరుంగడీ జీవి చిరమునుండి" — (3.3.ప)

కవిలోని వర్ణనా సామర్థ్యం కావ్యంలో విశ్వరూపాన్ని ప్రదర్శిస్తుంది.

---

1. అవతారిక - 1.ప 2. అవతారిక — 2.ప.

"తనజయాంకముల్లెల్ల దిక్తటములందు
స్వర్ణవర్ణమ్ములన్ వ్రాయసాగినాడు
ఉదయగిరి శిఖరమ్మున నుండి రవి, సు
ధాక్త ప్రథమ స్వకిరణహస్తముల తోడ" –(2. 2 .ప)

చెట్లకొమ్మల చివరల చిగ్రుదువలయి.

........

"స్వామి చూపులు జడభూత భూమిజాత
తనువుపై అణువణువుపై తరగలించె
ఎన్నివేల జన్మమ్ముల కెంతముందు
దో, మహానందభావమ్ము దొరికినట్లు " -(3. 35. ప)

ప్రతిపద్యం ప్రత్యేక వ్యాఖ్యానాన్ని అభిలషించేటంత ఉదాత్తంగా, సీతపాత్రను నిర్మించి సీతారాముల సమాగమాన్ని అత్యున్నతంగా ఆవిష్కరించిన ప్రతిభ శ్రీ సుప్రసన్నది. కవి ప్రతిభకు దీటుగా విర్చిన భావసౌందర్యం పాఠకుని హృదయంలో చిరకాలం నిలిచిపోతుందనడంలో ఆశ్చర్యంలేదు.

## శ్రీ కలువలపల్లి రంగనాధశాస్త్రిగారి 'మహాసతి సీత'

సర్వాభరణ భూషితుడై పరిమళ ద్రవ్యాల నలదుకొని పరివారం వెంటరాగా అశోకవనిలో ప్రవేశించాడు రావణుడు.

మారునిబారి పాలగుచు మంచియుచెడ్డయు నెంచలేక శృంగారవనం చేరాడు లంకాధిపతి. పలురీతుల్లో సీతా సౌందర్యాన్ని వర్ణించాడు. అందులో సమంగా తన ప్రతాపాన్ని ప్రకటించు కొన్నాడు.

కలికిరో! కాననమ్మునను గాసెడు వెన్నెల వోలె మాంజ వో
జ్వలమగు మేని సౌష్టవము జవ్వనమున్ వృధ పేయ నేటికిన్
వలచిన వాని బాయ దగవా........అంటూ దీనంగా– (5 ప)

ప్రార్థించి, పూలిస్తానని, మేడలిస్తానని ఆభరణాలిస్తానని ఆశచూపెడతాడు సీతకు.

"జలనిధి దాటినీవిభుడు జానకి! వచ్చునె లంకలోనికిన్
తలకక వచ్చెనేనియును నాయెదుటన్ నిలుపంగ నేర్చునే
నిలువగ నేర్చినన్ గెలుపనేర్చునె మానవ కీట మింతయున్
తెలియనిదాన నీవు –(8. ప)

అంటూ 'రాముని మానవకీటము' అని తిరస్కరించిన ఆ రాక్షసుని భూజాత "గడ్డి పోచను అడ్డుపెట్టుకొని మాట్లాడుతూ తృణీకరిస్తుంది. "పందవుగాక నీవు నెఱబంటివె"–అంటూ ప్రశ్నిస్తుంది.

"రాముని శాత్రవోత్కర విరాముని సంగర భీమునిన్
శ్యాముని సార్వభౌముదనుజారి వివర్జితకామునిం బరం
ధాముని మౌని హృత్కమలధాముని- (19. ప)

అంటూ రాముని ఔన్నత్యాన్ని ప్రకటిస్తుంది. "గడ్డిపోచ" ను మధ్యనిడుకొని రావణునితో సంభాషించిన సీత వాల్మీకి సృష్టియే! కైలాసాద్రిని కదిలించానని మిడిసి పడుతున్నావు కైలాసాధిపు విల్లునే విరచిన యోధుడు రాముడు. అయినా వేయిమాట లెందుకు యుద్ధం చేసేటప్పుడు భేదం తెలుస్తుంది అంటుంది. "రాముని వంటి శూరుడన రాజిలు లక్ష్మణుండు అంటూ లక్ష్మణుని సైతం గుర్తుచేసి, ఆ రామపాదాన్ని కొలిచి నీరాజ్యాన్ని కాపాడుకొమ్మని కూడ హెచ్చరిస్తుంది.

---

1. సుందర 21-3.

... ....తదీయ పూజ్యపద తామరసంబుల గొల్వబొమ్మి నీ
సిరియును రాజ్యమున్ నిలుచు చేటు పుటల్లదు నమ్ము రావణా" 24 ప.

అంటూ హెచ్చరికలు చేసే సీతలో "తేనమైత్రీ భవతు తే యది జీవితుమిచ్ఛసి" అంటూ హెచ్చరించిన వాల్మీకి సీతే కన్పిస్తుంది. కానీ కార్తవీర్యార్జుని కథను, వాలి కథను ప్రస్తావించి, పరశురామ గర్వభంగాన్ని గుర్తుచేసి రామునకు బుద్ధి చెప్పగల సీత కలువకొలనువారిది.

"నేను శపించినన్ బ్రతుక నేర్తువె నాపతి యానతీయమిన్ మానితిగాక"1

అన్న పల్కులు తెలుగు సీతవి. వాల్మీకి రామాయణంలో సీత ఉత్తమ నాయికకాగా అనంతర కావ్యాలలో ఆమె దేవతా స్వరూపిణిగానూ, సీతమ్మవారుగాను రూపుదాల్చి ఆధునికులకు లక్ష్మీ రూపుగానే దర్శనమిస్తుంది. అందువల్ల శాపానుగ్రహ సమర్థగా ఆమె పాత్రను నిర్మించిన విధానం రంగనాధాది రామాయణాలలో స్పష్టంగా కనిపిస్తోంది. వాల్మీకంలో సైతం సీత—

ఆ సందేశాత్తు రామస్య తపసశ్చాను పాలనాత్
నత్వాం కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్హ తేజసా"2

అంటుంది. భర్త యనుజ్ఞ లేకపోవుట, తపోనియమముండుట అన్నవి వాల్మీకంలో సీత రావణుని భస్మం చేయకపోవటానికి కారణాలు,

"ఇనకులనేతయౌ దశరథేంద్రుని కోడలి రాజయోగియౌ
జనకు నమంగు గూతు సతిశౌర్య జితోద్ధతవైరియైన రా
ముని సహధర్మిణిన్ విబుధపుంగవ సన్నుత పూతచర్య నన్
జెనకగ జూచు కూళలకు జేటొనగూడకయున్నె పాతకీ" (32. ప.)

1తవ్యధరాత్మన పత్నీం స్నుషాం దశరథస్య 3 అన్న వాల్మీకి సీత పలుకులు పై పద్యానికి ఆధారాలు 'తనువుడొరంగు కాలమిదె దాపురమాయెను నీకు" అంటూ శాపనార్థాలు పెడుతుంది. "నాపతి శ్రీపతి" అంటూ ప్రకటించేస్తుంది నీరి సీత. అగ్ని ప్రవేశానంతరం మాత్రమే బ్రహ్మ శ్రీరామునితో "సీతాలక్ష్మీర్భవాన్‌విష్ణుః"4 అని

1. మహాసతి సీత—భారతి 1925 2-27 ప.
2. వాల్మీకం—సుందర 22—20
3. వాల్మీకం—సుందర 22—19
4. వాల్మీకం—యుద్ధ 121—28

వీరియొక్క పరమాత్మ తత్త్వాన్ని వాల్మీకిలో ప్రకటిస్తారు. కానీ, కల్వకొలనువారి సీత ముందుగానే లక్ష్మీత్వాన్ని ప్రకటించుకొంటుంది. చదువుతున్న చదువులన్నీ వ్యర్థంకాగా ఈ స్థితికి దిగజారావా? సిగ్గులేదా అని నిందించటమేకాక—

"చక్కవిచక్క వేలుపులసావిధి రంతను బిల్మివట్టినన్
ఎక్కులదేవివట్టి విని శాపమొసంగుట జేసి కాదె నా
దిక్కున నీవివర్గమగు తెంపున జూపకయుంటి కావిచొ
నెక్కట విల్వనీకయలయింపక యుందువె నన్ను ధూర్తరా! (39 ప.)

అన్న పల్కులు కల్వకొలనువారి సీతవి. సీతాదేవి సాధ్వీత్వాన్ని కొనియాడటానికే మహాసతి "సీత" అనే లఘు కావ్యాన్ని ఈ కవి అందించారు. చివరి మూడు పద్యాలు కవి ఆశయాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి.

మనసులో రామనామాన్ని విడువక ఎన్నో యిడుముల బడినా రక్షించుకొనే ఉపాయమే చూచుకొంది గాని ఆ వనాన్ని ఒక్క పర్యాయమున్నా నలుమూలలా వీక్షించలేదు. కులాంగనలు తుచ్ఛసుఖాలను కోరుకోరుకదా!

"మాయలమారులైన బలు మానిసిదిండి పడంతులెప్పుడున్
బాయక చుట్టిముట్టి చెడు పల్కులు పల్కిన నేవగించి వ
ర్ణేయ చరిత్రయైన పతిదేవతశీలముగాచికొన్న సీ
తాయికి సాటివచ్చు పవితం గనుగొందుమె వేయునేటికిన్" (44 ప)

.... .... .... .... .... .... .... .... ....

యచ్చరబృంద మద్భుతము నందుచు సన్నుతిసల్ప జిచ్చులో
జొచ్చి మహీజ నైజ పరిశుద్ధత జూపె త్రిలోక వంద్యయై (45 ప.)

అన్న గౌరవం అభిమానం భక్తి ముప్పిరిగొని వీరిచేత ఈ కావ్యాన్ని వ్రాయించాయి. ప్రత్యేకతలేని అర్థస్పష్టత గల్గిన సీతాచరితమిది. సమయానుగుణంగా స్త్రీ జాతికి బుద్ధులు చెప్పడానికి కవి ఈ ప్రయత్నం కావించి ఉంటారు.

# మంథర

రామ కథలో ఉన్నదేమిటి? అడుగు అడుగున 'వెలుగు-చీకటి' అన్నారో కవి. వెలుగుచీకటుల పయ్యాటలో అయోధ్యానగరి రాజ్యలక్ష్మి రాముని చెంగటికొచ్చి మంథరా దుర్బోధల ఫలితంగా, కైకేయీ కోరికలనే నెపంతో భరతుని చేరింది. ఇది రామకథలో ప్రధాన ఘట్టం.

ఆనాడు అయోధ్యానగరమంతా మంగళతోరణాలతోను, రంగురంగుల తంగ వల్లులతో ఆనందోత్సాహాల కేరింతలు కొడుతోంది. సౌధాగ్రం పైనుండి అయోధ్యా నగరంలోని హడావుడిని చూచి ఆశ్చర్యపడ్డది మంథర. కారణం తెలుసుకొంది. ఇక కార్యానికి సిద్ధం పడింది. రామ పట్టాభిషేకం భగ్నం చేసి, ఆ మహనీయుని అరణ్యాలకు పంపించడం ఆమె ప్రథమకర్తవ్యం.

ఈ లఘుకావ్యాన్ని శ్రీదుర్గానంద్ రచించారు. వీరి దృష్టిలో మంథర ఒక మహావిప్లవానికి ప్రతీక. తరతరాల బానిస వృత్తిలో కాక తిరుగుబాటు వంశపారం పర్యపరిపాలన కాక అడ్డుకట్ట. మంథర ఒకమహోగ్రయుంయు, అయోధ్యా నగరాన్ని ఆనాడుపాతుకుపోయిన అనేక సనాతన దురాచారాలను ఒక ఊపు ఊపి పునాదులతో పెకలించిన మహోగ్రశక్తి మంథర. రాచరిక వ్యవస్థపై తిరుగుబాటు- అందుకే-

"గుండుకొని పోవుచుండె విఘూర్ణితమ్ము
వై ప్రాశయ పైకతములు సనాదికథలు
మనువు చెప్పిన నీతులు, మనుజనాథు
కుండవలసిన హక్కులు, కుమిలి యోడు
గలుచుచున్నవా మంథర కలుకు భ్రుకుటి
మ్రోల, మబ్బులు వాత్యల మ్రోల వోలె" [2]

మనుజ నాథుని హక్కులు, మనుధర్మ శాస్త్రాలు మట్టిలో కలిసిపోయాయి. మంథర కుటిలనీతి ముందు మహర్షుల ప్రయత్నాలు "బోరు" కలదాయి. సామదాన భేదాదిక్రియా చతురులైన వృద్ధులు సైతం మంథర ఉపాయం ముందు తలలు వాల్చారు.

"వ్యూహకుశలురు, వ్యగ్ర సంస్ఫోట ఠీవు
అతిమదోత్కట బృంహితాహ్వనరతులు

---

1. స్రవంతి 1959- డిసెంబరు 50 2. మంథర- 2వ ప.

విరుదు గ స్తీలు,-సుక్కు బోపీలు, పిడులు
ఓటు పడుచుండె మంధర కొటుముందు"

మంధర తిరుగులేని కొటుకు వ్యూహకులే దాసోహమన్నారు. పుట్టు బావినయై దశరథుని యింట దాసిగ, ప్రవేశించిన మంధర ప్రయత్నంలో ఏ సమస్యాపార స్యాలున్నాయో తెలుసుకోలేక ఈ ప్రజలు ఆమెనునిందిస్తున్నారు. అంతేకాని ఆమె- కవి దృష్టిలో.

"అతిగవోయిన మంచికి యతియుప్రాస
తీసి వెగటున కొక పులితేన్పు పినరు"2

అతి మంచితనానికి యతి ప్రాస ఈ మంధర- ఒక మహాశిల్పికి అందమైన శిలాఖం డం కన్పిస్తే ఏలా ఊరుకోక పనికల్పించుకొంటాడో, అదే విధంగా రాజ్యతంత్రజ్ఞ మంధర సాకేతపురాన్ని చదరంగ ఫలకను చేసుకొని, మనుష్యుల మనస్సుల లోని దౌర్బల్యాన్ని ఒక్కొక్క బంటుగ వినియోగించుకొన్న ప్రాజ్ఞ.

"దాది! వినుబోలు రాజ్యతంత్రజ్ఞురాలు.
భేదపుంబంట్లురా జాల విడుచునెట్లు"3

అన్న మెచ్చుకోలు కవిది. అంతఃపురంలోని వారందరి లోను పెక్కు భావాలు వెల్లుగ ప్రవహిస్తుంటే- మంధర మనోవీధిలో నూత్న భావావిష్కారం జరిగింది. అంతఃపురంలోని వారెవరు? ప్రతివారిలోను ఏదో ఒక బలహీనతలున్నాయి. అయినా అందరూ గొప్పవారే.

"ఈతడు దశరథుదిక్ష్వాకు కలదీప్తి,
కావి పెదతనాన కైకపిచ్చి
అతడు కులగురుదధిక విద్యాశాలి
కావి తీర్పుల శాంతి కలన హెచ్చు
పుడమికే బంగారు పూర్ణచంద్రుడు రాము
డవ్వుగాక జవదాట దార్యులాజ్ఞ
మేటిదిటవరి సౌమిత్రి విక్కమెగావి
గడ్డి పోచన అన్న కట్టువాని
ఇట్టి యసుదర్క దైన్యాల శిక్కవారు
మంచి యను మాయకోట రక్షించుభటులు-"4

---

1. మంధర — 4 వ
2. మంధర - 3 వ
3. మంధర - 8 వ
4. మంధర - వ

నల్లురిలోను నాలుగురీతుల "బలహీనతలదర్శించి" ఉష్కృ-ధర్మపు నిగళుల జాట్టువడిరి" అనడం కపిల⁻వి తిరుగుబాటు ధోరణికి నిదర్శనం. అదే "మంథర"లోను ప్రవేశించింది. అందుకే-

యీ, నేమములన్నియున్ సుఖపునేలల బుట్టు పసిండిపూలు నీ
వామనహ స్తమె త్తి తెగవ్రయ్యలొనర్చుము రాచజాడ్యముల్"1

అంటూ మంథరనుద్బోధిస్తారు కవి. మంథర దుర్బోధల కైక విప్లవిస్తే, శ్రీ దుర్గానంద్ బోధలతో మంథర "విప్లవ రూపిణి" అయింది.

"ఓ ప్రళయ యుగకారిణీ! ఓ సవిత్రి
ఓ యరుణరథ చోదకీ! ఓ పురాణ
సృష్టి రూపిణీ! యో పౌరుషేయవాణి
ఓ అకాల ఫలవతీ! ఒ యుగ్రగేహినీ!"2

అన్న సంబోధనలు మంథర నుద్దేశించినవి. అనగా మంథర రూపం అది. ఏదేమైనా మంథర ప్రయత్నం ఆరంభమైంది అర్ధరాత్రి

"అయినను మంథరా నిబిడ మా నడిరేయి తమస్సులో నుష
స్సయినను విచ్చి హాయబెలుచన్ వెలుగొందెడివేళ నీవు కే
కయనృప పుత్రికా హృదయ ఘంటికపై వినదించినావు, కీ
డయి యదినీకు జాట్టుకొనెనక్కట! వ్యర్థమకాల సత్వముల్"3

ప్రయత్నం లోక క్షేమంకరమైనా నిందమాత్రం మంథర నాశ్రయించింది. అయినా మంథర ఆ విధంగా ప్రవర్తించడానికి—రాముని పట్టాభిషేకాన్ని భంగం చేయడానికి గల కారణం-అకస్మాత్తుగా పుట్టింది కాదు. "ఇట్టి సంరంభమందేదో చెప్పగరాని కారణ" ముండి ఉంటుంది అని సందేహిస్తారు కవి మంథరా పూర్వజన్మ వృత్తాన్ని కవి ఇక్కడ ధ్వనింపచేశారు.

భారతంలో "దుందుభి" అనే గంధర్వాంగనే మంథరగా జన్మించిందని చెప్పబడుతుంది.4

నత్యోపాఖ్యాన రామాయణంలో "మంథర" విరోచనుని పుత్రికగ చెప్పబడింది. దేవతలచే మోసగించబడి సంహరించబడిన తండ్రి ఋణం తీర్చుకోవడానికి, దేవతలపై యుద్ధం చేసి ఇంద్రుని వజ్రాయుధం చేత విగతజీవయైంది. మరణిస్తూ తన మరణానికి ఇంద్రుని ప్రోత్సహించిన శ్రీ మహావిష్ణువుకు కష్టము కల్గించుదానను అనే కోరికతో మరణించి కేకయరాజు దాసికి పుత్రికగా జన్మించింది.5

---

1. మంథర - ప
2. మంథర - ప
3 మంథర - 21 వ
4. -పురాణిక్ ఎన్సైక్లోపీడియా పు-603
5. ఆశ్చర్య రా. అయోధ్యపు-60

అగ్నిపురాణంలో "రాముడు చిన్నప్పుడు మంథరా పాదాల్ని పట్టుకొని లాగి ఆమెను బాధించాడని, ఈవైరమే రాముని వనవాసాన్ని మంథర ప్రోత్సహించడానికి కారణమైంది"1 అని ఉన్నది. ఇది చాలా స్వల్పకారణం.

అందుచే "పూర్వవైర వాసనయా పునఃచింతయామాస రాఘవస్యాభిషేచనే" అన్నాడు ఆశ్చర్య రామాయణ కర్త.

"వ్యక్తిగతమైన వింకెన్ని యాత్మకథలో తీర్చిదిద్దెను మంథర తెగువనిట్లు" అన్న కవి పలుకుల్లో సైతం "ఈ పూర్వగాథ" ప్రస్తావన స్ఫురిస్తోంది.

కౌసల్యదాసి నిన్‌గాంచి తా పెదరాణి
ప్రియదాసినని మూతి విఱుచునేమొ
తనిరుబోంట్ల నడుమ దశరథుండీ విచ్చు
గందంబు మైబూత నందుకొనడొ
ఎపుడైన సౌధాన నెదురైన సౌమిత్రి
చుట్టువ నిన్ మిట్టి చూచిదనెనొ
సీరాజనాలెత్తి యారామభద్రుకు
సీతాణి సుతు పరికింపబోరొ1-2

ఏకారణం చేత నీవు ఈ పని చేశావని, రామచంద్రుని అరణ్యాలకు పంపించావని కవి ప్రశ్నిస్తాడు మంథరను. ఈ సందేహాలన్నీ కథల్లో దొర్లేవి. రాముడు చిన్నవాడు గుండెలమీద తన్నాడనే కోపంతో మంథర ఈపని చేసిందని జానపదుల కథను ఈ కవి ప్రస్తావించలేదు. పెద్దరాణియైన కౌసల్యదాసి "గూనిదాన్ని" చూచి మూతివిరవడాలు, పదిమంది దాసుల్లో సేవలందుకొను దశరథుడు ఈమె ఇచ్చిన గంధాన్ని స్వీకరించకపోవడాలు మొదలైనవి కవి ప్రస్తావనలు కొన్ని బాగానే ఉన్నాయి. ఏమైనా మంథర విజృంభించింది.

"నీతమో నిద్రమండి, నీవిభితదాస్య
నిగళములమండి నీహీమానీశిలాత్మ
హీనభావన మండి యూపూవి యొడలు
విఱుచుకొంటివది దరకు విలయమయ్యె"—3

-అన్నమాటలు నిజం. గాఢాంధకారతలో ఒళ్లు విరుచుకొని

1. ఆశ్చర్య రామాయణం - అయోధ్య పు — 73.
2. మంథర - 29 వ
మంథర - 31 వ

తరతరాల దాస్యశృంఖలాల తెంచుకొని "గంధకపు కొండకు అగ్నిరాచి" విడిచి నట్టు కైకమ్మ వద్ద వరాల ప్రస్తావన తెచ్చింది మంథర. కైకను జ్ఞానవంతురాల్ని చేసింది. "జ్ఞాతిదాసీ యతోజాతా కైకేయ్యాస్తు సహోషితా' 1 అన్నాడు వాల్మీకి. కైకేయి పుట్టినింటి నుండి వచ్చిన "జ్ఞాతిదాసి" మంథర. శ్రీ దుర్గానంద్ ఆమెను "క్రీతదాసి" అన్నారు, కాని "జ్ఞాతిదాసి" "యతోజాతా" అన్న వాల్మీకి పల్కులా ధారంగా "జ్ఞాతిదాసి" అనటం సముచితం.

"నీకే స్వార్థమె రామభద్రువనులన్ నిర్వాసితుం జేయగా
కాకే సౌఖ్యము ప్రామి కొంమవు భళా! కైకేయి గిర్వమ్ముతో
సాకేతేశ్వరి వొదునన్న తలపా! చాల్ చాలు నీభవ్య సే
వాకావ్యార్థములోని సాహసము జూపం జాలినా వంతియే"2

ఇక్ష్వాకు వంశానికి రావలసిన కీర్తిని, శ్రీరామచంద్రునికి, వాని ద్వారా కైకకు ప్రాప్తించవలసిన అజరామర యశస్సును వారికి దక్కేటట్లు చేయడానికే—ఒక జ్ఞాతి దాసిగ మంధర ప్రయత్నించింది సఫల అయింది. తనలో ఎటువంటి స్వార్థం లేకుండా కేవలం తాను సేవచేస్తున్న వంశానికి "ధన్యసేవ" నందిందాలన్న ఆశ యంతో మంధర ఆ పనిచేసింది. అందుకే—

"ఒక మహాకావ్య సంస్సృష్టి యొకతుపాను
ఒక్క స్వాతి బిందు పతన మొకయుషస్సు
స్వార్థ సంసిద్ధి దడవియే జరుగునొక్క
లేదు మంధర! నీలోన లేదషమ్మ"3

ఒక మహాకావ్య ఆవిర్భావం, ఒక స్వాతిబిందువు, ఒక ఉషస్సు ఏ విధంగా స్వార్థ రహితంగా సేవచేస్తాయో ఆదేవిధంగా నిస్వార్థ సేవచేసింది ఇక్ష్వాకు వంశానికి మంథర. తన ప్రయత్నానికి ఆధారం కైక. ఉన్నవారిలో మంచిది. మాయలేనిది. కొంచెంగా కోపమున్నా కొద్దిలో తగ్గిపోయేది ఆమెకె. అందులో ఆమె దశరథుని ముద్దుల భార్య ముఖ్యంగా తనరాణి. అవకాశం తీసుకొని 'మీటనొక్కింది' మంధర.

"ఒక మహాప్రాజ్య సామ్రాజ్య మొక్కదేవి
కేలనుంట వాతడు నొక్క కీలుగంటి

1. వాల్మీకం - 2-7-1
2. మంథర - 34 ప
3. మంధర — 35 ప.

కనుసన్నల మెలగుట కాంచి యవ్వ
మీటవొక్కిరి వొఱగయ్యె మిఱునేల"1

కూలిపోయింది దశరథాదుల ఆశాసౌధం. నారచీరలు కట్టాడు సీతారాముడు. రాణి వాసము శోక సంతప్తమైంది. వశిష్ఠ మహర్షి అవాక్కైనాడు. అయోధ్య అల్లల్లా డింది. సేవా ధర్మంలో నిస్వార్థంగ మంథర యొనర్చిన సేవా నైపుణి కావ్యానికి క్రొత్త అందాలను ఆందించింది. అందుకే—

"పోవే మంథర! నీ ప్రహారమున కాపుల్గట్టె రాముండు రా
ణీ వాసమ్మవదాత వస్త్రమయమై నిల్వెల్ల శోకించె, వి
ద్యావాశిష్టము మోఘమై చనెనహో! జ్యానాదకమ్మాడి గా
ధా వైశిష్ట్యమ్ముగా వినంబడియనో దాదీ! నతుల్నీకివే"2

అంటూ జోతలనందించారు మంథర కార్యకరణ నైపుణికి కవి దుర్గానంద్. అది రామాయణ కాలమైతే అందులో కైక వుంటుంది. అచ్చట కైక ఉంటే ప్రక్కనే మంథర ఉంటుంది. అన్నంతగ సమాజాన్ని ప్రభావితం చేశారు వారిరువురు.

"ఆయుగభూతి యంతయు వశిష్ఠులవారి పిఱుందునంటియే
పోయె నటందు తన్నొలక బోసికొనెన్ దనకోసలేశు భ
ద్రాయిత హస్త సంపుటుల తానుగ తానయి కోసలేశు డా
త్మాయువు రాముకిచ్చె — నతడాయువు పట్టు సమస్త ధాత్రికిన్!"3

వశిష్ఠుడు సమస్తాన్ని కోశలేశునికి సమర్పిస్తే ఆ మహారాజు రామునకు ధార పోశాడు. రాముడు సమస్త లోకానికి ప్రాణాధారం. కాబట్టే రాజ్యతంత్రజ్ఞురాలైన మంథర ఆ 'ఆయువుపట్టునే' తెగవేసింది. లోకం తల్లడిల్లిపోయింది. కోపించి "మంథర"ను నిందించింది. కాని—

"క్రాంతిజనయిత్రి! నీపుణ్యకార్య మింత
అవగతం బెట్లు లోకుల కడవి మూక"4

అడవిమూకయైన లోకులు మంథరను నిందిస్తున్నారు. ఆలోచించేవారే లేరు. శేషుడే రాజన్న యుగయుగాల నియమం ఈ శాకుతో తొలగిపోయింది. పతితం

1. మంథర - 36 ప.
2. మంథర - 41 ప
3. మంథర - 43 ప
4. మంథర - 46 ప

మంథర చూడలేకపోయినా "భావియుగము నీపద ప్రహారమున నిర్ణిద్రమయ్యె" నన్న విశ్వాసం దుర్గానంద్‌ది. అందుకే "కంట నీర్వెట్టబోకె ఏకాకిదాన, అది విప్లవకారిణివమ్మ నీవు"1 అంటూ మంథరను ఓదార్చుతాడు కవి. అంతేకాదు— –ఏకతంత్రతపోయి - రాచరికపు వ్యవస్థపోయి నేఁడు "మనుజభోగ్యమై తనరె సమగ్రభూమి నేడు"2 అంటూ నేటి ప్రజాస్వామ్య పాలనకు ఆనాటి మంథరా ప్రయత్నమే కారణమన్నంత విశ్వాసాన్ని కవి ప్రకటిస్తారు.

"ఇట్టి జడిమకు తొలి నడలింపు నీది
ప్రగతి భూమిక యది-కనుపడని క్రాంతి
విఫల మై నందుకీవు బెంచేలు పడకు
దీర్ఘ కాలిక ఫలద మీద్భశ చికీర్ష"3

అన్న ఓదార్పుతో కవి మంథరకు నీరాజనం పట్టారు.

సంప్రదాయ రాజరికాన్ని రూపుమాపటానికి ఇప్పటికీ ఎందరెందరో పునరావ మంథరలు ప్రయత్నిస్తున్నారు. వారికి విజయం లభిస్తున్నదంటే ప్రజలకు ఈ వంశపారంపర్య పాలనపట్ల వైముఖ్యం ఉన్నట్లే. శ్రీ దుర్గానంద్ మంథర కావ్యంలో ఈ భావాలు రమ్యంగా ధ్వనిస్తున్నాయి. పురాణేతివృత్తమిరీతిగా పునరావ వ్యంగా భాసించటం ముదావహం

---

1. మంథర - 45 ప
2. మంథర - 48 ప
3. మంథర - 49 ప.

# కైకేయి

రామకథా గమనానికి అడ్డుకట్టగా నిలిచి, రాక్షస సంహారమనేది సుదూర గమ్యానికి రాఘవుని జేర్చి, రామావతార పరమార్థాన్ని లోకానికి చెప్పి, తాను మాత్రం అపయశః కళంకాన్ని అలదుకొన్న అభాగ్యురాలు కైకేయి. మహర్షి తపో బల సంస్కారము, మహారాజిచ్చిన వరాలు, ముద్దుల భార్యగా అయోధ్యానగరం అంతఃపురంపై ఆధిపత్యముండికూడా, చెప్పుడు మాటలకు మోసపోయి, రాజరికపు రాజాసాన్ని, రాచకన్నె మర్యాదల్ని విడనాడి పదిమందిలో పలుచనై, భర్తచేత తుదకు కన్నబిడ్డ చేత సైతం "ఛీ' కొట్టించుకొన్న దురదృష్టవంతురాలు కైకేయి.

మహర్షి వాల్మీకిలేఖిని అందించిన కైకేయి ఉపేక్షిత నాయిక. కైకమ్మలోని సద్గుణాలను మఱుగుపరచి, మహనీయుల మాటలలో మాత్రం మంచిని విన్పింపజేసి, కథావర్ణనలో ఆమె దుర్గుణాలను వర్ణించి, పాఠకులకు స్త్రీజనోచిత స్వార్థ ప్రవృత్తి గల 'గయ్యాళి'గా కైకమ్మను తీర్చిదిద్దిన నైపుణ్యం వాల్మీకిది ఆమె సచ్ఛీలతను దర్శించడానికి వీలైన దారుల్ని మూసివేసి, అసూయాగ్రస్తగా సౌభాగ్య మదగర్వి తగా, - తుదకు "కైకేయి" అంటేనే ఒక వికృత దుశ్చేష్టా స్వరూపగ రామా యణంలో కైకేయి కన్పిస్తుంది. ఆమెలోని ఔదార్యం, యుద్ధనైపుణ్యం, సవతి బిడ్డలపై గల మమతానురాగాలు, పెద్దలమెడ గల గౌరవమర్యాదలు, ప్రజాక్షేమా కాంక్ష ఇవన్నీ మరుగునబడ్డాయి.

కేకయరాజుకిచ్చిన వాగ్దానం గానీ - అసలు రాజ్యాన్ని పొందవలసిన భర తుడు లేని సమయం చూసి రామునికి పట్టాభిషేకాన్ని ప్రకటించడంలోని ఔచిత్యాన్ని గానీ, తుదకు భరతాదుల పిలిపించమని రాముడు కూడ అనకపోవడానికి కారణాల గాని, వాల్మీకి వ్రాయలేదు.

"లక్ష్మణా! నీవు కూడ నాతో రాజ్యభోగాలననుభవించమని లక్ష్మణుని ఆదేశిస్తాడే' గాని మిగిలిన ఇద్దరుతమ్ముల్ని ప్రస్తావించనైనా ప్రస్తావించడు. ఇవన్నీ కైకేయి పాత్రను మూసివేసి, అపవాదుల భారాన్ని ఆమెపై వేసి నొక్కివేశాయి. వాని అడు గున పడిపోయాయి.

అయితే పండితలోకంలో కైకేయి ఉత్తమురాలే. ఆ విషయం మంథర ప్రవేశం వరకు ఉన్న రామాయణ భాగమే మనకు స్పష్టంచేస్తుంది. మంథరా ప్రవే శం తరువాత కూడా— పట్టాభిషేక వార్త విని తన రాముని పరాక్రమాన్ని కొ

యాడి, పట్టాభిషేకాన్ని సమర్థిస్తూ, ఆ వార్త చెప్పిన మంధరకు మంచి హారాన్ని బహూకరించే "కైక" వాల్మీకి సృష్టి. "ఏకమాభరణం తస్యైకుబ్జాయై ప్రదదౌ"1 అంటాడు వాల్మీకి. కాని మాతృప్రేమా వ్యామోహంలో మునిగిపోయి, జ్ఞాతిదాసి మంధర మాటల్లో చిక్కుకొని కీర్తిని కోల్పోయింది. "రామేవా భరతేవా హం విశేషం నోపలక్షయే"2 అని, రాముని తర్వాత భరతుడు రాజవుతాడని అమాయకంగా పల్కిన కైకేయి తుదకు అడవికి పంపి, భర్త మరణానికి సైతం కారణమై,పుత్రుని చేత తిరస్కరించబడి విలపిస్తుంది.

అయితే రాముడే "కైకమ్మ"ను ప్రార్థించి, అరణ్యవాసం విధింప జేసుకొన్నాడని, మంధర నాలుకపైకి "సరస్వతి" ప్రవేశించి కైకమ్మను ప్రబోధించిందని, ఇవన్నీ రాక్షస సంహారానికి దేవతల ప్రయత్నాలేనని అధ్యాత్మ' 3 ఆనంద రామాయణాదుల్లోని వృత్తాలను ఆశ్రయించి, మంధరను యీపాపానికి ప్రధాన కారకురాల్ని చేసి, కైకేయిని నిర్దోషిగ నిలబెట్టడానికి, అనంతర కాలికులు విశేషంగా కృషి చేశారు. భోజుడు, భాసుడు వంటి మహాకవులనుండి హిందీకవి మైథిలీశరణ్, కవిసామ్రాట్ విశ్వనాథలవరకు గల మహాకవుల ప్రయత్నాలు కైకేయికి నూత్న జీవాన్ని ప్రసాదిస్తున్నాయి.

మంధర వంటి దాసి కౌసల్యా సుమిత్రులకు లభిస్తే ఎలాగుండేదని సందేహించినవారు కొందరుకాగా-

భరతుడు తల్లిమాటను అంగీకరించి, రాజ్యాన్ని స్వీకరిస్తే రామాయణం మరో "భారతం" అయ్యేదేమోనని సందేహించేవారు కొందరు -

యోగశాస్త్ర మర్మజ్ఞగా, త్రికాలజ్ఞగా, వెలిగిన కైకేయి, రాముని విశ్వవిధుత్వాన్ని ముందుగానే గమనించి సహకరించిన త్యాగశీలిగా బహురూపాల్లో ఆధునిక "కైక" దర్శన మిస్తుంది.

---

1. వాల్మీకం - అయోధ్య – 8  2. వాల్మీకం-అయోధ్య- 8. 35 శ్లో.

3. గచ్ఛదేవ భువోలోకే మయోధ్యాయాం ప్రయత్నతః
రామాభిషేక విఘ్నార్థః మతస్వ బ్రహ్మవాక్యతః
మంధరాం ప్రవిశస్వాదౌ కైకేయించ తతః పరమ్.
ఆనందరామాయణంలో మంధరా పూర్వజన్మవృత్తాన్తం ప్రస్తావించబడింది.

## శ్రీ పళ్లె వారి కైకేయీ సౌశీల్యము

'కైకేయి'ని సుశీలగా నిరూపించ యత్నించిన కావ్యం శ్రీ పళ్ళె పూర్ణ ప్రజ్ఞా చార్యుల వారి కైకేయీ సౌశీల్యము. ఆచార్యులవారు కైకేయిని 'సుగుణశీల'గ భావించి, వాల్మీకము నందలి ఉపపత్తులతో దానికి ప్రాణం పోసి, తాత్పర్యనిర్ణయము వంటి గ్రంధాలు, భాసుడు, భోజుడు, వెంకటాధ్వరి వంటి మహాకవుల కావ్యాలు ఆధారంగా వారి భావాలతో సజీవ చిత్రంగా 'కైకేయి'ని నిలబెట్టారు.

రాముని క్షాత్రవోత్కర విరాముని చేయడానికే అరణ్యవాసానికి రాముని పంపి అనురాగాన్ని ప్రకటించుకొంది కైక. అది అర్థం చేసుకోలేక ఆమెను నింది స్తున్నారన్న వాదం కవిది. మహర్షి వాల్మీకియే కావ్యంలో పెక్కు తావుల్లో కైకేయీ సౌశీల్యాన్ని ప్రదర్శించారు. "కాకులు లోకులామె పయి గాఱులె వాకొనసాగినారు" తద్వాక్యులు సత్యదూరములు అనే సిద్ధాంతంతోనే కవి కావ్యాన్ని ప్రారంభించారు.

దీనికి ప్రోద్బలకంగా— "నహికించిదయుక్తం వా విప్రియం వా పురామమ" అన్న దశరధుని పల్కుల్ని, "దైవాభిపన్నాహి వదత్యవిష్టం జానాసి దైవంచ తధా ప్రభావమ్" 2 "మధ్యమాంబా గరీయసీ" 3 అన్న రాముని పల్కుల్ని "నదోషేణావ గంతవ్యా" 4 అన్న భరద్వాజ మహర్షి పల్కుల్ని ఉదాహరించవచ్చు. అలాగే పట్టాభిషేకవార్త చెప్పిన మంధరకు ఆభరణాన్ని కానుకగా యిచ్చి, రాముని గుణ గణాలను స్తోత్రం చేసిన కైకమ్మ, రాముని అడవికి పంపడం విచిత్రమనిపిస్తుంది. దశరధుడు కూడా— "అవిష్ట్యాసి గ్రహైః శూన్యైః" 5 అంటాడు. ఆ సమయంలో—

"రామేవా భరతేవాపి విశేషం నోపలక్షయే

తస్మాత్తుష్టాస్మి యద్రాజా రామం రాజ్యేఽభిషేక్ష్యతే॥" 6

అన్న ఉదార హృదయ కైకేయి. అందుకే "రామోరాజ్ఞః సుతోజ్యేష్ఠో యౌవరాజ్య మతోర్హతి" 7 అంటూ జ్యేష్ఠునికే రాజ్యాధిపత్యమని స్పష్టంగా ప్రక టిస్తుంది. అంతేకాదు "రాముని అనంతరం భరతుడు రాజు అవుతాడు"అని పల్కిన అమాయకురాలు కైకేయి. అందుకే మంథర అంటుంది—

1. వాల్మీకం- అయోధ్య- 12-20
2. వాల్మీకం- అరణ్య-
3. వాల్మీకం- అరణ్య-
4. వాల్మీకం- అయోధ్య- 92.29
5. వాల్మీకం- అయోధ్య- 12.19
6. వాల్మీకం- అయోధ్య- 7.34
7. వాల్మీకం- అయోధ్య- 8.14

"రాముని అనంతరం రాముని కొడుకులే రాజులౌతారుగాని భరతుని కొడుకులు కారు" అని. ఇంత అమాయక నిర్మల హృదయ అయిన కైక మనస్సు మంధరా దుర్బోధలచే క్షీరభాండంలో పాషాణం కలసినట్లు విరిగిపోయింది. అందుకే శత్రుఘ్నుడు "మంధరా ప్రభవస్తీవ్రః కైకేయీ గ్రాహ సంకులః"1 అంటాడు. ఇట్టి ఉత్తమ గుణాలు కలిగిన కైకేయి లోకం దృష్టిలో "అతనికృష్టయగుట కెంతయు వగచి యీ చిన్నిపొత్తమును" వ్రాసినట్లు కవి వక్కాణ. అందువల్లనే సిద్ధాంతాన్నే సమర్థించుకుంటూ వెడతారు కావ్యమంతా కవి ప్రజ్ఞాచార్యులుగారు.

సపత్నిమాత్సర్యమున్నదని కైకను నిందిస్తారుగాని, సవతి మాత్సర్యముంటె రాజు ముద్దుల భార్యమై పాయసంలోని అర్థభాగాన్ని పెద్దభార్యకిస్తుంటే వలదని ఆపితే ముసలిరాజు ఏంచేయగలిగేవాడు? ఆనాడే పోయుండేవాడా? కాదు. తనుగీసిన గీతను దాటని రాజుచేత కైకేయి ఏమైనా చేయించగలదు! మంథరా బోధలువిన్న తరువాత కూడ రాముని ఔన్నత్యాన్ని కొనియాడిన గుణాఢ్య కైక. ఆమెను నిందించడం న్యాయంకాదు. కాని రామునిపైనున్న ప్రేమను కూడ కొట్టి వేయగల మాటలమారి మంథర.—

"మేనెటు వక్రమో మఱియు మిక్కలి వంకర తెల్విలేటలా
గూనున నున్నవా చెనటి కుబ్జకు"2

అనడమేకాక—"ఎంతటి లాయరైన నద్దానికడ బలాదూరె"3 యన్న పొగడ్తను కవిచే పొందిన మంధర నోటికొలది మాటలతో కైకమ్మ కీర్తిపై బురదచల్లింది. మాటిమాటికి సవతిమాటల ప్రస్తావిస్తూ - భయంకర దావిన సమాజాన్ని కైక ముందు ప్రత్యక్షం చేయించి భయపెట్టింది. రాముడు యువరాజని కౌసల్య రాజమాతని, అందరం ఆమెకు ఊడిగం చేయాలని, నీకొడుకును మేనమామ ఇంటి నుండి అటునుండి అటే అడవులకు పంపకపోతే నీకొడుకే దక్కడని బెదిరిస్తుంది. ఇది వాల్మీక సృష్టే.

చెప్పుడు మాటలతో చెడిపోయింది కైక. అన్ని విషయాలు తనతో చెప్పే నాధుడు ఈ విషయం ఇంకా చెప్పకపోవడం - భరతుడు దగ్గరలేకపోవడం, కౌసల్య రాజ్మాతగా ఒక్కగా నొక్కకొడుకుని ఏంచేస్తుందోననే భయం-కైక మనసును మార్చివేశాయి. రాముని తరువాత భరతుడు రాజౌతాడన్న ఒక్కమాట చాలు ఆమె అమాయకత్వానికి ఉదాహరణగా.

---

1. వాల్మీకం-అయోధ్య–
2. కైకేయీసౌశీల్యము-22 ప. 3. కైకేయీ సౌశీల్యము–23 ప.

"కుమతి" "దుర్బుద్ధి" అని భర్తను నిందించినట్లు కైకపై అపవాదు. కానీ "ప్రియం పురుష విగ్రహమ్మని" శైలూషునిగా భర్తను నిందించిన మహాతల్లి సీతతో పోల్చితే ఈ మాట ఏపాటిది. అందుకే కవి –

"కైక గయ్యాళియని యంద్రుగాని మిగుల
నాపెగయ్యాళితన మంతయరయరాదు
మనమనగరాదు చూడరామాయణంబు
సీతకే కొంతయీపేరు చెల్లునేమొ?"1

అని అత్తను మించిన కోడలిగ సీతను గంపగయ్యాళిని చేసాడు. లక్ష్మణుని అంతగా నిందించిన సీతాసాధ్వి ఇంకా ఎందరిని ఎలా నిందించిందో అందరిలోనూ, ఏవో లోపాలు ఉండవచ్చు. ఏలోపాలు లేని మహాసాధ్వి గాంధారియని, అంటూ నతులు సమర్పిస్తాడు.

పట్టాభిషేకాన్ని గూర్చి చెప్పడానికి వచ్చిన రామునితో తన బంధువుల్ని సుమిత్ర బంధువుల్ని చూసుకోమని పల్కుతుందేగాని కౌసల్య కైక ప్రస్తావన తీసుకు రాలేదు. రాముని పంపిస్తే చచ్చిపోతానన్న దశరధుని పల్కుల్లో నిజంలేదనుకొంటుంది కైక. కారణం ఇంతకు పూర్వం విశ్వామిత్రుడు తీసుకెళ్ళినప్పుడు ఇలాగే అని పోలేదనే మొండిధైర్యం" కాని ఇప్పుడు నిజమైంది. రాజుమరణానికి మునికుమార వృత్తాన్తమే కారణంగాని కైక కాదు.

శంబరాసుర యుద్ధంలో భర్తను కాపాడి, పసుపు కుంకుమలను నిలుపుకొన్న కైకేయి భర్త ప్రాణాలెందుకు తీస్తుంది. ఏమైనా గూని మంథర కైకేయి కొంప తీసింది. తప్పులు లేవంటే ఎవరికైనా లేవు. ఉన్నాయంటే అందరిపైనా ఉన్నాయి. కైకేయే కారణమనడానికి కారణం రామునిపై ప్రజలకున్న అభిమానం.

పితృవాక్పాలకుడు శ్రీరాముడే అన్న తప్పుకాదు గానీ, భరతుడు కూడ అందుకు దీటైనవాడే - ఎందుకంటే

"రాముడగుగాక సద్గుణారాముడనఘు
డల్లనారాయణుండె తా నౌను గాక
భరతుడెంతయు ధర్మతత్పరతయందు
దీక్షయందును నతనికి దీసిపోడు" 2

లేనిదానిమీద విరక్తి మెండు కానీ లభించిందాన్ని వదలి నిష్కాముడై చరించటం త్యాగం.

1. కైకయీ సౌశీల్యము - 69 ప. 2. కైకేయీ సౌశీల్యము – 91 ప.

అసలు రామునికి కీర్తిని కల్గించిందే భరతుడు. ప్రాప్తించిన రాజ్యాన్ని మారాడక పరిపాలిస్తే రాముడు అడవుల్లోనే ఉండేవాడు - కథ అక్కడే ఆగిపోయేది - కాకుంటే — మొదటి భారతమై మిగిలేది కానీ, వచ్చిన రాజ్యాన్ని తిరస్కరించి సంప్రాప్తించిన అనేక పరిణామాలకు కారకుడై రామకీర్తిని శాశ్వతం చేశాడు భరతుడు.

సీతవంటి ఇల్లాలు, కైకవంటి సవతి తల్లి సుగ్రీవుని వంటి స్నేహితుడు, లక్ష్మణుని వంటి తమ్ముడు, హనుమంతుని వంటి సేవకుడు, రావణుని వంటి శత్రువు, విభీషణుని వంటి శరణార్థి, యుద్ధంలో సంధి విఫలమవడం, జాంబవంతుని వంటి వీరుల సహాయం రామచరిత్రను రక్తి కట్టించాయి లేకపోతే మొదటినుండియు దామోదరుడే గదా!

"దశరథేశుని ముగురు తరుణులందును గూడ
గైక భరతమాత గణ్యురాలు
తత్కుమారులందు దక్కువారలు ధర్మ
పరత మించలేరు భరతుపుత్రు"1

"మధ్యమాంబా గరీయసీ" అన్న రాముని పల్కులు, "నదోషేణావ గంతవ్యా" అన్న భరద్వాజుని పల్కులు "భాస"2 "భోజుల"3 కావ్యాలను దర్శిస్తే కైకేయి మంచిదనిపిస్తుంది. కైకమాట అలావుంచితే — మంథరవంటి దాసి కౌసల్యా సుమిత్రలకు లభిస్తే వారి స్థితి ఎలా ఉండేది.

"రమ్యచారిత్ర కేకయరాజపుత్రి యఖిల గతుల సుశీలయే యగును"4 అంటూనే "దాస్యుక్తి" వినడం తప్పని ఒప్పుకున్నారు కవి. కైకసగీర్తిగూర్చరానికి భువికి దిగిన యభాగ్యదేవత మంథర. కైకమ్మ మాతృమూర్తి నిర్దోషి. పాపమంతా మంథరదే.

"కైకకునప్రతిష్ఠ నరకాంతునకున్ మృతి రామచంద్రుసు
శ్లోకునకున్ బ్రవాసకృతిశోకము లోపలనెట్టిపాపపుం
బోకడలేని యాభరతపుత్రునకున్ దలవంపు మానితే
క్ష్వాకుకులప్రతారణము గర్గెమనీకృతి చేత మంథరా!"5

కానీ మంథరా కపటనాటకం వమ్మై తుదకు రాజ్యం "రామరాజ్యమే" అయ్యింది.

1. కై.సౌ - 95 ప.
2. కై.సౌ - 98 ప.
3. కై.సౌ. - 100 ప.
4. కై.సౌ. — 110 ప.
5. కై.సౌ. - 118 ప.

"రామునభిషేకభంగ మారంభమగుచు
నడచు వనవాసమను మహానాటకమున
సూత్రధారిణియై కథాపాత్రములను
నడిపినదికుబ్జయేయని నాతలంపు"1

కథా పాత్రలను నడిపిన సూత్రధారిణి మంథరగా కవి తప్పంతటినీ మంథరపై వేసి కైకమ్మను సుశీలగా ప్రకటిస్తారు.

"శ్రీ పూర్ణ ప్రజ్ఞాచార్యులవారి కవితా ప్రతిభ యకుంఠితమైనది. వీరి రచన తెలుగుజాతీయములతోడను సరళమైన శైలితోడను విరాజిల్లుచున్నది. కావ్యకారణ ముల బొందించుట యందుగానీ, ఇతర కవి పండితుల దృష్టిని వ్యక్తీకరించుట యందుగాని కవిగారి పాండితీగరిమ తేటతెల్లమౌతుందన్నది "పిల్లలమఱ్ఱి వారి కైమోడ్పు"2 కాకులు లోకులు, అవాకుచవాకులు, కాకిని గ్రద్దను. బ్రమ్మివిద్రిమ్మని" జాతీయాలు లోకోక్తులు కావ్యంలో అందంగా చోటుచేసుకున్నాయి.

ఇది పద్యాత్మక వ్యాసంగా భావించవచ్చు. కారణం భావ ప్రకటనంలో ఇతర కవుల ఉటంకింపులు, సమర్థనలే అధికం. హృదయవశీకరణ రచనా రామణీయకం లుప్తం.

---

1. కైకేయీ సౌశీల్యము - 114 వ.

2. కైకేయీ సౌశీల్యము - కైమోడ్పు - ఎక్సువి-XV.

పశ్చాత్తాపాన్ని మించిన ప్రాయశ్చిత్తం లేదు. తాను చెప్పుడు మాటలవలన రామచంద్రునికి అన్యాయం చేశాననే భావన కైకమ్మలో కలిగింది. అది భరతుని రాజ్య తిరస్కారంతో ప్రబలమై, తుదకు రామచంద్రునకై ఎదురుచూచే వారిలో ప్రథమయై నిలిచింది కైకేయి. ఆత్మనివేదనా కావ్యంగా రూపొందిన చిలకమర్తి వారి కైక రూప చిత్రణ స్పష్టంగా ఇది. పండితలోకంలో కైకపై సదభిప్రాయమున్నా సామాన్యుల్లో మాత్రం గయ్యాళిగ ఆమెపై దురభిప్రాయం పాదుకొంది. అందుకే ఇలపావులూరివారు ఆంధ్రదేశంలో "కౌసల్య"లు "సుమిత్ర"లు కన్పిస్తారు గాని, "కైకేయి" పేరు మాత్రం ఎవరు పెట్టుకోరు అంటారు.

రామకథనంతటిని కైకేయి స్వగతంగా విన్పించడం మూడువందల పద్యాల పైబడ్డ కావ్యంగా సాగింది. రాముడు రాజుకావడం తనకొక్కతెకె ఎందుకు అయిష్ట మౌతోంది? కౌసల్యకన్నా పెంచింది కైకమ్మ గదా! అటువంటి తన రాముడు రాజు కావడం తనకెందుకు ఇష్టం ఉండదు.

"ఎన్నగరాని ప్రేమ గురిఖించితి గన్నుల గప్పుకొంటిరా
మన్నను, గావునన్ జనువనంతయు నాకడవానికిన్, సదా
నన్ను దలంచుచున్ దలుచునాగృహమంద చరించుచుండునన్
గన్నుల జూడకుండ నొక నాడును నిల్వగజాల రక్కటా!"1

అన్న విశ్వాసం కైకమ్మది కడుపునబుట్టిన భరతునికి రామునకు రవంత భేదంలేదు. పదహారేళ్ళు నిండకముందే తాటకిని చంపినాడన్న విషయం విని, తానునేర్పిన విద్య సఫలమైందని సంతోషించింది. ఈ భూమి పుట్టినప్పటినుండి జ్యేష్ఠుడే రాజవుతున్నాడు. అందుకు విరోధమేలేదు.

మంథర మాటలువిని ఆనందించి హారాన్ని బహూకరించింది. మంథర పల్కుల్లో ఏవో వికృతధ్వనులు, ఆర్భాటాలు, ఉరుములు, మెరుపులు. కానీ క్రోపి పుచ్చింది. ఎన్నిజన్మలైనా రామునివంటి కుమారుణ్ణి, జానకివంటి కోడల్ని ఇమ్మని కోరుతున్న సహృదయ చిలకమర్తివారి కైక. మంథర మాయాజాలం కొనసాగింది. భరతుణ్ణి పిలవనంపకపోవడం నుండి శంబరాసుర యుద్ధ వృత్తం వరకు ప్రస్తారం జరిగింది చీకటి గృహప్రవేశం చేసింది కైక. రాజువచ్చాడు. "కోసల సార్వభౌము నకుగుంభియురాలికి నేటికిం గ్రుధా వాసము చేరగా వలసివచ్చెనదె"2 అంటూ ఆశ్చర్యపోయాడు. వరాలు తీర్చమంది· వాగ్దానం చేశాడు కోరికలు వెలువరించింది కైకమ్మ. ఆమె హృదయ కాఠిన్యమటువంటిది.

---

1. కైకేయి - 6 ప

3. కైకేయి — 92 ప.

"మృదులత లేని భిన్న మొనరించిన నార్ద్రిత కాన దానియే
యదన నొకింత సంచలన మందని కర్కశకాకరాళతా
స్పదపృధులోపలోపమము స్వాంతము దారుణపాపభీతికిన్
చెదరక నిల్చి గోంతిని జెట్టిదమైన పరద్వయమ్ముటుల్"1

తనకు తనుగా వినదించిన హృదయ కాఠిన్యమిది. ఆశ్చర్యపోయాడు మహారాజు. భరతునిపై నాకున్న ప్రేమ ఎటువంటిదో పరీక్షిద్దామని ఈ విధంగా ప్రశ్నించావా? "ఎప్పుడు అశుభం" పలుకని నీవు ఇటువంటి పల్కులు హృదయ విదారకాలు ఎలా మాట్లాడుతున్నావు. ఏదైనా గ్రహమావహించిందా అని వేదన చెందుతాడు. చివరకు భరతుడు ఉదారుడని, జ్యేష్ఠునకు చెందవలసిన రాజ్యాన్ని కోరడని అంటాడు. ఇవన్నీ వాల్మీకి పల్కులే.

మూర్ఛపోయాడు దశరథుడు. రాముని పిలిపించింది, తండ్రి ఆజ్ఞను విన్పించింది కైకమ్మ. ఆనందంగా అంగీకరించాడు. తమ్ముణ్ణి పిలిచి రాజ్యాన్ని అప్పగించమన్నాడు. వనవాసంలో మునీశ్వరుల సందర్శనం జరుగుతుందిగదా! అంటూ ఆనందించాడు. అంతఃపురం జేరి ఇల్లాలికి మెల్లగా వనవాసాన్ని గూర్చి చెప్పారు. "ధరిత్రి సుత గుండెనిండ సుడిగుండాలెన్ని రేకెత్తాయో?– తాను కూడా వస్తానంది. లక్ష్మణుడుకూడ అనుసరించాడు. నారచీర కట్టుకోవడం చేతకాకపోతే- సీతమ్మ రామచంద్రుని "వీనినిన్ దాపసకన్య లేకరణి ధరించెదివారని పృచ్ఛసేయ— నాధపరిణద్ధ మూర్తి రఘునాముడు తానయి కట్టబోవగన్" 2 అంతఃపురమంతా ఆ కరుణామయ దృశ్యాన్ని చూసి కంటికిమింటికీ నేకధారగా విలపించింది. హాహాకారాలతో నిండిపోయింది అయోధ్యా నగరం. వేదనలో కొట్టుకొని ప్రాణాలు విడిచాడు కోసలేశ్వరుడు నల్గురు కొడుకులుండి కూడ లేనివాడయ్యాడు.

భరతునికి కబురుపెట్టాడు వశిష్ట మహర్షి. రథాన్ని దిగి తల్లిని చేరాడు భరతుడు "నీకై యింతలు సేయనేర్చితివి దండ్రీ! యింక నీ కోసలక్ష్మ కళ్యాణి గూర్చు వల్ల భుడవై" 3 పాలించమంది బిడ్డను కైకమ్మ.

గొడ్డలిలో కొట్టినట్లు పడిపోయాడు భరతుడు. నిన్ను ఏనాడైనా రాజ్యమడిగానా అన్నాడు. నిన్ను తల్లీ అని పిలవడమే అవమానమన్నాడు. అడవికి వెళ్ళి రామునికి రాజ్యమప్పగిస్తానని బయలుదేరాడు — వెంట కైక కూడా కదిలింది వాల్మీకంలో" 4 ఇక్కడ కైకమ్మ ఆ మాటను ప్రత్యేకంగా చెపితే బాగుండేది. ఎందువల్లనో ప్రస్తావించలేదు కవి.

---

1. కైకేయి - 101 ప.
2. కైకేయి - 169 ప.
3. కైకేయి - 213 ప.
4. వాల్మీకం - అయోధ్య - 6 83 శ్లో.

భరతుని కోరికను సున్నితంగా తిరస్కరించారు రామచంద్రుడు. రాజ్యం నీదేనన్నాడు. అలిగాడు తమ్ముడు. ప్రాయోపవేశం చేస్తానన్నాడు. అనునయించారు అన్నగారు. పాదుకలతో నందిగ్రామం చేరాడు భరతుడు. ఏదో కోరుకున్న కన్న తల్లి హృదయం వేదనతో క్రుంగిపోయింది. పశ్చాత్తప్త భగ్నమైంది. భర్తకోసం భోగాల్ని వదలి అరణ్యాలు చేరిన ఇల్లాలు ఒకరుకాగా - భోగాలకోసం ఆశపడి భర్తను పోగొట్టుకొన్న గృహిణి వేరొకరు.

"పతికై విస్తుల రాజ్యభోగము తృణప్రాయంబుగా నెంచి సాం
ద్రితరారణ్యము జేరబోయినది సీతాసాధ్వి నే బుద్బుద
ప్రతిమానంబగు రాజ్యభోగమునకై ప్రాణేశు దూలింప నో
పితి బుణ్యాత్ములకున్ దురాత్ములకిదే భేదంబు విశ్వంభరన్"1

అన్న విశ్లేషణాత్మక ఆలోచనలు కైకలో చెలరేగాయి. ఆడదానికి శిక్ష పసుపు కుంకుమలు చెరిపెయ్యడం – అందుకే ఆ ప్రభువు తాను చేసిన పాపాలకు ఈ శిక్షవిధించాడని దురపిల్లుతుంది. పట్టుపానుపుల నిద్రించే జగన్మోహనాకారుల్ని అడవుల పట్టించిన తనకు నిష్కృతిలేదు.

నా రాముడు, భరద్వాజ మహర్షి మాత్రమే నన్ను చల్లని మాటల ఆశ్వాసించారు. మిగిలిన వారెవ్వరు నన్ను గుర్తించలేదు. చెప్పుడు మాటలు ఎంతపని చేశాయి? కూటికై ఊడిగం చేసే ఆ దాసి ఎంతపని చేసింది? రాబోయే రోజుల్లో ఎవరైనా ప్రశాంతంగా ఈ కథనంతా పరిశీలించకపోతారా! తప్పొప్పుల విశ్లేషణ జరపకపోతారా? అన్న ఆశ చిటిప్రోలు వారి కైకది.

జరిగిన గాథ నంతయు బ్రశాంతముగా బరికించు ధీర శే
ఖరుడొకడైన నెన్నటికి గల్గకయుండున? మాయలాడి మం
థర కత మింతనేగి కనుతథ్యమొకింత గ్రహింపకుండునా?
విబుధవర కి యథార్థమును విశ్వమునం బ్రకటింపకుండునా?"2

అనే ఆశతో ఎదురుచూస్తోంది కావ్యంలో కైక. ఆ ప్రియత్నం కవి చిటిప్రోలు చేశారు. 'ధీరశేఖరుడు' గ - స్థూలంగా రామకథ – కైక పల్కుల్లో కావ్యంగ ఒదిగింది. అందరి కవుల వలనే పాపాన్ని మంథరపైకి నెట్టి, కైకమ్మను మాతృ మూర్తిగా, నిష్కల్మష హృదయగా నిలబెట్టడమే కవిలక్ష్యం.

కావ్యమంతా 'ఆత్మనివేదనా' త్మక మవ్వడంతో పాఠకులకు కొంత విసుగు జనించే ప్రమాదం వుంది. పద్య నిర్మాణంలో సిద్ధహస్తులుగా చిటిప్రోలు కృష్ణ మూర్తిగారు లబ్ధప్రతిష్ఠులు. మూలానుసారంగా సాగిన రచన వీరి కైకేయి.

1. కైకేయి - 259 ప.   2. కైకేయి - 298 ప.

## కందుకూరి వారి కైక

రాముడు అరణ్యవాసానికి వెళ్ళిపోయాడు. శూన్యహృదయగా మిగిలిపోయింది అయోధ్య. వశిష్ఠ మహర్షి నగరంలో ప్రవేశించి తేడాలేని సామాన్యుల చూసి ఆశ్చర్యపోయాడు. రాముడు అడవులకు వెళ్ళినా ఎవరిలోను విచార రేఖలు కన్పించడం లేదు. తనతావాలే శూన్యంగా ఉన్నాయనిపించింది మహర్షికి. కౌసల్యా సుమిత్రలు సైతం రామవియోగ దుఃఖాన్ని మరచి పోయినట్లు కన్పించారు. కైకేయీ అంతఃపురం చేరాడు.

కాంతివిహీనంగా–కన్పించింది కైకమ్మసౌధం. ఆశ్చర్యపోయాడు మహర్షి. అయోధ్యలో ఎక్కడా లేని దైన్యం అక్కడ ప్రత్యక్షమైంది. తనలో తానేదో గొణుక్కుంటూ, తలయెత్తి దూరదేశాన్ని పరికిస్తూ, ఏదో లెక్కించుకొంటూ, అంతలో నవ్వుకుంటూ, ఒకటనేది ఇంకొకటి చెపుతూ, ఒకచో కూర్చొని ఇంకోచోట కూర్చుంటూ, ఒకమాటకు ఇంకోమాట మాట్లాడుతూ- విచారంగా కూర్చుంటోంది.

ప్రాణముల్ పీడుటకు నేని వశముగాక
పాప ఫలమెల్ల ననుభవింపంగ నున్న
ప్రాణి పోలిక మదిని తాపమ్ము నొంది
చిక్కి శల్యమై కైకేయి క్రుక్కుచుండె" 1

మహర్షి రాకను తెలియజేశారు పరిచారికలు. అర్ఘ్యపాద్యాలతో ఎదురొచ్చింది శల్యావశిష్టయైన కైక.

సేదదీరిన వశిష్ఠులతో తన వేదనను వివరించుకొంటుంది. అసూయాగ్రస్త హృదయనై రఘువంశాన్ని నాశనం చేశానంటూ రోదిస్తుంది. ప్రేమగాచూసే నాధుడ్ని మింగేశానంది. మంధర మాటలు నాకొంపముంచాయన్నది. "ధవళాంగ మహర్షి" వరాన్ని ప్రస్తావించింది ఆ మంత్రప్రభావం రఘుకులానికి కోతల్ని చేసింది. మూడుపువ్వులారుకాయలుగా సాగుతున్న జీవితంలో ప్రవేశించింది శంబరాసుర వృత్తాంతం–నాధుని రక్షించి వరాల పొందింది.

స్వార్థప్రవృత్తి లేకపోతే మహర్షి వరాలు. నాధుడిచ్చిన వరాలు లోకకళ్యాణానికంతో తోడ్పడగలవని ఆనందించింది-కానీ-దైవం వేరుకితిగా ప్రవర్తించింది.

---

1. కైకేయి–పుట (6–1)

రామపట్టాభిషేక ప్రకటనం–మంథరా దుర్బోధ కైకను మార్చివేశాయి. మంచి–మాన్యత బూడిదలో కలిశాయి. లోకం వెలివేసింది–మాటచెల్లింది? పత్నియు తద్దై రాఘవుడు అడవులపట్టాడు. రాజు కావగినవాడ్ని అడవుల పట్టించాను. రామ భరతుల సోదరప్రేమ తెలిసికూడా ఇలా ఎందుకు ప్రవర్తించానా యని ఇప్పుడు చింతిస్తున్నాను.

"భరతుని రాము నెంచగ లవంబును భేదము గానరాదు! యి
ద్దఱు నవనీరదాభులు ప్రతాపగరిష్ఠులు సుస్మితాస్యులున్
గురుజనరంజనుల్ హృదయగ్గోపనదివ్యకళాపటిష్ఠులున్
బరమ దయాప్రపూర్ణులును భావనమూర్తులులోకమోహనుల్" 1

ఇద్దరి భావాలు! రూపురేఖలు చేతలు అన్నీ ఒకేరకంగా ఉంటాయి. ఎక్కడికయినా ఇద్దరే కలిసివెళ్ళేవాళ్ళు ఇదేమిచిత్రమో ఇద్దరు ఒకేపని చెయ్యడంకోసం భూమి మీదకు రాలేదుగదా అనిపిస్తుంది. ఇద్దరేమిటి నల్గురు అదే స్థితి, ఆ విష్ణువే ఈ నలుగురుగా వచ్చి రాక్షసుల సంహరించి, ప్రజను కాపాడటానికి రాలేదుగదాయని సందేహిస్తున్నాను అనేస్తుంది కందుకూరివారి కైక. త్రికాలజ్ఞత, సంభాషణా చతురత ఈమెలో చోటుచేసుకున్నాయి. ఒకనాటి విచిత్రానుభవాన్ని గురుదేవునితో ఇలా ప్రస్తావిస్తుంది.

గుక్కపెట్టి ఏడుస్తూ బాలరాముడు కైక గృహానికి చేరుకొన్నాడు. ఎవరు లాలించినా లాభంలేకపోయింది. తుదకు పినతల్లి ఒడిలో ఒదిగి చిరునవ్వులు చిందించాడు. జోకొట్టి నిద్రబుచ్చింది కైకమ్మ. ఆనాటి రాత్రి ఒక అద్భుతం చూచింది. ఊయలలో నిద్రించే రామచంద్రుని చూస్తూ తాదాత్మ్యంలో మునిగింది కైకమ్మ. ఇంతలో—

"అందఱు నిద్రవోవు సమయంబున నెచ్చటనుండియో లసత్
సుందర సర్వలక్షణసుశోభి ముఖాంబుజమాకరందని
ష్యంద శుచిస్మితాంచితులు శాంతగంభీరులు సుందరాంగులౌ
కొందఱు వచ్చి రాఘవునకున్ బరిచర్యలు సేయుచుండగా" 2

చూచింది, మమ్మల్ని రక్షించమని వారు ప్రార్థించడం, రఘునేత వారి కభయమివ్వడం కన్పించింది. రాముడే హరి అనుకొంది.

కాని ఇంత తెలిసి మాయలో కూరుకుపోయింది. తల్లిప్రేమకు బంధించబడింది. "భరతుడు రాజుకావాలని ఆశపడ్డాను, రాజన్యులందరు పాదపీఠిని శిరసొగ్గి

1. కైకేయి–31–3 2. కైకెయి పు–38–17 ప.

ప్రణామాలు చేస్తుంటే—కైకేయి పుత్రుడు రాజ్యమేలాలనే కాంక్షతో మదంగా ప్రవర్తించానంటుంది వశిష్ఠునితో కైక.

నాథునిశాపాలే గుర్తుకొస్తున్నాయి. నీకొడుకు విన్నే "ఛీ" అని నిందిస్తాడు. భరతుడు రాముని కన్న ఉత్తముడు జ్యేష్ఠాధిపత్యాన్ని కాదనడు-".

"గతిచెడి మతిచెడి పదుగుర
నుతిచెడి వికృతఫలమును మును దలపనటులై
సుతున కెడసి సకలము చెడి
సతతము తపనమున మునిగి పడిపడుదు వికన్"1

అన్న మహారాజు పల్కులే చెవుల్లో మార్మోగుతున్నాయి- భరతుడు వచ్చి అదే విధంగా నిందించాడు. రాజ్యాన్ని అనాధను చేశావన్నాడు. నాకు నీముఖం చూపించ వద్దని ఛీత్కరించాడు.

"లక్ష్మీదేవియు సురలో
కక్ష్మాజము నైనసిత గానకవిపి యి
స్సీక్ష్మాదేవికి బరువై
తాక్ష్మాభృన్మణిని జంపి తందఱు దిట్టన్"2

అంటూ కొడుక్కూడా అరణ్యాలు పట్టిపోయాడు.

ఇంత జరిగినా రఘురాముడొక్కమాటనలేదు. పట్టు చీరలు వదలి నార చీరలతో అడవుల పట్టాడు. కౌశల్యా సుమిత్రలతో నా పాదాలకు కూడా ప్రణామం చేసి, వెళ్ళివస్తానన్న ఆ మహనీయుని ముఖమే ఎప్పుడూ గుర్తుకొస్తోంది. ఆయన వెళ్ళినదగ్గర నుండి ఏదో వేదన. ఏ పని చేస్తున్నా రామచంద్రుడే గుర్తుకొస్తున్నాడు. "స్థావర జంగమంబులవి సర్వము రామమయంబులౌచు నాభావము నందు విండినవి బ్రహ్మమునీంద్ర"3 అన్న తాదాత్మ్యం కైకమ్మది. "మోక్షంబన్నది గల్గునే గురువరా! మోహార్ణవో త్తీర్ణతన్" అంటూ సందేహిస్తుంది.

కరుణించాడు వశిష్ఠుడు. తత్త్వనిరూపణచేశాడు. రాముడంటే ఎవరనుకున్నావంటూ అతని యొక్క విశ్వవిభుత్వాన్ని స్థాపించాడు. ఎన్ని జన్మలెత్తినా విడిపోని మాయాబంధాలను క్రీగంటి చూపుతో విడగొట్టగల్గినవాడు రామవిభుడేనంటూ, తారక మంత్రాన్ని బోధించి జ్యోతీరూపాన్ని వివరించాడు.

---

1. కైకేయి-47-17 ప. 3. కైకేయి-ప. 68-10 ప.
2. కైకేయి పు. 55-27 ప.

"శుద్ధసత్త్వస్వరూపమె చూడజూడ
నీలరూపంబు జాయల నెగడు చుండు
లీల శ్రీరామురూపంబు నీలిమంబు
నీవు గనులార జూచియున్నావు గాదె" 1

అంటూ పరంజ్యోతి రూపాన నాత్మజ్యోతి లీనమగుమ ఏకత్వాన కన్పించేదే
ాత్మ అంటూ యోగాన్ని గూర్చి వివరిస్తాడు మహర్షి. మహర్షి చేత యోగవిద్యా
గాస్యాలవందించారు కవి కైకమ్మకు. కల్పవృక్ష నిర్మాత కవి సమ్రాట్ విశ్వనాథ
క యుద్ధమర్మజ్ఞి కాగా కందుకూరి వారి కైకమ్మ ఒక ఆకు ఎక్కువ చదివి
ాగశాస్త్రం పై శారద్యాన్ని సైతం సంపాదించుకొంది.

"రాముతో విరంతర ఏయోగమే నీకు
యోగిజనదురాపయోగ మయ్యె" 2

ంటారు మహర్షి. రాక్షస సంహారానికి రాముడు అడవులకెళ్లాడు రాముడు
పతలకిచ్చిన వరం అది. ఆనాటి రాత్రి నీకు కన్పించిన దివ్యరూపులువారే నంటూ
పరించి, మంధరా పూర్వజన్మవృత్తాన్ని ప్రస్తావించాడు వశిష్ఠుడు. ఆనంద రామా
ణ వృత్తమిది. మంథరా పాత్ర చిత్రణపద్ధ యీ గ్రంథంలోనే ఆ విషయాన్ని
ర్చించడం జరిగింది. విరోచనుని పుత్రికగా మంథర దేవేంద్రునితో యుద్ధం చేసి,
ంరణావసాన సమయంలో ఉపేంద్రునిపై కక్షయూని, ఈనాడు అరణ్యాలకు పంపిం
ని వివరించాడు మహర్షి.

ఇందు కొఱకై నీవు దుఃఖించవలసిన అవసరంలేదని ఇది ఎందువలన కల్గిందో
ం మంచినే చేస్తుందని, తారకమంత్రాన్ని ప్రబోధిస్తాడు మహర్షి. బదులక రామ
ంత్రముతో తపస్సిద్ధిని పొందమని ఆశీర్వదిస్తాడు.

"ప్రాణాయామము బట్టి యొక్క పరి మూలాధారచక్రాన ని
ద్రాణంబౌ ఘనశక్తి లేపుచు సహస్రారంబు దాకన్ హరా
చ్ఛ్రీతింగట్టినరీతి నొప్పుమ భవచ్ఛ్రీసాధనారీతి క
ళ్యాణమ్ముల్ గలిగించుచున్నయది కైకా! నీతపస్సిద్ధికిన్" 3

నీయంతటి పుణ్యవంతులు లేరని నీవలనన్ రామచంద్రుని కానందం కల్గు
ందని ప్రోత్సహించి, "నీదగు గూఢ సాధనము" వలన రాఘవేంద్రునకు

1. కైకేయి - పు. 77-7 ప.
2. కైకేయి - పు. 80-23 ప.
3. కైకేయి - పు. 101-2 ప.

దేవతల నానందపరచి వచ్చి పట్టాభిషేకం చేసుకోగలడని అంటుండగానే—విజయ ధ్వనులు విన్పించాయి. శ్రీరాముడు విచ్చేశాడు. కైకమ్మను చూడ్డానికే వస్తున్నా డంటూ ఆశీస్సులందించి రామదర్శనానికై వెళ్ళిపోయాడు బ్రహ్మర్షి.

కవి శ్రీ కందుకూరి శ్రీరామచంద్రమూర్తి కైకేయి లోని పశ్చాత్తాపాన్ని ప్రస్తావించి, తద్వారా ఆమెలో సంభవించిన మానసిక క్షోభను, యౌగిక పరిపక్వ తను విశ్లేషించి తదవకాశంలో యోగశాస్త్రాన్ని జ్యోతీరూపతను విన్నాణించారు. "విశోకావా జ్యోతిష్మతీ"1 అను పతంజలి యోగశాస్త్రాన్ని, "సుధాధారా సారైశ్చ రణ యుగలాంత ర్విగలితైః"2...."తటిల్లేఖాతన్వీం తపన శశి వైశ్వానర మయీం"3....వంటి ఆదిశంకరుల సౌందర్యలహరి శ్లోకాలు వెంటనే స్ఫురిస్తాయి ఇది కవి విద్వత్తుకి నికషోపలం. మంథరా పూర్వవృత్తాన్తం తారకమంత్ర ప్రభావం వశిష్ఠుని నోటి ద్వారా చెప్పించి వాని ఔన్నత్యాన్ని పెందారవిపిస్తుంది. మూడవది-భాగాలుగ విభజించబడిన కావ్యమిది.

కైకేయి లేనిది రామాయణంలేదు. విశ్వశ్రేయస్సు కోసం లోకనిందను భరించి, వైధవ్యాన్ని తలకెత్తుకొని, స్వయంత ప్తయై లోకానికి వెలుగిచ్చిన పాత్ర కైకేయి. వాల్మీకి, తులసీదాసుల కైకేయి గయ్యాళి, క్రూరచిత్త, చిరవంచిత, పుత్ర తిరస్కృతగ కన్పిస్తోంది. కానీ మహాకవి మైథిలీశరణ్

"యుగ యుగతన్ చలతారహే కరోర్ కహానీ

రఘుకుల్ మే భీ థీ ఏక్ అభాగీరాణీ"

అంటూ అభాగ్యురాలైన కైకను పల్కరించి మాతృమూర్తిగా ఆమెకు మానవీయ తను కల్పించారు. కందుకూరివారు పశ్చాత్తప్త హృదయగాను, తారకమంత్ర జప పరాయణగాను చిరతపస్వినిగను యోగశాస్త్ర విశారదగను, తీర్చిదిద్ది గౌరవాన్ని ఇనుమడింపచేశారు.

తెలుగుపదాలతేటదనాన్ని, సరససంస్కృత సమాన సంఘటనను, కథ నిర్వహణను శిల్పరమ్యంగా నిర్వహించిన ఉత్తమకవియై ఆంధ్రమైథిలీ శరణ్ గనుతికెక్కారు శ్రీ కందుకూరి.

1. పాతంజలి యోగశాస్త్రం – 1 యో - 35 సూ.
2. సౌందర్యలహరి - 10 శ్లో.
3. సౌందర్యలహరి - 21 శ్లో.
4. సాకేత్ - పు.

## కోగంటి వారి కైక

మామగారింటి నుండి భరతుడు రావడంతో శ్రీ "కోగంటి" వారి "కైక" ప్రారంభమౌతోంది. వచ్చిన కొడుక్కు సర్వవృత్తాంతాన్ని విన్పించింది కైక. పూర్తి రామాయణానుసారంగా కొనసాగుతోంది ఆచార్యులవారి రచన. తల్లిని నిందించి, పౌరుల నంగీకరింపజేసి, చిత్రకూటానికి బయలుదేరాడు భరతుడు. శృంగిబేర పురంలో గుహుడు తారసిల్లాడు. సంశయాలు తీరాయి. మనసులు కలసి మాట్లాడుకున్నారు గుహ భరతులు.

"అదియె కనుగొనుమయ్య పర్ణాస్తరణము
జానకీ భూషణా నమ్రి సమతలంబు
రామబాహూపధాన విరాజితంబు
లక్ష్మణాస్మాక శిల్పవిలక్షణంబు"1

"కన్నులు నీర్గాల్వలై పాఱ" అనాటినుండి జటావల్కలధారణుడైనాడు భరతుడు. భరద్వాజ దర్శనం చేసుకొన్నాడు. "జననిని నిందసేయకుము సజ్జనవందిత యామె" అంటూ మహర్షి—

"జననిని నిందసేయకుము సజ్జనవందిత యామె కోర్కెచే
మునులకు భావితాత్ములకు బూర్వసురామరకోటికిం బ్రియం
బనుపమ సౌఖ్యముంగలుగు నన్నకు నీకుజగంబులన్ యశో
జనిత సమస్త సత్కృతి వచః పరమాయతి యాయతంబగున్"2

అంటూ భవిష్యత్తును సూచిస్తాడు.

సుమంత్ర గుహులు వెంటరాగా రామచంద్రుని దర్శనం చేసుకొన్నాడు. తమ్ముని ఆదరించి అక్కున చేర్చుకొన్నాడు. కాని అతని కోర్కెను తిరస్కరించాడు. "కొమ్ము రాజ్యభరము, రమ్ము గేహమునకున్" అంటూ ప్రార్థించిన తమ్ముని ఊరడించి పాదుకల నందించాడు. నందిగ్రామ నివాసిగా, రాజ్యపాలన ప్రారంభించాడు భరతుడు.

### తల్లి

సరయూనదిలో స్నానమాచరించి గాయత్రిని జపించి, పులినతలంపై ఆసీనుడైన భరతునకు-"అమృతవాణి" విన్పించింది. ఎన్నో రహస్యాల ప్రపంచించబడ్డాయి. కైక మనోభావాలు-"వాణి" గొంతుకలో ప్రతిధ్వనించాయి. భరతుణ్ణి రాజును చేయమనడం కేవలం వ్యాజ మాత్రమే. రాముణ్ణి దండకకు పంపి రాక్షస సంహారం చేయించడమే కైకమ్మ ప్రధానాశ్రయం.

---

1. కైక – 23 – 19 వ.
2. కైక – 28 – 37 వ.

"రాముని గాంచినంత మదిరంజిలు, జేపులువచ్చు సారె, పాల్
రాముని కిచ్చెదం, భరతురాకకు రోసెద, గ్రుక్క వేయగా
మోమును గాంచి ముద్దుగొని మోక్షసుఖంబున కీడువచ్చు మో
దామృత వార్ధి వీచికలయందున మున్గెద బ్రాణమై తగన్"1

అంటుంది కైకమ్మ. రామకథ ప్రచలితిమైంది. తాటకా తాటకేయుల సంహారం గౌత మహల్యల వృత్తాంతం, శివధనుష్కండనం, పరశురామ గర్వభంగం వరుసగా ప్రచలితమైనాయి. సభను ఏర్పాటు చేశాడు దశరథుడు.

"నాదు జన్మ క్షణమున దిననాయకుండు
కుజుడు రాహువు ముగురు కూడినారు
మరణమో తత్సగోత్రమో మార్పొయోమొ
కలుగు దేశమునకు జేటు కలుగునిపుడు"2

అంటూ భయాన్ని ప్రకటించాడు. రఘువీరునకు పట్టాభిషేకాన్ని ప్రకటించాడు. భరతశత్రుఘ్నులు కాని, అపులైన కైకేయ, వైదేహులను కాని పిలిపించే సమయం లేదన్నాడు. సభంతా మెచ్చుకొంది. తమ్ములందర్నీ సమానంగా చూసుకొనే రాముడు కూడ తమ్ముల పిలిపించమని అనలేదు. తనకు నమస్కరించిన రాముణ్ణి చూచి కౌసల్య సైతం ఆశ్వీర్వదిస్తూ-తనవారిని సుమిత్రబంధువుల్ని కాపాడుతూ రాజ్యం చేయమన్నదే కాని కైకభరతుల ప్రస్తావన తీసుకురాలేదు. ఇది వాల్మీకం.

"వత్సరామ చిరంజీవ హతాస్తే పరిపన్థినః
జ్ఞాతీ స్మే త్వం శ్రియా యుక్త సుమిత్రాయాశ్చనన్దయః3

అన్న శ్లోకం మూలం. రాముడు కూడ లక్ష్మణుని చూసి "తమ్ముడా! యేలుకోక రాజ్యమ్మనీదె"-అంటాడు. "లక్ష్మణేమాం మయాసార్థం ప్రశాధిత్వం వసున్ధరామ్"4 -అన్నది వాల్మీకం. ఇక్కడ భరతుని ప్రస్తావన తీసుకురాలేదు. పట్టాభిషేక కోలాహలం మిన్నుముడుతోంది. పల్లెలు పట్టణాలు అలంకరించబడ్డాయి. ఇసుక వేస్తే రాం నంత జనం-కానీ-

తనయింటికి రోజుకెన్నోసార్లొస్తూ "అమ్మా" అంటూ భక్ష్యాలు తింటూ మారం చేసే రాముడు నాల్గురోజులుగా రావడంలేదు. నాలుగురోజులు నాలుగు కల్పాలుగా గడిచాయి కైకమ్మకు. కన్ను మూసినా తెరచినా భుజగశయనుడే సాక్షాన్నేత్రుడై కన్పిస్తున్నాడు.

---

1. కై-60-14 ప.
2. కైక-69-50 ప.
3. వాల్మీకం—అయోధ్య—4—39 శ్లో.
4. వాల్మీకం-అయోధ్య-4-43 శ్లో.

జనస్థానంలోని మునులు ఈ మహనీయుని చెంత కన్పిస్తున్నారు. అర్థ్రమైంది కైకమ్మ మనసు వారిని కాపాడడానికై రాముని అడవులకు పంపాలి, మార్గం తెలి యడం లేదు. అంటూ సలహా అడిగింది దాసి మంథరను - ఈ కల్పన రమ్యంగా అతికింది. మంథర పాత్ర సైతం ఉచితరీతిలో పోషించబడింది. శంబరాసుర వృత్తాన్ని, శ్రావణ వృత్తాన్ని ప్రస్తావించింది. అడవులకు రాముని పంపమంది. గుండెపగిలిపోయి, ఘోరునవిలపించింది కైకేయి.

తనతండ్రి కేకయరాజు కోరికను, శబ్దవేధిని ఇద్దరు పట్టమహిషులుండగా మూడవ భార్యకై దశరథుని ఆరాటం. అన్ని తన కొఱకే వచ్చాయనిపించింది. పెళ్ళయినా మిగిలిన ఇద్దరికి కొడుకులు పుట్టి తనకు కూతురు పుట్టగూడదా - కొడుకు పుట్టినా పురిటిలో పోగూడదా? అంతగానైనా ఆ రాముడే తన కడుపున పుట్ట గూడదా అని కూడ కైక విలపిస్తుంది.

చివరకు అనుమానం వచ్చింది. కొడుకును రాజు చేద్దామనే దశరథుడు-వాని జాతకాలు చూడలేకపోయాడా? లేక తెలియదా?

"కొడుకును రాజుసేతునను కోరిక మాత్రము చూచు తేడు దా
గొడుకుల జాతకాలు గనగూడదొ నైజజనిం బవిత్రమౌ
నుదుపున రాహుసూర్యకుజులుంట యెఱింగిన వాడెఱుంగడా?
కొడుకున కేడ్పియేడ్పి నదిక్రుంకిన చీకు మునళ్ళ కూకలన్"1

కుళ్ళికుళ్ళి ఏడ్చిచావకపోతే ముందు జాగ్రత్త పడవచ్చుగదా! నా తండ్రి - భరతుని పుత్రపౌత్రాదులకు సార్వభౌమత్వాన్ని వాంఛిస్తే - నేను పధ్నాలుగు సంవత్సరాలే కోరాను" అయినా ఆలుమగలిద్దరికి అరణ్యవాసం వ్రాసి ఉంచే ఆపడం ఎవరికి సాధ్యం? అంటూనే సీతారాముల వనవాస నిర్ణయంలో మునులకు రాముడిచ్చిన వరాల్ని - భైక్షిణీ వృత్తాన్ని గుర్తుచేస్తుంది.

ఇవన్నీ వాల్మీకి స్పృశించని భావాలు. కైకమ్మను క్రొత్తకోణంలో దర్శింప జేసి, నిర్దోషిగ కైకను నిరూపిస్తారు ఆచార్యులవారు.

రాముడు తిరిగి వచ్చేవరకు సామకౌరాజ్యం కొనసాగుతుందంటూ ముగిస్తుంది అమృతవాణి ఈ మాటలన్నీ విన్న భరతునికి దేశమే క్రొత్తగా కన్పించింది.

---

1. కైక – 79 - 92 ప.

విధులు పూర్తి చేసుకొని శత్రుఘ్నుడు వెంటరాగా పాదుకల చెంతకు చేరాడు. పాదుకల నలంకరిస్తూ కైకేయి, ఆమెకు పూలందిస్తూ సహాయం చేస్తున్న మంధరను చూసి ఆశ్చర్యపోయాడు.

"తల్లి విసంబు పోసెనని తల్లడమందితి, గోపమందితిం
గల్లరియై సపత్ని సుతు గానలకంపెనటంచు గుందితిన్
బెల్లుగ దల్లడిల్లితిని, విక్కమెఱింగితి నిప్పుడింక "మా
తల్లిని బోలు తల్లి కలదా భువనంబున నేరికేనియున్"1

అంటూ ఆనంద కెరింతల మున్కలేశాడు భరతుడు. మాతల్లిని బోలుతల్లి గలదా? యన్న ఆత్మతృప్తి కల్గిన మాతృభక్తి పరాయణుడు ఆచార్యులవారి కావ్యంలో భరతుడు. ఇది అనిదంపూర్వ కల్పన.

రాజుని మునిశాపమనే "రాజయక్ష్మ" కమ్ముకొని పుత్రులకు దూరం చేస్తుంటే తల్లి విషాన్ని మ్రింగి కొడుకుల్ని కాపాడుకుంది. వారికి కీర్తి ప్రతిష్ఠల నందించి తానప్రదిష్టపాలైంది. అందుకే చేతులు జోడించాడు భరతుడు మాతృమూర్తి ఔన్నత్యాన్ని గుర్తించి -

"పికపఖ్యాతి, దాస్యమ్ము నాకు, సీత
కమల చరితంబు, వధ దశాస్యాదుల కవి
మంగళము చాటి, గోయిలమయిని దాల్చి
యూబ్జి రామాయనమ్ము రామాయణమ్ము"2

అన్న భరతుని కైమోడ్పుతో కావ్యం ముగుస్తుంది.

"రాముని జాతకమునకు శుభయోగముల వలె కొన్ని యుపయోగములుండెననియు, ననియె యాతని సింహాసనము నధిష్ఠింప వెడలిన వానిని– ఆయలంకారము లతోనే యరణ్యమున కంపియుండుననను" తలంపుతో కవి ఈ కావ్యానికి శ్రీకారం చుట్టారు.

---

1. కైక – 86 – 2 ప. 2. కైక – 87 – 4 ప.

ఈ కైక కావ్యం 'కొడుకు–తల్లి' రెండు భాగాలుగా విభజించబడి, రెండు కోణాలనుంచి తల్లీకొడుకుల్ని అనుశీలించడానికి అవకాశం తీసుకొంది. మొదటి భాగంలో భరతుని చిత్రించిన పాదుకాప్రభావాన్ని ప్రశంసిస్తున్న ఆచార్యులువారు – పాదుకా ప్రభావ ప్రకటనంలో - గురుదేవులు రామానుజుల మార్గానుయాయులై భరతాయ నమోనమోస్తు" అనే రామానుజుల శ్లోకాన్ని ఉటంకించటంలోనే ఆయన పైనున్న భక్తిని ప్రకటించుకొన్నారు. ఆచార్యులవారికున్న పాదుకా ప్రతిపత్తికిది యుదాహరణ. రామాయణ మనగా "అందమైన ప్రయాణం" అని సింహాసనం ఎక్కడానికి బయలుదేరినవాడు అడవులకు వెళ్ళడమే అందమైన యానమని కవి విశ్లేషణ.

మునికుమారుని వృత్తాన్ని శ్రావణ వృత్తంగా పలుమార్లు ప్రస్తావిస్తారు ఆచార్యులవారు. వాల్మీకి ముని బాలకుని పేరును చెప్పలేదు. ఈ విషయం శ్రావణ చరిత్ర ప్రస్తావనలో అనంతర గ్రంథమందు ప్రస్తావించబడింది. - చిత్రకూటం చేరిన భరతుణ్ణి మొదట చూసింది వాల్మీకంలో లక్ష్మణుడు కాగా, వీరి కావ్యంలో రాముడౌతాడు. వీరికావ్యంలో అసలు లక్ష్మణుడే లేడు.

"వీరిశైలి లలితమధుర శబ్దప్రయోగాంచితమై ధారాళమై - పాండితీస్ఫోరకమయ్యు బరమ సుకుమారమై యలరారుచున్నది. సరయూతీరము "తల్లి" అను ఖండమునందలి సీసములంత్యప్రాసములతో గూడి పూర్వకవుల సీసములతో పోటీ చేయుచున్నవి"1 అన్న ఆచార్య దివాకర్లవారి అభిప్రాయం పండితామోదమైనది.

1. దివాకర్ల – IX

## కందిబండవారి కైక

కందిబండవారి 'కైక' రామప్రార్థితమై రామునిమీద మమకారంతో తాను అపయశః కళంకకాళిమనంటించుకొని, రామచంద్రుని జగదేకవీరునిజేయ సంకల్పించింది.

## స్వప్నము

పట్టాభిషేకం రెండురోజులుండనగా, ఉపవసించి సీతాసమేతుడై రామభద్రుడు దర్భశయ్యపై శయనించియున్నాడు. గాఢనిద్రలోనున్న రఘురామునికి— స్వప్నంలో కౌశికుడు ప్రత్యక్షమయ్యాడు. "రామా! రాజ్యం చేయడానికా నీవు పుట్టిందని నిలేశాడు. రాక్షససంహారాన్ని గుర్తుచేశాడు యాగసంరక్షణకై తీసుకెళ్ళి అస్త్రాలనిచ్చింది, బలాతిబలవిద్యల్ని ప్రసాదించింది ఎందుకొఱకనుకున్నావు? వైకుంఠంలోనుండగా మునిగణాలకు నీవిచ్చిన వాగ్దానమేంచేశావు?" అంటూ ప్రశ్నించాడు

"మాయామానుషరూపధారివగుటం మామాటబోనాడి నీ
వయోధ్యాపురినేలసిద్ధమయితౌరా! నీదు యజ్ఞానముం
బాయంజేయగనుత్సహించి యిటుస్వప్నంబందు గాన్పించితిన్
చేయంబూనగలెమ్ము రాక్షసవధల్ శిష్టుల్ ప్రమోదింపగన్" 1

అన్నాడు విశ్వామిత్రుడు. శిష్యునిగూర్చి గురువి మందలింపు అది. "అజ్ఞానముం బాయం జేయగ" గురువులు విచ్చేశారు. మరచింది గుర్తుకొచ్చింది రామునికి. గురువునకు నమస్కరించి ఆజ్ఞనుతలతో జేస్తానన్నాడు. దీవెనలిచ్చి వెనుతిరిగాడు మునీశ్వరుడు.

ఈ స్వప్నవృత్తాంతం ఆ వాల్మీకం, అధ్యాత్మ రామాయణంలో నారదుడొచ్చి శ్రీరాముని హెచ్చరించడం కన్పిస్తుంది.

"రావణస్య వధార్థాయ జాతోఽసి రఘుసత్తమ
ఇదానీం రాజ్యరక్షార్థం పితా త్వామభిషేక్ష్యతి
యది రాజ్యాభి సంసక్తో రావణం న హనిష్యసి
ప్రతిజ్ఞాతే కృతారామ భూ భారహరణాయవై" 2

అంటాడు రామునితో నారదుడు. ఈ భాగం కవికి ఆధారమైంది. విశ్వామిత్రుడు కలలో కనిపించాడు.

తెల్లవారింది. కలనుగూర్చి ఎవరికీ చెప్పక, ఆలోచనలో మ్రగ్గిపోతున్నాడు శ్రీరాముడు. విషయ నిర్ణయం చేయలేకపోయాడు. ఎటూ నిర్ణయించుకోలేక తెగని

1. కైక - 11 ప   2. అధ్యాత్మ-అయోధ్య—1-30

యోచనలతో ఏకాంతాన్ని కోరి ఉద్యానవనంలోని పూపొదరింటిలోనికి వెళ్ళాడు కందిబండవారి రాముడు.

## సంకల్పము

"ఏటికి బుట్టినాడనిట యేనుముదంబున రాజ్యమేలనా" అనే సందేహమొచ్చింది. రాజ్యభారాన్ని స్వీకరిస్తే రాక్షససంహారం ఎలాగు? వాళ్ళు ఒక్కచోట ఉండరు. వారిని సంహరించాలంటే ఏండ్లు పూండ్లు పడుతుంది. రాజ్యం వద్దంటే రాజు వినడు. ఖరదూషణాదులు దండకలో ఉన్నారు. రావణుడు లంకలో ఉన్నాడు. పోవాలంటే తండ్రి యొప్పుకోడు.

"తనయులు మీరరాదు తలిదండ్రుల యానతి నెన్నడేని యుం
వినయముతో నొవర్పవలె వింతగుకోర్కెలు కోరినన్ భువిన్"

అని ధరనే యుదాహరణ కర్తుడనౌ గతి సంచరింప...."1

అనుకుంటాడు రాముడు. 'పితృవాక్పాలన' కోసమే తాను పుట్టినట్లు ఆ విధంగా తాను కీర్తి పొందకోరుతున్నట్లు మాటిమాటికి రాముడనుకోవడం ఈ కావ్యంలో కన్పిస్తుంది. ఇది శ్రీరాముని పాత్రౌచితికి తగినట్లు లేదు. ఏకాంతంగా కూర్చొనడం-ఆలోచించుకోవడం అంత ఉదాత్తంగా అనిపించవు.

"కైక సామాన్యస్త్రీగాదు కాదు నిజము
సర్వవిద్యలు నేర్చిన చతురురాలు
అవులించిన ప్రేవుల నాకళించు
ఉచితమూహించిచెప్పెడియూహగలది"2

కాబట్టి 'కైకమ్మ'ను ఆశ్రయిస్తే తనకు సరైన ఆలోచన నందిస్తుందని భావించాడు రాముడు. మన్ననపొందిన సౌందర్యము, యుద్ధవిద్యా నైపుణ్యము కలిగియుండుట వలన భర్త హృదయాన్ని స్వాధీనపర్చుకోగలిగింది. ఆమె చెపితేనే రాజువింటాడు అన్న నమ్మకం రామునిది.

శంబరాసుర వృత్తాంతాన్ని గుర్తుచేసుకొని, తండ్రికి తల్లి చేసిన సహాయాన్ని స్మరించి, రూపుదాల్చిన దేవతగ కైకమ్మను భావించాడు రామచంద్రుడు. ఆమె అనురాగం సైతం గుర్తుకొచ్చింది. భరతునికన్న మిన్నగా తన్ను చూసిన తల్లి కైక. ఆమె మాత్రమే తన కోర్కె తీర్చగలిగేదన్న సంకల్పం – లోకహితం కోసం సిద్ధమైన సాధ్వీమణి – ప్రొద్దుపోయిన తరువాత వెళ్ళి ఆమెను కలుసుకోవాలనే నిర్ణయానికొచ్చి పొదరింటినుండి వెలుపలికొచ్చాడు రామచంద్రుడు.

---

1. కైక - 30 ప. 2. కైక - 34 ప.

## సమాలోచన

కైకేయీ భవనానికి చేరుకొన్నాడు రామచంద్రుడు. నీకోసమే చూస్తున్నా నంటూ ప్రేమగా ఆహ్వానించింది. పట్టాభిషేకం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయా అంటూ ఆదరంగా ప్రశ్నించింది. ఇకనీవు రాజువైతే, ఈ 'అమ్మ'ను చూడ్డానికి తీరుబడి ఉంటుందో ఉండదోనని గుర్తుపెట్టుకోమని ప్రార్థించింది.

రాముడు తన ఆలోచనల విప్పించాడు. నీ సహాయం కోసం వచ్చానన్నాడు. నాచే నీకేమి సహాయం కావాలో చెప్పమంది. స్వార్థం కంటే పరార్థసేవకే ఎక్కువ ప్రాముఖ్యమివ్వాలి. లోకహితం కోరి నీవు చేసే పని యేదైనా నేను సహాయం చేస్తానని మాట ఇస్తున్నాను తండ్రి తనపైనున్న ప్రేమతో నన్ను పసివానిగ భావిస్తున్నాడు. అడవికి వెళ్ళి రాక్షస సంహారం చేయడానికి అవకాశం కలగాలి. తండ్రిని నీవే ఒప్పించగలవని, తన్ను పితృవాక్పాలకునిగా చేయగలవని బరువును కైకమ్మపై పెట్టాడు. ఆ తల్లికి కళ్ళలో నీళ్ళునిండాయి. "సవతి కుమారుని అడవికి తోలిందనే అపవాదు నాకెందుకు వేస్తావయ్యా —నేను చెప్పినా నీ తండ్రి వింటాడా— అంటూ చింతిస్తున్న పిన్నతల్లిని — తండ్రి యిచ్చిన వరాల్ని గుర్తుచేసి తాను రాక్షస సంహారం చేయాలని, పితృవాక్పాలకుడనై కీర్తి గడించాలని అందుకు ఆ వరాల్ని సాధనంగా వాడుకొంటానని కైకమ్మను ఒప్పించయత్నించాడు. కాని కైకమ్మ ఒప్పుకోలేదు-

"లోకులెల్లరుగూడి లోలోనన్ను
రాకాసిరా పెద్దరాక్షసి యనుచు
మర్మవాక్యంబులు మనమెరియుమాడ్కి
దుర్మార్గురాలంచు దూషింత్రుగాదె"1

.....................

భరతుడీస్థితివిన్న బ్రతుకనివ్వడుగ
కరకరకంఠంబు కత్తినిగోయు
నీమాట చొప్పున నేజేసితేని
భూమిలో నాకింక పుట్టుగతులున్నె?"2

అంటూ భయపడింది. కాని రాముడు విడిచిపెట్టలేదు. తాను చేసే ఘనకార్యాలక ఆ మాత్రం కష్టం నీవు అనుభవించలేవా అన్నాడు రాముడు. లోకకళ్యాణం కోస చేసే పనుల్లో ఎవరేమనుకుంటే మనదేం పోయింది.

---

1. 2. కైక - 99 ప.

"ఆత్మ క్షేమాత్రమును, నవి యంటబోవు
తప్పుజేసిన భయపడ దగుమగాని
ఒప్పుజేసినదానికి తప్పటనుచు
పలుకు మూర్ఖుల పలుకుల కులుకనేల?"1

లోక కళ్యాణం కోసం త్యాగం చేయమన్నాడు రామచంద్రుడు. అనురాగంతో అంగీకరించక తప్పలేదు కైకమ్మకు. తానుకరిగిపోయి లోకానికి వెలుగు విస్తానంది.

"బలియైపోయెదనయ్య శాశ్వతముగా బ్రహ్మాది గొరీకులే
పలుకాడన్వెరగందు, దేరిగవి, నాపద్మాక్షుడేవచ్చి నన్
నలుపన్జెప్పిన కార్యమున్నలిపి, విశ్వంబందు రాకాసి, నో
పలుగాకో, యనుపేరుమోసిధరలో పాపిష్టినై రాఘవా!"2

అమ్మ అంగీకారాన్ని పొంది ఆనందంతో బయలుదేరాడు రాఘవుడు. అపవాదుల భారాన్ని మోయడానికి సిద్ధపడింది కైకమ్మ. గుమ్మం వరకు పంపి, సింహద్వారానికి చేతులాన్చి నిలబడిపోయింది రాముని దిక్కు చూస్తూ-ఆలోచనల్లోకి పోయింది కైక.

స్వామికార్యంలో తనవంతు కర్తవ్యాన్ని నెరవేర్చుకొన్న తృప్తిని పొందింది కైకమ్మ.

"గాంధీజీ జీవించియున్న రోజులలోనే ఈ కావ్యం అందించి యుంటే రామయ్య దైవత్వమునే శంకించే నేటి భౌతికవాదులకీ కథ ఉపయోగపడేది. భారత మాస్థాయినుండి దిగజారింది. నేటికీ సత్యముపై మొగ్గుచూపే హృదయాలకిది కొత్త రూపంలో హత్తుకొంటుంది. ఇదే కవి చెప్పిన కథా రహస్యం"3 ఊటుకూరు వారి మాటల్లో.

కథలో ఏదో క్రొత్తదనాన్ని చూపించాలనే ఆరాటంతో కవి, ప్రథమ, ద్వితీయభాగాల్లో రాముని పాత్రను సామాన్య కథానాయకుని స్థాయికి దింపినట్లు కన్పించినా— 'సమాలోచన'లో మాత్రం రామకైకలను సముదాత్త రీతిలో చిత్రించి, కావ్యానికి అందాల్ని చేకూర్చి 'కైకమ్మ'ను ఉదాత్తంగా రూపొందించారు.

1. కైక - 102 ప.
2. కైక - 108 ప.
3. కథారహస్యం –V పు.

## సీతమాంబ గారి కైక విజ్ఞప్తి

రామునడవికి పంపిన పాపం తనది కాదని, దశరధునకు మునిశాపముండగా అది మర్చిపోయి అందరూ నన్ను నిందిస్తారేమని కైక దుఃఖపిల్లుతుంది.

"భానునిచే మహా తమము బాయు తెఱంగున బాయునట్లుగన్
దీనికి మూలమైన కధ దెల్లముగ జేయదలంచి నా బహిః
ప్రాణము రామ భూవిభుని పైగల ప్రేమ నెఱుంగజేయగా
నేనిటు విన్నవించెదను యీ చిరువిన్నపమాలకించరే" 1

అంటూ— మునిబాలకుని వృత్తాంతాన్ని ప్రస్తావించి, పుత్రశోకమున మరణింతువన్న "మునిశాపాన్ని" ముందుగా దశరధుడు కూరిమి భార్యయైన తనకే చెప్పాడంటుంది వీరి కైక. అట్టి శాపాన్నుండి వంశాన్ని కాపాడ్డానికి యోచించి —

"పుత్రులు మృతినొందిన తర్వాతను పతి విగత జీవుడగుటకు బదులే
నాతని వంశస్థాపన కాతని వరమడిగి కొంటి నంతియ కాదేన్" 2

రామునడవికి పంపి, తద్వారా పుత్రశోకాన్ని దశరధునికి కల్గించి "మునివరుని" శాపాన్ని "తార్మారు" చేసి వంశాన్ని కాపాడానని, లేకపోతే పుత్రులు మరణించి అనంతరం ఆ శోకంతో భర్త మరణించి, భర్తపుత్రులు లేని వైధవ్య అనాధ స్థితిలో తాము రాణివంతా మరణించవలసిన విషాద స్థితి ప్రాప్తించేదని, దాన్నుంచి వంశాన్ని కాపాడానని, దీనిలో తప్పుంటే నిందించమని పండితులకు విజ్ఞప్తి చేసుకొంటుంది సీతమాంబగారి కైక.

"పుత్రశోక మరణాన్ని "కూరిమిభార్య"గా మహారాజు కైకకే ముందుగా చెప్పడం— అందుకై తనకు తానే "రామవనవాస కల్పన" జేసి వంశాన్ని కాపాడానని కైక పల్కడం సముచితంగా ఉంది. నిజంగా అద్భుత కల్పన. కైక ఇన వంశాన్ని కాపాడింది.

"ఇనకులస్థానం బినశశి తారకా గణమునిల్చిన దాక గణనమీర
నొనరిచితిని గదే! మీరలుర్వియందు నింక
నను దిట్టకెంతేని పంకజాక్షు
లందు నుత్తమురాలిగా, నరయుచుండ
మనవి చేయుచునుంటినో మనుజులారా!" 3

అన్న తుది ప్రార్థన ఈ కైకమ్మది.

---

1. కైక విజ్ఞప్తి—2 ప.
గృహలక్ష్మి-1932 సెప్టెంబరు-పు. 596.
2. కైక విజ్ఞప్తి—12 ప,
3. కైక విజ్ఞప్తి—14 ప.

## కైకేయీ సౌందర్యము

వాల్మీకి కైకేయిని ఆధునికులు వేరువేరు రీతులుగ అధ్యయనం చేసి నూత్న సౌందర్యాన్ని ఆవిష్కరింపయత్నించినా అందరి భావాల్లో ప్రధానాశయం ఆమెపై నున్న కళంకాన్ని తుడిచి వెయ్యడమేనని స్పష్టంగా చెప్పవచ్చు.

కవిశేఖర శ్రీ పల్లె పూర్ణ ప్రజ్ఞాచార్యులవారు "కైకేయీ సౌశీల్యములో" పద్యాత్మక వ్యాసంగా కొనసాగిన కావ్యమై కైకేయిని సుశీలగా ప్రకటించడానికి వల సిన ఉపపత్తులను ముందుగా ఏర్చికూర్చుకొని, వారి విశ్లేషణద్వారా పూర్వకవుల ఉటంకింపులతో తన వాదనను సమర్థించుకొన్నారు.

శ్రీ చిటిప్రోలు కృష్ణమూర్తి గారి కావ్యం పూర్తిగా "ఆత్మనివేదన"గ కైకమ్మ తనను నిర్దోషిగ చెప్పుకుంటూ, "రామకథను" గానం చేసి మంథరపై పాపాన్ని నెట్టి మాతృమూర్తిగా, నిష్కల్మష హృదయగా నిలబెట్ట యత్నించారు.

శ్రీ కందిబండ రాఘవరావుగారి "కైకమ్మ" రామప్రార్థితయై అపనిందను తాను భరించి రాముని అడవులకంపుతుంది.

కందుకూరి వారి "కైక" యోగశాస్త్ర ప్రవీణయై వశిష్టమహర్షి చేత తారక మంత్రోపదేశాన్ని పొంది తన తపస్సిద్ధివల్ల శ్రీరామునికి విజయప్రాప్తిని గల్గించి పశ్చాత్తప్త హృదయయై రామపట్టాభిషేకాన్ని స్వహస్తాలతో నిర్వహిస్తుంది.

కోగంటి కృష్ణమాచార్యులవారి కైక పాదుకా ప్రభావాన్ని ప్రాశస్త్యాన్ని బహూధా ఎరిగినదై వాని పూజ చేస్తూ మంధరతో కూడ నందిగ్రామంలోనే నివ సిస్తూ రామునిరాకకై ఎదురుచూస్తోంది.

శ్రీమతి బేతా సీతమాంబగారి "కైక" దశరథుని "కూరిమిభార్య" ముని శాపాన్ని ముందుగానే గ్రహించి "పుత్రశోకమరణాన్ని" రామవియోగమరణంగా మార్చగల్గిన నేర్పరి. సూర్యవంశాన్ని కాపాడిన ధీశాలిని.

"నదీనాం సాగరోగతిః" యన్నట్లు ఎవరెన్ని రీతులుగా వ్రాయ యత్నించి ననూ కైకను నిర్దోషిగా ప్రదర్శించడమే లక్ష్యంగా కావ్య రచన కొనసాగింది. యుద్ధ విశారదగా, యోగశాస్త్ర మర్మజ్ఞగా, పవిత్రమాతృమూర్తిగా పలురూపాల్లో ఈమెను దర్శింపజేసి, వాల్మీకి పాత్ర చిత్రణాన్ని యథాశక్తి సంస్కరించటానికి సముద్యోగులైనారు ఆధునిక కవులు.

## శూర్పణఖ

శ్రీరాముని ఆయనంలో ప్రధాన శక్తులుగ వెలిగి, నిర్దిష్ట మార్గంపైపు శ్రీరాముని నడిపించి, రామావతార పరమావధిని సాధింపజేసిన ఖ్యాతినార్జించుకొన్న రామాయణ పాత్రలు మూడు. వారిలో ప్రధాన పాత్ర కైకేయి కాగా, ఆవిడకు ప్రేరణ కల్గించిన మంథర ద్వితీయ.

మంథర ప్రేరణ మూలంగా కైకేయి రామ పట్టాభిషేకాన్ని విఘ్నమొనర్చి, శ్రీరాముని అరణ్యవాసానికి ప్రయాణింపజేసి, తన వంతు కర్తవ్యాన్ని పూర్తిచేసుకొంది. కాగా వనంలో పర్ణశాల నిర్మించుకొని, సంవత్సరాలు లెక్కిస్తూ తాపస వృత్తిలో జీవిస్తున్న రాముని కవ్వించి, రాక్షస సంహారానికి కారణభూతురాలై రామావతార పరమావధిని జ్ఞప్తికెలయించిన స్మరణీయ పాత్ర శూర్పణఖ తృతీయ.

విగతనాసికయై, ఖరదూషణాదుల సంహారానికి కారణయై, అనంతరం లంకకు చేరి ఈ నిప్పును అక్కడ కూడా అంటించి, రావణునిలో సీతావ్యామోహాన్ని ప్రేరేపించి, రావణుని పంచవటికి రావించి, సీతాపహరణాన్ని కావింపచేసి, తుదకు "పౌలస్త్యవధ"కు సైతం కారణభూతయై నిలుస్తుంది "శూర్పణఖ".

దండకారణ్యంలో "నరవాసన" తగిలి "పరుగెత్తుకొచ్చిన ఈమె రామదర్శనంతో ఆకలిని మర్చిపోయి, కామవికారయై ఆ మోహనరూపుని మోహంలో చిక్కుకొని పరిణయాన్ని ఆశిస్తుంది. ఆలోచిస్తే అసలు "రామకథ"కు గొప్ప మలుపు, ప్రధాన ప్రేరణ "శూర్పణఖ"

శూర్పణఖ కావ్య సృష్టికర్త శ్రీ కాశీభొట్ల సత్యనారాయణ.

శ్రీరాముని పరిమళం దండకారణ్యంలోని చరాచరాలను సువాసితం చేసింది. ఆ "చిత్సదార్ద్ర సద్వాసన" కేవల నరవాసనగా ఆఘ్రాణించి పరుగెత్తుకొచ్చింది శూర్పణఖ.

ఏ పొంతను నున్నవాడొ యని పొట్టను చేవిడి బొబ్బపెట్టుచున్
సంతసమంది గంతులిడ సాగెను రక్కసియైన నేమి జ
న్మాంతర వాసనా ఫలిత మబ్బక సోకునె రామవాసనల్"1

"రామవాసన" జన్మాంతర వాసనా ఫలితమని కవిభావన. దండకారణ్య నివాసులైన మునీశ్వరులందరకు రాక్షసానీకానికంతటికి "రామవాసన" వారి పూర్వజన్మ సంస్కార లభ్యమని స్పష్టార్థం. తనపైకి వచ్చిన శూర్పణఖను చూసి భీతహరిణయైన సీతను సముదాయించుచూ రాముడు ఆశ్చర్య రామాయణంలో—"పూర్వ

1. రమణీయం - 2 ప.

కర్మానురూపం తు తస్మాదేవం ఫలం గతా" అంటాడు దానికి వ్యాఖ్యాతలు "శూర్ప ణఖ" పూర్వజన్మ వృత్తాంతాన్ని ప్రస్తావించారు. అది ఇలా వుంది. -

"ఈ శూర్పణఖ పూర్వమొక గరుడాంగన. స్వర్గలోకంలో ఒకనాడు నందన వన విహారియై శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవితో శేషపాన్పుపై నుండ ఆయన యందలి మక్కువచే ఈ గంధర్వాంగన ఆ మోహనరూపుని దర్శింప యత్నించగా, శేషుడు తనపడగలతో శ్రీ మహావిష్ణువు కనపడనీయక మూసివైచెను కోపించిన గంధ ర్వాంగన శేషుని చెవులయందును, ముక్కుమీదను, పిడికిళ్ళతో పొడిచెను. అప్పుడు శ్రీమహాలక్ష్మి శేషుని సమర్థించుచూ, గంధర్వాంగనను దూషించుచుండగా, ఆ గంధ ర్వాంగన భర్త వచ్చి లక్ష్మితో వివాదపడుచున్న తన భార్యను కోపించి "భూమి యందు రాక్షసిగ" జన్మింప శపించెను. అప్పుడు క్రోధించిన గంధర్వాంగన "కాలాం తరమున నావలన నీభర్తతో నీకు వియోగము కల్గగలదని శ్రీమహాలక్ష్మిని శపిం చెను. - ఆ గంధర్వాంగనయే ఈ "శూర్పణఖ". ఆ శేషుడే ఈ లక్ష్మణుడు"1.

ఆ పూర్వజన్మ వాసనే కవిచేత ఇక్కడ జన్మాంతర వాసనాఫలిత మని వ్రాయించింది.

మెరుపు తీగతో గూడిన మేఘమువలె ప్రకాశించుచూ, సీత తోడి రాముణ్ణి చూచి అతని సౌందర్యానికి ఆశ్చర్యపోతుంది ఈ కావ్యంలో శూర్పణఖ వాల్మీకంలో వలనే.

"అన్నా! ఏమిది మున్నెఱుంగ నెపుడ త్యాశ్చర్యమైతోచు; ఈ
సన్నంబోయెడి తుచ్ఛమానవ వపుస్సంజాత వాతోద్ధతుల్
మన్నాసంబును దాకుగావి మదిబ్రహ్మర్షి తాంభోరుహా
ద్భిన్నంబయ్యెడి రాగమట్లిటుల శాంతింబొంద లేదెప్పుడున్"2

తనలో కలుగుతున్న చైతన్యానికి ఆశ్చర్యపోయింది ఆ రక్కసి. శరీర వైశాల్యమే కాని సౌందర్య దర్శనాశూన్యమైన ఆమె హృదయంలో శ్యామ సుందరుని రూపం కోరిక లెగజిమ్మ జేసింది.

"మోదమలర వస్తి ముఖగ్రంధులూరంగ
పీని పంటనొక్క పీకి తినగ
కావి; యిటకు వచ్చి కనుచున్న పలరాజు
పంటినొక్కు కేను పరవశింతు"3

అన్నమాటలు శూర్పణఖ లోని భావచంచలనానికి ప్రతీకలు. "పంటనొక్క పీకి తినడం కోసం" వచ్చిన తనకు పీని పంటినొక్కులతో పరవశించ వలెననెడి ఆరాటం అధికమవ్వటం చోద్యం.

---

1. ఆశ్చర్య. రా. 1 అరణ్య - పు. 227
2. రమ — 4 ప.
3. రమ - 5 ప

"అక్కట! అంతరాంతరము లందున సుద్రవమందె నేదియో
మక్కువ, నేటికీముఖహిమాంశుడు నాయెద గోడజీల్చి
చిక్కగ కాపురంబిడుటచేతనె చేతము చల్లనయ్యె నా
కెక్కడలేని రాగసుధలేవొ జనించెనువీనిచూపులన్"1

"ముఖహిమాంశుడు" ఎదగోడలజీల్చి చిక్కగకాపురం ఉండటం వలననే హృదయం చల్లగా ఉంది శూర్పణఖకు - బంగారు ఛాయలో ప్రకాశిస్తూ ప్రక్కనే ఉన్న ఆ వనిత కులుకు సొగసు జూడ కోమలి భార్యయే యనగదోచు - దోచె మనసువీడు" అనుకొంది. శ్రీరాముని చూపులలో రాగసుధల జడివానకు పుల్కరించిపోయింది. వాల్మీకి రామశూర్పణఖ లను ఒకేసరి దర్శింపజేస్తూ —

"సుముఖం దుర్ముఖీ రామం వృత్తమధ్యం మహోదరి
విశాలాక్షం విరూపాక్షి సుకేసం తామ్రమూర్ధజా
ప్రీతిరూపం విరూపాసా సుస్వరం భైరవస్వరా
తరుణం దారుణా వృద్దా దక్షిణం వామభాషిణీ"-2

అంటాడు. వారిద్దరు పురి సౌందర్యం దర్శింపజేసిన విధానం రమణీయం.

"అనుచు దైత్యవనిత ఆరామదర్శన
పుణ్యమనగ మేని పొలసు విప్పె
శాపమోక్ష మస్తు సందర్శనముచేత
ముక్తినందు దివిజ ముగ్ధవోలె.

"ఆరామ" దర్శన పుణ్య ఫలితంగా ఆమెకు మోక్షం సంప్రాప్తించబోతుంది.

(i) ఆ-రామ — ఆరాముని యొక్క

(ii) ఆరామ - ఆ పర్ణశాల యొక్క, (సీతారామలక్ష్మణులతో కూడిన)

(iii) ఆరామ - లక్ష్మిరూపమైన సీత యొక్క

సందర్శనమువలన అనే అర్థాలను మనం విశ్లేషించవచ్చు. అందువల్లనే "ముక్తినందు దివిజముగ్ధవోలె" అన్న పదం కవి ప్రయోగించడంలోని పరమావధి.

సీతారాములను నవ్వుతూ పల్కరిస్తుంది శూర్పణఖ. నేనవ్వల దానగాను మిము నమ్మిన దానను"3 అంటుంది. దానిలో నిగూఢంగా ఆత్మార్పణ తత్త్వం ప్రచ్ఛన్నమై ఆత్మసమర్పణం ద్యోతకమౌతున్నాయి.

---

1. రమ - 6 ప.
2. రమ - 9 ప.
3. రమ. - 10 ప.

"ఔరా! నీకొక, భార్యయా! భవతమోర్థోరాశి తీరస్థితం
ఔరాశీకృత నైగమార్థపదవీభావ్యాకృతీ! దైవమా
ఔరా! నీ, కొక భార్యయా! విపుల బ్రహ్మాండాంతస్థితః ప్రాణికో
టీరంబౌ పురుషోత్తముండవు వధూటీవాంఛ నీదేశ్వరా"1

అనేస్తుంది.

"ఆత్మ పరమాత్మసన్నిధి నరసినట్లు
అరసి వచ్చితి నీలోన నణగిపోవ
మాట మన్నించి మదిలోన చోటు నిమ్ము
శవమునై నను నడిపించు శివము నీవ"2

-మాటమన్నించి మదిలో చోటునర్థించింది. శివంకరుడవు నీవేనని తనను నీలో కలిపేసుకోమని ప్రార్థిస్తుంది ఈ శూర్పణఖ పల్కులలో మాయాతీతుడైన రాముడు 'మాయాదేవిని' అడ్డు పెట్టుకొని మావంటి వారిని నీచెంతకు పిలుచుకుంటావని కూడా అనేస్తుంది.

"మాయాతీతుడవయ్య నీవ యవురా! మాటోంట్లు నిస్తేరగా
చేయంబోయెడి కార్యవిఘ్నతకు ఈసీమంతినీ రూపుగా
మాయాదేవిని నాదరించితివి"3

అన్నమాటల్లో అభావమే తొంగిచూస్తోంది. రావణురాకకు ముందుగానే కనుంగొవిన రాముడు పర్ణశాలలోని సీతను అగ్నిలోదాచి మాయా సీతనే రావణుని అపహరణ కొఱకు ఆశ్రమంలో ఉంచాడన్న జానపద, అధ్యాత్మవాదుల కధను ఆధారంగ కవి ఈ పల్కులను శూర్పణఖ చేత అనిపించారు.

"మాయజూపి సతిగ మరపింపనుంటివి
మాయజగము కీవ మగడకావె"4

అన్నమాటల్లో ధ్వని "అభవుడై, మాయజాల సృష్టికి మూలరూపుడైన జగన్నాధుని మోహిల భక్తుని ఆర్తియది.

"నిస్తేరగా చేయంబోయెడి కార్య విఘ్నతకు ఈసీమంతినీరూపుగా"
మాయాదేవిని నాదరించితివి" అన్నమాటల్లో 'సీతాచరితం' యావత్తుకు ప్రధానకారణం శూర్పణఖ నాసికాఖండ పూర్వక సీతాపహరణమేనని చెప్పకయే చెప్పటం ధ్వనిస్తుంది. 'నిస్తేరగా' అన్న మాటల్లో రాక్షసులెల్లరు రావణుని వరకు -రాముని చేరడానికే సీతాపహరణాది సమస్త దారుణకృత్యాల్ని ప్రవర్తింపచేశారనే

1. రమ - 16 ప
2. రమ - 14 ప
3. రమ - 17 ప
4. రమ - 17 ప.

అర్థం ధ్వనిస్తుంది. శూర్పణఖ సీతను కబళించడానికి ఉద్యుక్తురాలైంది.

"మనల మధ్యనిపుడు మాయయే యడ్డైన

మాయజీల్తు నీదు మర్మమరయ"1

'మాయ' సీతయై శూర్పణఖా రాముల మధ్య అడ్డంగా ఉన్నట్లుగా శూర్పణఖ భావించింది. అందుకే–

"నాకలక్ష్మిని కబళించు నరకమల్ల

అవనిజను మ్రింగ వక్త్రగహ్వరము సాచె"2

సీతను మ్రింగటానికి సిద్ధపడిన శూర్పణఖను కోపంగా చూశాడు రాముడు. రాముని కోపాగ్నిలో నాసిక తెగింది.

"ఆక్షణమ రామరక్తాక్షవీక్షణమున

పొంగి రౌద్రమ్ము మూర్తమై పొడమెనేమొ

తరుణి నాసికి తెగి రక్తధారపారె

వానకారున నెఱకొండ వాగువోలె"3

"ఎఱ్ఱవాగు"వలె రక్తపుచేరుల పారి ముక్కుడిమైంది శూర్పణఖ. తనకు అంగ వైకల్యం ప్రాప్తించినందుకు బాధపడలేదు ఆమె. ఈ గాయాలు చూచి అన్న ఏమంటాడో నని ఆమె భయం.

"నామాటల్ మది నమ్మలేక అకటా! నన్నిట్లు హింసించినన్

రామా! నే వగలంద గాని కనులారన్ గాంచి మా యన్నయే

మేమీ!! గాయములంచనంగ నిజమేలా దాతునో, దాపటో

నీ మాటేమగునో యటంచు వగతోనేడ్తున్ దివారాత్రముల్"4

తనకు "విరూపత" ఏర్పడినందుకు గాక "నీమాటేమగునో"అనే వేదన శూర్పణఖది. రామునకు అతని ఇల్లాలికి ఏముప్పు ఉప్పతిల్లుతుందో అన్నవల్ల అన్న బాధతో "దివారాత్రాలు" విలపిస్తుంది ఈ "శూర్పణఖ".విలపిస్తూ వీడ్కోలు తీసుకుంటున్న శూర్పణఖను–

"హృదియ విష్కామభక్తితో వింపుమీర

వెడలి రమ్మనివల్కె నా విశ్వభర్త"5

---

1. రమ - 17 ప
2. రమ - 18 ప
3. రమ - 19 ప
4. రమ - 21 ప
5. రమ - 21 ప

"విష్కామభక్తితో" వీడ్కోలు ఇచ్చారు విశ్వభర్త. కారణం రామకథకు ప్రధాన ధేయం శూర్పణఖ. కాబట్టే-

"రాముడవా! అహో!! అసురరామహృదుత్పల కర్ణికాంత రే
ఖ్యా మధువాహినీ పులకజాలమె డోలికగాగ నూగు నా
సోముడవా!"1

-అంటుంది శూర్పణఖ. అంతేకాదు

"నాదు హృదయంపు చీకట్ల వీడియాది
అరసినట్లయ్యె అధ్యాత్మ పరిధిఛాయ"2

అంటూ శూర్పణఖలో భక్తి భావాల్ని దర్శింపజేసిన అధ్యాత్మశీలి శ్రీ సత్యనారాయణ.

వాల్మీకి లేఖిని అందించిన "శూర్పణఖ" గుర్తించలేనంతగ క్రొత్త సొగసు లతో అధ్యాత్మపరిధిలో దర్శించిన సంస్కారం ఈ కవిది. రామునితో విరాడ్రూపుని దర్శించి వానిచే శిక్షించబడియు-విచారించక -

"రక్షనందియొ లేక నేశిక్షనందొ
ధన్యనైతివి రామ నీదయమ పొంది"3

-అంటూ ఆనందంగా వీడ్కోలు తీసుకున్న అధ్యాత్మభావోపేత ఈ "చుప్పనాతి" తనం లేని ఈ శూర్పణఖ.

శూర్పణఖ "ముక్కుచెవులు" లక్ష్మణుడు కోసినట్లు వాల్మీకి చెపితే4 అనం తరకాలీనులు "స్తనాలను" కూడా కోయించారు. కాని వీరి "శూర్పణఖ" మాత్రం విగతనాసికయైంది. అదికూడ రాముని "రక్తాక్షవీక్షణము" వల్లనే సంభవించిందని చెప్పి, ఆ పాపాన్ని రామానుజుడైన లక్ష్మణునకు కూడా అంటనివ్వకుండా జాగ్రత్త పడతాడు ఈ కవి.

శ్రీరాముడు ఆర్తరక్షకుడేగానీ తనవారికి హానితలపెట్ట యత్నించిన తనవారి నైనేనూశిక్షింప వెనుకాడని "సత్యపరాక్రముని"గా రూపొందించిన ఖ్యాతి వాల్మీకిది- వారి అడుగుజాడలే అనంతర కాలికులకు మార్గదర్శకాలు. అందువల్లనే శూర్పణఖకు మోక్షాన్ని ప్రసాదింప సిద్ధపడియు సీతకు హానిచేయ యత్నించుటచేత లక్ష్మణునిచే శిక్షింపచేసినాడు అన్నది ఆధ్యాత్మల భావన.

---

1. రమ - 12 వ
2. రమ – 13 వ
3. రమ - 20 వ
4. వాల్మీకం - అరణ్య – 18–21

## స్వయంప్రభ

శ్రీరామచంద్రుని సేవలో జీవితాన్ని పండించుకొన్న యోగిని "స్వయం ప్రభ" సీతారమణికై అన్వేషిస్తూ, అలసిపోయి, ఆకలిదప్పులతో పీడించబడుచున్న వానరసేనను ఆదుకొని, వారికి అతిథి సత్కారాలందించి, తిరిగి రామకార్యానికి వల సిన జవసత్త్వాల నందించి, రామసేవకులకు సేవచేసి, పరోక్షంగా రామసేవను చేసు కొని తరించిన దివ్యప్రభ ఈ స్వయంప్రభ.

"మహాభాగాం-తాపసీం ధర్మచారిణీం"1 (తాపసీ ధర్మచారిణీ)
—తాపసీ ధర్మచారిణీ2 (తాపసీ ధర్మచారిణీ)
........జ్వలంతీ మివ తేజసా3

అని పరిచయం చేస్తారు వాల్మీకి ఈమె నివసించే వనాన్ని-"వనముత్తమం" అంటాడు.

........... ....కాంచనంవనం4
...............మహద్దరణ్యం5
....... ........మహావనే6
...............వనందుర్గం7

అని సైతం వర్ణించి, ఆమెని స్వయంగా కాంతివంతమైన పాత్రను చేశాడు ఆదికవి. "తాపసీ ధర్మచారిణీ" అన్న విశేషణం ఆమెకు పెక్కుసార్లు వాడబడింది. తనకు మేలు చేసిన ఆ తపస్వినికి తమవల్ల కలిగే ప్రయోజనం ఏమైనా ఉంటే ఆజ్ఞాపించ వలసిందని ఆంజనేయుడు ప్రార్థించినపుడు స్వయంప్రభ —

"చరంత్యా మమధర్మేణ నకార్యమిహ కేనచిత్"8

"ధర్మమార్గంలో చరించే నాకు ఇతరులవల్ల కలిగే పని ఏముంటుంది" అంటుంది. అంటే సన్మార్గపథంలో నడిచేవారికి ఇంకెవరితోనూ చేయించుకొనే పని ఏమీ ఉండదు. అన్న ఆత్మవిశ్వాసం ఆమెది. "ధర్మచారిణీ" అన్న పదంలోనే వాల్మీకి మనోభావం స్పష్టం.

---

1. వాల్మీకం - కిష్కింధా - 51-1
   52 - 1
2. వాల్మీకం - కిష్కింధా-51-94
   53-11
3. వాల్మీకం - కిష్కింధ-50-40
4. వాల్మీకం - కిష్కింధ-51-104.
5. వాల్మీకం - కిష్కింధ - 51-2
6. వాల్మీకం - కిష్కింధ-51-131
7. వాల్మీకం - కిష్కింధ-51-174
8. వాల్మీకం - కిష్కింధ-52-194

శ్రీమతి సీరము సుభద్రాంబ చేతిలో 'స్వయంప్రభ' క్రొత్త ప్రభల్ని సం తరించుకొంది. వానరసైన్యం అరణ్యాలు, పర్వతాలు, నదులు, వనాలు, గుహలు, కంధరాలు వెతుకుతూ దక్షిణ దిక్కుగా పయనిస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ విశాలమైన గుహనొకదానిని చూచి, అందులోకి ప్రవేశించారు, అందు-

"అతత శీతవాత జనితాధిక బాధ సహించుచున్ మహా
ప్రీతిని జాతి వైరములు వీడి మృగావళి చెంత గ్రుమ్మరం
జేతము నిర్వికల్పగతి జేసి సమాధి విలీన చిత్తయై
పోత వసించి విగ్రహము పోలికనున్న తపస్వినీమణిన్"[1]

-సమాధి విలీన చిత్తయైన ఒకానొక తపస్వినీ మణిని చూచి ఆశ్చర్యపోయారు వాన రులు. చేతులు జోడించి, చెంత చేరిన హనుమంతుడు ఆమె అసలురూపును గూర్చి ప్రశ్నిస్తాడు. ఈ పవిత్ర పర్వత భూమి యావత్తు ఆమె యొక్క తపఃప్రభావంచేదివ్య త్వాన్ని పొందిందని, రాముని సేవలో అలసిపోయిన తమకు ప్రాణాలు నిలుపుకోవ డానికి, కందమూలఫలాలను అందించవలసిందని. వానిని స్వీకరించడానికి అనుజ్ఞ ఇవ్వవలసిందని ప్రార్థిస్తాడు పరమ పవిత్రమైన ఈ గుహలో ఒంటరిగ యోగినవై తపస్సుచేయడానికి కారణమేమిటని, అష్టసిద్ధులను పొందాలనా? లేక మోక్షము మీద మక్కువా? అని సైతం హనుమంతుడు ప్రశ్నవేస్తాడు. ఇది తెలుగు కావ్యంలోని అధికప్రసంగం.

ఒక మహాయోగినిని వినయ వినమిత్రగాత్రుడై తన అవసరం మేరకు ప్రార్థించి, ప్రయోజనం పొందినవాడు వాల్మీకి హనుమంతుడుకాగా, ప్రశ్నలరూపంలో ఆమె నివాసాన్ని విరివిగా వర్ణించి, ఆమె ఆధిక్యాన్ని పాఠకులకు తెలియజేయప్రయత్నిం చినవాడు సుభద్రాంబ హనుమంతుడు.

"వాడదు మేనుసుంతయును వన్నెతొలంగదు మోము, తేజముం
జూడదరంబు కాదు, కడుజోద్యము! సొక్కను స్రుక్కులేక యీ
జాడ దపోవ్రతక్రియలు సల్పినవారలు కానరారు పూ
బోడులలోన, నీగతి యపూర్వ మహత్త్వమెటుల్ లభించెనో"[2]

వన్నె తరగని మోము, వాడని శరీరము, దుర్నిరీక్ష్య తేజస్సు స్వయంప్రభవి. 'జ్వ లంతీమివ తేజసా' అన్న వాల్మీకి ఒక్క పలుకు తెలుగులో వివిధ విశేషణాలుగా రూపొందింది.

---

1. స్వయంప్రభ - 2 ప 2. స్వయంప్రభ - 7 ప.

"ఫలములు కందమూలాములు, భక్ష్యములై తగ దృష్టిబాపగా
జలములు, బొప్పుగాగ ధర, దారుశరీరము గప్ప నారలన్
విలయముగాగ కందరము నిత్యతపంబు మహాధనంబుగా
గలిగి సుఖించుచుంటివి జగంబులనేలెడి రాజ్ఞి కై వడిన్"

అని ప్రార్థించి, "నీచరిత్ర ప్రభా ప్రకటనమున, మాదు పాపతమము బాయజేసికార్య ఫలము చేకూరిచి, వంపవమ్మ" అని అర్థిస్తాడు. మెల్లగ కనులుతెరచి ఆమె పావనిని చూచి–"ఓయనిలసుత" అంటూ సంతోషించి, తన వృత్తాంతం హేమా విశ్వకర్మల కథాయుతంగా ప్రస్తావించింది స్వయంప్రభ.

హనుమంతుడు స్వయం ప్రభను ప్రశ్నించే విధానంలోనే ఆమె ఔత్కృష్ట్యాన్ని ప్రదర్శింపజేయడం ఈ కవయిత్రి ప్రతిభ. "జగంబులనేలెడి రాజ్ఞికై వడిన్" అంటూ లోకాలనేలే రాజ్ఞి యనుభవించే భోగాలను ప్రకృతిలో దర్శించిన యోగినిగా స్వయం ప్రభను దర్శించాడు హనుమంతుడు. 'నిత్యతపమే మహాధనంగా' జీవిస్తున్న రాజ యోగిని స్వయంప్రభ.

"పెక్కేండ్లు దీనిగోరుచు
నక్కజమగు తపమొనర్చెనమ్మ యు, దక్షే
యిక్కందరమును గొమ్మని
యక్కమలానను డొసంగె నాతనికి దయన్"2

అన్న పద్యానికి వాల్మీకి ఈ శ్లోకం ఆధారం.

"నతువర్ష సహస్రాణి తపస్తప్త్వా మహావనే
పితామహా ద్వరంలేభే నర్వమౌశన సంధనమ్" 3

బ్రహ్మ అనుగ్రహంతో శిల్పజ్ఞానాన్ని పొంది,అపురూపమైన కాంచనభవనాన్ని నిర్మించాడు మయుడు. హేమతో ఇష్టోపభోగాలననుభవిస్తూ అధికకాలం ఇచ్చట నివసించాడు అతని సుఖాలకు కనుగుట్టిన దేవేంద్రుడు వజ్రాయుధంతో మయుని సంహరించగా, ఒంటరియైన హేమ ఈ వనాన్ని స్వయంప్రభకు యిచ్చి తాను వెడలిపోయింది. అనాటి నుండి దీన్ని రక్షిస్తూ, తపోదీక్షలో ఉన్నానంటుంది వక్తగా స్వయంప్రభ. 'ఇదం రక్షామి భవనం హేమయా వానరోత్తమ 4 అని వానరుడైన హనుమంతుని 'వానరోత్తమ' అని మాత్రమే వాల్మీకి స్వయంప్రభ సంబోధిస్తే తెలుగు స్వయం ప్రభ "అనిలసుత" అని సంబోధన చేయడం రామకథ తెలిసిన కవయిత్రికి చెల్లింది.

1. స్వయంప్రభ - 6 ప
2. స్వయంప్రభ - 15 ప
3. వాల్మీకం - కిష్కింధ - 51-124
4. వాల్మీకం - కిష్కింధ - 51-164

దీనివల్ల స్వయంప్రభ త్రికాలవేదిత్వం, దివ్యజ్ఞానత్వం తెలుసుకోవచ్చు. మూలంలో తనమగూర్చి పరిచయాన్ని చివరలో చెప్పుకొంటుంది స్వయంప్రభ. కానీ ఇందులో ముందుగానే తననుగూర్చి ప్రస్తావించి అనంతరం....'హేమ' వృత్తాంతాన్నివిశదీకరి స్తుంది.

........................... ఓ

యనిల సుత, మేరుసావ

ర్ణినందన, స్వయంప్రభ యన నెగడినదానన్"1 అన్న బల్కులు తెలుగు స్వయంప్రభవి. ఇందుకు ఆదికవి శ్లోకం ఇది.

"దుహితా మేరుసావర్ణే రహంతస్యా స్వయంప్రభా" 2

రామకార్యాన్ని ప్రస్తావించి, సమయాతీతంవల్ల తాము ప్రాణహానికి గురికా గలమని భయపడి మార్గాన్ని నిర్దేశించమని ప్రార్థిస్తారు పావని. "జీవతాదుష్కరం మన్యే ప్రవిష్టేన నివర్తితుమ్" యీ బిలముద్వారము జొచ్చినవారు క్రమ్మఱన్ ప్రాణము తోడ వెడలరు" అనిచెప్పి తనతపః ప్రభావంచేత బయటకు పంపిస్తానని హామీ యిచ్చి చేతులతో కళ్ళు మూసుకోమని ఆజ్ఞాపిస్తుంది వానరులను స్వయం ప్రభ.

"నిమీలయత చక్షూంషి సర్వే వానరపుంగవా

నహి నిష్క్రమితుం శక్యమనిమీలిత లోచనైః"3

"కన్నులు విప్పక యుండుడీ" అంటూ తన మహత్యంతో వారిని ఋక్షబిలాన్ని దాటించింది. దానికి షరతు వారు కన్నులు మూసుకోవటం "వానరాస్తు మహాత్మానో హస్తరుద్ధముఖాస్తదా" అని వాల్మీకి

"కపులు కనులు మూయ ఘనయోగశక్తిమ

హత్త్వమునను జేసి యత్తపస్వి

నిమె పెడల్చె గపులు బయటికి వెడలిరి

తల్లికడుపునుండి పిల్లలట్లు"4

తల్లికడుపునుండి వెల్వడిన పిల్లలవలె కపులు ఋక్షబిలంనుండి బయటపడ్డారన్న కవ యిత్రి భావన మాతృత్వ ప్రతిపాదన చేసిందే కాని పోలిక బాగుండలేదు, 'ఉద్ధ

1. స్వయంప్రభ – వ.
2. వాల్మీకం-కిష్కింధ-51-164
3. స్వయంప్రభ - వ
4. స్వయంప్రభ-వ

రిష్యామి' అను స్వయంప్రభ పలుకుల్లో వాల్మీకి కనపరచిన భావం అదే కావచ్చు కానీ తెలుగుపలుకుబళ్ళలో ఏదో కొంత అనౌచిత్యం ద్యోతకమవుతుంది. ఈ ఘట్టాన్ని కేనోపనిషత్తులోని అంశంతో పోల్చిన విమర్శకులున్నారు.

"స్వయంప్రభ గాధ చదివేటప్పుడు కేనోపనిషత్తు గుర్తుకొస్తుంది. ఆమె గుహనుండి వానరులు వెలువడాలంటే కళ్ళు మూసుకోమడం ఈ పదాలకు ప్రతి ధ్వని.

"యదేతత్ విద్యుతో వ్యద్యుతదా ఇతీన్యమీ విషదా"

కంటిలో మెరుపువలె క్షణకాలంలో మెరసిన మెరుపు కనిపించి అది అదృశ్య మయింది.

స్వయంప్రభ వృత్తాన్తం కేవలం కధనంగానే కాక ఈ మాయామయవిశ్వంలో అపార్థివ తత్వ మీమాంసా శాస్త్రంగా, యోగశాస్త్ర పాఠ్యాంశంగా,సాహిత్యంలో ఒక కళాఖండంగా భావించాలి" అన్న ఇలపావులూరి వారి మాటలు ముత్యాలమూటలు.

రామదర్శనం కాకపోయినా రాముని సేవకులకు సేవచేసి, రామసేవా భాగ్యాన్ని పొందిన ధన్య స్వయంప్రభ.

---

1. రామాయణంలో స్త్రీ పాత్రలు - పు 85.

# సరమ

సరమ ధర్మాత్ముడైన విభీషణుని భార్య. రావణుని తమ్ముడు విభీషణుడు. రామునికి ప్రతినాయకుడై రామాయణ కథకు కారకుడై "పౌలస్త్యవధ" నామాంతర రామాయణంలో రావణుడు ప్రధానుడుకాగా, లంకలోపుట్టినా లంక లక్షణాలులేని విభీషణునకు తగిన ధర్మపత్ని సరమ.

"సరమా నామ ధర్మజ్ఞాం లేభే భార్యాం విభీషణామ్"-1 అని ఉత్తరకాండ.

"విభీషణస్తు ధర్మాత్మానతురాక్షస చేష్టితః"2 అని శూర్పణఖ విభీషణుని గూర్చి రామునికి పరిచయం చేస్తుంది. "ధర్మాత్మా "ధర్మజ్ఞా" అనే విశేషణాలు వాల్మీకివి. రాక్షసవంశంలో జన్మించినా ధర్మాతులు వీరు. వీరి కొమార్తె "అనల".

సీత అశోకవనిలో నుండగా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఆమెను ఆదుకొన్న కుటుంబంగా, సేవచేసి తరించిన వ్యక్తులుగాను వీరు మనకు రామాయణంలో కనిపిస్తారు. రాముని శరణుజొచ్చి రావణ వధకు కారకుడైన విభీషణుడు సీతకు పరోక్షంగా సహాయం చేస్తే, రామవిభీషణుల సమాగమాన్ని, రామదండు పురోగమాన్ని గగనమార్గంలోనుండి అదృశ్యగా వీక్షించి సమస్త సమాచారాన్ని రాముని విజయాలను సీతకు చెప్పి, గ్రీష్మతాపంలో ఎండిపోయిన ఆమె హృదయంపై తొలకరి జల్లులు చిలకరించి, శాంతింపచేస్తుందీ సరమ.

అత్యల్పమైన ఈమె కథా ప్రస్తావనకు కావ్య రూపాన్నిచ్చినవారు శ్రీమాన్ గుదిమెళ్ళవారు.

"రమయా సహవర్తత ఇతి సరమా" సాక్షాల్లక్ష్మీ స్వరూపురాలగు సీతతో లంకయందు సంబంధం కలది కావున "సరమ"యని కవి కల్పన.

"సరోమాపర్థయా"3 అన్న మానస సరోవర తీరంలోని సరమా మాతృమూర్తి అభ్యర్థనలో విన్పించిన "సరమా" అనే పదం వ్యక్తికి పేరుగా రూపొందినట్లు ఉత్తర కాండ. కానీ గుదిమెళ్ళవారు దీనికి భిన్నంగా పై రీతిని కల్పన కావించారు. రామచంద్రుని కౌగిలి విభీషణునకు లభించగా, సీతమ్మ కౌగిలి పొందిన భాగ్యశాలిని "సరమ", ఇట్టి పుణ్యదంపతులకు లోకోత్తర సుషమమూర్తుల ఆలింగన భాగ్యంప్రాప్తించటం చేత వారు పుణ్యదంపతులైనారు.

---

1. 3. ఉత్తర కాండ 12-24 2. వాల్మీకం 3-17-24,

"హరి - కౌగిలించె భర్తను
సిరి - కౌగిలిపేసె సతిని చిత్రమ్మరయన్
సిరిహరుల కృపకు బాత్రులు
సరమయు దద్భర్త వారి జన్మ తరించెన్." (134 ప) అని కవి కొనియాడు తారు.

దక్షిణ దిక్కున దారుణమైన పయోనిధి. దాని నడుమ లంకా రాజ్యం. అది అశోకవనం. శింశుపావృక్షం. దాని క్రింద ఏకవేణిధారిగా సీత – ఇది సరమా కావ్య ముఖద్వారం.

మాయలేడి కోసం భర్తను దూరంచేసుకొన్న దురదృష్టవంతురాలు. "మాసి నది చీరెయు - గంటికి నిద్రలేదు – స్నానమ్మనరాదు–సాపడదు" "శోకరసాధి దేవత" యై విల్చిన ఆసాధ్వి సీత.

"ఆకుల నందులందు మరుగైన సుమమ్మన బాంసుగుంఠిత
మ్మౌ కనకమ్ముౕరీతి జలదాంతరమందలి చంద్రరేఖ నా
వేకువ జామునందు గనిపింపక కొండలదాగియున్న ప్రా
చీ కళ రీతి నున్న దదె! సీత నిశాటులు చుట్టుముట్టగన్." (5ప)

మబ్బుల్లో చంద్రలేఖ వలె రాక్షసుల నడుమ సీత దుఃఖిస్తోంది. తాను దశరథ వంశానికి పెద్దకోడలు కావడం వల్లనే ఇన్ని కష్టాలు వారికి వచ్చాయని ఆమె వేదన. రాముడికి రాజ్యం పోయింది. మామగారు మరణించారు. మఱదికి భార్యా వియోగం మొండవి కాపురం అంతంత మాత్రం. శ్రుతకీర్తికిని సంతాపం, తనవల్లనే జటాయు మరణం. ఖరదూషణాదులు నశించారు. తారకు భర్తృవియోగం. ఇంతజరిగినా - కష్టాలు తీంలేదు. నిన్నగాక మొన్న నొక వానరోత్తముడొచ్చాడు, తానిచ్చిన రత్నం పుచ్చుకొన్నాడు. స్వామి అంగుళీయకమిచ్చాడు. "కనవచ్చినవాడిల్లు కాల్చినాడు" రాక్షసులు చుట్టుముట్టి తోకకు నిప్పుపెట్టారు. అప్పటికి "తానుచూడటంతో" సుఖాం తమైంది. కాని తరువాత? దారులుకాచి మోసపుచ్చి వానరుని ఈ దానవులు ఏం చేశారో? తాను పంపిన సందేశం నాధుని కందిందా?

"స్వామియు లక్ష్మణుం డిటకువచ్చుట యెన్నడొ రావణుండు సం
గ్రామమునందు గూలిపడ గాంచుట యెన్నడొ భర్త ప్రేలియం
దీమణి యుంగరమ్ము వెలయించుటయెన్న డొ యంతభాగ్యమీ
భూమిజకున్నదే యనుచు భ్లోరుననేడ్చు ననేకరీతులన్" (14ప)

తన అందమే అన్ని అనర్థాలకు మూలకారణమైందని దుఃఖిస్తున్న జానకిని ఓదార్చ డానికి "సరమ" ప్రవేశిస్తుంది కావ్యంలో. ఇంతవరకు సీతయొనర్చిన "రామకథా ప్రశంస అంతయు వ్యాజస్తుతిగ తన ఔన్నత్యాన్ని ప్రకటించడమేనని-కవి సీత పిరాట్టిగ భావించి ఆమెలేకపోతే రామాయణం లేదని "సీతాచరితమ్" అనిపిలువ బడే ఈ కావ్యంలో ఆమె ఔన్నత్యాన్ని వ్యంగ్యంగా నిరూపించారు.

"మంచిని పొఱజూచి సరమా యని యీసతికే తపస్వి పే
రుంచెనో కాని నేడు తగియున్నది సీతను వాడు లంకలో
దించిననాటినుండియును తియ్యని స్నేహము చూపుచున్న దీ
యంచితశీల............(16 ప)

"ప్రేముడియున్న మిత్రము, విభీషణు భార్య మహాత్మురాలు"

ఆయిన ఈ సరమ సీతకై ప్రతిరోజు వచ్చి రాముని గూర్చి చెబుతూ, సీతకు ధైర్యా న్నిచ్చే, ఏకైక వ్యక్తి, "వందె జననాంతర సౌహృద మీమె కివిధిన్" అంటూ పూర్వజన్మ సంబంధమె ఈ విధంగా ఫలించిందని "జననాన్తర సౌహృదాని" అంటూ కవికులతిలకుని జ్ఞప్తి కెలయించారు ఆచార్యులవారు.

"ప్రాణవిభుండు చిత్తమున రాక్షసచేష్టలు వీసమేనియున్
బూనని ధర్మవర్తనుడు పుత్రికయో "అనలమ్మ" యెప్పుడున్
జానకి చెంతనే నిలిచి ధైర్యముజెప్పును సార్థకాఖ్యగా
దానును లక్ష్మితో గలసి తాల్చెనదే సరమాభిధానమున్" (17 ప.)

"సరమా" సార్థక నామధేయ. ఇది సరమా జీవిత చిత్రణం. ఆమె కుటుంబం రామ సేవలో పునీతమైంది.

విభీషణస్తు ధర్మాత్మా............

జ్యేష్ఠకన్యాఽనలానామా............విభీషణసుతా-1

అన్న వాల్మీకం కవికి ఆధారం.

ఉదయమనగా అన్నగారి సభకు వెళ్ళిన విభీషణుడు ఇంతవరకు రాలేదని ఆదుర్దాగా కూమార్తె "అనలతో" కలిసి పేదిగుమ్మం వద్ద ఎదురుచూస్తూ "సరమ" కనిపిస్తుంది. ఆమె మనస్సు ఆందోళనగా ఉంది. నగరంలో రాజకీయ సంచలనం ఎక్కువగా వుంది. భూజాతను ఎత్తుకొచ్చిన నాటినుండి-నిన్నెవడో వానరుడొచ్చి పురిని బూడిద చేసేవరకు జరిగిన ఘట్టాలు వేదనను కల్గిస్తున్నాయి. యుద్ధాగమన వార్తలు పెల్లుగా ప్రబలుతున్నాయి.

1. వాల్మీకం-సుందర-32-10-11, 12

"మనమున భీతితోడ సరమానతి కుంతల గూఢ పాలయై
పెనిమిటి రాకకోసమని వీధి నిరీక్ష పేయుచుండ-"1 గూఢచారి వచ్చి రావణుని తిరస్కారం, విభీషణుడు మంత్రులతో కలసి చేసిన గగన గమనాన్ని విన్నవించాడు. ఉలిక్కిపడింది సరమ. రిపువు ఇంట్లోకి పరుగెత్తి ఆకాశాన్ని తగులు తున్న భవనోపరిభాగాన్ని చేరి పరికించింది. నల్గురు మంత్రులు వెంటనంటగా రామ చంద్రుని వైపు పయనిస్తున్న నాధుణ్ని చూసి నిట్టూర్చింది.

"పట్టెనులంకకిప్పటికి భాగ్యము" అన్న పల్కు ఆమెనోటినుండి వెల్వడింది. వాయుసూనుడు అగ్నితో పవిత్రం చేసిన ఈ లంకానగరానికి విభీషణుని నేటిచర్య మంచిరోజులు రావడాన్ని నిరూపిస్తోంది అనుకొంది. అగ్నిశిఖలచే శావడం చేసిన సువర్ణంపై ముద్రలు వేసినట్లు లంకను అగ్నికి ఆహుతిచేసి, "భూకుమారి" "రఘు చంద్రుల" ముద్రికలుంచినారన్న ఆమె భావం ఎంతో ఉదాత్తంగా భాసించింది. ఆమె ఆలోచనా స్రవంతిలో ఎన్నియో భావాలు మెల్లగా దొర్లిపోయాయి. అధ్యాత్మ రామాయణ భావాలు కుప్పలుగ నెట్టుకొచ్చేశాయి. అసలు రావణుడే మోక్షప్రాప్తికై "అమ్మవార" ని ఎత్తుకొచ్చాడన్న భావన అందులో ప్రధానమైంది.

"పట్టెను లంకకింతునకు భాగ్యము కూడ ధరాకుమారికన్
ముట్టెను, స్వామిమీద బగబూనెను మౌనుల బట్టిగొట్టె గి
ట్టె పతివ్రతాళి జెరబెట్టె విభీషణు గాలదన్నె నిం
కెట్టులరాదు రాము డిటకెట్టులొనంగడు సేవ వానికిన్" —(30 ప.)

దీన్ని అనుసరించి కొనసాగిన మరి రెండు పద్యాలు "రాకిక దప్పదిచ్చిటికి రాముడు —... (11) వైరము చేత రావణుడు, భక్తి విభీషణు....................."2 పై భావాలకు బలాన్నిస్తున్నాయి.

ఆలోచనల్లో అర్ధరాత్రి సమీపించింది. "వారధిశీతల వీచికావళీ పావనవాయు సంగతి" వలన బాహ్యస్మృతి కల్గింది. రాముని సైన్యం నుండి జేజే ధ్వనులు విని పించాయి. తిరస్కారిణీ విద్యచే విభీషణ శరణాగతి, రామచంద్రుని అభయం, అంకా ధ్యక్షత, అద్భుతంగా దర్శించి ఆశ్చర్య పూరిత మానసయై ఆనందోద్వేగాలతో అశో కవనికి బయలుదేరింది సరమ. రావణుని పాపమా యనునట్లు గాఢాంధకారం శింశు పావృక్షాన్ని ఆవరించి ఉంది. విలాప ప్రలాపాలతో విసిగిపోయిన సీత దుఃఖభారాన్ని

1. సరమ-22 ప   2. సరమ-31, 32 ప.

మోయలేక దీర్ఘ శిరోజాలతో ఉరివేసుకో ప్రయత్నిస్తూ "రామా" యని విలపించగనే "సీతా" అనే శ్రీరాముని కంఠధ్వని మధుర మంజులంగా వినిపించింది పరిసరాల్లో.

"సీతాదేవి మోములో కోటి కాంతులు వెలిగాయి. అర్ధరాత్రి శరద్రాత్రిగా మారింది. రాముడు వచ్చారనే కౌతుకంతో గంపెడు ఆశతో శింశుపా వృక్షం చుట్టూ వెతుకుతున్న ధరాజాతకు సరమ కన్పించింది. "రఘుచంద్రుడు" వచ్చెనె నావిమిత్రమె" అంటూ ప్రశ్నించింది సీత.

"సీతాంతు మోహితాం దృష్ట్వా
........ప్రియాం ప్రణయనీం సఖీమ్ 1
...........సీతాం పరమదుఃఖితామ్
ఆశ్వాసయామాస తదా సరమా మృదుభాషిణీ 2
.....................సఖీ స్నేహేన సువ్రతా"3

—మొదలైన ప్రదేశాల్లో వాల్మీకి వాడిన విశేషాలు—ఒక నెచ్చెలి కష్టాల్లో కుందుచున్న తన స్నేహితురాల్ని ఓదార్చు రీతిలో సరమ—రాముని గొంతుకతో "సీతా" అని పిల్చి ప్రాణత్యాగానికి సిద్ధమైన సీతను ఆ ప్రయత్నం నుండి విరమింపజేసి తన వైపుకు త్రిప్పుకొంది. ఇది ఆధునిక కవి రమ్య కల్పన.

"తాం సమాశ్వాసయామాస సఖీస్నేహేన సువ్రతా"4

అన్న వాల్మీకి భాగంలోనుండి ఈ కల్పన ఉధృతం.

సరమను చూచి రఘురాముడు నా కోసం వచ్చాడా? అని అడుగుతుంది భూజాత. ఆ పదాలలో కూర్చిన ఆర్తి ఆవేదన ఎదురు చూపులలోని వేదన తెలుగు పద్యాలలో రామణీయంగా ఆవిష్కరించబడ్డాయి.

.....................రఘుచంద్రుడు వచ్చెనె నావిమిత్రమె
వరుగున బోయి రాఘవుని బాపము! మారుతి తోడితెచ్చెనే?
మరదియు వచ్చినాడటవే!
మాయలమారి దశాస్యు డెచ్చటుడెన్ మరుగున నుండెనేమొ!
కనుమాటుల వారల దాచిపెట్టుమా!

వాలుగు విధాలుగా విరిసిన ప్రశ్నలతో చివరిది సీత బేలతనాన్ని మాత్రమే కాక ఆమెలోని తొందరపాటును కూడా ప్రదర్శిస్తుంది. "రావణుడు వస్తాడేమో! వారల దాచిపెట్టు" అనడం సీతకు రావణుని వల్ల కల్గిన భయ విహ్వలతను సూచిస్తుంది.

---

1. వాల్మీకం-యుద్ధకాండ-33-1.
2 యుద్ధకాండ-33-2
3. యుద్ధకాండ-33-4
4. యుద్ధకాండ-33-4.

"ఎంత ప్రేమ నాపయిన నెంతశ్రమంబడి వచ్చినాడు నా, కాంతుడు నన్ను జూచుటకు" అంటుంది సీత. తన కాంతుడు తనకోసం రావటం కూడ ఎంతో మహా భాగ్యంగా భావించి, తనకై అడవుల్లో నడచివచ్చిన భగవంతుణ్ణి చూచి, ఆర్తి చెందిన భక్తురాలు "శబరి" లాగా వేదన చెందుతుంది.

"దశాస్యుడు వచ్చునేమో? నా, స్వాంతము కుందుచుండె నొకసారి పతిన్ నను జూడనీయుమా!" అన్న యుత్కంఠ సీతాసాధ్విది. ఇంతగా విలపిస్తున్న సీతను చూచి వేదని చెందింది సరమ. తాను రాముని గొంతుతో పిలిచి, పొరపాటు చేశానా అని చింతించసాగింది. క్షణికానందం కోసం శ్రీరామునివలె భాషించి సీతకు బాధ నధికం చేశానని వేదన పొందుతుంది. సరమ చేసిన పని అర్థమయ్యింది సీతకు. "నీవు కూడ మాయలేడి మాయలు నేర్చావా?" అని అడుగుతుంది. రాముడు రాడు. లక్ష్మణుడు రాడు. అసలు అనిల కుమారుడేమైపోయాడో—ఎంతగ గుణవృద్ధుడైన విభీషణుడు రాక్షసుడే-నీవు అతని భార్యవు. మాయలు మీ స్వభావాలు గొంతుమార్చి అరచినందుకే తాటకాతనూజుడు చావు తెచ్చుకొన్నాడు" అంటూ కోపగించి కన్నీళ్ళ చెక్కిళ్ళను తడిపేస్తుంటే మరల ఆత్మహత్యా ప్రయత్నం చేయబోయింది ధరాజాత.

చేసిన తప్పుకు, పశ్చాత్తాపపడి సీత పాదాలమీద వ్రాలిపోయింది సరమ. "రాముని పదమాన! తల్లి! విను మోసము సేయ తలంపులేదు" అంటూ క్షమాపణ చెప్పుకొని, రావణ విభీషణుల భేదాభిప్రాయాలు, రామవిభీషణసమాగమాది వృత్తాంతాల్ని విశేషంగా వర్ణించి సీతను సంతోష స్వాంతనొనర్చుతుంది.

"విప్పుల గుండమున్ వదలి నిర్మలశీతలపల్వలంబులో
నప్పుల దూకిన ట్లతిరయమ్మున లంకను వీడి బంధమున్
విప్పిన దూడ గోవుకడ విర్చినరీతి నతండు సేరి, శ్రీ
లొప్ప సలక్ష్మణుండగు రఘూద్వహుడున్న పవిత్ర సీమకున్" (57 ప)

బంధాలు విప్పుకొన్న ఆవుదూడ తల్లి దగ్గరకు పరుగెత్తినట్లు రావణుని వీడిన విభీషణుడు రాముణ్ణి చేరాడు. అంతేకాదు "జనకుని వీడి లక్ష్మణుడు స్వామి సపర్యకు జేరినట్లు నా పెనిమిటి కూడ నగ్రజుని వీడె"1 అంటుంది సరమ. "పితామహా దీయమాన పావన వరదాన లబ్ధ భగవన్మయభావన" అనడంలో "పరమా పదగ్గతస్యాపి ధర్మే మమ మతిర్భవేత్"2 అని పితామహుని వేడుకొన్న విభీషణునకు "ధర్మిష్ఠ! త్వంతథావత్స, తథాచై తద్భవిష్యతి" అని వరమిచ్చిన పితామహుని పల్కులు ధ్వనిస్తున్నాయి.

---

1. సరమ-60 ప

2. ఉత్తరకాండ-12-28.

3. " 12-30.

ఆధ్యాత్మ రామాయణాదుల్లో కన్పించే భావాలు రావణుని ప్రస్తావించే సమయంలో ఈ కావ్యంలో కన్పిస్తాయి. అసలు శ్రీ మహావిష్ణువు మొదటి నుండి రాక్షసులు వున్న ప్రదేశానికేవచ్చి వారిని సంహరించి మోక్షాన్ని ఇచ్చాడే కాని ఏ ఒక్కసారి మునులవలె రాక్షసులు హరివద్ద లొంగలేదు. అది తత్త్వ రహస్యము.

"ఒక్కఁడు చేపగా నలిపె - నొక్కఁడు కూర్మమొనర్చి, ఘోణిగా
నొక్కఁడు మార్చె జేసె మృగమొక్కఁడు - చిప్పను జేతికిచ్చి నా
దొక్కఁడహో! శ్రియఃపతికె" 1

అన్న చమత్కారం రమణీయం. అల్లరి పనులు చేసే కొడుకుని తండ్రి కాదని త్రోసి వేయలేడు గదా! ఆయన ఆరాటం ఆయనకుంటుంది. ఇదే పరమాత్మకు వుంది. ఆయనే వెతుక్కుంటూ వస్తాడన్న నమ్మకం రావణునిది. అందుకే - రావణుడు

"ఎందుల కీ జితేంద్రియత? యెందుల కీ తప, మెందు కీ వ్రతా
లెందుకు ధర్మవృత్తి? మన కెందుకురా యిటువంటి నిష్ఠలా
యిందిర భర్త? తానె మన యింటికి వచ్చునురా! విభీషణా!
సందియ మందబోకుము నిశాచరకీర్తిని నిల్పరా యనున్" 2

"నిశాచర కీర్తిని నిల్పరా" అన్న పలుకుబడి ఈ పద్యంలో కొసమెరుపు. రావణుని రాజసానికి తగిన స్థాయిలో కుదిరిన పదం అది.

రాజును చూడాలంటే రాజకుమారుణ్ణి కొట్టినట్లుగా రాముణ్ణి చూడాలనే ఆరాటంలో రావణుడు సీతను అపహరించి తీసుకొచ్చాడేగాని-వేరుకాదు; అంటుంది నరమ. సీతకు మరల విభీషణ శరణాగతి - రాముని ఔదార్యాలను వర్ణించి చెపుతుంది. ఈ పాత్రను వాల్మీకి కూడ యింతవరకే వినియోగించుకున్నారు. కవి గుడిమెళ్ళ సైతం కొంత స్నేహ వాత్సల్యాల్ని ఇనుమడింప చేసినా-తిరస్కరిణి విద్య గల రక్కసిగ - సముద్రతీరమందలి విషయాలను సీతకు తెల్పి ఓదార్చటానికి అవకాశం తీసుకొన్నారు. రామకధా వర్ణన కొంచెం మిక్కుటమయిందీ భక్త కవి రచనలో, అది సహజమే.

"వంకదుద్దు శరణార్థి"వలె వచ్చిన విభీషణుని సుగ్రీవాదులు శత్రువుగా భావించి - నివారించినా తుదకు రాముడు వారలందరినీ సమాధాన పరచి, ఆనాడు శూర్పణఖ చెప్పిన మాటలు గుర్తు చేసుకొని, విభీషణునకు అభయమిచ్చాడు. ఈ సమయంలో పలురకాల ధర్మసూక్ష్మాలు ప్రచలితమౌతాయి రాముని గొంతుకలో.

1. నరమ - 67 ప. 2. నరమ – 70 ప.

అంగదాదులు సైతం సుగ్రీవుని మాటను సమర్థించి విభీషణుని శత్రువుగా భావిస్తున్న సమయంలో వాయుతనూజుడు"అనేకశాస్త్ర సంస్కారముచేత, ధర్మముల సాక్ష్యం మెఱుంగుటచేసి"1 విభీషణాగతికి గాలము, దేశము యోగ్యమే అంటాడు. "సంస్కార సంపన్నో హనుమాన్ సచివోత్తమః"2 అను వాల్మీకి వాక్యాల్ని వ్యాఖ్యానిస్తూ "సకల శాస్త్రార్థజ్ఞాన జనిత సంస్కారయుక్తః" అన్నారు గోవింద రాజీయులు. ఆ భావనే సంస్కార పదేశమైన తెలుగుకవి వాక్కుల్లోను వాసిస్తుంది.

"నీకడ ధర్మసూక్ష్మమున్ దెలుపగ నేనెవండ" "దేవరచిత్తము వచ్చినట్లుగా సలుపుడు" అంటూ తప్పించుకుంటాడు హనుమంతుడు రామచంద్రునిముందు—శరణాగత తత్త్వాన్ని విశ్లేషింపవచ్చేసరికి.

అందుకే రఘురాముడు చిరునవ్వు చిందించాడు. కారణం కవి ఇలా విశ్లేషించాడు.

"స్వామి వశిష్టకౌశికుల సన్నిధి శిష్యుడు-లోకరక్షణ
ప్రేమనశంవదుండు కవిపెంచిన తండ్రి విశిష్ట కర్మలీ
లామహితాత్మకుండు-మిధిలాపతిమామయు తాన్వయంకృపా
ధాముడు న్యాసధర్మములతత్త్వము నాత దెరుంగకుండునే"3

న్యాసధర్మముల తత్త్వముల నెఱిగిన కృపాధాముడు రాముడు. అయితే వానికి పైన చెప్పిన విశేషాలన్నీ పోషకాలైనాయని భావించి, వారి ఉన్నతిని సైతం ప్రశంసించిన సారస్యం సరమది.

"నాటి స్వామ్యుపన్యాస రహస్య వైభవము"నుగూర్చి ప్రశంసిస్తూ " వీనిపై భరన్యాసము నేయునేవి యెపడైననుగాని కటాక్షపాత్రుడే"4 అన్న సరమ పల్కులకు వాల్మీకి సరమయే ఆధారం.

"మమా పితు వివిక్షాస్తి కాచిత్ప్రతి విభీషణం
శ్రోతు మిచ్ఛామి తత్సర్వం భవద్భి శ్శ్రేయసిస్థితై" 5

అని ప్రారంభించిన రాముని ధర్మశాస్త్రోపన్యాసం కవి ఈ సమయంలో—స్వామ్యుపన్యాస రహస్య వైభవము" అనే పల్కులద్వారా వాల్మీకి రాముని ఉదాత్తతను సరమ ద్వారా దర్శింపచేస్తారు.

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే।
అభయం సర్వభూతేభ్యో దదామేతద్వ్రతం మమ
విభీషణోవా సుగ్రీవ యదివా రావణస్స్వయమ్"6

---

1. సరమ—97 ప.
2. చతుర్వ్యాఖ్య పుట-1046
3. సరమ-107 ప.
4. సరమ—106 ప.
5. యుద్ధకాండ-18—2
6. యుద్ధకాండ-18-33, 34

ఇది రాముని శరణాగతికి చరమస్థానము. శరణుజొచ్చినవాడు రావణుడైనా అంగీక రిస్తానన్న రామచంద్రుని మహత్వం రామాయణానికి జీవగఱ్ఱ.

రాముని శరణాగత తత్త్వాన్ని కొనియాడుటకు కాక సీతనుసైతం నీకిది క్రొత్తయేమి జననీ! శరణాగతి రక్షణమ్ములో—

గైకొనినావుదారమగు ఖ్యాతి............1 అంటూ "విరాట్టు"యిన సీత ఔదార్యాన్ని, భక్తజన రక్షణలో 'తల్లి' ఉదారతను కొనియాడుతుంది. ఆ భర్తకు తగిన 'భార్య' వన్న కితాబునిస్తుంది. ఈ సమయంలో—

మిత్రభావేన సంప్రాప్తం............

దోషోయద్యపి తస్యస్యా...........2అన్న శ్లోకంలోని రెండు పాదాలు

మిత్రుని కాని కాడనని మిత్యని వైఖరిగా నటించినన్........3

దోషములుండ నిమ్మెవరి దోసము వారిది...........4

రెండు పద్యాలుగా రూపుదిద్దుకొన్నాయి. అంతేకాదు—

"పిశాచన్ దానవాన్ యక్షాన్........—"3 అని రాముడు సుగ్రీవునితో పల్కిన పల్కులు.

"ఏటికి సంశయమ్ము-భయమేల? పిశాచనిశాచరాదు లీ
గోటికిసాటిరారు కొనగోటున మీటెద నిచ్చయున్న యీ
లాటిపరాంగగా ప్రణయలంపటులన్ హతమార్చకున్న, మీ
బోటి మహానుభావులకు బూర్తిగ శాంతి లభించకల్గునే?"6

అంటూ నరమ సీతతో పల్కడం తెనుగుకవి వ్యక్తిత్వం. ఇందులో "ప్రణయ"మనే పవిత్ర పదాన్ని రావణుని పరం కావించి, కలంకం చేకూర్చారనిపిస్తుంది.

"న సర్వేభ్రాతరస్తాత భవంతి భరతో పమాః" 1,7 అన్న శ్లోకం

"భరతునివంటి సోదరుడు-భానుకుమారునివంటి మిత్రుడున్ దొరకడు....8 అనే పద్యంగా రూపొందింది. "సుహృదోవా, భవద్విధాః" అన్నపదం "భానుకు మారుని వంటి మిత్రుడున్" 10 అన్న తెనుగింపు బాగానే ఉన్నది.

ఈ విధంగా ఎన్నో శ్లోకాలు తెలుగులో పద్యాకృతి వహించాయి.

---

1. నరమ-109 ప.
2. యుద్ధకాండ 18-3
3. నరసు-110 వ
4. నరమ-111 ప.
5. యుద్ధకాండ-18-23
6. నరమ-115 ప.
7. యుద్ధకాండ 18-15
8. నరమ-117 ప.

సరమ ప్రవేశానికి ముందే జరిగిపోయిన యావత్సన్నివేశాన్ని ఈ లఘుకావ్య రచయిత సరమ ప్రవేశానంతరం జరిగినట్టు ఆమె చేతనే చెప్పించటం "సరమ" పాత్ర ప్రాధాన్యాన్ని ఇనుమడింపచేసింది. "సరమ" అదృశ్యంగా ఆకాశమార్గంలో నుండి రావణుని చర్యలను గమనించి సీతకు చెప్పినట్లు, సీత ప్రార్థించగా "సరల" అదృశ్యంగా వెళ్ళి రావణుని రహస్యాలను కనుగొని వచ్చి చెప్పినట్లు వాల్మీకము. కాని "శరణాగతి" అంతకు పూర్వము జరిగిపోయింది. దానిని కూడ కవి ఈ సన్నివేశానికి కలిపి సరమ పాత్రను సమగ్ర దర్శనంగా సిద్ధం చేశారు.

రాముని మాయా శిరస్సుని చూపి, ప్రలాపించి వెళ్ళిన రావణుని మాటలు విని దురపిల్లుమన్న జానకిని ఓదార్చుటకు సరమ వచ్చినట్లుగా మూలమునందుండగా, విభీషణ శరణాగతి, రామదండు అగమనాల గురించి అదృశ్యయై గాంచి సీతకు చెప్పినట్లుగా కవి చేసిన మార్పు రమణీయం. "నీవు లక్ష్మణుని అన్న విధంగానే రావణుడు నిన్ను అని ఉంటాడు. వాచిక దోషం వాక్కు చేతనే పోవును" అని సమర్థించిన సరమ మన తెలుగుకవి సృష్టి. అందుకే కోనమెరుపుగా "కాకినే బ్రతుకు బొమ్మనగా నితడెంత జానకీ" అనేస్తుంది. ఆ మహనీయుని శరణాగత రక్షణ అటువంటిది. ఉదాహరణగ కాకాసుర వృత్తాంతాన్ని గుర్తుచేసి, వాని చేష్టల ముందు పరుష వాక్యాల నిందించిన రావణుడు ఎంత? అన్న ప్రశ్న కైముత్యన్యాయ స్ఫోరకం. దూరంగా రామదండు ఆగమన కల కల ధ్వని వీనులకు సోకగా, ఆనందంతో "సరమ"ను కౌగిలించుకొన్న "రమా" పరిష్వంగతో కావ్యం ముగుస్తుంది.

అయితే మూలంలో "సరమా" పాత్ర ప్రవేశం వలన వాల్మీకి సాధించిన ప్రయోజనాన్ని తెలుగుకవి సాధించలేకపోయారేమో ననిపిస్తోంది. ఎందువలనంటే– రాముని శిరస్సు చూపి, వానర సైన్యమంతా నాశనమైందని ప్రకటించి సీతా హృదయంలో బడబాగ్ని జ్వాలల రేపి, మూలంలో రావణుడు వెళ్ళిపోగా– తన వల్ల నే పుణ్యాత్ముడైన రామచంద్రుడు మరణించాడని ఘోరున విలపిస్తున్న సీత చెంతకు– సరమను ప్రవేశపెట్టారు వాల్మీకి. మరణించాడనుకొన్న రాముని క్షేమం తెలపడమే కాకుండా రావణుని ఇంద్రజాల విద్యను తేటపరచి ఆమె హృదయానికి ఆనందాన్ని కల్గిస్తుంది వాల్మీకి సరమ. రాముని సముద్రతరణాన్ని గర్వంగా ప్రకటిస్తుంది. యుద్ధం జరుగబోతుంది. శుభం నిన్ను వరిస్తుంది. నా మాటలు నమ్మమని హామీ ఇస్తుంది. 2 ఇంతకన్నా ఏమికావాలి! నిరాశా నిస్పృహలతో నిండి "నా వంటి పాపిష్టిదాన్ని చేసుకోబట్టే ఆ పుణ్యాత్ముడు మరణించాడన్న 2 ఆత్మన్యూనతా భావాన్ని పొందిన సీతకు ఆత్మస్థయిర్యాన్ని కల్గించడానికి ఈ పాత్ర తోడ్పడింది వాల్మీకంలో.

---

1. యుద్ధకాండ- 18-19 సర్గ  2. యుద్ధకాండ- 32-28, 29

"శోకస్తే విగతస్సర్వః కల్యాణం త్వాముపస్థితమ్।

ధ్రువంత్వాం భజతే లక్ష్మీః ప్రియం ప్రీతికరం శృణు॥1

అన్న "సరమ" వాక్కులు సీత హృదయంలో అమృతజల్లులను కురిపించాయి. మరణోన్ముఖురాలైన ఆమెకు తిరిగి నూతోత్సాహాన్ని కల్గించాయి. ఈ భాగం తెలుగుకవి స్వీకరించలేదు. అంతేకాదు

"అభ్రుణ్యానందజాని త్వం వర్తయిష్యసి శోభనే

సమాగమ్య పరిష్వజ్య తస్యోరసి మహోరసః॥"2

"రాముని కౌగిలించుకొని అతని బిగికౌగిలిలో విశాలమైన అతని వక్షస్థలం మీద ఆనందాశ్రువులు రాల్చగలవు" అన్నభావం ఎంతో మధురమైంది. తెలుగు కవి ఎందువల్లనో ఈ భావాన్ని స్పృశించలేదు.

"ఎంతోకాలంగా చిక్కుపడి ఏకవేణిగా నున్న నీ శిరోజాలను శ్రీరాముడు చక్కదిద్దగలడు"3 వంటి భావాలు "తెలుగు సరమ"లో లుప్తం.

"సఖీస్నేహేన"అని సీతకై అదృశ్యగామినియైన ఈ "తెలుగుసరమ" వీని ప్రస్తావన కూడ తెచ్చి ఉంటే బాగుండేది. 'సీతా' అంటూ రాముని గొంతుకతో 'సీత'ను ఆటపట్టించగల చనువున్న "తెలుగు సరమ"కు పై రెండు భావాలు గల సన్నివేశాలు తప్పని సరిగా క్రొత్త సొగసులను కూర్చేవి. ఆకాశం మంచి వర్షాన్ని కురిపించి భూమికి ఆనందాన్ని కల్గించినట్లుగా రావణుని పల్కులతో దుఃఖిస్తున్న సీతకు "సరమ" పల్కులు తొలకరి జల్లులే అయినాయి.

అందుకే-

"అమృతము ద్రావినట్లు మలయానిల మల్లన సోకినట్లు పు

ష్పములను హాయిగా బయికి జల్లినయట్లు................4

సరమ పల్కులు చెవులకు సోక అనందించిన "సీత" సరమను కౌగిలించు కొంది. అప్పుడు రమాసహితయైన ఆ రక్కసి "సరమ" యైంది. రాముని కౌగిలి

1. యుద్ధకాండ - 33 - 14
2. యుద్ధకాండ - 33 - 33
3. యుద్ధకాండ - 33-34
4. సరమ - 132 వ

విభీషణునకు లభించగా సీతమ్మ కౌగిలి అతని భార్యకు లభించింది. వారి జన్మలు ధన్యమైనాయి. మింట దేవతలు వారి అదృష్టాన్ని కొనియాడారు. ఇది తెలుగుకవి సృష్టి. "సరమా ఇపుడైతివీవు సరమ వటంచున్" దేవతలు దీవించారు. సరమకు సీత కౌగిలిని వాల్మీకి లభింపజేశారు. కానీ "సరమ"నామ వ్యుత్పత్తి మాత్రం వేరుగా సంభవించినట్లు ఉత్తరకాండ చెపుతోంది.

"మానస సరోవర తీరంలో ఈ కొమార్తెను ప్రసవించిన ఈమె తల్లి వానలవల్ల పెరుగుతున్న సరస్సునీరు పసిబిడ్డ వద్దకు రావడం చూచి "సరోమా వర్ధయ"3 అని పల్కగా ఆ పదమే ఆ శిశువుకి పేరుగా నిలిచింది."

ఏమైనా "సరమామృదుభాషిణి" అన్న వాల్మీకి విశేషమే – సీతకు సరమా స్నేహాన్ని సరమకు సీత కౌగిలిని ప్రాప్తింపచేసింది.

ఏవం విధంగా మూలానికన్న ఒక్కచో న్యూనంగా కనిపించినా "సరమ" పదానికి తానిచ్చిన యోగికార్థానికి యోగ్యంగా శ్రీమాన్ గుదిమెళ్ళవారు సరమ పాత్రను రసపత్తరం కావించారు.

---

1. సరమ - 135 ప.
2. యుద్ధకాండ 32, 33.
3. ఉత్తరకాండ - 12-24.

## శాపము

శ్రీ రాముని పాదుర్భావానికి ముందు దశరథేశుని జీవితంలో సంభవించిన విచిత్ర విషాద సంఘటన-మునికుమార వృత్తాన్తం. ఇది రామవనవాసానంతరం కౌసల్యకు దశరథుని చేతనే చెప్పబడుతుంది. అరవై వేల సంవత్సరాలు రాజ్యపరిపాలన చేసి, సమస్త భోగాలను అనుభవిస్తూకూడా "పుత్రప్రాప్తి" లేక నిస్సారమైన జీవితంలోకి "వేట"ను ఆహ్వానించి, ఆదేవ్యసనానికి బానిసయై 'వేట' లోనే దివారాత్రాలు గడవసాగాడు అయోధ్యానాధుడు.

ఒకనాటి సాయం సమయంలో 'శబ్దవేది" విద్యను సాధనచేస్తూ, సరయూ తీరంలో మాతాపితలకు మంచినీటిని తీసుకెళ్ళడానికి వచ్చి, నీళ్ళు ముంచుకుంటున్న, "ముని కుమారుని" 'గజభ్రాంతితో' తన బాణానికి బలిచేశాడు. బిడ్డను కోల్పోయిన ముని మరణావసాన సమయంలో–దశరథుడు తనకు కల్గించిన పుత్రవియోగానికి దుఃఖించి-కోపించి-

"ఏవం త్వం పుత్రశోకేన రాజ! న్కాలం కరిష్యతి"

అని శపించి, సపత్నీయుతంగా మరణించి స్వర్గప్రాప్తినందాడు. ఆ శాపం పుత్రవిత హితుడైన దశరధునకు వరంగా పరిణమించి ఆనందించాడానాడు. రామ వియోగానంతరం ఆ శాపంలోని చరమాంశ దశరథుని ప్రాణాలు బలిగొంది. రామ వనవాసానికి కైక వరాలు ప్రధాన కారణంగా కనిపిస్తున్నా - ముని శాపమే ఇచ్చటప్రబలమైంది.

వాల్మీకి ఆ 'ముని బాలకుని తాపసుడని' 'తపోధనుడని' సంబోధించాడేగాని, నామకరణం చేయలేదు. అంతేకాక తాను బ్రాహ్మణుడను కాదని, శూద్రస్త్రీ యందు వైశ్యునకు పుట్టినవాడనని చెప్పుకున్నాడు2 వాల్మీకి మునిబాలకుడు దశరథునితో.

ఈ మునికుమార వృత్తాన్తం ఇతర గ్రంథాలలో వేరువేరు పేర్లతో వేరువేరుగా కన్పిస్తోంది. అగ్నిపురాణంలో "యజ్ఞదత్తుడ"నే3 పేరున ఈ కథ కన్పిస్తోంది. శ్రీమద్రామాయణ "పశ్చిమోత్తర శాఖీయపాఠం"లో, రంగనాథ రామాయణం లోను అదే పేరున ప్రస్తావించబడింది.

---

1. వాల్మీకం - 2.64.55
2. వాల్మీకం - 2. 63. 50
3. Puranic Encyclopedia-PP. 204

"In Agnipurana Chapter 6-it is stated that the name of this hermit boy was Yajnadatta".

తులసీదాసు "సరవన" అని మునిబాలకుని కథను ప్రస్తావించాడు. ఇది "శ్రమణ" శబ్దానికి వికృతి. "హిందీ శబ్దసాగర్" బౌద్ధమత సంప్రదాయంలో నుండి "శ్రమణ" కథ వచ్చి మనలో కలసి ఉండవచ్చని భావించింది."

ఇండో- ఆంగ్ల రచయిత్రి తోరోదత్తు" "సింధు" అనే పేరున పితృభక్తుని కథను ప్రకటించింది. మహాత్మాగాంధీ "శ్రవణపితృభక్తి" నాటకం చేత ఎంతో స్ఫూర్తిని పొందినట్లు ఆత్మకథలో వ్రాసుకున్నారు. "The book and the Picture left an indeliable impression on my mind". Here is an example for you to copy"I said to myself the agonised comment of the parents over Sravana's death is still fresh in my memory"2 "శ్రవణ" "శ్రావణ" శబ్దాలు సమాన అర్థకాలుగా ప్రయోగించబడ్డాయి.

ఈవిధంగా రామాయణ సాహిత్యంలో నామమాత్రంగా కనిపించిన ముని కుమారుని వృత్తాన్తం పలుకీతుల చిగురులు తొడిగి అద్భుతేతివృత్తమై ఎందరో ఆదర్శ పురుషులకు ఆదర్శప్రాయమైంది. "Sindhu" deals with the eternal theme of Parental love" అన్నారు విమర్శకులు. 3 "పితృభక్తి"కి ప్రతీకగ శ్రావణుని చెప్పడం సాహిత్యంలో సహజమైంది. "కావడి"లో తల్లిదండ్రులమోస్తూ పితృభక్తి పరాయణుడుగా తీర్థయాత్రలు చేయించే శ్రావణుడు చదువరులకు ప్రత్యక్షమౌతాడు. కానీ ఇది వాల్మీకి సృష్టికాదు. "శ్రావణపితృభక్తి" శ్రావణ చరిత్ర" "శ్రావణము" వంటి కావ్యాలు రచించిన కవుల ప్రయత్నఫలితమే.

"శ్రమణ" శబ్దమే "శ్రవణ"గా రూపాంతరం చెందినదని, "శ్రమణ" వృత్తిలో జీవించే మునికుమారుని వృత్తం శ్రావణ చరిత్రగా మారిందని-కొందరు భావిస్తే దశరథుడు వేటకై వెళ్ళింది వర్షాకాలం-అనగా శ్రావణమాసం. "ఈశ్రావణ నామానికి, ఆ శ్రావణ మాసం ఏమాత్రమైనా దోహదము చేసినదేమో అని అర్థోక్తిలో వదలివేశారు శ్రీమాన్ రాళ్ళపల్లివారు."4

---

1. శ్రావణము–పీ. III
2. The selected works of Mahatma Gandhi-vol.1-P.8
3. Toru Dutt-A. N. Dwivedi–PP.107
4. శ్రావణము-పీ. III

"విఠికిఠి" అనగా శ్రవణ ప్రధానమైన అస్త్రవిద్యతో–అనగా "శబ్దవేధి"తో కొట్టబడిన మునికుమారుని కరుణామయ గాథ "శ్రావణమై" ఆ మునికుమారుకు శ్రవణుడుగా–శ్రావణుడుగ మారిందని భావించవచ్చు. ఆధారాలు లేనప్పుడు కల్పనలు, అధికమవడంలో ఆశ్చర్యంలేదు. ఏమైనా శ్రావణుని చరిత్ర పితృభక్తికి ప్రతీక.

శ్రీ గొట్టుముక్కల రామకృష్ణ కవి-కవికులతిలకుని మేఘ సందేశ యక్షుని శాపానికి శ్రావణుని కథను ముడివేసి అద్భుతంగా స్వర్గభూతలాలకు నిచ్చెనవేస్తే "శ్రావణ పితృభక్తి" గుజరాతీ నాటక ప్రేరణతో శ్రీ అంబటి సుబ్బరాయ గుప్త "శ్రావణ చరిత్రి" కావ్యాన్ని అందించారు."పితృభక్తి"గా చింతలపాటి వారి కావ్యం రూపుదాల్చింది.

# గొట్టుముక్కల వారి శ్రావణము

శ్రీ గొట్టుముక్కల "శ్రావణం"లో సాహితీసృష్టి మూడు ఖండాలుగా వర్ణించింది. పూర్వఖండం, మధ్యమఖండం, ఉత్తరఖండంగ వేరుచేసారు కావ్యాన్ని. పూర్వఖండం అలకాపురీ ప్రాంతంలోను, మధ్యమఖండం భూమిమీద, మధురాపురం ప్రాంతంలోను, తిరిగి ఉత్తరఖండం గంధర్వోద్యానంలోను తన సాహితీ వర్షాన్ని కురిపించి మనఃకేదారాల్ని ఆర్ద్రీభూతం చేస్తాయి.

అలకాపురీ చైత్రరథోద్యానంలో "యక్ష సామ్రాజ్యయౌవరాజ్యాభిషేక కుశలశీవనుష్ఠిన" నలకూబరుడు-"విలాస ప్రౌఢ గాంధర్వ కౌశల సమ్మానిత దివ్యనర్తన కళాసర్వజ్ఞ" యౌ ఊర్వశి వెంటరాగా పూపొదల, పచ్చికల, పూసెజ్జల, మితిమీరిన కోరికతో విహారాలు సాగిస్తున్నారు. ప్రకృతి పులకించి, పంచమస్వరాల్ని ఆలాపిస్తూ, సుమమంగళాక్షతల జల్లుతోంది, వారిరువురి విహారాలు అనంతమైన హాయిలో కొనసాగుతున్నాయి.

"ఒడలు నొదల్ సతం బొరయుమంద దృఢంబగు బాహుబంధనం
బడరగ స్పర్శనిర్వృతి యనంతముగా సకలేంద్రియంబులం
బొదమగ సాత్త్వికోదయవిముగ్ధవిలోచనమై క్రమంబుగా
నడచిరి పూవుపూవున గనంబడు క్రొత్తదనంబు మెచ్చుచున్"1

పూలను చూస్తూ ముచ్చటలాడుకుంటూ నడుస్తున్న వారికి నందివర్ధనం కన్పించింది. మదిలో కోరికమెదిలింది ఊర్వశికి. అరమోడ్పు కనులతో ప్రియుని మెల్లగా కౌగ

1. శ్రావణం-పూర్వ-వ. 13

లించుకొని ఆ పువ్వు కావాలని గోముగా అడిగింది. ప్రియురాలి మక్కువ తీర్చడానికి చేతిని ముందుకు జాపాడు నలకూబరుడు. వెంటనే వలదని ప్రార్థించాడు ఉద్యానవన రక్షకభటుడు. శివరాత్రిని పురస్కరించుకొని శివపూజకు పితృదేవులు ఆపూవుల్ని ఉంచమన్నారు-వారికి కోపమొస్తుందన్నాడు. బ్రతిమాలాడు.

సఖీ శుభసన్నిధిలో ఒక సేవకుడు తన్ను విరోధించడం అవమానమైంది.- "శుంఠ! మదించి మైమరచి కూయకురా, యిట నాకుకూడ నాటంకమె" అంటూ దవ డలు వగులగొట్టి ప్రక్కకు నెట్టేశాడు నలకూబరుడు. ముచ్చటగా పూవును కోసి ప్రియురాలి సిగలో తురుమబోతుండగా, పంచాక్షరి ప్రణవనాదంతో చేతిలో పూ పెజ్జతో ప్రత్యక్షమయ్యాడు కుబేరుడు. ఉలిక్కిపడ్డారు ఊర్వశీ నలకూబరులు.

కుమారుణ్ణి అతని ప్రియురాల్ని దెబ్బలుతిని దూరంగా పడి ఉన్న రక్షణో ద్యోగిని చూచి పరిస్థితుల్ని ఆకళింపుచేసుకొన్నాడు. కోపం ఉగ్రరూపం దాల్చింది. కామపరతంత్రతతో వేశ్యలవెంట తిరగడమే కాక, కావలావానిని కొట్టి, తన ఆజ్ఞను సైతం ధిక్కరించడంతో కోపం శాపంగా మారింది.

"పొమ్ము నీ హద్దులేని స్త్రీమోహ మింత
సాగిరానీని యాతనాజలధిలోన
మునిగితేలుచు సుఖపరిస్ఫూర్తి లేక
జగతి జనియింపు మొక బ్రహ్మచారి వగుచు"2

అని కుమారుని శపించడమేగాక, ఊర్వశీ సహవాసం మూలంగా శైవాచార పర త్వాన్ని వదిలివేసి, శివాపచారాన్ని చేశాడని ఆగ్రహించి—

"పొమ్ము జనియింపు మొకరాజపుత్రి వగుచు
వసుధ ననురూపభర్తృలాభంబు లేక
యౌవనం బెల్ల వ్యర్థమై పోవునట్లు
కన్యకవుగానే యుండువుగాక చిరము"3

అంటూ ఊర్వశిని సైతం శపించాడు కుబేరుడు. శాపాలకు తల్లడిల్లిన ప్రియా ప్రియులు మూర్ఛిల్లి పెక్కుకాలానికి తెప్పరిల్లి, ధనదుని క్షమింపవేడుకొన్నారు. ఉప శమించిన కోపంగల తండ్రి "దశరథుని బాణహతి" మోక్షంగా నిర్దేశించాడు కుమా రునకు-

1. శ్రావణము-పూర్వ-ప. 21
2. శ్రావణము-పూర్వ-ప. 34
3. శ్రావణము-పూర్వ-ప. 36

"ఊర్వశీ! పూర్వతను వీత డొందు వెనుక
నితని మరణంబు దలచుచు నేడ్చి యేడ్చి
జీవితము రోసి యగ్గిపా ల్జేసి మేను
నిజశరీరము గాంతువు నీవు గూడ"1

అని ఊర్వశికి శాపవిమోచన. అవనత శిరస్కులై చైత్రరథాన్ని దాటారు ఊర్వశీ నలకూబరులు. ప్రకృతి విలపించింది, కొమ్మలు కన్నీరు కార్చాయి, క్రీడా సరస్సుల్లోని పూవులు తలలువాల్చి విలపించాయి.

ధర్మదేవత మూడుపాదాలతో చరిస్తున్న బంగారు దినాల్లో—మధురానగరంలో విశ్వనాధుడనే వైశ్యప్రముఖుడు అతిథి పూజైక క్రియాతత్పరుడై దానధర్మాలతో ఖ్యాతిపొందాడు. ఆతని ఇల్లాలు ఆతనికి ఉద్దికయినది. అతిధి మర్యాదల్లో భర్తకు సహాయం చేయడమే ఆమెకు మక్కువ ఎక్కువ. "చేయిమున్గిన సిరిగల" స్త్రీ అయినా ఏనాడు భర్తను నగలు అడగని ఆడదియామె.

వారిశీలాన్ని మెచ్చనివారుగాని, వారి ఇంటి అన్నాన్ని తిననివారుగాని, వారి దానాన్ని అందుకొనని వారుగాని, లేని ఆదంపతులకు సంతానం లేదనే వేదన కుంగదీస్తోంది.

"పొరుగింటి పాప నిద్దురవోక తల్లిని
నిదురింపనీక దండించునపుడు
తమయింటి దాసి గర్భము దాల్చి ప్రసవించి
కొడుకుచెక్కిలి ముద్దు గొనిన యపుడు
బడిపిల్ల లుత్సాహభరితులై గంతులు
వేయుచు నిండ్లకు వెడలునపుడు"2

తమ శూన్యగృహాన్ని చూచి విలపించెడివారు వృద్ధదంపతులు. వారి వేదన దయాహృదయుడైన మహాదేవుడు ఆలకించాడా—అన్నట్లు

"ఆమె కేబది, యతనికినరువది, యగు
నేట నోములపంటయై కోటిసూర్య
భాసమానుడై ................"3

---

1. శ్రావణము - పూర్వ - 42 ప. 3. శ్రావణము -మధ్యమ-19 ప.
2. శ్రావణము - మధ్యమ - 17 ప.

మోహనరూపుడు ప్రాదుర్భవించాడు. విశ్వనాధుని ఇంటిలో సంతోషపు జడివాన కురిసింది. జీవితం ధన్యమైనట్లు భావించారు వృద్ధదంపతులు. అంతేకాదు. ధన్యులలో అగ్రగణ్యుడయ్యాడు. జాతకకర్మాదుల వేదోక్తంగా జరిపించి, "శ్రావణుడని నామకరణం చేశారు. విద్యలలో అగ్రగణ్యుడై, పితృదేవతలే దైవంగా భావించె, పరమర్షిగా రూపొందాడు శ్రావణుడు బ్రహ్మచర్య దీక్షను నిర్వర్తిస్తూ, విజ్ఞులవద్ద శ్రుతులనధ్యయనం చేస్తూ పితృసేవాదీక్ష సాగిస్తూ అన్నదానంలో తల్లికి సహాయం చేస్తూ, సర్వసుగుణాసీక ప్రియం భూష్ణుడై కీర్తిగడించాడు శ్రావణుడు.

"పనికిమాలిన జీవితపథమునందు
దేనిసాధింపవలయునో, దేనివలన
మానవత్వము చరితార్థ మౌనొ, దాని
నెపుడు సాధించుకొన నుత్సహించునతడు"1

"పితృదేవోభవ! అన్న సర్వశాస్త్ర సారాన్ని మననం చేసుకొనే అతనిని చూచి విజ్ఞులు మెచ్చుకొనేవారు. "పితృపదార్చన కన్న నీక్షితిని తృప్తి యన్యమే" మనెడి అనుభవసారం అతని జీవితమార్గాన్ని మార్చింది. కుమారుడు పెద్దవాడై పది మందిలో పేరుపొందడం వృద్ధ దంపతుల హృదయాల్లో ఆనందవార్ధిధులు ఉప్పొంగాయి.

రాజుచేసిన పాపమో, ధర్మలోపమోగాని దేశంలో కరువురక్కసి కరాళ నృత్యం ప్రారంభించింది. అన్నమేకాదు, నీరుసైతం దొరికే రోజులు గతించాయి. చల్లనిగాలి, గుక్కెడు నీరు మరచిపోయింది ప్రజ.

"కలవా రెందరో గుండెనిబ్బరముతో "గానిమ్ము మావంటి వా
రలకే" మంచు చరించు కాలము గతార్థం బయ్యె, నవ్వారి పె
ట్టెలలో మూల్గెడి స్వర్ణఖండతతి యట్లే యుండగా నింత యం
బలి కైనన్ గతిలేని రోజులును సంప్రాప్తించె జిత్రంబుగా"2

'ఒంగారం తిండి పెట్ట' దన్ననానుడి నిజమయ్యింది. "కలవారు" సైతం "కల్లో, గంజో శాగే స్థితి వచ్చేసింది. ఈ సమయమందలి వర్ణన ధూర్జటి కవీశ్వరుని శ్రీకాళహస్తీశ్వరుని వృత్తాంతమందలి కాటక వర్ణనను జ్ఞప్తికి తెస్తోంది. ఈ భాగం ప్రబంధ సాహిత్యానికి దీటుగా నిల్చిందంటే ఆశ్చర్యం లేదు.

---

1. శ్రావణము - మధ్యమ - 32 ప.
2. శ్రావణము - మధ్యమ - 5 ప.

దేశమంతా కరువు రక్కసి కరాళదంష్ట్రల్లో చిక్కుకొని విలపిస్తుంటే-అన్న పూర్ణా విశ్వనాథులు మాత్రం నిర్నిరోధంగా విరామాన్న దీక్షను కొనసాగించారు. రేపు మాపులుతండోపతండాలుగా! 'అన్నార్తులకు' మృష్టాన్నాన్ని అందించిన పుణ్యదంపతు లైన వారికి తోడునీడగా నిల్చారు పుత్రశ్రావణుడు-నివాసాలు లేనివారికి విశ్వనాథుని మేడలు అతిథిగృహాలైనాయి. కలికి, గంజికి, మొహం వాచిపోయిన పేదలకు మృష్టా న్నాలు లభించాయి. ధనం తరిగిపోతున్నా, పరమానందంతో ద్వాదశవత్సరాలు అతిథి సేవ, అన్నదాన వ్రతం కొనసాగాయి. ఆకలితో ఆగూటివి చేరినవారేగాని, తిరిగి వెళ్ళినవారులేరు అయినా ఆ దంపతులనోటగాని,కుమారుడుగాని ఏనాడు"అస్తి నాస్తి" అన్న మాటలేకుండా సేవచేశారు.

''సంతత మర్థిసంతతికి "జా" లనుపింపధలంచు దీక్షయై
కొంత క్షుధార్తమౌ నతిథికోటికి "పప్పును బాయసమ్ము" గా
గొంతయు................"2

వంటి పద్యాల్లో " అముక్త మాల్యద" విష్ణుచిత్తుని "గేహసీమ" దర్శనమిస్తుంది. తల నొక గుర్రెక్కుడుగ, ఆ మహనీయుని ఆస్తిని హరింపజేశారు దేశంలోని వారందరు. "భాగ్యలక్ష్మి" వారిని వదిలేసింది. తాకట్టులో గృహరామాలు మునిగిపోయాయి. శరీ రంలో జవసత్వాలుడిగిపోయాయి. వృద్ధాప్యంవల్ల చూపుమందగించి, పూడిపోయింది.

"ధనము నిల్వకు ననుభవమ్మునకు గూడ
తగదు, దానమె ముఖ్యకర్తవ్య" మనుచు
ధనికులకు గన్ను దెఱపించు పనులకిపుడు
ధనముతో పాటు కఱవయ్యె గనులుగూడ"3

కాని అతిథులాగమనం మాత్రం తగ్గలేదు.కన్నులులేని తల్లిదండ్రులు, ప్రవాహంగా వస్తున్న అన్నార్తుల-ఆర్థికమాంద్యం-కష్టాల్లో కూరుకుపోయాడు శ్రావణుడు. భాగ్యో దయ చిహ్నాలు గగనకుసుమాలై, రాటోయే కష్టాలు శరపరంపరలుగా గోచరించాయి.

అతిథులందరూ విద్రించిన తరువాత పాదసంవహనం చేస్తున్న పుత్రునితో మనసులోని వేదనను వెలిబుచ్చారు తల్లిదండ్రులు. కన్నులుపోయిన వేదన, లక్ష్మి వెళ్ళిపోయినబాధ, కుమారుని పెండ్లి ప్రస్తావన తుదకు అతిథిసేవకు వలసిన సంభా రాల కొరత,-మాటల్లో దొర్లిపోయాయి. దుఃఖిస్తున్న తల్లిదండ్రుల్ని ఊరడించాడు శ్రావణుడు.

1. శ్రావణము - మధ్యమ - 2. 8 ప.
2. శ్రావణము - మధ్యమ - 2. 26 ప.
3. శ్రావణము - మధ్యమ - 2.21 ప

"ఉంటిని మీకు విద్వరకు నుమ్మడి కన్నుగ నేను"-అంటూ ఓదార్చి, పూవుల మ్మిన చోటున కష్టలమ్మలేని స్థితిలో, ఉన్న ఊరులో భిక్షాటనచేయలేక, గ్రామాల తరానికి బయలుదేరాడు తల్లిదండ్రులని కావడిలో నుంచుకొని శ్రావణకుమారుడు.

అర్ధరాత్రి లోకమంతా నిద్రపోతున్న సమయంలో ఇల్లువదిలాడు శ్రావణుడు. రాత్రికిరాత్రి ఊరుదాటి, పురోద్యానందాటి వేగంగా ప్రయాణించాడు శ్రావణుడు. తల్లి దండ్రుల కావడిలో నుంచుకొని కావడింపగ నడుము బిగించిన కుసుమ సుకుమారు డైన పుత్రుకుని తలచుకొని అంధనేత్రాలు అశ్రుపూరితాలైనాయి.

ఊరులు పల్లెలు గడుస్తున్నాయి. చూసినవారిలో జాలిపడేవారు కొందరు, దగ్గర్లో నున్న విశ్వనాధ దంపతుల నాశ్రయించి ఆవాసాన్ని గడుపుకోమని వారికే వారి దాతృత్వాన్ని వర్ణించి చెప్పేవాళ్ళు· శ్రావణుని పితృభక్తిని అతనిముందేపొగడి కీర్తించే వాళ్ళుగా పలుమంది తారసిలుతుంటే-దారిద్ర్యంలో కూడా ఆనందాన్ని అను భవిస్తూ, పయనిస్తున్నారు. లక్షలు గ్రుమ్మరించి దీన సంతానాన్ని రక్షించినకుటుంబం ఈ రోజు "భిక్షాందేహి" యని వీధుల్లో భిక్షాటనం చేసుకొంటూ, తీర్థయాత్ర నెపంతో సంచరిస్తూ-జ్యోతిష్మతీపురాన్ని చేరారు.

"అతని దివ్య తేజము శతాధికమై పసమించె నాటి ప్రా
భాతికవేళ, లోకములపై నెసరేగిన యంధకార మన్
మూత దెమల్చుచుం బసిడిపూతల బెట్టిన బాలభానుదే
పీ్రతి బ్రినన్నుడయ్యె నవిపించె బురీజనచిత్తసీమలన్"

హారతులిచ్చేవారు, హారాలు వేశేవారు, పాదాలపై భక్తి ప్రపత్తుల ప్రణమిల్లేవాళ్ళు నయి, రాజవీధిలో అడుగడుగున అడ్డుపడుతున్న పౌరజనుల కన్నెత్తి కూడ చూడక నత్రంవైపు ప్రయాణించసాగాడు శ్రావణుడు. తల్లిదండ్రుల మార్గాయాసాన్ని పోగొట్టాలనే తపన అతనిది.

రాచభవాన్ని ఉద్యానవనాన్ని దాని సమీపంలోని కన్యాంతఃపురాన్ని దాటి "గమ్య గమనోత్కంఠాపరాధీనుడై" వేగంగా నడుస్తున్నాడు వైశ్యకుమారుడు అదే సమయంలో పరిచారికలు సేవిస్తుండగా, లే యెండలోని సౌందర్యాన్ని వీక్షిస్తూ సౌధాగ్రభాగానికి చేరుకోంది ఆదేశపు రాచకుమార్తె ఇందిరాకన్య. చూపుల్నివీధివైపు మరల్చింది.

---

1. శ్రావణము - మధ్యమ - 4. 2 వ

పరధ్యానంగా వీధివైపుకి చూసిన ఆమెకు విశ్వమోహనరూపుడై శ్రావణుడు దర్శన మిచ్చాడు.

"అదగె మనసున సర్వేంద్రియ ప్రవృత్తి
మనసు విస్తబ్ధమై సోగకనుల నడగె;
గన్నులా బ్రహ్మచారి మార్గమ్ము బట్టె
నామెదేహము పరవశ మయ్యె నిట్లు"1

మనసు విస్తబ్ధమై, శరీరం నిశ్చేష్టమైపోయింది. ఆమె చూపులు కలువపూలమాలలై కొన్ని అతని కంఠాన వ్రాల, మరికొన్ని పూలవానలై అతని శిరసున కురిశాయి. చెలిక త్తెలను పంపించింది. ప్రేమబీజాలు మదిలో మొలకెత్తి, శరీరంపై పులకలు జనించగా. "వర్వులెట్టవెవాని వెంటనె" యని యాజ్ఞాపించింది. బిచ్చగాడైన అతన్నే పతిజయమాడతానని మొండికేసింది రాచపడుచు. "అతని వాల్లభ్యంలోనే తన బ్రతుకు పండించుకొంటానని స్పష్టం చేసింది"

ఆమె కోరికపై రాద్ధాంత సిద్ధాంతాలు రాచనగరులో చెలరేగాయి. తుదకు పరివారం దారిచూపగా, మయూరుడనే మంత్రిశేఖరుడు మహారాజాహ్వానాన్ని సత్రంలో ఉన్న శ్రావణునకు అందించాడు ఆశ్చర్యపోయాడు శ్రావణుడు. రాజుగారికి నాతో పనేమిటి? వృద్ధులైన మాతాపితరుల తీర్థయాత్రాభిలాషతో దేశాటనం చేస్తున్న నాతో రాచకార్యమేమి? అంటూ ప్రశ్నించాడు.

"అతడొక సార్వభౌముడు మహామతి, నేనొక బిచ్చగాడు' అంటూ తన భిన్నత్వాన్ని ప్రకటించి, అంధ పితృసేవనమేగాని, ఇతర విషయాల్ని నామనస్సంగీకరింపదు. అంటూ రాజాహ్వానాన్ని తిరస్కరించి, తుదకు పిత్రాజ్ఞకు శిరసొగ్గి అంతఃపురానికి బయలుదేరాడు.

రాజ్యసభలో రత్నఖచిత ప్రత్యగ్రసౌవర్ణ పీఠాసీనుడయిన రాజు బ్రహ్మచారిని, సాదరంగా ఎదుర్కొన్నాడు. మర్యాదలు పూర్తయిన తరువాత పిలిపించడానికి కారణమడిగాడు శ్రావణుడు. ఆలస్యమైతే గ్రుడ్డివారయిన తల్లిదండ్రులు ఇబ్బంది పడతారు. ఆజ్ఞ ఏమిటో సెలవివ్వండనుచున్న శ్రవణుని వినయ సంపదకు ముగ్ధుడైన మహారాజు మాటల మధ్యలో వివాహ ప్రస్తావన తీసుకొచ్చారు. "ఈ శేత్రాతుము మీఱబెట్టితివి విన్నేమందు నయ్యారె:"1 అంటూ వయసు దాటుతున్నా వివాహమెందుకు చేసుకోలేదని ఆశ్చర్యాన్ని అనురాగాన్ని మిళితం చేసి ప్రశ్నిస్తున్న రాజుమాటలు విని ఆశ్చర్యపోవడం శ్రావణుని వంతయింది.

---

1. శ్రావణుము-మధ్యమ 4-45 ప.

2. శ్రావణుము-మధ్యమ 5-18 ప.

"ధర"సంసారము సౌఖ్యపూర్ణ" మని సిద్ధాంతమ్ముగా జెప్పువా
రరుదయ్యా జడతన్ గతానుగతికన్యాయంబునన్ సర్వదా
పరతత్త్వైకవిరోధకం బగు సుఖాభాసంబు వాంఛించి దు
ర్భరమౌ నాపద కోరె తెచ్చుకొనుదైర్యం బింత లే దో ప్రభూ!" 1

అంటూ సంసారసాగరంలోని కష్టాలను వేర్పరచి, ఆత్మనిశ్చయాన్ని దృఢంగా ప్రకటించాడు. పితృపాదుల సేవకు ఆలస్యమవుతోంది. వెళ్ళడానికి అనుజ్ఞ ఇవ్వమని అర్థించాడు. "బాలిక లేక కాదు-పితృపాదుల తొందరలేకకాదు-భూపాలక! పెండ్లి మాట చెవిబట్టదు నాకెవరెన్ని చెప్పినన్" కావున వృథాశ్రమమానమన్న శ్రావణుని తో వాదోపవాదాలుసాగాయి. మెల్లగా కుమార్తె ప్రణయాన్ని వెల్లడించాడు మహారాజు.

"మా కది యేకపుత్రి యసమానసముజ్జ్వల సౌకుమార్యవి
ద్యాకమనీయరూప భవదర్పితచిత్తయు-నిట్టి కన్యకన్
జేకొను మిప్పుడే యధివసింపుము మామకరాజ్యపీఠి-సు
శ్రీకలితమ్ము లౌ సుఖవిశేషము లందుము శాశ్వతమ్ముగన్"2

అని కొమార్తెతోపాటు రాజ్యాన్ని పైతం ఇవ్వడానికి సిద్ధపడ్డాడు భూపాలుడు. ఇంత కాలం పెండ్లివద్దని మొండికేసిన ఆమె ఏ సౌందర్యాన్ని వాంఛించిందని-పుత్రహీనుని కులాన్ని రక్షించమని ప్రాధేయపడ్డాడు. సున్నితంగా తిరస్కరించాడు శ్రావణుడు ఆమె అమాయకత్వాని కాశ్చర్యపోయాడు. "మీకన్యామణికి నేననర్హు డనని, పుట్టిన ప్రతికొడుకు వంశోద్ధారకుడవుతాడన్న నమ్మక మేముంగని, "నీయుండైన కుమారకుం డొకడు జన్మింపగ ప్రాచీన మర్వాచీనం బగువంశమెల్ల నశియింపన్వచ్చు" 3 నని కావున నన్ను ధనముకొఱకు ప్రలోభపెట్టక, ఆమెను బిచ్చగానికి నాకీయక-యుక్తమైన వరుణ్ణి చూచి పరిణయం చేయమన్నాడు.

"జ్ఞానపుత్రుని బడయంగజాలువాని
యన్వయం బొప్పు వేయికల్పావసాన
కాలములదాక-నంతియేగాని చిరము
పరిణయము నిల్పునే వంశపై భవమును?" 4

వివాహమే వంశాన్ని నిలబెట్టదు. మంచివాణ్ని చూసి కుమార్తెకు పరిణయం చేయమని విన్నవించి, అనుజ్ఞ తీసుకొని తల్లిదండ్రుల చెంతకు వెళ్ళడానికి ఉద్యమించాడు శ్రావణుడు.

---

1. శ్రావణము-మధ్యమ 5-24 ప. 3. శ్రావణము-మధ్యమ 5-63 ప.
2. శ్రావణము-మధ్యమ 5-35 ప. 4. శ్రావణము-మధ్యమ 5-64 ప.

కాని అతని వాదనలను తెరచాటున కూర్చొని వింటూ, అతని రూపాన్ని వందకళ్ళతో చూస్తూ, అతని పల్కులను వేయి చెవులతో వింటూ వాటిలోని వైరాగ్యాన్ని స్వీకరించలేక చింతిస్తున్న రాజకుమారి-తన యదృష్టాన్ని మరొక్కసారి పరీక్షించుకోడానికా యన్నట్లు తెరతీసుకొని ముందుకొచ్చింది

"స్వర్ణకంకణనూపురస్వనము లెసగ
వేయిమెఱపులు మెఱసిన విధము దోప
నీవలకు వచ్చి శ్రావణునెదుట నిల్చి
వినయమున గేలు మోడ్చి యిట్లనియె నపుడు"1

అనేకరీతులుగా తన మనోవేదనను విన్నవించుకొంది. అతనిలోని వైరాగ్యానికి కారణాన్ని పెక్కింటిని ఊహించి—తుదకు-

"నీకోసంబని గంపెడాస పడియుంటిన్-శైశవాద్యస్తమున్
ప్రాకట్యం బగు ధీరతాపటిమ సర్వంబున్ భవద్దర్శనో
త్సేకంబందె యడంగిపోయినది-సుశ్రీమూర్తి! నీతోడిదే
లోకం, బింక రవంత జాలి గొని యాలోచింపు మీ నాదశన్"2

అంటూ ప్రార్థించి, ప్రాధేయపడింది పాదాలుపట్టుకొని ప్రాకులాడింది. కాదని త్రోసి వేశాడు. తల్లిదండ్రులను చేరాడు శ్రావణుడు. మూర్ఛబోయింది ఇందిర. బ్రహ్మచారి మనఃస్థైర్యానికి ఆశ్చర్యపోవడం రాజావంతయింది.

ఈ సమయంలో ప్రచలితమైన ఇందిరాశ్రవణుల వాదోపవాదాల్ని మహర్షుల పల్కులెన్నో కవి పల్కుల్లో ఒదిగిపోయి జ్ఞాన వైరాగ్య సంపన్న భావాలు వెల్లి విరిశాయి.

"పరమసుందర మగు సృష్టిపథమునందు
పురుషు లెందరో స్త్రీలు నందఱు గదయ్య
ప్రణయ మనునది ధర్మదూరంబ యేని
యేల స్త్రీపుంసభేద మీసృష్టిలోన"3

వంటి పద్యాల్ని ఇందిరాదేవి ముఖతః కవి శాస్త్రజ్ఞత లోకజ్ఞతలు వెల్లడౌతాయి. "నేను మోపెదను నీదు బరువుకావడి-పెట్టుము ప్రణయభిక్ష"4 అన్న అభ్యర్థన ప్రణయినిగ రాజకుమార్తెది. కాని ఆమె కోరికలు వమ్మయినాయి. శ్రావణుడు వెళ్ళిపోయినాడు.

---

1. శ్రావణము-మధ్యము 6.2 ప
2. శ్రావణము-మధ్యమ-6.11 ప
3. శ్రావణము—మధ్యమ-6.6 ప
4. శ్రావణము-మధ్యమ-6.13 ప

రాజభవనం నుండి ఎవరో తరుముకొస్తున్నట్లు తల్లిదండ్రుల్ని చేరి-తండ్రి అడిగిన ప్రశ్నలకు, మార్గంలో ప్రస్తావిస్తానంటూ "మూటాముల్లె" సర్దుకొని భయం కర కాళరాత్రిలో ఆ రాజ్యాన్ని వదలి బయలుదేరాడు శ్రావణుడు.

పురాన్ని సమీపోద్యానవనాన్ని, దక్షిణోత్తర కోసలద్వయాన్ని దాటి కోడి కూసే సమయానికి ఘోరారణ్యంలో ప్రవేశించాడు కావడిభుజానవేసుకొని శ్రావణుడు. అతని తొందరకు అతని హృదయంలో భయం సందడి చేయడమే కారణం-

"ఒడయుడు దూతలం బనుపునో, మతిమాలిన రాజకన్య వెంబడునో"1- అన్న సందేహం శ్రావణుని అర్ధరాత్రి అరణ్యాలు పట్టించింది.

ఇదే సమయంలో రాజాంతఃపురంలో మూర్ఛపోయిన ఇందిర తెలివితెచ్చు కొని పలురీతుల రోదించింది. తన దురదృష్టాన్ని నిందించుకొంది. చెలికత్తెలనంద రిని పంపివేసి ఏకాంతంగా గుండెలవిసేటుగ విలపించింది-ఒక ఏడుపు పద్యం ప్రబంధ వాఙ్మయాన్ని గుర్తుచేస్తూ ఆవిర్భవించింది కావ్యంలో-

"నూనశరోపమాననవసుందరమూర్తి దలంచి, తత్కృతా
నూనతిరస్కృతిం దలచి, యుజ్జ్వలశోకదవాగ్నితప్తయై
మానిని యేడ్వసాగె సుమమానరసాలకిసాలఖాదనా
దీనపికాంగనాగళరుతిప్రతిమాన కలస్వనమ్మునన్"2

అర్ధరాత్రివరకు విలాపాగ్నుల వేగి, తుదకొక నిర్ణయానికొచ్చి అంతఃపురం సద్దు మణిగిన విషయం గమనించి, ప్రియా సౌందర్యాన్ని తలంచుకొంటూ, మెల్లగా రాజ ప్రాసాదాన్ని దాటి నత్రానికి చేరుకొని, అంతటా గాలించింది. నిద్రలోనున్న ఒక వృద్ధుని మాటలాడించి, "కావడి బాలుని" మార్గం తెలుసుకొని ఆ దిక్కుగా వేగంగా బయలుదేరింది రాజపుత్రి.

సరైన మార్గాన్ని ఎవ్వరూ చెప్పకపోయినా, పురాకృత పుణ్య విశేషాన అదే మార్గంలో ప్రయాణం కొనసాగించింది.

అక్కడ వెనుకచూపులేని రీతిగ అవిశ్రాంతంగా ప్రయాణం కొనసాగిస్తున్న కొమరుణ్ణి తనకు తల్లికి దప్పిక తీర్చమని కోరాడు విశ్వనాధుడు "ఆగరా! పెట్టి తండ్రి! ప్రయాణమెంతకాలమని-యెప్పుడెత్తిన కావడి యిది" అంటూ విరోధిం చాడు. ఇంకా రాజభయంలేదు. ఉత్తర కోసల భూముల్లోకి ప్రవేశించామని, ధర్మాత్ము డైన దశరథావనీశుని ఏలుబడిలో పూత భూమిదియని ధైర్యం చెప్పాడు.

---

1. శ్రావణము-మధ్యమ-7–8 ప.

2. శ్రావణము-మధ్యమ-7-20 ప.

తన తండ్రికిని దప్పిక కల్గించాననే వేదనతో ఒక చెట్టునీడన కావడిదించి ప్రాక్తన శీర్ణ కమండలాన్ని తీసుకొని నీటికై బయలుదేరాడు వెనుక్కుంటూ శ్రావణుడు. జింకలు, ఏనుగులు తడిసిన ముఖాలతో వస్తున్న మార్గం ఎన్నుకొని సరయూ తీరాన్ని చేరాడు "ప్రశాంతోర్మి పావన వాఃపూరితయౌ" నదిని చూచి హర్షపులకితగాత్రుడై, జానుదఘ్నంగా నీటిలోనికి దిగి, కమండలాన్ని నింపుకొని వెనుతిరిగాడు మునికుమారుడు.

"శబ్దవేధి" విద్యనభ్యసిస్తూ చెంతను దాగియున్న దశరథుడు నీటిలో కమండలం మునిగిన శబ్దం-ఏనుగు నీరు త్రాగుతున్న శబ్దంగా భావించి, బాణాన్ని విడవడం,—శ్రావణ కుమారుడు నేలకూలడం-జరిగిపోయింది. మునికుమారుని ఆర్తనాదం కోసలేంద్రుని గుండెల్లో విస్ఫోటాల్ని కల్గించింది.

"రక్తనది పాతె హృదయగహ్వమ్మునుండి-
జలమున నగంబు తలమున నగము గాగ"1

పడిపోయి, తన దురదృష్టానికి దైవాన్ని నిందిస్తూ, పితృదేవుల దప్పిక ఎలాతీర్చాలాయని విలపిస్తున్న శ్రావణకుమారుని చేరాడు దశరథుడు.

"ఎవరునాయనా! నీవు?-రాఘవులకులము
చెఱుప బుట్టిన నీచుని శరనిపాత
మునకు బలియైతి, వకట!"2

చేసిన దారుణానికి సిగ్గిలిన నిర్భాగ్యుడుగ దశరథుడు దుఃఖిస్తుంటే-"నామృతికి వాకె లేదు చింతాలవమ్ము నీకుమాత్ర మదేటికో భూకళత్ర" అంటూ ఓదార్చి, తల్లిదండ్రులకు నీటిని అందించి దప్పిక తీర్చమని ప్రార్థించి, మార్గనిర్దేశం చేసి, బాణాన్ని లాగించుకొని ప్రాణాన్ని వదిలాడు. శ్రావణుని శవాన్ని భుజానవేసుకొని భయపడుతూ వృద్ధ దంపతుల వద్దకు చేరాడు దశరథుడు. అడుగుల సవ్వడి మాకురునిదే నను కొన్న తండ్రికి శ్రావణుని పిలుపు వినబడలేదు. పిలిచినా పలకలేదు. "పలుకక యుంటివేమి శిశువా! మురుపెన్నడు లేని యీ గతిన్" అంటూ ప్రశ్నించి, "ఆలోచితము కార్యమవ్వలను బిడ్డా! యిమ్ము నీరున్నచో" అన్నాడు బిడ్డింపుకో అరి

1. శ్రావణము-మధ్యమ-8. 17
2. శ్రావణము—మధ్యమ-8. 24

గాదని భావించిన విశ్వనాధుడు,—మౌనంగా ఉదకపాత్రి నందించాడు దశరధుడు శవాన్ని దూరంగా దించి, "దప్పిక తీర్చుకొని న్యస్తచిత్తులైన ఆ దంపతులకు-కాలో చితంగ"-తన్నుకుల గోత్రింతో పరిచయం చేసుకొని-గడచిన వృత్తాన్ని తెలియ జేశాడు దశరధుడు. అంధదంపతుల వేదన వెల్లువగా ప్రవహించింది. కంటిగుంటల నుండి కన్నీటివాగులు ప్రవహించాయి.

"ఏమేమీ పసివాడు మీశరముచే నేమయ్యె నేమయ్యె?-రా
జా! మాకొంపను గూల్చిపై చితివి హా! హా! పుత్రి హా! పుత్రి! తం
డ్రి! మా కింక లభింపవా?" యనుచు నావృద్ధుల్ వితాంతవ్యధా
భీమార్త స్వను లౌచు"1–మూర్ఛతో భూమిపై వ్రాలిపోయారు.

"ఉంటి మీయిర్వురి కుమ్మడికన్ను నే"
నంచు మమ్ముల నూఱడించినాడు
"పూని రక్తము ధారవోసి పెంచెద" నంచు
చేయెత్తి శపథమ్ము చేసినాడు,
"మీవంతు గడచెను నావంతు వచ్చిన"
దంచు మమ్ముల నెత్తి పెంచినాడు "2

అంటూ శ్రవణుని పితృభక్తిని పలుతెఱగుల కొనియాడటమే కాక–
"సంతతి లేమిచే మొరడుచావు లభించు నటంచు నెంతయున్
జింతలతోడనే నగముజీవితముల్ గడచన్న పెన్క మా
స్వాంతము లుబ్బ బుట్టితివి, చచ్చితి వీ వొకనాటి ముచ్చటై"3 అనే ఆవేద నలో ఆక్రోశం—ఆక్రోశం క్రోధంగా రూపుదాల్చి శాపంగా మారింది.

"కొడుకులు చెంతలేని యొకఘోరవివర్ధశ మున్గి ప్రాణముల్
విడుతువుగాక నీవు పలవించుచు బుత్త్రిలకోస మెంతయున్"3
అంటూ శపించాడు విశ్వనాధుడు. ఆవేశం తగ్గగానే–మళ్ళీ దశరధుని ఓదార్చి శాపాన్ని "పుత్రిప్రాప్తి" వరంగా మార్చాడు.

ఈ సందర్భంగా రాఘవ వంశోద్భవా! కిరాత! శిశుఘాతక! అంధభూపతీ! సంభోధనలు విశ్వనాధుని వేదనను మోసిన ముక్కలై దశరధునికి గుర్తుచ్చుకొం టాయి.

---

1. శ్రివణము–మధ్యమ–9-9,
2. శ్రివణము-మధ్యమ-9–15
3. శ్రివణము–మధ్యమ–9-16
4. శ్రివణము–మధ్యమ-9-28

"బ్రహ్మహత్యాపాతకానికి దుఃఖించవలసిన పనిలేదు-మేము వైశ్యులమని" విశ్వనాధుడు ప్రకటించడం వాల్మీకానికి విరోధం. వాల్మీకంలో "వైశ్యునకు, శూద్రి కన్యకు" పుట్టినవాడుగా ముని కుమారుడు చెప్పుకోవడం కన్పిస్తుంది" దాన్ని కవి "ఇరువురిదీ వైశ్యకులంగా మార్చి, రామరాజ్యంలో శూద్రునకు తపోధికారంలేదనే శంబూక వృత్తాన్ని" గుర్తుంచుకొని, జాగ్రత్తపడ్డారు.

దశరథుని సహాయంతో-పత్నీసహితుడైన విశ్వనాధుడు సచేలస్నానమాచరించి, పీరు విడిపించుకోవాలిసినవానికే నీరొదలి, ఔర్ధ్వదైహికక్రియల పూర్తిచేశాడు శవసంస్కారం పూర్తయ్యింది. కుమారుని ఔన్నత్యాన్ని దశరథునితో వేయిరీతుల చెప్పుకొనుచుండగానే-శ్రావణుని వెదకుతూ"ఇందిరాదేవి" ఆ ప్రదేశానికి చేరుకొంది.

శ్రావణుడనెడి పిలుపు చెవులకు శోక దత్తమానసాన్విత చక్షువులై రాచ కన్యను వీక్షించారు. నేత్రాలతో దశరధుడు-మనోనేత్రంతో అంధదంపతులూను.

వృద్ధదంపతుల విలాపంలో పిడుగువంటి శ్రావణుని మరణవార్తవిని మూర్ఛ పోయింది ఇందిర విశ్వనాధదంపతులిరివురు లిప్తమాత్రలో వాయువును బంధించి విగతజీవులయ్యారు. దశరథుని ఓదార్పుతో పరిచర్యతో సేదతీరిన ఇందిరపలురీతుల విలపించింది.

"నీకీ తొందర యేలవచ్చినది తండ్రీ కోసలాధీశ్వరా?"అంటూ నిలేసి ప్రశ్నించింది. "నేను నిన్ను ప్రేమించడం మూలంగానే నీవు మరణించావు. పెళ్ళాడతానని చెప్పకపోయినా మరికొంతకాలం జీవించి ఉండేవాడివేమో! నా మనసున బుట్టినప్రేమ విషం నిన్ను హరించివేసింది." "గెంటుకొని వచ్చె నిన్ను నాకంటి తప్పు"అని రోదిస్తుంది శ్రావణుని గూర్చి రాజపుత్రి. ఆమె ఆవేదనంతా చివరిమాటలో గూడు కట్టుకొంది. నాకంటి తప్పు నిన్నుచావుకై నెట్టుకొచ్చిందన్న వేదన ఆమెది. ఉద్వేగంతో పరుగెత్తి, సరయూలో స్నానం చేసి, శ్రావణకుమారుని చితికి ప్రదక్షిణంజేసి, దశరధుడు విరోధించడానికి త్రొక్కి-ళ్లాడుతున్నంతలోనే-చితిలో ప్రవేశించి సహగమనం చేసింది ఇందిర. నలుగురకు దహన సంస్కారాల్ని ఒకేసరి నిర్వర్తించవలసినవాడయ్యాడు దశరధుడు.

---

1. వాల్మీకం - అరణ్యం - 63. 50

"చేయునదిలేక దశరథక్షితివరుండు
ప్రాణహీనుల వృద్ధదంపతుల గూడ
గొడుకు గోడలి ప్రుంగిన ఘోరవహ్ని
నాహుతి యొనర్చె నపుడు మహాత్ముడగుచు"

ఇంతమంది మరణానికి కారణభూతుడై, ముని శాపానికి గురైన దశరథుని మనస్సు కల్లోలితమైంది. కింకర్తవ్యతా మూఢుడైనాడు. గుండెలు పగుల రోదించాడు. "శబ్ద వేధి గాదుర యది వంశభేదిగాని"అనే గర్జన పదిదిక్కులనుండి వినిపిస్తున్న భ్రాంతి పెరిగిపోయి, సహింపజాలక తన కత్తితోనే శిరచ్ఛేదనం చేసుకోవడాని కుద్యుక్తు డయ్యాడు. ఇంతలో సరయూనది స్నానానికేతెంచిన మునివరుడొకండు-అతన్ని వారించి "మాధవుని కరుణ పుత్రకుల గాంచి యశమును పొందగలవని" ధైర్యం చెప్పి, ఓదార్పడంతో తేరుకొన్న మనస్కుడై విచారంతో రాజధానికి ప్రయాణ మయ్యాడు పంక్తిరథుడు.

కర్మ ఫలం తీరింది. తిరిగి చైత్రరథోద్యానంలో నందివర్ధనం దగ్గరే తారసి ల్లారు ప్రియాప్రియులు. యావత్ప్రకృతి ఎదురేగి స్వాగతం పలికింది. ఊర్వశీ నలకూబరులు-జ్వలరూపులై ప్రత్యక్షమయ్యారు. వారి పలుకుల్లో పూర్వజన్మవృత్తాలు పలుకరింపులుగా దొర్లాయి. చిరకాల వియోగానంతర కలయిక అద్వైత భావాన్ని ధిగమించింది. నర్మభాషణలు ధురీణతనందాయి.

"బ్రహ్మాదారికి జైత్రరథవీధి శృంగార
మనుభవింపగ ముచ్చటయ్యె నేడు" అన్న ప్రియురాలిని—
"పరదారలలో మాటువడు రాదశన్నెకు
పరువులెత్తగ వీలు దొరకెనేడు" అన్నాడు హేళనగా నలకూబరుడు.
— "పితృసేవకును మహోన్నత లోక సేవకు
స్వస్తిచెప్పితిరి గావలయు నేడు" అనగానే—
— పితరులబ్రదుకు లేవిధమైన నేమాయె
కోరినమగడు చేకూరెనేడు' 2

అన్నాడు. -పరిహాసాలు, చెలగాటాలు, కవ్వింతలు, తుళ్ళింతలు పెచ్చరిల్లాయి. పరి

1. శ్రావణము -మధ్యమ - 10 - 30
2. శ్రావణము - ఉత్తర - 3 వ

చయమున్న రక్షకభటుడు సవ్వడివిని వచ్చి దవడ నవరించుకొంటూ ప్రక్కకు తప్పుకొన్నాడు. కుమారుని ఆగమనవార్త విని వచ్చిన ధనపతి బిడ్డను అక్కున చేర్చుకొని, ఆశీర్వదించాడు.

"నందివర్ధన మువచితానంద మగుచు
నూగి నొకమాఱు-కురిసె నద్యోవికీర్ణ
పుష్పవర్షము-తన్నవామోదకలిత
మలయపవనాంకురమ్ములు మసలె దెనల"1

తలలో పూలు అమరగా ఎదలో కోరికలు పురులు విప్పాయి. ప్రియుని బాహుబంధంలో ఒరిగిపోయింది ఊర్వశి. చిరకాల వియోగ సంజనిత దివ్యానంద సామ్రాజ్యం వారికి లభించింది.

ఈ "శ్రావణం" మూలాతిరిక్తంగా కొనసాగిన కల్పితకావ్యం. శ్రీకాశీభొట్ల సుబ్బయ్యశాస్త్రిగారి "శ్రావణవిజయము" అనే వచన కావ్యమాధారంగా కాసీ కావ్యాన్ని ప్రారంభించినట్లు కవి "నివేదనము"లో చెప్పుతున్నారు. భూ, దివులకు వారధి వేసి "సత్కవివాదు" వనిపించుకొన్న ఖ్యాతి శ్రీ గొట్టుముక్కల రామకృష్ణ కవిది.

"వెనుక ముందులు రెండును లేని వట్టి నదమంత్రపుదుర్యోగముగా నున్న ఈ కథకు వీరు పూర్వోత్తరములను చమత్కారముగా కల్పించి పూర్తీకరించినారు ............... ............ఆయాసన్నివేశములను, భావములను చిత్రించుటలో కవి గారు చూపిన లోకజ్ఞత, సంయమము, దృష్టివిశాలత, సహృదయత, ధారాశ వవిత్రతయు శ్లాఘార్హములు"2 అన్న రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి పలుకులు పండితామోదాలు.

"కవికి కథకట్టడంలో అంతగా నేర్పున్నట్టు కనబడదు. కథ అంతా అతికించినట్టుగ స్ఫురిస్తుంది"3 అన్న విమర్శకుల పల్కులు వ్యాఖ్యానాభిలాషితాలు. ఎందువలనంటే-కవి ఎప్పుడైతే కావ్యాన్ని, పూర్వఖండ, మధ్యమఖండ, ఉత్తర ఖండాలుగా విభజించారో అప్పుడే కథ రెంతుగా చీలిపోయింది. పూర్వోత్తర ఖండాలకు మధ్యమఖండం వారధిగా నిల్చి దివిలోని కథను భువిలో నిలిపి తిరిగి దివిలో కలిపింది. కావున కథా సంవిధానంలో ఆటంకంలేదు.

1. శ్రావణము-ఉత్తర-8 ప
2. శ్రావణము-పీఠిక-

"స్వభావపోషణాదుల్లో గట్టి దొసగులు కవిపిస్తున్నాయని—కుబేర తనయుడు, కొమ్మనెక్కి పూలుగోయడం, శ్రావణుడు, పలకబొత్తమ్ముల" వట్టి "బడికి" వెళ్ళడం, ఉదాహరించియున్నారు 1 ఇవి కవిలోని సమకాలీనతా ప్రభావానికి ప్రతీక లుగా భావించవచ్చు.

రామాయణంలో అతిక్లుప్తంగా కన్పించే మునికుమార వృత్తాన్తం శ్రావణ వృత్తాన్తంగా కావ్యమై ఐదువందల పైచిలుకు పద్యాలతో అందంగా రూపు దిద్దు కోవడం గాంధీజీ ఆత్మకథా ప్రభావమై ఉండవచ్చునని కోవడంలో యదార్థం కన్పి స్తుంది. వాల్మీకంలో మునిబాలుడు దశరథునకు మార్గనిర్దేశం చేస్తూ-ఇయమేకపదీ రాజ! న్యతో మే పితురాశ్రమః" 2 అంటాడు-కాలిత్రోవను కొద్దిదూరంలో తండ్రి గారి ఆశ్రమముందీ అన్న పలుకుల్లో-ఆశ్రమ వాసులగ మునిబాలకుని కుటుంబం కన్పిస్తుంటే-శ్రావణచరిత్ర వ్రాసిన వారందరిలోను, "కావడి-తల్లిదండ్రులు, అంధులు- చెట్టుక్రింద దించి నీళ్ళు తీసుకురావటం అనే కల్పనలు చోటుచేసుకోవటానికి కారణం గుజరాతీ నాటకం-గాంధీ మహాత్ముని ప్రభావితం చేసిన "శ్రావణపితృభక్తి" యేనని స్పష్టంగా పేర్కొనవచ్చు. వాల్మీకిని నెట్టివేసి, కావడిలో తల్లిదండ్రులమోయు శ్రావ ణుని చిత్రం-రామాయణ పాఠకుల హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోయిందంటే ఆ ప్రభావం గాంధీజీ ఆత్మకథయే అనడంలో అతిశయోక్తిలేదు. - కవి కూడ నివేదనలో "మహాత్ముని ఆత్మకథ" చదివినట్లుగా 3 చెప్పుకొనియున్నారు.

---

1. భారతి—విజయ-పుష్య-పు. 1!6   2. వాల్మీకం-అరణ్య—63—44.
3. నివేదన-iii

## శ్రావణ చరిత్ర

"శ్రావణ పితృభక్తి" యను గుజరాతీ నాటకమున్నదని మహాత్ముని ఆత్మకథలో చదివితిని. విశ్వప్రయత్నం చేసిన అది లభించలేదని" శ్రావణ కావ్యకర్త శ్రీరామకృష్ణశాస్త్రి వేదనచెందారు. – కాని "శ్రావణ చరిత్ర" యనబడు తన కావ్యానికి శ్రీవణపితృభక్తి నాటకమను గుజరాతీ నాటకగాథ" యని నామాంతరాన్ని ప్రకటించి కావ్యనిర్మాణం చేసినవారు శ్రీ అంబటి సుబ్బరాయగుప్తా. మహాత్మునిలో వెలుగువింపిన నీతిజ్యోతి "శ్రీవణపితృభక్తి" నాటకం తన కావ్యానికి ఆధారమని ప్రకటించడమేకాకుండా, తన కావ్యాన్ని ఆంధ్రజ్యోతి శ్రీ పొట్టి శ్రీరాములుకు అంకితమిచ్చి, జాతీయనాయకులపై తనకున్న గౌరవాన్ని ప్రకటించుకొన్న గాంధేయవాది వీరు.

పాటలీపుత్రవాసి సువర్ణగుప్తుడు, మధురాపుర నివాసి రత్నగుప్తుడు కాశీ నగరంలో విద్యాభ్యాసం చేస్తున్న కాలమది. ఒకనాడు గంగానదిలో స్నానంచేస్తున్న రత్నగుప్తుడు కాలుజారి ప్రమాదానికి గురికాగా స్వర్ణగుప్తుడు రక్షించారు. కృతజ్ఞతలతో మొదలైన పలకరింపులు దినదిన ప్రవర్ధమానమై, విద్యాభ్యాసం పూర్తయినా వదలలేక అక్కడే కాలక్షేపం చేసే గాఢస్నేహితులై పోయారు. తండ్రులవద్ద నుండి లేఖల వేగం ఎక్కువకాగా –తప్పని సరి పరిస్థితుల్లో–

"దైవకృపచేత మనకు సంతాన ముదయ
మైనచో నేటి మనమైత్రి యవని దిరము"[1]

గా చేతుమని ప్రమాణాలు చేసుకొని విడిపోయారు.

కాలంలో మార్పు సహజసిద్ధం. కొంతకాలం గడిచింది. రత్నగుప్తుడు వ్యాపారంలో నిష్ణాతుడై విదేశాలలో లాభాలుగడించి, ఓడలో ధనరాసుల నింపుకొని స్వదేశానికి తిరిగివస్తున్నాడు. ఓడలో మంచినీరు అయిపోవడంతో–లంగరు వేసి, సేవకులను సమీపారణ్యంలోకి పంపాడు. అరణ్యంలో పసిపాపను చూసిన సేవకులు రత్నగుప్తునకా విషయం విన్నవించారు. ఆ చిన్నారి "ముద్దుమోము" గాంచి ముచ్చటపడి, సమీపమందెవరు లేక విలపిస్తున్న ఆ "పసికందు"ను ఒడిలోనికి తీసుకొని, ఆమె విషయమంతా వివరంగా ఒక తామ్రఫలకం మీద వ్రాయించి, ఆ చెట్టుదరిన పెట్టి, ఇంటికి చేరుకొన్నాడు రత్నగుప్తుడు.

---

1. శ్రీవణచరిత్ర - 1- 11.

విష్ణుదాసుడను రాజు భార్యబిడ్డలతోగూడి "వింధ్యవాసిని" యను దేవతను సేవించుకోవడానికి అరణ్యానికొచ్చారు. ఆ రహస్యంతెలుసుకొన్న శత్రువులు రాజుని సంహరించి, రాణికై వెంటబడ్డారు. పసిబిడ్డను చెట్టుక్రింద దాచి, పొదల్లో దాగుకొన్న ఆ యనాధను శత్రువులు బంధించుకుపోగా, పసిపిల్ల అనాధయైంది. రత్నగుప్తునకు లభించిన బిడ్డ ఆ మహారాజు విష్ణుదాసుని కొమార్తె.

ఇంటికి చేరిన రత్నగుప్తుడు ఆ కొమార్తెను భార్యకందించాడు బిడ్డలులేని వారింట అల్లారుముద్దుగాపెరగసాగింది ఆ చిన్నారి. మధురానగరంలోని సువర్ణగుప్తుని కుమారునితో ఆమెకు వివాహం జరిగింది. మిత్రులకోరిక తీరి, వారిస్నేహం స్థిరమై నిల్చింది. ఆ దంపతులే అన్నపూర్ణా విశ్వనాధులు. వాణిజ్యంలో విశేషానుభవంతో రత్నగుప్తుడు ఆర్జించిన ఆస్తి యావత్తు వారి మరణానంతరం అన్నపూర్ణకు సంక్రమించింది. కోడలికి పెత్తనమిచ్చి అత్తమామలు పరలోక గతులయ్యారు.

వచ్చిన లక్ష్మిని తగుమాత్రంలో వెచ్చించ తలబెట్టి, అన్నదాన వ్రతాన్ని ప్రారంభించింది అన్న పూర్ణ. విశ్వనాధన్నపూర్ణలు సార్థకనామధేయులై అన్నదాన వ్రతాన్నికొనసాగిస్తూ, అన్నార్తుల నాదుకొంటున్నారు. సకలైశ్వర్యాలనిచ్చిన భగవంతుడు-సంతానాన్నివ్వలేదనే వేదన అతిశయించి, "అన్ని వుండి సంతానం లేకపోవడం, చుక్కలుండియు శశిలేని ఫక్కిదోచు" నని చింతించి తీర్థయాత్రలు, వ్రతాలు సాగించారా దంపతులు. పూజలు ఫలించి అన్నపూర్ణ-పది మాసాలుమోసి "శ్రావణ శుద్ధ పౌర్ణమినాడు మగశిశువును ప్రసవించింది.

"అన్నపూర్ణకు పుత్రభాగ్యంబుగల్గె
చూచివత్తము రండంచు జాట్లుపక్క-
ములను, నిరుగుపొర్గమ్మలక్కలును వచ్చి"

పురిటి పాపను ముసిపెందీర చూచివెళ్ళారు. భాగవతంలోని గోపికలు "మన యశోద చిన్ని మగవాని గనెనట చూచివత్తమమ్మ సుదతులారా!" అని బయలుదేరిన సన్నివేశం గుర్తుకొచ్చింది కవికి. పసివాని పెంపకంలోని మాతృత్వపుటానందాన్ని తనివి తీర అనుభవించింది అన్నపూర్ణ. "చందమామరావె జాబిల్లిరావె" అని చందమామను పిల్చి, అమృతమింతదెచ్చి ఆరగించియు పోవె" అనివెన్నలబువ్వలుపెట్టింది. జోలపాడింది.ఏడవకూడదయ్యయిటులేడ్చిన నందరునవ్వరయ్య" అంటూ లాలించే అన్నపూర్ణతోఏడవకుఏడవకు వెఱ్ఱినాగన్న ఏడిస్తే నీకళ్ళు నీలాలుకారు........నే చూడలేను"

1. శ్రావణ చరిత్ర - 1. 52 వ.

"కావడి నొకచే మఱియొక
చే వెలయగ దాళదళరచిత ఛత్రంబున్
సేవింప దీర్థయాత్రలు
శ్రావణుడటు చనియె శివుని సంకీర్తనలన్"1

తీర్థయాత్రల చేస్తూ, మార్గమధ్యంలో వింధ్యారణ్యంలో దారికాచి, హింసింపవచ్చిన దొంగలలో "అహింసాబోధన" లవణ పరివర్తన తీసుకొచ్చి, కరువుకాలంలో ఆకలిబాధల తీర్చిన మహనీయుల కుమారుడు వారి అవివేకాన్ని అణచి, ఋజు మార్గాన్ని చూపాడని ఎంతో ఆనందించారు.

"వినుడి, యహింసాపథ జీ
వనమే మానవులనెల్ల వనజాక్షుని పా
వన చరణాంబుజముల చెం
తను జేర్చెడు దివ్యసాధనంబగు గనుడి"2

అన్న పల్కుల్లో-అహింసాజ్యోతి"గాంధీ" భావాలు దొర్లుతాయి.

మార్గమధ్యాన వర్షంలో తడిసిన తల్లిదండ్రుల్ని ఒక పంచలో చేర్చి, వేడి నీటికై యింటివారిని ప్రార్థించాడు శ్రావణుడు. స్నానం చేయకుండ ఫలాహారం సైతం స్వీకరించని తలిదండ్రులకై మునికుమారుని అభ్యర్థన, ఆ ఇల్లాలికి ఎంతో ఆనందం కల్గించింది. స్నానాదికనుకూలమైన వేడినీటిని ముంగిలిలో ఉంచి స్నానం చేసి లోనికి రమ్మని ఆహ్వానించింది. ఆమె అతిథిమర్యాదకు పులకితుడైన శ్రావణుడు-"నీయట్టి సతులు, పఱలుటం గాదె, ధరతోర్వివన్నె గనియె"నని ఆమె దాతృత్వాన్ని కొనియాడుతుంటే-"అన్నపూర్ణా విశ్వనాథుల దాతృత్వం ముందు నేనెంత" అన్నది యా ఇల్లాలు. మాంగల్యాన్ని అమ్మి మా బ్రతుకుల నిల్పిన మహా ఇల్లాలు ఆ తల్లి పేరునే మేము ప్రతిరోజు అన్నంతినేవేళ తలచుకొంటామంటూ గద్గదగాత్రమైన ఆ ఇల్లాలికి-తల్లిదండ్రుల్ని పరిచయం చేశాడు. మహానంద సంభరితమైంది యాగేహిని.

"అమ్మ, దయాప్రపూర్ణా, యన్నపూర్ణ నే
డెంతటి సుదినంబొ నంతసమున
నల్ల ప్రత్యక్ష శాంకరివైన నిన్ను
గాంచు భాగ్యముసేకూరె గనుము జనని"3

అంటూ పాదాభివందనంజేసి, "తొల్లి నీవన్నమిడి మమ్మునెల్ల మనిచితమ్మ అంటూ కృతజ్ఞత తెల్పుకొంది. ప్రాణనాథునితో కలసి వృద్ధ దంపతులకు పాదపూజ చేసు

1. శ్రావణ చరిత్ర – 1-188 ప.
2. శ్రావణ చరిత్ర – 1-257 ప.
3. శ్రావణ చరిత్ర – 2 - 34ప

కొంచి అతిధేయుని. "ఐహికముగ పేదరాలివైన పారమార్థికముగ పీవెభాగ్యవతివి" అంటూ మెచ్చుకోవడంలో అన్నపూర్ణా ఔన్నత్యాన్ని కవి ఎంతగానో పరిపోషించారు. ఆ దంపతులతో మహాకాళేశ్వరుని దర్శించి, తమ యాత్రను సాగించారు శ్రావణాదులు.

జ్యోతిష్మతీపురంలో శివుని పాటలపాడుతూ-రాచవీధిలో నుండి సత్రంవైపు బయలుదేరాడు శ్రావణుడు. రాజు మయూరుని పుత్రిక ప్రాతఃకాలంలో వీణపై దైవకీర్తన నాలపిస్తూ యధాలాపంగా వీధిలో గమిస్తున్న సురుచిరాకారు సుందరీ సుమశరాస్త్రిదైన శ్రావణుని చూసింది.

"మందస్మిత సుందరమై
యిందీవరపత్ర విస్తృతేక్షణమై యా
నందప్రదమగు మౌని ము
ఖేందు కళామండలంబు నీక్షింపగదే"1

అంటూ ఆ సుందరాకారుని చెలికి చూపించి మురిసిపోయింది ఇందిర. చెలికత్తె పద్మతో సైతం అతని సౌందర్యాన్ని అపురూపంగా వర్ణించి చెపుతుంది.

"పురుష నిర్మాణ కౌశలమును జగాన
ఎంతకాలమునకు జూపె సృష్టికర్త!"2

అని మెచ్చుకొని, తనమనస్సుని అతనిపై పారవేసుకొంది. అతణ్ణి చూస్తే చిరకాల మిత్రుని చూసినట్లుంది. మదిలో ప్రేమమొలకరిస్తోంచని పలుకుతున్న రాకొమార్తెతో-

"పూర్వజన్మానురాగ మపూర్వగతిని
స్త్రీ పురుషులకు జనియింప జేయుచుండు"3

అని వారి ప్రేమకు ' జననాన్తరసాహృదాన్ని" కల్గించింది పద్మ.

రాకుమారి పల్కుల్లో దొర్లిన "ధనదజ రూపు నామనమునం దెదియో స్మృతికిన్ స్ఫురించి" అన్న పల్కుల్లో గొట్టుముక్కల వారి కావ్యం లోని పూర్వఖండ ఇతివృత్తం పాఠకులకు స్ఫురిస్తుంది.

రాజపుత్రి ప్రేరణపై చెలికత్తె పద్మ శ్రావణకుమారుని వివరాల్ని సేకరించ డానికి సత్రానికి వెళ్ళడం - తల్లిదండ్రులకు పాదసేవచేస్తున్న శ్రావణుని దగ్గరగా చూచి, వారి మాటల సారాంశంలో వలసిన వివరాలు సాధించుకొని రాజకుమార్తెకు చెప్పడం జరిగిపోయాయి. అతను బ్రహ్మచారే నన్న పల్కులు రాజకుమార్తెకు అమృతోపమాలు కాగా, - తల్లితో తన మనస్సులోని మాటల్ని - మెల్లగా విన్నవించింది. రాణి ద్వారా ఆ విషయం విన్న మహారాజు పరమానందభరితుడయ్యాడు కాని ముని కుమారునితో పరిణయం శ్రేయోదాయకం కాదన్నాడు.

1. శ్రావణ చరిత్ర - 3 - 8 ప 2. శ్రావణ చరిత్ర - 3 -12.
3. శ్రావణ చరిత్ర - 3 - 18.

"ఎందఱులేరు రాజసుతు లెందఱులేరు పరాక్రమక్రమల్
అందము చందముం గలిగి యౌవన మొప్ప వెలుంగు భూపతుల్
ఎందఱులేరు ప్రేమవిను నేలికసావిగ స్వీకరింపగా
మందమతిన్వరించుట సమంజసమే మునిపుత్రు నక్కటా!"1

పెళ్ళంటే పెడముఖం పెట్టే కూతురు పెండ్లి కుమారుని ప్రసక్తి తెస్తే ఆనందమే గావి, మునిపుత్రుని వరించడం బాధాజనకమైంది. కాని రాజకుమార్తె పట్టుదలతో శ్రావణుని చెంతకు రాయబారిగా వెళ్లాడు మహామంత్రి. మంతనాలు సాగాయి, సాదరంగా ఆహ్వానం స్వీకరించి, మృదువుగా తిరస్కరించాడు శ్రావణుడు. మంతనాలు-మభ్యపెట్టడాలు – ఆశచూపడాలు అన్నీ పూర్తయ్యాయి. అప్రయత్న ప్రాప్తమౌతున్న రాజ్యాన్ని, రాజకొమార్తెను తిరస్కరిస్తున్న ఆ వటుని వింతగా చూశాడు మహామంత్రి.

"మనకు వలయునదిగల్గి మనుచె ధనము
కాని యట్టి ధనంబునే కాలదన్ని
మనగ గల్గినచో నదే మహిమ యనగ
నలరు, మహిమచే గాదె మహాత్ములగుట"2

నశ్వరమైన ధనాన్ని త్యజించి, అనశ్వరమైన మోక్షాన్ని ఆశించిన మునికుమారుని ఔన్నత్యం ముందు తలవాల్చి రాజాంతఃపురం చేరాడు మహామంత్రి. వివరాలు సర్వము విశదమైనాయి.

విలాపాగ్నులు ప్రజ్వరిల్లగ భోరున విలపించింది ఇందిర. తుది ప్రయత్నంగ తానే ఆ మునికుమారునితో ప్రత్యక్షంగా విన్నవించుకుంటానని పద్మ వెంటరాగా శ్రావణుని కలుసుకొని, శతకోటి వందనాలు సమర్పించి మనస్సువిప్పిపరచింది.

"ఇంపు గూర్చెడు మోహనాకృతిని గంటి
భావమలరించు మీ వాగ్విభవము వింటి
అరసి, త్వద్గుణమ్ములకు నే మతులు గొంటి
నా మనోధనమున కీవ నాధుడంటి" 3

అనడమే కాక – "అమలమతులగు నార్య కన్యలకు గుణములందె నమరాసక్తి మెండగు" అంటూ గుణాలను ప్రేమించాను అస్తులతో పనిలేదని పల్కింది. కానీ శ్రావణుడు చలించలేదు. పేదవానికి సార్వభౌముని కూతురితో పరిణయం కూడదన్నాడు. మానవమాత్రుడనైన నాకు దేవనదీ జలాలు ఎలా లభిస్తాయన్నాడు. "కాంతా! కంటిని కంటి నీ మధురవాగ్గంగాఝరీ ధోరణుల్" అంటూ ఆమె

---

1. శ్రావణచరిత్ర - 3 - 70.
2. శ్రావణచరిత్ర - 3 - 119.
3. శ్రావణ చరిత్ర 3—178

వాక్చమత్కారాన్ని మెచ్చుకొని, కోరికను ముద్దుగానే తిరస్కరించాడు. కాని మంకు పట్టువదలని ఆమెనుండి తప్పించుకోవడానికి తుదకు తల్లిదండ్రుల అడిగివస్తానని నత్రం వైపు బయలుదేరాడు.

నత్రం చేరి గొట్టుముక్కల వారి కావ్యంలో లాగానే తల్లిదండ్రులడిగే అనేక ప్రశ్నలకు క్లుప్తంగా సమాధానం చెపుతూ అతి త్వరగా, ఆ ప్రదేశాన్ని వదలి, దేశాంతరం పయనమయ్యాడు శ్రావణుడు. మార్గ మధ్యంలో - రాజకుమార్తె ప్రణయం, తాను తిరస్కరించడానికి కారణాలు విపులంగా ప్రస్తావిస్తాడు తల్లిదండ్రులతో-

తాను రాజాగారల్లుడైతే గ్రుడ్డి తల్లిదండ్రులకు సేవలెవరు చేస్తారు. సేవకు లను వారి సేవలకప్పగించి, రాజవైభోగాల మత్తులో తాను మునిగిపోతే తల్లిదండ్రు లకు దిక్కేమిటి – ఎవరైనా వారిని గురించి "పేద"గ మాట్లాడితే సహించలేమ– "సరిమత్తు చెలులబొత్తు వలదు వలదెందు,నే పగవానికైన" అంటూ ధనాంధ్యాన్ని తిరస్కరించిన శ్రావణుని బాష్పాకులిత నేత్రుడై ఆశీర్వదించాడు తండ్రి, కాని తల్లి- "నాయనా! కలదొక్కటి నాదు కోర్కె" అంటూ కుమారునిచే వాగ్దానము చేయించు కొని —

"కూర్మి సౌభాగ్యవతియగు గోడలత్త
మామలకు వందనంబని మాకు మ్రొక్క
"వరసుపుత్రిభవ!" యని దీవనల నిడగ
గోర్కె గలదన్న! దీని జేకూర్చుమన్న!"1

అంటూ రాకుమార్తెను పరిణయమాడుమని వ్యంగ్యంగా కోరుకొంటుంది. అంతేకాదు ధనమూలంగా కలిగే ప్రయోజనాలను "ధనమూలమిదంజగత్"ని ఎన్నో రీతుల కొనియాడుతుంది వతిక్రమ్రముఖులు శ్రీ గుప్తగారు ఈ సన్నివేశ మాధారంగా ధన ప్రాభవాన్ని పలురీతులుగ్గండించటంలో ఆశ్చర్యంలేదు.

తల్లిమాటలను వినయంగా త్రోసిపుచ్చాడు శ్రావణుడు.

"అవనీ తనయులు వశ్యులౌదురని ధర్మతమంబయి, నిత్యమైన న
ద్ధనమగు నాత్మగౌరవము గాదని త్రోయవశంబె? తల్లిరో!" 2

ఆత్మగౌరవాన్ని అమ్ముకొని, రాకుమార్తెతో కాపురం చేయమంటావా? అన్న శ్రావణునితో కట్నానికాశపడని నేటి యువకోత్తముల భావాలు దొర్లుతాయి.

"ఇల్లాలి నుల్లములరంగ
నెల్లపుడు తిరించువాని నిలభర్తయనం
జెల్లునుగాని పతినం
వల్లలనం గొలుచు భర్త పదవికి దగునే?" 3

---

1. శ్రావణచరిత్ర-4-21 ప
2. శ్రావణచరిత్ర-4-23 ప
3. శ్రావణచరిత్ర-4-34 ప

అరదాని సొమ్ముతో జీవించడం - ఆత్మగౌరవాన్ని అమ్ముకోవడం - ఎంగిలి కూడుతినే కుక్కవలె జీవించడం - ఉత్తమ పురుషుల లక్షణం కాదు. ధనాశతో కులంచెడి "పరజాతి కామినిం గూడువాని వెక్కిరింతురు జనులెల్ల ప్రేలణాని" అంటాడు శ్రావణుడు. వైశ్యకులజుడైన శ్రావణుడు క్షత్రియ స్త్రీని పరిణయమాడ డం ప్రతిలోమమై సంఘాంగీకారాన్ని పొందలేదని వ్యంగ్యంగా కవి ఇచ్చట హెచ్చ రిరిదారు.

వాల్మీకి శ్రావణుడు "శూద్రాయా మస్మి వైశ్యేనజాతో" 1 అని శూద్రీ స్త్రీకి వైశ్యున యందు పుట్టినవాణ్ణిగ పరిచయం చేసుకొన్నాడు. కవి ఇక్కడ క్షత్రియ జాత అన్నపూర్ణను రత్నగుప్తునికి లభింపజేసి, సువర్ణగుప్తుని కుమారునికి పరి ణయం జేయించి, "వైశ్యస్త్రీ"ని గావించారు. కాని అనంతర కావ్యమంతా "ఊరు జాత" "వైశ్యవధూటి" అనే పదాలతోనే సంబోధిస్తారు - అది ప్రమాద పతితం కావచ్చు.

మాటలతో పాటు ప్రయాణం కూడ బహుదూరం సాగింది. ఉత్తరకోసల భూముల్లోకి ప్రవేశించాడు శ్రావణుడు. తెల్లవారవస్తుండగా - తల్లి "దప్పిక" పడ టంతో ప్రయాణాన్ని ఆపి చెట్టుక్రింద వారిని దింపి కలశాన్ని తీసుకొని, సరయూ తీరానికి చేరాడు. "శబ్దవేధి"ని సాధనచేస్తున్న కోసలాధీశుని బాణం నీటిని ముంచు కొంటున్న శ్రావణుని గుండెల్లో గ్రుచ్చుకొంది. ముని కుమారుని ఆర్తనాదంతో పరుగెత్తుకొచ్చారు దశరథుడు.

"రుధిరార్ద్రీక్షతగాత్రుడై మిపులనోర్పుస్వీడి, రోదించుచున్
అధరస్పందము సేయుచప్పుడపుడమ్మాయ చు, గ్రూరాశుగ
వ్యధకుందాళగ లేక కొట్టుకొను నా వైశ్యాన్వయుండు" 2

జూచి కరుణా వ్యగ్రాత్ముడై ప్రశ్నించాడు. శ్రావణుడు తన వృత్తాన్తాన్ని చెప్పి మార్గాన్ని నిర్దేశించి తల్లి దాహం తీర్చవలసిందని ప్రార్థిస్తాడు. తల్లి దాహాన్ని సైతం తీర్చలేని తన దురదృష్టానికి విలపి స్తాడు.

"ఔరా! యెంత విచిత్ర సంఘటన మాహా! యొక్క భూపాల పు
త్రీరాగాగ్నికి దప్పివచ్చి యిటు ధాత్రీపాలు బాణాగ్ని కే
నీరీతిన్ బలియైతి నా జననియెంతే దప్పితీర్పంగ దా
నీరంబిమ్మని యెన్నిసార్లబెనో! నిర్భాగ్యుడే నన్నిటన్" 3

బాణాన్ని లాగివేయవలసిందని, దప్పిక తీర్చిన తరువాతే నీవు నా విషయం అక్కడ ప్రస్తావించవలసిందని దశరథుని హెచ్చరించి ప్రాణాలు వదిలాడు శ్రావణుడు.

---

1. వాల్మీకరా-అయోధ్య-63.50 2. శ్రావణచరిత్ర-4-39 ప.
3. శ్రావణచరిత్ర-4-76 ప.

మంచినీటి పాత్రను చేతుల్లో ఉంచుకొని బరువుగా అడుగులు వేస్తూ వృద్ధ దంపతుల జేరాడు దశరధుడు. అడుగుల సవ్వడిని బట్టి వచ్చినవాడు కుమారు డనుకొన్న విశ్వనాధుడు ఆలస్యానికి కారణాన్ని మృదువుగా ప్రశ్నించాడు. ప్రేమగా దగ్గరకు రమ్మన్ని, కలశాన్ని అందించి దప్పిక తీర్చమని తల్లి అన్నపూర్ణ ఆరాట పడింది. కాని సమాధానంలేదు. "ఇతడెవండో పరుండు, సుతుండు గాడుమా!" అంటూ భర్తతో అనుచుండగనే విశ్వనాధుడు ఆగంతుకుణ్ని విలేసి, ప్రశ్నించాడు. గతగడలాడి పోయాడు కోసల నాధుడు. ముందు దాహం తీర్చుకోండి అనంతరం విషయమంతా వివరిస్తానన్నాడు. ఆ దంపతుల ఎదలో అనుమానం బీజమై త్వరగా వృక్షరూపం దాల్చింది. తల్లి ఎదలో గుబులు రేగింది

"మా సుతుడుండగా జలము మాకెవరీవిటు తెచ్చియీయగా
నానను నాడుపట్టి ప్రియమారగ నమ్మరొ! త్రాగుమంచు
విశ్వాసముతో నొసంగిననె నంతసమొప్పుగ గొందు గానిచో
విశ్వాసము పోయినం గొనను శ్రావణుడెందులకేగె దెల్పుదూ!" 1

అంటూ క్రోధోద్విగ్నమానసయై ప్రశ్నించింది. భార్యను ఓదారుస్తూ–విశ్వనాధుడు - దశరధునుద్దేశించి-

"అలమయూరు భృత్యు లతని అందించిరే?
లేక, యా నృపాలు రాకుమారి
ప్రణయ బంధమందు బట్టువడియె నొక్కొ!
తెలుపుమయ్య సుతుని తెఱగు వేగ"2

గద్దించి ప్రశ్నించాడు. విషయం నమస్తాన్ని విన్నవించుకున్నాడు దశరధుడు. క్షమించ ప్రార్థించాడు. తనయుని మరణ వార్త వినడంతో స్పృహకోల్పోయిన వృద్ధ దంప తులకు దప్పిక తీర్చ తెచ్చిన జలంతో స్పృహ తెప్పించాడు. భోరున విలపించారు.

"కన్నయవుడు బడెడు కష్టంబుకన్న నా
కన్నవాడు చన్న గలుగు గష్ట
మెన్నదరమె? ధరణి నెవ్వరికేని, యా
పన్నుడై తపించు బ్రహ్మయైన"3

శ్రావణుని సౌందర్యాన్ని, అతని చేష్టల్ని గుణగణాల్ని పలుభంగుల వర్ణిస్తూ, కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న దంపతుల్ని ఓదార్చ నసమర్థుడైన దశరధుడు వారి కోరికమేరకు కుమారుని శవం చెంతకు తీసుకెళ్ళాడు పుత్ర శవాన్ని తడివి చూసు కొని,విలపించి, తుదకు రోసిల్లి - తండ్రి

"మావలె పుత్రునికొఱకై
నీవును శోకంబుతోడు నీ ప్రాణంబుల్

1. శ్రావణ చరిత్ర - 4 - 95 ప. 3. శ్రావణ చరిత్ర - 4- 105 ప
2. శ్రావణ చరిత్ర - 4 - 99 ప.

వేవిలపించుచు వదలెదు
పోవిడుచునె కర్మఫలము పొందగవలదే!" 1- అంటూ
శపించారు. సరయూనదిని స్నానాదికముల నొరించి, అగ్ని సంస్కారాదులు పూర్తి చేశారు. దివ్యరూపుడై శ్రావణుడు విమానారూఢుడై వెడలిపోతూ, తల్లి దండ్రులను కూడ "సత్వరవిజేరగరండని ధైర్యం చెప్పాడు." యోగరీతిని ప్రాణ త్యాగం చేసి, ఊర్ధ్వగతులయ్యారు, అనాధప్రేత సంస్కారం పూర్తి చేసి చేతులు కడుక్కున్నాడు దశరధుడు.

అక్కడ ఇందిరా రమణి శ్రావణుని పునరాగమనం జరక్కపోవడంతో విచా రించి, అర్ధరాత్రి సమయంలోనే అతన్ని వెతుక్కుంటూ, అరణ్యమార్గంలో ప్రయా ణించి, తుదకు దశరధుడున్న తావుకు చేరుకొంది. - శ్రావణుని రూపురేఖ విలాసాల వర్ణించి, ఎక్కడైనా చూశావా అంటూ ప్రశ్నించింది. "చెల్లీ! వారెవరు నీకు చెప్పు" మని ప్రశ్నించిన దశరథేశునితో-

"అన్నా! దైవకటాక్షమున్న యుపకుండాతండు మద్పుత్రయుం
గన్నుల్లేని తదీయ వృద్ధజనకుల్ నాయత్తమామల్ నిజం
బన్నా! చెప్పగదన్న వారినొకొ నీ యస్త్రంబుచే జంపు టం
చన్నారీమణి తొందరించెను నృపాలాధీశు సత్యాశతోన్"2

చావు కబురు చల్లగా చెప్పాడు రాజా. మూర్ఛపోయింది నాచకన్య స్పృహ తెప్పిం చిన దశరధునితో శ్రావణుచితాగ్నిని దర్శింపజేసుకొని, సరయూలో స్నానంచేసి, మరుజన్మలోనైనా భర్త కావలసిందిగా శ్రావణుని ధ్యానించి, చితాగ్నికి ముమ్మారు ప్రదక్షిణం చేసి-

"యముని దూతలు ననుదారి నడ్డగింప
కున్న జేరగవత్తు నీ వన్నిధికెటు
లేనటంచు, దోసిలినీరు నేటి గట్టు
నందు విడిచి...."3

చితాగ్నిలో ప్రవేశించింది ఇందిర, రిచ్చపడిపోవడం దశరధుని వంతయ్యింది.

"యిప్పటికి వల్లురీల్గిరి యేనకార
ణముగ, నా నాల్గు పాపసంద్రంబులనగ"4

వల్లురి చావుకి తాను కారణమయ్యాననే వేదన రాజును క్రుంగదీయడంతో తానుసైతం ఆ చితాగ్నిలో పడి ప్రాణత్యాగం చేసుకోవడానికి సిద్ధపడతాడు. ఇంతలో నారదుడు ప్రత్యక్షమై—"ఆమునీంద్రుడిడిన శాపమక్షరాల
మంగళాశీస్సులుగ నీకు బరిణమించు"5

---

1. శ్రావణ చరిత్ర - 4 - 117ప. 2. శ్రావణ చరిత్ర- 4 - 146 ప.
3. శ్రావణ చరిత్ర - 4 - 159 ప 4. శ్రావణ చరిత్ర - 4 - 160 ప
5. శ్రావణ చరిత్ర - 4 - 165 ప

అని "శాపాన్ని" ప్రస్తావన్న వరంగా మూర్చి, భరతవాక్యం పల్కుతాడు కావ్యానికి—కాళిదాస మహాకవి సైతం-శాపాన్ని విన్న దశరథుని నోటితో-

"శాపోప్యదృష్టం తనం మాదన పద్మశోభే
సామగ్రిహో భగవతా మయి పాతితో ఽయమ్" 1

అనిపించి, శాపాన్ని వరంగా మార్చారు.

ఈ కావ్యమంతా నాటకరీతిలోనే కొనసాగుతుంది. రంగస్థలం మీద పాత్రల వలెనే సంభాషణా నిర్మాణం సైతం నిర్వహించబడింది. ఒక 'ఖండం' పూర్తికాగానే సన్నివేశం మారడం—మరికొన్ని పాత్రలతో పాటు వ్రతి సన్నివేశంలోను శ్రావణ, అన్నపూర్ణా విశ్వనాథులు తప్పనిసరిగా ఉండటం-మనం గమనించవచ్చు. అహింసా ప్రబోధాన్ని ప్రత్యేకంగా పసిగట్టుకొని చేయించినట్లున్న సన్నివేశాలు కథకు అంతగా అతకవు. అయినా గాంధేయుడైన కవికి అవి అనివార్యం.

అయితే "అహింసనుగూర్చి, ఆర్థిక తారతమ్యాల గూర్చి, దానప్రదానాల గూర్చి, దైవభక్తి తాత్పర్యాల గూర్చి, సమయానుగుణంగా కవి చేసిన ప్రబోధము జాతికి మార్గ దర్శనమగుటయే కాక, కవి జీవితాదర్శాలను సైతం వ్యక్తపరుస్తోంది.

"పురుటిపావ, పూలపొత్తిలి, బోసిబాలు, బువ్వతిందు, అన్నమో రామచంద్రా చన్నుచేపు, పలుగాకులైన లోకులు, పేరుగొప్ప ఊరుదిబ్బ' వంటి నామడులు కవికి గల మడికారపు సొంపుకు నిదర్శనాలు.

"శ్రీ విద్వాన్ అంబటి సుబ్బరాయ గుప్తాగారు భారతీయాధ్యాత్మిక దృష్టి, ధర్మతత్త్వము ఆ మూలాగ్రింగా అవగాహన చేసుకొన్నవారు. సర్వజన వేద్యమైన సులభశైలిలో నాలుగు ఖండాలలో ఈ పద్యకావ్యం రచించారు. వీరి కవితాశక్తికి,యీ పద్యరచన మేలుబంతిగా స్వీకరించవచ్చును—"2 అన్న శ్రీ పిలకా గణపతి శాస్త్రిగారి పలుకులు అతిశయోక్తులుకావు.

"అర్థసౌలభ్యము, పద్యములు హృద్యముగా వడిపించు లయయు (Rythm) ముఖ్యాశయాలుగా రచింపబడిన కావ్యమగుటచే నిందు యతులు, సంధులు, శకట రేఫానుస్వారాది ఛందో వ్యాకరణపు మురుటులందు కొంత 'మడి' సడలుట అనివార్యమైంది"3. అని కవిగారే చెప్పుకున్నారు. ఆంధ్రద్రావిడ భాషలకే సొంతమవదగిన యతి విషయమున కొంత 'మడి' యున్న బాగుండెడిది.

"శ్రావణచరిత్ర' కావ్యంగా తెలుగులో రావటం ఇదే ప్రథమమని విమర్శకులు భావించి యున్నారు. 4 కానీ ఇంతకు పది సంవత్సరాలముందే శ్రావణము ఆవిర్భవించిందన్న విషయం వీరు గుర్తించకపోవటం విచార్యం.

1. రాను. - పు. 736
2. శ్రావణచరిత్ర -పీఠిక -
3. పెజ్జ పి -. పు. 165
4. భారతి - 64 - 6సం - పు. 68

## పి తృ భ క్తి

పై రెండు కావ్యాలకు-ప్రతిబింబంగానే గాక, స్వరూపంగాను కల్పించేకావ్యం. "పితృభక్తి" ఖండిక. ఇది పూర్తిగా గొట్టుముక్కలవారి కావ్యాన్ని ఆధారం చేసుకొని వ్రాయడమే-కాక వారి కావ్యంలోని కొన్నిపద్యాలు, పద్యపాదాలు సరాసరి వీరికావ్యం లోకి ప్రవేశించాయి. కనీసం వారి పేరును కూడా ప్రస్తావించలేదు. గొట్టుముక్కల వారిపై కవికున్న అభిమానమే ఈ విధంగా వారి పద్యాల్ని వాడుకోవివ్పించడవడం- సాహితీ విమర్శకుల సహనానికి నిదర్శనం. ఇది నూటఇరవై ఒక్క పద్యలమూట.

కథ యథాతథంగానే ఆమ్రేడితం కాబట్టి తిరిగి చెప్పడం పునరుక్తం. ఇక చూడవలసింది గొట్టుముక్కలవారి రచన వీరికెంతవరకు ఆదర్శమైందన్నదే.

"నవ నవ భావముల్ నుతగుణ శ్రుతవృత్త పదార్థరీతిపై భవము లలంకృతుల్" 1
—ఇత్యాది పద్యం

"విదిత మహార్థముల్ సుజన విశ్రుత వృత్తులు నద్భుతంబులౌ
పదము లలంకృతుల్................"2

అనే గొట్టుముక్కలవారి పద్యానికి ఛాయ. రెండును చంపకమాలలే. అదే విధంగా—

"పొరుగింటి పసిపాప పోర్వెట్టి తల్లివి
తెలవారు దాక వేధించునపుడు" - (పితృభక్తి – 18 ప)

"పొరుగింటి పసిపాప నిద్దురవోక తల్లివి
విదురింపనీక దండించు నపుడు" – (శ్రావణము - మ - 1 -17ప)

అన్న పద్యానికి ఛాయ—

"తమ యింటి దాసి గర్భము దాల్చి కవి యెత్తి
కొడుకు చెక్కిలి ముద్దుగొనెడు వేళ" - (పితృభక్తి - 18 ప)

అన్న పద్య పాదం గొట్టుముక్కలవారి -ఈ పద్యానికి ప్రతిరూపం.

"తమ యింటి దాసి గర్భము దాల్చి ప్రసవించి
గొడుకు చెక్కిలి ముద్దుగొనినయపుడు" - (శ్రావణము- మ-1-7ప)

"వృద్ధదంపతులు స్వాత్మజీవితోద్యానమిట్లు
మొరడువారుట యెంచి వాపోవుచుంద్రు"—(పితృభక్తి- ,8ప)

అన్న తేటగీతి పాదం—

"వృద్ధదంపతు లాత్మజీవితము లిట్లు
మొరడు వోవుట దలచి వాపోవుచుంద్రు"—(శ్రా.-మ-1.17ప)

అన్న శ్రావణంలోని తేటగీతిలోని మూడు, నాలుగు పాదాలే.

---

1. పితృభక్తి - ప.17 2. శ్రావణము - మ-1-15 ప

పూజలు ఫలించి అన్నపూర్ణ కొడుకును ప్రసవించింది. బిడ్డను చూసి మురిసి పోయిన నాధుని కన్నుల్లో కన్పించే కాంతిపుంజాలకు ఆనందాశ్రువులు రాల— 'ధన్యోస్మి' అనుకుంది అన్నపూర్ణ.

"ఊయెల తొట్ల నూతగొని యుత్సుకతన్ సుతుముద్దు మోము నా

ప్యాయముగా గనుంగొనుచు హర్షసముద్భవ బాష్పబిందువుల్"1

అన్న పద్యం-శ్రావణంలోని

"ఊయెల త్రాడులనూతగాగొని వంగి

కొమరుని శిరము మూర్కొనెడు వాని"

అన్న సీస పద్యానికి భిన్నచ్ఛందోనుసరణం.

శ్రావణుడు అసమాన సౌందర్య తేజోనిరాజితుడై వైదుషీప్రకర్ష చేత ప్రతిపక్ష సర్ప విద్రావణుడై గురుకులంలో సకల విద్యల నేర్చుకొని ధర్మవ్యవస్థకే అలంకార భూతుడై "పితృదేవోభవ" అనెడి పవిత్ర మంత్రాన్ని సదా ధ్యానిస్తూ మాతాపితరుల నత్యంత భక్తితో సేవించసాగాడు. కథ యావత్తు 'శ్రావణ మందలిది'వలెనే కొనసాగింది.

ఇట్లా అనుకరణలు, ప్రతిరూపాలు సాగినా శ్రీ నరసింహ దీక్షితుల పద్య విద్య హృద్యంగా ఎలా సాగిందో చూద్దాం.

శ్రావణుని చూచి ఒక రాచకన్య పాణిగ్రహణ కాంక్షతో ప్రణయ వార్త నందించింది. తిరస్కరించాడు శ్రావణుడు.

"సరసత్వంబును గూల్చు, నిర్భర మనస్సాహిత్యముందాల్చు, ని

బ్బరముందవ్వానరించు, భీతిగొలుపున్, వైదుష్యముందుంచుభీ

కరసర్పానన చుంబనక్రియ విషార్తంబుల్, మహాపత్పరం

పరకున్ హేతువు లెల్లరీతుల దలంపన్ రాజబంధుత్వముల్" 2

రాజబంధుత్వాన్ని కాదని, నడిరేయిన బయలుదేరి ఆ నగరాన్ని వదిలివేశాడు. సాయంకాలానికి దశరథావనీనాధ పాలిత ప్రాంతాలకు చేరుకున్నాడు. అడవిజీవుల వన సంచారాన్ని భావించుకొని, ఆ వాసాలకు చేరే సమయంలో తల్లిదండ్రుల ఒక మూల దింపాడు.

దశరథావనీనాధుని ధర్మత్వాన్ని విశ్వసించి, మదిలోని కొండలముడిందు వడగా- ముఖంలో తొట్రుపాటు తగ్గి ప్రశాంతచిత్తుడైనాడు శ్రావణుడు.

"దశరథ క్ష్మాతలాధీశ ధర్మపాల

నాపునీతమ్ములైన కానవములివ్వి

భీతిలే దిట మందుడో పితరులార!"3

1. పితృభక్తి - 23 ప. 2. పితృభక్తి - 77 వ

3. పితృభక్తి - 85 ప.

అంటూ అంధులైన తల్లిదండ్రులకు శ్రావణుడే ప్రదేశాన్ని నిర్దేశం చేసి ఔచిత్యాన్ని పోషించారు చింతలపాటివారు. గొట్టుముక్కల కవి-విశ్వనాధునిచే-

"కానలియ్యని దశరధాత్మజశేందుని
ధర్మపాలనచే పునీతములు బిడ్డ"

అని గుడ్డివానిచే అనిపించటం సముచితంకాదు. సరయూనదిలో నీరుముంచుకొన్న శ్రావణుడు - దశరధుని "శబ్దవేది" విద్యకు లక్ష్యమై నేలకూలాడు. కంపించిన శరీరం నుండి స్వేదపుచేరులు ప్రవహిస్తుంటే మునిబాలుని సమీపించారు మహారాజు—

"ప్రకృతి తనవంక గనుగొని పకపకమని
పరిహసించుచు దెగడుమాదిరిగ దోచె
నృపతికి, కాతని దుష్కృతి నిక్కి బాకు
పొడిచినట్టులయ్యె కుర్రింగి పొగిలి వేడు"1

తన్ను సమీపించిన రాజుతో, తల్లిదండ్రుల దప్పికతీర్చవలసిందని ప్రార్థించిప్రాణాలు వదిలాడు శ్రావణుడు. మునిబాలకుని కళేబరాన్ని భుజానవేసుకొని భీతవిలోలచిత్తుడై వృద్ధదంపతుల జేరాడు. అడుగుల సవ్వడిని-పాదాలపైవ్రాలిన అన్యపురుషునివిగా గ్రహించి-ఎవ్వడవీవు మాకొమరుడేడి" అని ప్రశ్నించి మరణవార్త విని మూర్ఛపోయి, కోసలేశుని నవర్యల తేరుకొని—

"అరరె? కిరాతకా! నృపతివా? కరుక్రొవ్వున నెంత చేసినా
వుర! కుటిలాత్మ!....................."
.... ..........."శబ్దభేది"కా
దుర యది ప్రాణిహింసకయి తోచిన మామక వంశభేదిరా!" 2

అని విశ్వనాధుడు విలపించిన విలాపంలోని చివరిపాదాలు పది సంవత్సరాల క్రితం అవిర్భవించిన శ్రావణకావ్యంలో-దశరథుడు తనలో తాను వ్యధజెందుతూ అనుకొన్న మాటల ప్రతిధ్వనులు.

"త్వత్ప్రయుక్తంబు దారుణాస్త్రంబు శబ్ద
వేధి గాదుర యది వంశ భేదిగాని" 3

బిడ్డ శవంపై పడి విలపిస్తూ, దశరధుని శపించి, యోగమార్గాన ప్రాణాల్ని త్యజించారు వృద్ధ దంపతులు. మునిశాపాన్ని వరంగా భావించి ఆనందించారు దశరధుడు,

1. పితృభక్తి - 94 ప.
2. పితృభక్తి-ప. 105 3. శ్రావణం-మ-10.34 ప

## శ్రీవణావలోకనం

"శ్రావణ చరిత్ర" అందించిన కావ్యాలలో గొట్టుముక్కల వారి కావ్యం మొదటిది. ఆదికవి వాల్మీకి-మునికుమారునకు-పేరు పెట్టలేదు. దశరథుడు కౌసల్యతో -వృత్తాన్తం చెపుతూ- వనౌకసః 3- తాపసం 4-మునిసుతః 5 వంటి పదాలతో ప్రస్తావన కొనసాగించాడు. తులసీరామాయణంలో "సరవణుడు" గ ఈ కథా వృత్తంలో మునిబాలకుడు పేర్కొనబడ్డాడు. తాను బ్రాహ్మణుడగాదని మునిబాలకుడు స్పష్టంగా ప్రకటిస్తాడు.

"నద్విజాతి రహం రాజ! న్మాభూత్తే మనసోవ్యథా" తాను వైశ్యుని కుమారుణ్ణని చెప్పుకొన్న మునిబాలకుని పలుకులే-లఘుకావ్యకర్తలకు మార్గదర్శకాలు, ముగ్గురు ఈతని వైశ్యపుత్రునిగానే చిత్రించారు.

గొట్టుముక్కలవారి పూర్వఖండాన్ని ఉత్తర ఖండాన్ని కల్పించి, మేఘ సందేశ వృత్తంలో ముడివేస్తే-గుప్తా గారు "విష్ణుదాస" నామక రాజకొమార్తెగా అన్నపూర్ణను పరిచయంచేసి,అన్నపూర్ణా విశ్వనాథుల బిడ్డగా అందించారు శ్రావణుని. "క్షత్రియ స్త్రీయందు వైశ్యునకు పుట్టినవాని "శబరు" డంటారని నారదీయ పురాణం చెపుతోంది. నృపాణం వైశ్యజాతో యశ్చబరః పరికీర్తితః"1 "శూద్రాయా మస్మి వైశ్యేనజాతో"2 అంటాడు వాల్మీకి శ్రావణుడు "శూద్రా విశో-ఒస్తు "కరణ" అని3 అమరము.

"చింతలపాటివారి కావ్యం రామకృష్ణ కవి కావ్యానికి ఛాయా మాత్రంగాక- కొన్ని మక్కికి మక్కి అనుసరణమై దాని ప్రత్యేకతల కోల్పోయింది. రాజకుమార్తె ప్రస్తావన మూడు కావ్యాల్లోను సమానమే.

"""గొట్టుముక్కల" వారి కావ్యం రమ్యవన్యైవక్యంతో, కథా కథన నైపుణితో సమయానుగుణ వర్ణనలతో రసనిష్యంది కాగా- "అంబటి" వారి కావ్యం కమనీయ దృశ్యకావ్యంగా రాణించింది. చింతలపాటి వారి కావ్యం పదాలు, కొన్ని సమాసాలు, గొట్టుముక్కల వారివే వాడుకొన్నా-సూర్యోదయ సూర్యాస్తమయాది వర్ణనలలో కొన్ని పట్టులు తమ అస్తిత్వాన్ని నిలుపుకొన్నారు. గొట్టుముక్కలవారిని వీరి కావ్యారంభంలో ఒక్క పరి ప్రస్తావించియుంచే-వీరి గౌరవం-వీరి కావ్య గౌరవం ఇనుమడించేది.

"శ్రావణకథ గొట్టుముక్కల వారి కావ్యంలో మల్లెల పరిమళాన్ని వెదజల్లు చుండగా, గుప్తాగారి కావ్యంలో తెల్లగులాబీల సొగసులతో అహింసా మూర్తియై విరాజిల్లింది. చింతలపాటి వారి 'కావ్యం గొట్టుముక్కల వారి మల్లెల గుబాళింపు

---

3. వాల్మీకం-అయోధ్య-63.24
4. వాల్మీకం-అయోధ్య- 63.35
5. వాల్మీకం—అయోధ్య-63. 47
6. వాల్మీకం-అయోధ్య-63.50

షణికి పుచ్చుకొని, మందార సుగంధాలను అందందు నిలుపుకొని ప్రత్యేకతను కాపాడుకోవటానికి యత్నించింది.

గొట్టుముక్కలవారి కావ్యాన్ని తల్లిదండ్రులకే అంకితమిచ్చి "శ్రావణుని" పితృభక్తితో తమ పితృభక్తిని జోడించారు. అంటటివారు అహింసాజ్యోతి గాంధీ జీవితంలో వెలుగునిచ్చిన ఈ కథను ఆంధ్రజ్యోతి శ్రీ పొట్టి శ్రీరాములకంకితమిచ్చి-తమ అహింసా సిద్ధాంతాభిలాషను స్వాతంత్ర్య పిపాసను ప్రకటించుకొన్నారు. "చింతలపాటి" వారు పితృభావనతో తమ కావ్యాన్ని శ్రీ మద్దులపల్లి సత్యనారాయణ శాస్త్రికి అంకితమిచ్చారు. వీనిలో ప్రధానాంశం పితృభక్తి కావున పితృభావనతో అంకితం చేయటం ఉదాత్తం.

గొట్టుముక్కలవారి కావ్యానికి కాశీభట్ట సుబ్బయ్య శాస్త్రిగారి "శ్రావణవిజయము" అనే వచన కావ్యమాధారమని చెప్పుకొనగా-గుప్తాగారు కూడా "శ్రావణవిజయము" ననుసరించియే తన కావ్యాన్ని వ్రాసినట్లు చెప్పతూ "శ్రావణ పితృభక్తి" నాటకమును గుజరాతీ నాటకగాథ, యీ నా"శ్రావణ చరిత్ర"కు "మాతృక" అని ప్రకటించియున్నారు. అయితే "శ్రావణచరిత్ర" అనే గుప్తాగారి కావ్యంలో లేని పూర్వకథ అనగా ఊర్వశీ నలకూబరుల వృత్తాన్తం శ్రావణము అనే గొట్టుముక్కలవారి కావ్యంలో కన్పిస్తోంది. పాత్రలన్నీ రెండు కావ్యాల్లోను సమానాలే కాని రత్నగుప్త, సువర్ణగుప్త స్నేహ, విద్యాభ్యాసాలు, నౌకావాణిజ్యం, విష్ణుదాస మహారాజ వృత్తాన్తం గుప్తాగారి కావ్యంలోని విశిష్టత. చింతలపాటి వారు "రాచకన్నె"ను ప్రస్తావించి పేరుపెట్టకపోగా, మిగిలిన ఇద్దరు కవులు "ఇందిరాదేవి" "ఇందిరాకన్య" లుగా రాచకన్యను ప్రస్తావించారు.

గొట్టుముక్కలవారి కావ్యం సత్త్వగుణం, గుప్తాగారి కావ్యం రజోగుణం, చింతలపాటి వారి కావ్యం తమోగుణ ప్రధానాలుగా స్వీకరించవచ్చు.

---

1. ఆశ్చర్య రామాయణం 2-16 స.పు.357
2. వాల్మీకి రామాయణం-అయోధ్య-63 59
3. వ్యాఖ్యానచతుష్టయం—పు.750

# భ ర తు డు

రామకథలో రామచంద్రుని కీర్తిచంద్రికల నొరుసుకుని నిలబడగల్గిన గుణ భద్రుడు కైకేయీపుత్రుడు భరతుడు. ఏ అధికారం కోసం, రాజ్యభోగాల కోసం "భారతం"లో రక్తపుటేరులు పారాయో, వాలీసుగ్రీవులు, రావణాదులు తమలో తాము సంఘర్షించుకొన్నారో, అటువంటి రాజ్యలక్ష్మి కోరి వచ్చినా వలదని త్రోసి పుచ్చడమే కాక, భ్రాతృసేవా పరాయణుడై దాసానుదాసుడుగ మారి, సభామధ్యంలో "రాజ్యంచాహంచ రామస్య"1 అంటూ ఠీవిగ నిలిచియొగ్గి ఆ మహనీయుని తీసుకురావటం కోసం చిత్రకూటానికి వెళ్ళి, ఆయనమాటల త్రోసిపుచ్చలేక, పాదుకలతో మరలి, రాముని పేరనే పదునాలుగేండ్లు నిష్కాముడై రామప్రతినిధిగా రాజ్యమేలిన సుగుణో దాత్తుడు, రాజయోగిగా, యోగిరాజుగా కీర్తి శిఖరాలనధిష్టించిన ఉదాత్తగుణోపేతుడు భరతుడు.

పదునాలుగేండ్లు రాజ్యాన్ని పాలించి అన్న రాక ఆలస్యమైతే అగ్నిప్రవేశం చేస్తానన్న నిష్కాముడితడు. ఈ మహనీయుని కన్నతల్లి కైకేయి ఏదైనా పాపం చేసి ఉంటే-అది ఈ పుత్రుని పుణ్యరాశిలో ప్రక్షాళనం గావించబడి, పవిత్రీకృత మైంది. భరతుని దృఢభక్తి, తృష్ణాపరాఙ్ముఖత మాతృమూర్తి కల్మషాన్ని నైతం కడిగివేయబడింది2 అన్నారు మహాకవి కాళిదాసు.

భ్రాతృప్రేమలో రామభరతులిద్దరూ పోటీపడతారు. చిత్రకూటానికి వస్తున్న భరతుణ్ణి చూసి, యుద్ధానికొస్తున్నాడని సందేహించి క్రోధించిన లక్ష్మణునితో శ్రీరాముడు-

"వక్ష్యామి భరతం దృష్ట్వా రాజ్యమస్మై ప్రదీయతామ్"3

అంటాడు, నీకు రాజ్యం కావాలంటే భరతునికి చెప్పి ఇప్పిస్తానన్న రామునితో రామానుజుడు ఇంకేమనగలడు. రాజ్యభోగాల్ని భార్యాబంధువుల్ని వదలి అన్నవెంట అడవులకొచ్చిన తమ్మునికి అప్పుడర్థమైంది భరతుని ఔన్నత్యం.

భరతలక్ష్మణులకు రామునియందున్న ప్రేమ అపూర్వమే. ఇరువురకు రాము డంటే ప్రాణం. ఇరువురు రాముని సుఖాన్నే గాఢంగా కాంక్షించారు. రామసేవనే వాంఛించారు. కాని ప్రవృత్తిలో తేడా ఉంది. లక్ష్మణునకు రాముని చెంతనే ఉండి ఆయన్ని చూసుకుంటూ సేవ చేసుకోవడమే కోరిక. కాని ధర్మాధర్మ విచక్షణ అత నికి లేదు రామునికి సుఖం కల్గించటానికి తలిదండ్రుల్ని సంహరించడానికైనా వెను కాడని తత్త్వం అతనిది. లక్ష్మణునికి రాముని సుఖమే ధర్మం.

---

1. వాల్మీకం-అయోధ్య-63-47
2. దృఢభక్తి రితిజ్యేష్ఠే, రాజ్యతృష్ణా పరాఙ్ముఖః
   మాతుః పాపస్య భరతః ప్రాయశ్చిత్త మివాకరోత్"-రా-సు-పు-732.
3. వాల్మీకం-అరణ్య-97-17

కాని భరతునకు రాముని చెంతలేకపోయినా రాముని కొలకు, ధర్మబద్ధ మయిన యాతని యాజ్ఞకొలకు శిరసొగ్గటం - తాను ధర్మమని తలచిన దానిని రాముడు చెప్పినా అంగీకరించని స్థైర్య సంపద అతని కున్నాయి. రాజ్య స్వీకార నిరాకరణమే ఇందుకు ప్రబల నిదర్శనం. తల్లికోరికలు, తండ్రి వాగ్దానాలు అంగీక రించబడలేదు. జ్యేష్ఠుడే రాజు కావాలన్న క్షత్రియధర్మం ప్రబలమైందక్కడ. అందుకే తాను రాముని అంగీకరింపజేశాడు. రామ ప్రతినిధిగా పరిపాలిస్తానన్నాడు. రామునకు భరతునిపై ప్రేమాధిక్యత ఎన్నో పర్యాయాలు వేరు వేరు తావుల్లో ప్రదర్శించ బడింది. దోహద క్రియలచే పెంచబడిన ఉద్యాన లతవలె లక్ష్మణుని ప్రేమ రాముని చెంత రమణీయమై వెలుగ - భరతుని ప్రేమ - ప్రకృతిలో పెంపారు అరణ్యలత వలె పెంపారినదిగా భావించవచ్చు. చెంతనుండి సేవించువారొకరు కాగా, దూరమున నుండి "తు. చ." తప్పకుండా విధి నిర్వహణ సేయువారొకరు. — అరణ్యలతికా పరిమళం ఉద్యాన పుష్పాల కెక్కడిది?
అందుకే గుహుడు భరతునితో —

"అయత్నా దాగతం రాజ్యం య స్త్వ్యక్తుమిహేచ్ఛసి
ధన్య స్త్వం నత్వయా తుల్యం పశ్యామి జగతీతలే"

లోకంలో నీవంటివారిని చూడలేనన్న" గుహుని పల్కులక్షర సత్యాలు - భరతుని పాత్ర భారతీయ సాహిత్యానికి మణిమకుటం. కాని రామచంద్రుని పాదాలచెంత శిరస్సువాల్చిన ఆ భక్తుని తన కాంతిలో కలుపుకొన్న శ్రీరాముడు - ఏకరూపుడుగ విరాజిల్లాడనిపిస్తుంది.

అయాచితంగా వస్తున్న రాజ్యాన్ని వదలివేసి. భూశయనం, జటావల్కల దారణం వ్రతంగా స్వీకరించి, పాదుకాపూజలో పద్నాలుగేళ్ళు గడిపిన రామభక్తుడు భరతుడు. కర్మిష్ఠి, రాజయోగి. అందుకే — వేదాంతదేశికులు "తనయుపజ్ఞామహిమచే నను త భూమి యందును రామపాదుకా ప్రభావాన్ని సమారాధ మొనర్చిన భక్త వరులలో ప్రధానుడు భరతుడంటారు.

"భరతాయ పరం నమోఽస్తు నిత్యం ప్రథమో
దాహరణాయ భక్తిభాజాం యదుపజ్ఞ మ
శేషతః పృథివ్యాం ప్రథితో రాఘవపాదుక ప్రభావః"2

వేదనతో క్రుంగేటప్పుడు, ఆనందంలో పొంగేటప్పుడు శ్రీరామునకు భరతుడే గుర్తు కొచ్చేవాడు. వారి ప్రేమ అటువంటిది. భరతునిలో భ్రాతృభక్తికన్న "త్యాగభావనే" రామునివద్దకు చేరడానికి తోడ్పడింది. అతని విశుద్ధ ప్రేమవర్తనం మానవ ప్రపంచంలో భ్రాతృప్రేమకొక పవిత్రోదాహరణగా మిగిలిపోయింది.

---

1. వాల్మీకం - అయోధ్య - 85 - 21. 2. పా.సు - పు - 731.

"న సర్వే భ్రాతరస్తాత భవంతి భరతోపమాః"1 అన్న రాముని పల్కుల్లోనే భరతుని ఔత్కృష్ట్యం విరాడ్రూపంగ భాసిస్తుంది. "అహమేవ నివత్స్యామి చతుర్దశ వనే సమా" అని అరణ్యంలో పితృాజ్ఞకులోబడి పధ్నాలుగు సంవత్సరాలు విలుస్తా నని భరతుడు సిద్ధపడితే – "జానామి! భరతం క్షాంతం గురుసత్కార కారణమ్" అని మెచ్చుకొని –

అనేన ధర్మశీలేన వ్రతాత్ ప్రత్యాగతః పునః"

భ్రాత్రాసహ భవిష్యామి పృథివ్యాః పతిరుత్తమః"2

తమ్ముని ప్రార్థనను మన్నించి, పధ్నాలుగేండ్ల తరువాత అతనితో కలసి రాజ్యాన్ని పంచుకుంటానంటాడు జ్యేష్ఠుడు. రాముని వెంటనుండి రామసేవలో ఆనందాన్ని పొందిన తమ్ముడు లక్ష్మణుడు కాగా, అన్నగారికై అయోధ్యనే అరణ్యంగా భావించి, జీవించిన మహావీయుడు భరతుడు. ఒక్క మాటలో చెప్పాలంటే – ఇంత త్యాగ మూర్తి, ఋజువర్తి, భ్రాతృవత్సలుడు. ప్రజాశ్రేయః కాముడు,నిష్కామ కర్ముడైన ఉత్తమ పాత్ర నాన్యతోదర్శనీయం.

"రామాదపి హితం మన్యే ధర్మతో బలవత్తరం"3 అన్న దశరథుని పల్కుల్లోను – "దిష్ట్యానచలితో ధర్మాదాత్మతే శుభలక్షణః"4 అని కౌసల్య – "సత్యసంధే మహాత్మని"5 అనేన ధర్మశీలేన "భరతః ఖలు ధర్మాత్మా"6 "భరత స్సత్యవిక్రమః"7 అన్న సముదాత్త ప్రశంసలు వాల్మీకివి. రామునివి. వాల్మీకంలో చిత్రకూట సమాగమం అత్యంత కరుణారసభరితమైన సన్నివేశం కాగా - "రామ చరితమానస్"లో భరతుని పాత్ర మరింతగా రమ్యతనాపాదించుకొంది. చిత్రకూట వాతావరణమంతా ఆ సౌభ్రాత్రసౌరభంతో నిండిపోతుంది. ఈఘట్టం వేయిప్రయాగల కన్నా, పవిత్రమైందని రామాయణ విమర్శకుల భావన.

భరతుడు చిత్రకూటానికి తరలి వస్తున్నాడని తెలిసి, ఉత్తేజితుడయిన లక్ష్మణునితో రాముడు ఇలా అంటాడు.

"కహీతాత్ తుమ్హసీతి సుహా ఈ, పనితే కఠిన్ రాజమదుభాయీ
సునహు లఖన్ భలభరత సరీసా, బిధీ ప్రపంచ మహసునా నదీసా
భరత హి హత్తి నరాజ మదుబిధి హరిహార పదపా ఇ
కబహంకి కాంజి సీకరని ఛారసింధు బినసాఇ"8

1. వాల్మీకం - యుద్ధకాండ - 14, 15శ్లో 6. వాల్మీకం - 31 - 115
2. వాల్మీకం - అయోధ్య - 62 - 12
3. వాల్మీకం - అయోధ్య - 61 - 75 - 21 7. రా.మా - 117
4. వాల్మీకం - అయోధ్య - 30 - 111
5. వాల్మీకం - అయోధ్య - 31 - 111

నాయనా! లక్ష్మణా! నీవు చక్కని నీతివాక్యాన్ని చెప్పావయ్యా! నిజమే రాజ్యాధికారం వల్ల కలిగే అహంకారం అన్నింటికన్నా ప్రమాదభూయిష్ఠమైంది. కాని భరతుని వంటి వ్యక్తి ఈ బ్రహ్మ సృష్టిలో ఉన్నాడని వినలేదు. కంటితో చూడలేదు. బ్రహ్మ విష్ణు మహేశ్వర పదవులు లభించినా భరతుడికి అహంకారం కలుగదు. ఈ అయోధ్య ఒక లెక్కా? ఒక గంజి బొట్టు పడినందువల్ల క్షీర సాగరం మలినమవుతుందా?"1

ఈ ఒక్క ఉదాహరణచాలు భరతునిపై రామునికున్న మక్కువను గుర్తించ డానికి —రామాయణమైనా, రామచరితమానస్ అయినా రాముని ఎదలో స్థిరంగా నిల్చిన సుగుణమూర్తి భరతుడొక్కడె. ఎందరిలోనో ఉండే రామచంద్రునిలో ఉన్న సౌభాగ్యం భరతునిది.

## శ్రీ వసునందన్ భారతం

రామకథను "భారతం"గ చెప్పిన కావ్యం ఇది. "భరతుడున్నంత మేరా గట్టిగా పట్టి చూస్తే శ్రీరామచంద్రుడు నిలవడం కష్టం" అన్న విశ్వాసంతో కవి ఈ కావ్యానికి శ్రీకారం చుట్టారు. మహాసౌధానికైనా పునాదులు కావాలని తెలిసిన లోక జ్ఞుడు శ్రీ వసునందన్. కాబట్టే కథాగమనం చాలవరకు వాల్మీకానుసారమే చేసి, "కొండఅద్దమందు కొంచెమై యుండదా" యన్నట్లు ఆరువందల పైచిలుకు పద్యాల్లో కుదించారు, పద్దెనిమిది ఖండకలుగా విభజన.

"భారతం" పేరుతో రామాయణం వ్రాయడంలోనే కవి చమత్కారం స్పష్ట మౌతోంది. ప్రదేశ, పాత్రల పేర్లతో శీర్షికలు, శీర్షికల ఆద్యంతాల్లో విశేష ఛందస్సులను ప్రయోగించడం, సమవృత్తాల్ని శ్రీనుండి చంపకమాలవరకు, కావ్యాంతంలో మంగళమహాశ్రీ, కవి, కావ్య నామాలతో చక్రబంధాన్ని వ్రాయడం కవికి ఛంద శ్శాస్త్రంపైనున్న అధికారాన్ని తెలియజేస్తోంది. కొత్త కొత్త పదబంధాలు, ప్రయో గాలు సాహితీ కసరత్తులు పండితలోకాన్ని తలలూపిస్తాయి. ఒక ఖండికాంతంలోని ఛందస్సునే, అనంతర ఖండిక ప్రారంభంలో స్వీకరించడం ఇందులోని ప్రత్యేకత. ప్రతి శీర్షిక క్రింద వాల్మీకి కృత తత్సంబంధోచిత సమాసాన్ని కాని, పదబంధాన్ని కానీఉట్టంకించటం నూత్నప్రయోగం.

"అయోధ్యా" నగర వర్ణనతో కావ్యం ప్రారంభమౌతుంది. ధర్మం నాలుగు పాదాల నడుస్తుండగా, దాన దయా ధర్మసౌహృదాలు ప్రకాశిస్తూ, నెలకు మూడు వానలుగా దశరథుని పాలన కొనసాగుతోంది. వేదనాదాలు మార్మోగుతున్నాయి.

---

1. రా—సు. 177పు

ధర్మప్రధానురక్తులు గాను, నిగ్రహానుగ్రహ సమర్థులై చతుర్వర్ణాలవారు విరాజిల్లు తున్నారు.

"లేవు పరాంగ నారతులు లేవు పరార్థ దురాక్రమాదృతుల్
లేవు వివేక శూన్యతలు లేవు పరస్పర వైర దూషణల్
లేవు రుజా ప్రకోపములు లేవు జలప్రళయాది ఘోరముల్
లేవు నకాల మృత్యువులు లేవు దరిద్రగుణాది భావముల్"1

"చిన్నపాపలు లేక చిన్నబోయిన" దశరథునకు, పుత్రకామేష్టి ఫలితంగా–ఇల్లాండ్రు గర్భవతులయ్యారు.

"రామభరతులు నీలాభ్రరమ్యతనులు
లక్ష్మణుడును శత్రుఘ్నుడు లలిత హైమ
దేహదీప్తి జన్మించిరి దివ్యలీల
మించి కౌసల్య కైక సుమిత్ర యలర"2

కైకమ్మ ముద్దుముచ్చటలతో రామచంద్రుడు పెరగసాగాడు. కన్నతల్లి కౌసల్యేగాని రామచంద్రుని అనురాగాన్ని అనుభవించే తల్లికైక.

"కన్నదింతియె కౌసల్యగాని రాము
ముద్దుముచ్చట లన్నియు మొదటినుండి
కైక చల్లని యొడిలోనె కన్న మమత
కన్న పెంచిన ప్రేమయే ఘనమొ యనగ"3

కైకమ్మ రాముని అనురాగంగా చూసుకొంటోంది. "కన్నమమకారానికన్న పెంచిన మమకారమే మిన్న" యనిపించింది. భరతుడు కూడ అమ్మకు తగ్గ కొడుకుగా రాముణ్ణి ప్రేమించేవాడు.

ఆటలాడే సమయంలో సైతం రాముడసహాయుడై తిరుగుతుంటే-జాలిగ ఆరాటంతో లక్ష్మణుడు పరుగులెత్తేవాడు. పదిమంది పరుగులెత్తేటప్పుడు కైకకొడుకై విడానంగ చేయిచ్చి, రాముని శ్రమను పంచుకొనేవాడు.

"ఎచటికేనియు శ్రీరాముడేగుచుండ
వలదనినయేని వినబోక వానివెంట
బడునెపుడు లక్ష్మణుడు–కాని భరతుడన్న
మాట దప్పడు మదినొవ్వ మనల దెవుడు"4

అరణ్యవాసంలో అనుసరించినవాడు లక్ష్మణుడుకాగా-ఆదుకొన్నవాడు భరతుడన్న ధ్వని ఈ పద్యంలో రమ్యంగా వినిపించింది.

---

1. భారతం – 10 ప
2. భారతం - 16 ప
3. భారతం - 25 ప.
4. భారతం - 44 ప

యజ్ఞ స-రక్షణ పూర్తి చేసుకొని మిధిలానగరం బయలుదేరారు రామాదులు. "బండబారిన" "మునికాంత" ను ధన్యజేసి, అనంతరం మిధిలలో సీతాపరిగ్రహణం-అక్కా-చెల్లెండ్రు అన్నదమ్ములు చెట్టాపట్టాలేసుకొని అయోధ్యకు బయలుదేరారు. నగరమంతా తరలివచ్చి నీరాజనాలిచ్చింది. పడుచువారి గుండెల్లో మధుమాసం విరిసింది.

"సుమంత్రుడు" రాముని తీసుకురావడానికి రామాంతః పురంజేరాడు "దశరధుడు" పట్టాభిషేకాన్ని ప్రకటించాడు. "మంథర" పట్టపువార్తన్, బట్టి జనుల్మిన్, ముట్టగకన్నుల్, గుట్ట దిరానన్"1 కైకమ్మను చేరి "లోకపు" మాటల చెప్పి మనసుమార్చింది.

"దోషగుణయుత వేళా విశేషమేమొ
మంథరాకృతి గప్పిన మాయయేమొ
కైక వృక్షతీర వారాశి కలత జెందె
వెతలనందె ధైర్యముడింటె విషము జిందె" 2

కుబుసము విడిచిన కోడెనాగై, కోపగృహ ప్రవేశం జేసింది కైక. ఉత్సాహంగ వచ్చిన దశరధుడు కైక కోరికవిని మూర్ఛపోయాడు. ప్రార్థనలు, విన్నవింపులు, మందలింపులు కొనసాగాయి.

"రాముకంటెను సద్ధర్మ భూమియైన
భరతు డగ్రజుడుండ దా ధరణి గొనడు"3

అంటూ భరతుడు రాజ్యం తీసుకోడని సమర్థించబోయాడు, దశరధుడు.

"రామాదపిహితం మన్యే ధర్మతో బలవత్తరమ్" అన్న వాల్మీకి పల్కు-లే పై పద్యంలో ఒదిగివిలిచాయి. కైకమాట నెగ్గింది. పిత్రాజ్ఞావర్తనుడై రాముడు అరణ్యానికి బయలుదేరాడు సీత అనుసరించింది. లక్ష్మణుడు అనుగమించాడు.

మార్గమధ్యంలో "గుహుడు"-రామచంద్రునికి దోయిలి పట్టాడు. భరద్వాజ దర్శనం, చిత్రకూట ప్రవేశం సాగిపోయాయి. సుమంత్రుడు రాజధాని చేరాడు. దశరధుని మరణం - భరతునికై దూతలను పంపించాడు వశిష్ఠుడు.

"భరతుడు ధార్మిక విద్యావిరతుడు, సుఖలౌల్య విరత వియత ప్రజ్ఞా
చరితుడు పరహితగుణ సంభరితుడు దినవాధ వంశ పావనుడెన్నన్4
-భరతున్, రామక్షేమా, భిరతున్ కామాదివర్గ విరతున్ శుభ వ"
చ్చరితున్ విర్బర కరుణా భరితున్ గొనిరండు పొందు పటు వేగమునన్"5

1. భారతం - 76 ప
2. భారతం - 105 ప
3. భారతం - 126 ప.
4. 1. భారతం - 143 ప.
5. భారతం - 144 ప.

ఆజ్ఞాపించాడు. — "అతనిచేతను, యాతని యాత్మబలముతోడగూడి" రాజ్యంలో శాంతి నెలకొంటుందన్న విశ్వాసం వశిష్టునిది.

"భరతుడు" అయోధ్యలో ప్రవేశించాడు. అందరి ముఖాల్లో "దైన్యం" "కళ" తప్పిన తండ్రి యేడ? సందేహం ఎదలో సంద్రమౌతుంటే—తల్లిని దర్శించాడు. సున్నితహృదయుడైన భరతుడు తల్లిపల్కులనే గొడ్డళ్ళతో మొదలునరికిన గంధపుమ్రానై కూలి విలపించాడు. తల్లిని నిందించాడు. "ఎంతపని చేసితివె తల్లి" యంటూ ఆక్రోశించాడు. "నీవేల నేల రాసిరులగోరితి జగమ్ము రాక్షసివన్" అన్న పల్కులు తల్లిపైనున్న ప్రేమను కోపంతో మిళితం చేస్తే ఆవిర్భవిస్తాయి.

"ఎన్ని జన్మలపాపమో యిటులబండి
నీ తనూజుడనైతినా నిందదాల్ప
వలదువలదిట్టి యైశ్వర్యవాంఛ మనకు
ఎందులకు నిప్పువంటి ఈ నిందమనకు"1

"మనకు" అనే సముచ్చయంలో ప్రేమాక్రోధాలు తావు చేసుకొన్నాయి. అన్నను తీసుకొచ్చి పట్టాభిషేకం చేసి, నేను అడవిలో ఉంటానన్న యీ భరతుడు వాల్మీకి సృష్టే.

కౌసల్యనుచేరి కన్నీటితో పాదాలను కడిగి, తన నిర్దోషిత్వాన్ని ప్రకటించుకొన్నాడు. రాజ్యాభిషేకాన్ని ప్రస్తావించిన వశిష్టాదులతో అసమర్థతను జెప్పి, రాముని ఉన్నతత్వాన్ని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తాడు.

"ఎక్కడి రామచంద్రవిభుడెక్కడ నీ భరతుండు-పెద్ద, పే
రెక్కిన శూరసింహల మదినెక్కి సురక్షితగాదె భూమి నే
నెక్కడ నేలువాడ నిది యేటికి సాత్వికలోక పూజ్యమౌ
పక్కి జరించెదన్ భరత వాక్యము బల్కెద నీమహాత్రికిన్" 2

"నీ మహాత్రికిన్ భరతవాక్యము పల్కెద" నన్న భరతుని పల్కుల్లోని విరుపు రమ్యంగా వుంది. "భరత వాక్యము" రామామోదం పొందాలి. ఆనాడే భరతుని "మహాత్రికి" భరతవాక్యం-మంగళం చెప్పబడుతుంది. తాటకాసంహారం నుండి శివధనుష్ఖండనం వరకు రాముని కార్యాలు కొనియాడబడ్డాయి.

"రామచందుర్ని వేధించు నీరదుడనగుచు
అందరను శోకతిమిరమ్మునందు ముంచ
ఎచట జిక్కితి దశరథేంద్రునకు నేను-
కరిగి పోయెద నెల్లర కలిమిగోరి" 3

---

1. భారతం-161 పు. 3. భారతం-187 వ.

2. భారతం-176 వ.

"ఎల్లర కలిమిగోరి" "కరిగిపోయెద" నన్న భరతునిలోని పలుకుల్లో త్యాగం జాలువారింది. సమష్టి కోసం వ్యష్టి బలిదానం మిన్నయన్న యార్యోక్తికి లక్ష్యమై విలుస్తుంది. "రామచంద్రుని వేధించుసిరదు"నిగ భావించుకొన్న భరతునిలోనివేదన-తల్లివల్ల అతనిలో గలిగిన ఆత్మన్యూనతా భావానికి ప్రతీక. రాముడనే "చంద్రుని" కప్పివేసే కారుమేఘంగ తాను నిలవలేనన్న త్యాగం భరతునిది.

గుహుని సమాగమం— "అన్నావదినెల" కష్టాల విని భోరున విలపించారు. "ఆయిస వారిని" గూర్చి చెప్పే ఆత్మీయ ప్రవచనాలు ఎన్నైనా తనివితీరలేదు.

"అడిగిన నడి నడుగున పడి,
నుడివిన నుడి నిపుడె నుడువు, నుడుల దడబడున్,
తడబడు నడుగుల నిడునెడ,
వడవడ వడకుచును సుడిని వడినటు లడలున్' 1

భరతుని పలుకుల్లో పల్లవించే "రామభూపాలరాగం"తో రాత్రి గడిచింది. మర్రిపాల ధరించి భరత శత్రుఘ్నులు-రామలక్ష్మణుల్లాగ ప్రకాశించారు.

భరతుని పరీక్షించి, అతని నిష్కల్మషత్వానికి, నిష్కామత్వానికి మురిసి, వెన్ను నిమిరి సముదాయించి అతని జాతకాన్ని ప్రస్తావించాడు భరద్వాజమహర్షి. అతని జీవనగమనంలోని ఉచ్చనీచ గ్రహస్థితులను వివరంగా విశ్లేషించారు. "భరత రాజేంద్రు జన్మకుండలి"పేరుతో కవి ప్రత్యేక పత్రాన్ని ఈ సమయంలో కావ్యంలో పొందపరిచి 2 తన శాస్త్రజ్ఞతను చాటుకొన్నారు

"కామధేనువు" నాజ్ఞగొని షడ్రుచులతో విందు నేర్పాటు చేశారు మహర్షి భరతునికి. సైన్యానికి, మూలంలో-దిక్పాలకుల్ని విశ్వకర్మని గంధర్వాప్సరసల వేరుగ ప్రార్థించి, వారిసహాయాన్ని విందుకొరకు అర్థించినట్లుండగా,2 "కామసురభి" తో విందు ఏర్పాటు వసునందన్ది.

మహర్షిచేత ఆజ్ఞప్తుడై చిత్రకూటానికి ససైన్యంగా బయలుదేరాడు. వేగంగా వస్తున్న సైన్యాన్ని, క్రమ్ముకొంటున్న ధూళిని చూసి, "రామనిత్యసంశ్లేషమూర్తి" యైన లక్ష్మణుడు కన్నులెరుపెక్కగా—"కైకేయి కొడుకు" దాడిని గూర్చి రామునకు చెప్పాడు. చిరునవ్వు నవ్వాడు శ్రీరాముడు.

"తామసపు బేర్మినైన నీ తగని మాట
లాడదగునయ్య నీ వంటి యనఘమూర్తి !

---

1. భారతం-226 ప.  2. భారతం-67 పు
3. వాల్మీకం-అయోధ్య-91 10 నుండి 40 శ్లోకం వరకు

భరతుడల్పుడె నా బహిఃప్రాణమమలు
దిద్దధార్మికు డాతవి కెదురు బొమ్ము" 1

అన్నాడు. ఎదురు మాట్లాడలేక "బసలుకొడుతూ" ప్రక్కకు తప్పుకొన్నాడు లక్ష్మణుడు-"నారపీలికల" గుర్తులతో వాల్మీకి మార్గంలోనే రామాశ్రమం చేరాడు భరతుడు-తమ్ముని తవివితీర చూచుకొని బిగియార కౌగిలించుకున్నారు మైథిలీనాధుడు. "అగ్రజన్మ స్మృతియె ప్రాణమైనవాని, ముద్దుతమ్ముని" గ్రుచ్చి కౌగలించుకున్నాడు ఒకేమూర్తి రెండైనట్లు—

"అచ్చు గ్రుద్దినయట్టుల నద్దమునను
నున్న ప్రతిబింబమటు నోటినుండి యూడి
పడిన యటుల మమ్మూర్తుల బ్రతిగదనను" 2

—చేరిన-తమ్ముని కౌగిలిలోనికి తీసుకొన్న ఆ రమణీయ దృశ్యం ప్రేక్షకులకు కన్నీటి వరదవిల్చింది. "చిక్కనగమైన మూర్తులిద్దరొక్కటిగ కౌగిలిలో ఒదిగిపోయి" అన్నా యని భరతుడు, తమ్ముడా! యని రాముడు కౌగిలిలో విలపిస్తుంటే లక్ష్మణుని ఎదలో వేదన సుళ్ళు తిరిగింది.

తండ్రి మరణవార్త చెప్పారు. మళ్ళీ శోకసాగరానికి తుపాను తాకిడి. విలాపంతో పర్ణశాల కదలిపోయింది పట్టువదలి, పట్టాభిషిక్తుడు గమ్మన్నాడు తమ్ముడు. పితృవాక్య పాలన వారసునిగ అనువంశిక ధర్మాన్ని రక్షించడం తప్పదన్నాడు. వంశకీర్తిని కళంకితం కానివ్వనన్నాడు. అమ్మ కైకేయి చేసింది తప్పులేదన్నాడు. కడుపుతీపి కన్న తల్లికి సహజమన్నాడు. — రాముడు.

బాల్యము నుండి నా బాహుబలము గనిన
యమ్మ గావున కానన కవిపెగాక
గోరు ముద్దల బెంచిన కొడుకు విటుల
కీడు శంకించెనేని తా వీడ గలదె" 3

అన్నాడు రాముడు. కైకపై ఆయనకున్న మమకారానికి అది హద్దు. ఆ మాటలు విని భోరున విలపించింది. రాముని పెంపుడు తల్లి భరతమాత, మరలి రమ్మని కొంగుచాచి యాచించింది. ఈమె "తులసీదాసు" కైకేయి గాని వాల్మీకి కైకేయికాదు. "మైథిలీ శరణుని' కైకేయి పూర్తిగా ఈమెను పోలే ఉంటుంది.

భరతుని అనుసరించి వెళ్ళిన కైకేయి రాముని మనసార క్షమావణ వేడుకుంటుంది. అజ్ఞానం, ఆవేశం స్వార్థం దూరమై పశ్చాత్తాపంతో కైకేయి—

1. భారతం - 261 వ. 2. భారతం-268 వ 3. భారతం—292 వ

"అపరాధిన్ మైహూఁ! తాత్ తుహ్మారీ మైయా
హా! జనకర్ భీ మై నే భరత్ కో జానా
యదిమై ఉన్ సా యీా గయీా భరత్ సే హో ఊఁ
తో పతి సమాన్ హి స్వయం పుత్రనో ఖో ఊఁ" 1

"అపరాధిని"నేను - భరతుని కన్నతల్లినై కూడా అతని మనస్తాపాన్ని గ్రహించలేకపోయాను. ఈ కష్టదశకు కారణం భరతుని ప్రేరణకాదు. నా మాట విశ్వసించు పతితో కూడా బిడ్డను పోగొట్టుకున్న పాపాన్ని ఒడిగట్టుకోనని ప్రమాణం చేస్తున్నాను" అంటుంది సాకేత్ కావ్యంలో.

కాని రాముడు పితృ వాక్య పాలనకు బద్ధుడై మాతృవాక్యాన్ని తిరస్కరించాడు. పాదుకలతో నందిగ్రామ ప్రవేశం– "రామటంకాల్ని" ముద్రింపించి రామ రాజ్యాన్ని స్థాపించాడు.

"శత్రుఘ్నుడు" అన్నను అనుసరించాడు. వారి పత్నులు మాండవీ శ్రుత కీర్తులు భర్తల సేవించుకున్నారు. "చిలుకల కొలుకులు కల్మషమంటని తలపుల" పతుల సేవలో తరించారు. పర్ణశాలలో లక్ష్మణుడు-శూర్పణఖ-హిరణ్యకురంగం జటాయువు- రావణుడు– సీత– శబరి– సుగ్రీవుడు– పావని– విభీషణుడు– లంక- వేగంగా సాగిపోయింది రామకథ. రావణుడు మరణించాడు.

"పతి సమాగమానికన్న భరతు సన్నిధి వేగం"గా కోరుకున్నాడు రామ చంద్రుడు. హనుమంతుడు వెళ్ళి భరతుని దర్శించి, భావాలు తెలుసుకొని భరద్వాజా శ్రమంలోని రామునకు విన్నవించుకొన్నాడు.

"జడలుగట్టిన వాని జర్జరీభూతుని
మౌనివర్తనమున మసలువాని"
కటికనేల శయించ కాయలుగట్టిన
వెన్నున ప్రక్కల వెలయువాని" 2

చూచి వచ్చి—

"రామవార్తను జెప్పితి రమ్యచరిత!
నీ ఋణమ్మును జెల్లింప నేరనయచు
అలముకొనెనన్ను - అదియేమి యద్భుత మెఱ్ఱ
నీపరీరంభగతి విల్చె నెమ్మనమున" 3

రామ కౌగిలి పొందిన అదృష్టశాలి ఆంజనేయుడు. భరతుని కౌగిలిలో "రాముని కౌగిలి" అనుభూతిని పొందానని చెపుతున్నాడు. "మరువలేని అనుభూతి

---

1. ప్రవంతి-1963-జనవరి-పు. 42

2. భారతం-608 ప    3. భారతం-612 ప

మైథిలీనాధుని పరిష్వంగ"మని జాతికి తెలుపుతున్నాడు. — రామభరతా భేద ప్రతి పాదన కవి ఉదాత్త భావన.

"చిక్కి నగమైన మూర్తులి
టొక్కటిగానున్న యట్టు లొదుగనిరువురున్" 1

అన్న పద్యంలో "ఒక్కటిగ నున్నయట్టు" అన్న భాగంలో కవి విర్దేశమదే నని స్పష్టంగా పేర్కొనవచ్చు.

"రాముణ్ణి తన మహాభక్తి చేత జోడించి మూర్తి కట్టించిన స్థితప్రజ్ఞుడు భరతుడు" ఆయన రామభక్తుడుకాదు. సనాతన ధర్మభక్తుడు" 2 అన్న విశ్వాసమే ఈ కవి హృదయంలో కదిలి కావ్యానికి ప్రాణమై నిల్చింది.

## ముప్పిడి వారి భరతుడు

తల్లి కోరిక తీరింది. రఘురాముడు అడవులకు చేరాడు. అయోధ్య రాజు లేని రాజ్యమైంది. వశిష్టుని ఆజ్ఞమేరకు దూతలు తాతగారి "దరి" నుండి భరతుని తీసు కొచ్చారు.

అయోధ్య చేరిన భరతుడు-జరిగిన పరిణామాలకు ప్రమాన్పడిపోయాడు. అయోధ్య అరణ్యంలా కన్పిస్తోంది. లోకం శూన్యంగా కన్పిస్తోంది. తండ్రి మరణిం చాడు. తండ్రివంటి అన్న అరణ్యాలు పట్టారు. అయ్యచాటునో అన్నచాటునో పెరగ వలసిన తనకు రాజ్యభారాన్ని మోపాలని పెద్దలు యోచిస్తున్నారు-దీని కంతటికీ కారణం తన తల్లి. తల్లిని చేరాడు భరతుడు.

"మాతరో! రాజ్యకాంక్షగల-మాటల నెప్పుడు పల్కినానచే
నీతి విదూర కార్యమెటు—నీ మది దోచెనె? రాముడుండ నే
చేతునె రాజ్య మాగతిని—చేయుట చూచితె భానువంశజుల్
పాతకు జేసినావు నను-పాపపు కార్యము చేసి యీగతిన్" 3

ఏమాశించి ఈ పనిచేశావు? నేనేనాడన్న రాజ్యంకావాలని అడిగానా? రాచరికపు కులంలో పుట్టి, రాజుని చేపట్టి, రాచరికంగా జీవించలేక ఒక దాసి పల్కులు విని, వంశఘాతకివియ్యావు. రాజుల సాంప్రదాయంకూడ తెలియనిదానిలా, అంటూఆక్రో శిస్తాడు భరతుడు.

"కులప్రధ్వంసినీ!" అన్న నంబోధన వాల్మీకి భరతునిది.

"నతతం రాజవృత్తేహి జ్యేష్ఠో రాజ్యేభిషిచ్యతే!
రాజ్ఞామేతత్సమం తత్స్యా దిక్ష్వాకూణాం విశేషతః"4

---

1. భారతం-మాచిక· 2. భరతుడు - 24 వ
3. వాల్మీకం - అయోధ్య - 74. 24 4. వాల్మీకం-అయోధ్య -75 -20శ్లో

అన్న శ్లోకం రాచమర్యాదల్ని గూర్చి భరతుని పల్కులు-అవి కవికి ఆధారాలైనాయి. నీవు, నీదాసి కలసి రాజ్యం చేసుకోండి. నేను అడవిలో రామునిచేరి, లక్ష్మణునితో కలసి సేవ చేసుకుంటాను అంటాడు. రాముణ్ని తీసుకొచ్చి, ఆయనకే రాజ్యమిప్పిస్తాను. రాముడు లేనిదే రాజ్యమే లేదు. రాముణ్ణి తీసుకురావడానికి నేనే వెడతానన్నాడు.

కౌసల్యవద్ద తన నిర్దోషిత్వాన్ని ప్రకటించుకొంటూ—భరతుడు అనేకమైనశప థాలు చేస్తాడు. అది 28 శ్లోకాల భాగం మూలంలో-

ఆర్యే! కస్మాద జావ స్తం గర్హ పే మామకిల్బిషమ్
విపులాంచ మమప్రీతం స్థిరాం జానాసి రాఘవే"1

అనవసరంగా నన్ను నిందిస్తున్నావు. రామునిపై నాకున్న ప్రేమాభిమానాలు నీకుతెలి యవా? అంటూ నిష్కల్మషంగా ప్రశ్నించగలిగిన ధీరస్వాంతుడు భరతుడు.భరతుడు చేసిన ప్రతిజ్ఞలన్నీ కౌసల్యను నమ్మించడానికేనని మన మర్థం చేసుకోవచ్చు. అవి ఆధారంగా తెలుగుకవి—

"ఎరిగితినేని ఈకపట—మించుకయేనియు మాతృద్రోహంలున్
గురుజన హింసకుల్, సుజన-కోటికి మోసముచేయువారు, కా
వరమున పాపకార్యముల—వారిత రీతిని సల్పువారలే
నరకమునందు వారొయది-నాకును గల్గెడు గాతమాతరో" 2

చేయనిపాపాన్ని తనకంటకట్టి వెలివేసినట్లు చూస్తున్న "తన" వారిముందుభరతుడు-నమ్మించడానికి చేసే ప్రయత్నం అది. "చేయగరాని పాపములు చేసెకివారలుపోవు చోటుకే పోయెదనమ్మ" అన్న పల్కుల్లోని వేదన గుండెగోడల తడుతుంది. రాముని తీసుకొచ్చి రాజ్యమిస్తానన్న పలుకు ముందుగా కౌసల్యతోనే ప్రస్తావిస్తాడు తెలుగు కావ్యంలో భరతుడు. కానీ వాల్మీకంలో తల్లి కైకేయితోనే—

"ఆనాయయిత్వా తనయం కౌసల్యాయా మహాబలమ్
స్వయమేవ ప్రవేక్ష్యామి వనం మునినిషేవితమ్' 3

రామునికి రాజ్యమిచ్చి నేనే అడవుల్లో ముని వేషంతో జీవిస్తానని అంటాడు. తిరిగి వశిష్టాదుల వద్దమాత్రమే-ఆనయిష్యామ్యహం జ్యేష్ఠ భ్రాతరం రాఘవం వనాత్"4 అన్నమాట వినిపిస్తుంది. కౌసల్యవద్ద రోదన సాంత్వనాదులే సరిపోయాయి. కాని తెలుగు కావ్యంలో కౌసల్యతోనే ముందుగా రాముని "ఆనయన" విషయాన్ని చెప్పి, మాతృమూర్తికి ఊరట కల్గించడమేగాక, తన నిస్వార్థతను ప్రకటించుకోవడానికి

1. వాల్మీకం - అయోధ్య - 75.20శ్లో 2. భరతుడు - 23ప.
3. వాల్మీకం - అయోధ్య - 74 - 3. 4 వాల్మీకం - అయోధ్య— 79 — 9.

సైతం అవకాశం కలిగింది. రాజ్యాభిషేకానికి సిద్ధమవ్వమన్న వశిష్టునితో-

"గురువులు మీరలీగతిని - కోరుట ధర్మమె? భానువంశ్యజుల్
త్వరపడి యెన్నడైన యిటు-తమ్ముడు రాజ్యము జేసి పెద్దలన్
విరసనచేసి కానలకు - నెట్టుట వింటిమే? నేను భక్తితో
సరగున రాముజేరి మన-సారగ ప్రార్థన చేసి తెచ్చెదన్"1

అన్న పద్యం—

జేష్టస్య రాజతా నిత్యము చితా హికులస్యనః
నైవం భవన్తో మాం వక్తు మర్హన్తి కుశలాజనాః"2

అన్న వాల్మీకి శ్లోకానికి ఛాయా మాత్రమే-నేనీ రాజ్యాన్ని కోరలేదు. గురువులు నన్ను పరీక్షిస్తున్నారా? రాజంటే రాముడే రాజు తక్కిన వారందరూ రాజులు అని పించుకోరు.

"మృగరాజన సింహంబగు
ఖగరాజన గరుడుడౌను-కాకోదరులం
దగరాజన నా శేషుడు
మగరాజా రాముడౌను-మనరాజార్యా"3

కొండమున్నంత మాత్రాన దోమ ఏనుగుకాదు - రాజపుత్రుడయినంత మాత్రాన రాజ్యార్హుడౌతాడా? అని ప్రశ్నిస్తాడు భరతుడు. అనేకవిధాలుగా రామాధికారాన్ని నిరూపించి, రాజులుగా ప్రజల్ని దోచుకోక, మోసగాళ్ళను నిందించి, రామరాజ్యం కావాలని అభిలషిస్తాడు.

వశిష్టుని అంగీకరింపజేసి-భరతుడు తెలుగు కావ్యంలో ఏకాంతంగా మనః ప్రబోధానికి పూనుకొంటాడు.

"మనమా! చెప్పెదనొక్కమాట వినుమా-మానాధు సేవింపుమా
గనుమా రాజ్యము భోగముల్‌స్థిరమొకో-కాయంబనాపాయమే?"4

రాచ భోగాలను తిరస్కరించి, శాశ్వత సత్యపదాన్ని కాంక్షిస్తాడు. ఇంద్రియలోలుడై, సంసార సుఖాల్లో మునిగి, తపస్సునంతా వృధా చేసుకొంటున్న విశ్వామిత్రుని గుర్తు చేసుకొని "భోగము రాగముల్ పదప పూజ్యత నీయగలేవు"5 అంటూ తిరస్కరించి, రామనామంలోని గొప్పతనాన్ని మననం చేసుకొంటుండగా—సమీపించిన పౌరులజూచి దోయిలి ఘటించి, రాముని తీసుకువద్దామని వారిని ఒప్పించాడు రాముని ఏవిధంగా ఒప్పించాలో మరల ఒకపర్యాయం వారికి నివేదిస్తాడు. ఈ సమయంలో అవకాశం తీసుకొని-ఒకపరి రామమహాత్మ్యాన్ని కీర్తించడమే కవి ఉద్దేశ్యం. భరతునిలోని భ్రాతృభక్తి ప్రదర్శనకిది ప్రోద్బలకమైంది.

1. భరతుడు - 29 ప. 2. వాల్మీకం - అయోధ్య - 79 - 4
3. భరతుడు - 36 ప 4. భరతుడు — 44 ప 5. భరతుడు - 49 ప

"నాధుడేలేని మమ్ము న-నాధుజేసి
యేలుకోవయ్య రామయ్య-యెల్ల ప్రజల
తండ్రిలేకను పిల్లలు-ధరణిలోన
రాజు లేకను రాజ్యంబు రాణగమనె"1

అంటూ-తాటకాసంహారం నుండి భార్గవ భంజనం వరకు స్తుతించి నామది గల్గు భావములు వినంగను తెల్పితి. క్షేమదమైన మార్గంచెప్పమన్నాడు. -అయోధ్యావాసులు ఇంకేమంటారు? సరేనన్నారు. బయలుదేరారు. మార్గమధ్యంలో గుహుడు-తారసిల్లాడు. మాటలు కలిశాయి. మనసులు తెలిశాయి. రామకధా సందర్భంలో మాటల మూటలు విప్పారు-రాత్రి గడిచింది ఔన్నత్యాన్ని పరస్పరం గుర్తించారు.

"యేరి నీసరి ధన్యులు
ధారుణిలో లేరులేరు-తథ్యము సుమ్మీ"2

అన్న గౌరవం గుహుడు పొందాడు. ఆనాడు వేనయోధ్యలో ఉంచే రాముణ్ణి అడవులకు వెళ్ళనిచ్చేవాడనా-ఈ మోసం నాకు తెలీదు. హంసతూలికాతల్పం మీద శయనించవలసిన రాముడు చిగురుటాకులమీద నిద్రించాడు. రత్నఖచిత కిరీటాన్ని ధరించవలసిన శిరస్సు మట్టిపాలతో జడలు కట్టుకొంది-అన్న తెలుగు భరతుని పల్కుల్లో అన్నపై దయతో చిగురుటాకుల శయ్యనేర్పరచినట్లు కప్పిస్తాడు. వాల్మీకి సీతారాములకు లక్ష్మణుదేర్పరచినది దర్భశయ్య."3

"తల్లి చేసిన దుష్కృతి-వల్లనేడు
తండ్రి కరువాయె రాముండు-తరలె వనికి
ప్రజల కేలిక లేదాయె-పట్టణంబు
శోభ గనదాయె యెదలోన-శోకమాయె"4

అంటాడు భరద్వాజాశ్రమంలో భరతుడు. మహర్షి చెంతపైతం కైకా, మంధరల ప్రస్తావనలు, తీసుకొచ్చి తప్పు తనది కాదని నమ్మబలుకుతాడు భరతుడు. నేను పూర్వజన్మలో ఏ పాపం చేశానో గదా. చేయని పాపానికి కళంకం వచ్చింది. రాముని రాజుగాచేయాలనే ప్రయత్నానికి ఆశీస్సులందించమని మహర్షిని ప్రార్థిస్తాడు.

చిత్రకూటాన్ని చేరి రాముని పాదాలపై వ్రాలిపోయాడు భరతుడు. రాజ్యానికిరమ్మన్నాడు. రాముడే మా రాజన్నాడు.వంశసంప్రదాయాన్ని కాపాడమన్నాడు.తల్లి పాపం చేసిందన్నాడు. తండ్రి మరణించాడు, ఇకనీవే మాకు దిక్కని భోరున విలపించాడు.

"ఆన పెట్టిన తండ్రియా-యవనిలేడు
వరమ్ము మరలింప వేడగా-వచ్చె తల్లి
రాజ్య మాసింప నేనాడు-రామ నేను
అన్ని విధముల నీవే రాజ్యాధిపతివి"5

---

1. భరతుడు — 64 ప 2. భరతుడు-73 3. వాల్మీకం-అయోధ్య-87-19,20 శ్లో
4. భరతుడు-85 ప 5. భరతుడు-96 ప

తమ్ముని చుబుకం పట్టుకొని ఒప్పించడానికి ప్రయత్నించాడు రాముడు. పిత వాక్యాన్ని దాటనన్నాడు. పినతల్లి కోర్కె సమంజసం అన్నాడు. నేను దండకైపు ప్రయాణిస్తానని, పదునాల్గు సంవత్సరాలు రాజ్యాన్ని చూడమని తమ్ముని వేడుకున్నాడు. తనమాట కాదని తనని ఒప్పింప యత్నిస్తున్న శ్రీరామచంద్రుని ఎలా ఒప్పించాలో అర్థం కాలేదు భరతునికి-రామునిలో ఈ కాఠిన్యమెక్కడిది?

"కరుణావార్నిధివైన నీదు మదిలో - కాఠిన్య మీరీతిగా
తిరమై విల్చుటకేమి హేతువొకదా-దీనావనా! రాఘవా!
అరయన్ నాదగు పూర్వపాపమిటు లీ-యాటంకమున్ గూర్చెనో
కరుగన్నీయక నీదు మానసము నో - కల్యాణ భావాత్మకా!" 1

ప్రజల మొహం చూచైనా, గురుదేవుల పల్కులనంగీకరించైనా నీవు రావలసిందని, నా పూర్వజన్మకృత పాపమే ఈ విధంగా నీ మనస్సులో కాఠిన్యాన్ని కలిగిస్తోందని వేదన చెందుతాడు భరతుడు. శ్రమంతా వమ్మయింది. తుదకు రామపాదుకలే శిరోధార్యాలైనాయి.

తుదకు — పదునాలుగు సంవత్సరాలనంతరం మాత్రం జీవించనని షరతు పెట్టాడు ముడుచుకున్న మొహంతో-తమ్మునిలోని ఉక్రోషం రాముని పెదాలపైచిరునవ్వు కల్గించింది. గడువు మిగిలితే—అగ్నిప్రవేశం చేస్తానన్న భరతుడు వాల్మీకిసృష్టే-

"చతుర్దశేహి సంపూర్ణే వర్షేఽహని రఘూత్తమ!
నద్రక్ష్యామి యది త్వాం తు ప్రవేక్ష్యామి హుతాశనమ్"2

అన్న శ్లోకం "గడువు పదునాలుగేడులు గడచినంత" అన్న పద్యంగా రూపొందింది. పాదుకా పట్టాభిషేకం జరిగింది. రామచంద్రుడు లేని లోటు కానరాకుండా రాజ. పాలన చేయాలని, బుద్ధిహీనులు నాయకులై ప్రజలను పీడించి, దోచుకుంటారని వేయికన్నులతో వారిని గమనించి శిక్షించాలని — సభాముఖంగా ప్రకటిస్తాడు భరతుడు. "హీనమతులు నేతలౌదురు ప్రజదోచ నీతిదప్పి—వారి ఆటకట్టించి రామరాజ్యాన్ని స్థాపించాలన్న దృఢనిశ్చయం తెలుగు కవి భరతునిది. ఈనాటి రాజకీయ నాయకుల పరిస్థితికి ఈ సన్నివేశం అద్దం పడతుంది. ఏటేట క్రమాభివృద్ధిని సాధించి, శాంతి సౌభాగ్యాలతో రాజ్యంలో రాముని రాజ్యాన్ని ప్రకటించి, ప్రతిదినము రాచకార్యాలను పాదుకలకు నివేదించి, నిర్ణయాలు తీసుకోసాగాడు. రోజులు గడుస్తున్నాయి. రామ ప్రార్థనలతో నిరీక్షణాభారంతో నెమ్మదిగా నడుస్తోందికావ్యం.

కాలం తీరిపోయింది. గడువు పూర్తయింది. రాముడు రాలేదు. జీవించి లాభం లేదనుకొని అగ్నిప్రవేశం చేద్దామనుకుంటున్నాడు భరతుడు. అంతలోనే—

"…. ………… ……………………..రామునిన్
పాదుచువచ్చి యచ్చటకు పావని "వచ్చె రామచంద్రుడీ
వోడకు వేకువౌదనుక-నోపికపట్టు" మటంచు బల్కినన్"3

---

1. భరతుడు-108 ప 2. వాల్మీకం-అయోధ్య-142-25. 3. భరతుడు—135 ప

రాముని పాదుకుంటూ పావని వచ్చాడనటం చక్కని భావన. "వచ్చె రామచంద్రుఁ" డనడంలోని రమ్యత సంస్కృతంలో లేదు, "ఉన్నాఁడు లాస్యరాఘవు" డన్న మొల్ల హనుమద్వాక్యాల స్వారస్యం సాహితీప్రియుల గుండెల్లో లెస్సగా నిలిచి ఉంది సంస్కృత హనుమంతుడు భరతునితో పల్కు సందర్భములో రాముడు నీ క్షేమాన్ని విచారిస్తున్నాడంటూ ప్రియమాఖ్యామితే దేవ శోకం త్యక్ష్యసి దారుణమ్ అస్మిన్ ముహూర్తే"1అని రాముని ఆగమనాన్ని తెలియజేస్తాడు వాల్మీకంలో. తెలుగు పలుకుబడిలోని రమణీయకత రమ్యంగా ఉంది.

అగ్నిప్రవేశానికి సిద్ధమౌతున్న "రాఘవుని" అడ్డుకొన్నాడు. రాముని ఆగమనాన్ని విన్పించాడు. రామాయణాన్ని గానంచేశాడు. సంతోషంలో మూర్ఛిలోయి, తేరుకొని ఆనంద సముద్రంలో మునకలు వేయసాగాడు భరతుడు.

"వచ్చెనారాము డెప్పుడు - వచ్చెనతడు
యెచటనుండెను రాడేమి — యిచ్చటకును
యేమిసెలవిచ్చి పంపెనో — యెరుగ జెపుడి"2

"వచ్చెనె నానిధానమిటు, — వచ్చెనె యాతడు, దేవదేవుడే
వచ్చె నె నాగురుండు, గుణవంతుడు వచ్చెనె, ప్రేమమూర్తి, తా
వచ్చెనె, పెన్నిధానమది—వచ్చెనె, ఒప్పులకుప్ప నెన్నగా
వచ్చునె నాకు, నామదికి-నచ్చిన రాముడు వచ్చియుండెనా"3

అన్న ఆనందం భరతునిది. ఇందులోని క్రియాపదాల పునరుక్తి భరతుని మనస్సులో అనవృత్తమౌతున్న రామాకాంక్ష తీవ్రతను ధ్వనింపజేస్తుంది. త్వరగా రమ్మని చెప్పమని హనుమంతునికోరి, అన్నగారి ఘనకార్యాలన్నీ చిత్తరువుల గీయించి, అయోధ్యా నగరమంతా అలంకరింపజేశాడు. తాటకవధనుండి — రావణసంహారం వరకు ఎత్తిన చిత్తరువులు నగరపు కూడళ్ళలో నిలువెత్తున నిలిచాయి. అయోధ్యానగరం చెవులు రిక్కించి, మెడలు సారించి, రామునిదిక్కై ఎదురు చూస్తోంది.

"అదుగో రాముడు వచ్చుచుండె గనుడీ - యా రావమాలింపుడీ
అది యా పుష్పక రావమేయగును మీరా దిక్కు వీక్షింపుడీ
ముదమారన్ ఘనవాద్య ఘోషములతో—ముత్తైదువుల్ ముందుగా
నెదురై హారతులిచ్చి తోడుకొని రం—డీ రామచంద్రప్రభున్"4

హారతులిచ్చి "అమ్మ, అయ్య" లను అక్కునజేర్చుకొంది అయోధ్యానగరం, చతుస్సముద్రాలలోని నీరు వానరశ్రేష్ఠులు తీసుకురాగా, పన్నీట జలకాలాడించి. అయ్యను అమ్మను అలంకరించి, సభాంగణంలోకి ప్రవేశపెట్టారు. వేదోక్త మంత్రా

1. వాలీకం - యుద్ధ - 124 36 శ్లో
2. భరతుడు - 137 ప
3. భరతుడు — 138 ప.
4. భరతుడు — 154 ప.

లతో అనువంశికమైన మణికిరీటాన్ని శ్రీరాముని శిరస్సు పైనుంచి, ఆశీర్వదించారు. శ్రీరాముడు పట్టాభిరాముడైనాడు.

"వామభాగమునందు—వసుమతీసుతయొప్ప
పావని పాదాలపట్టి కొలువ
ముత్యాలఛత్రంబు—ముదము తో సౌమిత్రి
వెనుకను పట్టగా-వేడ్క-మీర"1

శత్రుఘ్నుడు చామరము పట్ట, సుగ్రీవుడు జాంబవంతుడు, విభీషణాదులు దోయిలించ -రాచపీఠిపై ప్రకాశిస్తున్న రాముణ్ణిచూసి భరతుడు-"సంతోషకంధి"లోమున్క-లేకాడు.

ఆనందంతో నృత్యంచేస్తూ—రామకీర్తనలను గానం చేయడం ప్రారంభించాడు. మత్స్యావతారం నుండి వామనావతారం వరకు మహానీయుని దివ్యావతార ప్రాభవాన్ని స్తుతించి భరతవాక్యం పలుకుతాడు-భరతుడు-వాల్మీకి భరతుని క్రొత్త కోణం నుండి భ్రాతృభక్తిలో రామభక్తిని ప్రదర్శింప యత్నించారు-కవిలోని రామ భక్తి భరతుని భ్రాతృభక్తిలో కలసి కావ్యంగా రూపుదాల్చింది.

"అభినవమై అభ్యుదయ భావ ప్రపూర్ణమై, విశిష్ట కావ్యగుణలక్షణము కలిగి, కైతలలోని తిరుతీయములను, తియ్యందములను వెలార్చుచు, విభృత గమనముతో విందుగా, కనుల పండువుగా వచ్చినదే యీ "భరతుడు"2 అన్న విమర్శకుల పలుకులు అతిశయోక్తి గుంభితాలే కాని అత్యుక్తులు కావు. భరతుని పాత్ర విశ్లేషణలో కవి ఇంకొంత జాగరూకత వహించి ఉంటే కావ్యం ఇంకొంత కాంతిని పొంది శోభావహమయ్యేది.

## జోస్యుల వారి భారతం

### ఆనయనం

తాతగారింటి నుండి వస్తున్న భరతుణ్ణి అయోధ్యా నగరముఖ ద్వారంలో కవి కలుసుకొని కావ్యంలోకి ఆహ్వానిస్తాడు. "రమ్మ భరతా! ధ్యానమ్ము లింకేటికిక్?" అంటూ చావు కబురు చల్లగా విన్పిస్తాడు. దశరధునకేమి యదృష్టవంతుడు నీలాంటి బిడ్డలుండగ తండ్రులకేమి కొదవ" అని ధైర్యం చెప్పి, పౌరులమాటలతో నీకేమి పని తల్లిదగ్గరకెళ్ళమని కైకేయీ గృహం వైపు మరలుస్తాడు భరతుని రథాన్ని—

"పౌరుల భాషణమ్ము లవి భావన సేయకు మోయి తిన్నగా
జేరుము మాతృ మందిరము జెప్పదె కైక విశేషమంతయున్
ధీరులకింత చంచలత దేలుట యుక్తమె! సత్యరక్షకుం
దౌ రఘురాముడేల సుఖమందదు కానలనైన మన్నచో?"3

మదిలోని తొట్రుపాటుని అణచుకొని, తల్లితో "మాతల సద్మ సర్వకుశలాఖ్యానమ్ము గావింపుసు" అంటూ కైకేయీ గృహంలో ప్రవేశింపజేస్తాడు.

1. భరతుడు-161 వ. 2. తిలకరేఖ-11 3. భారతం - 5 ప

ఆవేదనం

"ఆమెకు సంతసంబయినదయ్యా, వచింపుచు మన్నదింక"1 -అంటూ సర్వ వృత్తాన్ని కైకతో చెప్పించేస్తారు. తల్లిని నిందించినా ప్రయోజనంలేదు. పుత్రప్రేమ ఆమెనలా చేయించింది. కాదని నీవన్నా జరగబోయేది ఆగదు–రాముని తల్లిని నీవు ఏ విధంగా దర్శించగలవు. ఆమె నిన్ను నిందించినా–నీ నిర్దోషిత్వాన్ని నిరూపించుకొని, ఆమెకు విశ్వాసాన్ని కల్గించవలసిందన్న హెచ్చరిక కవి పలుకుల్లో విన్పిస్తుంది.....'రాజ్యమేలుమని కౌసల్యమ్మ భాషించెడిన్, దయలేకన్న దిగా దలంపకుము"2 "పుత్రప్రీతి" అంటాడు.

ఈ విధంగా కావ్యం "గద్యద్వాక్య"గా కొనసాగటం మాధవపెద్దివారి రచనల్లో అధికంగా కన్పిస్తుంది. భరతుణ్ణి ప్రవేశంపజేసి, వెనుక కవి అనుసరిస్తూ వృత్తాన్ని పాఠకులకు నివేదిస్తూ ఉంటాడు దీన్ని "ప్రత్యక్ష భాషణ ప్రక్రియ"గా కవి ఉటంకింపు.

**ఆమోదనం:** కౌసల్య ఓదార్పుతో తెప్పరిల్లి రాముని తీసుకురావడానికి బయలుదేరాడు భరతుడు. గుహుడు తటస్థపడ్డాడు. రామకథా గానం ప్రచలితమైంది. గుహుని పల్కులలోని ఆర్ద్రతకు రామకథా వేదనకు దుఃఖితుడై నేలకూలాడు భరతుడు. మూర్ఛితుడై ఉన్న భరతుని తల్లులందరూ చూచి విలపిస్తుంటే - కౌసల్య ముందుకు వెళ్ళి "గోవు తనదూడను" పోలె దగ్గరకు తీసుకొని పొదపుకుంది.

"వత్సలాస్వం యథా వత్సముపగూహ్య తపస్వినీ"3 అంటాడు వాల్మీకి.

"అదియేమీ గతినా విషాదు వచనం బాలించినంతం, దయా
స్పద వృత్తంబయినన్, విచేతనుడవై వాపోవగా జెల్లునే?
ఇదిగో జూడుము నిన్నుజూచు కొనియే యెంతేని గౌసల్య దా
మది ధైర్యంబుగనెన్ గుమార! యిటులున్మత్తుండవై దొప్పునే"4

రాత్రి గడిచింది. ఆ విషాదుదే జాహ్నవి తరణం చేయించాడు. ఆరాధనం

భరద్వాజుడు భరతుని పరీక్షించాడు. అతని భ్రాతృభక్తికి సంతసించి, సమస్త పరివారానికి ఆతిథ్యమిచ్చాడు పెత్తల్లి పినతల్లుల పరిచయం చేసి తల్లిని నిరాదరించినట్లు పల్కాడు – మందలించాడు భరద్వాజుడు.

న దోషేణావగన్తవ్యా కైకేయీ భరత! త్వయా
రామప్రవ్రాజనం హ్యేత త్సుఖోదర్కం భవిష్యతి"5

అంటారు వాల్మీకంలో

................ ఆమె యెదం దొనగించరాదు సం
ప్రీతి నొనంగు నెల్లరకు శ్రీ రఘురాము వనప్రవాసమీ
హేతు వునన్ శుభోదయము హృద్యముగా నగునంచు బల్కెడిన్
మాతను మాన్యగా! దలచిమైకొనుమాత్మ విశుద్ధి పెంపునన్"6

---

1. భారతం - 7 ప. 2. భారతం - 13 ప 3. వాల్మీకం-అయోధ్య-87-7 శ్లో
4. వాల్మీకం-అయోధ్య-92-29శ్లో 30 శ్లో 5. భారతం-30 ప. 6 భారతం-39 ప

ఆమార్గణం

చిత్రకూటాన్ని చేరింది భరతుని పరివారం. పర్వత సౌందర్యానికి రామాశ్రమాన్ని సమీపిస్తున్నామనే ఆనందానికి వేగం పెరిగింది సైన్యంలో. చూశాడు "లచ్చన్న" కనులెఱ్ఱబడ్డాయి.

"కాపురుషుండు యుద్ధమునకై భరతుండరుదెంచుచుండె" అనేశాడు రామచంద్రునితో, "నే చాపము నూని వానిని ససైన్యముగా బరిమార్తు"1 నంటూ విల్లెక్కుపెట్టాడు. చిరునవ్వుతో తమ్ముని వారించాడు రాముడు.

..................... "అరే!

భరతుండన్న నెఱుంగ వెట్టిడొ, మహాభక్తుండురా! తమ్ముడా

దురితం బాతని యందు నెంచదగదీ దుర్నీతి జాలింపుమీ"2

అని వారించడమే గాక-

"కాదని రాజ్యమందు మఱి కాంక్షయె నీకుదయించెనేని -నే

నాదర రీతి జెప్పిన మహాత్ము డొసంగు నతండె సర్వమున్

వాదములేల"3 అన్న-అన్న పల్కులతో సిగ్గుతో తలవంచుకున్నాడు లక్ష్మణుడు.

"యదిరాజ్యస్య హేతో స్త్వమిమాం వాచం ప్రభాషసే

వక్ష్యామి భరతం దృష్ట్వా, రాజ్యమస్మై, ప్రదీయతామ్"4

అన్న వాల్మీకి పల్కులీ పద్యానికి ఆధారాలు.

ఆమంత్రణం

తండ్రి మరణవార్త చెప్పాడు. మమ్మల్ని ఆదుకోమన్నాడు. అనాధులమైన దేశప్రజల్ని మమ్మల్ని ఆదుకోవడం నీబాధ్యత అన్నాడు. పలురీతుల ప్రార్థించాడు భరతుడు. తన తప్పులేదని తల్లిని నిందించాడు. అరణ్యవాసం తాను చేస్తానన్నాడు. "జాబాలి"వాదం పైతం ప్రస్తారితమైంది. అన్ని వాదాలు రాముని చిరునవ్వు ముందు తొలగిపోయాయి.

"పితృ వాక్పాలన జేయుమీవు విపుడా పిత్ర్యంబు సామ్రాజ్యమే

చతురాత్మీయ మనీష నేలుము శరశ్చాతుర్ద శానేహమున్

మతినన్యంబు దలంపరాదు మనకీమాత్రంబు నూహింపుమీ"5

అన్నాడు. పాదుకలనిచ్చి పర్ణశాలవైపు అడుగులు వేశాడు శ్రీరామచంద్రుడు.

విలపిస్తూ, పాదుకల పట్టుకొని, బరువుగా బయలుదేరాడు భరతుడు. పర్ణశాలవైపు బయలుదేరిన రాముడు అడుగుముందుకు వేయలేకపోతున్నాడు. అయోధ్యకు బయలుదేరిన భరతుడు అడుగుమెదపలేకపోతున్నాడు.

---

1. భారతం - 42 ప
2. భారతం - 43 ప
3. భారతం - 45 ప
4. వాల్మీకం - అయోధ్య - 97-17 శ్లో.
5. భారతం - 61 ప.

"నడువవు నీవు ముందుకిటు నాల్గడుగులవి లెక్కలూతువా
తడుకుటిలోనికిం జనదు, ధన్యులు మీరు సహోదరుల్ బలే!
నడుమ విచారమెంతయు మనంబున నగ్గలమౌచు దల్లుల
క్కడ బడికుందు చుందు రిదికర్తమె యార్ణవమూర్తి మీకిటన్"1

అటు కదలలేక రాముడు - ఇటు అడుగేయలేక భరతుడు - నడుమ విలాపాగ్నిలో తల్లులు ఇది కవికల్పిత సన్నివేశం. అత్యంత రమణీయం.

ఆలోకనం

అయోధ్యలో రామాజ్ఞగ పాలన కొనసాగుతోంది. పాదుకా నివేదనం దిన చర్యగా, ఋషితుల్యుడై నందిగ్రామంలో భరతుడు.

"జరుగుచు నుండె పాలనము సర్వమునాపురి నీకు దెల్పి యే
వరచరితుల్ సుమంత్రులు ప్రవర్తన జేయు చుండిరెపు నీ
వరుదుగ బాదుకాజ్ఞ గొని యాజ్ఞ యొసంగుదు వైన గానియా
చరణము మాత్రమయ్యది విచారణ రోజులు లెక్కవెట్టుచున్"2

అక్కడ అరణ్యంలో రాముడు అద్భుత పరాక్రమంతో రాక్షసుల నిర్జించి మునీశ్వరుల కాపాడుతున్నాడు. సీతకుబంగారు లేడి కన్పించింది. - మురిపెంగా రాముని చూసింది. "ఆడుకొందునేనిది గొనిపోదు" నా భరతుడెంతయు విస్మయమందు నట్లు" వాల్మీకంలో సీత బంగారులేడిని భరతునికి అత్తరైన కౌసల్యాదులకు చూపిస్తా నంటూ మురిసిపోతే - ఈ భారతంలోని "సీత" పాపం తమకోసం ఎదురుచూస్తూ వేదనలను భరిస్తున్న మరిదిపై జాలి, ప్రేమతో భరతునికే చూపిస్తానంటుంది. కారణం ఇది "భారతం" కాబట్టి. దీనికి మూలం -

"భరతస్యార్య పుత్రస్య శ్వశ్రూణాం మమచ ప్రభో
మృగరూపమిదం వ్యక్తం విస్మయం జనయిష్యతి"3

ఆలింగనం

సీతాపహరణంతో రోదించి, క్రోధించి, జయించాడు రఘురాముడు. రావణుణ్ణు మరణించాడు. రాముడు రాబోతున్నాడు. - కాని ఎందుకో అన్నయ్య రాదేమోనని సందేహం కలిగింది నందిగ్రామంలోనున్న తమ్ముడు భరతునికి. అందుకే కవి కల్పించుకొని -

"సోదరుడెల్లి, రాగలడు, సుస్థిరవాక్ప్రతి పాలకుండె, యం
దేదియేమైన నంతయు నహీన పరాక్రముడే యొనర్చె, నీ
మాదిరిజేల ఖేదువా! సమాగమ కాలము వచ్చుచుండగా
సోదరుతోడ సీహ్వాది విశుద్ధత చెప్పెనంతడు మొన్ననే"4

---

1. భారతం - 69 ప, 2. భారతం - 75 ప.
3. వాల్మీకం - అయోధ్య - 43 - 17 శ్లో. 4. భారతం - 79 ప.

అని ధైర్యం చెపుతాడు. కాని గుణాభిరాముడైన భరతునకు అగ్రజుడు సుగుణాభిరాముడు రాముడు. అందుకే పదునాల్గేండ్లు "రాజ్యలక్ష్మి" పరిభోగమనస్కుడైన భరతుణ్ణి పరీక్షించడానికి వాయుసూనుణ్ణి పంపాడు. "చూచి రమ్మంటే కాల్చివచ్చిన దూత" ఆ మహనీయుడు. తన చారచక్షువుల భరతునిలోని వినమ్రతత్వాన్ని విశ్వరూపంగా దర్శించాడు. "భారతం" పూర్తయ్యింది. తన బరువుని తీర్చుకొని, రాముని "ఆలింగనం"లో సొక్కు తీర్చుకున్నాడు భరతుడు —

"శ్రీరాముం బరికించి వందన వినమ్రీ భూత కాయుండవై
భారం బంతయు, దీరె గైకొనుము నీ భవ్యాధిపత్యంబికన్
నీరాజ్యంబును, గైకనాదరముతో నిత్యంబు సేవించితిన్
రారమ్మంచిపుడు విన్ను రాఘవు వరీరంభంబు రక్షించుతున్"1

రాజ్యంతో సమానంగ గైకనాదరించి రాముని ఆలింగనాన్ని పొందాడన్న చమత్కారం బాగుంది, "కైక" పై రాముని కున్న ప్రతిపత్తి కది నిదర్శనం.

భారత దర్శనం

శ్రీ వసునందన్ "భారతం"లో రామాయణ మహాకావ్యాన్ని అందించడానికి, తద్వారా ఒక మహాకావ్యకర్తగ తన స్థానాన్ని సాహితీ చరిత్రలో పదిలం చేసుకోవడానికి యత్నించారు. చక్రబంధాది ఛందో వైశిష్ట్యాల్ని విరివిగ ప్రదర్శించి– నూత్న ప్రయోగాన్ని ఆవిష్కరించారు. "భరతుని" ఔన్నత్యాన్ని పెంచి, రామచంద్రునితో సమానంగా కైకేయీ పుత్రుని దర్శింపజేసి, భరతుని కావ్యనాయకునిగ, ధీరోదాత్తునిగ ప్రదర్శించిన నైపుణ్యం - ఈ కవిది. కాని కావ్యంలో ప్రయోగార్భటుల మధ్య భరతుడు పూర్తిగా కన్పించడు. దానికి ప్రధానకారణం కవికి ఛందోవైవిధ్య నిర్వహణపై నున్న మమకారం పాత్ర నిర్మాణంపై లేకపోవడం. భ్రాతృభక్తిలో భరతుని మించిన వ్యక్తి లేడనుట ప్రాచీన పండిత విమర్శకుల కంగీకారమైనదే - అదే "వసునందన్" కావ్యలక్ష్యం. "ధార్మికత్వంలో మహామానవత్వంతో అగ్రజుడు భరతు"డన్న విశ్వాసమే ఈ కావ్యానికి ప్రాణాధారం. రామభరతుల కభేద ప్రదర్శనమే కవి లక్ష్యం -

"చిక్కనగమైన మూర్తుల్లా
టొక్కటిగా నున్న యట్టు లొదుగ విరువురున్
చిక్కటి కౌగిట చూపర
కక్కజముగ హర్ష సమ్మోదా శ్రువులంరలెన్

వసునందన్ భరతుడు సర్వాలంకార భూషితుడైన యోగీశ్వరుడు. ముప్పిడి వారి భరతుడు రామనామ చింతనామృత పానుడు. అవకాశం దొరికినప్పుడెల్లా రాముని కథ పారాయణం చేస్తుంటాడు. శబర్యాదుల నరసన రామభక్తునిగ కన్పించే పాత్ర నీరి భరతుడు. జోశ్యుల వారి 'భారతం" ప్రత్యక్షభాషణ ప్రక్రియగా కొనసాగిన

1. భారతం - 82 ప.    2. భారతం - 612 ప.

కావ్య నిర్మాణంలో కవి భరతుని వెంట నడుస్తూనే కావ్యాన్ని నడిపిస్తారు. మాధవ పెద్ది వారి కావ్యాలు గుర్తుకొస్తాయి. సహజ సిద్ధమైనరచనా గాంభీర్యం మూలానునరణ మైనా-పీగిపోక-రమ్యతనాపాదించుకొంది-

ఏవం విధంగా భరతపాత్ర రామాయణ లఘు కావ్యాల్లో అలఘుశోభాస్పద మైంది.

## జటాయు ర్మోక్షము

సీతాపహరణం జరిగాక, సీతా వియోగంతో బాధాక్రోధాల నడుమ నలిగిపోతూ, ఏమైందో, ఏమి జరిగిందో, అయోమయ స్థితిలోవున్న రామునకు సీతాపహరణాన్ని గూర్చి, రావణుని గూర్చి రామచంద్రునకు ముందుగా చెప్పి రామబాణానికి లక్ష్యాన్ని నిర్దేశించిన కీర్తి జటాయువుకే దక్కుతుంది. తాపసివేషంలో సీతను అపహరించి, ఆకాశమార్గంపట్టాడు అసురుడైన రావణుడు. సహాయం కోసం ఆక్రందిస్తోంది శ్రీ రామచంద్రుని ఇల్లాలు. ఎదురలో వున్న జటాయువుకు ఆ కేక వినిపించింది. ఉలిక్కిపడి లేచాడు. ప్రమాదాన్ని గుర్తించాడు. రావణుని రథానికి అడ్డంగా వచ్చాడు. ఇక్కడ నుండి ఈ కావ్యం ప్రారంభం. ఇది ఉత్పలమాలిక నిబంధ లఘుకావ్యం.

సీ తా వి లా పం

"... ...........విన్నిచట నీడగరాదని లక్ష్మణుండు వే
తీరుల జెప్పినన్ వినక తెంపున నాతని నిష్ఠురోక్తులన్
గ్రూరత నొవ్వజేసి యిటు కూరుచుకొంటిని కీడునేడు న
న్నారసి వేగబ్రోవుమని"1 రఘురాముని పార్థిస్తున్న సీతావిలాపంచెవినబడిన జటాయువు నిద్రలేచి, రెక్కలు విదిల్చుకొని రథాన్ని నిలువరించాడు.

సం వా దం

"ఓరి నిశాచరాధమా!" అని సంబోధించి,
....అయోనిజ జానకి యొంటినుండగా" దొంగవలె అపహరిద్దామని చూస్తున్నావా- అంటూ ప్రశ్నించి—

"చీరెద నీదు వక్షమునుచించెద మైమరులింక బోకపీ
తేరసి, నిన్ను గూల్చెద, సతీమణి సీతను డించిపొమ్ము"2-అంటూ హెచ్చరిస్తాడు. అంతేకాదు సారతరాస్త్ర సంపదతో పరశురాముని క్షాత్రవీర్యార్జునుని సంహరించిన అస్త్రవిశారదుడు రాముడు విన్నచే, నీతమ్ముల్ని సంహరించి నీకై ఎదురు చూస్తున్నాడు. శ్రీరాముని మోసగించడం అంటే "చీరచెంగున నిప్పు కట్టుకోవడమే" అవుతుంది అంటాడు.

---

1. జటాయుర్మోక్షము - పు. 1 2. జటాయుర్మోక్షము - పు.2.

"చీర చెరంగునన్ కుచివి చెచ్చెర మూటగ గట్టనెంచితే
కోరలు గీటు వర్వవిభుకూరిమికోడను ముద్దువెట్టుకో
గోరితె, యేరుచెప్పి రిటుకూళతనంబును మాను"1

అంటూ బుద్ధులు చెపుతాడు జటాయువు. మూర్ఖునికి బుద్ధులు చెప్పడం ప్రాణానికి. ముప్పువాటిల్లింది. "కారులు ప్రేలకు" మంటూ హుంకరించాడు రావణుడు. "నాకు కోపమన్ మారికి చిక్కబోకు"2 మని బెదిరించి

"పౌరుషమొప్ప దిక్కులమపాలనజేసెడి వారి నెల్లరన్
బారగ వాజి ద్రోలితివి పక్షివి పీవొక రెక్కయే యుంకే
బేరును నూరులేక చను ప్రేత వదమ్మునకందు"3

## III. సంగ్రామం

బాణాలు గుప్పించాడు రావణుడు. చంచువుతో పొడుస్తూ నఖాలతో గ్రుచ్చుతూ రావణుణ్ణి గాయపరచాడు జటాయువు. సారధిని చంపి, విల్లువిఱిచి, రథాన్ని తునా తునకలు చేసాడు.

"తస్య తీక్ష్ణనఖాభ్యాంతు చరణాభ్యాం మహాబలః
చకార బహుధా గాత్రే వ్రణానృతగ సత్తమః"4

అన్న వాల్మీకి మూలం ఈ సన్నివేశానికి ఆధారం.

"స భగ్న ధన్వా విరథో హతాశ్వో హతసారథిః"5

రథం నాశనంకాగా సారధి గుఱ్ఱాలు మరణించగా భూమి మీద పడ్డాడు రావణుడు

"నిన్ని రణమందు బ్రతెనగరేకుని జూడగవేగ బంపెదన్
దారకయాజివిల్లు"6-అంటూ రావణున్ని రోషంతో ఎదిరిస్తూనే, తన విశాల మైన రెక్కలతో సీతమ విసరుతూ సేదతీరుస్తాడు.

"...................వి వృతో
దార గరుద్వయంబునసుతద్దయు సీదలుగూర్చి సీతకున్"7

-శ్రమపోగొట్టి రామునిపై దశరధునిపై తనకున్న ప్రేమవాత్సల్యాలను ప్రకటించు కొన్నాడు. కొద్దిసేపు పోరాటం తరువాత వృద్ధుడైన జటాయువు అలసిపోయాడు. ఆ కాశం తీసుకొని చంద్రహాసం-ఝళిపించాడు రావణుడు. నీరసించిన టాయువువ రెక్కలు తెగి రక్తసిక్త గాత్రంతో నేలకూలాడు, ఇదే సమయమని వేగంగా పారి పోయి సీతను అశోకవనంలో విడిపాడు రావణుడు.

---

1. జటాయుర్మోక్షము-పు. ౨
2. జటాయుర్మోక్షము-పు. ౪
3. " పు. 4
4. వాల్మీకం-అరణ్య-71-5
5. వాల్మీకం-అరణ్య-71-20
6. జటాయు-పు. ౨
7. జటాయు-పు. ౨

పర్ణశాల

మాయలేడిని చంపి వెనుతిరిగి వస్తున్న రామునికి దారిలో ఎదురువచ్చాడు లక్ష్మణుడు. సీతను ఒంటిగ వదలి వచ్చినందుకు కోపగించాడు రాముడు. కారణం చెప్పి అనునయించాడు లక్ష్మణుడు. సీత పల్కిన పరుష వాక్యాలను ఏకరువు పెట్టి -

"......................మది చిందర వందర నందు రీతిగా
వారక మందు కట్టె చెవియందున జొన్పెదిరీతినాడ, నే
నో రఘువంశదీప! యిటులోర్వక వచ్చితి" 1

అన్న లక్ష్మణునితో, దుశ్శకునాలు ఎదురవుతుంటే భయపడుతూ వేగంగ పర్ణశాలకు చేరుకున్నాడు రామచంద్రుడు. పర్ణశాల విస్మితయైంది. రాముడు పరిపరి విధాల విలపించాడు.

దాశరథి విలాపం

'ఓ రమణీలలామ యెటులోపుదు విల్వగ విన్ను జూడకే
సారసపత్ర లోచన! విదారభరమ్ము భరింప శక్యమే
కీర సువాణి యీ దరిని—కేళిని కుంజములందు దాగితే" 2

మూర్ఛ మునిగిన రాముని శైత్యోపచారాలతో సేదదీర్చాడు లక్ష్మణుడు. మూర్ఛ నుండి తేరుకొని వేదనతో వృక్షాలను, పక్షులను, పర్వతాలను ప్రశ్నించి, చివరకు అరణ్యం మారుమ్రోగేటట్లుగా జానకిని పిలిచి అలసిపోయి, క్రోధోద్విగ్న మానసుడై -

రాముని క్రోధము

................................ ...........లక్ష్మణా
యెరుగ నెంచినావు నను పీ జగతిన్ సృజియించినాడ నే
రా! రయమూర దీని విటు రక్షణ జేసెడివాడ నేను, నే
నేర లయంబొనర్తును....... ......... ................
నారియెలేని యీ జగతి నాకిక నేల శరాసనమ్ముతే
రా..........." 3

1. జటాయు-పు. 8
2. జటాయు-పు. 9
3. జటాయు-పు. 10

కోదండధరుడైనాడు రాముడు. "కర్తారమపిలోకానాం కూరం కరుణవేదినం"1 అన్న శ్లోక పాదంలో వాల్మీకి రామునికి సృష్టి సంహార కర్తృత్వాలను 'కర్తారం, కూరం" అనే పదాలలో నిర్దేశించాడని వ్యాఖ్యాతలు భావించారు.2 ఇవి ఆధారంగా పై పద్యం రూపొందింది.

## సోదరుని అనునయం

మహోగ్రరూపంతో ప్రళయకాలరుద్రుడైన రామభద్రుని చూచి విశ్వేష్ఠ తయ్యాడు తమ్ముడు లక్ష్మణుడు. కన్నులు జలపాతాలు కాగా రాముని ముందు దోయిలించి, కోపాన్ని ఉపశమింపజేయ పలు విధాలుగా ప్రార్థించాడు.

"మీరిటు శోకతప్తులయి మేదిని నాశము జేయ బూనినన్
నీరజ సంభవాదులగు నిర్జరశేఖరు లందరావ రా
లేరు విజంబు,"3

అంటూ రామ పరాక్రమాన్ని ప్రశంసిస్తూనే కర్తవ్య నిర్దేశం చేస్తాడు. "వేరొకమారు గాంచి పయి వేగిరపాటును చూపవచ్చు" అంటూ ముందుకు నడిపించాడు. "దక్షిణ నేత్రబాహువుల్ సారెకు సారెకున్ చెదరె, చక్కని మేలగు సూచనంబుగా" అంటూ ఆశను కల్గించి ముందుకుపయనింప చేశాడు రాముణ్ణి లక్ష్మణుడు. మూలాధారంగా కొనసాగిన ఈ రచనలో కొంత క్రొత్తదనం దర్శనమిస్తుంది.

## సమాగమం

లక్ష్మణుని అనునయంతో తేరుకొని ప్రయాణం సాగించి జటాయువుపడియున్న ప్రదేశానికి చేరారు. చెల్లాచెదరైన రథభాగాలు, సారధి కళేబరం మొదలైన యుద్ధ చిహ్నాలు రామునిలో మళ్ళీ కోపాన్ని రగుల్కొల్పాయి. "ఓ రోరి యెవండవీవు! ఇల! యుర్విజ నేమి యొనర్చినావు? అంటూ విరిశాడు జటాయువుని"4 అనేన సీతా వైదేహీ భక్షితా నాత్ర సంశయః" అంటాడు వాల్మీకి రాముడు.
తనను సంహరింప యత్నించిన రామునితో సమస్త వృత్తాన్తం వివరిస్తాడుపక్షి రాజు

"సీరమణిన్ గొనుచు నీచుడు రావణుడేగు చుండగా
దోరొనరించి భూమి బడిపోయితి"4

అన్న జటాయువు పల్కుల్లో వృత్తాన్త వివరణ తప్పితే మూలంలోని రసావిష్కారం

---

1. వాల్మీకం - అరణ్య షు 71-20
2. వాల్మీకం - చతుర్వ్యాఖ్య
3. జటాయువు. షు. 11
4. జటాయువు. షు. 13

కల్పించలేదు. తన్ను సంహరింప ఉద్యుక్తుడైన రామునకు సమస్త విషయాన్ని వివరించిన వాల్మీకి జటాయువు-

"రక్షసావి-హతం పూర్వం వమాంహతుం త్వమర్హసి"

"నేను రాక్షసునిచే ముందుగానే చంపబడ్డాను. ఇపుడు నీవు చంపదగదు" అంటాడు. ఆ పదాలు కరుణరస ప్లోరితాలై, రామునిపై జటాయువుకున్న స్నేహాన్ని జటాయువుకి తన చేతకాని తనంతో-సీతను రక్షించలేకపోయానే అన్న వ్యధను ఒకే పరి ప్రకటింప చేస్తాయి. ఈ భావాన్ని కవి స్వీకరిస్తే ఎంతో బాగుండేది.

జటాయువును గుర్తించి, అతని దురవస్థకు దుఃఖించి, తనకై ప్రాణత్యాగం చేసిన అతని ఔదర్యానికి ఎంతో వేదన చెందుతాడురాముడు చింతిస్తున్న రామునితో-

"సృష్టికాధారము నీవు సాక్షివయి దానిని గాంతువు కర్మవాక్కులన్"

ని న్నారసినాడగాదె సదయా! యవసానమునందు చాలునో

శ్రీ రఘురామ! శోకము నశించినదంచును మోడ్చెకన్ను"

అంటూ రాముని పరమాత్మ తత్త్వాన్ని ధ్యానించి ఊర్ధ్వలోకాలను కలిగించ వలసిందిగా ప్రార్థిస్తాడు. నవీన జటాయువు. దీనికి మూలం—అధ్యాత్మంలోని

"పరమాత్మాసి విష్ణుస్త్వం మాయా మనుజ రూపధృక్

అన్తకాలేఽపి దృష్ట్వాత్వాం ముక్తోఽహం రఘుసత్తమ,! ఈ శ్లోకం. ఇట్లా ప్రార్థించిన జటాయువుకు-

మోక్ష ప్రాప్తి

ఓ, సారవివేక నా సతిని సాకుటకై యిటువైతిపమ్మనే

నారయ జాల వీనరణి.... ..............సీ

కోరిన లోకమేదయిన గూర్చెదపొమ్మ '2

అంటూ ఊర్ధ్వలోకాలను కలిగించాడు రాముడు.

"మాయాత్వం వమమజ్ఞాతో గచ్ఛలోకానను త్తమాన్"3

అని ఆశీర్వదిస్తాడు వాల్మీకి రాముడు. జటాయువుకు దహనసంస్కారములొనర్చి శాస్త్రబద్ధంగా అపరక్రియలాచరించి, పిండ ప్రదానమొనర్చారని వాల్మీకి వక్కాణ. రామునిచే అంత్యక్రియల నాచరింప చేసుకొన్న పుణ్యవశాన జటాయువు-

"మహర్షి కల్పేనవ వంసస్కృత స్తదా జగమపుణ్యాం గతి మాత్మవక్కుతామ్"4

1. అధ్యాత్మ రామాయణ - అరణ్య-పు 132. 2. జటాయు - 5 పు

పుణ్యలోకాన్ని - వైకుంఠాన్ని పొందాడన్న మూలాన్ని ఆధారంగా ఈ లఘుకావ్య-నిర్మాత దేవతలెల్లరు "నాకయోగ్యమౌ తేరుని తెచ్చి పక్షివరు దివ్యశరీరము నందు జేర్చి జే, జే రఘువర! జే యంటూ స్వర్గాన్ని చేర్చారు. అధ్యాత్మ రామాయణంలోని "తతోఽన న్తరమే వాసౌ దివ్యరూపధరశ్శుభః" .................. ఇత్యాది భాగం ఈ కవికి ప్రోద్బలకమై ఉండవచ్చు.

జటాయువు రామభక్తుడు. దశరథునికి మిత్రుడుగా కన్పించినా, ఇతనిలో రామునిపై భక్తి భావమే ప్రబలంగా ఉంది. అతడు రావణునితో యుద్ధం చేయునంత సేపు చంపుతాను అని అనలేదు, అనడు. అతడు రావణుణ్ణి సంహరించలేడు. ఆ విషయం అతనికే తెలుసు. రామలక్ష్మణులు వచ్చేవరకు ఆలస్యం చేద్దామనే ప్రయత్నమే జటాయువుది. అందుకే "ముహూర్తం తిష్ఠ రావణ"2 నహి మే జీవమానస్య నయిష్యసి శుభామిమామ్3 జీవితేనాపిరామస్య,4 కిన్నుశక్యం మయాకర్తుం గతౌ దూరం నృపాత్మజౌ"5 "ముహూర్తం పశ్య." యుద్ధాతిథ్యం ప్రదాస్యామి"6 ఇత్యాది పలుకులతో, ముక్కులతో పొడుస్తూ, గోళ్ళతో రక్కుతూ రావణుణ్ణి పీడిస్తాడు. ఇందుకు ప్రధానకారణం, రావణుని ప్రయాణాని ఆలస్యం చేయడమే.

ఈ పని తాను చేయగలనా? లేదా! అనే సందేహం దాసునకు కలుగదు. స్వామికార్యాన్ని ప్రతిఫలాపేక్ష లేకుండా చేయడమే దాసునికి ఆనందం. అందుకే ముసలివాడు, నిరాయుధుడు, అసహాయుడు అయిన జటాయువు తన ప్రాణాన్నిచ్చి, రామునకానందాన్ని కల్గించి, రామసేవలో తరించాడు. అందుకే -

"అవశ్యంతు మయాకార్యం ప్రియంతస్య మహాత్మనం"7
— అంటాడు.

రావణుచే కొనిపోబడుతున్న సీతాదేవి సైతం చెట్టుపై నిద్రించుచున్న జటాయువును చూచి తనను రక్షింపుమని ప్రార్థించలేదు. నిరాయుధుడు వృద్ధుడైన జటాయువు ఆయుధధారియైన రావణు నెదిరిస్తే మరణిస్తాడు. తన పరిస్థితిని రామలక్ష్మణులకు చెప్పడానికి సాక్షి కూడ మిగలడనే భయం సీతకుంది. అందువల్లనే -

1. అధ్యాత్మరా — అ — 40
2. అరణ్య - 50 — 224
3. అరణ్య - 50 - 254
4. అరణ్య - 50 — 264
5. అరణ్య - 50 - 244
6. అరణ్య - 50 - 274
7. అరణ్య - 50 - 264

"నైషవారయితుం శక్య స్త్వవక్రూరో నిశాచరః
సత్త్వవాన్ జితికాశీచ సాయుధశ్చైవ దుర్మతిః"1
అని ఆయుధధారియైన వీనితో నీవు ఎదుర్కొనలేవు. రామలక్ష్మణులలో నా విషయం వివరంగా చెప్పవలసినదనే ప్రార్థించింది. కానీ, జటాయువు దాసుడు. ప్రాణ భయంతో పారిపోవడం దాసలక్షణమేకాదు.

"దశగ్రీవస్థితో ధర్మే పురాణే సత్యసంశ్రయః"2 అని తనని తానుగ పరిచయం చేసుకొంటాడు జటాయువు. ఈ భాగంలో —

పురాణే సనాతనే ధర్మే-దాస్యవృత్తౌ విత్యర్థః-స్థితః తదేక
పరాయణః-సత్యం-సత్యంజ్ఞానమనంతం బ్రహ్మేత్యుక్తః
పరమాత్మా సంశ్రయః ఆలంబనం యస్యసః-భగవదేకోపాయ
నిష్ఠ ఇత్యర్థః—3..............మయిదాసే స్థితే తవసీతాప
హరణం నయుక్త మితిభావః—

అని గోవిందరాజీయం, జటాయువులో దాసత్వాన్ని నిరూపించింది. ప్రభుభక్తి అసాధ్యాల్ని సుసాధ్యం చేస్తుంది. "రామకార్యం" అనే విశ్వాసమే హనుమంతుని సముద్రం లంఘింపచేసింది. లంకా నగరాన్ని చేర్పించింది రామభక్తి మాత్రమే. వీనిని కొంతసేపు నిలిపితే రాముడు వస్తాడనే ఆశయే జటాయువుని యుద్ధానికి సిద్ధం చేసింది. "యదికూర్యోస్తి ముహూర్తం తిష్ఠ"4 అన్న మాటలోని ధ్వని ఇదే. ముహూర్తకాలంలో రాముడు రాగలడనే విశ్వాసం జటాయువుది. "రామో యుధి వధిష్యతి"5 అంటాడు. వెంటనే అంతేకాదు, చివరకు "ప్రాణాలు యిచ్చైనా నేను వారికి ప్రియం కలిగిస్తాను"6 అన్న పలుకులు ప్రభుసేవలో ప్రాణత్యాగానికి సిద్ధమైన సేవకునివి.

అసలు జటాయువు రాముడు వచ్చేవరకు జీవించి ఉండటానికి కారణం సీతానుగ్రహమేనని స్కంద పురాణోక్తి ఇది.

"దేవీమాం ప్రాహరాజేంద్ర యావత్సంభాషణం మమ
భవతస్తావ దాసన్నే ప్రాణ ఇత్యాహజానకీ"7
రాముని ఆదేశంతో మోక్షప్రాప్తి లభించింది జటాయువుకి.

1. వాల్మీకం-అరణ్య 49-40శ్లో.
2. వాల్మీకం-అరణ్య-50-3.
3. చతుర్వ్యాఖ్య-1214-124
4. వాల్మీకం-అరణ్య-50-22
5. వాల్మీ-అరణ్య-50-23 శ్లో
6. వాల్మీ-అరణ్య-50-26 శ్లో
6. చతుర్వ్యాఖ్య-1243 పు

"రాఘవస్య ప్రసాదేవ సగృధ్రః పరమంపదమ్
హరేః సామాన్యరూపేణ ముక్తిం ప్రాయాత్ఖగోత్తమః"

రామభక్తిలో ముక్తినందిన జీవరాశిలో జటాయువు అగ్రగణ్యుడు. అనన్యమనస్కుడై, భగవంతుని కొఱకు పోరాడి ప్రాణాల్ని ధారవోసి, ఆయన సమక్షంలో ఆయనపై దృష్టినిలిపి, ఆయన చేతుల్లోనే మరణించి-ఆయన[1] చేతనే శాస్త్రవిహిత సంస్కారాలు పొందిన ధన్యజీవి; జటాయువు. కాపుననే–"సుగ్రీవో హనుమాన్ ఋక్షో గజోగృధ్రోవణిక్పథ"[2] అంటూ ముక్తులనదుమ స్తుతిపాత్రుడైనాడు.

అతి విరళమైన మాలికారచనతో సంప్రదాయాన్నమనరిస్తూ జటాయువు వంటి విశ్వాసపాత్రమైన పాత్ర ఆధారంగా కావ్యం సృష్టి గావించటం ప్రశంసార్హం. కవి ముప్పిడి సత్యనారాయణమూర్తిగారు ధారాశుద్ధి గల పద్య నిర్మాతగా ప్రసిద్ధులు ప్రాసకోసం తడవుకొన్నపట్టులు లేవు. కథాభంగం కాని వర్ణనలు, రసభంగం చేయని అలంకారాలు, ఔచిత్య భంగంకాని రీతిలో సంభాషణల్ని నేర్పుతో నిర్వహించారు. రాముని కోపానికి, జటాయువు కోపానికి రావణుని కోపానికి ఉన్న సూక్ష్మభేదాల్ని మాటల్లో ప్రస్ఫుటీకరించిన విధానం కొనియాడదగింది.

1. పద్మపురాణము-సృష్టి-3-12
2. తిరుకవాక్య. వా. అ. 104 పు
3. పెద్దన-పూతమెరుంగులన్ భట్టుమూర్తి-లొట్టయదేటిమాట

# సంధ్యా సౌమిత్రి

సౌమిత్రి జీవితంలోనిసంధ్యా రేఖల్ని చిత్రించిన కావ్యం సంధ్యా సౌమిత్రి. రామకృష్ణావతార సంధి యుగంలో లక్ష్మణుడు కఠోరపరీక్షకు గురికావడం కథకు బీజం. ప్రస్తావన వశంగా రామకథ కొనసాగటం అనివార్యమైంది. రాముడులేనిది లక్ష్మణుడులేడు. లక్ష్మణుని కథలో రామకథ ప్రధానం అందుకే "రామగాథ వడపె రామానుజుం దౌర" అన్న ఆశ్చర్యంతో కవి కావ్యానికి శ్రీకారం చుట్టారు.

తన బిడ్డకు రవివంశజులో సనచ్చిన ఇక్కట్లకు కినిసి, భూదేవి శ్రీరాముని కూడ శత్రువుగ భావించి అటువంటి దుర్మార్గునకు బిడ్డనిచ్చిన జనకుని సైతం పలు రీతుల నిందించింది.

"చేలో దుక్కికి నడ్డమై దొరకె నీ సీతామహాలక్ష్మియిం
కేలా? చెట్టునగోసినట్టి ఫలమయ్యె న్నీకు మున్నాళ్ళలో
బాలన్ రాముని కంట గట్టితివి నీ భారంబు శాంతింపగా
జాలుం జాలును గొంతు గోయగల వాత్సల్యమ్ము నీదేనుమీ!" 1

ధాత్రినిందా వాక్యాన్ని విన్నాడు కలహభోజుడు. శ్రీహరితో విన్నవించు కొన్నాడు. జనకుని వంటి మహనీయుని నిందిస్తున్న భూమాతను అభిశంసించాడు నారదుడు.

"ఏమి విచిత్రమయ్యె పరమేశ......... ... అంటూ ఆశ్చర్యపోయి విషాద జముల్ రమణీమనో గతుల్" - అంటూ వేదన నటిస్తాడు. అయోధ్యా నగరానికి బయలుదేరాడు. గంగాతీరంలో దుర్వాసుని చూచి "పాముం జూచిన కప్ప సలాముల జేయెత్తి, పల్కిన రీతి" నమస్కరించాడు. కుశల ప్రశ్నాదికం పూర్తయ్యాయి. రెండు, మూడు పర్యాయాలు కదలించి పల్కరించగా—

"అనవిని యన్పురుస్సురని హాయని హాయని కన్ను విప్పెనా
ముని పదికోట్ల జీవము యముంగన బోయెమ భస్మరాశియై'

వెనుకనే నిలబడ్డాడు నారదుడు. వెనక్కి తిరగవద్దని ప్రార్థించాడు. నవ్వు టాలుగా ననుకొన్న హాస్యోక్తులు, అపహాస్యాలుగా భావించిన దుర్వాసుడు మాటల్ని పెంచాడు- "దాడిదాడి తాకింది"- పందెపు కోళ్ళై ఎదురుపడ్డారు దుర్వాసనారదులు. నీవు రక్షించిన వాళ్ళందరు అదిగో యముని అతిథ్యాన్ని పొందుతున్నారు చూడ మన్నాడు నారదుడు. నీవు పోషించగ పెరిగిన జీవకోటి బూడిదగా ప్రకాశిస్తున్నా రన్నాడు దుర్వాసుడు. రుద్రబ్రహ్మలు ఎదుర్కొని పోరాడినట్లున్న ఆ సన్నివేశం మునులకు భయాన్ని కల్గిస్తే, దేవతలకు ఆనందదాయకమైంది. వశిష్ఠుల శాంత్యు

1. సంధ్యా సౌమిత్రి-6 ప.

దార ప్రవృత్తుల గూర్చి, విశ్వామిత్రాదుల రాగవృత్తుల గూర్చి చర్చించుకుంటూ- వీరి పోరాటాన్ని చూస్తున్న దేవతలకు- "హా లక్ష్మణా" అనే ఆర్తనాదం భూమ్యాకాశాల ప్రతిధ్వనించింది. దేవతలు అనిమిషత్వం సార్థకమైనట్లు విశ్వేష్టులై వశిష్ఠపత్ని దుర్వాసుని గూర్చి చేసిన ఆర్తనాదంగా గమనించారు. - పరిస్థితిని అర్థం చేసుకొని- దుర్వాసుని తప్పుపట్టారు.

"ఏమివనితయుండి పోయితా యువతులేల
సౌధమునకీవు పావంబు వలుపవేదు
నిజము దాచినం బ్రాణాలు నిలువ నింక
కోటి దుర్వాసులము నిన్నె కూల్పగలము"

-అంటూ కమ్ముకున్నారు దుర్వాసుణ్ణి. అడ్డుకొన్నారు నారదుడు. అందరూ కలిసి వశిష్ఠ పత్ని చెంతకు చేరారు.

"అన్నను నమ్మి కూలితకటా యొకనాడు సుఖంబెఱుంగ వా
కన్నెకు దాశి గట్టితివె కావి యికంబయి మేలుంగవో"2

అంటూ లక్ష్మణుని గూర్చి పలురీతుల విలపిస్తోంది అరుంధతి. స్త్రీగా ఊర్మిళా సౌభాగ్య రాహిత్యాన్నె ఎక్కువగా ఎత్తిచూపుతుంది వీరి దురదృష్ట జీవితంలో. "మధుపర్కంబులు మాయ నిప్పటికి ప్రేమల్యావిర్పుష్పించవు..........ఊనాదేని కళ్యాణపు బొట్టే తాల్చుచునున్నదారమణి....ఇవ్వారిగ ఊర్మిళపై జాలివానలు వర్షిస్తాయి. ఇంతలో వశిష్ఠమహర్షి వచ్చి సతిమణిని ఓదార్చి పెవాధర్మంతో రాజ్య సుఖాల త్యాగం చేసిన సౌమిత్రిపై జాలిపడతారు. "మంధర గర్వమన్న జోర వయ్యా కొంత మేలయ్యెడిన" అంటారు వీరి వశిష్ఠుడు లక్ష్మణుని. విశ్వామిత్రుని వెంట అడవులకు వెళ్ళిననాటి నుండి కళ్యాణ, వనవాసాలవరకు రాముడు న్వవిష యాల్ని, సీతవిషయాల్ని మాత్రమే గమనిస్తూ వచ్చాడుగాని, లక్ష్మణుని గూర్చి, అతని భార్యను గూర్చి, వారి వేదనల గూర్చి ఆలోచించలేదంటూ, తన కెటువంటి ప్రయోజనం లేకపోయినా అన్న అడుగులో అడుగువేసి నిల్చాడు; త్యాగమూర్తి గల లక్ష్మణుడు.

"ఏమంత్రమ్ముల తెప్పిన
రామునకే చెప్పి నతడు రాముడె నేర్పెవ్.
సౌమిత్రి ప్రక్కమండియు
నేమాత్ర మ్మోము గాన దయిద్చా వరతవ్"3

వశిష్ఠుని పల్కులు విని ఆశ్చర్యపోయిన మునులు - నారదుని ప్రశ్నించారు. రామావతార తత్త్వాన్ని ఏకకాలంలో పరశురాముడు శ్రీరామ అవతారాల ప్రాదుర్భావాన్ని విశ్లేషిస్తాడు నారదుడు-

1. సంధ్యా - 45 వ
2. సంధ్యా - 49 వ.
3. సంధ్యా – 65 వ

"క్షాత్రమును చంపి బ్రాహ్మ్యమ్ము చల్లపడియె
రాజసం బింక గూల్చు విరాక్షసమును
క్షాత్ర ధర్మమే రక్షింప సమయమగుట
రామనామ రూపములు కార్మ్ముకులయ్యె"1

బ్రహ్మతేజం క్షాత్రతేజాన్ని చల్లపరచింది. ఇక క్షత్రియతేజం రాక్షసత్వాన్ని రూపుమాపాలి. అందుకే రామనామాలు కార్మ్ముకులయ్యాయన్నాడు.

"మంత్ర తంత్రములెల్ల మందగించునొయ్యెమొ
శక్తి నొక్కటి శేర్పకున్న
ధరణి రాక్షసకోటి దండింప లేదేమొ
అవనిజ మద్వాహమాడకున్న
పరశురాముని రాముని ప్రబల శక్తి
జానకీదేవి మానవ శక్తి గూడి
రామునకు గూర్చె సిద్ధ పరాక్రమంబు
రాక్షసధ్వంసకమ్మను క్రతువు సలుప"2

మునుల మాటల్లో శ్రీ–రామచంద్రుని గూర్చి ప్రారంభమైన పరామర్శలు–చిన్నవాడు రాముడు గుండెలపై తన్నాడనే మందర కోపం వలన అరణ్యవాసానికి ప్రోత్సహించిందని - మరి లక్ష్మణుడు ఏమి తప్పుచేశాడని ఈ పాపం అంటాడొక మునీశ్వరుడు. "విపరీత ప్రతికార ధుర్యంకటా విద్వేషిణుల్ మానిసుల్" అంటాడు కవి. – రామభక్తులకు కష్టాలు అధికమే - అసలు చింతించడమే రామ భక్తులకు జీవధనమే మోనవిపిస్తోంది.

"ఓరిమి కొలది పరీక్ష
భారము కడు హెచ్చు రామభక్తులు గారి
బూరించినట్టి బంతులు
శ్రీరాముడు కొట్టుకొలది సేవయొనర్పన్"3

లక్ష్మణునివెనకేసుకు రావడంలో రామనిందకు సైతం దిగుతాడు కవి. అయితే మును లలో ఒకడు లేచి - లక్ష్మణుని పతనానికి కారణాలనేకమున్నాయి శ్రీరాముని నిందించ కూడదంటూ–వనవాస సమయంలో కైకేయాదుల సంహరిస్తానన్న దగ్గర నుండి - భరతునిపై యుద్ధాన్ని ప్రకటించడం వరకు - తుదకు రామాజ్ఞను తిరస్కరించి, "సీతమ్మ"ను ఒంటరిగా పర్ణశాలలో వదలివేయడం వరకు - లక్ష్మణుని తప్పులనేకరువు పెట్టి - తల్లివంటి ఆమె తిట్లను సహించలేకపోయాడా? రహస్యంగా దాక్కొనైనా సీతను కాపాడుకోలేకపోయాడా? అంటూ ప్రశ్నిస్తాడు.

---

1. సంధ్యా - 69 వ.
2. సంధ్యా - 76 వ.
3. సంధ్యా – 83 వ.

"శేషావతార మంచు వి
శేషమ్ముగ బలికెనెవరో శేషుని చదువుల్
శేషుని యోరిమి బేర్కొ-వి
దోషమ్ముగు కాదె యొరులతో నటుపోల్పన్"1

అనేస్తాడు. అంతేకాదు. రాముడు శాంతమూర్తి విశ్వకారుడు కాదట్టి-లక్ష్మణుడు'జీవించి యున్నాడు. లేకపోతే ఒనాడు తన భామినికి హానిచేసిన కాకాసురునిపై అంతకోపం ప్రదర్శించిన రాఘవుడు ఈనాడీ లక్ష్మణుడెన మౌనము వహించుటెంత మహిత గుణంబో"2 అది రాముని ఉదారతి. వాలిని చంపి రాజ్యమిప్పించాడన్న విశ్వాసం లేకుండా సంచరిస్తున్న రాముని ప్రియస్నేహితుడైన సుగ్రీవునిపై ధనువు నెక్కు-డ యత్నించిన లక్ష్మణునికి—చూచిరమ్మంటే కాల్చివచ్చిన హనుమంతునికి తోక ఒక్క-టే తక్కు-వ" యని-లక్ష్మణుని వడతలోని తప్పులుగా ఎత్తి చూపుతున్న కార్యాల్ని వివరించడమే గాక—అసలు రాముడే వైష్ణవాన్ని స్థాపించడానికి పుట్టా డని, శివధనుస్సుని విరిచి, శైవులైన రాక్షసాదులను సంహరించి, పరశురాముణ్ణి ఓడించి విష్ణుమతాన్ని నిర్ద్వంద్వంగా ప్రకటించాడొకముని

ఎంతటి కఠిన చిత్తుడు కాకపోతే అల్లుణ్ని చంపి, కొమార్తెకు వేదన కల్గి స్తాడు. ఇతణ్ని శేషుడనడం న్యాయంగా లేదు. పట్టాభిషేకం సమయంలో వచ్చిన ఈ లక్ష్మణదేవర ఎంతమందికి వేదన కల్గించాడో? పిండు గర్భిణియైన తల్లివంటి సీతమ్మను అరణ్యంలో వదలివచ్చిన పాపాత్ముడితడు—

వాల్మీక్యాశ్రమంలో సేదదీరిన భూపుత్రి లవకుశులకు జన్మనిచ్చింది. ఆశ్వమే ధాశ్వ రక్షణ సమయంలో ఎదురుపడిన చిన్నారులను గుర్తించి పైతం లక్ష్మణుడు అన్నతో ఆ విషయం చెప్పలేదు. ఇన్ని జరిగినా దోషం లక్ష్మణుని వదలలేదు-రాముని ఇల్లాలు భూప్రవేశం చేసింది.

"మున్ను బోయ చంప జన్న క్రౌంచములందు
నాత్మదేగె దొలత నాత్మ విడిచి
ప్రకృతి పురుషులందు బ్రదము యేగెనేడు
రామచంద్రు వీడి రామ యేగె"3

"రామానుజుడు లేని రామకథ" లేదనిపించి రామాయణాన్ని పూర్తిచేశారు కవి.

---

1. సంధ్యా-93 వ.
2. సంధ్యా—95 వ
3. సంధ్యా-128 వ.

త్రేతాయుగం చివరికొచ్చింది. భార్యావియోగంతో శోభాశూన్యుడై యున్న రాముని చెంతకు యముడు మాట్లాడటం కోసం వచ్చారు.

"రాముని తోడ దాను నవరంగమునందు రహస్యమాడగా
నియమము తీర్పరించె గరుణింపగ లక్ష్మణు గూల్పబుద్ధియై"1

మూలంలో యముడు మునివేషంలో వచ్చినట్లుండగా2- యముడే వచ్చినట్లుగా చెప్పారు తెలుగుకావ్యంలో—

తాను రామునితో మాట్లాడే సమయంలో లోపలి కెవరూ రాకూడదని వస్తే- వారికి మరణదండన విధించాలని ఆజ్ఞాపిస్తాడు. "యశ్శృణోతి నిరీక్షేద్వా స వధ్యో భవితా తవ"3 అన్నాడు. రాముడు తమ్ముని ఆజ్ఞాపించాడు-పాపాల భైరవుడు లక్ష్మణుడు ద్వారపాలకుడైనాడు.

"త్యాగమె జీవనమ్ము పరతంత్రమున న్నిజయోషితా పరి
త్యాగమె భోగమై తనరు దాశరథీకు పదార్చ మాత్ర
సంభాగుడు లక్ష్మణుండఖిల భారవ హుండయి ద్వారపాలకో
ద్యోగముదాల్చె నాటికి ప్రయోగ మెఱుంగని యస్త్రపాణియై"4

గోవలవారి సంభాషణ మొదలైందో లేదో కొంపమునుంచుకొచ్చినట్లు దుర్వాసుడు ప్రత్యక్షమయ్యాడు-రామునితో మాట్లాడాలన్నాడు. కాకుంటే....అంటూ కోపంగా చూశాడు-బెదరించాడు- నిందించాడు-తుదకు కన్ను గప్పి లోపలికి వెళ్ళిపోయాడు. నియమం తప్పింది సభలోనికి రానిచ్చినందుకు అడవులలోనికి పోయి మరణించ వలసిందిగా ఆజ్ఞాపించాడు రాముడు.

మూలంలో రాముడు మునుల సలహా ననుసరించి లక్ష్మణుని వదలివేశాడు. అన్నచే త్యజించబడిన లక్ష్మణుడు సరయూ నదిలో ప్రవేశించి సశరీరంతో వైకుంఠాన్ని చేరుకొన్నాడు-తెలుగుకావ్యంలో. యముడే లక్ష్మణుని కోరుతాడు అడవుల కెళ్ళి మరణించవలసిందని-ఏమైనా- లక్ష్మణుడు నియమాన్ని పాటించాడు.

"నిష్ఠసేవ చేసి నిశ్వమే త్యజియించె
భౌతికమ్ము మణచి బ్రహ్మ మెటిగె
రామగాథ నడపె రామామణిందౌర
సహనమొందె యాత్మ శక్తిగాగ 5

అన్న ప్రశంస కవిది. చేసిన పనుల్లోని మంచి చెడ్డలను బట్టి మంచివారు పైతం

1. సంధ్య - 131 ప.
2. వాల్మీకం - ఉత్తర - 103. 1.
3. వాల్మీకం - ఉత్తర - 103. 12.
4. సంధ్య - 133 ప.
5. సంధ్య - 138 ప

ఒక్కొక్కప్పుడు శిక్ష అనుభవించక తప్పదనడానికి, అతన్ని లోకమంతా నిందిస్తు ఉనడానికి ఈ మహాసీయుని వృత్తమే సాక్ష్యమని-

పల్కుతున్న తోటివారి మాటల వింటూనే వశిష్ట మహర్షి రామదర్శనానికై మిగిలిన మునులందర్నీ తొందరపెట్టారు-రాముని చివరిచూపుకై త్వరపడుతున్నారు మునులు-

బ్రహ్మబ్రహ్మరుద్రునితో కలసి సృష్టి వినాశకర్మల ప్రారంభించారు; వైకుంఠంలో లక్ష్మీనాథునికై ఎదురుచూస్తూ ఏర్పాట్లు వేగంగా సాగిపోతున్నాయి రాముడు బయలుదేరాడు. మునులందరు రాముని పాదాలపై బడి- తమ్మకూడ తీసుకెళ్ళవలసిందిగా ప్రార్థించారు- కారణ్యధాముడు కరుణించాడు-

"మీరెల్లరు నే ప్రియా
కారముంలంజెంది గోపికలరై నన్నున్
గారాబమొప్ప గొలుతురు
నారదముని కధలనెల్ల నడిపించుచునికన్"1

అంటూ అభయమిచ్చాడు. "స్త్రీ రూపమే" భక్తికాధారమని, స్త్రీ రూపంలోనే భక్తి సిద్ధిస్తుందని హితమొనర్చి- "రక్తిమెయిన్ భజింపుడి ధరాభరమెల్లను నేనకాల్తు స్త్రీ శక్తినొకండు చేతగొని శక్తుతనై పరిపూర్ణ బుద్ధినై"- అంటూ వరమిచ్చాడు- కృష్ణావతారం ప్రారంభమైంది. దేవతలు ఆనంద నృత్యం చేస్తుంటే - మును చేతులు మోడ్చి మొక్కులు ప్రారంభించారు.

ఈ కావ్యాన్ని లక్షణుని శీల చిత్రీకరణకు కవి ఉపయోగించుకొన్నారు వశిష్ట పత్ని ఛాత్రీమహాదేవి స్త్రీ మూర్తులుగా వేదనా వక్రోక్తులు విన్పిస్తారు. తే మేలెంచక రామగాధ నడిపిన రామాయణాని వలనే నేడు రామరాజ్య స్థాపనకు తపి సుఖాలను పరిత్యజించి స్వాంతంత్ర్యోద్యమం నడిపి రామ రాజ్యాన్ని స్థాపింప రామాయణం కావాలనే వేదనే ఈ కావ్యాన్ని వ్రాయించింది.

1. నలహ్య - 156 ప